# చాటుపద్య మణిమంజరి

## రాజప్రశంసా స్తబకము

### విక్రమార్కుఁడు

సీ॥ ఉదయతాళంబెక్కి యుట్టి చేరులు గోసి
శూలాలపాతఱ గూలవైచె
...గ్ని నుతికి యప్పాతాళకేతువుఁ
దెగటార్చి శశిలేఖఁ దెచ్చుకొనియె
బేతాళు బంధించి బిలకన్య పాపకుఁ
దన మేనికండలు తఱిగి మేపె
పైఠాణినగరంబుఁ బరువడి సాధించి
గుళికసిద్ధునిఁ బట్టి గోళి చేసె
రసకూటమునకేగి రణతాంబరములోని
గవి నున్న సింహము గజము దునిమెఁ
గన్నంబులో నెరకాలుని తలఁద్రుంచి
పాములమొగ్గని పంతమడఁచె
జడియక పాలంక బడి సదాశివునిచే
నసితాతపత్రంబులందుకొనియె
రౌద్రాసురునిఁ జంపి రయమున నింద్రుచేఁ
గనకంపుఁబుత్తడిగద్దెఁ దెచ్చెఁ
గంఠ రక్తంబునఁ గాళికి విందిచ్చి
యరయ హోమాగ్నికి నాహుతయ్యెఁ
జిత్రకంకాళిచే సింగినాదముఁ గొని
మొఱవెట్ట మృత్యువు ముక్కుఁదునిమె

గీ॥ యోగవాగాలు కంబము నొనరఁ దాల్చి
చెప్ప నరుదుగ లోకప్రసిద్ధుడయ్యె
నెన్ని చూడంగ నిటువంటివెన్ని లేవు
విక్రమార్కుండు చేసిన వితరణములు. 1

సీ॥ భరతునిలాగునఁ బరశురామునిరీతి
రంతిదేవునిభంగి రామువలెను
నంగుని రేఖ యయాతిభావంబునఁ
బృథువిధంబున భగీరథునిమాడ్కి
గయులీల మాంధాతకైవడి నంబరీ
షునిరూఢి శశిబిందుసోయగమున
శిబిపోలిక మరుత్తుచెలువున నంగుని
కరణి సుహేతృని గౌరవమున

గీ॥ సగరువెరవునఁ బురుకుత్సుసరణి నలుని
రమణ నర్జునుక్రియఁ బురూరవునిచంద
మున హరిశ్చంద్రు తెఱఁగున వినుతి కెక్కి
సాహసాంకుండు వసుమతీచక్ర మేలె. 2

కం॥ పొడగన్నంతనె వేయును
నుడివినఁ బదివేలు నగిన నూర్వేలు మనం
బొడఁబడ మెచ్చినఁ గోటియు
నడిగెడివారలకు విక్రమార్కుండిచ్చెన్. 3

సీ॥ ప్రకటప్రతాపాతపముచేత వైరుల
కన్నులఁ జీకట్లు గ్రమ్మఁ జేసి
ఖడ్గహాలాహలగరిమచే నహితుల
నమృతాశనులఁగాఁగ నలవరించి



సలలితసత్కీర్తిచంద్రికఁ బగతుర
మనసులతాపంబు మట్టుకొలిపి
సముదగ్రనారాచశరవృష్టి విమతుల
తనువులఁ జెమటలు దనుపు గొల్పి

గీ॥ చిత్రచారిత్రవిక్రమశ్రీ వహించి
సాహసాంకమహీపాలచక్రవర్తి
జలధివలయితవసుమతీచక్రవర్తి
చండభుజదండకలితుఁడై యుండునంత. 4

సీ॥ నవరత్న భూషణానారతరణభూమి
విలసిల్లుకల్యాణవేది గాఁగ
దళితకుంజరకుంభకలితమౌక్తికరాజి
రమణీయసేసాక్షతములు గాఁగ
సమరసంక్రీడనసందర్శనాగత
సురకోటులును బెండ్లిదొరలు గాఁగ
బహువిధజయతూర్యబహులనిస్వనములు
రమ్యమంగళతూర్యరవము గాఁగ

గీ॥ సుచితకాలజ్ఞుఁడగుభట్టి యొజ్జ గాఁగ
సచల (వీర) ప్రతాపాగ్ని సాక్షి గాఁగ
విజయలక్ష్మీ సమేతుఁడై విలసనమున
సాహసాంకమహీపాలచంద్రుఁ డొప్పె. 5

సీ॥ బలమునఁ జలమునఁ బ్రాణరక్షణమున
భీము భీమాగ్రజు భీమగురునిఁ
జెలువున సంకల్పసిద్ధిఁ దేజంబునఁ
బద్మారిఁ బద్మజుఁ బద్మమిత్రు

శివభక్తి మూర్తి విశిష్టదానంబున. 6

– (పాతము) –

శ్లో॥ అర్థిభ్యః కనకస్య దీపకపిశా విశ్రాణితా రాశయో
వాదే వాదవిషాణినాం ప్రతిహతాశ్శాస్త్రోక్తి గర్భా గిరః
ఉత్ఖాత ప్రతిరోపి తైర్నృపతిభిశ్శారై రివ క్రీడితం
కర్తవ్యం కృతమర్థితా యది విధే స్తత్రాపి సజ్జావయమ్. 7

నేఁటికి దాదాపుగా నిర్వది యేండ్లకు ముందు[1] తంజావూరికి వెళ్ళి నే నక్కడి సరస్వతీ పుస్తకశాలలోని వ్రాఁతప్రతుల నుండి యెత్తి వ్రాసికొనివచ్చిన యుపయుక్తాంశములలో నేనింతకుముందే ప్రకటించినవిపోను, మఱియు నితరులు వెల్లడించినవిపోను, మిగిలిన వానింగొన్నింటిని, శిథిలమగుచున్న కాగితములనుండి యెత్తి యిందు ప్రకటించుచున్నాఁడను. ఇందేవేని సహృదయులకు వినోదము గొల్పఁగలవేమో!

**1**

గీ. విక్రమార్కుఁ డనెడు విభుఁడు భేతాలునిఁ
గట్టి తెచ్చినట్టి కథలు చెప్ప
వినుచునుందు, నెట్టివిధమునఁగొని తెచ్చె
నానతియ్యవలయు నవనినాథ! 8

సీ. విక్రమార్కుఁడు జగద్విఖ్యాత చరితుఁడై
జగతిఁబాలన సేయు సమయమునను
శాంతి శీలుఁడు విప్రసంయమి.... 9

1. (శ్రీ ప్రభాకరులు కూర్చుకొన్న చాటుపద్యముల కాగితాలలో ఇది లభ్యమైనది. దీని నిందు చేర్చుచున్నాము. శాస్త్రిగారు తంజావూరు వెళ్ళినది 1916 ప్రాంతమున. 1936లో వారేమి వ్రాయనెంచిరో కాని అసంపూర్ణముగా ఈ విషయమింత మాత్రమే ఉన్నది. – ప్రకాశకులు)



మీఁదిది తంజావూరి లైబ్రరిలోనున్న "బేతాళపంచవింశతి" గ్రంథపుటారంభ భాగము. దీని రచయిత పేరెఱుఁగరాదు. దీని నేనెందుకు వ్రాసికొని వచ్చితినఁగా కవిభల్లటుని విక్రమార్కచరిత్రమనీ, బేతాళపంచవింశతి అనీ పేర్లతో ప్రాచీన లక్షణగ్రంథములందు కొన్ని పద్యములుదాహృతములయి యున్నవి. కవిభల్లటుఁడెవఁడో ఏ కాలమువాఁడో సరిగా గుర్తింపఁగుదుర లేదు. ఆంధ్రశబ్దచింతామణిలో కవిభల్లటైః త్రయాణాం నామ్నా మిత్యాది సూత్రమున గవిభల్లటుఁడు స్మరింపఁబడినాడు. ఆంధ్రశబ్దచింతామణి.

## భోజుఁడు[1]

సీ॥ జననాథసామంత సచివసందోహంబు
పరివారమును దన్ను బలసికొలువ
హితులు, వృద్ధులు, పురోహితులు, విద్వాంసులు,
సేసలు చల్లియాశీర్వదింప
కవిగాయకానేక కామినీ నటనటీ
వందిమాగధులిరువంకఁబొగడ
భేరీమృదంగ గంభీర నాదంబులు
ముంచి దిక్కుల నొక్క మ్రోఁతగాగ

గీ॥ వేత్రహస్తులు ముందర వినుతిసేయ
కొలువుకూటంబునకు వచ్చి కొమరు మిగిలె
భూరివిద్యా విశారద భుజగరాజు
భోగవైభవ సురరాజు భోజరాజు. 10

సీ॥ రాగబంధము చేత రాపునఁబొందక
పొర పొచ్చెములచేతఁబూసగాక

1. ఈ మూడు పద్యములను శ్రీ ప్రభాకరుల చాటు–నోట్సు నెం. 27 పుట 61 నుండి గ్రహించితిమి. – సం॥

కాంక్షించి చూచినఁ గఠినమై యుండక
గట్టిగా నొక వంక కట్టబడక
వైరిరత్నముచేత వడుసుళ్ళనందక
తఱచుగాఁ బలుసూత్రధారిగాక
తన జన్మమునకు రంధ్రము దెచ్చు...
.... దప్పకణఁగియున్న

గీ॥ అమరరత్నంబు వివరణ యత్నమునకు
సాటి నీతోడ ననవచ్చు సార్వభౌమ!
భూరివిద్యావిశారద భుజగరాజ
భోగవైభవ సురరాజ భోజరాజ. 11

సీ॥ వనవాసియైపోక నాతకంపయుగాక
కఱకుగా.... గాక
పండుపోనాడక బహుబీజమైపోక
కోలలచేతను గొట్టువడక
పల్లవించినచోట వసరుగాఁదిరుగక
నేలను దాచక మూలధనము
పలుగాకులకు నీడపట్టుకై నిలువక
కొమ్ములఁజూపక కోర్కులిడక

గీ॥ కల్పవృక్షంబు దాన సంకల్పమునను
....    ....    ....    ....
...    ....    ....    ....
....    ....    ....    .... 12



## షట్చక్రవర్తులు

శ్లో॥ హరిశ్చంద్రో నలో రాజా పురుకుత్సః పురూరవాః,
సగరః కార్తవీర్య శ్చ షడేతే చక్రవర్తినః. 13

జిగిబిగియును, రుచియును గల యీ క్రింది పద్యరాజములు యత్కర్తృకములో తెలిసినదికాదు.

సీ ॥ హరిహరబ్రహ్మాదుల ద్భుతంబందంగ
నెగడె సత్యవ్రతనిష్ఠ కలిమి
నాలుగుయుగముల నోలిని బదునాల్గు
వరుసల వర్తిల్లి వసుధ యేలె
సప్తపాథోధిసంగుప్తసప్తద్వీప
సంధుల జయశిలా స్తంభవితతి
నిలిపె నాఖండలాదులు పంపు సేయంగ
రాజసూయమహాధ్వరంబొనర్చె

గీ॥ నతలవితలరసాతలాద్యఖిలదనుజ
లోకగంధర్వలోకాహిలోకనాక
లోకగోలోకకమలజలోకభరిత
సాంద్రయశుఁజెప్పఁదగు హరిశ్చంద్ర విభుని. 14

సీ॥ చంద్రకందర్పాది సౌందర్యవంతులు
తనుఁజూచి సిగ్గునఁదనరఁదనరె
త్రైలోక్యసుందరి దమయంతి తనయందు
బద్ధానురాగగాఁబరఁగఁబరఁగె
అర్థికిఁ బ్రాణంబు నర్థంబు నిచ్చుట
నెట్టన బిరుదుగా నెగడ నెగడె

అమరులు దన మనోవిమలత కిచ్చమై
మెచ్చి నెచ్చెలులుగా మెఱయ మెఱసె

గీ॥ మహితకర్కోటకాహీంద్రమైత్రిపరుఁడు
పుణ్యఋతుపర్ణ వర్ణితాగణ్యగుణుఁడు
వితత కలిదోషసంహార విమలయశుఁడు
నలుని గీర్తింప నఘములు దొలఁగు టరుదె? 15

సీ॥ చంద్రనందనునకు సాధ్వియిలాకన్య
యందుద్భవించెఁ బుణ్యములతోడ
శ్రీమత్సురాంగనాసీమంతమణియైన
యూర్వశి పత్నిగా నుర్వి యేలె
వితతభాండాగారవిపుల గోష్ఠాగార
తతి విప్రహస్తసంగతిగ నిచ్చె
ఆయుర్దృఢాయుస్సుఖాయుర్ముఖుల దేవ
పతి చూచి వెఱఁగంద సుతులఁ బడసె

గీ॥ సుజనముచికుందభూపాల సోదరత్వ
మేరుమందరధృతియశోమేదురత్వ
సకలగుణరత్న భూషణసాగరత్వ
ధను నఘచ్యుతుఁ బురుకుత్సుఁ జను నుతింప. 16

సీ॥ మహి యెల్లయెడ నేలుమాంధాతృనకుఁ బుట్టి
యాదిగర్భేశ్వరుండనఁగఁ బరఁగె
బ్రాహ్మణభ క్తిసంపన్న సౌజన్యత
విప్రవశుండన వినుతి కెక్కె
ఇరువేలవర్షముల్ గుఱుతుగా నొక దినం
బాదిగాఁగలయధ్వరాళిఁ జేసె



త్రిభువనప్రీతిగా దివ్యకోదండుఁడై
బహుకోటిదనుజుల బలమడంచె

గీ. ప్రకటశాత్రవభంజనభైరవుండు
పౌత్రతాయత్త కౌరవపౌరవుండు
హర్షితానేక జనవినుతారవుండు
గౌరవోన్నతి నొప్పెఁబురూరవుండు. 17

సీ. పటుశక్తిశౌర్యు లర్వదివేవురాత్మజుల్
పనిచేయ నిమ్మహీభరము దాల్చె
ఒక్కొక్క సుతుపేర నొక్కొక్క పట్టణం
బిలయెల్లఁగల్పించె నలఘుమహిమ
అన్ని పట్టణముల నఖిలమహారత్న
చయములు గల్గ రాజ్యంబు చేసె
పుత్రమోహభ్రాంతిపొందక మర్యాద
తొలఁగిన సుతుల నిల్ తొలఁగఁ దోలె

గీ. చెప్ప నొప్పదె నిజపౌత్ర చిత్రఘోర
తమ తపోలబ్ధగంగాంబుతరళ సలిల
వీచికానూన సోపాన వితతయాన
నవనివాసిత వైకుంఠనగరు సగరు. 18

సీ॥ హేహయవంశధాత్రీశాబ్ధిచంద్రుఁడై
జనియించి విశ్వభూచక్ర మేలె
అచ్యుతమూర్తి దత్తాత్రేయయోగీంద్రు
చేత జగజ్జైత్రసిద్ధి వడసె
ఏ తప్పు నెన్నఁడు నెవ్వరు నెచ్చోటఁ
దలఁప రాకుండంగ నిలిపె నాజ్ఞ

ఏడుదీవులయందు నేన్నూఱు హయమేధ
యాగంబు లొనరించె నలఘుమహిమ

గీ॥ అతులతరదీర్ఘసత్త్వసహస్ర బాహుఁ
దహి గణాధిపఫణగణాయత్తభూరి
భూభరముఁదాల్చె నవలీలఁబొగడఁదగదె
కార్తవీర్యార్జు నాహ్వయక్ష్మాతలేంద్రు? 19

సీ॥ ఒగిఁ జతుర్దశమహాయుగములు భువిఁదాల్చె
సత్యవ్రతము హరిశ్చంద్రవిభుఁడు
జంభారివరుణాదిసంభావితులలోన
దమయంతి వరియించెఁ దనర నలుఁడు
ఆదిగర్భేశ్వరుండై విప్రదాసుఁడై
చరియించెఁ బురుకుత్సజనవిభుండు
బ్రాహ్మణహస్తంబు భండారమదియె కొ
తారంబుఁజేసెఁ బురూరవుండు

గీ॥ సాగరము పేర్మి నిర్మించె సగరనృపతి
కార్తవీర్యుండు మహిజైత్రవర్తనుండు
వీరలార్గురుఁ దలపోయ విష్ణునిభులు
చక్రవర్తులు నిత్యనిర్వక్రయశులు. 20

## మైలమభీమన (ఏఱువభీమ)

ఈతనిపేరఁగల్గుపద్యములు ("గరళపుముద్ద-" ఏఱువభీమ-) వే(లే)ములవాడ భీమకవికృతములుగా లక్షణగ్రంథములందుదాహరింపఁబడినవి. ఈ క్రింద నుదాహరింపఁబడుపద్యములెల్ల నొక్క వరుసలోనివే యగుటచే నొక్కరిచేతనే (భీమకవిచేత) రచియింపఁబడిన వనుకొనెదను. భీమకవిపద్యములు నల్లసిద్ధి,



సాహిణిమారన, చాళుక్య చొక్కభూపతి, కళింగగంగు (చోడగంగఁడు) తెలుంగాధీశుఁడు, మైలమభీముఁడు ననువారికిఁ బ్రసక్తించినవి యగుటచేత- నాయందఱు సమకాలమువారు కాఁదగుదురు. భీమకవినిగూర్చి "ప్రబంధరత్నావళి" పీఠికలోఁ గొంత విస్తరించి చర్చించియున్నాను. [1]విజయ నగరసంస్థానపుఁబ్రభువు లగు పూసపాటివా రీ మైలమభీమనసంబంధులఁట! ఈతఁడు ఏలేరు, కసిమి, వేంగి, కళింగలను జయించినట్టు పద్యములందున్నది. ఏఱువభీమ మైలమభీమ పదము లొక్కనిపేళ్ళే. ఏఱువ వంశమున నల్లభీముఁడని, ఎఱ్ఱభీముఁడని యిద్దఱు భీములున్నారు. అందొకఁడు మైలమభీముఁడు గాఁబోలును.

ఉ॥ యాచకఖేచరుండు సుగుణాంబుధి మైలమభీమఁడీల్గినన్
జూచి వరించె రంభ, యెడఁజొచ్చెఁ దిలోత్తమ, దారి నిద్దఱన్
ద్రోచె ఘృతాచి, ముగ్గుఱకు దొడ్డడికయ్యము పుట్టె నంతలో
నాఁచుకుపోయె ముక్తిసతి నవ్విరి యద్దశఁ జూచి నిర్జరుల్
నోఁచినవారిసొమ్ము లవి నోమనివారికి వచ్చునే ధరన్. 21

(ఇందలి కడపటి చరణము నాచనసోముని యుత్తరహరివంశమందును గలదు)

చ॥ అహితులఁ దాఁకి పోరునెడ నంబుధి కల్గిననాఁటిరాము గో
గ్రహణమునాఁటిపార్థు గదఁ గౌరవు నేసిన నాఁటిభీము నా
గ్రహ మెసఁగం బురత్రయముఁగాల్చిన నాఁటి లలాటలోచనున్
మహి నుపమింపఁగాఁ దగునె మైలమ భీముని భీమవిక్రమున్. 22

ఉ॥ పన్ని తురంగమంబునకుఁ బక్కెర వెట్టినవార్త హేరిచే
విన్న భయంబునం గలఁగి వీసరనాడును చక్రగోట్టమున్
మన్నియపట్టణంబులును మక్కెన వేంగి కళింగలాదిగా
నిన్నియు నొక్కపెట్టెగసె నేఱువభీమ నృపాలుధాటికిన్. 23

1. చూ. చాటు - కవిప్రశంసాస్తబకము

కII అరివరు లేఱువభీమని
పొరువున మనలేరు చిచ్చుపొంతను వెన్నై
తెరువునఁ బెసరై జూదరి
సిరియై రేన్చెట్టుక్రింద జిల్లెడుచెట్టై 24

ఉII ఆలములో నరాతులకు హమ్మని మార్కొనవచ్చునే మహా
కాళికి శూలికిన్ బ్రళయకాలపుగాలికి రాఘవేంద్రుబా
ణాళికిఁ బక్షినాయకునఖాళికి మత్తగజేంద్రవైరిదం
ష్ట్రాళికి దావపావకశిఖాళికి మైలమభీమువాలికిన్. 25

ఉII నేరుపు బ్రహ్మఁ జేరె నిజనిర్మల తేజము సూర్యుఁ జేరె నా
కారము కాముఁ జేరె నధికంబగు లక్ష్మి యనంతుఁ జేరె గం
భీరత వార్ధిఁజేరెఁ గలపెంపు కులాద్రులఁ జేరెఁ గీర్తిదా
నూఱట లేక త్రిమ్మఱుచు నున్నది మైలమభీముఁ డీల్గినన్. 26

చII గరళపుముద్ద లోహ మవగాఢమహాశనికోట్లు సమ్మెటల్
హరునయనాగ్ని కొల్మి యురగాధిపుకోఱలు పట్టుకార్లు ది
క్కరటిశిరంబు దాయి లయకాలుఁడు కమ్మరి వైరివీరసం
హరణగుణాభిరాముఁడగు మైలమభీమనఖడ్గసృష్టికిన్. 27

మII తెరలంబాఱి నభంబు దాఁకినఁ బయోధింజొచ్చినన్ శైలగ
హ్వరముల్ దూఱినఁ జిక్క భీముఁడు నృపవ్రాతంబుఁ బోనిచ్చునే
గరుడుండై చని పట్టు మింటితుద నుగ్రగ్రాహమై చొచ్చి సా
గరమధ్యంబున మ్రింగుఁ బట్టుకొను సింగంబై గుహాంతంబునన్. 28

కII ఆలమునఁ జిక్కభీముఁడు
వాలతివేగమునఁ బెఱికి వడి తుదఁగవియన్
బ్రేలిపడఁబడుగు నేసెను?
ఏలేరును గసిమి భైరవేశుండెఱుఁగన్. 29



ఉII వీరగుణప్రతాపగుణవిశ్రుత! మైలమభీమ! నీ యశం
బారభమానతారకరహారవిలాసము నీ నికేతనం
బారభమానతారకరహారవిలాసము నీ భుజార్గళం
బారభమానతారకరహారవిలాసము చిత్రమిద్ధరన్. 30

ఉII భండనభీమ నీ యెదురఁ బాఱక నిల్చినశాత్రవుల్ బృహ
న్మండలపుండరీక పురనాకనివాసులు నోర్చినన్ బృహ
న్మండలపుండరీక పురనాకనివాసులు చచ్చినన్ బృహ
న్మండలపుండరీక పురనాకనివాసులు చిత్రమిద్ధరన్. 31

చII విదితగురుప్రతాపగుణవిశ్రుత! మైలమభీమభూప! నీ
పదిలపుఖడ్గధారఁ దెగి పాటినవీరుఁడు గోపురంబుపై
విదితసువర్ణరత్నమయవేదికమీఁదను నిల్చి కాంచు నౌఁ
బదిపదులగ్నిహోత్రులను బన్నిరుసూర్యుల నూఱుచంద్రులన్. 32

చII అసమునఁ గాశికానగరమందసువుల్ త్యజియించినంతనే
యసదృశమైన కన్నుగలదచ్చట మైలమభీమభూప నీ
యసిఁదెగిపడ్డ వైరులకు నంబకముల్ పదినూఱులయ్యె నీ
యసికిని వారణాసికిని నంతరమెంత దలంచి చూచినన్. 33

కII వసుమతిలోఁ జిరకాలము
మశకంబై మనుటకంటె మదకరికుంభ
గ్రసనంబగు సింహంబై
మసలుట యొక గడియచాలు మైలమభీమా! 34

## (అమృతనాథుఁడు) మాచయబ్రహ్మఁడు

ఈతఁడు, నాచనసోముని వసంతవిలాసకృతికిఁ బతియని, యా గ్రంథమందలి మొదటిపద్యమిది యని శ్రీరామకృష్ణకవిగా రుదాహరించినారు.

శా॥ శ్రీ చన్నుంగ్రవక్రేవఁ గ్రొమ్మెఱుఁగులన్ శృంగారపుందోఁటకున్
బ్రాచీనంబగుచున్న వింశతినఖప్రౌఢిన్ సుఖాంభోధివే
లాచంద్రోదయమైనదేవుఁడు కృపాలంకారచిత్తంబునన్
జూచున్ మాచయబ్రహ్మధీమణిఁ గవిస్తోమైకచింతామణిన్. 35

ఈతనిఁగూర్చి చాటువు :-

సీ॥ కమలంబునకుఁబుట్టి కమలంబుచుట్టమై
కమలంబు తన నాభిఁగాంచిగాక
గంగకునుదయించి గంగ నౌదలఁదాల్చి
గంగలో భువనంబు గలపిగాక
జలరాశి జన్మించి జలరాశి లంఘించి
జలరాశి బాణాగ్నిఁ జమరి గాక
వహ్నికి నుదయించి వహ్ని నెచ్చెలిఁ జేసి
వహ్ని ఖాండవముపై బ్రాఁకి గాక

గీ॥ ఊర కెవ్వారు నీతోడ నొరయువారు
బుద్ధితేజోరమాశౌర్య భూతి యత్న
కాంతి విక్రమఖ్యాతి సంగతులకలర
ప్రాభవోదార! మాచయబ్రహ్మధీర. 36

## రణతిక్కన - నెల్లూరుపురము

విరాటపర్వముఁదొట్టి తుదముట్ట నాంధ్ర మహాభారతమును రచియించిన తిక్కన సోమయాజి కీతఁడు పెద్దతండ్రికుమారుఁడు. పదుమూఁడవ శతాబ్దియందు విక్రమసింహపురమున రాజ్యమేలిన మనుమసిద్ధిరాజునొద్ద సేనాని.

సీ॥ వీరవివాదంబు వేదనినాదంబు
పాయక యే ప్రొద్దు మ్రోయుచుండు



భూసురప్రకరంబు సేసలు చల్లంగఁ
బాయకెన్నియొ కుటుంబములు బ్రదుకు
బ్రాహ్మణావళికి ధారలుపోసినజలంబు
సతతంబు ముంగిట జాలువాఱు
రిపుల కొసఁగిన పత్రికలపుత్రికలను
బాయక కరణముల్ వ్రాయుచుండ్రు

గీ॥ మానఘనుఁడైన తిక్కనమంత్రి యింట
మదనసముఁడైన తిక్కనమంత్రి యింట
మహితయశుఁడైన తిక్కనమంత్రి యింట
మంత్రిమణియైన తిక్కనమంత్రి యింట. 37

మనుమసిద్ధి రాజునకును నెఱగడ్డపాటియేలికయగు కాటమరాజునకును జరిగిన సంగ్రామమున నీ ధన్యచరిత్రుఁడు కీర్తిశేషుఁడయ్యెను. పుల్లరి యిచ్చు నొడంబడికపైఁ గాటమరాజు తన పసుల మనుమసిద్ధిరాజుమేఁతబీళ్ళలో మేపుకొని యక్కడఁ దన కోడెదూడలలో నేదో నష్టము సంభవించిన దన్నకారణమునఁ బుల్లరి నెగఁగొట్టెను. దానిపై మనుమసిద్ధిరాజు పసులబోఁనీయఁడయ్యె. పరస్పర యుద్ధమున కిది కారణము. ఈ యుద్ధచరిత్రము "కాటమరాజుకథ" యనుపేర గ్రంథరూపమున వెలసినది. మనుమసిద్ధి పక్షమునఁ గొంత సేనతో ఖడ్గతిక్కన కాటమరాజు సేన నెదుర్కొని కొంత పోరాడి తన బలము చెల్లాచెదరుకాఁగా నిలువరాక తిరిగి యింటికి వచ్చెను. నాఁడు స్నానము చేయఁబోఁగా స్త్రీలు జలకమాడు మఱుఁగుపట్టున భార్య నులుకమంచ మడ్డుసేసి పసపుటుండ దానిపైనుంచి నీళ్ళబిందెఁదెచ్చి పెట్టెనఁట! ఇది యేమని వ్యసనపడియడుగ-

క॥ పగఱకు వెన్నిచ్చినచో
నగరే నిను మగతనంపు నాయకు లెందున్?

ముగురాఁడువార మైతిమి
వగపేటికి జలకమాడవచ్చినచోటన్? 38

అని యవమానకరముగా సైతము పల్కెనట! తర్వాతఁ దల్లి యన్నములో విఱిగినపాలుపోసెను. తిక్కన తల్లి నిదియేమని యడిగెను. తల్లి "నాయనా! నీవు పోయినచోటికే పసులును మేఁతకుఁ బోయెను. అవియును విఱిగి వచ్చినవి. పాలును విఱిగెను" అనెనఁట!

కII అసదృశముగ నరివీరుల
మసిపుచ్చక విఱిగివచ్చుమగపందక్రియన్
గసవున్ మేయఁగఁ బోయిన
పసులున్ విఱిగినవి తిక్క! పాలున్ విఱిగెన్. 39

అంతట నన్నము విడిచి లేచి యుద్ధసన్నద్ధుఁడై పోయి పగఱ నెదుర్కొని వీరస్వర్గమునందినట్లు నాఁటికవుల వర్ణనము.

చII పదటున వాజి రాహుతులపై దుమికించుచుఁ దిక్కఁ డార్చినన్
బెదరి పరిభ్రమించి కడుఁ బిమ్మట వీరులు భీతచిత్తులై
యదె యిదె వాలు వాల్మెఱుఁగు లల్లవె యల్లదె యాతఁడం చనన్
గొదుకక యాజిఁజేసె రిపుకోటులకందఱ కన్నిరూపులై. 40

ఉII చిక్కక మన్మసిద్ధివిభుచే మును గొన్నఋణంబు దీర్చె మా
తిక్కనమంత్రి సోమశిల దేవరసాక్షిగఁ బెన్నసాక్షిగా
నెక్కిన వాజిసాక్షిగ మహిన్నుతికెక్కిన కీర్తిసాక్షిగా
స్రుక్కక మారుకొన్నరణశూరులు సాక్షిగఁ గొండసాక్షిగన్. 41

సీII రణరంగమున మోహరంబులఁ బొడగని
ప్రాణంబు వాసినపందగజమ!



విజయాధిపుని దాడి వెనుకొని తగులంగ
దెసదప్పి పాఱినదిగ్గజంబ!
చేరఁ జాలక తిర్గి చేమడ మళ్లించి
మంచాన కందనిమదగజంబ!
బెనుతుల్లి చెఱువులోఁ బిరుదు లన్నియు రొంపిఁ
గ్రుంగంగఁ ద్రొక్కినకుంజరంబ!

ఆIIవెII నేఁడు మొదలుగాఁగ నెల్లూరివీథిలోఁ
బొగడుతనము సేయుమగలతలలు
పూరిగఱచి తిక్క? భూతమై సోఁకుము
యూరివారిసోఁకు గారుసేసి. 42

--------------------------------

పాఠాంతరము.

సీII విజయాధిపునిదాడి వెనువెంటఁ దగిలినఁ
బ్రాణముల్ దాచిన పందగజమ!
పెనుజల్లెపల్లెలో బిరుదులన్నియు వైచి
పరుగెత్తి వచ్చినపారుఁబోత!
దురములోఁ జావక దొరలెల్ల హసియింప
మంచానకొరిగిన కొంచె కాడ
చతురంగబలముతో సమరంబు సేయక
మానంబు విడచిన మందబుద్ధి

గీ. యనుచు నార్వేలవారు నిన్నపహసింప
ధరణి నెల్లూరిలో నెట్లు తిరుగ గలవు?
వైరులను గెల్చి సత్కీర్తి వరలు మయ్య!
మంత్రికులహేళి? తిక్కనామాత్యమౌళి! 43

సీ॥ ధైర్యంబు నీ మేనఁదగిలి యుండుటఁజేసి
చలియించి మందరాచలము తిరిగె
గాంభీర్యమెల్ల నీ కడన యుండుటఁజేసి
కాకుత్థ్సుచే వార్ధి కట్టువడియె
జయలక్ష్మి నీ యురస్థ్సలిన యుండుటఁజేసి
హరి పోయి బలి దానమడుగుకొనియె
ఆకారమెల్ల నీయంద యుండుటఁజేసి
మరుఁడు చిచ్చునఁబడి మడిసి చనియె

గీ॥ దిక్కదండనాథ! దేవేంద్రపురికి నీ
వరుగుటెఱిఁగి నగము తిరుగుటుడుగు
నబ్ధి కట్టువిడుచు నచ్యుతుకొద మాను
మరుఁడు మరలఁ గలుగు మగలరాజ! 44

సీ॥ నందిని బుత్తెంచె నిందుశేఖరుఁడు నీ
వన్న! యేతెమ్ము తారాద్రికడకు
గరుడినిఁ బుత్తెంచె నరహరి రావయ్య
వడి సిద్ధతిక్క కైవల్యమునకు
హంసను బుత్తెంచె నజుఁడు నీకడకు ను
భయకులమిత్ర! రా బ్రహ్మసభకు
ఐరావతముఁ బంపె నమరేంద్రుఁ డిప్పుడు
దివమున కేతెమ్ము తిక్కయోధ!

గీ॥ యనును వేఱువేఱ నర్థితోఁ బిలువంగ
వారువీరుఁ గూడ వచ్చివచ్చి
దివ్యయోగియైన తిక్కనామాత్యుండు
సూర్యమండలంబు సొచ్చి చనియె. 45



ఉ॥ వెన్నెలలేనిరాత్రియు రవిప్రభలేనిదినంబు నీరులే
కున్నసరోవరంబు కడునొప్పగు దీపములేని యిల్లునై
విన్నఁదనంబు నొందె మన విక్రమసింహపురంబు చూడఁగాఁ
బున్నమిచంద్రుఁబోలు మన పోలమతిక్కఁడు లేమి నక్కటా! 46

## సిద్ధయ తిక్కన

ఈ తిక్కన రణనిహతుఁడయిన పిదప వేములవాడభీమకవి యాతని యింటికేఁగి యాతని భార్యను “దీర్ఘసుమంగళీభవ” యని యాశీర్వదించెనట! ఆమె భర్తృవియోగవార్త తెలిపి శోకింపఁగా నాతఁడు–

క॥ గుణములనిధాన మగుమన
రణతిక్కన తాఁగళేబరంబును శిరమున్
గణఁకమెయిఁగలయ బ్రదుకును
బ్రణుతాఖిలవైరిమకుటభాసితపదుఁడై. 47

అని పద్యముచెప్పి రణతిక్కనను జీవింపఁ జేసెనట! ఇది కట్టుకత. రణతిక్కనను గూర్చి చెప్పఁబడిన పద్య మిది యొకటి–

ఉ॥ ఏమి తపంబు చేసి పరమేశ్వరు నేమిటఁ బూజచేసిరో
రామునితల్లియుం, బరశురామునితల్లియు, భీముతల్లియున్,
గామునికన్న తల్లియును, గంజదళాక్షుననుంగుఁ దల్లియున్
శ్రీమహితప్రతాపుఁడగు సిద్ధనతిక్కన కన్నతల్లియున్. 48

ఉ॥ శ్రీయలరార శత్రువులఁ జెందితి వార్యులు మంత్రివర్య రా
ర్వేలఘనుల్ నుతించి రలవేల్పుదొరల్ ముదమంది మెచ్చిరో
లాలితశౌర్యధైర్య జయలక్ష్మి ప్రియంబున నిన్వరించె నీ
లీలలు హెచ్చెఁ దిక్కనికళేబరమా! యిఁక నిల్చియాడుమా! 49

[1]నెల్లూరు ప్రాంతమునఁగల పట్టుపురాయిగ్రామానకుఁ దూర్పుభాగమునఁ బినాకినీ నదీతీరమునఁ దిక్కనపాదనుస్థలము గలదు. ఆ స్థలమందు గుఱ్ఱము మీఁద రౌతును జెక్కినశిల యొకటి నేఁటికిని గలదు. అది తిక్కన ప్రతిమయని స్థలజ్ఞులు చెప్పుదురు.

## నెల్లూరు ఏలికలు

సీ॥ ధీరుఁడై ధరయేలెఁ దిరుకాళదేవుండు
తిక్కనాయకుఁడేలెఁ దేజ మెసఁగ
మన్మసిద్ధన యేలె మహిమతో దీపించి
దాదినాగన యేలె ధర్మరీతి
మనుగండగోపాలమనుజాధిపతి యేలె
స్వర్ణదేవుండతిప్రభగ నేలె
గోపినాథుండేలె గుణపయోరాశియై
రమణతో శ్రీరంగరమణుఁడేలె

గీ॥ తిక్కనయు మఱియొకకొన్నిదినము లేలె
నేలె మీతండ్రి మర్యాద లెల్లఁ గలుగఁ
గడఁక నీ వేలితందఱకంటె మించి
శరధిగంభీర! సంగమక్ష్మాతలేంద్ర! 50

## హరిహరరాయలు

చ॥ హరిహరదేవ నీ వవినతారుల నద్భుతలీలఁద్రుంపఁగా
గరికరి వాజివాజి నవఖండవిఖండధారలై

1. ఈ విషయము ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారమందలి చారిత్రక సంపుటములందున్నది.



యరుదుగ నీదు హేతిజరాగ్నులఁ బర్వుచు నెప్పుడుండురా
ధరధర ధారధార ధరధార ధరాధర ధారధారలన్ (?) 51

## ప్రౌఢరాయఁడు

సీ॥ సర్వసర్వంసహాచక్రవర్తికి భట్టు
ఘనమైన నాయకాగ్రణికి భట్టు
రణసముద్భటవీర రాహుత్తునకు భట్టు
కనుపట్టుదాతరాయనికి భట్టు
ప్రియనయోన్నతి గల బిరుదురాజుకు భట్టు
సుచరిత్రుఁడగు గృహస్థునకు భట్టు
సప్తసంతానాతిశాంతాత్మునకు భట్టు
గణుతింపఁదగు మంత్రిమణికి భట్టు

గీ॥ కాక యత్యంతలోభివికారగరిమ
చటులదుర్భాషితానేకజనకఠోరుఁ
డైనమేధావిహీనునకవునె భట్టు
లక్షణోపేంద్ర ప్రౌఢరాయక్షితీంద్ర. 52

## పోతుగంటి మైలానేఁడు

సీ॥ బలిమిఁ బ్రతాపుని కొలువునాయంకుల
కుంచెలు మాన్పినగురుభుజుండు
భువి దొడ్డమారెమ్మగవిని దూరుచు నర్గ
ప్రకటవిద్వేషినాయకులమగఁడు
ఎలమి డెబ్బదియేడ్గ రలరారఁగొల్చి రా
రుద్రదేవుని యొద్ద భద్రగజము
పరతేర నందఱుఁ బాఱంగఁ గరిఁ ద్రోచి
హరిదంతిభీమాంకుఁ డనఁగఁ బరఁగి

గీ॥ ధరణిలోన వెలయుదండాడుగండాంక
భీమనృపతిపుత్ర పృథులగోత్ర
పోతుగంటిమైలభూపాల! నీ చేతి
హేతి కెదురు నిల్వ నెందు లేరు. 53

సీ॥ మానిసికొండొద్ద మన్నె వేశ్యాభుజం
గాంకుబొమ్మయదేవు నాజిఁ బరపె
నీసునఁ బైపడ్డ బోసంగికడదాఁకఁ
బరఁగ మంగయనేని భంగపఱిచె
పోరిలో మెఱయు కొండూరినల్లయరెడ్డి
.... .... వెసఁ జీమలేటిబయల
నుప్పరపల్లొద్ద నుద్వృత్తిఁ బైపడి
ఢిల్లితురుష్కుల త్రుళ్ళడంచె
ఢిల్లిలో దెలుఁగుబిజ్జలనృపాలుని గెల్చి
తావిశలకీర్తిధర్మగతిని నిల్పె?

గీ॥ ...................................
భీమభూపాలసుతుఁడు తద్భీమబలుఁడు
వైరిగజభీముఁడమితసత్యప్రియుండు
ఘనభుజాశాలి యగుపోతుగంటిమైలి. 54

సీ॥ ఢిల్లిలో సురధానుఁ డొల్లివేదిధరాది (?) (డల్లాయుదీన్‌ధరా)
దృ(ధ్య)క్షుండు ప్రత్యక్షసాక్షి గాఁగ
జగతిపై డెబ్బ దేడుగురు నాయంకులు
నక్షీణబలయుతుల్ సాక్షిగాఁగ
సహజసాహసయుద్ధసన్నద్ధవరభటా
శ్రయమైన దా కొలు సాక్షిగాఁగ



గీ॥ సూర్యవంశోదయఖ్యాతుఁడార్య తెలుఁగు
బిజ్జలనృపాలు గెల్చెఁదద్భీమబలుఁడు
వైరిగజభీముఁ డమితసత్యప్రియుండు
ఘనభుజాశాలి యగు పోతుగంటిమైలి. 55

## ఈయన కొడుకు

సీ॥ మాయురే భాశోరమల్లసంహరణాంక
చాఁగురే తెలుఁగుబిజ్జలవిభాళ
హాహా సముద్ధతాహవవైరిగజభీమ
మేలుమేలు కులపిశాలిగోత్ర
హొూహొూసత్కీర్తిసముచ్ఛ్రితబ్రహ్మాండ
హాహేప్రశస్తదండాడుగండ
యవుర పాంబాదేశహన్నిబ్బవరగండ
బళి బేతిదంపభూపాలదళన

గీ॥ యనుచుఁ గొనియాడుదురు నిన్ను నర్థిజనులు
మగధమాళవనేపాళమత్స్యసభల
భీమభూపాల సత్పౌత్ర పృథుచరిత్ర
విభవనాభాగ మైలభూవిభునినాగ 56

## అబ్బ నృపాలుఁడు

ఉ॥ వల్లభ! భోగభాగ్యసురవల్లభ! చారువివేకశారదా
వల్లభ! నిత్యసత్యరఘువల్లభ! ధర్మవిచారద్రౌపదీ
వల్లభ! వాగ్విలాసఫణివల్లభ! కాంతివిహారశారదా
వల్లభ! చింతపల్లుపురవల్లభ! అబ్బ నృపాలువల్లభా! 57

## ఖండియరాయ వల్లభుఁడు

మ॥ కదిలెన్ ఖండియరాయవల్లభుఁడు వేడ్కన్ దాడి యీ ధాత్రిపై
నదె ఛత్రంబదె చామరంబదె హయంబన్నన్ భయభ్రాంతులై
కదనోర్వీధరచాపచక్రధృతిగా ఖడ్గాదిశస్త్రాస్త్రముల్
చదరన్ వైచి తదీయవైరులు గిరుల్ సంప్రాప్తులై రక్కరే! 58

## అతనికొడుకు

ఉ॥ భండన మాటపట్టు జయభామిని నెచ్చెలి చండవిద్విష
న్మండలి దేహరక్తములు మానక పానకముల్ గ్రహించు ను
ద్దండత డాకినుల్ సఖులు తక్కిన భూతము లర్థి లిమ్మహిన్
ఖండియరాయవల్లభుని గన్న నృపాలకరాసిపుత్రికిన్. 59

## అతనియనుజుండు

సీ॥ ప్రతిపక్షసుందరీబంధుర స్తనముల
పసుపుఁబయ్యెదలకుఁ బాయు తెరువు
రిపురాయభామినీవిపులధమ్మిల్లంబు
విరులనెత్తావికి వీడుకోలు
శాత్రవకామినీచటుల నేత్రంబుల
కలికికాటుకలకుఁ గానివావి
యరిరాయభామినియారుణాధరముల
సొబగువీడెములకుఁ జుక్క కెదురు

గీ॥ చేసె నౌరౌర ధాత్రి నీ చేకతారి
వైరిగజభీమ వల్లభేశ్వరకుమార
వనజహిత తేజ! కామినీజనమనోజ!
బహుతరాటోప! సింగభూపప్రతాప! 60

ఈ సింగమనేఁడే రావు (చౌసీతివరాల) సింగనాయన బావమఱఁది



## గజరావు తిప్పరాయఁడు

సీ॥ యవనుల గెల్వఁడే యంపరాయలు చూడ
నెట్టెనఁ గంబము మెట్టుబైటఁ
బరిపంథియోధులఁ బరపఁడే వాఁడిమై
నుద్దండవృత్తి కోనూరియొద్దఁ
గాటయవేమభూకాంతుసైన్యంబెల్లఁ
గొట్టఁడే యలగుండుగొలనిక్రేవ
చమడపామాత్యుని సాచిగాఁ గొట్టఁడే
కొండవీ డా పెద్దకొండగడిని

గీ॥ బ్రబలరణరంగజయభేరిభాంకృతుండు
రాయచేకోలుగండధరావిభుండు
రామ రఘురామ బలభద్రరామ విభుఁడు
దీప్రబలుఁడైన గజరావు తిప్పఘనుఁడు. 61

## ప్రతాపరుద్ర చక్రవర్తి

సీ॥ పూర్వాపరాద్రులు పొలిమేరలై యుండ
నే రాజు జగమెల్ల నేలఁగల్గె
లక్షింపఁ దొమ్మిదిలక్షలవిలుకాండ్రు
నే రాజుబలములో నెలమిఁ గలరు
ధరణి డెబ్బదియేడుగురు నాయకోత్తము
లే రాజు సేవింతు రిచ్చగించి
దాక్షిణాత్యులనెల్లఁ దఱిమి జయస్తంభ
మే రాజు నిల్పె రామేశ్వరాన

గీ॥ అతఁడు కాకతివీరరుద్రావనీశుఁ
డమ్మహారాజు చెప్పంగ నలరె ధాత్రి
రాజశేఖరుఁ డెంతయు రమణతోడ
జగముపాలించు భూలోకచక్రవర్తి. 62

## సాహిణిమారన

సీ॥ జడలలో మిన్నేఱుఁ జంద్రరేఖయుఁగల
యాతఁడీతండు నేమౌదు రొక్కొ
వరవజ్రకవచంబు వజ్రాయుధము గల
యాతఁడీతండు నేమౌదు రొక్కొ
కోల్పోవు తనయుండు క్రోఁతిటెక్కెము గల
యాతఁడీతండు నేమౌదు రొక్కొ
చెఱకుసింగిణివిల్లు సెలగోలయునుగల్గు
నాతఁడీతండు నేమౌదు రొక్కొ

గీ॥ శంభుఁడాతండు శాశ్వతారంభుఁడితఁడు
ఇంద్రుఁడాతండు భోగదేవేంద్రుఁడితఁడు
పార్థుఁడాతండు సమరసమర్థుఁడితఁడు
మారుఁడాతండు సాహిణిమారుఁడితఁడు. 63

## రెడ్డిరాజులు

కాకతీయుల యొద్దఁ దొలుత దండనాథులుగా నుండి తత్సామ్రాజ్యము సన్నగిల్లిన తర్వాతఁ బద్మనాయకుల వలెనే వీరును స్వతంత్ర రాజులైరి. తొలుత వీరి రాజధాని యద్దంకి. తర్వాతఁ గొండవీడు రాజమహేంద్రవరము కందుకూరు. వీరు మహాదాతలు. పదమూఁడవ శతాబ్దినుండి వీరి పాలనము పెంపొందెను. నూఱు సంవత్సరములకంటె వీరి రాజ్యము మహోచ్ఛ్రయమున లేదు. వెల్గోటి



వెలమరాజులును ఒడ్డెరాజులును ప్రబల శత్రువులై యీ రాజ్యమంతరింపఁ జేసిరి. ఈ రెడ్ల పరిపాలనక్రమమును గూర్చి యీ క్రింది సీసపద్యము వాడుకలోఁగలదు. శాసనములఁబట్టి పరిశీలించిన నిది మిక్కిలి యక్రమమగుచున్నది.

సీ॥ పోలయవేమన్న పొలుపారఁ బండ్రెండు
వత్సరంబులు గాచె వసుధయెల్ల
అటవెన్క ముప్పది యనపోతవేమన్న
వన్నెవాసికినెక్కి వసుధ యేలె
ధర్మాత్ముఁ డనవేమధరణీకళత్రుండు
పదియునేనిట భూమి పదిలపఱిచె
ప్రజల కుబ్బసముగఁ బదునాలుగేఁడులు
కొమరగిరేలెను సమయుదాఁక

గీ॥ ఏలెఁ గోమటివేమన యిరువదేడు
రాచవేమన్న నాల్గు వర్షములనేలె
మించి కట్టిరి గృహరాజుమేడ కొండ
వీట నూరేండ్లు రెడ్లు భూవిదితయశులు. 64

## అనవేమారెడ్డి

రెడ్డిరాజులలో నీతఁడు విఖ్యాతబలపరాక్రముఁడు. క్రీ.శ. 1370 ప్రాంతముల నున్నవాఁడు. రెడ్డిరాజ్యమునకు నద్దంకి రాజధానిగా నుండఁగా నీతఁడు క్రొత్తగాఁ గొండవీడుదుర్గమును గట్టించి తనకు రాజధానిగాఁ జేసికొన్నాఁడు. 'కొండవీడుం రాజధానీం సవిచిత్రా మకల్పయత్! దృష్ట్వా త్వష్టాపివైచిత్ర్య దృస్యామ భూస్సవిస్మయః" ఈతఁడు వెల్గోటి వెలమరాజులతోఁ బోరాడి రాజ్యమును బెంపు వెలయఁజేసిన శౌర్యశాలి. ఈయన నవరాజధానీ ప్రశంసాత్మక మగు సమస్య-

ఉ॥ ౖవేటున కాఱుతున్కలుగ వేయఁగ జాలినరాయరౌతులున్
బోటరులైనవీరభటపుంగవులోయనవేమభూప! నీ
వీటను గల్గి యుండఁగను విగ్రహులెంతటివారెదుర్పఁగా
ఘోటకహాటక ప్రకటకుంజరధాటికిఁ గొండవీటికిన్. 65

ఉ॥ కాటమరెడ్డివేమఁ డవఘాటమహాద్భుతచండఖడ్గుఁడై
కాటమఱేనికోట గొని గౌతమవాహిని దాఁటి పోయి యా
కోటల నున్న రాసుతులఁ గోమలులన్ దగఁ గొంచు వచ్చెఁబో
ఘోటకహాటక ప్రకటకుంజరధాటికిఁ గొండవీటికిన్. 66

ఉ॥ ఘోటకభోటహాట కురుకొంకణ సింధుమరాట లాట క
ర్ణాట కళింగవంగద్రవిళాంగవిదేహ కరూశ దుర్గముల్
సాటియె యన్న వేమవివులావిభుఁడేలిన దుర్గమైన యా
ఘోటకహెూటక ప్రకటకుంజరధాటికిఁ గొండవీటికిన్. 67

ఉ॥ ఎత్తినబీర మొప్పఁ గడునేపున వేమయయన్న వేము దం
డెత్తినవార్త విన్నఁ బరువెత్తుతలంపులె యెత్తుఁ గాని మో
మెత్తను ఔప్పులెత్త గొడుగెత్తఁ బతాకములెత్తఁగా మనం
బెత్తద తత్తరంబుమెయి నెత్తినభీతి నరాతికోటికిన్. 68

శా॥ భద్రత్యాగగుణాయురాహవకళాప్రస్ఫూర్తిఁ గోదండసం
పద్రేఖాకృతి నన్న వేమనృపతిన్ భాషింతు నీ భూమి నే
భద్రేభాంతకు భానుపుత్త్రుభరతున్ భాషాప్రియున్ భార్గవున్
భద్రున్ భాను భగీరథున్ భవసుతున్ భంగోద్భవున్ భావజున్. 69

క॥ విని చెప్పకున్న దోషం
బని చెప్పినఁ గొండెమందురది యెట్లన్నన్
నినుఁ బొంది కీర్తికామిని
యనవేమనృపాల! దెసల కరిగెను జుమ్మీ! 70



సీ॥ వీరనారాయణవిభుఁడు గొల్లెన యెత్తె
నే వంక దాడిగా నేఁగువాఁడొ
రాజవేశ్యావిటరాజు తేజీ నెక్కె
వాహ్యాళిగా నెందు వచ్చువాఁడొ
జగనొబ్బగండండు సరసబంటులఁ జేర్చె
నే కోటఁజుట్టుకో నెన్నినాఁడొ
కలియుగబేతాళ ఘనుఁడు ఖడ్గము పూనె
ధరలోన నెవనికై తలఁచినాఁడొ

గీ॥ యెఱుఁగరాదని వేగరులెఱుఁగఁ జెప్ప
నీదు శాత్రవబలములు నిద్రలేక
తివిరి జడిసిరి నీ ఖడ్గతీవ్రధాటి
నతనుసమరూప! యనవేమ నాఖ్యభూప! 71

సీ॥ సంహారభైరవచండ బాహాదండ
డమరుడిండిమ (రవా) డంబరంబు
మందరక్షోణీధ్రమంథానసంధాన
దుగ్ధాబ్ధిగాంభీర్యధూర్వహంబు
నృహరి కంఠ కఠోర కహకహా [1] 72

సీ॥ పావకపరమేష్ఠిపవనపారావార
పాకశాసనులు నీ పాటివారు
కందర్ప కాశ్యపీకమలాధిపతికర్ణ
కాలకంధరులు నీ కరణివారు
యామినీశ యయాతియాదోధిపతియక్ష
యమతనూభవులు నీ యంతవారు

---

1. 72వ పద్యంలో పై పాదాలు మాత్రమే పూర్వప్రతిలో ఉన్నవి.

తపనతాటక? వైరితాలాంకతారాద్రి
తారకాంతకులు నీ తరమువారు

గీ॥ శుద్ధిమతిరయగాంభీర్యవృద్ధిరూప
శాంతికరుణావితర భూతికాంతిభాగ్య
సారధనధర్మ తేజోతిశౌర్యధైర్య
భుజబలంబుల ననవేమభూపవర్య! 73

సీ॥ భరతభాషారాడ్భిదురభీష్మ భుజగాధి
భూభేశభైముల పొల్పువాఁడు
మధుమారమిహిర మీనధవముద్గురమూర
భిన్మేరిమైత్రుల పేర్మివాఁడు
శకశాక్ర శిబిశీక (వకురీట) శుకశూక
శేషశైనేయుల సెలవువాఁడు
కరికాలకిరికీల కురుకూల కెసకేస
కైటభారాతుల కరణివాఁడు

గీ॥ స్థితికళావేష్టిజవసుహృద్ధృతిజయార్థి
తనుమనోజాతధైర్యసదన........
........దానవిద్యాయ బుద్ధివినుత
ఘనబలోపేతుఁడనవేమజనవిభుండు. 74

ఉ॥ ధారుణి రాణివాసి నని తాననుచున్నది యన్నవేముతో
మారుతభుక్కు లాధిపుని మానఁగఁ గారణమేమికల్గెనో
.... .... .... .... నారియైన యా
నారికి నాటయైఁ బరనారులు నవ్వరె ముజ్జగంబులన్. 75

క॥ ఏ పనికిఁదగినమనుజుని
నా పనికనుపంగ లేక యవనీశుఁడు దా



నోపనిమనుజునిఁ బంపిన
నా పని దాఁజెఱిచినట్టులనవేమనృపా! 76

సీ॥ కర్ణాటభూపాలు కంఠహారముమీఁద
గురురాజు ముత్యాలగొడుగుమీఁద
హిందుదేశాధీశు నెల్లిజల్లీలందు
గౌళేశు వజ్రాలగద్దెమీఁదఁ
బాంచాలభూపతి పట్టుపుట్టముమీఁదఁ
బాండ్యభూపతి వెండిభరణిమీఁదఁ
గాళింగభూపతి గంధసారముమీఁద
సౌరాష్ట్రవిభు చంద్రశాలమీఁద

గీ॥ నాడుఁ బాడు నటించును నవఘళించుఁ
బొంచుఁ దురలించుఁ గుప్పించు భూత్కరించు
సంతసంబున నీ కీర్తి జలజనేత్రి
మానుషోపేంద్ర! యనవేమమండలేంద్ర! 77

## అనవేమనృపాలుఁడు

క॥ కవితాకన్యకు నలుగురు
కవి జనకుఁడు భట్టు దాది గణుతింపంగా
నవరసరసికుఁడె పెనిమిటి
యవివేకియె తోడఁబుట్టువనవేమనృపా! 78

క॥ కొంచెపుజగములలోపల
నంచితముగ నీదు కీర్తి యనవేమనృపా!
మించెను గరి ముకురంబునఁ
బంచాక్షరిలోన శివుఁడు బలసినభంగిన్. 79

గీ॥ పందికొమ్మెక్కి పెనుపాముపడగలెక్కి
మేటితామేటివీఁపెక్కి మెట్టలెక్క
విసివి వేసారి యనవేమవిభునిఁ జేరి
రాణివాసంబుగతి మించె రత్నగర్భ. 80

క॥ రాకున్నఁ బిలువఁ డేనియు
రాకకు ముద మంది చేర రమ్మనఁ డేనిన్
ఆఁకొన్న నీయఁడేనియు
నా కొలువటు కాల్పవలయు ననవేమనృపా! 81

శ్లో॥ అనవేమమహీపాల స్వస్త్యస్తు తవ బాహవే,
ఆహవే రిపుదోర్దండచంద్రమండలరాహవే! 82

ఈ శ్లోకము ననవేమనృపాలునిపై నొక కవిచెప్పఁగా సంతసించి రాజు మూఁడువేలుపారితోషికమొసఁగెనట. కవి నేను నాల్గువేలు (వే అను నక్షరములు) ఒసఁగిన మీరు మూఁడువేలిచ్చెదరా యనెను. రాజు నాల్గువేఁలొసఁగితిననెను. కవి మేమొసఁగినదే తిరిగి మాకొసఁగి పంపెదరా యనెను. రాజయిదువేలు కొమ్మనెను. కవి (ఆర్వేలనియోగి) కులమును గుంచించెదరాయనెను. రాజు ఆఱువే లిచ్చితి ననెను. కవి నేను పుట్టువుతోడనే యార్వేలవాఁడనెను. రాజు చాతుర్యమునకు మెచ్చి యేడువేలు కొనుమనెను. కవి సంఖ్య మంచిది కాదనెను. రాజెనిమిదివే లిచ్చి పుచ్చెను.

## పెదకోమటి రెడ్డి

ఉ॥ వీపున మోపెఁ గచ్ఛపము వెండి భుజంగమరాజు మస్తక
స్థాపితఁ జేసె నీవు వసుధారమణిన్ బెదకోమటీంద్ర! బా
హాపరిరంభ గుంభసముదంచితఁ జేయుట యింత యొప్పునే
మోపరు లే మెఱుంగుదురు ముగ్ధలతోడివిహారధర్మముల్. 83



## పెదకోమటి వేమారెడ్డి

ఈయనకు సర్వజ్ఞచక్రవర్తి యని బిరుదు. అమరుశతకవ్యాఖ్యా సాహిత్యచింతామణ్యాది కృతుల కీయన కర్త. శ్రీనాథకవిసార్వభౌముఁ డీయన యాస్థానమున విద్యాధికారి. క్రీ.శ. 1404 మొదలు 1420 వఱకు నీతఁడు రాజ్యపాలనము చేసినాఁడు.

సీ॥ కపటకంఠీరవాకారనారాయణ
క్ష్వేళానినాదంబు గేలిసేయుఁ
గల్పాంతదుర్దాంతకాలభైరవభేరి
ఢమరుకోన్మాదంబడంగఁ జేయుఁ
బ్రళయకాలాభీలపటుఘోరనిర్ఘాత
పటుపుటారావంబుఁ జటులపఱచు
కుహనామహాకాలకోలాహలోత్తాల
పాతాళనినదంబు భంగపఱచు

గీ॥ గండు మెఱసినరిపుకోటిగుండెలవియఁ
జండగతి మ్రోయు నీ రణోద్దండభేరి
జయ రమాసంగ! రాయవేశ్యా భుజంగ!
యతులబలధామ! పెదకోమటన్న వేమ! 84

సీ॥ కానీనకాకోక కానీనకాకోక
కానీనకాకోక కాద్రవేయ
కాద్రవేయాధర్మ కాద్రవేయాధర్మ
కాద్రవేయాధర్మ కాలకాల
కాలకాలప్రాంగ కాలకాలప్రాంగ
కాలకాలప్రాంగ కారకార

కారకార గ్రాహ కారకారగ్రాహ
కారకారగ్రాహ గాహగాహ

గీ॥ గాహగాహాను గాహానుకైనధూమ
ధూమనాటీక నాటీకదురభిమాన
రమ్యగుణలోల! సంగడిరక్షపాల!
యమితగుణధామ! పెదకోమటన్న వేమ! 85

చ॥ ధరణియె బొమ్మరిల్లు వసుధావరపంక్తులు బొమ్మలంబుధుల్
గురుగులు చక్రవాళగిరి కోట నభంబది సేనకోర ని
ర్జరగిరి గద్దెపీఁట యినచంద్రులు మేటినివాళిపళ్ళెముల్
గురుతరపుణ్యుఁడైన పెదకోమటివేమన కీర్తికాంతకున్. 86

సీ॥ ఆ చెంపనుద్దండ? (అచ్చంపువుద్దండ?) అనవేమపురమను
గ్రామంబు తోరణ కట్టిరేని
ధరణికోటను గల్గుధనధాన్యవస్తువు
లరికట్టుకొని చూఱలాడిరేని
మునుకొని యభిమానముద్ద (?) భక్షింపంగ
సారెకుఁ జేతులు చాఁచిరేని
అభ్యంజనము సేయునన్న గారికిఁ (నన్నవేముకు) దెచ్చు
నూనెలోఁ జెప్పులు నూటిరేని

గీ॥ కణఁగి శత్రులు (విప్రులు) సేయునోగాత్యమునకు
నోర్చియుంటివి నీసాటి యుర్విఁగలఁడె
(ఓర్చి కీర్తులు గాంచితి వుర్విలోన
నెన్న రాజులు సాటిరా రెవ్వరైన)
సముదరిపువీర రాజవేశ్యాభుజంగ!
అతులబలభీమ! పెదకోమటన్న వేమ! 87



క॥ ఈరేడుజగములనఁజె
న్నారెడు పదునాల్గుగ్రుడ్ల ననిశము తెక్కల్
సారించి పొదుగుచున్నది
కోరిక నీ కీర్తిహంసి కోమటివేమా? 88

సీ॥ వీరశాత్రవరాజవృక్షముల్ పడగొట్టి
దుర్మార్గపురములు దుక్కిదున్ని
చెనటివిరోధుల సెల్లెమున్ పొడపాపి
.... .... రిపులను నలకలేరి
వైరికాంతానేత్ర వర్షముల్ కురిపించి
కుటిలారి దంతముల్ గొఱ్ఱుమర్చి
వీర రాహుత్తుల విత్తులు వెదబెట్టి
పగతుల యమ్ముల పంట చేసి

గీ॥ మొరయుమన్నీలగుంపుల మొదలు గోసి
మెసఁగ నూరిచి తూర్పెత్తి యేకరాశి
గాను గావించె నీకత్తి కాఁపు కొడుకు
గాయ గోవాళ జగనొబ్బ గండవేమ. 89

ఈ కోమటి వేమారెడ్డియాస్థానమున మామిడిసింగనాదులు మంత్రులు. తురగారామన యనుమంత్రి దుష్టుఁడట! ఒకకవి వానిఁ బేర్కొనెను

క॥ కోమటి వేమనత్యాగము
భూమిఁ బ్రసిద్ధంబు కల్పభూజముచేతన్
బాముున్న పగిదిఁ దురగా
రాముండున్నాఁడు చేరరాదెవ్వరికిన్. 90

## కాటయవేమారెడ్డి

కం॥ వెలయాలు శిశువు నల్లుఁడు
నిలయేలిక యాచకుండు నేగురు ధరలోఁ
గలిమియు లేమియుఁ దలఁపరు
కలియుగమునఁ గీర్తికామ! కాటయవేమా! 91

ఈతఁడు కాళిదాసునాటకత్రయమునకు వ్యాఖ్యాత. కుమారగిరిచేఁ గొండవీటి రాజ్యమేలించినవాఁడు. "సప్తాకాటయశౌరేః పౌత్రో మారస్య కాటనృపసూనుః। వీరాన్న పోతనృపతే ర్జామాతా జయతి వేమభూపాలః" – ఈయన భార్య కుమారగిరితోఁబుట్టువు. కుమారగిరి తన యవసానకాలమున నీతనికి రాజమహేంద్రప్రాంతదేశమును బారితోషికముగా నొసఁగి యక్కడికిఁ బంపినాఁడు. తన యేకపుత్త్రుడు మృతినొందఁగాఁ నీతఁడా రాజ్యమును దనయల్లుఁడగు వీరభద్రారెడ్డి కరణముగా నొసఁగి యాతనికి బాసటయై యక్కడ జీవిత శేషమును గడపెను. కుమారగిరి యనంతరము కొండవీటిరాజ్యమేలిన పెదకోమటి వేమారెడ్డి కీయన విరోధి. పెదకోమటివేమునికిఁ జెల్లఁదగిన రాజమహేంద్రరాజ్యము నితఁడు వడయుట విరోధకారణము. శ్రీనాథుఁడీతని'మనుతుల్యుఁ'డని ప్రశంసించెను.

ఉ॥ మానుషదానమానబలమానితధర్మరమామనోజ్ఞ రే
ఖానుతభూతివిత్తములఁ గాటయవేమనఁ బోల్తు వాసవిన్
వాని విరోధి వాని విభు వానివిపక్షుని వాని యగ్రజున్
వాని మఱంది వాని సుతు వాని యమిత్త్రుని వాని మిత్త్రునిన్. 92

ఉ॥ ఓలి నరాతులందునిమె నుగ్రతఁ గాటమరెడ్డివేమభూ
పాలుఁడు రాక్షసత్రిపురభంగము చేసిన భీమురీతి, నా
కాలపుఁబార్థువైఖరి జగంబును జాల నుతించుచుండఁగా
నాలిపరాభవంబునకు నంబుధి గట్టిన రాముకైవడిన్! 93



## అల్లయ వేమా రెడ్డి

శ్రీనాథుని కాశీఖండము కృతిగొన్న వీరభద్రారెడ్డికీతఁడన్న. భార్య మూలమునఁదమ్మునికి వచ్చినరాజమహేంద్రరాజ్యము నీతఁడు నిర్వక్ర పరాక్రముఁడై పెంపొందించినాఁడు. క్రీ శ. 1440 ప్రాంతములదాఁక నీతఁడు కలఁడు. ఈతని పయిఁ జెప్పఁబడినపద్యములు పెక్కులు, శ్రీనాథకవీశ్వరునివి–

సీ॥ వివిధ విద్యోద్దండ విద్వత్కుముదకాండ
హరిణాంక! రూపనారాయణాంక!
నీతోగ్రకరవాల నిర్జితారిన్నృపాల
సప్తాంగ! రాజవేశ్యాభుజంగ!
సకలమహీరాజ్యసంరక్షణోద్యోజ్య
కులశీల! గుజ్జరిదళవిభాళ!
భామాజనస్వాంతపరితోషణలతాంత
కోదండ! రాయచేకోలుగండ!

గీ॥ జయవిజయ జన్యకాంభోజహయసమాజ
ఖురవిపాటన సంభూతకుతలరేణు
పటలనిబిడఘనధ్వాంతభరితభువన
విజయరఘురామ! అల్లాడవిభునివేమ! 94

సీ॥ ఖండేందుమౌళిపైఁ గలహంసపాళిపైఁ
గర్పూరధూళిపైఁ గాలుద్రవ్వు
మిన్నేటి తెఱలపై మించుతామరలపై
మహిమంచుసుఱలపై మల్లరించు
జంభారిగజముపైఁ జంద్రికారజముపైఁ
జందనధ్వజముపైఁ జౌకళించు
ముత్యాలసరులపై మొల్లక్రొవ్విరులపై
ముదికల్పతరులపై మోహరించు

గీ॥ వెండిమల యెక్కి శేషాహి వెన్నుఁ దన్ని
తొడరి దుగ్ధాబ్ధితరఁగలతోడ నలరి
నెఱతనంబాడి నీ కీర్తి నిండి యహహ
విజయరఘురామ! అల్లాడవిభునివేమ! 95

సీ॥ దండయాత్రాఘోషతమ్మటధ్వనులచే
గంతులు వేయించెఁ గప్పకొండ
కితవకాలాభీలకీలానలముచేత
నేలపొంగడగించెఁ బాలకొండ
ఆరట్టజాదట్టహయదట్టములచేత
మట్టితూర్పెత్తించెఁ బొట్టునూరు
భూరిప్రతాపాగ్నిఁ బుటములు వెట్టించె
విద్వేషులనఁ గళావెండిపురము

గీ॥ అనఁగ నుతి కెక్కి తౌర కేళాదిరాయ
యరులపండువమండువాయవనహరణ
బళియధూళియమాళవబందికార
విజయరఘురామ! అల్లాడవిభునివేమ! 96

## వీరభద్రారెడ్డి

శ్రీనాథకవికాశీఖండము నీతఁడు కృతిగొనెను. రాజమహేంద్రము రాజధానిగాఁ గృష్ణానద్యుత్తరతీరమున నుండి చీకటి, చిల్కసముద్రములదాఁక రాజ్యమేలినవాఁడు. ఈయన యన్న యళ్ళయవేమారెడ్డి బహుసమర్థుఁడు. కొండవీడు రాజధానిగా నాంధ్రదేశమేలిన పెదకోమటి వేమారెడ్డికి వీరు విరోధులు. పెదకోమటివేమారెడ్డియుఁ దత్పుత్రుఁడును స్వర్గస్థులయిన పిదప శ్రీనాథుఁడు వీరి యాస్థానమునకుఁజేరెను. ఈయన పద్యములందును గొన్ని శ్రీనాథునివి కలవు.



సీ॥ జయ రాజవేశ్యాభుజంగాంక! నిశ్శంక!
యభ్యుదయంబు రాజాధిరాజ!
మంగళంబానతమండలీకరగండ!
సంకల్పసంసిద్ధి సమరవిజయ!
బ్రహ్మయు వరిరాయబసువశంకరముద్ర
వర్ధిల్లుగాయగోవాళబిరుద
మహి మించు రిపుచెంచుమలచూఱకారాంక
స్వస్తి కర్పూరవసంతరాయ

గీ॥ ఆంధ్ర (కర్ణాటశక) సింధుయవనచేది
వీరలక్ష్మీస్స్వయంవర వీక్షణాఢ్య!
ధరణి పాలింపు మా చంద్రతారకముగ
విక్రమోన్నిద్ర! యళ్లయవీరభద్ర! 97

సీ॥ వృద్ధకచ్ఛపరాజు వీఁపు భగ్గనఁదన్ని
ఫణిసార్వభౌమునిపడగదన్ని
ధరణీస్థలముఁ ద్రొక్కి గిరులెక్కి వరవార్త
వరుసతో సంబోధివరులఁ జూచి
యనిలమార్గము దాఁటి యినమండలము దూఁటి
శశి దూఱి నక్షత్రసమితిఁ గేఱి
ఘనశింశుమారచక్రముఁ ద్రిప్పి యబ్జాత
భవు మించి గోలోకశివమడంచి

గీ॥ యే కవిభవంబుతో నడ్డమాక లేక
పూర్ణవిధుగాత్ర నీ యశోంబురుహనేత్ర
జగములన్నియుఁ దానయై సంచరించె
విమతలయరుద్ర! యల్లయవీరభద్ర! 98

ఉ॥ భద్రమరుత్ప్రయాణ గుణపౌరుష దానవినీతిశౌర్యసం
పద్ధధిమప్రశస్తిగుణవర్ణితుఁడళ్ళయవీరభద్రుఁడా
భద్రకభద్రభద్రగజభద్రకభద్రకభద్రభద్ర క
ల్పద్రుమవీరభద్రజలభద్రసముద్రసురాద్రిభద్రులన్. 99

## సాగిబైచరాజు

సీ॥ శూరత వైరిరాజులఁ గాని జక్కున
 వ్రేయవు మానగోవిందరాయ
అది లాపు నిది ఘనంబనుదళంబులఁ గాని
 చొచ్చి నఱ్కవు దివిచూఱకార
ప్రధనదక్షుఁడు మహాబలుఁడగు నృపుఁ గాని
 యొఱయవు రాయ రాహుత్తమిండ
పటఖానుఖానాది బలుదుర్గములు గాని
 కొన విలఁబులియమార్కోలుగండ

గీ॥ గండభేరుండ యుత్తమగండబిరుద
వీర కేదార రణరంగవీరభద్ర
నవ్యగుణహార సాగి గన్నయకుమార
బళిర బైచామహాపాత్ర బహుచరిత్ర. 100

సీ॥ బహుముఖబ్రహ్మాండభాండంబు దివెగూడు
 సంపూర్ణవీరరసంబు చమురు
భీమప్రతాపార్కబింబంబు తిరువత్తి
 విజయసంగరభూమి వేఁటపొలము
పంచమహాశబ్దబంధంబు గంటలు
 కరవాలభైరవాకారమంబు



మేటి వైరులపాలిమృత్యువు చొప్పరి
 సహజసన్నాహంబు శక్తిగాఁగ

గీ॥ రాత్రిపగలన కే ప్రొద్దు రాజసమున
గంట వేటాడె దహితమృగములు సమయఁ
గాంతిహిమధామ గండరగండనామ
శత్రునారాచ గన్నయసాగిబైచ! 101

సీ॥ నెరవుగాఁబేరిన నెత్తురుదబ్బలు
 గుఱుతుగా నంటినక్రొవ్వుపొరలు
మేపుపొట్టలమీఁద మెదలాడుప్రేపులు
 చెదరి చించినగుండె చేరుగుదులు
మూటైనకుప్పలు మాంసఖండంబులు
 చరణముల్ కరములు శల్యములును
మొదలికి నూడినమూలుగుకొడుపులు
 పవనంబు వోపని పచ్చితలలు

గీ॥ కందుకూరొద్ద భూతాలు కలసి మెసఁగ
ఘూనమల్కల గెల్చుటే ఘనము నీకు
జల్లసురధాణబిరుదసంపాదపాద
శత్రునారాచ గన్నయసాగిబైచ! 102

సీ॥ పులితలాటంబుకై కలహించు దామెల్ల
 మల్లయ్యనని (?) రేకు మడఁగఁ గొట్టి
నెఱిగండభేరుండబిరుదుకై పట్టిన
 వెల్లంకులను నాజి విఱుగఁ ద్రోలి
మునుక రక్తక్షేత్రమునకునై యొరసిన
 యినుగంటి తిమ్మనయే పణంచి

బల్లెసురత్రాణపట్టుబిరుదముకై
నెట్టిపల్ రాఘవుచేఁత చెఱిచి

గీ॥ మఱియుఁ దక్కినమన్నీల నురుముచేసి
మించె నీ కీర్తి దిక్కుల మేదినందు
బల్లసురధాణబిరుదసంపాదపాద
శత్రునారాచ గన్నయసాగిబైచ! 103

క॥ ఈ సాగిబై చభూవరుఁ
డీసాగినమొదలు నర్థులేచిరి సిరులన్
రాసాగి బల్లెమందినఁ
బోసాగిరి వైరులింద్రపురికిని సమరన్. 104

మ॥ సరసాగ్రేసర సాగిగన్నయతనూజా బైచభూపాల యి
ద్ధరణిన్ నీకరిగోరు చెల్లునఁట చిత్రంబా తలంపంగ ని
ర్భరతారుణ్యవయోవిజృంభయగు రంభానారిపాలిండ్ల నీ
యరిగోరెంతయుఁ జెల్లుచుండు నఁట జంభారాతిలోకంబునన్. 105

## సాళువగుండ నరసింహరాయలు

ప్రౌఢదేవరాయలయనంతరమీతఁడు కర్ణాటకరాజ్యమాక్రమించుకొని పరిపాలించెను. క్రీ. 1480 ప్రాంతములం దీరాజరత్నము కలఁడు. డిండిమభట్టారకుఁడను సంస్కృతకవి యీతని దిగ్విజయాదికమును వర్ణించుచు సాళ్వాభ్యుదయమను పదునాల్గుసర్గముల మహాకావ్యమును రచించెను. పిల్లలమఱ్ఱి పినవీర భద్రకవి యీతనికంకితముగా జైమినిభారతము రచియించెను. ఈతని పేర "నవరత్న" పద్యములును "సప్తాంగపద్ధతి" పద్యములును రచింపఁబడినవి. దీనికిఁ గ్రంథగర్త పినవీరభద్రుఁడు కాఁదగును.



## నవరత్నములు

సీ॥ దినదినంబును నెల్లదివిజులఁ బోషించుఁ
గైరవబంధుఁడేకార్యకాంక్ష?
అప్పటప్పటికి లోకాంధకారము మాన్చు
నినుఁ డేమి లాభంబు నిచ్చగించి?
సచరాచరంబై న జగతియెల్ల భరించు
ఫణిపతి యే ఫలప్రాప్తిఁజూచి?
అదనున వర్షించి యఖిలజీవులఁ బ్రోచు
జలధరం బే ప్రయోజనము గోరి?

గీ॥ పరహితం బాత్మహిత మతి పరమపుణ్యు
లన్యులొనరించుమేలు తారాసపడరు
సకలభాగ్యోదయ కఠారిసాళువాంక!
గుండభూపాలునరసింహమండలేంద్ర! 106

సీ॥ ఆకారసంపద ననుకరించినవిద్య
విద్యకుఁదోడై నవినయగుణము
వినయగర్భితమైన విక్రమారంభంబు
విక్రమార్జితమైన విభవగుణము
విభవానుగుణమైన వితరణోన్మేషంబు
వితరణోపేతమై వెలయుప్రియము
ప్రియవచోనిరతమై పెంపొందు సత్కృతి
సత్కృతిఁ జేకొన్నచారుకీర్తి

గీ॥ చారుకీర్తికి నెలవైన పౌరుషంబు
పౌరుషంబున వర్తించు భాగ్యభూమి

భూమి పాలించునృపతికి భూషణములు
గుండభూపాలునరసింహమండలేంద్ర! 107

సీ॥ సర్వజ్ఞుఁడగుమంత్రి సవదరించినరాజు
కార్యఖడ్గమ్ముల క్రమమెఱుంగు
కార్యఖడ్గమ్ముల క్రమమెఱింగినరాజు
బహువిధంబుల మూలబలముఁగూర్చు
బహువిధంబుల మూలబలము గూర్చిన రాజు
శత్రులనవలీల సంహరించు
శుత్రులనవలీల సంహరించినరాజు
ధరణి యేకాతపత్రముగ నేలు

గీ॥ కావున మహాప్రధానాగ్రగణ్యుబుద్ధి
యధిపుసామ్రాజ్యమునకు సర్వాంగరక్ష
రాయమలవరగండ! వీరప్రచండ
గుండభూపాలు నరసింహమండలేంద్ర! 108

సీ॥ సంగీతధర్మంబు సాహిత్యధర్మంబు
తెలియనేర్చుట ప్రజ్ఞగలఫలంబు
వితరణప్రౌఢియు వినయసంరూఢియుఁ
గైకొంట సంపదగలఫలంబు
కుజనశిక్షణమును సుజనరక్షణమును
గల్గుట నిజశక్తిగలఫలంబు
బ్రాహ్మణభక్తియుఁ బరహితశ క్తియుఁ
గావింపు విభవంబుగలఫలంబు



గీ॥ బట్టు విప్రుండు విద్యార్థి పరఁగ దాత
కిదియ లక్షణమెన్నంగ సెలమి నెపుడు
సాళువక్షోణిపతివంశజలధిచంద్ర!
గుండభూపాలునరసింహమండలేంద్ర! 109

సీ॥ బంగారునకు సౌరభము జనించినయట్లు
కులజుఁడుత్తమగుణకలితుఁడేని
కస్తూరి నికరంపుఁ గాంతిఁ జెందినయట్టు
లుత్తమోత్తముఁడు శ్రీనొందెనేని
భావింపఁ జెఱకునఁబండు పండినయట్లు
నెఱదాత ప్రియవచోనిరతుఁడేని
అలరుగంధపుమ్రాన నలరు పూచినయట్లు
శ్రీమంతునకుఁ గీర్తి చెందెనేని

గీ॥ భవ్యగుణసాంద్ర! సకలవైభవసురేంద్ర!
సహజదానశిబీంద్ర! భాషాఫణీంద్ర!
సాళువక్షోణిపతివంశ జలధిచంద్ర!
గుండభూపాలునరసింహమండలేంద్ర! 110

సీ॥ వాహ్యాళిచో మత్తవారణసూకరా
శ్వములఁ గన్గొనుచోట సాముచోట
ఆరగించెడిచోట నౌషధంబులచోట
నిద్రవోయెడిచోట నెలంతచోట
వేట వెళ్ళెడిచోట విందుచెప్పినచోట
నాటపాటల వేడ్కనలరుచోట
వైద్యుచే .......నిఱకటంబైనట్టి
తెరువున ననిమొనల్ దీర్చుచోట

గీ॥ దైవతస్థానవైభవతతులచోటఁ
గ్రొత్తవారలఁ గాన్పించుకొనెడుచోట
నాత్మరక్ష యేమఱకుండునతఁడె రాజు
గుండభూపాలునరసింహ మండలేంద్ర! 111

సీ॥ ప్రియముతో నిజమాతృ పితృభక్తి యొనరించు
ధర్మాత్ములకు వేఱె దైవమేల?
మమతమై సర్వభూతములందు దయగల్గు
ధన్యులకును వేఱె తపములేల?
సరససత్కవి కావ్యసరణివినోదించు
నతిపుణ్యులకు వేఱె యమృతమేల?
సతతంబు సత్యభాషానిష్ఠ వదలని
కృతకృత్యులకు వేఱె క్రతువులేల?

గీ॥ ప్రాణపదమైన లలితాంగిఁ బాయకుండు
పురుషులకు వేఱె దేవేంద్రపురమదేల
రాయచౌహత్తమల్ల ధరావరాహా!
గుండభూపాలునరసింహమండలేంద్ర! 112

సీ॥ ధనికులఁగావింపఁదగదు సోదర్యుల
బడవాలుఁజేయఁ జొప్పడదు కుటిలు
తగదు దుర్గాధిపత్యము జ్ఞాతి కొసఁగంగ
ధనము కావలిఁబెట్టఁదగదు ఖలుని
దేశాధికారిఁగా ద్రిప్ప నొప్పదు క్రూరుఁ
జనవు ప్రమాదంబు సాహసునకు
కాదు భీరుఁ దలారికము ప్రతిష్ఠింపంగఁ
గీడు వంచకుని వాకిటను నిల్ప



గీ॥ నమ్మ ననుమానమగువాని నమ్మఁదగదు
నమ్మియుండినచోట వ్రణంబు గనిన
వ్రణమునకుఁ దగఁజేయంగ వలెఁ జికిత్సఁ
గుండభూపాలునరసింహమండలేంద్ర! 113

సీ॥ మంత్రాధిపునితోడ మర్మజ్ఞుతో రాజ
హితునితోడను నిగ్రహింపఁజనదు
అతిమదాంధునితోడ నంగనాసక్తుతోఁ
జెడుగుతోఁ దన యాత్మ చెప్పఁదగదు
నిందితుతోఁ బరనిందాభిలాషితోఁ
గ్రూరకర్మునితోడ గూడఁ జనదు
రాజవిద్వేషితో భూజనద్రోహితో
వంచకుతోఁబొత్తు వలదు సేయ

గీ॥ పరఁగ నీ రీతిఁ జరియించునరవరునకు
నూరకెవ్వారు మూర్ఖులై వైరులగుచు
నడచిరేని యవశ్యంబు చెడకపోరు
గుండభూపాలునరసింహమండలేంద్ర! 114

## సప్తాంగ పద్ధతి

సప్తాంగపద్ధతి యను పేరి పద్యములేదును జేకుఱినవి కావు. చేకుఱిన మట్టున కుదాహరింపఁబడుచున్నవి.

### రాజపద్ధతి

సీ॥ ఉత్తమకులజుఁడై యుద్యోగశీలుఁడై
భాషల లిపులెల్లఁ బరికళించి

వాక్పటుత్వము గల్గి వ్యసనము మాని య
ర్థము గూర్ప దక్షుఁడై శ్రమము దెలిసి
ప్రజలకుఁ జల్లనై బలములఁ బోషించి
సుకృతియై శూరుఁడై శుద్ధి మెఱసి
రాజదోషములు భూరమణుఁబొందఁగనీక
పరమర్మ భేదియై వెరవెఱంగి

గీ॥ గుప్తమంత్రుఁడై కుశలుఁడై కొలువెఱింగి
చారచక్షుఁడై దేశవిచార మరయు
నట్టిసన్మంత్రి గలగినయతఁడు రాజు
గుండభూపాలునరసింహమండలేంద్ర! 115

## కోశపద్ధతి

గీ॥ తన భుజార్జితమైన యర్థంబు దెచ్చి
యాయ మెఱిఁగి వ్రయించుచు ననుదినంబు
నరసి భండారమొదఁగూర్చునతఁడు రాజు
గుండభూపాలు నరసింహమండలేంద్ర! 116

## రాష్ట్రపద్ధతి

సీ॥ వర్ణాశ్రమంబుల వరుస దప్పఁగనీక
జారచోరాదులపేరడంచి
దేవభూదేవతాస్థితులు పాలించుచు
నల్పువిన్నపమైన నాదరించి
అబలుని బలవంతులదరి త్రోవఁగనీక
వ్యవహారధర్మముల్ తివిరి నడపి



కొలువుమన్నీల లోపలిపోరులడఁగించు
గళ్ళ కూళ్ళకు నలజళ్లు మాన్పి

గీ॥ నిఖిలదేశంబులను జక్క నిజగృహంబు
లరయువిధమున దివ్యాజ్ఞలనువుపఱిచి
యప్రమత్తుఁడై ధర యేలునతఁడు రాజు
గుండభూపాలు నరసింహమండలేంద్ర! 117

## దుర్గపద్ధతి

సీ॥ తృణకాష్ఠజలసమృద్ధిని బ్రధానంబుగాఁ
గలకాలమును సమగ్రంబుసేసి
కోట యాళ్వరి కొమ్ము క్రొత్తళంబులగడ్త
లట్టళ్ళు యంత్రంబులనువుపఱిచి
ధాన్యంబులాదిగాఁ దగు సవరణలెల్ల
నొకటియుఁ గొదవ లేకుండ నునిచి
నీతిమార్గంబున నెనరైనదొరలను
బలసి పాళెములందుఁ గొలువునిలపి

గీ॥ నగరకావలి సావధానముగ నునిచి
చోద్య మిది యెట్టివారి కభేద్య మనెడు
నట్టు దుర్గంబులందుండు నతఁడు రాజు
గుండభూపాలు నరసింహమండలేంద్ర! 118

## బలపద్ధతి

సీ॥ బేడుపైతరవులు పెట్టక చేజేత
రవణదప్పకయ జీతంబులిచ్చి?

చేరువదొర లిచ్చుజీతంబు వచ్చుట
రాకయుండుట విచారంబుచేసి
యగువలైతల.......... తగ్గిననైనను
గట్టకుండిన వారకముగ నిచ్చి
రణరంగమునఁ గానరా మెలంగినచోట
నుచితంబులొసఁగుచు నుపచరించి

గీ॥ ప్రాంతవారిని గొల్వాస పడనివారి
మూలబలములు మన్నీల మొనలకంటె
నంగళంబుగ నేలినయతఁడు రాజు
గుండభూపాలునరసింహమండలేంద్ర॥ 119

## శ్రీకృష్ణదేవరాయలు

బళ్లారిమండలములోని యానెగొందికి సమీపమున నుండిన విద్యానగర మను పట్టణరాజము రాజధానిగా దక్షిణహిందూదేశమునకెల్ల నేకచ్ఛత్రాధి పత్యమును నిర్వహించిన యీ నృపాలరత్నము క్రీ 1509 మొదలు 1530 వఱకు రాజ్యము వహించినట్లు తెలియుచున్నది. కృష్ణరాయలు బహువారములు దండ యాత్రలుచేసి నానారాజుల జయించి తురుష్కులముష్కరకృత్యముల సాగనీయక రాష్ట్రముల నాక్రమించుకొని మహారాజ్యవైభవమనుభవించినవాఁడగుటయుకాక సరసకవితావిలాసలాలసుఁడై పెద్దనాది కవీంద్రుల పల్కుఁదేనియలఁజూఱలఁ గొని సంస్కృతాంధ్రములందు మేలయినకవనము సెప్ప నేర్చిన సుకవిరాజశిఖామణి. ఆంధ్రమున విష్ణుచిత్తీయమును సంస్కృతమున మదాలసాచరిత్రాదికములు నీతని కృతులు. ఆంధ్రవాఙ్మయమున కీమహారాజుకాలమున నింతం తనరానిమహోన్నతి చేకూఱెను. పెద్దనాదికవిశ్రేష్ఠులీతనియాస్థానమునఁ గవీశ్వరులు. మనుచరిత్రము పారిజాతాపహరణము మొదలగుకృతుల కీతఁడు కృతిపతి. పెద్దనామాత్యున కీతఁ డాంధ్రకవితాపితామహుఁడన్న బిరుద మొసఁగెను. విద్యావిషయమున నీ మహారాజు



నాస్థానమందు జరిగిన వృత్తాంతములు వింతవింతలుగాఁ జెప్పుకొనఁబడుచున్నవి. కొన్ని మాత్రమిందుఁదెల్పఁబడును.

ఒకప్పుడు కృష్ణరాయలు పసిఁడిపళ్లెరమునఁ గవిగండపెండేరమును గొనివచ్చి సభాస్థానమున నిడి సంస్కృతాంధ్రములందు సమముగాఁ గవనము సెప్పనేర్చినవారిద్దానిఁగైకొన నర్హులనఁగా సభ్యులు మిన్నకుండిరనియు దానిపై నాతఁడే–

ఉ॥ ముద్దుగ గండపెండియరమున్ గొనుఁడంచు బహూకరింపఁగా
నొద్దిక నా కొసంగుమని యొక్కరుఁ గోరఁగలేరు లేరొకొ–

అని సగముపద్యముఁ జదివినఁ బెద్దనామాత్యుఁడు లేచి–

ఉ॥ పెద్దనఁబోలుపండితులు పృథ్విని లేరని నీ వెఱుంగవే
పెద్దన కీఁదలంచినను బేరిమి నా కిడు కృష్ణరాణ్ణృపా॥ 120

అని పూరించి యీమాలిక నాశువుగా రచించిచదివెనఁట!!

ఉ॥ పూఁతమెఱుంగులుం బసరుపూఁప బెడంగులుఁ జూపునట్టివా
కైతలు? జగ్గు నిగ్గు నెనగావలెఁ గమ్మనగమ్మనన్వలెన్
రాతిరియున్ బవల్ మఱపురాని హొయల్ చెలి యారజంపు ని
ద్దాతరితీపులో యనఁగఁ దారసిలన్వలె లోఁ దలంచినన్
బాఁతిగఁ బైకొనన్వలెను బైదలికుత్తుకలోనిపల్లటీ
కూఁతలనన్వలెన్ సొగసుకోర్కులు రావలె నాలకించినన్
జేతికొలందిఁ గౌగిటను జేర్చిన కన్నియ చిన్నిపొన్ని మే
ల్మూఁతల చన్నుదోయివలె ముచ్చటగావలెఁ బట్టిచూచినన్
డాతొడనున్న మిన్నులమిటారపుముద్దులగుమ్మ కమ్మనౌ
వాతెఱదొండపండువలె వాచవిగావలెఁ బంటనూఁదినన్
గాతలఁ దమ్మిచూలిదొర కైవసపుంజవరాలి సిబ్బెపు

స్మే తెలియబ్బురంపు జిగి నిబ్బర పుబ్బుగుగబ్బిగుబ్బపొం
బూఁతలనూనెకాయసరిపోఁడిమి కిన్నెర మెట్లబంతి సం
గాతపు సన్నతంతి బయకారపుఁ గన్నడగౌళపంతుకా
సాతతతానతానలపసన్ దివుటాడెడుగోటమీటుబల్
మ్రోఁతలునుంబలెన్ హరువు మొల్లముగావలె నచ్చుతెన్గు లీ
రీతిగ సంస్కృతంబుపచరించెడుపట్టున భారతీవధూ
టీ తపనీయగర్భనికటీభవ దానవపర్వసాహితీ
భౌతిక నాటకప్రకర భారత భారత సమ్మతప్రభా
శీతనగాత్మజా గిరిశ శేఖర శీత మయూఖరేఖికా
పాతసుధాప్రపూర బహుభంగిఘుమంఘుమఘుంఘుమార్భటీ
జాతక తాళయుగ్మలయసంగతిచుంచు విపంచి కామృదం
గాతత తేహిత త్తహితహాధితధంధణుధాణుధింధిమి
వ్రాతనయానుకూల పదవారకుహూద్వహ హారికింకిణీ
నూతనఘల్ఘలా చరణనూపుర ఝూళఝుళీమరందసం
ఘాతవియద్ధునీచకచకద్వికచోత్పలసారసంగ్రహా
యాతకుమారగంధవహహారిసుగంధవిలాసయుక్తమై
చేతము చల్లఁజేయవలె జిల్లన జల్లవలెన్ మనోహర
ద్యోతకగో స్తనీఫలమధుద్రవ గోఘృతపాయసప్రసా
రాతిరసప్రసారరుచిర ప్రసరంబుగ సారెసారెకున్. 121

రాయలంతటఁగవిగండపెండేరమును దానై యాతని పాదమునఁ దొడిగెనఁట? రాయలు వేఱొకప్పుడేదో యాశువుగా రచింపుమనఁ బెద్దనగారు చెప్పినది–

చంII నిరుపహతిస్థలంబు రమణీప్రియదూతిక తెచ్చియిచ్చుక
ప్పురవిడెమాత్మకింపయిన భోజనముయ్యెలమంచ మొప్పు త



ప్పరయురసజ్ఞులూహ తెలియంగల లేఖకపాఠకోత్తముల్
దొరికినఁగాక యూరక కృతుల్ రచియింపుమనంగ శక్యమే! 122

కృష్ణరాయలొకనాఁ డాస్థానమునఁ గవీశ్వరుల కీ సమస్య నొసఁగెనట!
“వి స్ఫురిత ఫణామణిద్యుతులఁబొల్పగునాగకుమారుఁ డో యనన్”

పెద్దన్నగారి పూరణము–

చII వరుఁడు చెఱంగు పట్టినను వల్వతొలంగినలేమ సిగ్గుప
ట్టురుతరరత్నముద్రికల నొప్పుగుడాపలికేల మూయఁగాఁ
గరమమరెం గరంబపుడు కామనిధానముఁ గాచియున్నవి
స్ఫురిత ఫణామణిద్యుతులఁ బొల్పగునాగకుమారుఁ డో యనన్. 123

నగరు; తగరు, వగరు, అనుపదములు ప్రాసస్థానమున నెలకొల్పి, రామాయణ, భారత, భాగవత, పరములుగాఁ గృష్ణరాయని యాస్థానమున నొక కవిచేఁ జెప్పఁబడినపద్యములు––

చII నగరుపగాయె నింక విపినంబులకేఁగుఁడు రాజ్యకాంక్షకుం
దగరు కుమారులార! యని తల్లి వగల్మిగులంగఁ దోఁపఁ గాఁ
దొగరున రక్షగట్టి మదిఁదోఁపక గద్గదఖిన్నకంఠయై
వగరుచుచున్నఁ జూచి రఘువంశవరేణ్యుఁడు తల్లి కిట్లనున్. 124

చII తొగరుచి కన్నుదోయిఁ గడుఁ దోఁపఁగ గర్ణుఁడు భీమ సేనుపైఁ
దగరు ధరాతలంబునను దాఁకినభంగిని దాఁకి నొచ్చి తా
వగరుచుచున్ వెసన్ బరుగువాఱిన నచ్చటిరాజలోకముల్
నగరు, సుయోధనాజ్ఞ మదినాటుటఁజేసి ధరాతలేశ్వరా! 125

చII వగరుపుమాత్రమే వరుఁడు వశ్యుఁడుగాఁడు సఖీసఖత్వమె
న్న గరుడవాహనుండు మము వాఁడటు డించుటయెల్ల నుద్ధవా

తగరని కాక మోహపులతాతనువైన విడంగఁజూతురే
తొగరుచి యోషధీశునకుఁ దోఁపఁగఁజేయునె వీడనాడఁగన్. 126

కృష్ణరాయలు ధూర్జటికవి కవనశక్తినిగూర్చి పద్యరూపమునఁ బ్రశ్నింపఁగా నొక కవి పూరించిన పూరణము–

చ॥ స్తుతమతియైన యంధ్రకవిధూర్జటిపల్కుల కేలకల్గెనో
యతులిత మాధురీమహిమ!–: హా తెలిసెన్ జగదేకమోహనో
ద్ధతసుకుమారవారవనితాజనతాఘనతాపహారిసం
తతమధురాధరోదితసుధారసధారలఁ గ్రోలుటంజుమీ! 127

రాయలకోరికపై నీ క్రింది మూఁడు పద్యములును బెద్దన, తిమ్మన, భట్టుమూర్తి కవులచే రచింపఁబడినవి–

శా॥ రంతుల్ మానుము కుక్కుటాధమ దరిద్రక్షుద్రశూద్రాంగణ
ప్రాంతోలూఖలమూలతండులకణగ్రాసంబుచేఁ గ్రొవ్వి దు
ర్దాంతాభీలవిశేష భీషణఫణాంతర్మాంససంతోషిత
స్వాంతుండైన ఖగేంద్రుకట్టెదుర నీ జంజాటముల్ సాగునే! 128

ఉ॥ స్థానవిశేషమాత్రమునఁ దామరపాకున నీటిబొట్టు! నిన్
బూనికమౌక్తికంబనుచుఁబోల్చినమాత్రన యింతగర్వమా
మానవతీశిరోమణుల మాలికలందును గూర్పవత్తువో
కానుకలియ్య వత్తువొ వికాసమునిత్తువొ విల్వదెత్తువో. 129

ఉ॥ తక్కక నేల ముట్టెగొని త్రవ్వఁగనేర్తునటంచుఁ దాకుతా
వొక్కటె జాతి యంచు ముదమొందకు బుద్ధిని వెట్టిపంది! నీ
వెక్కడ! యాదిఘోణియన నెక్కడ! యద్రిసముద్రదుర్గధా
ర్భాక్కుతలంబు నొక్క యరపంటనె మింటికి నెత్త నేర్తువే 130

రాయలయాస్థానమున కొక సంస్కృతకవి యరుదెంచి పెద్దనాద్యాంధ్రకవీశ్వరులయెడ నీసడింపుతో నిట్లుపల్కెనట–



శ్లో॥ ఆంధ్రభాషామయం కావ్య మయోమయ విభూషణమ్ ।

వెన్వెంటనే పెద్దనామాత్యుఁడు చెంపపెట్టు పెట్టినట్లు పూరించె–

శ్లో॥ సంస్కృతారణ్య సంచారి విద్వన్మత్తేభ శృంఖలమ్. 131

రాయలకుఁ జదరంగపుటెత్తులు వేయుటయందత్యంతాసక్తి యుండెడిదట! బొడ్డుచర్ల చినతిమ్మన యను కొప్పోలు కరణము కవీశ్వరదిగ్గంతియను ప్రతిష్ఠగలవాఁడై శ్రీకృష్ణరాయలతోఁ జదరంగమాడుచుండెడివాఁడు. శ్రీకృష్ణరాయల పక్షమున నెంద ఱాలోచించి యెత్తువేయుచున్నను నీతఁడొక్కఁడే యెదురెత్తు వేసి యాటగెల్చుచు వేయార్లు పందెము గొనుచుండెడివాఁడట! ఆతని శక్తికి సంతోషించి కొప్పోలు గ్రామమునకుఁ గృష్ణారాయపురమనునామ మేర్పఱిచి రాయలు సర్వాగ్రహారముగా నాతనికి ధారవోసెను.

క॥ శతసంఖ్యులొక్కటైనను
సతతము శ్రీకృష్ణరాయ జగతీపతితోఁ
జతురంగమాడి గెల్చును
ధృతిమంతుఁడు బొడ్డుచర్ల తిమ్మన బళిరే! 132

ఉ॥ ధీరుఁడు బొడ్డుచెర్ల చినతిమ్మన మంత్రికుమారుఁడంచితా
కారుఁడు సత్కళావిదుఁడు కౌశికగోత్రుఁడు పద్మనేత్రసే
వారతబుద్ధి నందవరవంశ్యుఁడు సత్కవిలోకనాథుఁడా
చారసమగ్రవర్తనుఁడు చారువచస్థితినొప్పువాఁడొగిన్. 133

రాయలు కళింగదేశ విజిగీషామనీష దండెత్తిపోవుచు బెజవాడలో విడిసి హరివాసరోపవాసవ్రతమును గృష్ణాతీరమున నున్న శ్రీకాకుళ పుణ్యక్షేత్రమునఁ గావించుటకై పెద్దనాది విద్వత్కవులతో నరిగెను. అప్పుడే యక్కడవెలసి యున్న యాంధ్రనాయకస్వామి కృష్ణరాయల స్వప్నమున నాముక్తమాల్యద రచింప నాదేశించిన

ట్లాముక్తమాల్యదయందుఁ జెప్పఁబడి యున్నది. అక్కడ నేకాదశినాఁడు పండితమండలితోఁ బుణ్యకథాగోష్ఠి సలుపుచుఁ గృష్ణరాయలు దాశరథు లెక్కువవారా? పాండవులెక్కువవారా? అని ప్రశ్నించెనఁట పెద్దనాదులు తమకుఁ దోఁచినరీతిని బలుదెఱఁగుల జెప్పిరట. దాశరథులు ఈశ్వరాంశమున జన్మించినవారు గావున వారికమానుష శక్తులును లోకోత్తరయోగ్యతయునుగల్గుట వింతకాదు. పాండవులయెడ నీశ్వరాంశములేదు. అట్లయియు శక్తులయందును యోగ్యతయందును దాశరథులతో సాటివచ్చిరి. కావునఁ బాండవులే యెక్కువ వారగుదురని తన యాశయమును రాయలు తుదకు వెల్లడించెనట! అది విని రాయలప్రక్కను జామరము విసరుచున్న చాకలి యొకఁడు కేలుమోడ్చి "దేవర జన్మాంతరమున నున్నను బాండవులమీఁది యభిమానమును మానలే" దనెనట! రాయలత్యానందముసెంది యా చాకలివాని నేది కావలయునో కోరుకొమ్మనెనఁట! వాడు దేవరకోట యేలవలెనని కోరిక కలదనెనట! అప్పుడే యక్కడ వానికి దేవరకోటసీమ నేలుకొమ్మని యనుజ్ఞ నొసఁగెనఁట! నేఁ డా దేవరకోటసీమను గమ్మజమీందారులు పాలించుచున్నారు. కాని నేఁటి వఱకును నా సంస్థానమునఁ జాకలిచేఁబల్లకి మోయింప కుండుటయు సీలుమొహర్లు వాని యొద్దనే యుంచుటయు నాచారముగా వచ్చుచుండె నందురు.

కృష్ణరాయలపై ననేక కవులచేఁ జెప్పబడిన చాటువులు–

మ॥ శరసంధానబలక్షమాది వివిధైశ్వర్యంబులుంగల్గి దు
ర్భరషండత్వబిలప్రవేశకలనబ్రహ్మఘ్నుతల్ మానినన్
నరసింహక్షితి మండలేశ్వరుల నెన్నన్‌వచ్చు నీ సాటిగా
నరసింహక్షితిమండలేశ్వరులకృష్ణా! రాజకంఠీరవా! 134

మ॥ కలనం దావకఖడ్గఖండితరిపుక్ష్మాభర్త మార్తాండమం
డలభేదం బొనరించి యేఁగునెడఁ దన్మధ్యంబునన్ హారకుం
డలకేయూరకిరీటభూషితుని శ్రీనారాయణుం గాంచి లోఁ
గలఁగం బాఱుచు నేఁగె నీవ యనుశంకన్ గృష్ణరాయాధిపా! 135



ఉ॥ ఏపునఁగృష్ణరాయ జగదీశ్వరుఖడ్గము మింట మార్గముం
జూపిన భానుమండలముసొచ్చి హుటాహుటి శుత్రులేఁగుచో
రేపటిబాపనయ్య పగలింటిమహోగ్రపుజంగమయ్య యో
మాపటిదాసరయ్య మము మన్ననసేయుమటందురెంతయున్. 136

ఉ॥ కాశియు నీకరాసిసరిగాదు నృసింహునికృష్ణరాయ! యా
కాశిని జచ్చువారికిని గల్గును జేతికిఁ బుఱ్ఱె నీ మహో
గ్రాసిని గండతుండెములుగా మృతిఁబొందినవైరికోటికిన్
భాసుర రంభకుంభకుచభారములబ్బెడు నేమిచిత్రమో! 137

ఉ॥ రాయగ్రామణి కృష్ణరాయ! భవదుగ్రక్రూరఖడ్గాహిచేఁ
గాయంబూడ్చి కళింగదేశనృపతుల్ కాన్షిర రీపోషణీ
మాయాభీకుముటూరులోటుకుహుటూమాయాసటాజాహరే
మాయాగ్గేయమదే యటంద్రు దివి రంభాజారునిన్ యక్షునిన్. 138

మ॥ సమరక్షోణిని గృష్ణరాయలభుజాశాతాసిచేఁ బద్దదు
ర్దమదోర్దండపుళిందకోటి యవనవ్రాతంబు సప్తాశ్వమా
ర్గమునన్ గాంచి సెబా సహెూ హరిహరంగా ఖూబు ఘోడాకితే
తుముకీబాయిల బాయిదేమలికియందు ర్మింటికిం బోవుచున్. 139

మ॥ గవఁకుల్ బల్లిదమయ్యె ఢిల్లికిని మక్కాకోటమేలయ్యెఁ బం
డువకుం గ్రొత్తగఁగ్రొత్తడంబులమరెన్ బోలేరు చందేరులన్
దవసంబెక్కె బెడందకోటపురకాంతాగర్భ నిర్భేదన
ప్రవణంబైన భవత్ప్రయాణజయవార్తన్ గృష్ణరాయాధిపా 140

ఒకప్పుడు కృష్ణరాయలకుఁ గృష్ణదగ్గఱఁ దురుష్కులతోఁ బోరువాటిల్లెను.

రాయలసేన కృష్ణకిద్దరిని దురుష్కసేన యద్దరిని నుండెను. నదిదాఁటి రాయలసేనపైకి రావలయునని యేన్గులతోఁ దురకలు నదిలోనికిఁజొచ్చి కృష్ణవెల్లువగాఁ బాఱుచుండుటచేఁ జెల్లాచెదరై కొట్టుకొని పోయిరి. ఏన్గులుమాత్ర మీదరికి వచ్చి రాయలసేనలోఁ జిక్కెను. అప్పుడొక కవి చెప్పినపద్యము-

కు॥ నరసింహకృష్ణరాయా
దురమున నీపేరిటేఱు తురకలఁజంపెన్
గరిరాజవరదుఁడంచును
గరిఘటలట మిమ్ముజూచి గ్రక్కునవచ్చెన్. 141

శా॥ శ్రీలీలాత్మజ! కృష్ణరాయ! సమరోర్విన్ నీదు వైరిక్షమా
పాలు ర్వేఁగి హయాధిరూఢులగుచుం బాఱన్ వనీశాఖిశా
ఖాలగ్నాయతకేశపాశులయి యూఁగన్ గేకిసల్గొట్టి యు
య్యాలో జొంపలొ యంచుఁ బాడుదురు భిల్లాంభోజపత్రేక్షణల్! 142

మ॥ బలభిన్నాగము చెంపఁగొట్టి గిరిజా ప్రాణేశునట్టెక్కి వా
గ్జలజాతేక్షణకొప్పుపట్టి శశివక్షంబెక్కి ధట్టించి యా
బలరామున్ మొలఁబట్టి నీ యశము భూభాగమ్మునన్ మించె నౌ
లలనామన్మథ! కృష్ణరాయనరపాలా రాజకంఠీరవా. 143

కు॥ నరసింహకృష్ణరాయని
కరమరుదగుకీ ర్తియొప్పెఁ గరిభి ద్గిరిభి
త్కరికరిభిద్గిరిగిరిభి
త్కరిభి ద్గిరిభి త్తురంగ కమనీయంబై. 144

గీ॥ పద్మనాట్యస్థలంబునఁ బక్కిలోనఁ
బైరుపైఁ బవ్వళించిన పరమమూర్తి
అనుదినంబును గృష్ణరాయాధిపునకుఁ
జుక్కజగడాలవేలుపు శుభములొసఁగు. 145



చ॥ పెనిమిటిచేయు పుణ్యజనపీడనవృత్తియుఁ దండ్రిభంగమున్
దనయుననంగభావమును దమ్మునికార్శ్యముఁ జూచి రోసి స
జ్జనపరిరక్షు శౌర్యనిధిఁ జారుశరీరుఁ గళాప్రపూర్ణు న
వ్వననిధికన్య చేరె జితవైరినికాయునిఁ గృష్ణరాయనిన్. 146

ఉ॥ అబ్జముఖీమనోజ! నరసాధిపనందన! కృష్ణ! నీ యశం
బబ్జకరాబ్జజాబ్జనయనాబ్జవిలాసము నీ వితీర్ణిమం
బబ్జకరాబ్జజాబ్జనయనాబ్జవిలాసము నీ పరాక్రమం
బబ్జకరాబ్జజాబ్జనయనాబ్జవిలాసము చిత్రమిద్ధరన్. 147

ఉ॥ కాయము వంగి తాముదిసెఁ గన్నులునుం బొరగప్పెఁ గాలు పే
దాయె నటంచు రోసి నరసాధిపనందన! కృష్ణరాయ! యీ
భూయువతీలలామ నినుఁబొందిన నాదిభుజంగభర్తకున్
బాయనిచింతచేతఁదలప్రాణము తోఁకకు రాకయుండునే. 148

ఆంధ్రవాఙ్మయమున శ్రీకృష్ణరాయలవిఖ్యాతి యవినశ్వరమును బ్రధానమును గావున నా మహారాజును గూర్చి సంస్కృతమునఁ జెప్పఁబడిన చాటు పద్యములఁగూడ నిందుఁజేర్చుట సముచితమని యట్లుచేయుచున్నాఁడను-

శ్లో॥ వీరాగ్రేసర! కృష్ణరాయనృపతే! త్వద్వైరికాంతా వనే
ధ్యావంత్యః కుచయానరోమలతికావ్యాహారలీలాభృతః।
ప్రాప్తాన్ కోకమహేభపన్నగశుకాన్ రుంధంతి వక్త్రేందు నా
మధ్యే నాపి కచేన కంకణలసద్వైదూర్యరత్నైరపి. 149

శ్లో॥ భో భో భూవర! భూరివిక్రమ! భవద్ధాటీషు విద్యాధరై
ర్నిస్సాణేషు ధణం ధణం ధణధణం ధాణంధణ ధ్వానిషు।
త్వత్కృత్తప్రతిమల్లవీరవరణే దేవాంగనానా మభూ
న్నృత్తేభ్యో ధిమిధిమ్మి ధింధిమి ధిమిం ధింధిం ధిమింధింకృతిః. 150

శ్లో॥ దృగ్భిత్వా నరసక్షమాపతిసభస్త్రీణాం మృగేణాశ్రితో
రాజా తన్ముఖతర్జిత స్స్వయమపి త్యక్త్వాஉత్మనో మండలమ్।
దుర్గేశస్య జటాటవీ ముపగతః పాణౌత మేణం దధౌ
సన్మార్గప్రవణో నిజాశ్రితతమంక్షీణోஉపి నో పేక్షతే. 151

శ్లో॥ వీరాగ్రేసర కృష్ణరాయ! భవతా కృత్తారణప్రాంగణే
ప్రౌఢాః కేచన పారసీకపతయః ప్రాప్తాః పురీ మామరీమ్।
పీరుత్తేతి గురౌ, వలద్విషి సురత్తాణేతి, శచ్యాంపున
ర్బిబ్బీతి, ప్రణతౌ సలామితి, సురాన్ స్మేరాననాన్ కుర్వతే! 152

శ్లో॥ కృష్ణరాయ స్తువంతు త్వాం, కవయో న వయం స్తుమః
నరసింహకిశోరస్య కియాన్ గజపతే ర్జయః? 153

శ్రీకృష్ణదేవరాయలు లావణ్యగణ్యమగు నొక స్త్రీరత్నమును బహుయత్నమున సాధించి యవరోధవధూసవిధమునుఁ దన యుల్లాసమును వెల్లడించెనట! అంత నా యంతఃపురిక యింతకే ఇంతయుప్పొంగవలెనా? యిది యేమి గజపతి కుమార్తెను సాధించుటయొక్కో?"యని తేలనాడెనట! రాయల డెందమున చుఱుకుమని తాఁకెను. గజపతి కుమార్తెను సాధింపఁదలంపొదవెను. ఒకనాటిరాత్రి యుపశ్రుతి పరిజ్ఞానమునకై చాకివాని యింటిదరి కొక యాప్తభృత్యుని, దిమ్మరుసును బంపెనట! ఆ యింటి చాకివాఁడు సుఖశయితుఁడై యిట్లు పాడుచుండెనట!

"కోండవీడు మందేరా కొండపల్లి మందేరా
కాదని యెవ్వఁడు వాదుకు వచ్చిన కటకందాకా మందేరా" 154

విజయసూచకమగు నా యుపశ్రుతినిగొనియే రాయలు దాడివెడలి కటకము వఱకునుగల దేశమును వశపఱచుకొనుటయేకాక గజపతి కుమార్తెను గూడ దక్కఁగొని యంతఃపురమున జరిగిన యవమానమును బాపికొనెనట.

శ్రీకృష్ణదేవరాయల నిర్యాణకాలము–



ఉ॥ బోరన యాచకప్రతతి భూరివిపద్దశ నందుచుండఁగా
నారయ శాలివాహనశకాబ్దములద్రి యుగాబ్ధిసోములం
దారణవత్సరంబున నిదాఘదినంబున మాఘ శుద్ధష
ష్ఠీరవివాసరంబున నృసింహునికృష్ణుఁడు చేరె స్వర్గమున్
ద్వారకనున్న కృష్ణుఁడవతార సమాప్తిని జెందుకైవడిన్. 155

రాయలనిర్యాణానంతరము కొన్ని సంవత్సరములు పెద్దనామాత్యుఁడు జీవించి స్వావస్థనిట్లు చెప్పుకొనెను–

సీ॥ ఎదురైనచోఁ దన మదకరీంద్రమునిల్పి
కేలూఁత యొసఁగి యెక్కించుకొనియె
మనుచరిత్రంబందుకొను వేళఁ బురమేఁగఁ
బల్లకిఁ దనకేలఁబట్టి యెత్తె
గోకటగ్రామాద్యనేకాగ్రహారంబు
లడిగిన సీమలయందు నిచ్చె
బిరుదైన కవిగండపెండేరమునకీవ
తగుదని తానె పాదమునఁ దొడగె

గీ॥ ఆంధ్రకవితాపితామహా! అల్లసాని
పెద్దనకవీంద్ర! యని తన్నుఁబిల్చునట్టి
కృష్ణరాయలతో దివికేఁగలేక
బ్రతికియున్నాఁడ జీవచ్ఛవంబనగుచు. 156

రాయల నిర్యాణానంతరమే గజపతిరాజు కన్నడ రాజ్యముపైకి దండెత్తి రాఁగా బెద్దనామాత్యుఁ డీ సీసపద్యమును రచించి పంపెను. సిగ్గిలి గజపతిరాజు తిరిగిపోయెను.

సీ॥ రాయరాహుతమిండ రాచయేనుఁగు వచ్చి
యారట్లకోట గోరాడునాఁడు

సంపెటనరపాల సార్వభౌముఁడు వచ్చి
సింహాద్రి జయశిలఁ జేర్చునాఁడు
సెలగోలు సింహంబు చేరి ధిక్కృతిఁగంచు
తల్పులఁ గరుల డీకొల్పునాఁడు
ఘనతర నిర్భర గండపెండెరమిచ్చి
కూఁతు రాయల కొనగూర్చునాఁడు

గీ॥ ఒడలెఱుంగవొ చచ్చితొ యుర్విలేవొ
చేరఁజాలక తలచెడి జీర్ణమైతొ
కన్నడంబెట్లు సొచ్చెదు గజపతీంద్ర
తెఱచినిలు కుక్కసొచ్చిన తెఱఁగు దోఁప. 157

* * * * *

ఈ క్రింది సమస్య లొల్ల లక్ష్మీధర పండితునిచేఁ బూరింపఁబడినది. ఈతఁడు కృష్ణరాయని యాస్థాన విద్వత్కవి.

శ్లో॥ శ్రీకృష్ణక్షితిపాలదత్తమణిభి ర్విద్వత్కవీనాం గృహే
నానారత్న విచిత్రకుట్టిమభువో రత్నాకరత్వం గతాః
అబ్ధిః కేవలవారిపూరనిలయ స్సంభావ్యతే సజ్జనై
రంభోధి ర్జలధిః పయోధి రుదధి ర్వారాన్నిధి ర్వారిధిః. 158

ఇదే సమస్యకుఁ బ్రాచీనతర మగువేరొకపూరణము:-

శ్లో॥ అంబా కుప్యతితాత! మూర్ధ్ని విహితా గంగేయ ముత్సృజ్యతాం
విద్వన్ షణ్ముఖ కాగతి ర్మయి చిరం తస్యాస్థితాయా వద
రోషోత్కర్షవశా దశేషవదనైః ప్రత్యుత్తరం దత్తవా
నంబోధి ర్జలధిః పయోధి రుదధి ర్వారాన్నిధి ర్వారిధిః. 159



సీ॥ చెడిపి రాలొత్తినయడుగుఁదమ్ములకును
గట్టుపయ్యెదఁ జించి చుట్టుకొనుచు
బయలైన కుచకుంభపాళులకును జంటి
శిశువుల మాటుగాఁ జేర్చుకొనుచుఁ
గనుగందులకు వడగాలికిఁ జాటుగాఁ
గచభరంబులు విప్పి కప్పుకొనుచు
వీడినతురుము నీవియదాఁక సడలించి
చేలాంతము ముసుఁగు చేర్చుకొనుచు

గీ॥ ఖానమల్కవజీరుల మానవతులు
పాటుపరువున నీవు కల్బరిగ గొనిన
బ్రమసి దెసచెడి నలుగడఁ బఱతు రౌర
యాహవోపేంద్ర! కృష్ణరాయక్షితీంద్ర! 160

మ॥ అలలం బాఱితి వేమి? కృష్ణ! పతిదేవా! కృష్ణరాయక్షమా
తలనాథుండనివారితాన్నమిడఁగాఁ దద్బ్రాహ్మణాపోశనం
బులకుంబోయె సముద్ర (మగ్ర?) జీవనమిఁకం బూరించు నా రాజుని
ర్మలితాన్నోదకదానధారల విచారంబేల ప్రాణేశ్వరీ! 161

మ॥ నరసాధీశ్వరుకృష్ణరాయజగతీనాథా! భవత్కీర్తికిన్
సురకల్లోలిని వీఁగి భర్గుని జటాజూటంబు ప్రాపించె నా
హరుఁడవ్వాహినివార్ధిముంచుట భయస్వాంతాంగుఁడై పూనెనొఁ
గరిచర్మంబు కపాలమున్ భసితమున్ ఖట్వాంగమున్ శూలమున్. 162

సీ॥ అమిత ప్రతాపబాలార్కవిస్ఫూర్తిచే
నదన గోల్పడియె నయ్యుదయశిఖరి
భేరీధణంధణా ఘోరనాదములచే
వినుకొండ దుర్గంబు విఱిగిపడియె

వాహినీసవుతాబు (?) వాహాముఖంబురా
లక్కయై కరఁగె బెల్లంబుకొండ
క్రూరరాహుతఖడ్గకులిశధారలచేతఁ
గొలసి చెట్రుపగట్టెఁ గొండవీడు

గీ॥ కూలె బెజవాడ కంపించెఁ గొండపల్లి
పగిలెఁ గటకంబు గగ్గోలుపడియె ఢిల్లి
యేకధాటిగ నీవు దండెత్తినపుడు
కీర్తితో పాయధౌరేయ! కృష్ణరాయ! 163

గీ॥ స్వచ్ఛశైవలగుళుచ్ఛయచ్ఛాయాభి
నవసుధానిధి లాంఛనము నణంచి
శంభుశుంభద్భుజా స్తంభదంభ స్తంభ
శాంభవీనిగ్రహచ్ఛవి హరించి
భానుకన్యా సౌ.... .... ....
.... .... .... దటిమి
.... .... .... .... ....
.... .... .... ....

గీ॥ యెదురులే కెల్లచోఁ జరియించుచుండు
నభ్రగంగాంబుశరదభ్రశుభ్రజలరు
హాభ్రముప్రియద భ్రమాదభ్ర మహిమఁ
బ్రబలు శ్రీకృష్ణరాయభూపాలుయశము. 164

సీ॥ .... .... .... తరాకాళీయ
ఘనశరాసనకళాకార్తికేయ
సగరహరిశ్చంద్రజననాయకన్యాయ
రక్షితసకలార్థరాజదాయ



కర్కశ కదనరంగస్థలగాంగేయ
(గాయకసుకవిప్రకాండగేయ)
వివిధార్థివాంఛితవితరణరాథేయ
.... .... .... .... 165

సీ॥ జంభారిగంభీరరంభాకుచ స్తంభ
సంభోగగరిమ నీ సమరమహిమ
చింతామణిక్రాంతసంతాననిశ్రాంత?
శాంతికరంబు నీ సత్యకీర్తి
ధాటీసమారంభ భేటీరణభేరి?
భేరీరవంబు నీ భీమగరిమ
చండోగ్రదండమై ఖండించురిపునసి
ఖండించి వైచు నీ ఖడ్గధార

గీ॥ చంద్ర చందన మందార చారురుచిర
కుటిలగోక్షీర సురరాజ కుంతనముల
నవఘళించు నీ కీర్తి యఖిలదిశల
కీర్తిరాధేయ! నరసింహకృష్ణరాయ! 166

## అళియ రామరాయలు

క॥ సలకము తిమ్మండనియెడు
పలుబీజము వోయెఁ బ్రజలు బ్రతికితి మనఁగా
వెలసెనయొ రామరాయఁడు
ములు పుచ్చిన చోటఁ గొఱ్ఱుమొత్తినభంగిన్. 167

## తంజావూరి విజయరాఘవరాయలు

ఈతఁడు తంజాపురము నేలిన యాంధ్రనాయకరాజు. రఘునాథరాయల

కుమారుఁడు. మహారసికుడు. మహాదాత. మహాకవి. ఈ వంశమువారి యోగ్యతలు, తంజావూరియాంధ్ర రాజులచరిత్ర మూలమున నెఱుఁగ నగును.

లయ॥ తావిజగడంపుసిగపూవులసరుల్ తళుకు
మోవిపలుగెంపు బురుసావలపు సొంపుల్
ఠీవిదులకింపు నొకతావి చుఱుకు స్మరుతు
మావుపయి నెక్కిపురిలో వెడలి రాఁగా
నీ వగలు చూచి చెలి రేవగలు సొక్కుచును
పూవుజముదాడిదొరహావళికిఁ జిక్కెన్
మా వెలఁది నేలుకొన రావలదె నీవు దయ
తో విజయరాఘవమహీవర పరాకా! 168

క॥ భూతలమున శిబికర్ణులు
దాతలనేసుద్ది సుద్దదబ్బర నిన్నెం
చేతఱి వదాన్యుఁ డెవ్వఁడు
రా? తంజావూరి విజయరాఘవనృపతీ. 169

ఈయన యాస్థానమున రంగాజి, కృష్ణాజి మొదలగు వారాంగనలు, సరస కవిత నేర్చిన వారుండెడివారు. అందు రంగాజి మన్నారుదాసవిలాస' మనుపేర నీయన శృంగారచరిత్రమునే గ్రంథముగా రచించినది. ఆమె, యా రాజేంద్రునిచేఁ గనకాభిషేక సత్కారమును వడసినది. ఆయన వలపునెలఁత. ఎల్లవేళలందును వెల్లాటకత్తెతో నానందించు నీ నృపాలుని మహిషి తన యాగ్రహము నాపుకొనఁజాలక యొకనాఁ డా వారాంగనకు దూషణోక్తులతో నొక దూతికమూలమున వార్తనంపెనట! విదుషీమణి యగు నా వారాంగన యాదూతి కీ పద్యమును రచించి చెప్పి పుచ్చెనట–

ఉ॥ ఏ వనితల్ మముం దలఁప నేమిపనో? తమ రాఁడువారు గా
రో? వలపించునే ర్పెఱుఁగరో? తమ కౌఁగిటిలోన నుండఁగా



రా వదియేమిరా విజయరామ! యటంచిలు దూఱి బల్మిచేఁ
దీవరకత్తెనై పెనఁగి తీసుకవచ్చితినా తలోదరీ! 170

ఉ॥ రాజనిభాననా! సరసురాలవు జబ్బుగ నల్లినా వదే
మే జడ? యింతకంటె వలెనే? వలనొప్ప బిగించి యల్లవే
యో జవరాల! వేఱె పనియున్నది; దోసమె దోసమే మహా
రాజగునట్టియవ్విజయరాఘవు మై చిగురాకె కోమలీ! 171

చ॥ కులికెద వేటికే చెలియ కుంచెఁడు మానెఁడు గాను నెల్లవా
రలు వినినారలే; విజయరాఘవరాయఁడు నిన్నుఁ గూడుటల్
వలపులె చాటుచున్నవి జవాదియు నల్లవు విఱ్ఱవీఁగఁగా
వలెనటె చూచియోర్తురటె వంతులు జంతులవేటియెమ్మెలే? 172

క॥ ఇంతీ! పానుపుపైనిదె
కంతుఁడు కూర్చున్నవాఁడు కనుఁగొను మహహా!
కంతుఁడనంగుఁడు నీ తెలి
వింతేనా విజయరాఘవేంద్రుఁడె చెలియా! 173

నాళీక భృంగకృదతీ వనదీనబంధుః
నక్షత్రపోనవసుధా విభవైకహేతుః
రాజాకిమిందురపి నార్యభిమానహారీ
రాజాపరం విజయరాఘవ సార్వభౌమః 174

## గని తిమ్మానాయఁడు

ఈతఁడు కృష్ణరాయలనాఁటి వాఁడు. నంద్యాల తాలూకాలోని గని రాజధానిని ముఖ్యనివాసముగాఁ జేసికొనియున్నందున నితనికి గని తిమ్మా నాయఁడనువ్యవహారము కలిగెను.

అచ్యుత దేవరాయల ప్రభుత్వకాలములో గుండ్లకమ్మ యను

నదిసమీపమునఁ బుట్టకోట యను పట్టణములోఁ జాబోలు తిమ్మరా జనునతఁడు తన తమ్ములైన కొండ్రాజు, నాగరాజు, అన్నమరాజు మొదలైన వారలను సహాయముగాఁ దీసికొని సైన్యముతోఁ గూడఁ బోయి పల్నాడు, గురిజాలసీమల పశువులను దొంగిలించెను, వినుకొండసీమ, తంగెళ్ళసీమ, పొదిలెరాజ్యము, అమ్మనవోలు, ఉదయగిరి, చిరువెళ్ళ, సిద్ధాపురముసీమ యను ప్రదేశములను దోఁచి నందికనుమలో మనుష్యులు నడవకుండఁ ద్రోవ నరికట్టెను. రాయలవారి కోట నాక్రమించెను. అతని నవరివారముగ నంహరించుటకై యచ్యుతదేవరాయలవా రీ గనితిమ్మానాయునిఁ బంపిరి. ఇతఁడు పుట్టకోట యొద్ద గొప్ప యుద్ధముఁ జేసి చాబోలు తిమ్మరాజును సపరివారముగ సంహరించి తొండమారయగుళ్ళ కోటను సాధించి యచ్యుత దేవరాయల వారివలనఁ బెక్కు మన్ననలగాంచెను.

వెలుగోటివారి వంశావళి యందును, వెలుగోటివారి వంశచరిత్ర యందును నితని ప్రశంస కలదు.

సీసమాలిక॥

శ్రీమించు వెలుగోటి చినతిమ్మభూపాలుఁ
    డెలమి శ్రీగిరిదేశమేలుచుండి
పూర్వసాగరకృష్ణఁ బొసగు కొల్లెరుగడి
    గరివించు నల మన్నెకురువలెల్ల
సాధించుమని పెక్కు శలవు వీడ్యములంది
    యాదరంబున నయ్యపరుసు నంపి
విధివశంబునఁ గొండవీడు ప్రొద్దున వెళ్ళి
    తదనంతరము వచ్చి దర్శిఁ జేరి
చనుదెంచి కోటల సన్నాహముల నుండి
    కనుఁగొని కుర్రోళ్ళకాడఁ జేరి



తలఁపవిరోధి భాద్రపదశుద్ధాష్టమి
    వరుసతోడుత భానువారమునను
మల్లాపురముబైట మంది ముప్పదివేలు
    వెల్ల గుఱ్ఱములేడువేలు మఱియు
గొడుగులు పడిగెలు గుఱుతైనయరిగెలు
    కొలఁది మీఱినపెట్లక్రోవులమర
మెఱుఁగుటీటెలతోడ మెఱయు పొందళములు
    గడిమితోఁ బౌజులుగా నొనర్చి
గర్వోక్తు లాడుచు గాటంబుతో వచ్చి
    నిర్భాగ్యులందఱు నిలిచిరప్పు
డెలగోలుముందఱ నేర్పడ నడిపించి
    దండిపౌజుల గజదళవిభాళుఁ
డదియు నాకర్ణించి యావెన్క శలవన్నె
    తెగువతోఁ బోయెను దీవ్రగతిని
దొడరిన యెలగోలు తోడిమూఁకలఁ గూడి
    యదరి వారును దాను నంటుఁ గదిసి
ఘోరయుద్ధంబులోఁ గొట్టి చెండాడుచుఁ
    బొరివోక ముప్పిళ్ళ పొడిచినపుడు
ధీరత రావ్యాల తిమ్మయ మృతిఁ  బొందెఁ
    బేరూరినాయని పీఁచ మడఁగెఁ
గోనేటి తిమ్మయ కోటరావెలసింగు
    కూలి రప్పయ్య (యుఁ) గొదవలేక
తడయక యరగొండు తనయుండు విచ్చేసి
    నుడిసెఁ జింతలచెర్వు శూరు మడిసె

వీరాదిగాఁ బెక్కువిధము సైన్యము దొరల్
వడి వెఱఁగందిరి కడమవారు
కలఁగి మున్నే పోయి కల్లని తలపోసి
దద్దిర్ల పాఱుచుఁ దలఁకి బెగడి
హయములుడిగి గొడ్గులందలాల్ కుంచెలు
పడగలు టెక్కెముల్ పాఱవైచి
పట్టెమంచంబును బరుపు గుడారులు
గట్టిగాఁగల వెండిపెట్టెలిచ్చి
నవరత్నములతోడ నలువొందుసొమ్ములు
కవగూడు నవనీతకామినులును
బట్టుమాంజిష్టలు పైఠాణిసేల్వలు
నాదిగాఁ జీనిచీనాంబరములు
కస్తూరివీణెలు గంధంబు నగరును
బ్రస్తుతితోఁ బెక్కు పరిమళములు
జల్లులు జగ్గులు సమకట్లు మొదలుగా
విలువైన వస్తువుల్ వెసనొసంగి
కొట్టినవడ్లను గోనెల బియ్యాలు
పట్టితెచ్చిన యాసుబాజమాలు
సమరంగమునకోడి సప్తాంగముల నిచ్చి
యాప్తుల నొప్పించె నకట యనుచు
నాహవంబున ఛత్తిసాయుధంబులు వైచి
సాహసయోధులు సనిన తెఱగు
పెదవులఁ దడుపుచు భీతిల్లి వణకుచు
జడిసి పాఱకయున్నఁ జత్తుమనుచు



మడమెత్తుపరువులు మాని యబ్బయసూరు
వడివాగె సిడి పెద్దపరువు గదలె
బలమెల్లఁ జంపుక బరువరాఘవరెడ్డి
గొరగయై దూపాటికోట సొచ్చె
మదవాక్యములచేత మననేర వటుపోయి
పొదలకు రావ్యాల పోతినేఁడ
గుఱుతెఱుంగని కొండగుహలలోఁ బడిపోయె
బరిఁ బ్రాకి రావ్యాల బసివినేఁడు
క్రొవ్వి దేశముమీఁదఁ గొండెమా యిదియేమి
యొవ్వక నారయ్య యురకవయ్య
పట్టి విడ్చినమాటఁ బ్రజలెఱుంగకముందె
చందలూరికిఁ దిమ్మ సరగఁ బొమ్మ
దూడలశక్యమా! తుదిగంట మ్రోయను
పాఱు మూడనిఁ బాడి పర్వతయ్య
కళవళంబునఁ గుంచెకంటె సర్వనగారు
నెలవెఱుంగక యేటినీళ్లఁ బడిరి
కాకతితిర్మ లేకంతను బోయెనో
యెన్మల బసవన నెఱుఁగరాదు
కొఱమాలి కీలారి కొండుకోనయగారు
పరిచేతఁ బొలివోయి పరఁగి రంత
మఱి చింతగుంపల్లి మాచుగంగనగారు
యెదవడి యిటు లేగి యేటఁ బడిరి
ముప్పాళ్ళమాచన మునుపు రావెల మాచు
యుప్పిచెట్లను బడి యుఱికి రంత

మదిదప్పగ్రసెడ్డి మల్లు రేఁగులు సొచ్చె
గతులభాగముమల్లు గానరాఁడు
పలువిత్తు చలపాది పాతకుండగుకంచి
తొల్తనే పాలడ్గు తిమ్ము వెళ్ళె?
పయ్యాలపాపయ్య పంచబంగాళమై
చయ్య నేనుఁగువారి సరువు గదిరె
జన్యాల చిటిరాము సటలతిప్పానేఁడు
అన్యాయమునఁ బోయి యడవిఁ బడిరి
భ్రమఁ జెంది యల పొట్లపల్లిలక్ష్మయలింగు
తుమికిచెట్లను బడి తూటె నంత
నుప్పమ్ముకొనవచ్చు నుసురు కల్గినఁ జాలు
నెరవోజ అవుభళ యేగవయ్య
ప్రాణంబు గలిగిన బలుసుటాకులు చాలు
ననుచు జాస్తి.... నంచు జాటె
దూబిలగంపైన దూళిపాళెపుమల్లు
బబ్బరింపుచుఁ బోయి బయలు ద్రాకె
రణభూతములు సోఁకి రాత్రి సంగామల్లు
జంకి పాటెఁ గిలారి వెంకటయ్య
దోష్పివై చెడిపోకు తొలఁగు నున్నవగోపు
మళ్ళి చూడక వెళ్లు మద్దిమల్లు
మంది గూడక వేటె మాఋత్రోవలఁ బోయెఁ
జిందు బొల్లేపల్లి సింగరయ్య
కావేరిమేరగాఁ గల్గుమన్నీలలో
వెన్నిచ్చి యంబర్సు వీఁగి వెళ్లె



మునుపటి విఋగుళ్ళ మొక్కపోమెన్నఁడు
నెనయఁ జింతలచెర్వు నెల్లినేఁడ
మానంబు లేనట్టి మాలబుక్కయతిమ్మ
సేన కడ్డము పోక శిలలు ద్రాకె
మలుదేవు వడచింత మచ్చర్లనాయుండు
కలిలోన నూనయై కడలు వట్టె
అడుసుపల్రామయ యాకస్వినేఁడును
మదిఁదల్కి వడి గుళ్ళమడకుఁ జనిరి
గాయగోవాళుని గజదళంబులచేతఁ
బాయక మనసేన పడ్డపాటు
వినఁ జెప్పఁడా మాకు వెనుక వచ్చినయట్టి
పర్వతమాచన భ్రమలు మాని
కావున మీరడ్గుకథలు చెప్పుట కాదు
పోవక వినరయ్య ప్రోడలార
పంటకమ్మలఁ గొల్వఁ బావ మింతటనుండి
యొంటిమై దున్నుక తింటె మేలు
జగతి మిడుతభట్లశకున మింతకు వచ్చె
యింకఁ బోట్లాడుట యేల మనకు
కొండతోఁ దలమోదుకొన్న చందంబున
బండైతిమింకేటి బ్రదుకులయ్య
కాఁపుపల్లెలలోని కలహంబువలెఁ గాదు
వీఁపుపోట్లను భూమి విడువవలసె
రేచర్లపతిసింహు ధృతి నెదిర్చినరిపుల్
భూతలంబున లేరు మీ తరంబె

గట్టుపైఁ జింబోతుగతి నుండ నేరక
　　గుట్టు చెడితిరి నరకూళలార?
పడుచుకొడ్కులు గార పట్టువీద్యములంది
　　మిడుతలు అగ్నిలో మెలఁగఁ గలవె
యూరూరి గుడిపంచ నొదిగి జోగులరీతి
　　మోరుండలైతిరి మూఢూలార
రెంటికిఁ జెడ్డట్టి రేవనికథ లాయె
　　నంటుఁ దప్పెడు నిలుపాస లేక
నిన్న మొన్నటి దుక్కి నీచులంతే మీరు
　　యెన్నటి మన్నీల నెఱుఁగరాదు
వద్దంటి వెలుగోటివారితో జగడంబు
　　సుద్దెఱుంగవు నీవు సూరినేఁడ
వెరసి లెక్కకు రెండువేలాయెఁ జావులు
　　ఆరయ ముక్కులకోఁత లాఱువేలు
కాకిభాషల నోటఁ గసవులు కఱచక
　　(ధర) మీఁద దొరలు భూవరులు హితులు
దెసచెడి తమ సీమదిక్కు లెఱ్గక తిర్గి
　　విసిగి యూరకె జీవి విడుచువారు
ఘనమైనగిరిగుహాగహనభూములు సూచి
　　యొనరఁగన్నులు మూసి యొఱలువారు
నెండమావుల సెలయేఱులంచును బాఱి
　　యందె యుసురనుచు నడలువారు
మలలమ్మ నేఁ బోయి మా యిల్లు సేరిన
　　నెలమి జాతరలని యేఁగువారు



నిరుగల సానెమ్మ యీ బారిఁగడపిన
　　సుతులు నీ పేరని సురుఁగువారు
ఆడువారలసొమ్ములమ్మి కొన్నివేలు
　　పుచ్చుకొంటే సూరెయాన మీకు?
దీసి కట్టుక వస్త్రి దేవశ్శకోకలు
　　దోఁచుకుంటే రెడ్డితోడు మీకుఁ
జుక్క కెద్రుగ దిక్కుఁ జూడ మెన్నఁడు నింక
　　మ్రొక్కెదఁ బోనిందు మొత్త నేల
మోఁద శకునముగాదు మొఱ పెట్టగావస్తి?
　　తఱుఁగక తల నీటెఁ బొరలువారు
నెనయ నాతని మహిమ నెఱిఁగెద మంటిమా
　　శేషవాణీశులు సెప్పలేరు
పంజు గద్దినదిక్కు బాహువిక్రమమూఁక
　　సవరణ యేమని చెప్పవచ్చు
నేజాలసొంపును నెలమి గుఱ్ఱముపెంపు
　　నుదయభానునికేమి నుడుగవచ్చు
సేనాధిపతియేపు చెంద్ర (చిత్ర?) భానుని చూపు
　　పురహరుకేమని పొగడవచ్చు
పోర బాణము మ్రోఁత బయట నమ్ములవ్రేత?
　　తగ దేవతలకేమి తలఁపవచ్చుఁ
దమ్మెటధ్వనులును దార తప్పెటలును
　　భేరీరవములేమి బెణకవచ్చు
కరిఘటంబులు పెక్కు కదిసి వైరులఁ ద్రొక్కు
　　ముదమున నెపనందు మోహరించు

భటుఁడు మెచ్చని యీ విబవరంబు కొనగ్రేవి
నిరవంద నెవ్వాఁడు యీడు వచ్చు
జముదాళములు మెండు సకలాయుధము లుండు
విక్రమంబెవనందు వెలసియుండు
శాత్రవుల్ భయమంది శరణన్నఁ గాచెడి
కారుణ్యమెవనందుఁ గలిగియుండు
సింహనాదంబును జిత్రభేదంబును
వెసఁ గర్ణములకేమి విసువు వచ్చు
జడి గొనఁగాఁ జేయు సంగ్రామభావంబు
కదిసిన తొలివానకాలమమరెఁ
బడుగులు పేకలై పడిన మొండెంబులు
కొండలపొడుగులై యుండుఁ దలలు
ధరమీఁద నురురక్తధారాప్రవాహంబు
చెలఁగ వారిధులెల్లఁ గలఁక వాఱె
భానుమండలమెల్లఁ బ్రభవించెఁ గెంజాయ
నూనినతారలు నుడ్డు కుడువ
బెదరి దిక్పతు లతిభీతిని బొందిరి
మేరుశైలముతోడ మేది నదరె
వేదాత్ముఁడాత్మలో విస్మయంబునఁబొందె
సాధనంబున మంత్రసంధ్య మఱచె
భేతాళుసన్నిధి భీతి నార్భటముగా
నంబ తై యని తాండవంబు నాడె
ఖేచరంబులు మింటఁ గెరలి భూమిని వ్రాలి
భూచరంబులఁ గూడి పొసఁగి యుండె



దూపాడు కొలుకుల తుది మార్కపురి కోట
దాపునఁ బట్టించె ధర్మదార
శ్రీశైలపతినారసింహులిద్దఱు సాక్షి
విశదమల్లాపురి వీరు సాక్షి
నడుమ నిర్గులసాని నాట్యత్రిపుర సాక్షి
కణఁగి రేనుక గుండ్లకమ్మ సాక్షి
కరవాలపతి తారకంబులగిరి సాక్షి
సిరి తెల్గురాయనిచెఱ్వు సాక్షి
వరుసతోడుత గొడ్డువానిసోబన సాక్షి
యిరువంక దార వట్టింపు సాక్షి
త్రిజగంబులను గీర్తి దీపింపఁగా గెల్చె
విజయుఁడై జగముల వెలసియుండు

గీ॥ నసుచు నీ ధాటికోడినయహితవరులు
బబ్బరింపంగ జగములు ప్రస్తుతించు
సమరనిశ్శంక రేచర్లశాసనాంక
విజయమిదె కొమ్మ తిమ్మయ పిన్నతిమ్మ! 175

సీసమాలిక॥
కొలఁది మీఱినపుట్ట కురువ లంకాపురి
గొనకొన్న జలరాశి గుండ్లకమ్మ
మిరియాలకంట్లాలు మిథిలాతనూభవ
దివిజారి చాబోలితిమ్మరాజు
గుఱుతైన యా కుంభకర్ణుండె కొండ్రాజు
పొదలినరాక్షసుల్ బోయమూఁక

నయముగా మారీచు నాగరాజనుమయ్య
మొదలుగా నీ మన్యమూఁకలెల్ల
దగ్గఱి యేరువల్ గగ్గోలు పడఁజేసి
పల్నాటిగురుజాల పసులఁదెచ్చి
వినికొండ సీమెల్ల వెడుదర (?) మోదించి
తంగెడరాజ్యంబు దొంగలించి
పొదిలె యమ్మనవ్రోలు వదవద వణఁకించి
కదిసి యుద్దగిరిండ్లు కన్న వెట్టి
పాడుగా నాసగిలపా యెల్లఁ గొల్లాడి
చిరివెళ్ళ నందేల చెఱలు పట్టి
సిద్ధాపురపుసీమ నిద్దుర పోనీక
బందులు వట్టించి ప్రజలఁ గొట్టి
తొండమారయగుళ్ల దుండగంబులు సేసి
నందికనుమను... నడవనీక

గీ॥ చోరుతనమున నీ రీతి జూటు సేయ
దండుఁగూడుక బల్లరగండయశుఁడు
చదిపి చాబోలురావణు సంహరించె
రమణ వెలుగోటి చినతిమ్మ రాఘవుండు. 176

## వెలుగోటి కస్తూరిరంగప్పనాయఁడు

ఇతఁడు క్రీ.శ. 1570 ప్రాంతమువాఁడు. సుప్రసిద్ధుఁడగు వెలుగోటి యాచమనాయకుఁడితని కుమారుఁడు. ఈతని భార్య వేంకటాంబిక. దామెర వారి యాదుపడుచు బహులాశ్వచరిత్రకర్త దామెర వెంగళభూపాలుఁడితని మేనల్లుఁడు.

ఇతఁడు మహా పరాక్రమవంతుఁడు. మట్ల తిమ్మరాజు సారె యోబళరాజు రాజ్యము నాక్రమించుకొనఁగా నతఁడీతని శరణు వేఁడెను. ఇతఁడతనికభయ మొసఁగి



గొప్పసైన్యముతోఁ దరలిపోయి కోడూరుఁ జేరెను. దామెర వెంకటప్పనాయఁడు కొంతసైన్యముతో నితనికి సహాయముగా వచ్చెను. యుద్ధమునఁ దిమ్మరాజు నోడించి సారె యోబళరాజున కతని రాజ్యము నొసఁగివైచెను. ఈ యుద్ధము శాలివాహనశకము 1501 ప్రమాది సంవత్సరాశ్వయుజ శుద్ధాష్టమి యాదిత్యవారమునాఁడు ముగిసినది.

సీసమాలిక॥

శ్రీకర విజయలక్ష్మీసమున్నతుఁ డైన
వెలుగోటి రంగభూవిభునికీర్తి
విలసిల్లఁగా వైరివీరుల దునుమాడి
యేఱువసీమ దా నేలుచుండెఁ
గ్రొవ్వి దాసరిరాజు కొండ్రాజు తోఁబుట్టు
నన్న వేంకట్రాజు నతని తమ్ముఁ
డా తిమ్మరాజు మహాశౌర్యమునఁ బేర్చి
హండియవారిని నాక్రమించి
సారివారిని నొకసారి యేపణఁగించి
వారిరాజ్యంబు దుర్వారలీల
బలపరాక్రమవంతుఁడై యుండ నా
సారియోబన (?) యాత్మలోన
కలనిలో వాని దోర్గర్వంబు మాన్ప ను
పాయంబుఁ జింతించి యపుడు (?) సోమ
కులభార్గవుండు వెల్గోటి రంగప్పచేఁ
గాని యితరులచేఁ గా దటంచుఁ
గూరిమి రేచెర్ల గోత్రపవిత్రుని
వినయంబుతోఁగాంచి విన్నవించి

శరణు వేఁడినవిభీషణు నాదరించిన
దశరథరాజనందనునిరీతిఁ
బరులచే భూమి గోల్పడినభూపాలుర
నిర్వహించుట రాజనీతి గాన
ఆ రంగభూవరుండాహవనిశ్శంక
బిరుదాంకుఁడగుట నాభీలవృత్తి
హితబంధుమిత్రుల నెవ్వరిఁ బిలువక
తన కయిజీతంబు తానె కదలి
వచ్చి యా కోడూరివద్ద నున్నంత నా
వార్తను వేగులవారివలన
నంతకు మున్నె తానంతయు నెఱిగి యా
కొంఢ్రాజువారును గ్రోధచిత్తు
లై తమకనుకూలమై వచ్చు మన్నీల
కేకాంతమునఁ గొన్ని లేక లంపి
కాట్రేనివారు వంకరవారు మఱి కూన
పులివారు నా పెదపోతువారు
అలనెసవారు వేములవారు కాలువ
పల్లివారును మాచుపల్లివారు
పొత్తరవారును పొంత రేగురిగింజ
కుంటవా రా గండకోనవారు
చల్లవారును దారు సవరమువారును
వెలయంగ వారైదువేలతోడ
నెల్లిగుంటొద్దను నేపారఁగా దిగి
తగ మల్లె తిమ్మభూధవునిఁ గాంచి



వింటిరా మన మీఁద వెలుగోటిరంగప్ప
దండెత్తివచ్చె నుద్దండవృత్తి
తొడరి పేరనిపాడు విడిపించి యిచ్చెద
నని సారియోబనకభయమిచ్చి
మన మెంత మెత్తనో మానిసి యెవ్వఁడు
నాజిలో దాసరిరాజువారి
వరుసతోడుత మల్లెవారిసీమలు సొచ్చి
వచ్చితిమనుమాట వాసికొఱకు
వచ్చినాఁడటు సారివారి మాటలు విని
మొన చేసికొని కడుమొక్కళమున
వీఁడె కోడూరిలో వేల్ రెండువేలతో
నున్నాఁడు మిక్కిలివన్నె మెఱసి
యిదె వేళ మనలకు నిరుగడఁ జుట్టుక
బలిమిమైఁ బట్టుగాఁ బట్టుకొంద
మని సులభంబుగా నాడుదాసరిరాజు
వారిమాటలకు గర్వంబు మీఱి
యా మల్లె తిమ్మరాజల్లె కానిమ్మని
కదనచాతుర్యప్రగల్భుఁ డగుచుఁ
గల్మిలి యుదయాద్రి కదిరి పొత్తపినాడు
సిద్ధవట్టము సక్లి (సీమఁ) గల్గు
దొరలను మన్నీల దుర్గాధిపతులను
రాజుల బంధువర్గముల హితులఁ
బెక్కు చందముల రప్పించి మానుష మెంచి
యతిగౌరవంబున నాదరించి

కరులు తొంబది తురంగంబులు వేయును
　　దొరలు మున్నూఱు భూవరులు నూఱు
ఏఁబదిబాణాలు నేనూటయేఁబది
　　యాఱు తుపాకు లేనూఱు విండ్లు
కడమ చందురగిరికడ మట్లె తిమ్మరా
　　జేలిన కై జీత మేడువేలు
మఱియుఁ దక్కినభూమిమన్నీలు పెక్కండ్రు
　　గొల్చి రా నాయెఱ్ఱగుంట గదలి
వచ్చినాఁ డట సిద్ధవటములో దిగి హుటా
　　హుటిపైనమున నేలటూరు చేరి
రాయబారము దాసి రౌతును బెట్టంపి
　　కొంచాన నుండుట గుట్టు దెలిసి
దాడిగా నా మఱునాఁడు ప్రొద్దున వచ్చి
　　వేలంబుఁ జుట్టుక వెనుక ముందు
గూడినయందాఁక గుత్తి వెంకట్రాజు
　　నంపి యొక్కట మాట్ల జంపు నడపి
యతనిచే సంధాన మమరక పోవుచో
　　రాజులమూఁక హేరాల మనినఁ
గోపించి యాదూరికొండలు నిలుచునే
　　ప్రళయాగ్నిముందట బల్లెములను
పృథ్వీధరంబైన భేదింతు నన వెలు
　　గోటి రంగప్పని మాట కల్గి
తొడిబడి చిల్లరదొరలెల్ల నొకవంక
　　గ్రక్కున మట్లెవా రొక్కవంక



వేఱె దాసరిరాజువారి ఫౌజొకవంక
　　తక్కినమూఁకలు పెక్కుగతుల
వీరులై పండ్రెండువేలకాల్బలముతో
　　నెక్కడెక్కడినేల యీనినట్లు
ధర సముద్రము వెల్లివిరిసినకైవడిఁ
　　గదిసి నల్ దిక్కులఁగ్రమ్ముకొనిన
సింహనాదంబులు శింజినీరవములు
　　ఘనతరంబైన ఘీంకారములును
బాణజాలములు తుపాకులవిండ్లును
　　భేరీరవంబులు భీతి కొలుప
నా ఖడ్గనారాయణాంకుఁ డవ్వేళఁ దా
　　నించుక శంకింపకెల్ల బిరుదు
కొమరవేశ్యాభుజంగుండప్పుడటువంటి
　　కూటువల్ గని దొడ్డు కొంచె మనక
స్వప్నంబులోపల జయలక్ష్మిగైకొన్న
　　సంతోషమునను నశ్వంబునెక్కి
మదగర్వమున వచ్చుమన్నీలఁ బొడగని
　　లేనగవలర బల్లెంబు పూని
పరివారమునకుఁ గప్పురవీడ్యములు వెట్టి
　　యపుడు దామెర వెంకటప్పఁ జూచి
దండిఫౌజది రాచదళము నే నిందుపైఁ
　　దొడరెదఁ దక్కినదొరలఁ గూర్చు
కొని నీవు నడుపుము కొండ్రాజువారిపై
　　నన విని యాతఁడిట్లనియె నగుచు

నీ కెదిరించుమన్నీఁ డిట నెవ్వఁడు
యీ రాచమూకపై నేమె చొత్తు
మనుచుఁ దక్కినదొరలందఱు నా రీతి
సరసభాషల రణోత్సవము మీఱి
మొత్తమై యీఁటెల ముంగలికై వంచి
కణఁక యొండొరులను గదిసి నడవ
నుభయసైన్యంబులు నొండొరుఁ దార్కొన్న
భూరజంబున నిండి ముసుఁగు పడియె
బాణాలపొగ మేఘపటలంబుగాఁ దుపా
కులగుండ్లు వడగండ్లకొమరు మిగిలెఁ
బృథుసింహనాదంబు భేరీరవంబయ్యె
నురుతరవాద్యంబులుఱుములయ్యె
మెఱుఁగుఁగైదువులొప్పె మెఱపులగతి నంప
వర్షంబు తొలకరివానఁబోలె
నప్పుడు ప్రళయకాలాదిత్యుకైవడి
లాలితసింహతలాటరాయ
రాహుత్తులకు విటరాయఁడౌ శ్రీరంగ
ధాముని హృదయపద్మమునఁ జేర్చి
పిడుగుచందంబున బెడిదంబుగా నార్చి
పొడుపొడుండదెతిర్గె పొడుఁడటంచు
జలనిధి మందరాచలము సొచ్చినరీతి
నచలంబుతోడ వజ్రాయుధంబు
దీకొనుగతి మట్లె తిమ్మభూవిభు దాఁకి
ముంగల మూఁకలపొంగణంచి



మునుమున్నె యామట్లె చినయెల్లు దునుమాడి
యక్కడి దొరలఁ బెక్కండ్రఁ గూల్చి
రణముఖంబున లింగరాజుతిమ్మనఁ జంపి
విళ్లూరివీరయ్య త్రుళ్ళడంచి
బలువిడి నక్కెనపల్లిరాఘవుఁ ద్రుంచి
యెఱగుడికోనేటియేపు మాపి
యతనిమేనల్లుని నా క్షణంబునఁ గూల్చి
యా తిమ్మభూవరు నదటణంచి
నగధీరు నా రంగనాథరాజును రూపు
మాపి బాల్రాజురామనను గెడపి
పాలెపుకోనేటిప్రాణంబులగలించి
మచ్చాలవెంగయఁ గ్రుచ్చి వైచి
కొండ్రాజు సోమన గుఱుతు మాయఁగఁ జేసి
సూర్రాజు కొండ్రాజు చొప్పు మార్చి
రణములోనే తులసిరాజుతిమ్మనఁ గ్రుమ్మి
బైర్రాజు కోనేటి బడలు వఱపి
యాజిలో నల తిమ్మరాజు తిప్పనఁ జంపి
గొట్టికంటోబయపొట్టఁ జించి
యాజిలోనే సంగరాజుమూర్తిని గూల్చి
పసవుల యోబనఁ గసిమసంగి
ముల్లగూరెల్లయప్రల్లదంబణఁగించి
సిరిగిరి కోనేటిఁ జిదిమివైచి
యట చింతకుంటకోనేటి నీటెలఁ గ్రుమ్మి
యా సుబ్బరాజుకాయమును బాపి

మఱి యాలమున నాకమల్లు తిమ్మయ నట
    పెక్కుగంట్లను బడఁ బృథివిఁగూల్చి
యాయోబభూవరు నతనియొద్దనె త్రుంచి
    గుత్తివెంకట్రాజుఁ గూలఁ గ్రుమ్మి
కోపించి మల్రాజు కొండ్రాజు నెత్తురఁ
    బొరలించి యా దండభూమరాజు
తిమ్మరాజును భూమిదేవికి బలివెట్టి
    యల్లుఁడు వీరయ త్రుళ్ళడంచి
యుఱికించి మఱి కత్తులూరి లక్షుమరాజు
    నలుఁగులఁ గ్రుమ్మించి సలకరాజు
పెదరాజుఁ బొరిమార్చి కదిసిన మట్టె వ
    రదరాజు తిమ్మయ మదమణంచి
యచట నేఁబదిముగ్గురందలా వెక్కిన
    నరవరోత్తములను నామమణఁచి
మథియింపు చున్నట్లు మట్లె తిర్మలరాజు
    తేజి నెక్కెడు రాజతేజ మెసఁగ
ఘనతరపర్వతాకారుఁడై పొడిచినఁ
    గైదువుల్ పోఁదట్టి పదను మెఱసి?
చనుదెంచుచున్న నా జనపతి యశ్వంబు
    మీఁదనె యీటుల మొనలఁ (మేన?) గ్రుచ్చి
పుడమిపైఁ బడఁద్రోచి భుజసత్త్వమున లేచి
    ధీరతఁ గొండ్రాజు తిమ్ముఁ జూచి
యా మూఁక చొరఁబాఱి యప్పుడె యందంద
    గ్రక్కున రాయుచు నుక్కుఁబొళ్ళు



రాలెడి వెలుగోటి రంగని ముంగలి
    యీటెలఁ గని పోటుమాటలుడిగి
జల్లని విఱిగి దాసరిరాజు తిమ్మన్న
    మొదలుగాఁ గలమన్నెమూకలెల్ల
యందలాలటు వేసి బొందలాలటు దీసి
    లేవలు దిగఁ గోసి దీవిఁబాసి
హయములఁ బోనాడి నయము సిగ్గునువీడి
    పగవారలకునోడి పొగలూడి
గోనెల దిగఁ గోసి కొట్టెడ్ల నెడవాసి
    యరిగెలు విడిచి యొండొరులఁ గడచి
యధిపుల వంచించి యాడుపాపల డించి
    కరులఁ బోఁదోలి భంగమునఁ గూలి
భూరజంబునఁ దోఁగి పొదల సందున నీఁగి
    కడుభీతిఁ గుడిచి కంకటములూడ్చి
సొంపెల్లఁ జెడి జొన్న గుంపులలోఁ బడి
    కంపమందుచుఁ దొడఁకాడికొనుచుఁ
గొండల కగఁబాఱి దండకోనలఁ బడి
    తమవారిఁ జేరి దైవమును దూఱి
యెగరోఁజులకుఁబెట్టి దగలు కుత్తుకఁదొట్టి
    దీనత వచ్చిన తెరువుఁబట్టి
పఱచుచోఁ బగిలి పూబంతులు కత్తులు
    బంగరుకుప్పెలు పట్టుదట్లు
ముంగాముఱంబులు మొలత్రాళ్ళు భటువులు
    వింజామరంబులు వెండితట్లు

చే బొక్కసంబులు చెంబులు బాగాల
పలకలు నద్దముల్ పసిఁడిగిండ్లు
సికతాయెతులు వన్నెచీరెలు మెడనూళ్ళు
నీలాలపోగులు నేవళములు
సందులకడియాలు జల్లులు సవరాలు
ప్రాణభయంబునఁ బాఱవైచి
కొనకూఁతలకె పోయెఁ గోనతెల్గలు నేఁడు
వెడలెఁగాలువపల్లి వెంకటయ్య
పొడచూపకే కూనపులి గంగినేఁడేగె
యెదపడెఁ గాట్నేని కదిరినేఁడు
యొంటరై గురిగింజగుంట బుచ్చన వోయె
దవులనె చనె చల్ల తాతినేఁడు
జరిగెఁ దా నెప్పుడో సవరము తాతన్న
పరువెత్తె వంకర బసివినేఁడు
యే సందుఁబాఱెనో నేస తిమ్మన్న తా
దిగువాఱె మాచుపల్ తిమ్మినేఁడు
దెసవడె పొత్తర తిమ్మనేఁడూడని
బాడె వేముల గంగినేఁడు గదలె
మఱియుఁ దక్కినవారు మానుషంబులు డించి
తరతంబుల దొరతనము డించి
పోవంగఁ గని పోకు పోకుఁడటంచును
వెలుగోటిపులి వాకి వెంటవెంట
నంటంటి పీనుఁగు పెంటలు సేయుచుఁ
బిలపిలఁ బఱతెంచు బెట్టిదంపుఁ



గూఁతల రణభీతి కొని మెడల్వడి చిక్కి
యడుగిడ లేక తూఁగాడువారు
వద్దఁబోటులు పడ్డవారి నెత్తురుఁజూచి
నివ్వెఱ గందుచు నీల్గువారు
దగ గొట్టి యూరకె దాహంబు పెంపునఁ
దొడివడఁ బెదవులు దడపువారు
పిడియంపుఁ బోటులఁ బ్రేవులు వెళ్ళిన
నొకచేతఁ బట్టుక యుఱుకువారు
నీటెపోటులఁ బ్రేవులివ్వలవ్వల వెళ్ళఁ
గొఱప్రాణముల బుసల్ గొట్టువారు
భారంబుగా డాగి బ్రదికెడియాసలుఁ
దొంగుచుఁ బొదలలోఁ దూఱువారు
ఎవ్వరైనను దిర్గకేమియు సేయక
విఱిగి పాఱఁగఁగని బరవసమున
.... .... మప్ప కొండ్రాజు .... ....
వీరదాసరిరాజు వారిఁ జూచి
విమతుల కీరీతి వెన్నిచ్చి పోరాదు
తిరుగు దాసరిరాజు తిమ్మరాజ
నీయంత మన్నెవానికిఁ బాఱఁ జెల్లునా
తిరుగు దాసరిరాజు తిమ్మరాజ
వడిగలతనము నీవంకనుండియె పోయె
తిరుగు దాసరిరాజు తిమ్మరాజ
అక్కటా! కులమున కపకీర్తి దెస్తివి
తిరుగు దాసరిరాజు తిమ్మరాజ
నినుఁగొల్చువాఁడను నను జూచి పోవోయి
తిరుగు దాసరి రాజు తిమ్మరాజు

అని యావలెత్తుచు నప్ప కొండ్రాజు తా
	నొక్కడే తిరిగి మహోగ్రలీలc
గణcగిన యతని భీకరమూర్తిc గనుcగొని
	పెక్కు బల్లెంబుల నుక్కణంచి
మఱియుc బోనీక యామడవెంటc బట్టిన
	హతశేషులెల్ల దైన్యంబునంది
మేటి విరోధుల మిండగీcడగువెలు
	గోటిరంగప్పను గుఱుతెఱంగి
వారణాశ్వములతో వానిచే నల రాయ
	మన్నీలు పడుపాటు మున్ను వినియు
గుణహీనులైన యీ కొండ్రాజువారేల
	శూరులవలెc దలc జూపిరిట్లు
చూపిరి గాక యీక్షుల్లకులకుc దోడు
	యీమట్లె తిమ్మరాజెట్లు వచ్చె
వచ్చెcగా వచ్చినవాcడొకబుద్ధి గై
	కోక రాజులనెట్లు కోరువెట్టె
జెబ్బులి మీసముల్ పెఱుకc బోయినరీతి
	కుడిచి క్రొవ్వున ఱాయి గ్రుద్దినట్లు
వెఱపింపc దా వచ్చి వెఱచి పోయినవాని
	తెఱcగయ్యె నింక నీ తెఱcగు గలదె
యెక్కడో మనసీమ యేది వచ్చినత్రోవ
	చిక్కితిమిcక దరిc జేరc గలమె
చూడంగc గలమొకో చుట్టాలమోములు
	వగచుచు నిష్టదైవములc దలచి



యీసారి బ్రతికితె యీసారి యోబన
	తెరువు వో నొల్ల మో తిరుమలయ్య
యిల్లుc జేరితినేని యిలు తీర్థములు గాcగ
	వచ్చెద నో కంచివరదరాజ
బ్రదికితినేని యేcబది మాసి దాసళ్ళ
	కద్ద నేతులు పెట్టుదౌబళేశ
గండంబు గడచితే కంభాని కొకకోడెc
	గట్టెద సుమ్మీcకc గదిరినాథ
ప్రాణానc జేరితే బంట్రోతు తనమింక
	నెన్నcడు నొల్ల నోపెన్న రాయ
యీసారి బ్రతికించ వే నీకుcదన్నీరు
	దాసుండ నగదు నోతండ్రి యనుచు
మ్రొక్కుచుc గడు నంట ముట్టిన భయమున
	వెలుగోటి రంగభూవిభునిc జూచి
చలమేల నృపపిశాచములు నీ సరివారె
	(పరికింపc) బ్రతిగండభైరవాంక
పాఱిపోయెడి నరపశువుల వెన్నాడ
	వలదయా గాయగోవాళ యిట్టు
లెఱుcగక వచ్చిన యీ దురాత్ముల మమ్ముc
	గావవె బల్లరగండబిరుద
యిందఱిc బొరిగొంటివిcక నైనc గోపంబుc
	దాళవె పాండియదళవిభాళ
యని పెక్కుభంగుల నఱచుచు వగచుచు
	భంగంబు నొందుచుc బఱచుచున్న

వారల (దయఁ) జూచి (వాత్సల్యమున) ధర్మ
దార వట్టించి యంతటను మరలె
రణరంగమున ననంత్రాజు వెంకట్రాజు
మొదలైన యేఁబండ్రు మొనసి నిలిచి
పటుశౌర్యమునఁ బట్టువడినఁ జంపక కాచి
సవరించి నిజనివాసములకనిచి
యిల శకాబ్దములు వెయ్యేనూట యొక్కటి
వరుసఁ బ్రమాది సంవత్సరమున
విదితంబుగాఁగ నాశ్వీజశుద్ధాష్టమి
యాదివారమున నిట్లాహవమున

గీ॥ జగతికెల్లను నిజకీర్తి సాక్షిగాఁగ
విమతనిశ్శేషముగఁ జేసి విజయలక్ష్మి
వెలయ వెలుగోటి యాచభూవిభునిరంగఁ
డెలమిఁ జిరకాలమిల యెల్ల నేలుచుండె. 177

## వెలుగోటి యాచమనాయఁడు

ఇతఁడు వెలుగోటి కస్తూరి రంగప్పనాయుని రెండవ కుమారుఁడు. మహా పరాక్రమవంతుఁడు. వీరవెంకటపతిరాయలొసఁగిన పెరిమిడి సీమను బాలించుచు మధురాంతకములో నుండెను. కొంతకాలమున కితఁడు ఉత్తర మల్లూరి కోటమీఁదికి గొప్ప సైన్యముతో దండెత్తిపోఁగాఁ దదధిపతి యయిన యారడి నాగప్పనాయఁడు తనబావమఱఁదియగు దావాల పాపానాయు నితని మీఁదికిఁ బంపెను. ఉత్తరమల్లూరి యొద్ద వీరికిరువురకు ఘోరసంగ్రామము జరగెను. యాచమనాయఁడు మహాపరాక్రమముతో సరదారులనెల్ల సంహరించి పాపానాయుని తలఁగొట్టి భంగపఱిచెను. ఈ యుద్ధము శాలివాహన ౧౫౨౩ ప్లవసంవత్సరజ్యేష్ఠ శుద్ధ దశమి భానువాసరమునాఁడు జరగినది. ఇతని



పరాక్రమాదికము బహులాశ్వచరిత్రమున నిట్లు ప్రశంసింపఁబడినది.

సీ॥ ఉత్తరమల్లూరి యొద్ద దావలపాప
విభునిఁ గొట్టిననాఁటి విజయకలన
తిరుమల చేరి ధాత్రిని మన్నె రాజులఁ
బాఱఁ ద్రోలిననాఁటి బాహుబలము
చెంగలిపట్టు వీక్షించి లగ్గలు వట్టి
యాక్రమించిననాఁటి విక్రమంబు
పాలెంబుకోట వెల్పట నాజి యతిరాజు
జరగఁ జేసిననాఁటి శౌర్యపటిమ

గీ॥ మున్నెతోపూరు జగ్గరాణ్ముఖుల నొంచి
మధురదొర చెంజిమన్నీని మదమడంచి
తిరిచెనాపలి చొరఁదోలు తేజము గల
మేటి వెలిగోటి యాచనిసాటి గలరె? 178

సీసమాలిక॥

శ్రీ మించు రేచెర్ల సింహాసనస్థుండు
సత్యసంధుఁడు హరిచరణపద్మ
సేవాధురీణుఁడూర్జిత కీర్తిమంతుండు
బిరుదుమన్నీఁడు సంగరకిరీటి
మన్నెసింహము రాయమన్నీఁడు పరదుర్గ
వర్గాపహరణ దుర్వారబలుఁడు
ఖడ్గనారాయణగాయగోవాళాంకుఁ
డారూఢిఁ బ్రతిగండభైరవుండు
రణభీముఁడుద్దండరాయముఖాంభోజ
కుముదమిత్రుఁడు వెలుగోటి యేచ

ఘనునిపౌత్రుఁడు రంగజననాథపుత్రుండు
ధీరుండు యేచధాత్రీవరుండు
భళి వీరవేంకటపతిరాయలిచ్చిన
పెరిమెటిసీమ నిబ్బరముతోడఁ
గయికొని మధురాంతకమునఁ బాళెము నిల్పి
దండయాత్రాసముద్దండవృత్తి
మఱునాఁట నుత్తరమల్లూరిపయిఁ బోయి
కోటలగ్గల వెనుకొన్నవార్త
ఆరడినాగ (?) ధరాధినాథుఁడు విని
రోషభీషణకాలరుద్రుఁడగుచు
గండరగండనిఁ గామినీప్రసవకో
దండునిఁ జండమార్తాండనిభుని
రసిక శేఖరుని సాహసవిక్రమార్కుని
దావలపాపభూధవునిఁ బిల్చి
వింటివా యనుచుఁ దద్వృత్తాంతమంతయు
నెఱిఁగించి జగడాన కెచ్చరించి
సరగునఁ దనసీమదొర మన్నె రాజుల
బలవంతులగు రెడ్లఁబాలెగాండ్రఁ
బెంజి తంజావూరు కుంజరాశ్వంబుల
రప్పించి బహుపదార్థమ్ములిచ్చి
వెంటనంపిన నాజి వెన్నీనిమన్నీఁడు
శౌర్యవంతుఁడు పటుధైర్యచిత్తు
డసమానదానవిద్యానిధి దావుల
చిన్న పాపన్నృపాలుఁడన్ను మెఱసి



తనకల్మి తనబల్మి తన పేరుఁగీర్తియు
వసుధఁబ్రసిద్ధి గావలెనటంచు
వచ్చి మూఁకలుఁ దాను వడి గోటిలగ్గల
కెక్కిగాయము దాఁకి చక్కఁబోక
వెలుగోటి యేచభూవిభునిపై బలిమితో
నెదిరించి మించి జయింతుననుచు
శకవత్సరములు వైశ్వానరలోచన
శరసుధాకరసముజ్జ్వలత మించి
సన్నుత ప్లవనామసంత్సరంబున
సురుచిరంబుగ జ్యేష్ఠశుద్ధదశమి
భానువాసరమునఁ బగలంత నుత్తర
మల్లూరితూర్పున బల్లిదముగఁ
గనుపట్టుపశ్చిమంబునఁగోట సాక్షిగా
సరసఁగందస్వామి సాక్షిగాను
నళినాక్షుఁడగు చొక్కనాథుండు సాక్షిగా
సంగతి భూదేవి సాక్షిగాను
వెసనంబుధులు వెల్లివిరిసినచాడ్పున
వసుధాధరంబెత్తి వచ్చినట్లు
నూఱుగజంబు లేనూఱుజోళ్ళగుఱ్ఱాలు
నరవాహనంబులదొరలు వేయు
పదివేలవిండ్లు డెబ్బదివేలబాణముల్
పండ్రెండువేలతుపాకిపౌఁజు
వరుస ముప్పదివేలు వరభటవర్గముల్
గెంటక బారులై వెంట నడవ

దావుల చినపాపధరణీశుఁడొకయింత
లక్ష్యపెట్టక మొక్కలమునఁ జేరి
నపుడు గెల్పులరాయఁడరిభయంకరమూర్తి
వైరిమ త్తేభకంఠీరవుండు
కదనంబులో నలుంగనినాఁటిఫల్గునుం
డహితాంధకారసహస్రకరుఁడు
వెలుగోటి రంగభూవిభునియేచనృపాలుఁ
డదరక పరబలం బధిక మనక
పం(డెండువేలకాల్బలముతో మార్కొన్న
తెగువరి యల మట్ల తిమ్మఘనునిఁ
డొదరి కొట్టినతండ్రి వడిగలతనమెంచి
రామలక్ష్మణులమార్గమున మించి
తనతమ్ముఁడగుసింగజననాథుఁడును దాను
ఘనమైన కరితురంగములనెక్కి
ధణధణంధణ యనురణభేరిశత్రుభూ
మండలాధీశులగుండెలవియఁ
గాహళశంఖమంగళతూర్యఢక్కాది
రవములు వైరులఁ జెవుడు పఱుప
వందిమాగధజనవర్గంబు గీర్తింప
భూసురాశీర్వాదములు సెలంగ
ఘనమైన సురధానిగజపతుల్గొనియాడ
వీరవేంకటరాయవిభుఁడు మెచ్చ
గంధగజాశ్వసంఘములు మావంతులు
ధీరులు శూరులు వీరవరులు



బిరుదరాహుత్తులు దొరలన్నదమ్ములు
బావలు మఱఁదులు బంధుజనులు
రెండువేలకు సముద్దండత నేర్పడి
బాణాలరవళికి బ్రమసిపోక
గుఱుతు మీఱఁ దుపాకిగుండ్లకు నళ్కక
గజఘీంకృతులకుఁ జీకాకుపడక
తురగఖురోద్ధూత ధూళిఁ గన్ జెదరక
విలుమూఁకలకు ముందువెనక గాక
గడలపొఁజులకు నల్గడలకు నేఁగక
అరిగెరాణువలకు నదటు లేక
ప్రళయవాయువు మేఘపటలిఁ దాఁకినరీతి
దావాగ్ని వనభూమిఁదరియుకరణి
బలుమూరి వెంకటప్పను ద్రుంచి మఱి పూస
పాటికృష్ణమరాజుఁ గీటడంచి
ముప్పాళ్ళ రాగనఁ జొప్పడఁ బరిమార్చి
గడెపూఁడి యయ్యన్న గదిమి చిదిమి
యెదిరినయరవోబళేంద్రునయ్యనఁ గూల్చి
పులగము కాళయ్య పొంక మణఁచి
మచ్చర్ల తిమ్మన మాట లే దనిపించి
యలకేతిరెడ్డి కమ్మనను దునిమి
దామర్ల లింగనదర్పంబు దూలించి
గోనతిమ్మనఁ గూలఁ గ్రుమ్మి వైచి
పంజుల వీరప్పఁ బైకొని విదళించి
దివ్వలేంద్రుని సూరధీరుఁ బొడిచి

యిటికేల రంగని నీటెలఁ గ్రుచ్చెత్తి
సందినాయని వెంగశౌరిఁ గెడపి
వీరపాణెమరామవిభునిపొట్టలు చీఱి
దుర్గము పెద్దుఁదుత్తుమురు చేసి
నెఱయోధ లింగమనేని నాగనఁగొట్టి
కలివె వెంగన నరికట్టి మట్టి
చినచిదంబరరాజుఁ జీకాకుపడఁ జెండి
వెట్టిరాజును బుచ్చె వీడ నఱికి
గబ్బికిలారి వెంకటశౌరిఁ దునుమాడి
ముద్దువెంకటఘను సుద్దులణఁచి
హెచ్చి వీరపనేని యెల్లప్పఁ బరిమార్చి
చెప్పల్లి వెంగనఁ జేరి చీఱి
బల్లిదుఁడగుపొట్లవల్లి లచ్చన చింత
పట్ల వోబన కోటపాటి చెన్న
వరునికృష్ణప్పను బరిమార్చి దావుల
చిన్న పాపన్నపాలుశిరముఁ ద్రుంచి
గరుడగంధర్వకిన్నరవరుల్ నుతి సేయ
నమరేంద్రపురమునకతనిఁ బంపి
దొరల వెయ్యింటికి దురములోపలఁ జంపి
యార్వేలకరయ గాయములు చేసి
భువిలోనఁ బేరుఁ బెంపును గలదామెర్ల
కరిచెన్న శౌరిని గామిరెడ్డి
సర్వప్పఘను నాగజనపాలచంద్రునిఁ
బాలెల రాజులఁబట్టి రచట



మత్తిల్లువీరరాహుత్తులఁ దెగటార్చి
తక్కినయొంటర్ల నుక్కడంచి
శిరములు నురములు చెక్కులు ముక్కులు
కరములు నురములు కాళ్లు వ్రేళ్ళు
చట్టలు పొట్టలు చర్మముల్ వర్మముల్
దొబ్బలు జబ్బలు దొడలు మెడలు
నడుములు సిడెములు నాయముల్ కాయముల్
వెన్నులు కన్నులు వీడ నఱికి
తఱిమిన విఱిగెను జెఱకురాఘవనేఁడు
పరువెత్తె దగ యెత్తి బాలమూర్తి
మళ్ళి చూడక పాఱవెళ్ళె విస్సారెడ్డి
సొరిగెను పాళెపు తిరుమలయ్య
జడిసి కంపలఁ బట్టె సాళ్వ కోనమరాజు
కఱచె నోరను బుల్లు కంచిమల్లు
ముందుగాఁ బోయెను మోవూరి తిమ్మన
కదిలె నంతకుముందె కణిపినేఁడు
పోయె గొబ్బున వీలపురపు వీరప్పయ్య
చిక్కెను జెప్పల్లి సిద్దినేఁడు
జడిసి పుట్టలఁ బడె సత్రము నాగప్ప
పఱచిరి కంచినంబాకరెడ్లు
ఊడనిఁబాడిరి ఒడియప్ప శేషాద్రి
యేడ నుండక పోయి రోడవారు
త్రోవ దప్పక చనె దావుల సర్వప్ప
దూటి రప్పుడె వడవీటివారు

కొండలంటిరి చెంజి గుఱ్ఱాలరౌతులు
గట్లు పట్టిరి నెల్లిపట్లవారు
తూరెను పొదలు మల్లారెడ్డి మల్లప్ప
చక్కనిరాజంతఁ జక్కఁ బోయెఁ
దత్తఱంబునఁ బరువెత్తె దావులమూర్తి
పఱచెఁ బాణెంబాక పాపరాజు
తొలగెను మద్దికాయల చిన్నతిమ్మన్న
తేలిపోయెను నూడిగాల యెఱ్ఱ
చావు దప్పించుక చనె బోయరామన
యుఱికిరి మొదల నామూరివారు
మలసి యచ్చటఁ గొందఱలసిపోఁగానక
హా! విధి! యనుచు బిట్టఱచువారు
ఈటెపోటులఁ ద్రేవు లివ్వలవ్వల వెళ్లి
ముక్కుచు నెత్తురుల్ గ్రక్కువారు
నెత్తురు చూచి కన్దిరిగి దెబ్బునఁబడి
యొళ్లెఱుంగక మూర్ఛ నొందువారు
గుప్పుదెబ్బునఁ బట్టదుప్పటంబులు వేసి
తూరనిడొంకలఁ దూరువారు
బల్లరగండని పౌఁజులల్లదె వచ్చెఁ
బదమంచు నిల్వక కదలువారు
పంచపాండ్యదళవిభాళుఁడేనుఁగు నెక్కెఁ
జిక్కితిమని బిట్టు వెక్కువారు
వెలిగోటిపులితోటి చలమేటి కనుచును
లేటిగుంపులవలె దూటువారు



పగపాడి దిగనాడి దగగూడి బిట్టెండ
సుడివడి ప్రాణముల్ విడుచువారు
బెగడొంది వగఁజెంది తగ మున్నె నిల్వక
కన్నది గాదిగాఁ జన్నవారు
వడిఁబెట్లఁ బడిచెట్ల నడిగట్ల కెగఁబాఱి
పెక్కుదిక్కులఁద్రొక్కి నక్కువారు
అలపుంజి గలచెంజి బలుమంజి వెనుదీసెఁ
దిరుగుమంచును వేగ జరుగువారు
పదమించి మదిగొంచి పెదకంచుకోవుల
బారు నెగ్గెనటంచుఁ బాఱువారు
కనిదుడ్డిరని గడ్డిదిని రెడ్డిబిడ్డలు
వాఁగుల ప్రంతల నేగువారు
బలుపట్టెములు నెట్టెములు నట్టె పడవేసి
రిచ్చలుపడి బొబ్బరించువారు
తొలి బింకములు పొంకములు మాని దిగులూని
యొకవంక సికలూడ నుఱుకువారు
వెఱచి వాచఱచి మై మఱచి కోకలు వీడి
వెసదిగంబరులయి మసలువారు
దప్పిదప్పని మదిదప్పి ఱొమ్ములఁబట్టి
మడుగులోపల దాహమడుగువారు
నగుచు నందలములు నశ్వముల్ గజములు
టెక్కెముల్ గొడుగులు చిక్కటార్లు
పట్టెముల్ పికిలిపూబంతులయీఁటెలు
భూషణంబులు పట్టుబొందళములు

బంగారుకట్లతుపాకులు బాణాలు
జల్లులు బిరుదువింజామరములు
తొత్తులు మందుతిత్తులు గుడారంబులు
కంచుగొమ్ములు వెండికట్లవిండ్లు
బహుధనధాన్యముల్ పరిమళద్రవ్యముల్
ఊళ్ళు కోటలు సీమలొప్పగించి

గీ॥ విఱిగిపోయినఁ గొట్టక విడిచి ధర్మ
దార వట్టించి సంగరస్థలమునందు
విజయలక్ష్మిని గైకొని వెలసెనంచు
సకలనృపులెంచఁగా విని చాల మెచ్చి
వీరవేంకటపతిరాయవిభుఁడు నీకు
ఘనవిభూషణవస్తువాహనచయంబు
అమితరాజ్యంబులొసఁగిన నతులశౌర్య
ధైర్యగాంభీర్యబంధురైశ్వర్యలీల
మీఱితివి కీర్తులా చంద్రతారకముగ
ఆయురారోగ్యపుత్రపౌత్రాభివృద్ధి
రస్తు దిగ్విజయోస్తు శ్రీరస్తు నీకు
కోవిదస్తోత్ర! వెలుగోటికులపవిత్ర!
బంధుమందార! వెంకటాంబాకుమార!
ఈశ్వరాటోప! వెలుగోటి యేచభూప! 179

ఉ॥ ముప్పదిరెండు వేలభటముఖ్యుల దావులపాపశౌరితో
ముప్పదియంచు నెంచకతిమూర్ఖతఁజేరిన రెండువేలతోఁ
జొప్పడ నిల్చి గెల్చితివి శూరతనీప్రతిమన్నెవాఁడు లేఁ
డప్పు బళీరె! రంగవసుధాధిపు నేచనృపాలశేఖరా! 180



సీసమాలిక॥
శ్రీ మించురేచర్లసింహాసనాధీశుఁ
డసమానభూరిబాహాబలుండు
శరణాగతత్రాణకరుణాధురీణుండు
ఖండితప్రత్యర్థిమండలుండు
భరతరంతిసుహోత్రభార్గవనాభాగ
రామాంబరీషాదిరామనిభుఁడు
ధాటీనిరాఘాట ఘోటీఖురోద్ధూత
భూరేణుపంకిలాంభోధినిభుఁడు
ఘనకీర్తివిస్ఫూర్తికర్పూరవాసనా
వాసితాశేషభూవలయుఁ డఖిల
సర్వసర్వంసహా సంరక్షిదక్షిణ
బాహుదండుఁడఖండ పాండ్యగర్వ
దుర్వాపహరణుండు దుర్మన్నెభుజగాంకుఁ
డర్థిదారిద్ర్యముద్రాంధకార
చండమార్తాండుండు సర్వజ్ఞసింగభూ
రమణవంశాబ్ధికైరవసఖుండు
తమ తండ్రి రంగభూధవుఁడు గెల్పుల సుల
తాను పద్దొకయింతఁ దప్పకుండ
మెలఁగ నేర్చినమహామహుఁడు విక్రమశాలి?
యాచభూవిభుని సాహసగుణంబు
సన్నుతి సేయంగ శక్యమా యొకమాట
నారూఢి బొప్పనగారినెల్లుఁ
గొల్లాడి తమతోడ మల్లాడి కినిసిన
రాచమూఁకలనెల్ల పీఁచమణఁచి

చెండి యుద్ధండుఁడై చెలఁగి యక్కడ సీమఁ
గట్టించి భుజశౌర్యగరిమ మెఱయ
నొకనాఁడు వడి హుటాహుటిగ దాడిగఁ బోయి
ధీరుఁడై యుత్రమల్లూరికోటఁ
గైకొని యా సీమఁగట్టించి యక్కడి
మన్నెమూఁకలనెల్ల మదమణంచి
మిగులఁ బ్రతాపంబు మెఱసి యుండెడువేళ
వేలూరి లింగభూవిభుఁడెఱింగి
తన మదిలోన నెంతయు విచారమునంది
చలము రోషంబు మచ్చరము పేర్చి
బలవంతులైనట్టి ప్రభువులనేకులఁ
గూడఁబెట్టినఁగాని కొంచమునను
వెలుగోటివారితో విగ్రహించంగ రా
దనుచు నారడినాగఘనుఁడు దాను
నొక్కటై హర్షించి మిక్కిలి మీఁదెంచి
వింటివా మదినింత వెఱపు లేక
ధాకతో మొనఁజేసి డాసి యాచమనేఁడు
మన బలంబొక తృణంబునకుఁ గొనక
హత్తి మెల్లగ సీమ యొత్తి కట్టఁ దొణంగె
నదిగాక కోటలనాక్రమించె
ననిన నాగమనేఁడు నాగ్రహవ్యగ్రుఁడై
తన బల్మియును గల్మిఁ దలచి యుబ్బి
యీ పని సాధించుటిది యెంత దొడ్డని
తన బావ నధికప్రతాపశాలి



దావాలపాపయ్య నా వేళఁబిలిపించి
కడు ముదంబొదపించి గారవించి
మించి యాచమనేఁడు మేటియై మన కోట
లాక్రమించెను భుజావిక్రమమున
నతనిపై దండెత్త నర్హుఁ డెవ్వఁడు లేఁడు
నేఁటికాలంబు మన్నీలలోనఁ
బ్రజఁగూర్చ విచ్చంగ బలవంతుఁడవు నీవె
యటుమీఁద నధికసాహసివి గాన
నేవిధంబులనైన నీ కార్యమీడేర్చి
కులమెల్ల నేఁటితో నిలుపు మనిన
నర్పించి యప్పు డాదావాలపాపయ్య
కడిమితో రోషంబు గడలుకొనఁగఁ
గడు నుద్దవిడి నేఁడు గదలి దాడిగఁ బోయి
కమనీయభుజపరాక్రమము మెఱసి
కోట లగ్గలఁ దీసికొనివత్తు ననుఁ జూడు
మని పంతముల్ పల్కి యాక్షణంబె
యారణి చెంజి వేలూరిలోఁ గల్గుబల్
మూఁకలన్నియు నొక్కవీఁకతోడఁ
గూర్చి తిండివనంబు కోట తిర్వదికోట
వలదాపురపుఁగోట వందవాసి
కోట పెన్గోటూరికోట తిర్వత్తూరి
కోటయు ననుమూరికోట కదివె
కోటయు నార్కాటికోటయు మొదలైన
కోటలలోఁగల మేటిదొరల

మధుర తంజావూరి మన్నె మూఁకలనెల్లఁ
దేజి గుఱ్ఱముల మస్తేనుఁగులను
బడవీటఁగల ప్రాంతపరిజనంబుల నెల్లి
పట్లవారును గుడిపాటివారు
నామూరివారును నాదిగాఁగల్గు నీ
పాలెగాండ్లను బట్టి బలము నెల్ల
రమణఁగమ్మలు పంపి రప్పించి మఱియును
దోడు వచ్చినయట్టి దొరలకెల్ల
గౌరవంబెసఁగ వెయ్యారుజాలెలు చించి
వెచ్చించి యిచ్చుచు వేగిరించ
యుద్ధసన్నద్ధులై యువ్వెత్తుగాఁ జని
యుత్తరమల్లూరియొద్ద విడిసి
కదిసి కయ్యమునకుఁ గాలు ద్రవ్వుచు నుండఁ
గనుఁగొని పైవచ్చు కార్యమెంచి
కరె చెన్న విభుఁడు నాగారెడ్డియును జేరి
హితముఁదెల్పెద మంచు మతిఁదలంచి
యేచమనేనితో నెదిరించి నిలుచుట
భారంబు దావాల పాపినేఁడ
యితనిపై దండెత్తి యింతట మఱలితే
పటుకీర్తి దావాల పాపినేఁడ
మన మూఁకలెన్నైన మొనసేయవతనిపైఁ
బరికింప దావాల పాపినేఁడ
కాదని యతనితోఁ గణఁగి మార్కొంటిమా
బడబానలముఁ గేలఁబట్టినట్లు



పులులమీసముల నుయ్యెలలూఁగఁ జనినట్లు
కొండతోఁ దగరు ఢీకొనినయట్లు
మేటిసింహము నిద్ర మేలుకొల్పినయట్లు
వినుమింకఁ బలుమాటలనఁగనేల
సంధాన మొనరించి చక్కఁ జేయుట మంచి
పని సుమీ దావాల పాపినేఁడ
యని పెక్కుభంగుల నాడినఁజీరికిఁ
గొనక వారల గనుగొనక వినక
వెనుక ముందఱఁజూచుకొనక యాచనతోడి
కినుక మోసము వచ్చు ననక భూరి
సరభసంబున సర్వసన్నాహములు మీఱి
చేరి యాయుత్రమల్లూరి తూర్పు
బైటను జిగి మించుపైఠాణికట్టు వ
ర్గంబులు పచ్చలకడియములును
రాణించు గొప్పకట్టాణిముత్యాల చౌ
కట్లు హొంబట్టులు దట్లు మేలి
ముంగామురబుంలు నుంగరాల్ తలిమంపు
దుప్పటంబులు జిరాల్ ముప్పిడములు
బంగారు నీర్వోతపని చెక్కడాలును
జెలరేఁగి రెడ్డిబిడ్డలును దొరలు
కడు మదోన్మత్తులై గరిమతో నేతేర
నూఱాఱు మదపుటేనుఁగులు చాల
దండిగాఁగనుపట్టు రెండువేల్ నిండు సం
జోకగుఱ్ఱములు ననేకభటులు

నార్వేలవిండ్లు నాల్గయిదువేల్ బాణపు
ఫౌఁజులాఱేడువేల్ బలుతుపాకు
లును బాదార్వే లీఁటెలును గడల్ నల్గడ
నిండెను దండోపతండమగుచు
ధరణి యీనినజాడఁ తగ సముద్రంబు పె
ల్లుబ్బి వచ్చినరూఢి నిబ్బరమున
ఢమిఢమిండిమి పెరల్ ఢబ్బుఢిబ్బుస్సురిం
ఖం గన్నరవళితో.....................
భూరిభేరీఢమామీరుంజతమ్మఢా
రవము దిగ్దంతులఁ జెవుడుపఱుపఁ
దీరుగా వేర్వేఱ బారుగా నొనరించి
వీఁక నేతెంచునమ్మూఁకఁ గాంచి
రేచెర్లసింహమౌ యేచభూపాలుఁడు
నళ్కును బెళ్కు నింతైన లేక
పొడుపుగుబ్బలిమీఁదఁ బొడుపైన భానుని
రంగు మీఱంగ నేనుంగు నెక్కి
సింగంపుఁగొదమలభంగిఁ గ్రేళ్లుఱికెడు
బలములఁగనుఁగొని సెలవు పెట్టి
రావణుపైఁబోవు రామచంద్రునిచెంతఁ
గణఁకతో నడచు లక్ష్మణునిజాడఁ
దన తమ్ముఁ డతిశౌర్యధనుఁడు సింగమనేఁడు
రాజసంబున మేలితేజి నెక్కి
గమకించి దుమికించి ప్రమదంబుతో రాఁగ
నుప్పొంగి హరి నాత్మ నునిచి తలఁచి



వెనువెంట నిదె వత్తు ననుచు నట్లావేళ
గరుడుండు వామభాగమున నడవఁ
గనుఁగొని జయలక్ష్మి గల్గె నిశ్చయముగా
నని పేర్చి కోయని యార్చి కూర్చి
తన మూఁక మూఁడువేల్ ఘనమైన యవ్వలి
మూఁక ముప్పదివేలు మొనసె ననక
ఘనభీకరాకారఖడ్గుఁడై మదవార
ణంబులఁగన్న సింహంబుపగిది
లేళ్ళఁగన్గొన్న బల్బెబ్బులిచందాన
ఫణులఁగాంచిన ఖగప్రభునిజాడ
సరవిఁబక్షులఁగన్న సాళ్వంబువైఖరి
ఘనజవప్రౌఢిచేఁగదిసి కినిసి
మొనసి తీరినబార్లు ఘనతరంగములుగాఁ
జుట్టువేడెములెల్ల సుళ్లుగాఁగ
బాణాగ్ని ధూమముల్ బడబాగ్ని శిఖలుగా
గజములు శైల సంఘములు గా గ
బటువీరభటమహార్భటనిర్భరార్భటుల్
మునుకొన్న ఘుమఘుమధ్వనులు గాఁగఁ
జెలరేఁగి వచ్చు నా సేనామహాంభోధిఁ
గుంభసంభవుఁడు దార్కొనినయట్లు
ప్రళయకాలాభీలభయదరుద్రునిలీల
బారుల వడిఁ దూఱఁ బాఱఁగొట్టి
మునుమున్నుగా గట్టి మొనల నిల్చినయట్టి
దొరలఁబెక్కంద్రఁ దుత్తుమురుఁజేసి
గడెపూడి యయ్యన- బుడమిపైఁ బడఁగ్రుమ్మి
.................................

అల కోటిపాటి చన్నప్ప కృష్ణప్పను
బరిమార్చి.........................
అల కేతిరెడ్డికమ్మన్న మస్తముఁ ద్రుంచి
....................హత మణంచి
చింతపట్లోబన్న నంతకుపురికంపి
ఘనుఁ జందినేని వెంగనను గూల్చి
వీరాదియైనట్టి పేరుఁగల్గినవారి
నలువదిదొరపేర్ల నలియ మొత్తి
వెనుదీక మొనలకుఁగినిసి సాహసముతో
నెక్కి గాయము దాఁకి చిక్కినట్టి
మన్నీని దామర్ల చెన్నప్పఁబట్టించి
యచట నూర్గురికి గాయములు చేసి
యా వేళ నత్యుగ్రుఁడై మోహరించిన
దావాలపాపభూధవునిఁగట్టి
మస్తంబు విగ్రహవ్యస్తంబుగాఁగొట్టి
కలివె వెంకట్రాజుఁ గసిమసంగి
యతని మేనల్లు నయ్యపరాజుఁ బొరిమార్చి
వీరపానెము రామవిభునిఁగూల్చి
చినచిదంబరరాజు జీవంబుఁదెగటార్చి
చుట్టి వెయ్యాఋలఁబట్టి త్రుంచి
యేనుంగులను మించి పోనీక పట్టించి
గుఱ్ఱంబులను గూలఁగ్రుమ్మి చిమ్మి
తరిమి రౌతులనెల్ల దండించి మండించి
మేటివిల్కాండ్రను వ్రేటు గొట్టి



వెస బాణగాండ్లను ప్రీలించి తూలించి
గడల బారులఁబాఱఁగదిమి చిదిమి
పోలేక జడిసిన పోవెలవెంకట
రాజుతమ్ముఁడుఁ దిమ్మరాజు సూర్య
నారాయణేంద్రుకుమారకాలపరాజుఁ
బట్టించి యా మూఁకఁ బాఱఁదఱిమి
ఘనశౌర్యుఁడైన నాగారెడ్డి చప్పల్లి
సిద్దన్ననుంబట్టి చెలఁగి మఱియు
మెండొడ్డి నిలిచిన దండిమూఁకలనెల్లఁ
గరములు నరములుఁగాళ్ళు వ్రేళ్ళు
చెక్కులు ముక్కులు శిరములు నురములు
కండలు గుండెలు గండ్లు రొండ్లు
ముఖములు నఖములు మూఁపులు వీఁపులు
మేనులు వీనులు మెడలు తొడలు
చీకాకు పడఁగొట్టి చెండి వెంపరలాడి
గుట్టలు పెట్టినఁగూడి యచట
భీకరార్భటి మీఱి శాకినీడాకినీ
బేతాళముఖమహాభూతకోట్లు
కుత్తుకబంటిగా నెత్తురుల్ వడిఁద్రావి
మెదడు మాంసము క్రొవ్వు మెసవి మెసవి
నిక్కి యన్నెక్కి మై సొక్కి నాట్యములాడ
యాచభూవిభుఁడు వెన్నాడి తరుమ
డాలుడమామీలు మేలిగుడారముల్
బాణములరిగెను పట్టెములును

దరకసంబులు వాడిఁగొరకలంబులపొదుల్
ముప్పిడంబులు దట్లు దుప్పటములు
నైజంబులును గరాచూరులు సింగిణుల్?
బొమిడికెములు జిరాల్ కోలుగడలు
చేకత్తులును విండ్లు బాఁకులు జంబువల్
కిరుసులు జముదాళ్ళు సురెకటార్లు
సరిపెణల్ తాళీలు చౌకట్లు పదకముల్
ఘనచామరములు కాళాంజి గిండ్లు
జముకాళములు బొక్కిసలు బోనపుటికలు
చెంబులు కొప్పెరల్ తంబికలును
బలుతుపాకులు ఫిరంగులు తురంగంబులు
పల్లముల్ బల్లెముల్ పల్లకీలు
గొడుగు లందలములు కుంభిని దిగనాడి
విభ్రాంతులై సిగల్ వీడి చెదరి
పాఱుచుఁజెట్లలోఁదూఱుచుఁబుట్టలఁ
దారుచు దైవంబు దూరుకొనుచుఁ
గుడిచి కూర్చుండి యీ గోడేల తలపెట్టె
దావాల పాపయ్య దావరీఁడు
తలపెట్టుకొనుఁగాక తన మట్టుతో రాక
యీ మూఁకలెన్నైన నేల కూర్చె
కూర్చిన నే మియ్యకొంటిమి యాచభూ
వరునితో నెదిరింప వశమె మనకు
మొనకుఁబోయిన మహామోసంబు వద్దింక
తిరుగుము పాలెపుఁదిరుమలయ్య



కయ్య మింతటఁజాలుఁ గడకు జారుటె మేలు
పదపద బిగువేల బాలమూర్తి
పో వూరి లేదిట మోపూరితిమ్మన్న
వెనుకఁజిక్కక రమ్ము వీరపయ్య
బాపఁడ వంతె నీ పరువింత నీకేల
వడి యప్ప శేషాద్రిఁదొడుక పొమ్ము
సత్రంబు నాగప్ప చిత్రంబుగా దూఁటె
వడిగలతన మేడ వఱదఁబోయె
బోయరామన్న తాఁబోయె నందతికన్న
మున్నుగా దావాలచిన్నమూర్తి
పడవీటిమూఁక లెక్కడ నేటఁగలసెనో
నెల్లిపట్టులవారిత్రుళ్లణంగె
కూడి రాలేవదె యూడిగా లెఱ్ఱప్ప
కట్టఁబాఱఁగ వైచి కడకుఁబొమ్మ
చెఱకుదప్పితివి మేల్ చెఱకు రాఘవనేఁడ
పొమ్మల్ల పమ్మెర్ల బుక్కరాజ
మాకన్న మునుమున్నె......................
మనిపినాఁ డప్పుడె గసివినేఁడు?
తప్పి వచ్చెద నన్న తప్పి రావనుచు ని
న్నప్పుడె సాల్వకోనప్పరాజ
జాణ యౌనట్లుండు సర్వప్ప పర్వప్ప
వెల్లైనఁగూడంగ.................
బొమ్మయ్య శీఘ్రంబె పొమ్మయ్య ప్రజఁగూడి
పుంజి తమ్మయ్య దా పుంజ దప్పె

వాడవారును తాము జోడుగూ డూడనిఁ
          బాడిరి కంచి తంబాడిరెడ్లు
వీఁపయ్య పురిపట్టు బాపయ్య గాయంబు
          రామన్న మున్నుగా రాఁగ నొచ్చె
నొచ్చర్ల నొచ్చెఁగా మచ్చర్లతిమ్మన్న
          కలివెరాజును దాముఁగలసి మెలసి
పాలేలరాజులఁబడి పాఱిపోలేక
          వెట్టివాఁడై కూలె వెట్టిరాజు
మేటి యౌనలకోట చెన్నప్ప కృ
          ష్ణప్ప నేవంకగ నడిపికొనిరొ
కంచె మించై వెళ్ళెఁ గంచి మల్లప్ప య
          ల్లప్పుడే జాఱె నయ్యప్పనేఁడు
దామర్ల చన్నప్ప తామర్ల కే చిక్కె
          చిక్కె నాచప్పల్లి సిద్ధఘనుఁడు
తండ్రి నాగారెడ్డిఁ దగిలించి తా దూటె
          విస్సప్పయును దొరల్ విఱిగి పాఱఁ
బెదవులఁ దడిలేక బెదరి పాఱగ లేక
          దగ దొట్టి చిట్టాడి సిగలు వీడి
వగరింతలకుఁబెట్టి దిగఁజెమ్మటలు వెట్టి
          తోడు వచ్చినయట్టిదొరలఁదిట్టి
దిగులునఁ గనుమూసి దిక్కులఁ జే సాచి
          దెసచెడి తలదాఁచి తిరిగి చూచి
యిదె మూఁక వెన్నాడె నని బబ్బరింపుచుఁ
          దుంగ గుంపులలోనఁ దూఱువారు



నక్కబొక్కలలోన డొక్కి యుండెడివారు
          కొఱప్రాణముల నిలఁగూలువారు
నెత్తురు తలదాఁకి తత్తరిల్లెడువారు
          మాటమాటకుఁ బ్రాలుమాలువారు
పడిన పీనుఁగులలో నడఁగి దాఁగెడువారు
          చెఱువు కాలువలలో నొరలువారు
కడుగాయములనొచ్చి మడుఁగులఁ బడఁజొచ్చి
          జడిసి దప్పులకు నీళ్ళడుగువారు
తమ మూకలనె చూచి తల్లడిల్లెడువారు
          మ్రొక్కి గుంటలలోన మునుఁగువారు
మిగుల నూపిరిఁబట్టి మెదలకుండెడివారు
          పడి పటాపంచలై పారువారు
పాఱగాలేక వేసారి యో శ్రీహరి
          వీరరాఘవసామి వెంకటాద్రి
యీతూరి దయను మమ్మిందఱ నిలు సేర్చి
          ప్రాణముల్ నిలుపుఁ డాపదలఁదలఁచి
పడవీటి యల్లమ్మ పల్కెడి వీర్లార
          పోతురాజయ్య యో పుట్టలమ్మ
మమ్మకోటమ్మ మహమ్మాయి గురునాథ
          మీరెల్లఁ గూడి యీ బారిఁగడపి
ప్రోవుఁడీ యేటేటఁ బొంగళ్ళు వెట్టించి
          పొట్టేళ్ళఁగొట్టించి పట్టి కొలుతు
బంట్రౌతుకొలువంత పాపమెన్నఁడు వద్దు
          చాలుఁబో యేడేడుజన్మములకు

గుడినిఁ దుమ్మిరి కసుక్కున నిల్లు వెళ్ళఁగాఁ

జాఁగీడుకలగంటి సన్న రేయి

పైనమై పోగానె పడియె నామపుఁబెట్టె

నపశకునంబు లెన్నైన నాయె

నీతూరి బ్రతికితే నిఁక గలలోనైన

నేచమనేనితో నెదిరి నిల్వ

మని ప్రజల్ పాఱంగ హోగయ్య బందాని

లోబాలరాహుత్త ............

దావాల పాపయ్య తా బిద్ధ నేనయ్య

హెూహిందె బందెరా హుత్తనం జ

సుమ్మనె బారయ్య దమ్మయ్య రాహుత్త

యిత్త బారయ్య బాయిత్తనంగ

నాహెూదె నిల్లుకో నాని నీ నింతుకొ

సాగుమల్లన్న నీ సాగు సాగు

హేగయ్య నీమున్నె హేగయ్య నిన్నాణె

హెూగయ్య నీ హెూగు ఒల్లె యనుచుఁ

జెంజిరౌతులు భీతిఁజెదరి సందులఁ దూఱ

తిరుమలతోవందు డల్గరము మూర్తి

వెణ్ణుం డొద్దామురా చెంజి రప్పిళ్ళ పో

..........రాయడల్ చల్లనోడు

కొత్తళం బెట్టుటల్ కుళ్లాయి పోచిరా

తానప్ప కుడికతాన్ తణ్ణి యిల్లె

నీయోడి వార్మయ్య ఆయం బెరుమ్మా ళె

(పెరుమాళు) నమకుండు పెరియసామి



మోణ్కప్ప శివనప్ప వెణ్కాముడా దండ

లాది మానాల పొల్లాదెనమకు

ఓడివా యప్ప నీ యోడివాడా యంచు

ద్రావిడుల్ భయమంది తల్లడిల్ల

రణభీతులైనట్టి ప్రజలభంగములెల్లఁ

గరుణావిధేయుఁడై కాచి యపుడు

భుజబలభీముఁ డద్భుతవిక్రమార్కావ

తారుండు ప్రతిగండభైరవుండు

ధీరుండు ఘనదానశూరుండు మన్నెహం

వీరుండు.........................

తగ నంత మన్నించి తా ధర్మదార వ

ట్టించి రక్షించి యుదంచితముగ

మునుకొన్న ప్లవ వర్షమునఁదగు జ్యేష్ఠ మా

సంబున శుక్లపక్షమున దశమి

యాదిత్యవారమధ్యాహ్నలగ్నంబునఁ

జంద్రదివాకరుల్ సాక్షిగాఁగ

మహి మించు నల యుత్రమల్లూరు సాక్షిగా

గరిమతో జయకన్యకను వరించి

యఖిలదిగ్దేశరాజాధిరాజులు దొరల్

మన్నీలుఁ దన గెల్పు సన్నుతింపఁ

గర్ణాటకమునకుఁ గ్రమ్మఱఁ జనుదెంచి

వెంకటపతిరాయవిభుఁ డొసంగు

రంగత్తురంగ వారణభూషణావళుల్

గైకొని లోకవిఖ్యాతుఁడయ్యె

గీ॥ నతఁడు మన్నీనిమాత్రుండె మతిఁదలంపఁ
గలితజయహారి వెలుగోటికులవిహారి
కుపితజయహారి వెలుగోటికులవిహారి
యిద్ధబలసీరి రంగయయేచ శౌరి. 181

వెలుగోటి యాచమనాయుని కుమారుఁడు కుమార యాచమనాయుని నిదేశముచొప్పున పసుమర్తి కోదండపతి యను కవీశ్వరుఁడు చెప్పిన పద్యము లివి.

శా॥ ఆ భూపత్రితయంబులో మహితవంశాధీశుఁడై యాచధా
త్రీభృత్కేసరి మీఱి శైశవమునందే సాహసస్ఫూర్తిను
ర్వీభారంబు వహించి ప్రోచెఁ బ్రజలన్ శ్రీరామరాజ్యంబుగా
నాభీమారి మదాపహారి సరిసేయం జెల్లదేరాజులన్. 182

సీ॥ ఉత్తరమల్లూర నుద్దండవృత్తిగా
నాక్రమించిన విని యాగ్రహించి
దావాల పాపభూధవుఁడు నల్వదివేల
కాల్బలంబులు నశ్వగజబలంబు
దామెర కటిచెన్నధాత్రీశుఁడాదిగాఁ
గల బలముతో వచ్చి కదిసినపుడు
మున్నూటికై జీతమును గూడ నాల్గువేల్
భటులతో నచ్చట బారు నడచి

గీ॥ పరబలముఁద్రుంచి చెన్నభూపాలుఁబట్టి
తఱిమి పాపక్షితీంద్రుమస్తకము దునిమి
వీర వెంకటపతిరాయఁ డౌర యనఁగ
హితులు రక్షించె వెలుగోటి యేచఘనుఁడు. 183



సీ॥ ఇల రామదేవరాయలను బట్టముఁగట్టి
బంధుమిత్రసహాయపటిమ మెఱసి
మాటమాత్రఁ గొమారమాకరాజును దున్మి
చెంగాడుజగ్గవజీరుఁదఱిమి
గొబ్బూరివారేలుకోటలు భూములు
సాధించి చెంజికృష్ణక్షితీంద్రు
బారు గెల్చాతనిఁబట్టి పాలెముకోట
చేరువ యతిరాజుఁ బాఱఁద్రోలి

గీ॥ మఱియుఁగలశత్రువీరుల మట్టు పెట్టి
వేలురికిఁ దూర్పు కృష్ణకావేరినడుమ
వెలమనాడుగ నాఁడు గావించినాఁడు
యేచభూవిభుప్రాభవ మెంచఁదరమె. 184

సీ॥ రామరాయనరేంద్ర రఘునాథనాయక
ప్రాముఖ్యకార్యకర్తలబలంబు
నిజసహోదరసింగనృపతిరాయపభూవ
రాయ్యపనాయకోద్యతబలంబు
దామెర కటిచెన్న ధాత్రీశ చెరుకు వెం
గళభూప బంధువర్గములబలము
పరమాప్త కేతిరెడ్డి రఘునాథేంద్రు పా
వడకృష్ణ నృపసుహృద్వరబలంబు

గీ॥ మెఱసి తనుఁ గొల్వఁ గొక్కర్సు మెట్టయొద్ద
సమర మొనరించి గొబ్బూరిజగ్గవిభునిఁ
దునిమి మధురేంద్రుఁ జెంజీశు దొరలఁ దఱిమె
నెంత ప్రబలుండు రంగయయేచఘనుఁడు. 185

సీ॥ సింహాసనముకుఁ జిత్తంబులో రెండు
దలఁచుద్రోహుల ఱొమ్ముఁ దన్నినాఁడు
మదిలోనఁ గ్రొవ్వి ఛద్మనకార్య మూహించు
చెనటులజిహ్వలు చీల్చినాఁడు
మొసలు తారసమైనఁ గని భయంబున వీఁగు
చండిమన్నెలఱొమ్ముఁ జఱచినాఁడు
ఎదిరించుమన్నీల నేపునఁ బడి పుట్ట
చెండ్లు గొట్టినరీతిఁ జెండినాఁడు

గీ॥ మన్నెమాత్రుండె యితఁడరిమర్మభేది
మన్నె బెబ్బులి గడెమన్నె మగలమగఁడు
సమరగాండీవి వెలుగోటిశాసనుండు
రంగభూపాలు నేచధరావిభుండు. 186

సీ॥ నేఁడుగా తలపూవు వాడ కంతయుఁ జాల
నలరె నీ పద్మనాయకకులంబు
నేఁడుగా భువనవర్ణితమహాద్యుతితోడఁ
గొమరొందె రేచెర్లగోత్రమెల్ల
నేఁడుగా ఫలియించె నెగడి సర్వజ్ఞసిం
గమనేనిసంతానగౌరవంబు
నేఁడుగా మదిఁగల్గునెవ్వ లన్నియుఁదీఱి
విలసిల్లె ఘనమైన వెలమ పేరు

గీ॥ నీవు కర్ణాటకంబున నిలిచినపుడు
రాయవిద్వేషిగర్వదుర్వారవైరి
కోటిఁబరిమార్చి గెలుపుఁజేకొనినకతన
హితమితాలాప వెలుగోటియేచభూప! 187



సీ॥ దళవాయికిని వెట్టి గొలిపి వచ్చినవాని
పట్నంబుఁ గట్టుకొన్నట్టినాఁడె
గుమిగూడి వేలూరికోటలోఁ గలయాఁటె
యౌబళేశునిఁ ద్రుంచినట్టినాఁడె
నిండార మౌరాయభండార మెల్లను
నాక్రమణము సేసినట్టినాఁడె
పుత్రమిత్రకళత్రపుంజంబు రాయల
నరయక వధియించినట్టినాఁడె

గీ॥ చచ్చె నీ చేత గొబ్బూరిజగ్గరాజు
పాటి పోఁబట్టి రెండేండ్లు బ్రతికెఁ గాక
లలితచారిత్ర వెలుగోటికులపవిత్ర
హితమితాలాప వెలుగోటి యేచభూవ! 188

సీ॥ నీ హేతిచే జగ్గనృపతి సద్గతిఁబొంది
పాపాత్ముఁడనునిందఁ బాపుకొనియె
విఱిగి వీరవిభుండు చిరుతనాపలిఁ జేరి
దిడ్డితూరుపుదిక్కుఁ దెఱవ వెఱచెఁ
దన ప్రాణములు దాచుకొని చెంజికృష్ణప్ప
వీఁగి యెన్నఁడుఁ గోట వెళ్ళ వెఱచె
నమ్మినదొరలటు నట్టేటఁబడిపోవ
నోటకాఁ డొక్కఁడు గూటఁబడియె

గీ॥ శాకమూరులు రావెలల్ మాకరాజు
వారు దిక్కామొగంబులైనారు జడిసి
యౌర తోపూరుపాళ్యంబు లదర నీవు
త్రోచి నడచిన వెలుగోఁటి యేచధీర! 189

సీ॥ రాజులలో జగ్గరాజనిమొనఁబడె
దప్పెఁ గార్యంబు వీరప్పనేఁడ
పదపద తిరుచునాపలిఁ జేరఁగావలె
మాకరాజు గుఱాని నూకె మొదల
నేనుఁగు నెక్కుట మానక దళవాయి
తాఱెను దనదుబిడారిబైట
రావెలవెంకన తా వెళ్లసాగెను
పోయె మున్నుగఁ దెరువీయ నొక్కఁ

గీ॥ దనుచుఁ గృష్ణమనేఁడు మున్నాడి తెలుప
జాఱు వీరపనేఁడు నీ బారుఁజూచి
వైభవబిడౌజ రంగభూవరతనూజ
హిమకరాకార వెలుగోటి యేచధీర! 190

సీ ॥ వారజీతమె కాని బారు నాకేలని
చినరౌతు సొనలను జేర వెఱచె
నూడిగమే కాని కూడ వీపనులని
యెప్పుడో జరిగె నా తిప్పరౌతు
మణియ మంతే కాని మా కిది కాదని
గుట్టుగాఁ దీ తపసెట్టి కదలెఁ
బాళెగాఁడై తాను బ్రతుకేది లెస్సని
చిట్టాడ కదలె నాగట్టిమొదలి

గీ ॥ మఱియుఁ దక్కినదొరలిటు మార్గముననె
వట్టిమూఁకలు నీ మీఁద నెట్టుకొనునె
వైభవబిడౌజ రంగభూవరతనూజ
హిమకరాకార వెలుగోటియేచధీర! 191



సీ ॥ పాతక సుకవీంద్రబంధువిద్వజ్జనా
శ్రయమైన యట్టిరేచర్ల పేరు
పరపంథిరాజన్యపట్టణహతవీర
రణజయార్జితమైన రావుపేరు
సకలదిగ్భూములజనము సన్నుతి సేయఁ
గరమొప్పుగనియాల గనిన పేరు
విక్రమక్రమకథావిర్భూతమహిమలఁ
గోరి తెచ్చిన వెలుగోటి పేరు

గీ ॥ నీకు ముత్యాలపేరులై నిలిచె నౌర
మత్తరిపుమస్త విన్యస్త మణికిరీట
చారుకీర్తిపతంగ కస్తూరి రంగ
విభునిసత్పుత్ర యేచ పృథ్వీకళత్ర! 192

ఉ ॥ గొబ్బురి జగ్గరాజులొకకోటి మఱేఁబదికోట్లు మాకరా
జబ్బలు నూఱుకోట్లపయి నార్వురు రావెలవెంకులైన హ
న్నిబ్బరగండఁ డేచరధరణీశ్వరు ముందర నిల్వ శక్యమే
గబ్బులు గాక బెబ్బులి ముఖాముఖి మేకలు నిల్వనేర్చునే? 193

ఉ ॥ గబ్బిని నుండు నీ తరముగాదు రణస్థలి మాకరాజ, నీ
గబ్బితనంబు మాను మవకార్యము రావెల వెంకటాద్రి, యో
గొబ్బురి జగ్గరాజ! మనకుందగ దీ పగ యాచశౌరితో
బెబ్బులి డాసి మచ్చరము పేర్చుక పిన్నల కోర్వవచ్చునే? 194

ఉ ॥ ముప్పది వేల వీరభటముఖ్యులు దావుల పాప శౌరితో
ముప్పది యంచు నెంచ కతిమూర్ఛతఁ జేరిన రెండువేలతోఁ
జొప్పడ నిల్చి తీవు రణశూరత నీ ప్రతిమన్నెవాఁడు లేఁ
డప్ప బళీరె! రంగవసుధాధిపు నేచనృపాలశేఖరా! 195

సీ ॥ త్రొక్కించు గడివన్నెదుర్గముల్ హయముచే
ధిగధిగమని పెళ్లలెగయుచుండ
దరికొనఁజేయు నుద్దండవిరోధిరా
ణ్ణికరపట్టణవహ్ని నింగికెగయఁ
దలలు చెక్కాడు ప్రత్యర్థి రాజకుమార
వర్గముల్ దోర్గర్వవైఖరులను
బట్టించుఁజెఱపట్టి ధట్టించి రిపురాజ
కోటిని మిక్కిలి నీటు చూపు

గీ ॥ కాచు శరణన్న వారినిఁ బ్రోచుఁ దనదు
దండఁజేరిన యరిరాజమండలమును
మండలంబున రంగభూమండలేంద్రు
నేచభూపాలశౌరి దయావిహారి. 196

సీ ॥ పాఱువేఁటలు రాచబారులెల్లను నీకుఁ
బట్టుగొట్టెలు గదా పగఱకరులు
వీఁటితోఁటలు గదా మేటైనకోటలు
కాకులాఱాణాలమూఁకలెల్లఁ
బన్నన్ను లామన్నె పాళేలసొమ్ములు
నమ్మినకాఁపు లాకమ్మదొరలు
పెండ్లిండ్లుగా నీకు భీకరకదనముల్
ప్రతిన గదా రామరాయపట్ట

గీ ॥ మౌర! ముగురుదునేదారులయిన నిన్ను
నెదురఁ జాలరు యతిరాజు యెదురఁ గలఁడె
బాంధవుల నన్నదమ్ములఁ బాస చనియె
వరహితాచార! వెలుగోటిపురవిహార!
రంగధాత్రీశునేచధరాతలేంద్ర! 197



మ ॥ బెగడెన్ గల్మిలి సత్యవీడు వడిఁ గంపించెం బటాపంచలై
పగలం బాఱెను జెంజి మించి మధురాపర్యంతరాష్ట్రంబులన్
దిగులెత్తెన్ గడిదుర్గముల్ వణఁకె భీతిన్ జగ్గరాజాదిరా
చగముల్ రంగయయేచశౌరి కెదిరించన్ లేక పాఱెన్ గడున్. 198

## మల్కిభరామ్

ఈ తురుష్కప్రభువు క్రైస్తవ సం. 1550 తరువాత నాంధ్రదేశము నాక్రమించుకొని పరిపాలన మొనర్చినవాఁడు. ఈతని విజయముల నీ చాటువు చాటుచున్నది.

ఉ ॥ ధాటిగ నేఁగి యుద్ధగిరిఁ దార్కొని వేంకటరాజుఁ దోలి ముం
గోటల లగ్గపట్టి వినుకొండయు బెల్లముకొండ తంగెడల్
పాటిమెయిన్ హరించి మఱి బల్మిని గైకొనెఁ గొండవీడుఁ గ
ర్ణాటకరాజధాని యిభరాముఁడు బాహుబలంబు మీఱఁగన్. 199

ఈతని పేరు "ఇభరాంపట్టణ" మని నేఁటికిని బుఱమొకటి కలదు. తురుష్కుఁడైనను నీతఁడాంధ్రభాషయం దత్యంతాదరము కలవాఁడై యనే కాంధ్రకవులనాదరించి ధనమొసఁగి మిక్కిలి విఖ్యాతి సెందెను. పొన్నిగంటి తెలగనార్యుఁడను కవి యయాతిచరిత్రమను నచ్చతెల్గుప్రబంధమును, అద్దంకి గంగాధరకవి తపతీసంవరణోపాఖ్యానమును, నీతనికిఁ గృతులుగా నొసంగిరి. కవీశ్వరులగోష్ఠియందీతనికిఁ గుతూహలము మెండు. ఒకప్పుడు మల్కిభరామ్ ప్రభువు తన యాస్థానమునకుఁ బెమ్మసాని తిమ్మానాయని, అనంతపురపు హండెయప్పను, మట్ల అనంతరాజును, బంగారేచమనాయని, పేరమల్లా రెడ్డిని, వారివారి కవీశ్వరులతోఁబిలిపించి, వారిని బొగడిన పొగడ్తలు వినిపింప నాయా కవీశ్వరులఁ గోరెనఁట! ఆ కవీశ్వరులు చదివిన పొగడ్తపద్యములివి –

ఉ ॥ చాలు గుఱాలు మాళిగడిసంగడిరాజులు గొల్వరండహో
హాలహలోగ్రఫాలదహనాక్షునియంతటిధాటివాఁడు నా

యేలిక వేంకటాద్రిధరణీశునితిమ్మఁడు పెమ్మసాని భూ
పాలుఁడు హెచ్చు ధాత్రిఁగల పార్థివులెల్లరు లొచ్చు వానికిన్. 200

ఉ ॥ మట్టక రాఁడు బెట్టుతికి మన్నెకుమారులసీమ ధూళిగాఁ
గొట్టక మానఁడే కద యకుంఠితసింహతలాటరాయఁ డీ
పెట్టినదండుఁ దీఁడు రణభీష్ముఁడు హండియయప్ప శౌరికిన్
బెట్టుఁడు వేగ దండములు బింకము లేటికి శత్రుభూపతుల్! 201

ఉ ॥ కొద్దిని రాఁడు దిండుతికి కోటలుకొమ్మలు గొన్నశూరుఁడా
గద్దతిగబ్బిరాచపులి గండరబాలుఁడు మట్లనంతుఁ డే
ప్రొద్దును వైరిభూభుజులపొంకమడంపనె పుట్టినాఁడు మీ
పెద్దతికాలు సాగవిఁకఁ బ్రేలకుఁడీ గడిమన్నెభూపతుల్! 202

ఉ ॥ టెక్కునఁ గొండతోఁ దగరు డీకొని తాఁకినజోకగాక యీ
బిక్కపకీరుమన్నె సరిబేసిదొరల్ మొనలందు నిల్వనా!
నిక్కము బంగరేచనృప! నీవు రణస్థలి మోహరించినన్
బక్కున లోకముల్ పగిలి పాఱవె కూలవె దిగ్గజంబులున్. 203

చం ॥ బలరిపుభోగ కృష్ణనరపాలుని పేరకుమారమల్ల! మీ
కలితయశః ప్రభావములు కన్గొనలేకల కట్టుమన్నె మూఁ
కలు తలలొల్లరో బిరుదుగద్దియముల్ చదివించుకొందు రౌ
కొలఁది యెఱుంగనేరకల కుక్కలు చుక్కలఁజూచి కూయవే. 204

పేరమల్లారెడ్డి పొగడ్తకుఁదక్కినరాజులెల్లరు నాగ్రహభరితులై యుద్ధసన్నద్ధులయిరఁట! అంతట మల్కిభరామ్ ప్రభువు "ఈ పొగడ్తవలనఁ బొగడినవారికి న్యూనత యేర్పడును గాని మీ కేమియుఁగొఱఁత కల్గ"దని చెప్పి వారిని శాంతింపఁ జేసెనఁట!

ఈతనిపైఁ జెప్పఁబడిన చాటువులు –



సీ ॥ నవ్వెనా సంగీతనాదభేదవిధిజ్ఞ
ధీరాత్ములకుఁ బదినూఱులిచ్చు
రమ్మనెనా సభాప్రౌఢసత్కవివర
జాలములకుఁ బదివేలు నిచ్చు
కూర్చుండుమనియె నా గురతరశాస్త్రజ్ఞ
లక్షణవిదులకు లక్ష యిచ్చు
సాబాసురా యన్న సకలాశ్రితానేక
కోవిదులకు మెచ్చి కోటి యిచ్చు

గీ ॥ బళిర! చతురబ్ధిమేఖలా కలితధాత్రి
చక్రనిర్వక్రపాలనా చారుకీర్తి
రమ్యముక్తాతపత్రరారాజితుండు
చారుతరమూర్తి! యిభరాముచక్రవర్తి! 205

సీ ॥ కర్ణాటకాధీశు కంఠమాలికమీఁదఁ
గురురాజుముత్యాల గొడుగుమీఁద
వింధ్యదేశాధీశు వెల్లవల్వలమీఁద
గౌళేశువజ్రాల గద్దెమీఁద
పాంచాలభూమీశు పట్టుపల్లముమీఁద
బాండ్యభూపతి వెండిబరణిమీఁద
బంగాళజననాథు పాంచజన్యముమీఁద
గుకురేంద్రుధవళ గోళకముమీఁద

కీ ॥ ఆడిపాడించు నటియించు నవఘళించు
మెచ్చి కుప్పించుఁ గెరలించు మేబళించు
సంతసంబున నీ కీర్తి జలజనేత్ర
మానవోపేంద్ర! యిభరాము మండలేంద్ర! 206

ఉ ॥ రా యిటు భట్ట! యేమి కవిరత్నమ పిల్చితి, వీవి పద్యముల్
ఏ యవనీశుపై, నృపకులేశ్వరుఁడౌ నిభరాముశాహిపై,
నాయతపుణ్యమూర్తి యతఁడర్థులు వేఁడిన నిచ్చు, నిచ్చునా
వేయును రెండువేలు పదివేలును లక్షలుఁగోట్లు నిచ్చు, నౌ! 207

కవిత్వము నేర్చినవారికిఁగాని మల్కిభరామ్ ప్రభువు సమ్మానము మెండుగాఁ గావించుచుండెడివాఁడు కాఁడఁట! ఒకప్పుడు కవిత్వము నేరని చతురు లిర్వురు “కరయుగమును” “యరలవమదనస” యను కందపద్యములను దలలు మార్చి మల్కిభరాము ప్రభువునకన్వయించునట్లు చదివి పెద్దగా సమ్మానింపఁబడిరఁట.

కం ॥ కరయుగమును జరణంబులు
నురము లలాటస్థలంబు నున్నతభుజముల్
సరి ధరణి మోపి మ్రొక్కిరి
మఱి మఱి నీ శత్రులెల్ల మల్కిభరామా! 208

కం ॥ యరలవమదనస యనుచును
బరువడి నీ యక్షరములు భయనయతతులన్
నిరతమును వ్రాయనేర్చిరి
మఱిమఱి నీ పుత్రులెల్ల మల్కిభరామా! 209

ఉ ॥ ఏడు కులాద్రులెక్కి వెసనేడు పయోధులు దాఁటి లీలమై
నేడవు దీవులందిరిగి యేడుగడన్ విహరించి కీర్తి యీ
రేడు జగమ్ములన్ వెలయు నేచినమల్కిభరామచంద్రుఁడే
యేడవచక్రవర్తి పదునేడవరాజు ధరాతలమ్మునన్. 210

ఉ ॥ రాజును రాజుగాఁడతఁడు రాహుముఖంబునఁజిక్కె వాహినీ
రాజును రాజుగాఁడతఁడు రామశరాహతిఁదూలె, దేవతా
రాజును రాజుగాఁడతఁడు రావణసూతికి నోడె, నాజిలో
రాజన రాజు మల్కి యిభరాముఁడె రాజు ధరాతలంబునన్. 211



ఉ ॥ రాముఁడు దుక్కిముచ్చు రఘురాముఁడు క్రోఁతులరాజు, రేణుకా
రాముఁడు పోటుబంటు, పటురాగసమంచితుఁడైన గోపికా
రాముఁడు వెట్టిగొల్లఁడిఁక రాష్ట్రములందు సమానులేరయా
రాముల నెంచి చూడ నిభరామ మహీధవ! భవ్యవైభవా! 212

చ ॥ మలికిభ రామభూప! మహిమండలరాజకులప్రదీప! నీ
పలుకు శిలాక్షరంబితర పార్థివకోటుల పల్కులన్నియున్
జలలిపులెండమావులు ( ) బూడిదపొల్లు నీరుబు
గ్గలు వడగళ్ళు ( ) శారదమేఘజాలముల్ 213

ఉ ॥ రార విధాత! యోరి వినరా! తగురా! తలకొట్లమారి! ని
స్సారపులోభి రాజులను జంపక మల్కిభరామ భూవరున్
జారుయశోధనున్ సుగుణిఁ జంపితివర్థులకేమి దిక్కురా
చేరిక నింతరాజును సృజింపఁగ నీ తరమా వసుంధరన్. 214

## మైసూరి చిక్కదేవరాయలు

ఈతఁడు పదునేడవ శతాబ్దియందు మైసూరు ప్రభువై పేరెన్నికగన్న వాఁడు. ఈతని పేర సంస్కృతాంధ్ర కర్ణాట భాషలలోఁ గొన్ని గ్రంథములు రచింపఁబడినవి.

సీ ॥ స్వస్త్యస్తు విశ్వవిశ్వంభరాభరణైక
దక్షదక్షిణభుజాస్తంభ నీకు
విజయోస్తు నిర్వక్రవిక్రమక్రమకళా
పరిభూతవిద్విషత్పటల నీకు
మహనీయతాస్తు సామంతచూడారత్న
బిరుదాంగదస్ఫారచరణ నీకు
హర్షోఽస్తు పృథుశాశ్వతైశ్వర్యధూర్దుర్య
సౌందర్యధుర్యతాశ్చర్య నీకు

గీ ॥ వివిధవిభవోస్తు, సత్కీర్తివిజితరజత
తారకాదారతారకాదారవార
హారనీహారదివిషదాహార రుచిర
హార మైసూరి చికదేవధీర నీకు. 215

సీ ॥ శ్రీమించు జడదారి చికిలి డెందపుటాట
పట్టువాఁడపరంజి పట్టువాఁడు
తన భక్తులగు వారి తప్పులన్నియును మ
న్నించువాఁడనుకంప నించువాఁడు
తలఁచినఁ జాలుఁబాతకము లన్నియు రాచు
పేరువాఁడరదంపుఁ బేరువాఁడు
తఱచులెవ్వియులేక తానయై త్రైలోక్య
మేలువాఁడిందిర యేలువాఁడు

గీ ॥ రంగ రమణుఁడభంగసామ్రాజ్యలక్ష్మి
నొఁసగుఁ గాత నిజాంఘ్రిసారసమదాళి
పటలదరి వీరమకుటాగ్ర ఘటితదివిజ
రాజమణికిని జికదేవరాజమణికి. 216

సీ ॥ జంగమార్చనము భూషాయమాణ మహాభు
జంగమార్చనము నే జాణసేయు
చారదర్శనము సజ్జనశుద్ధమగుశివా
చారదర్శనము నే సరసుఁడెఱుగు
దేవమాన్యములు సంభావితాభోగ భూ
దేవ మాన్యములు నేధీరుఁ డొసఁగు
రణపరాక్రమము దుర్ధర ధరాధరవిదా
రణపరాక్రమము నేరాజు గాంచు



గీ ॥ అతఁడు పొగడొందు నెందు నుదగ్రనిజభు
జాగ్రజాగ్రసన్మహామండలాగ్రఖండి
తాగ్రహాగ్రహదుర్నిగ్రహారిహారి
పాలనవిహారి! చిక్కభూపాలశౌరి 217

సీ ॥ సిరిమించు...............
పఱపువాఁడొకఁడు నీ యొఱపువాఁడు
కళుకు బంగరుపట్టు గరుల సింగిణి కోపుఁ
బఱపువాఁడొకఁడు నీ యొఱపువాఁడు
కడలిరాయలతరంగముల చిందులు పొందు
పఱపువాఁడొకఁడు నీ యొఱపువాఁడు
నునుఁబూల రెండు నొందుగ సేయు విలువిద్య
పఱపువాఁడొకఁడు నీ యొఱపువాఁడు

గీ ॥ విక్రమవిభూతిగానవాగ్విలసనముల
నౌర! యాహవధీర! సాహసకుమార!
కోవిదవిధేయ హగలుగగ్గోలురాయ
రాజదేవేంద్ర! చికదేవరాజచంద్ర! 218

సీ ॥ కడఁగి వీరాధివీరుఁడు వచ్చెనని పూరి
గఱచువారును దారి మఱచువారు
హగలుగగ్గోలురాయఁడు వచ్చెనని చెట్లఁ
దారువారును గట్లఁజేరువారు
గడిమన్నెదొరల గండఁడు వచ్చెనని కూలి
పొరలువారును జాలినొరలువారు
ఘోరాజివిక్రమార్కుఁడు వచ్చెనని నీళ్ల
చొచ్చువారును గాళ్లుచచ్చువారు

గీ ॥ నగుచుఁ దా రెలగోల్ హళాహళికినళికి
పఱచు నిజబలమాజికిఁ బఱపలేక
పఱచె నిక్కే రిశివ్వభూవరుండయారె
రాజదేవేంద్ర శ్రీదేవరాయచంద్ర. 219

సీ ॥ డాసి ఢిల్లీకవాటములు వాటములయ్యె
గోలకొండకుఁ గొత్తళాలుబలిసె
తగ విజాపురినగడ్తలు పొగడ్తలుగాంచెఁ
గటకార్గళములు మిక్కుటములయ్యె
ప్రబలికల్బరిగవప్రములుదీప్రములయ్యె
నాగడా సుక్కడాలతిశయిల్లె
కొల్లూరు పలుదెఱంగుల పిరంగులఁ బొల్చె
బెదదకోటకురస్తు బెడిదమయ్యె.

గీ ॥ ఔర తొల్జగడాన నీవఱిమి తఱిమి
నిక్కునిక్కేరిశివ్వపనేని సరగ
విఱుగఁ బొడిచిన యావార్త విన్నవాఁడె
యాహవోపేంద్ర! దేవరాయక్షితీంద్ర. 220

మ ॥ కడిమిన్ మైసురిదేవరాయలకు రంగస్వామివెన్నాసగా
నడువన్ దండి నఖండచండిమపుఖండాల్వాని చాముండి యె
ల్లెడలన్ దోడును నీడయై నడువఁగా నిక్కేరిలండీలవం
గడపుం బ్రాపయినిల్చె నంతకుఁడహంకారంబు దానెట్టిదో. 221

సీ ॥ చూచినఁ జాలదా సుల్తాన్మహమ్మదు
పాదుశాయెదఁదాకు నీదుబాకు
ఎదిరినఁ జాలదా యిక్కేరిశివ్వప
నేనిపాలిటిమిత్తి నీదుకత్తి



కవసినఁజాలదా రవణించురాయదు
నేదారులకుమారి నీదుచూరి
మలసినఁజాలదా మధురతంజాపురీ
నేతలపై దూఱు నీదుబారు

గీ ॥ పరనృపతులెంత నీయంత దొరకు రాయ
భేరికాభూరికాహళాభీలమకర
మర్తుబాంకుశదోనేజమహితబిరుద
రాజదేవేంద్ర శ్రీదేవరాయచంద్ర. 222

ఉ ॥ మీజముదాడివాఁడి కడిమిం గడి మించిన దుండగీలఁ జెం
దేజముదాడి యొక్కురవడిన్ రవడించెదు మీకడింది ఖం
డాజగడంబు కవ్వడి కడంగెదు పెన్ జగడం బయారె నీ
తేజులుదేవరాయనృపతీ! జగతీతరుణీపురందరా. 223

మ ॥ కడిమిన్ మైసురి దేవరాయమణి ఖడ్గాఖడ్గిచేఁ బోరుబా
రిడినన్ డీకొని నిల్వలేక యిహిహీ యిక్కేరి శివ్వప్పనా
యఁడు దా నూడనిఁబాడెఁగా కటక కళ్యాణాగడాంబాగడా
గడవైరాగడశాగడాశహగడాఖానుల్ మదింగుందఁగన్. 223

మ.స్ర॥ గడిసీమల్ దేవరాయాగ్రణిఁగని బెగడుల్ గాంచుటేవింత వైరా
గడ రాడాలాహురాంబాగడశ హగడమఖ్ఖామహల్గోలకొండా
గడఢిల్లీమహురాసాగరకలుబరగీఖానవర్గంబు తద్దా
క్కడమాత్కారంబటంచున్ గడగడవడఁకున్ గర్జవిన్నప్పుడెల్లన్. 225

మ ॥ కలకాలంబరియైన శివ్వవసుధాకాంతుండు శ్రీరంగరా
యలఁజేపట్టక నేఁడు తా గెలుచునో యాచంద్రతారార్క మా
జలజాత ప్రభవాభవాదిసురపూజల్ గాంచు శ్రీరంగరా
యలు చేపట్టిన దేవరాయలకసాధ్యంబెద్దియుం గల్గునో? 226

మ ॥ గడిసీమల్ బెగడన్ విజాపురము వేఁగన్ గోలకొండన్ హడా
హడి పుట్టన్ గటకంబు డంబుచెడి(వ్రయ్యన్ జెంజితంజాపురుల్
వడఁ కందన్ మధురన్ మహాభయము పర్వ న్నీ బలంబాజికిన్
వెడలున్ డీకొనువారలేరి యిఁక నుర్విన్ దేవరాయాగ్రణీ! 227

చ ॥ గడగడ నన్యభూమి వడకఁన్ గడకన్నులఁ గెంపునింపు న
ల్గడగడిరాజులెల్ల నళుకం దళుకన్ జిగివాలుఁ బూనిపే
రడవుల రాతికోటులరయన్ నెరయందపుఁదేజి నెక్కు నీ
పుడమిని దేవరాయ నృపపుంగవుఁ డీఘనురాకయెట్టిదో 228

శా ॥ కట్టున్ మట్టునుమీఱు నగ్గలికలగ్గల్ పట్టియారోడ్డుతాఁ
గట్టల్కం జలపట్టి కట్టుకొని యక్కారెడ్డి చేపట్టఁగాఁ
బట్టెన్ బట్టినమాత్రమా కరుణచేఁ బాలించి లాలించి చే
పట్టెన్ మాయురె చిక్క దేవధరణీపాలుండు సామాన్యుడే! 239

మ ॥ ధరణీచక్రమవక్ర విక్రమము చేతన్ నేనె సాధించిభూ
సురులం బ్రోవనె పుట్టినాఁడ నిదె యంచున్ వామపాదంబునం
బిరుదుంబెండెము పెట్టినాఁడవఁట యెంతే మమ్ముఁబోషింప నీ
కరుదే మైసురిదేవరాయ నృపచంద్రా! సాంద్రతేజోనిధీ! 230

మ ॥ శ్రీరంగైక విహారి శౌరి భువనక్షేమంకరప్రాభవో
దారస్ఫార కృపాకటాక్షములచేత న్విశ్వవిశ్వంభరా
ధౌరంధర్యకళావిశేష విలసద్బాహార్గళుండైన మై
సూరి శ్రీచికదేవరాయలకు నిచ్చున్ శాశ్వతైశ్వర్యముల్. 231

సీ ॥ కురువిరాటవరాట కరహాటనృపజూట
తటకిరీటములపైఁ దాఁకితాఁకి
చోళ నేపాళ పాంచాల భూపాలవి
స్ఫాలఫాలములపై వ్రాలి వ్రాలి



యంగ గౌళ కళింగ వంగ బంగాళరా
డుత్తమాంగములపై నుటికి యుటికి
కుకుర కాశకరూశ కోసలక్ష్మాధీశ
మాంసలాంసములపై మలసిమలసి

గీ ॥ యెవ్వని భుజాసి జయలక్ష్మి నెసఁగియుండు
నతఁడు పొగడొందు నెందును నసమసమర
విస్ఫురమర చమూసమూహ సాహసధురా ప
రాజితనతారి చికదేవరాయశౌరి. 232

సీ ॥ కడఁగివైరాగడా గడగడాగడ పడం
తులపాపటలకు సింధూర రజము
గోలకొండబెడంద కోటవిజాపుర
స్త్రీలచన్నులకుఁ గాశ్మీర రసము
కటకకళ్యాణమక్ష్మావధూకబరీ భ
రములకుఁ జంపక ప్రసవసమితి
ఆముదానగర ఢిల్లీమహూరాపురాం
గనలమోవులకు లాక్షాద్రవంబు

గీ ॥ తానయై యుండు నేయశోధనుని తేజ
మతఁడు పొగడొందు నెందును నసమసమర
సాహసకళావిహారి దుస్సహవిరోధి
రాణ్మదవిదారి చికదేవరాయశౌరి. 233

సీ ॥ గడిదొరల్ గడగడ వడఁక నీరోడుపై
గగ్గోలుపడి కోట గట్టుకొనియె
దిక్కుదిక్కులవార్త కెక్కు నక్కారెడ్డి
నట్టిట్టుచేసి చేపట్టుపట్టె

తోడ్తోడ గంధసింధురసైంధవవ్రాత
ముడివోనికడిమిచే నొడిసితెచ్చె
శ్రీదేవితో జయశ్రీలెదుర్కొనుచు రాఁ
గీర్తి ప్రతాపవిస్ఫూర్తిఁ గాంచె

గీ ॥ ఔర కేతన పటపటాత్కార ధీర
కరటిఘీంకార పటహభాంకార వీర
వారహుంకార చాపటంకార ఘోర
రణవిఘటితారి చికదేవరాయశౌరి. 234

ఆ.వె. పంజరమున నుంచి పండ్లు చక్కెరలిచ్చి
మాటనేర్పి చిలుక మనుపునట్లు
నిం డ్లొసంగి ధనము లిచ్చి విద్యలు నేర్పి
ప్రోవు బుధులఁ జిక్క దేవవిభుఁడ. 235

లయ ॥ లిబ్బి విరిబోణిదయ గుబ్బతిలు సంపదల
నుబ్బు చికదేవవిభు నిబ్బరపుఁ తేజం
బబ్బురములైన తరిమబ్బులన పైఁబడదు
గబ్బితనపుందురుకబెబ్బులులబిబ్బీ
గుబ్బెతల తండముల సిబ్బెపు మిటారివగ
లబ్బు బిగిగుబ్బచను గుబ్బలులమీఁదన్
బొబ్బిలు మృగీమదపు గబ్బులు వెసందొలఁగ
ద్రొబ్బుచు దిగంతముల గెబ్బుచు మెలంగున్. 236

చ ॥ ఒకచెలి నొక్కచే వెనుక నుంచి కనుంగవ మూసిపట్టి వే
ఱొక కరమెత్తి కొమ్మనుచు నొక్క తెకుం గనుసన్నచేసిన
న్నొకపరిముద్దు వెట్టుకొన నొక్కతె వెంటనె వచ్చిమెచ్చెదా
నికిఁ జికదేవరాయలొకనేర్పున వంచనసేయకుండునే. 237



సీ ॥ నెనరుఁజూపులువాఁడిఁ దనరుతూపులుభక్తి
పరులపై నరులపైఁ బఱపువాఁడు
చుట్టుకైదువుఁ దమ్మిఁబుట్టునైదువునైజ
కరమున నురమునఁ గలుగువాఁడు
చందుఁగేరెడు తమ్మివిందుమీఱెడు శంఖ
రాజంబు తేజంబు గ్రాలువాఁడు
కెంపుపావలు విడియంపురేవలు నాత్మ
పదముల రదములఁ బరఁగువాఁడు.

గీ ॥ రంగరమణుఁ డభంగ సామ్రాజ్యలక్ష్మి
నొసగుఁగాత నిజాంఘ్రిసారసమదాళి
పటలదరివీర మకుటాగ్రఘటితదివిజ
రాజమణికిని జికదేవరాజమణికి. 238

సీ ॥ అరికాంతలముసుంగు తెరలఁదెంపరలాడి
కదుఁబొగడొందు జిష్ణుఁడవు నీవు
కళలచే విబుధలోకములకెంతయుఁ బ్రీతి
నెఱపఁజాలిన కళానిధివి నీవు
సర్వసర్వంసహాచక్రంబు జీవనా
కలనచే నలరించు ఘనుఁడవీవు
మహనీయముగ సర్వమంగళావాప్తిచేఁ
గరమొప్పురాజశేఖరుఁడ వీవు.

గీ ॥ అవుర! నృపమాత్రుఁడవె మహోదగ్రనిజభు
జాగ్రజాగ్రదనర్గళోగ్రాసిజప్ర
తాపతపన ప్రతాపితోద్దండరిపున్న
పాళి శ్రీ చిక్కదేవ భూపాలమౌళి. 239

మ ॥ అమృతంబానకయున్నఁ దద్రుచులపై నాసక్తియే కల్ల దా
యమృతంబానినమీఁద మానవశమా యాహా భవద్విస్ఫుర
త్కమనీయోక్తులు నట్లగాదె యిఁకమీఁదన్ గ్రోలకెట్లుందు నే
నిమిషంబేనియుఁ జిక్కదేవనృపతీ నిస్తంద్రసాంద్రద్యుతీ! 240

## కోటిరాయ రఘునాథరాయలు

ఈతఁడు పుదుక్కోటప్రభువు. పదునేడవ శతాబ్దివాఁడు. ఆంధ్రభాషార్ణవకర్త సుదురుపాటివెంగన యీతని యాస్థానకవి.

### తురంగపంచకము

సీ ॥ ఆ స్కందితాశుప్రహసి తాశుగోద్యత్తు
రంగమంబగు నీతురంగమంబు
ధౌరితకత్వరోద్ధతిధుతస్థావర
జంగమంబగు నీతురంగమంబు
రేచితోద్వేగాధరీకృతహరిభృద్వి
హంగమంబగు నీతురంగమంబు
వల్గితస్యదవినిర్భగ్న ఫణాధృభు
జంగమంబగు నీతురంగమంబు

గీ ॥ ప్లుత జవవినిర్జిత సురాశ్వవితతగమన
చంగమంబగు నీదు తురంగమంబు
కలితగుణపేటి! కవికోటికల్పవాటి
రాయరఘునాథ పంచణ ప్రభుకిరీటి. 241

సీ ॥ పుటములు ద్రొక్కెనా కుటిలారిరాజన్య
కోటికోటీరముల్ కుదియఁబడును
జోడెనల్ చూపెనా శూరవీరకఠోర
గందాంధసింధుర ఘటలుచదియు
చౌదాఁట్లు దాఁటెనా సామంతభూపాల
జవనకంఖాణముల్ స్రగ్గి మ్రొగ్గు
వేడెముల్ తిరిగెనా విమతులపురములు
గాలిచక్రమ్ముల కరణిఁదిరుగు



గీ ॥ బళిర రవగాలుఘటియింప భండనమున
వెడఁదయురములు బరులును విఱిగివిఱిగి
దొరఁగురిపుకోటి నీదెరాబిరదు కోటి
రాయరఘునాథ పంచణ ప్రభుకిరీటి. 242

సీ ॥ కదిలిక చూపెనా కక్కసంపదు నేల
గుండెలు కలఁగు గగ్గోలుగాను
దులదులనడచెనా దుర్దాంతసామంత
బలములగముల గర్భములు గలఁగు
పరువులువాఱెనా పరిపంధి నరపాల
చిత్తముల్ మెత్తనైతత్తళించు
కరకరినెదిరెనా గర్వితారాతిరాట్
ప్రాణంబులటునిటు పఱచివెఱచు

గీ ॥ దూఱి రణమున హదలికల్ మీఱఁగాను
ఖురపుటోద్ధతులదరంగఁ గొట్టిమెట్టఁ
దొరఁగె రిపుకోటి నీదెరా బిరుదు కోటి
రాయరఘునాథ పంచణ ప్రభుకిరీటి. 243

సీ ॥ సమరాన శాత్రవ సమితి శిరోజముల్
గసకస ఘాసమ్ము కరణి నమలి
కదనాన విమతుల కండలు గుండెలు
ఝుళఝుళ కబళమ్ము సరణిమెసఁగి
ప్రధనాన మార్తుఱ ప్రక్కలు డొక్కలు
కరకర ఖాణంబు వరుసమెక్కి
బవరానఁ బరరాజ వరుల రక్తంబులు
గళగళ జలముల గతిని గ్రోలి

గీ ॥ మెట్టి మర్దించి చుట్టుక మెదలనీక
గొట్టి గోరింప రణమున గుండెలవిసి
తొరఁగె రిపుకోటి నీదెరా బిరుదు కోటి 244
రాయరఘునాథ పంచణ ప్రభుకిరీటి.

సీ ॥ గర్వాంధపరిపంధి గంధసింధురముల
కొమ్ముకత్తుల మొనల్ కొట్టికొట్టి
చెనఁటిదునేదార్ల శిరముల గొగ్గీల
గొలుసులు వీడంగఁ గూల్చి కూల్చి
మూర్ఛారివీరులౌ ముసలిమానులమోము
ముక్కుదూలములూడ మోఁది మోఁది
ఘోరవజీమోటు జీరాల యుంగరాల్
చెదరి ఝుల్లసరాలఁ జెండి చెండి

గీ ॥ చీర తూఁటుచు ఖురములఁ జించి చించి
పేరెములువార బారువ పెంటలగుచుఁ
దొరఁగె రిపుకోటి నీదెరా బిరుదు కోటి
రాయరఘునాథ పంచణ ప్రభుకిరీటి. 245



## వెలుగోటివారు

చ ॥ కదనమె బొమ్మరిల్లు చెలికత్తెలు వీరజయాంగనామణుల్
మదకరిమస్తకుంభముల మాటికి దొంతులు సంగరస్థలిన్
గుదిగొని పద్దరాహుతుల క్రోపులు గుజ్జనగూళ్ళు బాపురే
పొదలెడు రాయరావు ననపోతయ ధర్మని ఖడ్గపుత్రికిన్. 246

ఉ ॥ మత్తుఁడుకూర్మరాజు విషమత్తుఁడు నాగవిభుండు మిక్కిలిన్
మత్తుఁడు సూకరాధిపుఁడు మత్తగజంబులు తిండిపోతు లీ
తొత్తడికాఁపురంబు తులఁదూఁగ దటంచును రత్నగర్భ నీ
పొత్తుల నీ భుజాబలము పొందెనపో యనపోతభూవరా. 247

శా ॥ ఏమీశేషుఁడ? ఏమినారద! ముకంబేపారునా? తొంటి వి
శ్రామంబేమియులే, దదేమి? నసిమీఱన్ రావుసింగాంకుఁడు
ద్దామప్రౌఢి జయింప సోమకులగోత్రాధీశ్వరుల్ జోగులై
భామల్ దామును బాములన్ వెదకఁగా బాతాళమున్ దూఱితిన్. 248

చ ॥ కుదురగ మిమ్ముఁ గొల్చి వెలుగోటిపురీంద్ర! కొమారతిమ్మ! నిన్
గదియఁగ నగ్రహారములు కైకొనఁజూతురు భూసురోత్తముల్
బెదరక నీకరాసిహతిఁ బెల్కురి వైరులు పోయి యూర్వశిన్
గదిసి కుచాగ్రహారములు కైకొనఁజూతురదేమి చిత్రమో! 249

ఉ ॥ రంగపనేనియబ్బనృపరత్నము గోపనృపాలు ధాటికిన్
సంగరరంగభూములను శాత్రవకోటులు నిల్వలేక సా
రంగముఖీలలామలను రాజ్యతురంగ కవీంద్ర సంపదల్
సంగతి నప్పనంబొసఁగి శైలములన్ విహరింతురెప్పుడున్. 250

మ ॥ తలఁపెల్లన్ హరిభక్తియుక్తి దినకృత్యంబెల్ల ధర్మక్రియల్
నిలువెల్లన్ దయ రూపమెల్లయెడలన్ నిర్గర్వమశ్రాంతమున్

గొలువెల్లన్ గవిగాయకాళి యితరక్షోణీశ్వరుల్ సాటియే
వెలుగోట్యన్వయనారసింహ సకలోర్వీనాథ రాయన్నకున్. 251

ఉ ॥ ఆలములోన సింగవసుధాధిపనందన? యన్నపోతభూ
పాలక! నీకునోడి యనిఁబాఱినవైరుల నాలభంగినే
తోలుదుగాని చంపవఁట దోసమటంచు నౌర! గాయగో
వాళుఁడవైన నీకుఁ బశువర్గముఁగాచుట నైజమేగదా! 252

క ॥ ఇనువెనుకయ గ్రహచక్రము
వినుతామరవర్గమెల్ల వెనకయవెనుకే
జనపతులు సాహసంబున
ననపోతనృపాల! నీకు నందఱు వెనుకే. 253

చ ॥ అగణితకీర్తిలోల! సుగుణాకర! దాచయవెన్నభూప! నీ
పగతుఱు కొండలెక్కఁ దమభామలకోమలదేహదీధితుల్
జిగిగొని నిండినన్ గుహలఁజీఁకటివాసినఁ దమ్ముఁగాంతురన్
దిగులునఁ గస్తురిన్ వెదకి తెత్తురు మేనల మెత్తనత్తఱిన్. 254

ఉ ॥ బల్లరగండ లింగవిభుపాదమునందుఁ బసిండియందె తా
ఘల్లురు ఘల్లుఘల్లురని ఘల్లని మ్రోయఁగ భీతిగుండియల్
ఝల్లురు ఝల్లుఝల్లురని ఝల్లన నల్లలనాడుచుందురా
యల్లయరెడ్డివేముడుఁను నాతని తమ్ముఁడు వీరభద్రుఁడున్. 255

క ॥ తమ్మతమకెంత ప్రియమో
తమ్మకుఁ జెయిసాఁచి రిపులు తలక్రిందై నీ
తమ్మపడిగాననుందురు
బొమ్మలక్రియ రావుదాచభూవరుసింగా! 256



ఉ ॥ ఈక్షితిఁ గాశికానగరి నీల్గినమాత్రలభించు నెంచఁగా
భిక్షపుఁగూడు యాచధరణీతలనాథవతంసు ఖడ్గధా
రాక్షతి మేనువీడిన యరాతికిఁగల్గు సుధారసంబు త
ద్భైక్షము మంచిదో యమృతపానము మంచిదొ యెంచిచూడఁగన్!257

మ ॥ అరుదౌ నీ బిరుదప్రతాపములు కల్యాణాద్రిపైనుండి కి
న్నరగంధర్వ సతుల్ సదా శ్రుతిపుటానందంబుగా బాడఁగా
దనరే! బాపు! బళీ! సెబా! సహహా! యౌరా! మే! లహెూ! యందు ర
య్యరివీరుల్ వెలుగోటి యాచవిభురంగా! సంగారక్ష్మార్జునా! 258

ఉ ॥ అంచిత రాయరావు బిరుదాంకమురాజులఁ గొట్టి యందెఁ గీ
లించిన మాదభూవిభుని లింగనృపాలున కొప్పుఁగాక గ
ర్వించిన నీకుఁజొప్పడునె వేమఱునల్లయ వేమరెడ్డి పో
కొంచపుఁదమ్మేతిండితిను కూళకు సింహతలాట మేటికిన్. 259

## పోలెపల్లి బుక్కరాయలు

సీ ॥ కొలువులో మీసాలు కొనలు దిద్దఁగవచ్చుఁ
జికిలిపేనాకత్తి చిమ్మవచ్చు
మేలైనయంగీలు మెఱిసితొడ్గగవచ్చు
సతులుచూడఁగ నెమ్మె సలుపవచ్చు
గరడిసాధనఁజూచి ఘాతసేయఁగవచ్చు
బిరుదులు చదువంగ బిగియవచ్చు
.................................................
......................................

గీ ॥ కాక యరి నని వ్రేయ సత్కవుల కీయ
నీవె నేర్తువు ధరలోన నేర్పు మెఱయఁ

బరమకళ్యాణ! నూతనపంచబాణ
భూనుతాటోప! తిమ్మయ బుక్కభూప! 260

సీ ॥ కలగుండ్లువడుఁబారు కన్పించుదుర్గాలు
కడఁగి భగ్గనవిచ్చు గండవిండ్లు
పెందూళిపైఁగప్పి భీతిల్లుఁగోటలు
కమలిభస్మంబులౌఁ గాననములు
చీకాకుపడు దొడ్డసింహాసనంబులు
హల్లకల్లోలమౌ నష్టదిశలు
గగ్గులకాడౌను గడిమన్నె భూములు
పంచబంగాళమౌఁ బట్టణములు

గీ ॥ గర్వదుర్వారభూపసంఘములలోన
మట్టిపడ్డట్టు నీధాటి పుట్టినపుడె
మన్నెశార్దూల! రిపుమన్నెమర్తజాల
భూనుతాటోప! తిమ్మయ బుక్కభూప! 261

సీ ॥ మత్తారిరాజన్య మకుటంబులనెకాని
పాదంబు చాఁపఁడు బలిమిమెఱసి
బిరుదాడురాజుల పేరురమ్మునెకాని
మన్నెబెబ్బులి బాకు మహి నిడండు
పచరించురిపురాజ పట్టణంబునె గాని
వాజినెక్కాడండు రాజసమున
కపటరాజ కఠోరకంఠరక్తమెకాని
యడిదంబుకడుగఁడాహవమునందు

గీ ॥ మన్నెమాత్రుండె గద్దరిమన్నె మాపు
మలయు బిత్తరిమన్నీల మగలమగఁడు



దండిమన్నీల వలపుల మిండగీఁడు
భోగసురరాజు తిమ్మయ బుక్కరాజు. 262

సీ ॥ అనిలో విఱిగివచ్చి యందల మెక్కునే
ముక్కు సెవుల్లేని మొండిగాక
పోరిలో గుఱ్ఱంబు పొలియించివచ్చునే
గుఱిచెడ్డగుఱ్ఱాల గోవుగాక
బవరంబునకుఁబోయి పతికివంచనచేసి
తొలఁగునే బణ్ణంగి దూఁబగాక
ఏలినపతిసొమ్ము నెల్లకాలము దిని
పారిపోనెంచునే పందగాక

గీ ॥ సమరతలమునఁ దమప్రాణసతులఁదలఁచి
సుఖముగోరునె జోగుల సుతుఁడు గాక
యనుచుగెల్వంగ నేర్తువౌ నాహవమున
భూనుతాటోప! తిమ్మయ బుక్కభూప! 263

## మట్లవారు

ఉ ॥ అక్కజమొప్పఁగా భుజపరాక్రమశక్తుల నెంచిచూచినన్
దిక్కులలోనఁ బోలిపలి తిమ్మయ బుక్కఁడు రాజు నాఁటికిన్
మక్కువదోర్బలంబునను మానవనాథులలోన నంతకు
న్నెక్కువ మట్లకోనధరణీశ్వరు నెల్లమరాజు నేఁటికిన్. 264

ఉ ॥ మాయురె! సద్గుణాభరణ మల్లకుమారయనంత శౌర్యధౌ
రేయుని నిన్ను నాజి నెదిరింపను శక్తులుగాక కైదువుల్
వేయని రాజులున్ శరణువేఁడనిమన్నె కొమాళ్ళు కానికల్
సేయనిశూర్లు మ్రొక్కనివజీర్లును లేరు వసుంధరాస్థలిన్. 265

ఉ ॥ వెండియు మట్లరాజు తిరువేంగళనాథుఁడు కందనోలికా
భండనభూమిలోఁ దురకబారులపైఁబడి సంహరింపఁగాఁ
గండలు కొండలయ్యె నెముకల్ ధరణీజములయ్యె నెత్తురుల్
గంధపుటేఱులయ్యెఁ దలకాయలు తారకలయ్యెఁ జూడగన్. 266

## అద్దంకి నృపాలురు

మ ॥ పదవే రంభ! సురేంద్రుకొల్వునకు, నప్పా! నాకు రాఁ దీరదే,
యదియేమే? ధర మందపాటి రఘునాథాధీశుబాహాసిచేఁ
గదనక్షోణిని నీల్గినట్టిరిపుసంఘాతంబు వే వచ్చెడున్,
వదిలేదెప్పుడు వచ్చుటెప్పుడు, చెలీ, వామాక్షి! వారెందఱే?
బదులున్నూఱులు వేలు లక్షలు గణింపన్ శక్యమే చెల్లెలా! 267

ఉ ॥ ఇంద్రుని సన్నిధానమున కేఁగె రణోజ్వలవిక్రమక్రియా
సాంద్రుఁడు మందపాటికులసాగర చంద్రుఁడు రామభద్రరా
జేంద్రుండు పార్థివాబ్ధమున నేకతఁగార్తికశుద్ధపూర్ణిమా
చంద్రదినాంతమందు రవి జారిన కైవడి మారుతాత్మజా! 268

## వత్సవాయవారు

ఉ ॥ తీరుగ వత్సవాయకులతిమ్మజగత్పతికీర్తిహార మా
హారశరద్ద్విజన్మకులిశాయుధజాతుల మించె శౌర్యమా
హారశరద్ద్విజన్మకులిశాయుధజాతుల మించె రూపమా
హారశరద్ద్విజన్మకులిశాయుధజాతుల మించె నిద్ధరన్ 269

ఉ ॥ రాజులరాజు లోభి యొకరాజులరాజతిమూర్ఖుఁడష్టది
గ్రాజులరాజు చోరుఁడు విరాజులరాజొక పక్షి తారకా
రాజులరాజు దోషి ఫణిరాజులరాజొకవక్రగామి యీ



రాజులు రాజులా సుగుణరాజులరాజవు నీవుగాక యో
రాజవతంస! వత్సవయ రాజమహీపతి? తిమ్మభూపతీ! 270

ఉ ॥ రాజు కళంకమూర్తి రతిరాజు శరీరవిహీనుఁ డంబికా
రాజు దిగంబరుండు మృగరాజు గుహాంతరసీమ నుండు వి
భ్రాజితపూసపాడ్విజయరామనృపాలుఁడు రాజుగాని యీ
రాజులు రాజులా పెనుతరాజులు గాక ధరాతలంబునన్. 271

* * *

ఉ ॥ ఆరయ వత్సవాయ తెలగాధిపనందన నారసింహ! మీ
ద్వారము గర్వితాహితవిదారము సత్కవిబంధురక్షణో
దారము సత్యశౌచనయధర్మ విచారము కామలోభివి
స్తారనివారమున్ సదుపచారము దైన్యనివారమారఁగన్. 272

క ॥ రాచర్క మఁనఁగ జందెపుఁ
బోఁచా మఱి రిపుల గెలిచి భూనుతకీర్తిన్
యాచకుల కియ్యఁగలుగుటె
రాచర్కము వత్సవాయరామనృపాలా! 273

మ ॥ ఇతఁడా రంగదభంగసంగరచమూహేతిచ్ఛటాపావకో
ద్ధతకీలాశలభాయమానరిపురాడ్దారాశ్రుధారానదీ
నతరంగిణ్యబలాసమాగమసమానందత్ప్రయోధిస్తుతా
యతశౌర్యోజ్జ్వలుఁడై నవత్సవయరాయక్ష్మావరుండీతఁడా! 274

మ ॥ మహినానందనృపాలు శ్రీవిజయరామస్వామివాల్సోకి నూ
ర్దిహుసేన్ ఖానునిమస్తకంబనిమొనన్ రెండయ్యె రెండయ్యె న
వ్యహరిద్ఘోటకమండలంబపుడు రంభాకంచుకగ్రంథియున్
రహి రెండయ్యె జనానులాపమునకున్ దప్పేదిద్రేఁటాఅనన్. 275

ఉ॥ తేఁకువతోడ వత్సవయతిమ్మజగత్పతిప్రాపుసేరితిన్
రాకు దరిద్రమా యిఁక బరాకుననైన గిరాకునైన నీ
పోకలు సాగవింక జెడిపోవక మాపగవారిఁజేరుమా
దీకొనివచ్చితేని నినుఁ దిట్టక కొట్టక మాననిమ్మహిన్. 276

క॥ డాబాలోఁ గూర్చున్నాఁ
డేబాలుఁడు ముద్దుగుమ్మ యెవ్వరె చెపుమా
చాబాషు నీవదెఱుఁగవె
బాబాజీ బుచ్చితిమ్మబహదరె చెలియా! 277

## పూసపాటివారు

ఉ॥ ఆయతకీర్తి సజ్జనకులాగ్రణి మాధవవర్మ చింతలం
గాయలుకోసి యమ్ముకొను కట్టెలగుండతనూజుఁచావుకై
శ్రీయుతుఁడైన పుత్రు తలచేతికినిచ్చె బెజాడపాడె నా (?)
పాయక నిల్చె వార్ధిశశిబాణశకాబ్దములైనకాలముల్. 278

ఉ॥ కట్టెలగుండి... కట్టెదురన్ దనపట్టిఁ దెచ్చి య
ప్పట్టునఁ జంపిఁ చిత్రమని భర్గుఁడు మెచ్చి సువర్ణవృష్టియ
పృట్టణభూమిలోఁ గురియఁ బంచెను మాధవవర్మ పాడి పెం
పెట్టిదొ యంచు నింద్రుసభఁ బేర్కొనిరప్పుడు దేవసంఘముల్. 279

సీ॥ చినుకుకుఁ జినుకెత్తు కనకంపువర్షంబు
నేరాజు కురిపించె నేడుగడెలు
దురితవిదూరుఁడై దుర్గజగన్నాథు
మెప్పించె నేరాజు మేదినందు
గరువంబునకు బోయవరుఁ బన్ని శిశు
తనశిశుఁ జంపెను........



చతురంగబలములు శక్తితో సంధించి
పగతుఱ నేరాజు పరపినాఁడు

గీ॥ భానువంశ్యుండు సహకారబాంధవుండు
ధర్మపాలుండు తమ తాతతండ్రి
పొసఁగ నెవ్వారు నీపాటి పూసపాటి
రాజకులదీప! ఉద్దండరాచమా! 280

చ॥ ఎనిమిదివేలదోరగలయేనుఁగులున్ వడి నేలద్రొక్కి త్రొ
క్కనిదశలక్షవాజులును గాలుఁడు పోని ... ... ...
ఎనయఁగ దుర్గయిచ్చె ధనమిద్ధధనంజయభీకరాంకుకున్
మనుజవరేణ్యతంబరగు మాధవవర్మకు గారవంబునన్. 281

సీ॥ మత్తఖండాపూని మ్రాకులు తెగమొత్తి
ముఝురియుమన్నీలకు మిండగీఁడు
పూని గంతులువేసి బోరున నార్చియు
ముఱియుమన్నీలకు మూఁకవిప్పు
కోపించి నడివీథి గుఱ్ఱంబు దట్టించి
వదరుమన్నీలకు వలపువిటుఁడు
వనితలముందఱ వన్నెలు పెట్టుక
నిక్కుమన్నీలకు నెత్తిపిడుగు

గీ॥ అనుచు నర్థులు దిక్కుల నభినుతింప
వీరవిక్రమవిఖ్యాతి వెలసి తౌర
మన్నెసుల్తాన శాత్రవమానభంగ
వినుతనారాచ! చినతిమ్మవిభునిరాచ! 282

సీ ॥ మనసు లొంగని వైరిమన్నె పేరంటాండ్రఁ
గదనాన గర్భాలు కలఁగమోదుఁ
గంటగించెడు మన్నెకొంటె భూపతులాండ్ర
వెస నర్థికోటికి వెచ్చ పెట్టు
లజ్జాభిమానంబు లుజ్జగించెదుమన్నె
కూటలంజెలచుంచు కోసివేయుఁ
దొడరిన రిపుమన్నె దుక్కి టెద్దులఁ గాంచి
కరకరినదలించి కసవుమేపుఁ

గీ ॥ జెడుగుగుల్లాపుమన్నీలఁ జెండియాడు
విధవగుల్లాపుమన్నీల వెన్నుఁజఱచు
భూనుతాటోప గుణపేటి పూసపాటి
రాచవిభుతమ్మ! ఉద్దండరాచమావ! 283

క ॥ కరకరి తమ్మయరాచం
దఱిముఱి తురగంబునెక్కి యాజిఁగృపాణిన్
బఱవళ్ల విడిచినంతనె
మొఱవెళ్లు నరాతిరాజ ముఖ్యులవీళ్లన్. 284

క ॥ మన్నెసులతానుబిరుదం
బెన్నఁగ గజరాజువీట నెన్నఁగఁ దామున్
మన్నీల మనుచు వచ్చినఁ
దన్నును నీగొడుగువాఁడు తమ్మయరాచా! 285

సీ ॥ హేమాచలముదాఁక నేకఛత్రంబుగా
భువియేలె మీతాత బుద్ధవర్మ
మీతాత కురియించె మెఱసి మాధవవర్మ
గరిమతో బెజవాఁడ గనకవృష్టి



పాండ్య కేక యచోళ పరవీరబలముల
డెగటార్చె మీతాత దేవవర్మ
పిడుగుముత్తియముగా వడినేసె మీ తాత
భీకరంబుగఁ జికభీమనృపతి

గీ ॥ చండవిక్రమ! ఘనవంశజలధిచంద్ర
బాపు! నగధీర రణరంగభైరవాంక
పొసగ నెవ్వారు నీ సాటిపూసపాటి
రాచవిభుతమ్మ! ఉద్దండరాచమావ! 286

మ ॥ అతిశౌర్యుండగు పూసపాటికులరాచాధీశు తమ్మయ్యకు
న్నతిగావించుచు నాశ్రయింతురిల వర్ణాటీ వరిచ్ఛేదికా
కితకోటప్రభులాత్మబాంధవతనో గెల్వంగలేకో మహా
చతురుండంచునొ ఖద్విపాగ్నిశశభృచ్ఛాకాబ్దకాలంబులన్. 287

ఉ ॥ కొందఱురాజు లప్పనము గొమ్మని యియ్యఁగ బంధువర్గమై
కొందఱు గొల్వఁ బేర్నుడివి కొందఱు మ్రొక్కగ నూడిగంబులన్
ముందటఁ గొందఱుం బిరుదు మ్రోవఁగ రాజుల పూజలింగమై
యందున మించె రాచమనుజాధిపుతమ్మన రాజమాత్రుఁడే ।! 288

## జూపల్లివారు

సీ ॥ చటులశాత్రవకోటిఁ జక్కుగా నఱకవే
పిలిచి బిడ్డలపేర్లు పెట్టకున్న
మత్తారిసంఘంబు మట్టిమల్లాడవే
పరతెంచి పదములఁ బడకయున్న
చెనఁటివిరోధులఁ జించిచెండాడవే
యెలమితోఁ గానుకలియ్యకున్న

గబ్బివైరులఁబట్టి కసవు దిన్పింపవే
వేవేగ శరణంబుఁ వేఁడకున్న

గీ ॥ గండభేరుండగండరగండబిరుద
గురుతరోద్దండ పులియమార్కోలుగండ
శుభకరాకార కొండభూవిభుకొమార
దీపితాటోప! జూపలితిమ్మభూప! 289

(ఈ కొండమనేడే రావుసింగమనేనియన్న మనేనిబావ)

సీ ॥ రభసంబుతో వైరిరాజన్యపక్షులఁ
గొట్టుతెక్కలఁ జాపచుట్టుగాను
చటులారివరవీరచక్రవాకంబులఁ
జించు గోళ్ళను బటాపంచగాను
కపటశాత్రవ విహంగమకోటి శిరసులు
చెండు ముక్కున గంతతుండెములుగ
ఘోరవిద్వేషిశకుంతమాంసంబులు
భక్షించు వేడ్కతోఁ గుక్షినిండ

గీ ॥ అవుర నీగండభేరుండ మహరహంబు
తివిరి యీరీతివిహరించు దిక్కులందు
శుభకరాకర కొండభూవిభుకుమార!
దీపితాటోప! జూపల్లి తిమ్మ భూప! 290

సీ ॥ బిరుసైన నీ గండభేరుండ బిరుదంబు
తమదన్నవాఁడు నీతమ్ముదిండి
పెంపైననీ గండభేరుండబిరుదంబు
పెట్టెదువాఁడు నీణెస్తవాఁడు



తీరైన నీ గండభేరుండబిరుదంబు
గుఱిఁబూనువాఁడు నీ గొడుగువాఁడు
పేరైన నీ గండభేరుండబిరుదంబు
కోరెదువాఁడు నీకుంచెవాఁడు

గీ ॥ మండలంబున గండభేరుండ బిరుదు
నీకె తగుఁగాక దూబమన్నీల కేల
భవ్యచారిత్ర! కొండభూపాలపుత్ర!
దీపితాటోప! జూపల్లితిమ్మభూప! 291

ఉ ॥ మండితకీర్తి మీఱి జయమాఘచతుర్దశినాఁడు గండభే
రుండముఁదీసి క్రిందుపడి రూఢిని వెల్లకిరాయఁ దద్దిరా
కొండయతిమ్మనిన్ శరణుగోరెను జూపలివంశచంద్రు ని
మ్మండలమందుఁ గొండపలిమాన్యులు సాక్షిగన గృష్ణసాక్షిగన్. 292

క ॥ గండభేరుండబిరుదు
కొండయతిమ్మక్షితీశుకును భూషణమై
యుండెె నల కనకశైలము
కొండుక పరిపంధిచాపగుడిసెలఁ గలదే. 293

క ॥ కొలువక యిచ్చుట త్యాగము
కొలిపించుట యిచ్చుటెల్లఁ గూలిప నింతే
కొలువునకుఁ బసర మీదా
పొలుపుగ జూపల్లి కొండభూవరుతిమ్మా! 294

క ॥ కొండపలిబయల బిరుదులు
నిండినవేడుకలఁ బెట్టి నీ కెదిరించే
లండీలఁ బట్టి ముక్కులు
చండుదువచ్చోటఁ గొండజనవరుతిమ్మా! 295

సీ ॥ కొండంతభుజశక్తిఁ గొండలు సాధించి
యవలీల గడికోటలాక్రమించి
పాడుపల్లెలు మేటిపట్టణంబులు చేసి
ఘనతటాకములనేకములు నిల్పి
బహుధనంబులు పెట్టి బావులు త్రవ్వించి
బాపల పెండిండ్లు పరగఁజేసి
భరతకట్టడఁ బ్రజాపాలనం బొనరించి
మలయుశాత్రవకోటి మదమడంచి

గీ ॥ భరితసత్కీర్తిచేత భూభారమెల్ల
నేలుచున్నాఁడు మఱియును నేలఁగలఁడు
బలిమిఁ గనుపట్టి రామభూపాలుపట్టి
శ్రీవిశాలుండు జూపలిచెన్నఘనుఁడు. 296

క ॥ ఏరువ సింహాసనమున
కేరీపాలింప రాజులిల సత్త్వమునన్
నేరుపునఁగలిమిబలిమిని
శూరత నిన్నెన్ని యెన్న జూపలిచెన్నా! 297

క ॥ అడపాలు కుంచెలరిగెలు
ముడిచెడఁగాఁ జింతకుంటముత్తఁడుచన్నీ?
తడఁబడుచు వేసి పాఱఁగ
సుడివడఁగా నొడిచితౌర జూపలిసింగా! 298

ప ॥ శుభచరితాంగ లింగవిభుజూపలికొండలరాయభూప యా
రభటిని వైరిభూపులు దురంబున నిల్చియు నీధమామి దా
గుభులు గుభుల్లటంచు వడిఘూర్ణిల మ్రోవఁగ వారిగుండియల్
గుభులు గుభుల్లటంచు వడి ఘూర్ణిలమ్రోవనగుం బ్రతిధ్వనుల్!299



చ ॥ అరిబలభేది లింగవసుధాధిపుకొండలరాయచంద్ర సం
గరమున నిన్ను మార్కొనినగర్వితరాజకుమారకోటిభీ
కరముగ నీకరాసిఁదెగి క్రందుగ నా దివికేఁగునత్తఱిన్
సరసిజమిత్రమండలము జంతిగబిళ్లతెఱంగు దాల్చదే! 300

ఉ ॥ కొండనృపాలుపౌత్త్ర నయకోవిద భోగజయంత లింగభూ
మండలనాయకేంద్రునికొమార దయాకర నూత్న పుష్పకో
దండసమానరూప నిరంతరంబును నిన్నును బ్రస్తుతింతురా
కొండలారయ వైరినృపకుంజర జూపలిశాసనోత్తమా! 301

ఉ ॥ మండువపండువాద్రవిళమాలవమత్స్యవిదేహకాశభూ
మండలరాజమధ్యమున మచ్చిక నెంతురు నిన్ను గండభే
రుండపద ప్రచండుఁడని రూఢిగ నర్థులు జువ్వికాండమా
కొండలరాయనిన్ సుకవికోవిదరాయనిఁ బ్రస్తుతించెదన్. 302

సీ ॥ కలితధర్మజ్ఞానఖని ధర్మజుఁడు గాని
పరభయంకరభుజాబలము లేదు
పరభయంకరభుజాబలుఁడు భీముఁడుగాని
వివిధాస్త్రశస్త్రకోవిదతలేదు.
వివిధాస్త్రశస్త్రకోవిదుఁడర్జునుఁడు గాని
సతతదానకళాభిరతియు లేదు
సతతదానకళాభిరతుఁడు కర్ణుడు గాని
వరవంశసంగతత్వంబు లేదు

గీ ॥ అనుచు ధర్మజభీమార్జునార్కసుతులఁ
బరిహసింతువు ఘనధర్మబాహుసత్త్వ
శస్త్రపటిమ వితీర్ణబాస్వత్కులముల
గురుతరాటోప! జూపల్లిగోపభూప! 303

సీ ॥ శ్రీకీర్తి రస్తు సంచితగండభేరుండ
బ్రహ్మాయు కరావాలభైరవుండ
అభివృద్ధి రస్తు రాహత్తుమువ్వరగండ
శుభమస్తు రాదివి (విళ?) చూఱకార
కుశలంబు దుష్టగోకులమానమర్దన
కటకహన్ని బ్బరగండబిరుద
శత్రుక్షయోస్తు చేశ్వభక్తిపారీణ
భద్రంబు నీకు విప్పర్లగోత్ర

గీ ॥ ఆయురారోగ్య ముత్తమనాయకేంద్ర
అవుర సంకల్పసిద్ధి నీ కనుదినంబు
వైభవాకార! అప్పయ్యవరకుమార
రాజదేవేంద్ర! జూపల్లి రామచంద్ర! 304

## సాయపనేని వారు

సీ ॥ అదిగొ సాయపనేని యారట్ట ఘోట్టాణ
ధాటికా ఘోటికాదళితరజము
ఇదిగొ సయ్యన ధీరహేలాధమామికా
ధాంధణధాంధణధ్వనితరవము
అదె నచ్చెఁ జినవేంకటాద్రినాయకసింహ
బలుఁడు బాహాబలప్రౌఢిశాలి
అదె లగ్గపట్టించె నెట్టణ పలికొండ
ఘనదుర్గభటజనుల్ కదువడంకఁ

గీ ॥ గినిసి మన్నీలు చూడంగ మొననిశాని
గరిమ నడపించి పలికొండఁ గట్టితౌర



సమదహంవీరనిశ్శంకసార్వభౌమ
ధీరదేవేంద్ర! వేంకటాద్రిక్షితీంద్ర! 305

## పెమ్మసానివారు

సీ ॥ జూటూరి ముండర శూరత్వమేర్పడ
రణభూమిలో సల్కరాజుగెల్చి
కోరి బేతముచెర్ల కోట ధూళిగఁజేసి
చింతగుంట్రఘుపతిపంతమణఁచి
బెడగంటికయ్యాన భీకరంబుగ నీవు
వెండియు సల్కని విరుగఁదోలి
సాహసుండైనట్టిసహజియ్యఖానుని
నదలించి యాదవ నంతలోన

గీ ॥ త్రిమ్మ రైనట్టిసల్క యతిమ్మవిభునిఁ
ద్రుంచి రాయలఁబట్టాన నుంచితౌర
పృథుల గెల్పుల సురధాణి పెమ్మసాని
చన్నవిభురామలింగ! తేజఃపతంగ! 306

సీ ॥ మేలిమితేజీలు డాలుడమామిలు
చికిరేలగోరీలు సింగిణీలు
ఖబ్బాయిధట్టీలు కపురంపుసురటీలు
తులతేనినైజాలు తోదుమీలు
చాఁకట్లజల్లులు జవ్వాదిపిల్లులు
తెలివిముత్తెపుఁ బేర్లు బలుగుడార్లు
పన్నీటిచెంబులు పైడికేడెంబులు
నందలంబులు జరాచాందవములు

గీ॥ కొల్లగొనివచ్చె నీమూఁక కొంకులేక
క్షితిఁ బ్రణుతధర్మమృదుతరచేలభర్మ
సిద్ధగజకర్మ పెనుసానిచిన్నతిమ్మ
వితరణగుణేంద్ర, భోగనిర్జితసురేంద్ర! 307

సీ॥ అభయంబొసంగుము హత్తుమువ్వరగండ
కావుము వాఁడిచేకండబిరుద
క్రోధింపకుము గండికోటదుర్గాధ్యక్ష
కరుణించు గండరగండబిరుద
రక్షించు గరుడ నారాయణాంకవిహార
మనుపుము శాత్రవమదవిఫాల
నిగ్రహింపకుము హన్నిబ్బరగండ చే
పట్టు గండరసూర్యభద్రచిహ్న

గీ॥ అనుచు నీచేతి హేతికి నదరి రిపులు
శరణుఁ బొందిరి భవదీయచరణములకు
ధీర పెమసాని యక్క పార్థివకుమార
భోగదేవేంద్ర! చినతిమ్మ భూపచంద్ర! 308

సీ॥ వేలసంఖ్యలుగదా వినుతింప నీయీవి
స్థిరసత్యసల్లాప తిమ్మభూప
తనరు వజ్రీలమీఁదనె కదా నీధాటి
ధీరతరాటోప తిమ్మభూప!
మన్నెరాజులు కదా నిన్నుఁగొల్చినవారు
దేవేంద్ర సమరూప తిమ్మభూప
రాయదేవుఁడె కదా రహిమించు నీకొల్వు
కమ్మవంశసుదీప తిమ్మభూవ!



గీ॥ ఎంతమన్నీఁడ వౌరౌర యెంచిచూడ
గండరాదిత్య ముఖ్య ప్రచండబిరుద
భీకరాహవసేనాని! పెమ్మసాని
యక్క భూపాల చినతిమ్మ యలఘుధర్మ! 309

సీ॥ రమణ మీ పెదతండ్రి రామలింగవిభుండు
ముగురువజీర్లను మొక్కపఱిచె
మీతండ్రి పెదతిమ్మ భూతలాధ్యక్షుండు
దస్తూరిఖానుని మస్తణంచె
మీయన్న బళి చిన్ననాయకేంద్రుఁడు మస్త
ఖానుని బలము చీకాకుపఱిచె
అది విచారించి నీవశ్వరాయని బల
మడఁచవే జమ్ములమడుఁగు బయల

గీ॥ అహహ నీ గెల్పు నెన్నంగ నవనిలోనఁ
దరమె శేషునికైన ముష్కరతురుష్క
మస్తకన్యస్త చరణ సమస్త శస్త
నవబిరుదసింహ పెమసాని నారసింహ. 310

## తిమ్మయ బుక్కరాజు

సీ॥ పరవీరనరపాలశిరములు పొక్కిళ్లు
భద్రేభకుంభముల్ భాండసమితి
లలిత ప్రతాపానలంబగ్నికీలలు
కపటారిశల్యముల్ కాష్ఠసమితి
కడికండలై యుండు తురగాలుఖజ్జాలు
నిబిడారిసతుల కన్నీరుజలము

కుటిలారిమాంసంబు కూళ్లనుగూరలు
ప్రత్యర్థిరక్తంబు పానకంబు

గీ ॥ ఇన్నియునుగూర్చి సమరోర్వి నిష్ఠమహిమ
నామెతలు పెట్టి భూతాళికర్పితముగ.
బ్రేమదళుకొత్త జయకాంత పెండ్లిగోరు
భోగసురరాజు తిమ్మయబుక్కరాజు. 311

## శాకమూరివారు

సీ ॥ శ్రీమించుమన్నియ శేఖరాధిపవర్య
శౌర్యగాంగేయ సౌందర్యమదన
సమదారిగజసింహ సర్వజ్ఞత్రిపురారి
పరశత్రుభేదన పరశురామ
సత్యహరిశ్చంద్ర నిత్యవైభవసాంద్ర
మానదుర్యోధన దానకర్ణ
పాకారిసమభోగ భానుసన్నిభతేజ
అద్రిధైర్య.... మానభద్రమూర్తి.

గీ ॥ నిన్ను వర్ణింపఁగవులకు నేర్పు గలదె
శాకమూరన్వయాంబోధిశర్వరీశ
ధాటిరఘునాయక ప్రభుమేటితనయ
వైరిజిద్రంహ! వేంకటనారసింహ. 312

సీ ॥ దర్పితాహితరాజ దర్వీకరాళికిఁ
బరగఁబక్షిరథాధిభర్తయయ్యె
ప్రత్యర్థినరపాల భద్రేభసమితికి
సంహారవిక్రమ సింహమయ్యె



ధీరవైరికుమార త్రిపురసంఘమునకు
రౌద్రవీరావేశ రుద్రుఁడయ్యె
కుటిలారిపృథ్వీశకుల మేఘపటలికిఁ
బ్రళయకాలాభీలపవనుఁడయ్యె

గీ ॥ నీ ప్రతాపంబు వర్ణింపనెవరితరము
శాకమూరన్వయాంభోధి చంద్రబింబ
ధాటిరఘునాయకప్రభుమేటితనయ
వైరిజిద్రంహ! వేంకటనారసింహ. 313

సీ ॥ ప్రత్యర్థిమత్తేభ పంక్తికి మృగరాజు
పరసర్పవితతికిఁ బక్షిరాజు
శాత్రవనీహారచయముకు దినరాజు
అహితగోత్రాళికి నమరరాజు
దర్పితాహితపద్మ దళములకుదురాజు
నభియాతిఘనులకు ననిలరాజు
పరిపంథిమారుతప్రతతికి నహిరాజు
నరివనంబులకు దావాగ్నిరాజు

గీ ॥ అనుచు విమతులు నీధాటి నదరి బెదరి
యణఁగియుందురు శాకమూరన్వయేశ
గురుగుణోదార రఘునాయకులకుమార
వైరిజిద్రంహ! వేంకటనారసింహ 314

సీ ॥ శరజన్మ భార్గవ శతమన్యు సుత భీష్మ
రాఘవద్రోణులరణజయంబు
ఖచరమేఘ బలీంద్ర కల్పద్రుమదధీచి
విషజాప్తసూనుల వితరణంబు

నలిననాయక రంతి నలకూబర వసంత
శక్రాత్మ జాతుల చక్కదనము
బలరామ శంకర పద్మాది దుగ్ధాబ్ధి
వాణి తారాద్రులవరయశంబు

గీ ॥ ప్రబలె నీయందు సత్కవుల్ ప్రస్తుతింప
శాకమూరాన్వయాంభోధి చంద్రబింబ
ధాటి రఘునాథనాయకు మేటితనయ
వైరిజిద్రంహ వెంకటనారసింహ. 315

## మేదరమెట్లవారు

సీ ॥ కాల్బలంబులమీఁద ఖడ్గంబు వైవఁడు
రాయరాహుత్తుల వేయుఁగాని
రూఢికెక్కిన హయారూఢుల డాయఁడు
వీరసాహసులను డాయుఁగాని
వెన్నిచ్చిపఱచుబూవిభుల వెంటాడించఁ
డెదిరించురిపులపైనెక్కుఁగాని
సామాన్యయోధుల సరకు సేయండాజి
మించునెక్కుడుకాంద్ర డించుఁగాని

గీ ॥ వెఱచి పఱచినఁ గసువులు కఱచి మఱచి
గట్టులెక్కిన నరచినఁ గాచు రిపుల
బళిరె మేదరమెట్లయౌబళసుతుండు
మన్నెమాత్రుండె నరసనక్ష్మావిభుండు. 316

సీ ॥ బాహాబలాటోప పటుగర్వముల మించు
కూటువమన్నీల గుండెదిగులు



ఆహవక్షోణిలో నరిసేనఁ బొడఁగని
పాఱెడు మన్నెభూపతులవిటుఁడు
పలుకుపంతములొక్కభంగిగా మెలగక
యదరెడికొదమనాయఁకులమగఁడు
పొడవనిపోటును నిడనిత్యాగంబునై
యిలనొప్పుమన్నీల యింటి భర్త.

గీ ॥ అతఁడు పువునూరిభువన విఖ్యాతయశుఁడు
అతఁడు గజపతిరాజసాహాయ్యకర్త
అతఁడు సుల్తానగర్వసర్వాపహర్త
నారసింహుఁడు మేదరనరసవిభుఁడు. 317

సీ ॥ గజపతిమన్నీఁడు కమలాక్షి! యితఁడఁటే
సఖి రాజవేశ్యాభుజంగుఁ డితఁడె
గోమలి! కోటలగొంగ యీతండఁటే
కాంత! రాచూరిదుర్గాపహురుఁడె
నారి! యీతఁడు పువునూరిసింహంబటే
అలివేణి! కొదమనాయకుఁడితండె
చెలియరో! సురుమాయిచిహ్నమీతండఁటే
అతివ! గగ్గోలురాయాంకుఁడితఁడె

గీ ॥ అనుచుఁ బౌరాంగనలు మహాహర్షమొదవ
నొండొరుల హెచ్చరింపుచు నుందురహహ
బళిర మేదరమెట్ల అయ్యలకుమార
మన్నెదేవేంద్ర! నరిసంహమండలేంద్ర! 318

క ॥ కంటకపురిపులఁ బొడఁగని
గెంటుచు వెన్నిచ్చి పోక కినిసినయపుడే

బంట్రైనవానికెల్లను
కంట్రై నిలిచేది వరుసకదరయ నరసా! 319

సీ ॥ మాటాడితప్పెడిమన్నీల నేవేఁడ
భట్టునెర్గని లోభిపందఁ బొగడ
వెన్నిచ్చుమన్నీని వినుతిసేయఁగ నొల్ల
కొలువెఱుంగనిమడ్డెఁ గొలువ నొల్ల
ప్రజ్ఞమీఱనిమన్నె బజగెల్లఁ బ్రణుతింప
నీతిచాలనిమన్నెనీచునొల్ల
పరువెఱుంగని మన్నెవానిఁ గన్నులఁ జూడ
మహిని దుర్మన్నియ మాటనెంచ

గీ ॥ నిన్ను నీవంటిమన్నీల నెంతుఁగాని
ఆహవోద్దండ కొదమనాయఁకులగండ
వనధిగంభీర! అయ్యలవరకుమార
మేటిరణరస! మేదరమెట్లనరస! 320

ఉ ॥ బట్టును నేను కమ్మకులపట్టపురాజవు నీవు కావ్యవా
గ్ధట్టుఁడ నేను, శౌర్యనయధర్మవిదగ్ధుఁడ వీవు, నేల యీ
పట్టునఁ దొంటియట్టు నయపద్ధతిఁ బ్రోచికృపానిరూపమున్
మెట్టగదయ్య యయ్య! ఘనమేదర మెట్లనృసింహభూవరా! 321

సీ ॥ విజయంబుగజపతినిజమన్నెధౌరేయ!
ఆహవోద్దామ కేళాదిరాయ!
పేరైనసురుమాయిబిరుదాంకమూర్ధన్య!
ప్రతిపక్షసంహార పరశురామ!
హంవీరపువునూరిసింహాసనధురీణ!
గగ్గోలురాయసంగ్రామభీమ!



ప్రకటకోటలగొంగ ప్రత్యర్థిమదభంగ!
జగదీశరాజవేశ్యాభుజంగ!

గీ ॥ అనుచు సుకవులు నిన్నెంతురన్నిదిశల
మిహిరసమతేజ మేదరమెట్లభోజ!
నారసింహార్యసత్పుత్ర! నవ్యగాత్ర!
గీతగుణసాంద్ర! రమణపృథ్వీతలేంద్ర! 322

సీ ॥ దురములో రాచూరుదుర్గాపహరణాఖ్య
బిరుదమేమన్నెభూవరుఁడు చెందె
రణములో నేమన్నె రాజన్యుఁడింపొందఁ
గొదమనాయంకరవిదితుఁ డయ్యె
బవరాన నేమన్నెభార్గవుండెక్కుఁడై
గగ్గోలురాయాంకఘనతఁదనరె
కదనాన నేమన్నె కంఠీరవుఁడు హెచ్చి
కోటలగొంగాఖ్యగురుతు మీఱె

గీ ॥ నిన్నిబిరుదులు నీయంద యెన్నఁగలిగె
మిహిరనిభతేజ మేదరమెట్లభోజ
నారసింహాంక సత్పుత్ర నవ్యగాత్ర
పూతగుణసాంద్ర! రమణ పృథ్వీతలేంద్ర। 323

సీ ॥ సిరిమించుసురుమాయి బిరుదుమన్నెకుమార
భీమప్రతాప సంగ్రామవిజయ
గజపతి సామ్రాజ్యగజమన్నెసింహమ
కేళాదిరాయ గాంగేయశౌర్య
కమ్మకులాధ్యక్ష ఘనకీర్తివిస్తార
తమ్మలూరిసుగోత్ర దానకర్ణ!

సత్యహరిశ్చంద్ర నిత్యాన్నవరదాన
భటకవిసంస్తుత్య బంధుమిత్ర

గీ ॥ మిత్రతజనపోష మేదరమెట్లవంశ
జలధిసారంగ! లోభివేశ్యాభుజంగ!
మల్లభూపాలసత్పుత్ర మంజుగాత్ర!
భవ్యగుణగణ్య! కొండపప్రభువరేణ్య! 324

## మాణిక్యరావువారు

సీ ॥ సుమమౌక్తికాకల్ప సుప్రతీకంబుతో
కంబుతోఁ బుండరీకంబుతోడ
పల్లవకుసుమ సంపాదనైకాంతుతోఁ
గంతుతో రోహిణీకాంతుతోడ
అధిగతపరమోగ్రుఁడైన స్వర్భానుతో
భానుతో నలచిత్రభానుతోడ
దండిగాండీవ కోదండాభిరాముతో
రాముఁతో నందనారాముతోడ

గీ ॥ నీదుసత్కీర్తి నీ మూర్తి నీప్రతాప
దీప్తి నీదోర్బల స్ఫూర్తి దీటుమిగిలి
యలరె మాణిక్యరాయవంశాబ్ధిసోమ
భాసురగుణాళి భావభూపాలమౌళి. 325

సీ ॥ ఒకతాత కుతుబుశా ప్రకటదక్షిణభుజా
దండుఁడై కోవెలకొండ యేలె
నెలమి రెండవతాత యిభరాముపాదుశా
పంపునఁ బెదకొండపల్లె యేలె



మహిమించు ముమ్మడిమాణిక్యరాయఁడు
వినుతికెక్కిన కొండవీటి నేలె
రాణించురఘుపతి మాణిక్యరాయఁడు
పరభయంకరవృత్తిఁ బరిఢవిల్లె

గీ ॥ తండ్రికంటెను బెదతండ్రి తండ్రికంటె
తాతముత్తాతలకు నెల్ల ఖ్యాతిదనర
వన్నె గంటి కృష్ణానేనివంశమునను
నిర్మలోపాయ బళిర మాణిక్యరాయ. 326

సీ ॥ దురములోఁ గదిసిన దొరలశిరంబులు
భేదింప బలుదిట్ట నీదుపట్ట
కదనరంగమునందుఁ గదిసిన పరరాజ
నిచయంబులను దాఁకునీదుబాకు
జన్యసంతోషులై చనుదెంచువైరుల
నిముసంబులో మ్రింగు నీదుచాంగు
..............................................
........................................

గీ ॥ సొరిది నీ డాలు వైరులచుక్కవాలు
బళిర నీ పౌరుషంబెన్నఁ దరముగాదు
అవని మాణిక్యరాజ్యవంశాబ్ధిచంద్ర
రాజవేంకటగోపాలరాయభూప! 327

సీ ॥ శ్రీకరవిజయలక్ష్మీ విరాజితవైభవ
వేంద్రుండు సద్గుణసాంద్రమూర్తి
మాణిక్యరాడ్వంశమందారభూజంబు
పద్మనాయకమనఃపద్మ హేళి

మన్నెకులోద్యానమధూమాసపైకంబు
కామినీమన్మథాకారవేషఁ
నతిపుణ్యపరిగోత్రవితతాబ్ధిచంద్రుండు
దర్థిచాతకవార్షుకాంబుదంబు

గీ ॥ అని జనుల్ మెచ్చఁ గీర్తిచే నలరి తహహ
చరితదేశాంత సత్కవీశ్వరనితాంత
వర్ణితస్వాంత! రేపల్లెపూర్ని శాంత
దీపితాటోప! వేంకటగోపభూప! 328

## అట్లూరి వేంగళన్న

సీ ॥ పరగధర్మాధర్మ పద్ధతుల్ దిగనాడు
దుండగీఁడగుకమ్మ గుండ్లకమ్మ
అగణితవిఖ్యాతినెగడ నేర్చినయర్థి
మనసెఱుంగనికమ్మ మాచకమ్మ
కడఁగివైరులమదమడఁచిపుచ్చఁగలేక
యడఁగియుండెడుకమ్మ యాకుఁగమ్మ
.........................................
.........................................

గీ ॥ కమ్మలందఱుఁ గమ్మలా! కమ్మ లరయఁ
గమ్మలకుఁ గీర్తిఁదెచ్చినకమ్మ వీవె
ప్రథితగుణహార! నారమాంబాకుమార
విక్రమోపేంద్ర! అట్లూరివేంగళేంద్ర! 329

## జల్లి అంకభూపతి

ఉ॥ జల్లి కులావతంస బలశాసనవైభవ యంకభూప నీ
సల్లలితైక కీర్తిరుచిజాలము మిక్కిలివన్నెవెట్టు జా



బిల్లికిఁ బాలవెల్లికిని భీష్మునితల్లికి నాణిముత్తెపుం
జల్లికిఁ కల్పవల్లికిని సాగరగర్భవధూమతల్లికిన్. 330

## కాళభూపతి

ఉ॥ ఏమిదరిద్రమా! సుకవి యేమిర? పొమ్మిఁకఁ; బోకయుండినన్
నీమొనలేమిచేయు; నది నీవె యెఱుంగుదువైనఁ జూడుమా
సామజకాళభూపతి కృపాంబుధిచే విలసిల్లుదానము
క్షామితహేమధారయనుఖడ్గముచే నఱకింతు ధీరతన్. 331

## జగ్గరాజు

ఉ॥ కొంచులవెంబడిన్ మునుపు కొన్ని దినంబులు సంచరించి సీ
యంచును వారిరోసి మహదాశ్రయమంచును మిమ్ముఁ జేరితిన్
వంచకులైనదుష్ప్రభుల వాకిటికిన్ మగుడన్ జనంగ నా
కించుక బుద్ధి పుట్టదిఁక నేమియుపాయము జగ్గరాణ్మణీ! 332

## వేల్ల వేంకటకృష్ణరాజు

మ॥ చెలఁగెన్ వేజెళసార్వభౌముఁడు జయశ్రీశాలి సింహాసన
స్థలలో నేడవరాజు దిగ్విజయకీర్తుల్ వానివే వానితోఁ
గలహంబెప్పుడువద్దురా రిపునృపుల్ గర్వించి మార్కొంటిరా
పులితో లేళ్ళు విహంగపుంగవునితోఁబూరేళ్ళు పోరాడుటల్. 333

## నూజివీటి యప్పారావు

చ॥ వెలమకులంబునందు నిలువెళ్లరు కాంతలటంచుఁ బల్కున
ప్పలుకులబద్ధమయ్యెఁ గులపావనుఁ డీఘనుఁ డప్పరాయరా
డ్కులభము కీ ర్తికాంతకృతికాంత మహీజయకాంత యిప్పుడీ
కలిజగమంతటన్ దిరుగఁగాఁగనుఁగొంటిమి చిత్రమారయన్ 334

## వాసిరెడ్డి వేంకటాద్రినాయఁడు

ఈ కమ్మ ప్రభువు పదునాల్గవ శతాబ్ది తర్వాత, గృష్ణాతీరమందలి యమరావతి రాజధానిగాఁ గొంత తెల్గుదేశమేలినవాఁడు. మహాదాత. శూరుఁడు. "అటునుండి కొట్టుకు రమ్మన్నారు" అను సామెత కీతఁడే జనన కారణము. ఆ కాలమునందు దారిదోపుడుగాండ్రు మెండుగా నుండిరట! అనేకుల ప్రాణ ధనములఁ గొనుచుఁ బ్రజలకు మిక్కిలి పీడ గల్గించుచున్న యా పచ్చెవు దొంగలలో బహుప్రయత్నమున వేంటాద్రినాయఁడు నూర్గురను బట్టించి వరుసగా నిల్వఁబెట్టి తలలు నఱకఁదలారులకనుజ్ఞ నొసఁగెనట! ఒక కొన నుండి నఱకఁ బ్రారంభింపఁబోఁగా నచ్చటివాండ్రు, అటునుండి కొట్టుకొనుచు రమ్మని కోరిరట! (కొందఱ నఱికిన తర్వాతనేని జాలి వొడమక పోదని) నాయఁడుగారును నట్లే రెండవప్రక్క నుండి యారంభింపఁజేసి నిశ్శేషముగనే సంహరింపించి ప్రజలకుఁ జోరభీతి మాన్పిరట;

మ॥ వరహాల్కాసులభంగి సాలువులు కంబళ్లట్ల రూపాయలున్
మఱి గవ్వల్వలెఁగంకణమ్ములుఁతృణప్రాయమ్ముగానిచ్చి బం
గరుపళ్లెంబులఁ బాయసాన్నములు లక్షబ్రాహ్మణాపోశనం
బర లేకిత్తువు వాసిరెడ్డి కులదీపా వేంకటాద్రీశ్వరా! 335

ఒకప్పుడు, వాసిరెడ్డి వేంకటాద్రినాయఁడును నర్సారావుపేట మల్రాజు గుండారాయఁడును, నూజివీటి యప్పారావును, చల్లపల్లి యంకినేఁడును, మొదలుగాఁ గొందఱు జమీందారులు కూడి యిష్టగోష్ఠీ వినోదము సల్పుకొనుసందర్భమున హాస్యచతురుఁడగు గుండారాయఁడు "మనజీవితములు కడచనిన తర్వాత లోకము మనలనెట్లు ప్రశంసించునో తలఁచిచూచుకొందమా" యనెనట! అందఱు నంగీకరించిరట! ఇట్లు పేర్కొనెనట! నూజివీటి యప్పారాయఁడు చనిపోయెనా బైరాగులందఱును బలవించెదరు. తాను చనిపోయితినా వేశ్యలందఱును విలపించెదరు. వేంకటాద్రినాయఁడు చనిపోయెనా యందఱును నల్లోయని



దుఃఖించెదరు. అంకినేఁడు చనిపోయెనా యందఱు నాహా యని సంతోషించెద" రనియెనట!

అమరావతిలో నీ వేంకటాద్రింనాయని శిలావిగ్రహమున్నది.

దరిద్రుఁడగు నొకకవి యా వాసిరెడ్డి వేంకటాద్రి నాయని దాతృత్వము విని యాతని దర్శింపఁ బల్నాడు ప్రాంతమునుండి యరుదెంచుచు గుంటూరు చేరునప్పటి కాభూపతి పరలోక యాత్ర గావించినట్లు తెలియరాఁగా నీ క్రింది పద్యమును జెప్పెనందురు.

చ॥ నలువ చిచీ? నినుందలఁప న్యాయముగాదిఁక వేంకటాద్రి భూ
తిలకునిఁ జంపి యర్థులకు దిక్కు మఱేమొనరించినావు? నీ
విలఁదలకొట్లమారితనమెన్నటికిన్ విడవైతి వౌర! భూ
తలమున నిట్టిరాజును యథావిధి నీతరమా సృజింపఁగన్. 336

వేంకటాద్రినాయఁడు "వారికి వారికిన్ మఱియు వారికి వారికి వారి వారికిన్" అను సమస్యనీయఁగా వట్టెం విరూపాక్షశాస్త్రులను కవి యిట్లు పూరించెనట.

ఉ॥ భూరమణీమనఃకుముదపుంజసుధాంశుని వేంకటాద్రిల
క్ష్మీరమణావతారుని భజింతురు రాజులుఁ దత్సుతుల్ హితుల్
నూరిజనుల్ తదీయులును సొంపుగ నాప్రభువిచ్చుఁ గోరికల్
వారికి వారికిన్ మఱియు వారికి వారికి వారివారికిన్. 337

సీ॥ లోకప్రతిష్ఠ తోల్లుట్లనామకగోత్ర
పద్మపంకేరుహ బాంధవుండు
వాసిరెడ్యాఖ్యా న్వవాయపారావార
శారదరాకా నిశాకరుండు

రణరంగఫల్గున రాజజగన్నాథ
భూజానిసింహ తనూజవిభుఁడు
లక్ష్మిసతీతుల్య లక్ష్మీసతీగర్భ
శుక్తికానర్ఘోరు మౌక్తికంబు

గీ॥ కొండవీడాది వినుకొండ కొండపల్లి
బందరు నిజాముపట్టణ ప్రముఖరాజ్య
విభుఁడు జగదేకవీరుఁడు వేంకటాద్రి
నాయఁడు బహద్దరు ధరాధినాయకుండు. 338

సీ॥ శశిలోనిమృగము పచ్చలభిత్తికాంతులు
దూర్వాంకురములని దుముకఁ జూచు
మలచిన కెంపుపట్టెలఁ జూచి మదనుండు
తనమానికపుదొన తఱచు వెదకుఁ
బవడంపుఁజూరు కల్పకశాఖి చిగురని
కామధేనువు మేయఁగా యతించు
వజ్రనీల స్తంభవర్ణముల్ శివవిష్ణు
తనువులంచు నగాబ్ధితనయ లెంతు

గీ॥ రౌర నవరత్నబద్ధానుకారి ముకుర
నికరరుచి వేంకటాద్రీంద్ర నిరుపమాన
లలితకలిత సౌభాగ్యవిలాసనామ
సౌధవైభవమగణిత సరణి నొప్ప. 339

సీ॥ ఏ వంకఁ జూచిన హేమరౌప్యాంచిత
స్తంభంబులకడింది తళుకులెసఁగు
ఎచ్చోటఁ జూచిన హెచ్చైనమృదుహేమ
పటచిత్రశయనోప బర్హణములు



ఏ చెంతఁగనుఁగొన్న నెంచి చెప్పఁగరాని
నిలువుటద్దపు నిగన్నిగలుగ్రమ్ము
ఏ కడఁగనుఁగొన్న నెంతొ వింతఘటించు
చిత్రవస్తుసమృద్ధి చెలువుఁజూపు

గీ॥ ఏదరినిఁ జెయ్యిసాచిన నెనసి చుక్క
లందుకొనవచ్చు శ్రీవేంకటాద్రిమనుజ
రాణ్మహేంద్ర విలాసహర్మ్యంబు మహిమ
వర్ణనము సేయుఁ దరమె యెవ్వారికైన. 340

క॥ ఇలఁగలనృపతులు నీతోఁ
దులదూఁగకయున్న నీవు తులదూఁగితి వౌ
బళిబళి బంగారముతో
బలసాంద్రా! వేంకటాద్రి పార్థివచంద్రా! 341

మ॥ మురుగుల్ గొల్సులు చంద్రహారములు సమ్మోదోక్తినిద్దంపుటుం
గరముల్ పోగులు పల్లకీలు హయసంఘంబగ్రహారంబులున్
మెఱయంజాలిన సేలువుల్ ధనము నెమ్మిన్ వేంకటాద్రీంద్రుచే
తఱచున్ గొన్న బహుస్థితుల్ గలిగి విద్వాంసుల్ సుఖంబందరే. 342

గీ॥ వైభవోపేంద్రుఁడైనట్టివాసిరెడ్డి
వేంకటాద్రీంద్రుఁ డొక పెండ్లివేళయందుఁ
బిన్నదొరలకు నత్తరుకొన్నకర్చు
పృథ్విఁగల రాచవారికిఁ బెండ్లికర్చు. 343

శా॥ తేజఃకాంతివితీర్ణిభోగకరుణా ధీసారతన్ బద్మినీ
రాజున్ రాజును రాజరాజు సుమనోరాజున్ నదీరాజు వా

గ్రాజున్ బర్వతరాజు మీఱితివి నీకా సాటి భూరాజు లో
రాజశ్రీయుతవాసిరెడ్డికులచంద్రా! వేంకటాద్రీశ్వరా! 344

కII వెన్నెలవలెఁ గర్పూరపుఁ
దిన్నెలవలె నీదుకీర్తి దిగ్దేశములం
దౌన్నత్యంబున వెలసెను
విన్నావా వాసిరెడ్డి వేంకటనృపతీ! 345

సీII దేవరకోటాఖ్య దేశాధిపత్యంబు
గల్గిమించిన యేర్లగడ్డవారు
సేనాధిపత్యంబుచేతను మెప్పించు
శూరవర్యులు శాకమూరివారు
అరయఁగఁ దమవాసి ననుసరించెడు మంచి
చేవచే మించెడు చేవవారు
కులగోత్రసంపద గలిగి రాజప్రీతి
మెలఁగినట్టి చిఱుమామిళ్లవారు

గీII మొదలుగాఁగల బంధువుల్ మోదమలర
మన్నెసుల్తాన్ బహద్దరు మంచినృపుడు
మఱియు బంధుసముద్రుండు మానఘనుఁడ
టంచు వర్ణింతు ంపుడు నాయవనిపతిని. 346

సీII దీపాలమిసిరవల్ తాఁపినబంగారు
టోపీ శిరంబందు నేపుసూప
రంగైననీమస్త రంగీజరీచెట్ల
లుంగీ హెుయల్ మీఱి చెంగలింప
గుజరాతికెంపులకూర్పు తిన్ననయొప్పు
పల్వర్సపై నవ్వుచెల్వు దనర



మేచారమునఁ బచ్చపోచీ కరంబదు
మేల్మిజీఱలముద్దులల్మ కొనఁగ

గీII అరసిచిగురాకుఁ దరవారు మరువజీరు
.......................................
.......................................
....................................... 347

శ్రీవేంకటాద్రినాయనివారొకదినమున "నందన" మనెడి యమరావతి యందలి వారిస్వీయోద్యానంబున విహరించుచుండ ములుగు పాపయారాధ్యులవారు దర్శించి యీ క్రింది పద్యము చెప్పిరట.

సీII సురసరిద్ధరిణరుగ్ద్విరదభిద్ధరకుభృ
ద్ధరశరచ్ఛరదర స్ఫురితకీర్తి,
హరిసఖస్వరుహరి ద్ధరికరోద్ధురభయం
కరశరోత్కరముఖ క్షరదరాతి
సురభికిన్నర కులేశ్వరసుతస్మరమరు
ద్వరజనుస్సురుచిసుందరతనుండు
తరణిభూశరదనిర్జరకురుట్సురగవీ
హరసఖామరమణీ వరవితీర్ణి

గీII నృపతిమాత్రుండె యాశ్రితనివహపద్మ
భానుఁడై భూరిధీరతానూనరత్న
సానుఁడగు వాసిరెడ్డివంశ ప్రసిద్ధ
వేంకటాద్రిప్రభుండు రవిప్రభుండు. 348

నాయనిగారు "తాతా! యిట్టి యుద్యానవనమున్నందులకుఁ దగిన ఫలము లభింపదయ్యెను. ఇది మీబోఁటి కవిశేఖరులకే యనుభవయోగ్యము గాఁదయ్యెను.

సౌరభభరిత పుష్పగుచ్ఛములెన్నియున్న నేమి ఫలము? మిముఁబోఁటి కవివరేణ్యులచే గండోపలప్రహారంబులననుభవింపవలసె" ననిరట. అంత పాపయారాధ్యులవారీ క్రిందిపద్యముఁ జదివిరట.

సీ॥ భములతో సురపాదపములతో గంగోద
కములతో నీహారకములతోడ
హేతితో నమరేంద్రవీతితో నైలింప
వీతితో పరమేష్ఠిసూతితోడ
నవ్వుతో విరిమల్లెపువ్వుతో జేజేల
బువ్వతో పలుకులయవ్వతోడఁ
శూలితో గూఢపాత్పాలితో మౌక్తిక
పాలితో సారంగపాలితోడ

గీ॥ మొల్లమున నల్లిబిల్లియై యెల్ల జగము
నల్లుకొని నీ యశోవల్లి యుల్లసిల్లు
శ్రీవిభాసితజగ్గభూభృత్తనూజ
వెంకటాద్రీంద్ర నృపచంద్ర విజయసాంద్ర. 349

క॥ జలజారి కళలయందును
గలశాంబుధియందుఁ బన్నగ ప్రభునందున్
నెలయై యలయై తలయై
యలరెన్ నీ కీర్తి వేంకటాద్రి మహేశా! 350

సీ॥ ధరణి నే విభుఁడద్యతనభోజరాజంచు
విద్వద్గణంబుచే వినుతిగాంచె
నెరయ నే ఘనుఁడిదానీంతనరాధేయుఁ
డని రాజసభలఁబ్రఖ్యాతిఁగాంచెఁ



నే నృపుం డైదంయుగీ యార్జునుండని
శూరులచేతఁ బ్రస్తుతివహించె
నే మహాప్రభువర్యుఁడిలనధునాతన
రుక్మాంగదుండని రూఢిమించె

గీ॥ నఖిలవిద్యాపరిశ్రమాత్యంతదాన
శౌర్యహరివాసరవ్రత చర్యలందు
నట్టి శ్రీవాసిరెడ్డి వంశాబ్ధిపూర్ణ
చంద్రుఁడగు వేంకటాద్రిధాత్రీంద్రుఁడలరు. 351

మ॥ సురభూమీరుహపంచకంబున రమా సూనుండు నొక్కొక్కశా
ఖ రహిన్ గైకొని వాసిరెడ్డికులరాకాచంద్రుఁడౌ వేంకటా
ద్రిరసాధీశుని పంచశాఖముగఁ గూర్చెన్నేఁడు మాకు న్మహే
శ్వరపూజాతిశయంబటంచు సురభూజంబుల్ ముదంబందెడిన్352

ఉ ॥ సోముఁడులేని రాత్రివలె సూర్యుఁడులేని దినంబురీతి శ్రీ
రాముఁడులేనయోధ్యవలె రాజకులేంద్రుఁడు వాసిరెడ్డి సు
త్రాముఁడు గానరాని యమరావతి పెంపఱెఁగాలమానమున్
గామవిరోధికిం గడవఁగాదుగదా మది శంకలేటికిన్. 353

## వాసిరెడ్డి నాయఁడమ్మ

ఈ క్రింది సీసము పాపయారాధ్యులవారు శ్రీవేంకటాద్రినాయనింగారి పినతండ్రికుమారులైన నాయఁడమ్మగారిపైఁ జెప్పినది –

సీ ॥ ఘనసారశరశరద్ఘనసారసేశాప
ఘనసారమైన యొప్పు ఘనయశంబు
విక్రమార్కునితోడ విక్రమింపగఁజాలు
శక్రాభనిర్వక్రవిక్రమంబు

కల్పభూమీజ సంకల్ప భూశతజన్మ
కల్పభూరిత్యాగ కాంతతాప్తి
రాజరాజనిలింప రాజరాజత్సుధీ
భాజనంబైనట్టి భాగ్యగరిమ
గీ ॥ స్థిరతవిలసిల్ల వలెc బార్వతీసమేత
రామలింగేశ్వరకృపాభరంబువలనc
బ్రకటతరరరంహ వాసిరెడ్డి కులసింహ
నరులకల్పద్రుమపుcగొమ్మ! నాయcడమ్మ. 354

## వాసిరెడ్డి రామనాథబాబు

ఈయన వేంకటాద్రినాయని కుమారుcడు. వీరి కాలముననే వేంకటాద్రి నాయనింగారార్జించిన ప్రాజ్యమగు రాజ్యము యథాయథలయినది.

సీ ॥ సుల్తానుబహదరీచూపించినలఖాబు
ఇచ్చు వచ్చిన లచ్చులిచ్చు జేబు
కయివారములు సేయు కవికిచ్చుతసిరీబు
కాన్కుషీతోcగూడు కాబు
అలకాధిపతికైన నప్పు లిచ్చునరీబు
చలపట్టి సేయువైరులఖరాబు
వాసిరెడ్డికులాబ్ధి వర్ధిల్లుమహతాబు
సర్కారు సారించు సరిజబాబు
గీ ॥ జబరదస్తులకెల్ల దుస్రానవాబు
కన్ను వేసిందిచూ తమ్మికంటిబూబు
నవనవోల్లాసి మా రామనాథబాబు
................................ 355



## శ్రీధనంజయధాత్రాజు

ఈcతడు విశాఖపట్టణ మండలమందలి పార్వతీపురపుc ప్రభువు. పంతుల బ్రహ్మయశాస్త్రియను కవి యీతనిcగూర్చి చెప్పిన పద్యములు :-

సీ ॥ భటులకోలాహలార్భటుల గుండెలుప్రీల
పుండరీకంబులు బెండుపడcగ
బలువేcటకుక్కల భౌభౌరవంబుల
నడవిపందులు గుండెలవిసిపడcగ
తమతుపాకీవేట్ల ధనుధనంధనముల
క్షణములో మృగములగములుగూల
కెలcకుల జనులెల్లc గేరి కేకలువేయ
జయజయధ్వని వందిజనము సేయ
గీ ॥ వేcట గావించితిరి వనవీథియందు
నర్జునపరాక్రమంబుచే నతిశయించి
మహితశ్రీవీరవరతోద్ర మల్బిరుదున
శ్రీధనంజయధాత్రాజ! క్షితిబిడౌజ. 356

సీ ॥ సొగసైనరత్నాల జిగిగుల్కు మేల్తాజు
హౌసుగా నౌదలవాసినింప
ముఖచంద్రు నిరుక్రేవ మొనయు కీర్తులపోల్కి
వజ్రాలచౌకట్లు వన్నెలొలుక
సరసకవీంద్ర రక్షణవిచక్షణనేత్ర
రాజీవముల దయారసముగుల్క
సకలవనీపక శ్రవణంబులింపొంద
శుచిధామ మధురవాగ్రచనలెసcగ

గీ ॥ నఱుత హురుమంజిముత్యాలసరులు దనర
గంతుని జయంతు నలమహీకాంతు గెలిచి
వెలయుమిముఁగన్నఁ గనులకు విందుగాదె
శ్రీధనంజయధాత్రాజ! క్షితిబిడౌజ. 357

సీ ॥ నదుటఁ బాపటబొట్టు పదనుకస్తురిచుక్క
మెడను గంధపురేక మేల్మిసుంగు
సొగసుచెక్కులనింపు జనపాలబలుసొంపు
మోవియందు బులాకిముత్తియంబు
పైఠిణీరైక క్రొంబట్టు కుచ్చులజడ
తళుకుతాబేదు జల్తారువాణి
మొలనూలుగంటలు జిలుఁగు పావంజీలు
మోమందుఁ జిఱునవ్వు మొలకలెత్త

గీ ॥ రంగుమీఱంగ మదనసామ్రాజ్యలక్ష్మి
విధముగా వచ్చి కప్పురవిడియ మిచ్చి
కౌఁగిటను గ్రుచ్చి బావిలీల్కదల మెచ్చి
మచ్చుకిచ్చిన ముద్దును మఱువవద్దు. 358

ఉ ॥ పంతులవంశ బ్రహ్మకవిపార్థివలోకలలామ! దేవిడీ
చెంతకుఁజేరి దర్శనముఁజేయఁ బ్రతీక్ష యొనర్చుచుండె న
త్యంతదయా రసార్ద్రహృదయంబున సన్నిధిఁజేర్చునాజ్ఞ ద్వా
రాంతరవర్తికిమ్ము సముదారధనంజయధాటరాణ్మణీ. 359

క ॥ ననవలె ననవలె చెఱకుం
గనవలెఁ గనవలె మృదుత్వగరిమ మధురిమన్
ఘనమగు భవత్కవిత్వం
బనుపమతేజా! ధనంజయనృపబిడౌజా! 360

(శ్రీ రాజాకాకర్లపూడి రామచంద్రరాజు బహద్దరుగారు చెప్పిన చాటు పద్యము).



సీ ॥ నీ బాకు శత్రుల నెమ్మేని ఽగబాకు
నీ సాగువైరుల నెమకసాగు
నీ కఠారరుల బోనీకఠారుగజేయు
నీ గద పగర దండించునుగద
నీ బల్లె మహితుల ప్రాబల్యమణగించు
నీ శక్తి రిపుల ఖండించుశక్తి
నీ ఖాండమది శత్రు నృపఖండనమొనర్చు
నీ యంబు పరవాహినికి భయంబు

గీ ॥ నీదు కై జారు కై జారు నిఖిలశరులఁ
దార్చు జముధాటికి నిజము దాటిదాటి
కడగి వైరులనొంతు కాకర్లపూడి
రామచంద్రావనీప! సూర్యప్రతాప! 361

(శ్రీరాజా నల్లపరాజు మీర్జా వెంకట నీలాద్రి రాజు బహద్దర్ గారి పైన చెప్పిన శ్లోకము వంశస్థవృత్తం)

శ్లో ॥ చిరసుస్ఫురా సత్యగిరా విరాజతాం ।
ప్రతాపరూపామితభోగకీర్తిభిః
క్షితౌ హరిశ్చంద్ర ఇతీరితోఽ మరై ।
ర్నరైశ్చ నీలాద్రినరేంద్రచంద్రమాః ॥ 362

## సి.పి. బ్రౌన్‌దొరగారు

క్రీ 1770 తర్వాత 1820 వఱకు నీ మహాశయుఁడాంధ్రభాషకై యతి ప్రయాసపడి మహోపకృతి సల్పినవాఁడు. బందరు మొదలగు పట్టణములం దీతఁడు జిల్లాజడ్జీ యుద్యోగము సల్పుచు ననేక సంస్కృతాంధ్రగ్రంథములను బహుధనవ్రయమున సేకరించెను. తెల్గునకు నిఘంటువులు నిర్మించెను. జూలూరి

అప్పయ్య పండితుఁడు, గురుమూర్తిశాస్త్రి, మొదలగు ననేక పండితులనాదరించి విరివిగా ధనమొసంగెను. ఆంధ్రభాషయం దీ ఘనునకత్యంతాభిమానము కలదు. ఇప్పుడు ప్రాచ్యలిఖితపుస్తకభాండాగారముననున్న సంస్కృతాంధ్ర గ్రంథములందనేకము లిమ్మహనీయుఁడార్జించినవే. ఈతని యాంధ్ర భాషాభిమానమును బుద్ధివైభవమును దద్భాండాగారమునఁ గల గ్రంథములఁబట్టి గుర్తింపనగును.

క ॥ నూర్లార్లు లెక్క సేయక
పేర్లందిన విబుధవరులఁ బిలిపించుచు వే
మార్లర్థమిచ్చు వితరణి
చార్లెసు ఫీలిప్పుబ్రౌను సాహెబు కరుణన్. 363

బీదటికమును గుడుచుచున్న యొక యాంధ్ర పండితుఁడు సి.పి.బ్రౌన్ దొరగారికి భాగవతమందలి యీ క్రింది పద్యమును వ్రాసి తనకు ద్రవ్యసాహాయ్యము వేఁడుకొనుచు నొక యర్జీ పంపికొనెనఁట! ఈ పద్యము :

ఉ ॥ లావొక్కింతయు లేదు ధైర్యము విలోలంబయ్యెఁ బ్రాణంబు లా
తావుల్దప్పెను మూర్ఛవచ్చెఁ దనువున్ డస్సెన్ శ్రమంబయ్యెడిన్
నీవే తప్ప నితఃపరంబెఱుఁగ మన్నింపందగుం దీనునిన్
రావే యీశ్వర! కావవే వరద! సంరక్షించు భద్రాత్మకా! 364

బ్రౌన్ దొరగారి కిట్లు మనుష్యునొరుని స్తుతించుటయందు రోఁత. (వారి స్వహస్తముతో నొకచోట 'ఈ దేశపు జనులు కార్యార్థమై నీవే తండ్రివి, నీవే దైవమవు అని నరునొరుని స్తుతింతురు అట్లు స్తుతించుట తల్లిని దండ్రిని దైవమును వంచించుట యగును. ఆంగ్లేయు లిది మేవగొందురు" అను నర్థము వచ్చునట్లు తెల్గుననే కొంత వ్రాసియున్నారు.) ఆ యర్జీని జూచి దొరగారు తిరిగి భాగవతములోనిదే యగు నీ క్రింది పద్యములఁబ్రత్యుత్తరముగాఁ బంపిరఁట.



ఉ ॥ ఏను మృతుండ నౌదునని యింత భయంబు మనంబులోపలన్
మానుము సంభవంబుగల మానవకోట్లకుఁ జావు నిక్కమౌఁ
గాన హరిం దలంపు మిఁకఁ గల్గదు జన్మము మీకు ధాత్రిపై
మానవనాథ! పొందెదవు మాధవలోక నివాససౌఖ్యముల్. 365

# బిరుదావళులు

## విప్పర్లవారి బిరుదావళి

కాకతి ప్రభువుల సేనాధిపతులగు డెబ్బదియేడుగుర నాయకులలో విప్పర్లవారి బిరుదావళి – స్వస్తిసమస్త సకల సామ్రాజ్యలక్ష్మీ లక్షణాలంకార వీరగుణాభరణ విక్రమప్రతాప వైభవ శృంగార హరిశ్చంద్ర శౌచ గాంగేయ అన్నదానోదనదాన వస్త్రదాన సువర్ణదాన గోదాన భూదాన కనక దాన చింతామణి సకల విద్యావిశారద నిజకుల పార్థివవర్ధన కదనపూర్ణిమా సుధాకర బలవద్వైరి పొన్నయ మహీపాల గోధూమఘట్టన ఘట్టరయమాన దోర్దండమండన కొలనిపుర మహీపాలకశిరః కందుకక్రీడావినోద చిచ్చెటి కోనయ కొత్త మాతంగఖండన ప్రమదరిపు కదనప్రచండ గండరగండ గండభేరుండ నిఖిలజన ముఖఫలక శరణాగతవజ్రపంజర, స్వామిద్రోహ కులాంతక కీర్తి కర్పూరపూరిత బ్రహ్మాండకరండ వేంగి చాళుక్య హన్యాల వోడుగండ బిరుదరాజ భయాకర ఏకాంగివీర చోడకటక వజ్రప్రాకార సంగతి రక్షపాలక మానదుర్యోధన యేతాడిమాదినాయని తలగుండుగండ కాసల సోముని గర్వాపహరణ పట్టెలమల్లని ప్రాణాపహరణ దొడ్డన భీమని దుర్గర్వహరణ కొల్లూరి బేతీని హల్లకల్లోల తిరుమల్లి నాయని దిశాపట్ట కొంగిమాయ దేవుని కోలాహల అల్లుర్తి పురారి మానవర్ధన చించెడి కొమ్మినాయని శిరచ్ఛేదన దాడిమల్లని తలగుండుగండ ఆర్యభీము సప్తాంగహరణ బొంటు నాగదేవుని నిర్మూలన త్యాగనాగని దళవిభాళ వివిధ మణి ఖచిత కనకదండ కిరీట ధవళ చ్ఛత్రచ్ఛాయావలయవేదిత రాజ్యలక్ష్మీ ప్రసన్న చామరసమీచీన విజితకరనికానీక

శంఖునినద మూర్ఛిత రిపువాహినీకర నిజప్రతాప మహిమానుకూల కరవాల భైరవగోకులమారి గోకుల దిశాపట్ట దుష్టగోకుల మానమర్దన రణమున పెక్కంద్రు నాయకులొక్కెత్తుగండ దివిచూరకార పులియామార్కోలుగండ మండలీకర ధూమకేతు మండలీకర మకరధ్వజ కటకనిబ్బరగండ హత్తు ముప్వరగండ తెరసావంత బారమండలీకరగండ తన కేలు బిరుదంబున బుద్ధవర్మ వంశ విస్తారక కమలగర్భ చరణోద్భవ పరనారీదూర వంశ విస్తారక అభిమాన కురుసరేంద్ర భటకోవకరతే నాయకాంఛ్ఛామ్ల వరరట్ల గోత్రపవిత్ర భటవిరోధికరతే నాయకాంచ్ఛామ్ల భట్టు వెదు రేపుమధ్యాహ్న పరిగళతె నాయకాంచ్ఛామ్ల దేవ బ్రాహ్మణ భటకవి దానసంపన్న శ్రీనారాయణ దేవరకు యేదువేల గంగిధేనువుల సమర్పించిన దానసంపన్నులున్నూ శరణాగత జీవరక్షపాలకులున్నూ దుష్టగోకుల పట్టితెచ్చే గోడార్లచేత వారి హలాయుధంబులు ప్రళింబించి తద్రక్తంబున చీరలు దడిపి చర్మ సమేతంబుగా గొద్దులకుబెట్టి వారి తలలు ఖండించి గొద్దులకు గుబ్బలు గావించి వారి కవచంబు లొలిపించి గొద్దులకు పచ్చి విలాసంబు గావించి యెత్తించిన యెర్రగొద్దులున్నూ కొంకణ ఘూర్జర ద్రవిడ ద్రామిళ ఉజ్జయిని యని నల్లాది రాజులు ఆదూరిబైళ్ళ ఏనుగుదళంబు లతోఁదలపడి తమ పేరు చెప్పి యేనుగతొండంబులు ఖండవిఖండశతఖండ తుండంబులుగా చేసి ఆటలాడించి ఆ రాజులపదుతలలు పట్టితెచ్చి తమ్మేలిన కరికాళచోళ చక్రవర్తికి సమర్పించి ఆ నృపాలుందు మెచ్చియిచ్చిన ఆ రాజ్యబిరుద పదసంపద లెట్టివనిన – ఏక శంఖంబులున్న, ఎఱ్ఱగొద్దులున్ను, హనుమంతుపడియు, అలపట్టంబును, ప్రముఖగిరులున్ను పులికాలియొద్దున పులితోటలు పక్కెరసమెర పులితలాటంబును రెడ్డెరికంబును గండభేరుండమును గండభేరుండ తలాటంబును అరిరాయ గజాంకుశంబును దక్షిణదోర్దండ మండితంబై శాసన యంగల పసుపుపావడ విక్రమార్చిత (దిత్య?) ధనంజయలోల సరికర్ణ ఖేచర శిబిజీమూతవాహనులు గల త్యాగసింహాసనాధీశ్వర పెరియూరి త్రికూటేశ్వరాది దేవదివ్య శ్రీపాదపద్మారాధకులైన విప్పర్లనాయంకులాన్వయాది బిరుదు విజయప్రశస్తి విజయీభవ.



## పైశాలవారి బిరుదు

దివ్యశ్రీ పాదపద్మారాధకులైన విప్పర్లనాయంకులాన్వయాది విజయ ప్రశస్తి విజయీభవ – పైశాలవారి బిరుదు. గండరాదిత్య గండరశాప్య గండరమోగీత గండభండార నన్నూరునరువత్తు కొమరవేశ్యా భుజంగ చిక్కు తిరుకాళ హేమగళ ప్రధానికరగండ యిమ్మడిగండ నాయకరగండముమ్మడిగండ నాయకరగండ హత్తిత్త పామండలీకరగండ హిత్తిగురుతోమండలీకరగండ కూడికాదో మండలీకరగండ కూడివిచ్చో మండలీకరగండ నెరటికోడో మండలీకరగండ అడ్డదోడి పెమమండలీకరగండ కెంచుమండలీకరగండ కెరయుమండలీకరగండ గుజ్జుమండలీకరగండ మొయిలుక్రింద మడమెత్తి నడిచే మండలీకరగండ మిసినీరుకులో మండలీకరగండ కెరయు నరకులో మండలీకరగండ హిత్తిగలి బెదరి హత్తిత్తపో మండలీకరగండ మదనారి తల గుండుగండ విసర్పతల గోమండలీకరగండ బల్లాడదేవుని నీబలవంకుకు మదిద్దో మండలీకరగండ బల్లాడదేవుని యిందుకు మదిద్దో మండలీకరగండ బల్లాడదేవుని నీ ముందుకు మదిద్దో మండలీకరగండ భల్లాణ మోహినీ పేషిణీ హనుమంత పార్థివపరశు రామ అసురనర కందు కుద్బాళ్ళు యందరో తాటంక విభాళ భట్టుబ్రాహ్మణ పంచాణుహటణపరగసేనా సాలీనొంటిభృంగి భూపాలి మార్జవి తికుట తిర్యాచార్యవొన బిరుదుగండ వోరటు మురారి నిడుదనిక్కు రాయ తితోడమండలీకరగండ బిరుదుల వెన్ను సమ్మెట ఖండేరాయ చౌహత్తు మల్ల కరికమల కలయబిలి యమ్మాడు అంతుంబొమండలీకరగండ తనయందు కూడు బంటందుకూడు తొత్తందుకూడు నాయబందుకూడు ముమ్మొమండలీకరగండ హన్నిబ్బరగండ హత్తుముప్పరగండ త్యాగి సహస్రబాహువెల్లటూరి పురవరాధీశ్వర నృపదవంశోద్భవ పాంచాల దేశాధీశ్వర వైరిగజాభీమ దండోడుమండలీకరగండ యెల్లనాయంకుల నందనవనమవాలుగండ మున్ను దేలు జవులున్నూ కోలొముక

మందునాలుకయు గల్గు నాయకాంచామ్లు నల్లగిరి తెల్లగిరి నాయకాంచామ్లు వందితేగుడిచి వాసాల కింద ఖండేనాయకాం చామ్లు గండిచెరువు కట్టయెక్కి దొడ్డమారెమ్మగవిని దూరేనాయకాంచామ్లు కాసారవల్లని బెంకోలుగండ కందూరిసోమని బెంకోలుగండ బెండపనాయని బెంకోలుగండ కొండపనాయని దిశాపట్ట మొగలువలె గూడి మంచువలె విచ్చే నాయకాంచామ్లు 'పిశాల' కులకమలమార్తాండ భక్షతటాల రాయరాహుత్తవేశ్యా భుజంగ దేవబ్రాహ్మణ శ్రీపాదపద్మారాధకులయిన పైశాలనాయకులాన్వయాది బిరుదు విజయప్రశస్తి విజయీభవ.

ఈ బిరుదునిచ్చినవాడు పోతుగంటి మైలానేండు. తెలుగు బిజ్జలుని గెలిచి బిరుదు దెచ్చినందుకున్నూ పోతుగంటి మైలానేని నుండి చింతపట్ల శింగమనేనిదాకా వంశావళికిన్ని యివే పద్యాలు.

సీ॥ బలిమిఁ బ్రతాపుని కొలువునాయంకుల
కుంచలు మాన్పిన గురుభుజుండ!
భువి దొడ్డమారెమ్మ గవిని దూరుచు నర్గు
నసమ విద్వేషినాయకుల మగఁడు
యెలమి డెబ్బాదేడ్గురను గొల్చిరా?
రుద్రదేవున వంద భద్రగజము
పఱతేర నందఱు పాఱంగఁ గరి ద్రోచి
హరిదంతిభీమకుఁడనఁగ బరగె

గీ॥ ధరణిలోన వెలయ దండోడుగండాంక
భీమనృపతిపుత్ర పృథులగోత్ర
పోతుగంటి మైలభూపాల నీ చేతి
హేతికెదురు నిల్వనెందు లేరు. 366



సీ॥ మాసిసికొండొద్ద మన్య వేశ్యాభుజం
గాంకు బొమ్మయదేవు నాజిఁ బరపె
యీసులపై బడ్డ పోసంగిడదాఁక
పరగ మంగయనేని భంగపఱచెఁ
బోరిలో మెఱయు కొండూరి నల్లయరెడ్డి
నీటె వాలిచె చిదులేటిబయట
నుప్పరపల్లొద్ద నుద్ధృతిఁ బైపడి
ఢిల్లీ తురుష్కుల త్రుళ్ళడంచె

గీ॥ బిజ్జలనృపాలు గెల్చి తా విశదకీర్తి
ధర్మగతి నిల్పె భీమభూధవుని సుతుఁడు
వైరిగజభీముఁడమిత సత్వప్రియశుఁడు
ఘనభుజాశాలి యగు పోతుగంటిమైలి. 367

సీ॥ ఢిల్లిలో సులతాను తొల్లివేదిధరాది (డల్లావుదీన్ధరా?)
ద(ధ్య)క్షుండు ప్రత్యక్షసాక్షిగాఁగ
మహనీయజయశాలి మలికి నేమారుండు
జగదేక శూరులు సాక్షిగాఁగ
సహజసాహసయుద్ధసన్నద్ధవరభటా
శ్రయమైన దా కోటసాక్షిగాఁగ
.... .... .... .... ....
.... .... .... ....

గీ॥ సూర్యవంశోదయఖ్యాతుఁడార్యు తెలుఁగు
బిజ్జలనృపాలు గెల్చెఁదద్భీమబలుఁడు
వైరిగజభీముఁడమిత సత్యప్రియశుఁడు
ఘనభుజాశాలి యగు పోతుగంటిమైలి. 368

సీ॥ మాయురే భాశోరమల్లసంహరణాంక
చాఁగురే తెలుఁగుబిజ్జళవిభాళ
హాహా సముత్సాహయరివీరగజభీమ
మేలుమేలు కులపిశాలగోత్ర
హెూహెూ సత్కీర్తిసముచ్ఛ్రితబ్రహ్మాండ
హెూహెూ ప్రశస్తదండోడుగండ
అవుర పాంబాదేశహన్నిబ్బరగండ
భళి బేతిదంప భూపాలదళన

గీ॥ యనుచుఁగొనియాడుదురు నిన్నునర్థివరులు
మగధమాళవనేపాళమత్స్యసభల
విభవనాభాగ మైలభూవిభునినాగ
భీమభూపాలు సత్పౌత్ర పృథుచరిత్ర. 369

సీ॥ కుటిలశాత్రవకోపకొల్మి కాఁకలఁ దేలి
ఘనరిపునేత్రడాకంట నిల్చి
యరిరక్తధారచే నందంద పదనంది
శత్రుపక్షపుఁ గరసాన మెఱసి
పగడక్రొవ్వనఁ జికిలిబారుగా సమకూడి?
సమదారి మొనచాయం జాయమించి
యధిక కంఠాంతరంబను బలువర చొచ్చి
కాలకూటపులోహకాంతి మెఱసి

గీ॥ చటుల భేతాళ కమ్మరి చాతఁ బ్రబలి
నెగడె జయమార్గ గుణరాశి నీ కరాసి
నరసుతోదార నాగభూవరకుమార
యమితవిభవేంద్ర పోతుగంటవుబలేంద్ర! 370



ఉ॥ వల్లభ భోగభాగ్యసురవల్లభ చారువివేక శారదా
వల్లభ నిత్యసత్యరఘువల్లభ ధర్మవిచారద్రౌపదీ
వల్లభ వాగ్విలాసఫణివల్లభ కాంతిచకోర శారదా
వల్లభ చింతపల్లుపురవల్లభ అబ్బనృపాలువల్లభా! 371

మ॥ అదె ఛత్రం బదె చామరం బదె హయంబన్నన్ భయభ్రాంతులై
కదనోర్వీధరచాపచక్రధృతికాఖడ్గాదిశస్త్రాస్త్రముల్
చెదరన్ వైచి తదీయవైరులు గిరుల్ సంప్రాప్తులై యెక్కరే
.... .... .... .... .... .... .... .... .... 372

అతని కుమారుండు

ఉ॥ భండనమాటపట్టు జయభామిని నెచ్చెలి చండవిద్విష
న్మండలి యంగరక్తములు మానక పానము లానుచుండ ను
ద్దండవిదాకినుల్ సఖులు తక్కిన భూతములర్థు లిమ్మహిన్
ఘండియరాయవల్లభుని గన్న నృపాలకరాసిపుత్రికిన్. 373

అతని యనుజుండు

సీ॥ ప్రతిపక్ష సుందరీబంధుర స్తనముల
పసపుఁబయ్యెదలకుఁబాయునెలవు
రిపురాయభామినీవిపులధమ్మిల్లంబు
విరులనెత్తావికి వీడుకొలుపు
శాత్రవకామినీచటులనేత్రంబుల
కవికాటుకలకును గానివావి
యరిరాయభామిని యరుణాధరంబుల
సొబఁగువీడెములకుఁ జుక్కకెదురు

గీ॥ చేసె నౌరౌర ధాత్రిని జేతరాశి
వైరగజభీమ వల్లభేశ్వరకుమార
కమలహితతేజ కామినీజనమనోజ
చిరతరాటోప సింగభూపప్రతాప! 374

ఈ సింగమనేడే రావుచౌశీతివరాల సింగమ నాయని బావమఱిది – ఆతని యనుజుండు,

సీ॥ ఘనతరదండోడుగండప్రచండ నీ
కభ్యుదయ పరంపరాభివృద్ధి
వైరిగజాభీమవనరాశిగంభీర
ధనకనకవస్తువాహనసమృద్ధి
బండియరాహుత్తమిండ విక్రమబాహు
శౌర్య నీ కెపుడు నైశ్వర్యమస్తు
విలసిల్లు తెలుఁగుబిజ్జలురాయసప్తాంగ
మలరె నీకును సుదీర్ఘాయురస్తు

గీ॥ వాలుగడ్డంబు మెండైన వ్రేలు చెవులు
యిల్కకోలెముఖము వోదునాల్క గలుగు
వైరులకు మిండ వర్ధిలు వసుధలోన
భాగ్యసంతృప్త వల్లభూపాలకృష్ణ. 375

## ఇనుగాలవారి బిరుదావళి

స్వస్తి సమస్తమహామండలేశ్వర మహాసామంతపదవీ సమేత ఉత్తర దిగ్భాగపూర్వ సింహాసనాధీశ్వర అయోధ్యాపురసామ్రాజ్యలక్ష్మీ నిర్వాహక హరిశ్చంద్రమహారాజ రాజ్యస్థవిశేషకార్యధురంధర లోహితాశ్వదక్షిణభుజాదండ భగీరథ స్వ (ల) కార్యవిస్తారక అనవేమ మహీపాలుని సకల సేనాధీశ్వర



దితిపురమహారాజరాజ్యభారక ఇక్ష్వాకు సేనాసమరముఖరవికులాంభోనిధి హరిక్రీడావినోద చంద్రభూపాలపాదపంకజభ్రమరాయమాణ దశరథమనోరథ సౌస్మిల చతుర్దిక్ష మహామండల మండితాయమానరామభాగీరథ లక్ష్మణ శత్రుఘ్న కార్యనిర్వాహక మహొక్షత్రిపురవరాధీశ్వర శ్రీ లక్ష్మణదేవ మహాపట్టాభిషేక మహొత్సవ మహాసంతుష్ట కరికాళచోళరాజ్య సముద్ధార కావేరీతీర శ్రీరంగనామధేయ దివ్యశ్రీపాదపద్మారాధక చతుర్థకుల సుధార్ణవ సంపూర్ణచంద్ర రాజేంద్రచోళరాజ్యప్రతిపాలక సమరముఖహనుమంత యినుగాలగోత్ర కదనత్రినేత్ర యన్నిచ్చి కుదువబెట్టు నాయంకరగండ కార్యబృహస్పతిస్వరూప ఘుడికోట మల్లాయ లిదాయరాక్షసపయికి వనకురార శత్రుకుల నిర్జిత అరిబలతల్లడ సాహసాభరణ గిరిదుర్గ వజ్రాయుధ స్థలదుర్గహలాయుధ వనదుర్గవైశ్వానర జలదుర్గ బడబానల సత్యహరిశ్చంద్ర యందు వొబ్బుర్ను సముఖంబున పంజోళ్ళ పడమట బండ్లవాగున బలాన పులిని బొడిచిన సబలసహస్రబాహ పులియ మార్కోలుగండ బాహుబలభీమ వైరి గజవిదళపంచానన సమరముఖరామ దాక్షిణ్యపారిజాత పరివార సంగడి సన్నాహ అఖిలజనపురుహూత ఆశ్రితపారిజాత పాలూరి పురవరాధీశ్వర శ్రీనరసింహదేవ దివ్యశ్రీపాద పద్మారాధక–

ప్రతాపుండిచ్చిన బిరుదంబు లెట్టి వనినను వర్ణతలాటంబును నుభయ వింజామరంబులున్న ఇత్యాది నామాది ప్రశస్తి సహితులయిన యినుగాల నాయంకులాన్వయాది బిరుదు విజయప్రశస్తి విజయీభవ దిగ్విజయీభవ–

## ఆరవెల్లివారి బిరుదావళి

స్వస్తి సమస్త గుణగణాభరణ చంద్రచూడామణి కృతివరాభరణ పరివారభరణ సమరసమయమార్తాండ వీరలక్ష్మీ నిజేశ్వర ఆరవెల్లి పురవరాధీశ్వర దశదానవిలాస నిత్యదాన మాధవ పరబలావిలంబితభీమ వితరణ గుణస్తంభ ఆశ్రితవల్లభ భండనవీరావతార కదనప్రచండ గండరగండ గండభేరుండ యేరున తొండని దక్షిణ భుజాదండ కామినీజనమనోవల్లభ నాస్తిం బరగండ నాళువాంబరగండ

నరగజకేసరి పన్ని మార్కోలుగండ పరగండ భైరవ యెక్కుడుగాండ్ల దీక్షాదిగురువ విలువిద్య పరశురామ పులితలాట రాయ రాహుత్త వేశ్యాభుజంగ శ్రీకృష్ణవేణ్ణాజలక్రీడావినోద చోడాలుండిచ్చిన చోతందిరిన్ని భల్లాణుడిచ్చిన బల్లపందిరిన్ని ముత్యాలపందిరిన్ని యేక శంఖంబును నీలచ్ఛత్రవింజామరంబులుం గలిగి సేతుబంధ రామేశ్వరదేవదివ్య శ్రీపాదపద్మారాధకులయిన ఆరవెల్లినాయం కులాన్వయ బిరుదు విజయప్రశస్తి విజయీభవ-

## ఆలఘుచర్లవారి వంశావళి

స్వస్తి సమస్తభూమండల మండితభుజాదండ కీర్తికర్పూర వర్తమాన సాహిత్యవినోద సకలదానవినోద పురసురధాన బవురయ కోలాహల పతిహితాధారక విశ్వలోక కరుణాపారిజాత అరిరాయనాయంక మంగళసూత్ర పవిత్ర గర్వితరిపురాజ కదనకాలకంటక అరిరాయ హృదయభల్ల మూరురాయవేట భల్లాండరాయ కొమరుహన్నిబ్బరగండ సప్తసంతాన సమర్థ సంగడి రక్షపాలక మానదుర్యోధన అసహాయశూర అరమనిగొండియరగండ అంచమనేని గొండియరగండ స్వామిద్రోహరగండ అర్థప్రాణ పంచకరగండ పతిహితాభరణ ప్రజమెచ్చుగండ బంధుజన చింతామణి పరనారీదూర తురగారోహణ రేఖా రేవంత ఆరట్లరాయరాహుత్త వేశ్యాభుజంగ అదనెన్ని సప్తదిశా నాయకాంచ్ఛామ్ల మృదుమని సామంతరగండ ఉభయదళపూజలింగమ చరుకు కేతారెడ్డి తలగుండుగండ బిరుదు బిసగొమ్ము రాయరగండ కస్తూరి కర్పూరకావినోదిరాయకొమార వీరతాణిరాయకొమరు వుత్కళ ఖటవీర లలాట కాంతి మాళవ రాయాత్సామ్ల సమరముఖ హనుమంత సాహస సామంత జలధిబడబానల కృష్ణవేణ్ణా జలక్రీడావినోద మృదుకొలని వీరక్షేత్రాణో భారతికమల్ల పారావార చతుర్దశ అభంగభార్గవ యేకాంగి వీర వీరావతారరాయనాయంక యేనుగ విధి ఆఖట్ట రాహుత్త విభాళ సంగ్రామభీమ అవుటకోట కొమర భయభంగవర్జిత రణవిజయ పరాక్రమ విజయలక్ష్మీనివాస



వైరి సామంత రాగొల కఠారిరాయకాలానల శరణాగత వజ్రపంజర చాతుర్య భోజరాజ భూదాన బలీంద్ర అన్నదాన హరిశ్చంద్ర అరిరాజకోపకాలాగ్ని రుద్ర ఉద్ధండ రాజోరగవైనతేయ రాజమార్తాండ చౌహత్తుమల్ల విషమధాటీ పాంచాలగిరిదుర్గదహనదావానల స్థలదుర్గహరణహలాయుధ జలదుర్గ జలధిబడబానల మండలీకర వీరక్షేత్రాణో (జఝూరు?) దంతావళ ప్రతిధనుః కోలాహల కెరుదాడు నాయంకరగండ బిరుదు యీసడించు నాయంకుల తలగుండుగండ లాలుసరి బిరుదాంక వర్తమానవైభవామరేంద్ర దేవబ్రాహ్మణ ప్రతిపాలన భటకవిజన స్తోత్రపాత్ర.

పల్లవుండనురాజు యేర్వసింహాసనంబునకెత్తి నడచిన యేర్వరాజు తమ అలఘుచర్ల నాయకవర్గంబుల బిలిపించి కదనంబున కేర్పరచి తురగంబులవల్లన కంటి ఛత్రిశాయుధప్రవీణులై పంచమహాలాయుధంబులతో పురంబు వెడలి యుద్ధసన్నద్ధులై తలపడి భద్రగజంబులు కయ్యంబున కెదిరినట్లు సింహంబులు పోరాటంబునకు చేరినట్లు ఒండొరులమీద తమ ఘుండంబులెత్తి మొత్తిన తుత్తునియలై వీరభటుల శరీరంబులు, చరణంబులు, బాహులు, శిరంబులు ఉత్తుంగతరంగంబులైన తురంగంబులను ఖండతుండంబులై పడిన గజతండంబులను ఛత్రిశాయుధంబులు వైచి శరణంబు వేఁడిన గాచి పల్లవులబిరుదంబు గైకొని తమ్మేలిన యేరువరాజు సముఖంబున బెట్టి విన్నవించిన ఆ నృపాలుండు మెచ్చి యిచ్చిన బిరుదంబు లెట్టివనిన - నిత్యకళ్యాణమున్ను, పచ్చతోరణమున్ను, తిరుమణిన్ని, నాగబంధమున్ను, ఉభయకుల పవిత్రముంగల పల్లవ వంశోద్భవుని బిరుదంబులు ఉజ్జ్వల తలాటంబును అర్ధనారి తలాటంబును కవితలాటంబును ధవళచ్ఛత్రచామరంబులున్ను యెర్వరాజు తమ అలఘుచర్ల నాయంకుల బిరుదంబు లిచ్చిన యెర్వరాజు స్థాపనాచార్యులైన పంచపాండ్యవరద గోపాలదేవ దివ్య శ్రీపాదపద్మారాధకులైన అలఘుచర్ల నాయంకులాన్వయ బిరుదు విజయప్రశస్తి దిగ్విజయీభవ-

## పసుపులవారి బిరుదావళి

స్వస్తి సమస్త పసుపులసింహపు పసుపులగోత్రపవిత్ర అరిగండ భైరవ మణికంటినారాయణ మేదినిమీసరగంధ స్వర్గమర్త్య పాతాళ త్రిభువనదాతల శిరోమణి రాచూరిదుర్గ ప్రతిపాలన ముదిగంటి వీరక్షేత్రాణో భారతీకమల్ల గోసంగి ములుసని మీసాలతోతల ద్రుంచిన మీసాలమండలీకరగండ ఝట్టి భల్లాణ హల్లకల్లోల చరుకుమురారన్న సప్తాంగహరణ కత్తెరగండకర శిరచ్ఛేదన గోనెగండ్ల పూర్వసింహాసనాధీశ్వర దేవళేశ్వరు వంశపారావార పారిజాత శ్రీమద్రామాయణ కృతినాయంకులైన పసుపులకులాన్వయ బిరుదు విజయప్రశస్తి విభవ విజయీభవ దిగ్విజయీభవ–

## రేపాలవారి బిరుదావళి

స్వస్తి సమస్త రేపాలసింహమ పాతాళగరుడ మన్మథనాథ సుబ్బి నాటి గొంగ ఘడియంకసింహమ ఘడికి బోరుదలుప కన్నడమన్నేని తలగుండ గండ నిడదవోలి వీరక్షేత్రాణో భారతీకమల్ల తెల్లతలాటరాయ రాహుత్త వేశ్యాభుజంగ కోలాహక నాయంకరగండ బిరుదు లెల్లి హన్నిబ్బరగండ రాయగజసింహమ కొంకణ రాజ్యస్థాపనాచార్య టెంకణ రాజ్యత్రికర్త ఆవుట కోటకొమర భయభంగ వర్జిత కర్ణాటక మదవిదారణ అ(రి)జాత హనుమంత వైరిగర్భనిర్భేదన మన్నె కాలాంతక సంగరవిజయ కిరీటి సంతానదాన చింతామణి సంగీత గంధర్వ కిన్నరేశ్వర సాహిత్య విద్యాకథాభరణ విద్యల భోజరాజావతార విజాపురీహల్లకల్లోల విరుగు లేని మన్నె విభాళ గెల్పులరాయ రాయసాహత్తుమల్లగిరిదుర్గ రాయమానమర్ధన దొరుసుమన్నె విభాళ–

వోరుగంటి ప్రతాపుని సేనాపట్టభద్రుడైన? కీర్తిబిరుదాంకులైన రేపాల నాయంకుల బిలిపించి గబ్బినాటి రాజులమీదికి దండెత్తుమని చతురంగ సబల మేతంబులతో గదలి రణంబున కెదిరి వారి తలలు ఖండించి గబ్బినాడు తమకు



సింహాసనంబుగా జేసుకొని తమ్మేలిన వోరుగంటి ప్రతాపునికి విన్నవించిన ఆ నృపాలుండు మెచ్చి యిచ్చిన బిరుదంబు లెట్టివనిన– తెల్లపట్టుతలాటంబును తెల్లడాలు డమారంబును తెల్ల పావడయును ధవళశంఖంబులును ముత్యాల జగజంపు అరుణచ్ఛత్రచామరంబులును మొదలయినవి రేపాలనాయంకులకు బిరుదంబు లిచ్చిన బెజవాడ మల్లేశ్వర దేవదివ్య శ్రీపాదపద్మారాధకు లయిన రేపాలకులాన్వయ బిరుదు విజయప్రశ స్తి విజయీభవ–

## సన్నగూరివారి బిరుదావళి

స్వస్తి సమస్త నిరుపమమాణిక్యమ పూర్వసింహాసనాధీశ్వర మూరులో కరగండ గండరగండ యిరుదత్తుగండ గండగోవాళ కాంచీ రక్షపాలక చోడ రాజ్యస్థాపనాచార్య నాయంక చరువు భంగార భరత సంగీత తాన పరివార సంగడిసన్నాహ పరనారీదూర పరమమాహేశ్వర పరపురుషార్థక కుమారకంఠీరవ భట్టును గడపనిగండ పరదళవినోద పరమన్నె భయంకర ధాంతి మన్నె విభాళ బహుధాన్య స్థాపనాచార్య పొన్న బలనాథదేవ దివ్యశ్రీ పాదపద్మారాధకు లయిన సన్నగూరి నాయంకులాన్వయ బిరుదు విజయప్రశస్తి.

## పెంపాలవారి బిరుదు

స్వస్తి సమస్త పంచమహాశబ్దానురాగ పంచమహాసామంత సింహాసనాధీశ్వర పరనారీదూర సద్గుణాధార పరోపకార పరమన్నె పరమేశ్వర పరబలసాధక పరబలనిరంకుశ వితరణగుణకర్ణ దానమాన (గానతాన?) విద్యాధర ప్రజమెచ్చు గండ బంధుజనచింతామణి భరతసంగీతసాహిత్య రత్నాకరనాయకరత్నమ నవరసరచనాచార్య సత్యహరిశ్చంద్ర శౌచగాంగేయ గోబ్రాహ్మణహితార్థక చారుకుల దీపక పెంపాలగోత్ర పవిత్ర యెర్వరాజు రాజ్యమూలస్తంభమ చౌషష్టి విద్యా కళా ప్రవీణ స్వామిద్రోహరగండ దొడ్డభీమదేవుని శిరచ్ఛేదన రణరంగ విజయసన్నాహ ఆ ప్రగోపుదిశాపట్ట కాసులసోముని గర్వహరణ పట్టెసమల్లుని ప్రాణహరణ సమరనిశ్శంక మన్యభీమనాయని మానమర్దన మన్యమాదినేని దళవిభాళ

మన్యపాతనితలగుండుగండ పరబల మేఘపవన అప్రతిహతప్రతాప వైరి తిమిరమార్తాండ మల్లమహారూపమానమర్దన రూపకందర్ప లక్ష్మీలక్ష్మణసంపన్న విక్రమాదిత్య అంజనాపుత్ర అహిత పటలనికరలంకారి పదహానచేకొలు పార్థివ పరశురామ దీక్షాకుమార యెర్వతొండ భూపతి దక్షిణభుజాదండ కటకభల్లాని గర్వాపహార మెరుగుటలుగులు పొడగని పొడవలుపు నాయంకరగండ ఉత్తమగండ ఉభయరగండ గండరగండ గండభేరుండ బత్తీసాయుధ ప్రవీణ హెున్నకట్టో కుదిరకట్టోనాయంకరగండ హత్తుముప్పరగండ తురగారోహణ రేఖారేవంత ఆజ్ఞాదండ ప్రతిజ్ఞాపరశురామ కమలపురి పురాన్వయ కోదండనారాయణ వివేక దేశాభివంశావతారులయినవారి బిరుదంబులు భీమారావు ముత్యాలతలాటంబును కనకదండెంబును గరుడతలాటంబును చామరంబులును పంచవన్నె వాద్యంబులును గల పెంపాల కులాన్వయబిరుదు విజయప్రశస్తి విజయీభవ దిగ్విజయీభవ–

## పొన్నెలపల్లివారి బిరుదావళి

స్వస్తి సమస్త పొన్నెపల్లిసింహమ పొన్నెపల్లి గోత్రపవిత్రరాయ యిమ్మడి బిరుద విఖ్యాత త్రిభువనదాతలరాయ మెండొడ్డ మండలీకరగండ డబ్బు కుడుబుకులమారి డంబుకుల తలగుండుగండ డంబుకుల నిర్ధూమధామ సనకునాయంకరగండ వికటనాయంకుల తలగుండుగండ సమరగాంగేయ యేకాంగివీర శత్రురాజ గజసింహమ మడమెత్తి మడమదిరిగే నాయకాంచామ్ల చిన్న గిరిదుర్గవిభాళ వస్తేటి రాజుల తలగుండుగండ కాసుల సోమనితలగుండు గండ అవుటకోటవిభాళ వైరిగర్భనిర్భేదన బొమ్మయదేవుని నిర్ధూమధామ వోరుగంటికోట విడిచి కోటకుబొయ్యే నాయకాంచామ్ల కుట్టమన్యవిభాళ వోరుగంటి ప్రతాపుని దక్షిణభుజాదండ ప్రతాపరామావతార దలబిరుదురగండ రుక్మాంగదుని ద్వాదశిచూరకార వెనక ముందర చూచే వైరినాయకులమిండ భానుగంటి పట్టణప్రాకార ఉదయరాజు రాజ్య స్థాపనాచార్య కనక వసంత రాయ బహుబిరుద పంచఘంటాపట్టుతలాట రాయరాహుత్త వేశ్యాభుజంగ పొన్నెపల్లి గో(ఖ)? నాథ దేవదివ్య శ్రీపాదపద్మారాధకులయిన పొన్నెపల్లి నాయంకులాన్వయ బిరుదు విజయప్రశస్తి విజయీభవ–



## వెదనూళ్ళవారి బిరుదావళి

స్వస్తి సమస్త వెదునూళ్ళ పురవరాధీశ్వర దాతలదాతరాయ ధర్మస్వరూప అన్నదాన, అమృతదాన, గజదాన, తురంగదాన, గోదాన, భూదాన, కన్యాదాన నవరత్నదాన, మహామండలేశ్వర అనవరతదాన ధారాప్రవాహవైరి డెబ్భైయేడుగురు వెలమకులభుజగ సప్తవిషయనాయకాంఛామ్ల సమరముఖహనుమంత సంతతదానకర్ణ గజతురగ రేవంత కాకతి రాజసేనాపట్టభద్ర కాయధాన్యము కొరువట్టి నాయకాంఛామ్ల భట్టకవి జనస్తోత్రపాత్ర పంచపాండ్య రాయహల్ల కల్లోల ముత్యాలతలాట రాయరాహుత్త వేశ్యాభుజంగ శ్రీరామేశ్వర దేవదివ్య శ్రీపాదపద్మారాధకు (లయన..........?) ధవళచ్ఛత్రంబును మౌక్తికచ్ఛత్ర కిరీట నవరత్న భూషణాది దుకూలాంబరంబును గలవైన వెదునూళ్ళకులాన్వయబిరుదు విజయప్రశస్తి విజయీభవ దిగ్విజయీభవ–

## వేరట్లవారి బిరుదావళి

స్వస్తి సమస్త వేరట్లసింహమ వేటభల్లాణ అణకుమీసరగండ సురియ కరబేతాళ వరప్రసాదక సువర్ణతలాట రాయరాహుత్త వేశ్యాభుజంగ అభిమాన లక్ష్మీనివాస వేరట్లకులాన్వయబిరుదు విజయ ప్రశస్తి విజయీభవ దిగ్విజయీభవ–

## రేవునూళ్ళవారి బిరుదావళి

స్వస్తి సమస్త రేవునూళ్ళ పురవరాధీశ్వర బిరుదు బిమ్మెడ్డుగండ చెనసు నాయకరగండ కూడివిచ్చోనాయంకరగండ కూడికాదోనాయంకరగండ దప్పి తలగుండుగండ జాదురతలగుండుగండ గురిజాల గణపతి కందకుద్దాళ ముమ్మడి సింగ తలగుండుగండ ముమ్మడిబైచతలగుండుగండ త్రిభువనపట్టర్ల గొంగపట్టర్ల మానమర్దన తెలుగుదేశాది తెలుగు రాహుత్త పొమణిపతెకొమరాంఛామ్ల అర్ధనారీ

తలాటేశ్వర చలువరగండ శలగోలపార్థివ మొగులువలె గూడి మంచువలె విచ్చిపొయ్యే నాయకాంఛాప్లు పరదళము పొడగని దేహమందు (జొడురాగెవస్లు?) కాళ్ల పాదుకలు మెట్టేనాయకాంఛాప్లు అర్ధనారీ తలాట రాయరాహుత్త వేశ్యాభుజంగ దేవబ్రాహ్మణ శ్రీపాదపద్మారాధకులైన రేవునూళ్ల కులాన్వయబిరుదు విజయప్రశస్తి విజయీభవ–

## పల్లచెళ్ళవారి బిరుదు

స్వస్తి సమస్త పల్లచెళ్ళపురవరాధీశ్వర రాయనాయంక గండభేరుండ వికటనాయంకుల తలగుండుగండ చంద్రగిరి సోమనాథుని దిశాపట్ట కులుగొండ వీరక్షేత్రాణో భారతీకమల్లభట్టును గడపనిగండ ఉజ్జయినీ పురవరాధీశ్వర ఘడికోటమల్లని తలగుండుగండి భానూరి ప్రాంతీక మంగళభావ పల్లికులరాజ విదారణ దేగనాగదేవుని తలగుండుగండ ఉత్తమగండ వైరిగండ గండర గండ గండభేరుండ కొట్టల కేతినేని ప్రాణాపహార చీకటిరామనాథుని శిరశ్ఛేదన ఆర్యభీముని సప్తాంగచూరకార బొంటునాగదేవుని దళవిభాళ రాయనాయంక సురియకరభేతాళ కాలిపీఠంబును కంచుడమారంబును గరుడధ్వజంబును మౌక్తికంపు ఛత్రంబును ముత్యాలతురాయి గలవాడ ఉదయరాజు రాజ్యస్థాపనాచార్య శ్రీలక్ష్మీనారాయణ దేవదివ్య శ్రీపాదపద్మారాధకు లయిన ముత్యాలతటారాయ రాహుత్త వేశ్యాభుజంగు లయిన పల్లచెళ్ళ నాయంకులాన్వయ బిరుదు విజయప్రశస్తి విజయీభవ–

## జంబులూరివారి బిరుదు

స్వస్తి సమస్త భువనాభ్యంతరనిరంతత ఆదిగర్భేశ్వర అనవరత భూసురాశీర్వాదసంపన్న సకలవిద్యావిశారద శరణాగతవజ్రపంజర ఉన్మదన మదనమోహన వశీకరణసంతాప కామినీ పంచబాణావతార అరిరాయ హృదయమాహేశ్వర మూడురాయచుట్టుల భల్లాడ అలవూరి జోగుల పరమేశ్వర వరప్రసాదక డెబ్బ దేద్దురునాయంకులను బంతిగా బెట్టి చక్రక్రమంబుగా విడిపించి నట్టి నరవర సమర ఘోరభంగప్రతాప గోపికొండ దానవమురారి త్రివిక్రమ చూడామణి కంచిచూరకార గజమల్లుతలగుండుగండ అల్లుభీమునిసప్తాంగవైరి కంచి బొడిచి



కంచి తలుపులు డిచ్చి ఆలవూరి బాలబొమ్మేశ్వరదేవనగరికి యెక్కి తలుపులు దాటించిన యడబలరాయ ఝంగిలమన్ని యరగండ ఝంగిలమన్నె నాయకాంఛాప్లు బశితవిషితలగుండుగండ చండమార్తాండ భూరి దేవుని తలగుండుగండ పైడివెనకె వీరప్రవేశ చాంగుతొండమనేని తిక్కమనేని తలగుండుగండ చాంగువారి చాంగుమండలీకరగండ అదట్టు మండలీకులు అద్దెలున్నారు. దుష్టమండలీకులు వొడ్డెన వున్నారు. రణమందు మార్మలసినరావు తుట్టంకవన్నె నున్నారు. రాయమన్నె మృగవేటకాడ ఉన్నప్పటికిన్ని మోగుండు మారు వీటికిన్ని మోగుండు అక్కడిసహస్ర బాహాదోని దోసుబామల్ల కాత్తి కొమరురాయాంఛామల్ల నిత్యకల్యాణమున్ను పచ్చతోరణమున్ను గలిగి వారణాసి దేవదివ్య శ్రీపాదపద్మారాధక పంచవన్నెతయురాహుత్తవేశ్యాభుజంగ త్రైలోక్యమల్లభుజబలభీమపాండ్యరాజగజకేసరి పాండ్యరాజ్యస్థాపనాచార్య అవుదుంబరాభరణ గండహస్తి గండనారాయణ రాగెవాశి తెలుగు బొమ్మదళవాయ మాయదేవాచ్ఛామల్ల జంబులూరి పురవరాధీశ్వర కలవరోలని గుండ భూపతిశిరఃఖండన రాధాంక నిర్ధూమధామ మేడిపల్లికంచినేని శిరచ్ఛేదన చాంగూరి గజహత్తురాయ రగడకురాయ కోలాహలమంత్రి చూరకార పసవుల నిర్ధూమధామ ఆశ్రితపారిజాత దేవబ్రాహ్మణ శ్రీపాద పద్మారాధకులయిన జంబులూరినాయం కులాన్వయ బిరుదు విజయప్రశస్తి విజయీభవ–

## దేసట్లవారి బిరుదు

స్వస్తి సమస్త దేసట్లసింహమ సూర్యవీర్య సంకర్షణ ప్రజ మెచ్చుగండ చెంచుమలచూరకార మన్యదేగనితలగుండుగండ మద విరోధుల మానమర్దన మారుకుమారు మలయురాయకరగండ కూటువ మూకగుండెదిగుల దేదీప్యమాన దేసట్ల పురవరాధీశ్వర రాముని దూత రావణుని చెంకులుగండ కుంభకర్ణాదుని ముష్టివిదారకా పందిటిమీదిగుండ పడనున్న పిడుగ నీళ్లలోనిముల్ల డెప్పరపు నాయనాయంక రాయనాయంకుల శిరఃఖండన రాయనాయంకులకు సీములో నింకెల? దన్నాలకోటరాయవేశ్యాభుజంగ శ్రీ మల్లికార్జునదేవదివ్యశ్రీపాద

పద్మారాధక దేవబ్రాహ్మణ స్థాపనాచార్యులయిన దేసట్లకులాన్వయ బిరుదు విజయప్రశస్తి విజయీభవ–

## అరట్లవారి బిరుదు

స్వస్తి సమస్త అరట్లపురవరాధీశ్వర అరిరాయభయంకర ఆశ్రితపారిజాత అనవరతభూసురాశీర్వాదసంపన్న అరులహృదయ శూలమ మదమచ్చరుల తలగుండుగండ సమరనిశ్శంక సంగ్రామరాయ సంగరకిరీటి సకలదాన వినోద సంగీత సాహిత్య భరతవినోద భట్టజనకవిబాంధవ పతిహితహనుమంత భండనభీమ యెకెశెకేనుడు రాహుత్తులగండగండలవోరుగల్ల భలానికొలువున బల్లమదహస్తిని వకట్టు అట్టు మట్టను వకట్టుకు వంచింపగా అరట్లు అరట్లు అట్లుకొని తొలివిడెమున్ను తొలికట్నమున్ను పుచ్చుకొన్న మొల్లమూరి బిరుద రాఘవవరకుమార ద్వాదశి సోమవారమునాడు యలమింట పడమటిబైట కరెమల్లిదేవునితో తలపడి యుద్ధంబు చేసి సేనలనున్ను అతనిన్ని తెగటార్చి అర్ధనారీతలాటంబు పుచ్చుకొన్న అతులితబల్లిదుండ కామినీచిత్తచోర మన్యమృగవేటకాడ బిరుదురాజుల బెంకోలుగండ తురగా రోహణరేఖా రేవంత కోదండనారాయణ దేవదివ్య శ్రీపాద పద్మారాధకు లయిన అరట్ల నాయంకులాన్వయ బిరుదు విజయప్రశస్తి వియీభవ–

## పాలూరివారి బిరుదావళి

స్వస్తి సమస్త పాలూరి సింహమ పాలూరి పురవరాధీశ్వర కంచి చూర కార జగమల్లు తలగుండుగండ గంగేశ్వర భైరవుని పురంబు నాట బొడిచి దండించిన సురెలాంఛనవిభాళ చలమర్తిగండ భట్ట (కవిజన) బాంధవ దేవబ్రాహ్మణ శ్రీపాద పద్మారాధకులయిన పాలూరి నాయంకులాన్వయ బిరుదు విజయప్రశస్తి విజయీభవ–

## మల్లెలవారి బిరుదు

స్వస్తి సమస్త మల్లెలపురవరాధీశ్వర వోసబిరుదరగండ వొడ్డియ దళ విభాళరాయదండిపెదమోట్ట గండమన్నీలమారి చిక్కమం గరుడ తలాటరాయ రాహుత్తవేశ్యాభుజంగులైన మల్లెలనాయంకులాన్వయ బిరుదు విజయప్రశస్తి విజయీభవ–



## మరుపట్లవారి బిరుదు

స్వస్తి సమస్త మరుపట్లసింహమ మరుపట్ల పురవరాధీశ్వర బెల్లము కొండ రామనాథుని శిరశ్ఛేదన సురియకరభేతాళ కఠారిసాళ్వబిరుద తిని? కఠారి రాయాంఛామ్ల పొడవనిపోట్లున్ను పెట్టని త్యాగమున్ను పొగిడించుకునే నాయకాంఛామ్ల దేవబ్రాహ్మణ శ్రీపాదపద్మారాధకులైన మరుపట్ల నాయంకులాన్వయ బిరుదు విజయప్రశస్తి విజయీభవ–

## మండిపల్లివారి బిరుదు

స్వస్తి సమస్త మండిపల్లిసింహమ మండిపల్లి పురవరాధీశ్వర అంధకార జగజ్జ్యోతి లజ్జవైరాగ్య? సప్తాంగచూరకార భట్ట (కవిజన) బాంధవ చలమర్తి గండ రాచర్లదుర్గస్థాపనాచార్య స్వయంభూనాథ దేవదివ్య శ్రీపాదపద్మారాదకులయిన మండిపల్లి నాయంకులాన్వయ బిరుదు విజయప్రశస్తి విజయీభవ–

## మధుపాలవారి బిరుదు

స్వస్తి సమస్త మధుపాలసింహమ మధుపాల గోత్రపవిత్ర నాయక చూడామణి యలదాయ వెన్ను సమ్మెట ఘోరరణశూర పరకార్యసముద్ధారణ సేతుబంధరామేశ్వర దేవదివ్య శ్రీపాదపద్మారాధకు లయిన మధుపాల నాయంకులాన్వయబిరుదు విజయప్రశస్తి విజయీభవ దిగ్విజయీభవ–

## మరిచెట్లవారి బిరుదావళి

స్వస్తి సమస్త మరిచెట్ల సింహమ మగ్చరంబురిగండ వేదండ పురవరాధీశ్వర యాదవగిరి చూరకాల కప్రవిటె (?) గొంగ రణముఖ భైరవ అభంగ రాయరాహుత్త వేశ్యాభుజంగ దేవబ్రాహ్మణ శ్రీపాదపద్మారాధకులయిన మరిచెట్ల నాయంకులాన్వయ బిరుదు విజయప్రశస్తి విజయీభవ–

## మోతేవారి బిరుదు

స్వస్తి సమస్త మోతేగజసింహమ జయంతవసంతనలకూబర సౌందర్య ధర్మ విస్మరణ కారణ జననాథసింహాసన నందూరి వీరక్షేత్రాణో (జంఝామారుత)

స్వచ్ఛమౌక్తికమైశివైకఛత్ర బిరుదచ్ఛాయాసమాచ్ఛాదిత కువలయప్రభావనిలయ యద్దబల శాసనాధీశ్వర దేవబ్రాహ్మణ శ్రీపాదపద్మారాధకులయిన మోతేనాయంకులాన్వయ బిరుదు విజయప్రశస్తి విజయీభవ–

## ముద్దునూళ్ళవారి బిరుదు

స్వస్తి సమస్త ముద్దునూళ్ళసింహమ హేమానుకూలి నింగివెల్లి పురవరాధీశ్వర సాహిమెరాణి తలగుండుగండ మొనకు మొన సూత్రధారి మొనకు మచ్చరిగిబరిగండ దేవబ్రాహ్మణ శ్రీపాదపద్మారాధకు లయిన ముద్దునూళ్ళ నాయంకులాన్వయ బిరుదు విజయప్రశస్తి విజయీభవ–

## గుండేటివారి బిరుదు

స్వస్తి సమస్త గుండేటిసింహమ గండరాభరణ గండరగండ గండ భేరుండ సామంతకొమర ఘండేరాయ సామంతకొమర జవిణికెనారాయణ వేగిమువ్వరగండ వేగిదిశాపట్టరాయ భుజంగ దేవబ్రాహ్మణ శ్రీపాదపద్మారాధకులయిన గుండేటి నాయంకులాన్వయ బిరుదు విజయప్రశస్తి విజయీభవ–

## డెబ్బదులవారి బిరుదు

స్వస్తి సమస్త డెబ్బదులసింహమ రణరంగ భైరవ మల్లికావల్లభ సహకారబాంధవ కొత్త బిరుదులనెత్తిపిడుగ గంధగజగనయవాస బిరుదరగండ వొడ్డియదళవిభాళ కొలిపాక పురవరాధీశ్వర శ్రీ నారాయణ దేవదివ్య శ్రీపాదపద్మారాధకులయిన డెబ్బదుల నాయంకులాన్వయ బిరుదు విజయప్రశస్తి విజయీభవ–

## తాండిపాములవారి బిరుదు

స్వస్తి సమస్త తాండిపాములవంశోద్భవ గండరగండ ప్రజమెచ్చుగండ శ్రీధాన్యకటక పురవరాధీశ్వర యేటిపేరు కృష్ణవేణీ బంటుపేరు ప్రజమెచ్చుగండ రాజుపేరు ప్రజమెచ్చుగండ రేవుపేరు పాపవినాశన పందుగపేరు నడుగుచు పనుగ? పదివేలతోనున్ను బిరుదు ధరించిన బ్రాహ్మణ శ్రీపాదపద్మారాధకులయిన తాండిపాముల కులాన్వయ బిరుదు విజయప్రశస్తి విజయీభవ–



## గుండిప ర్తివారి బిరుదు

స్వస్తి సమస్త గుండిపర్తి పురవరాధీశ్వర ఆడితప్పువరగండ ఆభరణ మండలసంస్తుత్య ఆశ్రితకల్పవృక్షమ గుండిపర్తినాయంకులాన్వయ బిరుదు విజయప్రశస్తి విజయీభవ–

## కాటెపర్తివారి బిరుదు

స్వస్తి సమస్త కాటె పర్తిసింహమ బెళుకుటొయ్యారంపు చక్కని మన్యసింహమ అనవరత భూసురాశీర్వాదసంపన్న చెనకువైరులమిండ స్వామిహితైక భాస్వత్‌స్థైర్య (శౌర్య?) మేటి ప్రతాపాధీశ్వర వైరిసప్తాంగహరణ గొడగనూరి మల్లని సప్తాంగహరణ దండినూరి మల్లనిదానభంజన సంగ్రామశూర లేని బిరుదులు పొగిడించుకునే నాయకాంచామ్ల గంధకస్తూరి పరిమళాలంకృత వైరి జీమూతపవన గలాలుసరి గజాంకుశ వొడ్డియ దేసగి సప్తాంగహరణ ప్రల్లదమాడి పొయ్యేటన్ను మీసరగండ మాహూరిపురీవీరక్షేత్రాణో భారతీక మల్లపరాక్రమ కంఠీరవ కనకగిరిదుర్గ విభాళు లైన కాటెపర్తి నాయంకులకు ఉదయభానుండు మెచ్చి యిచ్చిన ధవళఛ్ఛత్ర చామరాందోళి కాలవట్టంబులును పంచవన్నె పావడంబులున్ను బిరుదు ఔదార్య వితరణ గుణంబులు గల్గి ధనకనక వస్తువాహన సమృద్ధి గల్గిన కాటెప ర్తినాయంకులాన్వయ బిరుదు విజయప్రశస్తి విజయీభవ–

## పాలపర్తివారి బిరుదు

స్వస్తి సమస్త పాలపర్తిగోత్ర పవిత్ర బిరుదు బెక్కోలుగండ పొసబిరుదు కొమరవేశ్యాభుజంగ అసహాయ కొమరరక్షక బెళియత్రి నేత్ర రణమున వెన్నిచ్చి వచ్చె నాయంకరగండ పరివారసంగడి సన్నాహ జాణమర (?) వివేకనారాయణ

దేవబ్రాహ్మణ శ్రీపాదపద్మారాధకులయిన పాలపర్తి నాయంకులాన్వయ బిరుదు విజయప్రశస్తి విజయీభవ–

## కందూరివారి బిరుదు

స్వస్తి సమస్త కందూరి గోత్రపవిత్ర రణమున వెన్నిచ్చి వచ్చే నాయకాంఛామల్ల కూటువమూకలగుండెదిగుల రణమున పంతములాడి వెనకతీసే నాయకరగండ కోటానుకొమ్మానం జవరాలినిన్ని యేలినయేలికనున్న యరగండ్రాన విడిచిపొయ్యే నాయకాంఛామల్ల శ్రీరంగనాథదేవదివ్యశ్రీపాద పద్మారాధకులయిన కందూరి నాయంకులాన్వయ బిరుదు విజయప్రశస్తి విజయీభవ–

## పెనుగొండవారి బిరుదు

స్వస్తి సమస్త పెనుగొండ కేసరి అపుదుంబరాయ అకలంక మల్ల భట్టర భావ పరనారీదూర ఖండసహాయ బిత్తరపుగొయ్య అంతరాంతర అరిమండలీ కులతలగుండుగండ తిరువీధి వీరచూడామణులయిన పెనుగొండ నాయంకులాన్వయ బిరుదు విజయప్రశస్తి విజయీభవ–

## వరువట్లవారి బిరుదు

స్వస్తి సమస్త వరుపట్ల వంశోద్భవ అకలంకరామ బల్లరగండమూరు లోకరగండ మూర్తిముకుంద ధరాభరణబిరుదాంక రుద్రబిరుద బ్రహ్మరాక్షస గొలిపాకగోత్రపవిత్ర రాజనారాయణ దేవదివ్య శ్రీపాద పద్మారాధకులయిన వరువట్ల నాయంకులాన్వయబిరుదు విజయప్రశస్తి విజయీభవ–

## నింగివెల్లివారి బిరుదు

స్వస్తి సమస్త నింగివెల్లి పురవరాధీశ్వర వెగువకులవంశతే మండలీ కాంఛామ్ల మెల్లా ఘోడానుబంధతె మండలనాయకాంఛామల్ల మెల్లా ఘోడానుబంధతె దోయికులదంచుణి శౌరికుల నాయకాంఛామల్ల నింగివెల్లి నాయంకులాన్వయ బిరుదు విజయప్రశస్తి విజయీభవ–



## పాండ్రాజులవారి బిరుదు

స్వస్తి సమస్త పాండ్రాజుల నాయకవంశోద్భవ త్రైలోక్యమల్ల భుజబలభీమ పాండ్యరాయమానమర్దన పాండ్యరాయ తలగుండుగండ పాండ్యరాజ గజకేసరి పరివారసంగడిసన్నాహ శత్రుతిమిరమార్తాండ దేవబ్రాహ్మణ శ్రీపాద పద్మారాధకులయిన పాండ్రాజుల నాయంకులాన్వయ బిరుదు విజయప్రశస్తి విజయీభవ–

## పులియాలవారి బిరుదు

స్వస్తి సమస్త పులియాల పురవరాధీశ్వర సత్యహరిశ్చంద్ర శౌచగాంగేయ మూరులోకరగండ గండగోవాళ కాంచీపుర రక్షపాలక కనకపూర్ణదాన ధారాప్రవాహ అసహాయశూర విక్రమార్కావతార దేవబ్రాహ్మణ దివ్య శ్రీపాదపద్మారాధకులయిన పులియాల నాయంకులాన్వయ బిరుదు విజయప్రశస్తి విజయీభవ–

## ఉప్పునూరివారి బిరుదు

స్వస్తి సమస్త ఉప్పునూరి వంశోద్భవ దాయలతలగుండుగండ వైరివీర సామంతరాగొల అభేద్యవైరినాయంకకోటలగొంగ హంకార రాయమండలీకరగండ అదటుమండలీకరవేశ్యాభుజంగ కూడివిచ్చు నాయకరగండ కూటువరాయకొమార గుండెదిగుల ఉన్మదనమదన మోహనవశీకర కామినీపంచబాణావతార దేవబ్రాహ్మణ శ్రీపాద పద్మారాధకులయిన ఉప్పునూరి నాయంకులాన్వయ బిరుదు విజయప్రశస్తి విజయీభవ–

## కంజరియవారి బిరుదు

స్వస్తి సమస్త కంజరియ పురవరాధీశ్వర గండరాభరణ కూడివిచ్చు వరగండ వైరినారాయణ వైరిసామంత వైరిభుజాదండ వైరిగజకేసరి వైరి నాయంకమదవిభాళ వైరిమన్నీలవెూర చిక్క మొనసిన చోట వెన్నిచ్చే నాయ కరగండ

హంకారకొమరవేశ్యాభుజంగ దేవబ్రాహ్మణ శ్రీపాద పద్మారాధకులయిన కంజరియ నాయంకులాన్వయ బిరుదు విజయప్రశస్తి విజయీభవ దిగ్విజయీభవ–

## యేటుకూరివారి బిరుదు

స్వస్తి సమస్త యేటుకూరి వంశోద్భవ సామంతకొమర ఖండేరాయ మల్లసామంతకొమరఖండేరాయ దాయలతలగుండుగండ పూర్వసింహాసనాధీశ్వర అవుణిభావనారాయణ కూడివిచ్చు నాయకరగండ కూడలిసంగమేశ్వర శ్రీపాద పద్మారాధకులయిన యేటుకూరి నాయంకులాన్వయ బిరుదు విజయప్రశస్తి దిగ్విజయీభవ–

## పైడిపాల వారి బిరుదు

స్వస్తి సమస్త పైడిపాల వంశోద్భవ సువర్ణనక్షత్ర శ్వేతచ్ఛత్రలాంఛన చనసునాయంకరగండ యేరువరాజు రాజ్యస్థాపనాచార్య ఘుడియంకమల్ల అర్థిజనచింతామణి వొడ్డియదేవుని సర్వదళవిభాళ స్వామి కార్యధురంధర స్వామి కార్య వంచకుని తలగుండుగండ పరమన్యభయంకర దేవ బ్రాహ్మణ దివ్య శ్రీపాద పద్మారాధకులయిన పైడిపాల నాయంకులాన్వయ బిరుదు విజయ ప్రశస్తి విజయీభవ–

## ఆవాలవారి బిరుదు

స్వస్తి సమస్త ఆవాల వంశోద్భవ నెరవాడగొంగ చేతనియంక తానున్నకోట విడిచి మారుకోట సంధించేనాయకాంఛామల్ల పరదళ భయంకర పరనారీదూర పరమనిస్తారక పరపురుషార్థక చౌషష్ఠి విద్యావినోద నేలకువట్ట మాడునాయ కాంఛామల్ల దేవబ్రాహ్మణ శ్రీపాద పద్మారాధకులయిన ఆవాల నాయంకులాన్వయ బిరుదు విజయప్రశస్తి విజయీభవ–

## శనగపూడివారి బిరుదు

స్వస్తి సమస్త శనగపూడి వంశోద్భవ బిరుదుబిసగొంబు రాయరగండ



ఛత్తీసాయుధప్రవీణ గండరాభరణ ఓరుగంటి వీరక్షేత్రాణో జంఝూమారుత పారావారగంభీర దుష్టరగండరాయ త్రిపురారిదేవుని తలగుండుగండ రాయ కొమరవేశ్యాభుజంగ విప్పర్లకోట విలువిద్య పరశురామ గయ్యాలించుమడ మెట్టుగండ తురగారోహణ రేఖారేవంత దేవ శ్రీపాద పద్మారాధకులయిన శనగపూడి నాయంకులాన్వయ బిరుదు విజయప్రశస్తి విజయీభవ–

## పాయేటివారి బిరుదు

స్వస్తి సమస్త పాయేటి వంశోద్భవ పరబలసాధక పరివారసంగడి సన్నాహ త్యాగిజీమూతవాహన కూడివిచ్చునాయంకరగండ మల్ల కుమారమాన మర్దన మామనియ్యంకరమార మారుమలయు నాయంకరగండ కూడలిసంగమేశ్వర శ్రీపాద పద్మారాధకులయిన పాయేటి నాయంకులాన్వయ బిరుదు విజయప్రశస్తి విజయీభవ–

## గోసంగివారి బిరుదు

స్వస్తి సమస్త గోసంగివంశోద్భవ జంగిలీమండల (నాయ) కాంఛామల్ల మండలీకరమృగవేటకాడ నిశ్శంకనిర్భయమల్ల జాదువరాయ పరశులింగమ సప్తదళపతి నాయకాంఛామల్ల వులువభానుని సప్తాంగచూరకార మలుకనే మాలుని మానమర్దన గజగంధవారణ తలాట రాయరాహుత్త వేశ్యాభుజంగులైన గోసంగి నాయంకులాన్వయ బిరుదు విజయప్రశస్తి విజయీభవ–

## మంగిపూడివారి బిరుదు

స్వస్తి సమస్త మంగిపూడివంశోద్భవ అత్యుగ్రనారసింహదంష్ట్ర అతులితపరాక్రమ మధుర గుణసంపన్న భీమ విఖ్యాత బిరుదావళి బిరుదాంకులకుటి లారి గణముఖనికళంక శ్రీపార్వతీదేవుని దివ్య శ్రీపాదపద్మారాధకులయిన మంగిపూడి నాయంకులాన్వయ బిరుదు విజయప్రశస్తి విజయీభవ–

## మాధవరేకులవారి బిరుదు

స్వస్తి సమస్త మాధవరేకుల (కుల) కమలమార్తాండ దేవబ్రాహ్మణ భటవందన అరినృపాల వెన్ను సంబెట రాయకుండ దీక్షాదిగురువ రణము పొడగని శంకించే నాయకాంఛామల్ల వులువులు వాప్రత్తిన్ని? కోరుపట్టెనాయ కాంఛామల్ల గుహుని రాజ్యస్థాపనాచార్యులయిన మాధవరేకుల నాయంకులాన్వయ బిరుదు విజయప్రశస్తి విజయీభవ-

## శిరుసునూళ్ళవారి బిరుదు

స్వస్తి సమస్త శిరుసునూళ్ళవంశోద్భవ వైరినాయంకరగండ అరిరాయగండభేరుండ మేదినీరాయమలవరగండ బల్లాడరాయమదవిభంజన వెన్నాడరాయని గర్వాపహరణ కూడివిచ్చు నాయకరగండ కొలనివీటి సర్వగర్వాపహరణ పరివార సంగడిసన్నాహ హేమాద్రి దానచింతామణి అరిబల తిమిర మార్తాండ దేవబ్రాహ్మణ శ్రీపాదపద్మారాధకులయిన శిరుసునూళ్ళ నాయంకులాన్వయ బిరుదు విజయప్రశస్తి విజయీభవ-

## ముయ్యూర్పులవారి బిరుదు

స్వస్తి సమస్త ముయ్యూర్పులవంశోద్భవ కన్నడదళవిభాళ గుత్తిహన్నిబ్బరగండ గుత్తిహత్తుమువ్వరగండ రాదేవు సహదేవు తలగుండుగండ బొగ్గులకొమాళ్ళ తలగుండుగండ మొనమొట్టుగండ పెడమొట్టుగండ అభినవదిశావల్లభ అర్థిజన చింతామణి అలఘుతర ప్రతాప దయారస దీకలాప శ్రీనారాయణదేవదివ్యశ్రీపాదపద్మారాధకులయిన ముయ్యూర్పుల నాయంకులాన్వయ బిరుదు విజయప్రశస్తి విజయీభవ-

## శ్రీమెళ్ళవారి బిరుదు

స్వస్తి సమస్త శ్రీమెళ్ళపురవరాధీశ్వర అసహాయగండనారాయణ త్రిభువనకోటగొంగ చలముకు చలమ ర్తిగండ తిక్కన బయ్యని తలగుండుగండ



గంగాసురుని తలగుండుగండ ఘడికోటమల్ల మలుక జీమూత తలగుండు గండ ఉత్తమగండ ఉభయరగండ ఉదుటుమ్మన్నియరగండ దేవబ్రాహ్మణ శ్రీపాదపద్మారాధకులయిన శ్రీమెళ్ళనాయంకులాన్వయ బిరుదు విజయ ప్రశస్తి విజయీభవ-

## అయోధ్యవారి బిరుదు

స్వస్తి సమస్త అయోధ్యపురవరాధీశ్వర సత్తిక తప్పువరగండ ఆది రాజాన్వయ చరిత్ర పూర్వసింహాసనాధీశ్వర అరుల పొడగని వెన్నిచ్చి వచ్చే నాయకాంఛామల్ల కూడివిచ్చు నాయకరగండ పరివార సంగడి సన్నాహ అయోధ్యనాయంకులాన్వయ బిరుదు విజయప్రశస్తి విజయీభవ-

## కొమరవెల్లివారి బిరుదు

స్వస్తి సమస్త కొమరవెల్లివంశోద్భవ పరబలసాధక పరబల నిరంకుశవితరణగుణకర్ణ దానమాన వివేకవిద్యాధర ప్రజమెచ్చుగండ బంధుజనచింతామణి భరతసంగీత సాహిత్యరత్నాకర నాయకరత్నమ నవరసాలంకార సత్యహరిశ్చంద్ర దేవబ్రాహ్మణహితార్థక చారుకులదీపక పవిత్ర యెర్వరాజు (రాజ్య) మూలస్తంభమ దొడ్డభీమదేవుని శిరచ్ఛేదన బలుసామంతుల తలగుండుగండ రణరంగ విజయసన్నాహ మన్యభీమనేని దళవిభాళ ఆవుల గోపునిదిశాపట్ట సమర నిశ్శంక మన్యభీమినాయని మానమర్దన మన్యమాది నేనివిభాళ మన్యహితని తలగుండుగండ రూపకందర్ప లక్ష్మీలక్ష్మణసంపన్న గుత్తికోట ముమ్మినేని ప్రాణాపహార దశభీమినేని దిశాపట్ట అశ్వకామిదేవుని విదారణ యెర్వతొండభూపతి దక్షిణభుజాదండ మెరుగుటలుగులు గని వులికే నాయకరగండ ఉత్తమగండ ఉభయరగండ గండరగండ గండభేరుండ నారసింహ అనంతభండార యెర్వరాజు కార్య హితార్థక దేవబ్రాహ్మణ శ్రీపాదపద్మారాధకులయిన కొమరవెల్లి నాయంకులాన్వయ బిరుదు విజయ ప్రశస్తి విజయీభవ దిగ్విజయీభవ-

## చెరుకువారి బిరుదు

స్వస్తి సమస్త చెరుకునాయకవంశోద్భవ త్రైలోక్యమల్ల భుజబలభీమ పాండ్యరాజగజకేసరి పాండ్యరాయప్రస్థాపనాచార్య ఔదుంబరాభరణ అభగ్గహివుళ గంధహస్తి గండనారాయణ పాండ్యవాశి తెలుంగు బొమ్మెదళవాయ మామదెకాంఛామల్ల జంబులూరిపురవరాధీశ్వర కలువకొలనిగండ భూపతిశిరః ఖండన చాగుగజాహత్తురాయ జలుక్కురాయకోలాహల మన్నియచూరకార పసపులవంశ నిర్ధూమధామ ఆశ్రితపారిజాత బంధుజనకల్పభూజమ సాహస రఘురామ దేవబ్రాహ్మణ దివ్యశ్రీపాదపద్మారాధకులయిన చెరుకునాయంకులాన్వయబిరుదు విజయప్రశస్తి విజయీభవ–

## మారట్లవారి బిరుదు

స్వస్తి సమస్త మారట్లవంశోద్భవ మల్లవోలి పురవరాధీశ్వర అభంగరాయ సాళ్వధట్టివిభాళ దుర్భిక్షవైరిమధ్యాహ్న కల్పవృక్షమ నుడిదంతిగండ శరభతలాట రాయరాహుత్త వేశ్యాభుజంగ శ్రీగిరినాథదేవదివ్య శ్రీపాదపద్మారాధకులయినమారట్లనాయంకులాన్వయ బిరుదు విజయప్రశస్తి విజయీభవ–

## కొప్పాళ్ళవారి బిరుదు

స్వస్తి సమస్త బిరుదుబొల్లోదుగండ అర్ధనారీనటేశ్వర చనసు నాయంకరగండ చెలువరగండ శలగోలపార్థివ లాలుసరిగజాంకుశ దిశల బిరుద ప్రతాపాధీశ్వర గురిజాల ముమ్మదేవు మాననిదళిత యిమ్మడిముమ్మడి దళవిభాళ దుగ్గిదారవేముల వీరక్షేత్రాణో భారతీకమల్ల దొడ్డపాటిసమరమన్నియ జంఝామారుత మిమ్మిరేల ప్రాకార హల్లకల్లోల గూండూరి యొభళు తలగుండుగండ దూదిబొమ్మిరాజు మనోభయంకర వొడ్డియదేశాది సామంత గర్వాపహరణ గజరాజ బిరుదప్రతాపాధీశ్వర పొడవనిపోటున్ను పెట్టనిత్యాగమున్ను పొగిడించుకొనే మన్యకొమాళ్ళమిండ ఆడితప్పువరగండ అష్టదిగ్రాజమనో భయంకర ఆదిగర్భేశ్వర దేవబ్రాహ్మణ



దివ్యశ్రీపాదపద్మారాధకులయిన కొప్పాళ్ళ నాయంకులాన్వయ బిరుదు విజయప్రశస్తి విజయీభవ–

## నెలవెల్లివారి బిరుదు

స్వస్తి సమస్త నెలవెల్లిపురవరాధీశ్వర మార్బలసింహమ రాయనాయంక ఉత్తమగండ చెల్లురణభూమి నాయకాంఛామల్ల మల్ల వారటుమురారి పట్టుతలాట దక్షిణభుజాదండ యెర్వసింహాసనాధీశ్వర సింహతలాట రాయరాహుత్తవేశ్యా భుజంగ సంగ్రామపరశురామ దేవబ్రాహ్మణ దివ్య శ్రీపాదపద్మారాధకులయిన సూర్యపుటము గుడారంబును సువర్ణటెక్కెంబును కంచుడమారంబును కాలిపెండెంబును సింహతలాటంబునుంగల నెలవెల్లినాయంకులాన్వయబిరుదు విజయప్రశస్తి విజయీభవ దిగ్విజయీభవ–

## నిడిమానివారి బిరుదు

స్వస్తి సమస్త సకలసామ్రాజ్యలక్ష్మీ లక్షణసంపన్న మహాసామంత పదవీసమేత అనవరతభోగభాగ్యధురంధర ఉత్తరసింహాసనాధీశ్వర సత్యహరిశ్చంద్ర సమరరఘురామ చారుకులదీపక నిడుమాని గోత్రపవిత్ర ఉదయరాజు రాజ్యస్థాపనాచార్య మండలీకవీరప్రతాప మండలీకరాజవేశ్యాభుజంగ మండలీ కరగండ అర్థిగడపనిగండ ప్రత్యర్థి తలగుండుగండ బాహుబలభీమ అన్నదాన ఉదకదాన వస్త్రదాన గోదాన భూదాన చింతామణి సకలవిద్యాపారంగత సకలకళాప్రవీణ సకలసేనాధీశ్వర యెర్వతొండభూపతి తలగుండుగండ అదవరాజు దక్షిణభుజాదండ అదవకులరక్షక చెంచుమలచూరకార ఆదవెన్ని దుర్గవిబాళ ఆదవెన్నిసప్తాంగహరణ ఆదవెన్ని కొండభూపతి సర్వగర్వాపహరణ రాచూరి మదని బెంకోలుగండ రాచూరి సోమని బెంకోలుగండ రాచూరి సప్తాంగహరణ గిరిదుర్గవజ్రాయుధ వనదుర్గ వైశ్వానర జలదుర్గబడబానల కాకతిగణపతిరాజు రాజ్యభారక గండభేరుండ పట్టుతలాట రాయరాహుత్త వేశ్యాభుజంగ దేవబ్రాహ్మణ ప్రతిపాలక పుత్రమిత్రకళత్రాది

బాంధవసంరక్షక అఖిలధర్మ స్వరూప ఆదినారాయణ సేవాపరుండ సకల కార్యవిశారద కులస్థాన పౌరుష ప్రసిద్ధులైన నిడుమాని నాయంకులాన్వయబిరుదు విజయప్రశస్తి విజయీభవ దిగ్విజయీభవ–

## విరియాలవారి బిరుదు

స్వస్తి సమస్త మన్నెకులసరోవర రాజహంస సరస్వతీకర్ణావతంస అయ్యనసింహ అరిబలగండ విరియాలకులకమలమార్తాండ సత్యహరిశ్చంద్ర శౌచగాంగేయ పరనారీదూర కటకమున్నర్య శౌర్యమున్నర్య బంధుజనకల్ప భూరుహ నానాప్రశస్తులైన యిమ్మడిరాజుల తలగుండుగండ వొడ్డురాజుల దిశాపట్ట పట్టలన్ నీ బలంబుల గెల్చిన భీమనాథునకు కరికాలుండు మెచ్చియిచ్చిన యుభయవింజామరంబులును సింహముఖ కనకదండంబులును కాళాంజియు లోహఖండ తురగంబును మాణిక్యతలాటంబును తెల్లపట్టు గుడారంబును కంచుడమారంబును ముత్యాల కుచ్చుగొడుగు గల సురధాని నిర్ధూమధామ రాతగుంట్లపురవరాధీశ్వర వైరికుమారవాహినీ భుజంగవైనతేయ కార్తికేయదుష్టతరరక్షణ దాతనిర్ఘాతదోర్దండకరహొంతకమల్ల కార్ముకధనంజయ పతిహితహనుమంత భండనభీమ ఆజ్ఞాదండ ప్రతిజ్ఞా పరశురామ పరబలభీమ దుష్టరాజగజాంకుశ టేరాసామంత భారామండలీకరగండ గడి విడిచి కూడివిచ్చేనాయకాంఛామల్ల వోరుగంటి కాకతిరాజు రాజ్యస్థాపనాచార్య పరాక్రమ కంఠీరవ శ్రీరంగధామదేవదివ్య శ్రీపాదపద్మారాధకులయిన విరియాల నాయంకులాన్వయబిరుదు విజయప్రశస్తి విజయీభవ–

## మట్నూళ్ళవారి బిరుదు

స్వస్తి సమస్త మట్నూళ్ళ సింహమ మట్నూళ్ళగోత్ర మహామండలేశ్వర భండనపార్థివమిండ గడకేసరి దుష్టరాజగజాంకుశ రణరంగ భైరవ కొంకణ దిశాపట్ట రణరంగభీమ విమలకళాపారీణ అనంతభోగ సంపన్న ఉభయదళ దక్షిణదేశాధీశ్వర



సన్నద్ధ తురుష్కరసందోహ సమరమార్తాండ ప్రళయకాల విక్రమ కళాపారీణ బిరుదుమన్యవిభాళ ఉదయభానుండిచ్చిన పలుబిరుదు రాహుత్త తన కింత బిరుదుసేగి నాయకరగండ బసువశంకర బిరుదంబు గైకొన్న మహామేటిప్రతాపశూర కమ్మనూరి నాగన కోలాహల యిమ్మడి ముమ్మడి మండలీకరగండ కేరమమన్నియ విభాళ అటకుంట్ల పురవరాధీశ్వర మధ్యాహ్న విరోధి నాయకాంఛామల్ల మట్నూళ్ళగోత్ర పవిత్ర భైరవవరప్రసాదక దక్షిణదోర్దండ సమరకీర్తికర్పూర బ్రహ్మాండకరండ బిరుదురాజ భయంకర యేకాంగివీర చోడకటక వజ్రప్రాకార సంగడిరక్షపాలక బిరుదు గైకొని కనకగిరిరాజులతో దలపడి ఖండతుండంబులు చేసి వారిశిరంబులు దునుమాడి మగటిమి మెఱసి తమ్మేలినయుదయభానుండు మెచ్చి యిచ్చిన కాలిపెండెంబును కంచుడమారంబును నవరత్నకలితతలాటంబును కరితురగాందోళికంబులును మెచ్చియిచ్చిన మట్నూళ్ళనాయంకులాన్వయబిరుదు విజయప్రశస్తి విజయీభవ దిగ్విజయీభవ–

## కదురునూళ్ళవారి బిరుదు

స్వస్తి సమస్త కదురునూళ్ళవంశోద్భవ యడగండ వరదరాజుల తలగుండుగండ కోటానుకొమ్మ యేలినయేలికను విడిచి పొయ్యే నాయకాంచామల్ల పరివారసంగడిసన్నాహ భండనభీమ శ్రీరామేశ్వరదేవ దివ్యశ్రీపాద పద్మారాధకు లయిన కదురునూళ్ళ నాయంకులాన్వయబిరుదు విజయప్రశస్తి విజయీభవ దిగ్విజయీభవ –

## పలుకునూరివారి బిరుదు

స్వస్తి సమస్త పలుకునూరి వంశోద్భవ నగర పంతములాడి వెన్నిచ్చి వచ్చేనాయకాంఛామల్ల యేలినయేలిక పోటాసించి తిరిగి చూచేనాయకాంఛామల్ల ఏలినఏలికను రణమందు విడిచిపొయ్యే నాయకాంఛామల్ల శ్రీరామేశ్వరదేవ దివ్యశ్రీపాదపద్మారాధకులయిన పలుకునూరి నాయంకులాన్వయ బిరుదు విజయప్రశస్తి విజయీభవ–

## రావిపాలవారి బిరుదు

స్వస్తి సమస్త రావిపాలవంశోద్భవ పెనుగొండకేసరి అవుదుంబరాయ అకలంకమల్ల భట్టరభావ పరనారీదూర ఖండసహాయ బిత్తరుపు గొయ్య అంతరంతర అరిమండలీకుల తలగుండుగండ తిరువీధి వీరచూడామణులయిన రావిపాల నాయంకులాన్వయ బిరుదు విజయప్రశస్తి విజయీభవ–

## కొమ్మునూరివారి బిరుదు

స్వస్తి సమస్త కొమ్మునూరివంశోద్భవ ఉత్తమగండ ఉభయరగండ విరోధించు నాయంకుల శిరఃఖండన ప్రతివిధానమాన వరబెంకోలుగండ పొన్న బలనాథదేవ దివ్యశ్రీపాదపద్మారాధకులయిన కొమ్మునూరి నాయంకులాన్వయ బిరుదు విజయప్రశస్తి విజయీభవ–

## బలసట్లవారి బిరుదు

స్వస్తి సమస్త బలసట్లసింహమ బలసట్ల పురవరాధీశ్వర చోడరాజ్య స్థాపనాచార్యులైన శరణాగతవజ్రపంజర అరిబలభీమ చనసు నాయంకర నిర్ధూమధామ రామేశ్వరదేవదివ్య శ్రీపాద పద్మారాధకులయిన బలసట్లనాయం కులాన్వయ బిరుదు విజయప్రశస్తి విజయీభవ–

## ధాన్యవోలివారి బిరుదు

స్వస్తి సమస్త ధాన్యవోలివంశోద్భవ అనవరతగుణగణాలంకార సహస్రాభరణ మండలస్తుత్య అభంగవీరనారాయణ శత్రుమన్యవేశ్యాభుజంగ శరణాగత వజ్రపంజర అనవరత కనక కర్పూరదానధారాప్రవాహ ధాన్యవోలి పురవరాధీశ్వర శ్రీరంగధామదేవదివ్యశ్రీపాదపద్మారాధకులయిన ధాన్యవోలి నాయంకులాన్వయ బిరుదు విజయప్రశస్తి విజయీభవ దిగ్విజయీభవ–



## కోర్కంటివారి బిరుదు

స్వస్తి సమస్త మహామండలేశ్వర మహాసామంత పదవీసమేత ఉత్తర దిగ్భాగపూర్వసింహాసనాధీశ్వర అయోధ్యాపుర సామ్రాజ్యలక్ష్మీ నిర్వాహక హరిశ్చంద్రమహారాజు రాజ్యస్థాపన విశేష కార్యధురంధర లోహితాస్య దక్షిణ భుజాదండ భాగీరథ సకలకార్యవిస్తారక అనవేమమహీపాలుని సకల సేనాధీశ్వర దితిపురమహారాజు రాజ్యభారక యిక్ష్వాకుసేనాముఖ రవికులాంభోనిధి చంద్ర హరిక్రీడావినోద అజుపాదపంకజభ్రమరాయమాణ దశరథమనోరథ సౌస్మిల చతుర్దిక్ష మహీమండల మండితాయమాన రామభాగీరథ లక్ష్మణ శత్రుఘ్న కార్యనిర్వాహక మాహిష్మతీ పురవరాధీశ్వర శ్రీలక్ష్మణ దేవమహాపట్టాభిషేక మహోత్సవ మహాసంతుష్ట కరికాలచోడ రాజ్యసముద్ధారక కావేరీతీర శ్రీరంగనాథదేవ దివ్యశ్రీపాదపద్మారాధక చతుర్థకుల సుధార్ణవ సంపూర్ణచంద్ర రాజేంద్రచోడ రాజ్యప్రతిపాలక సమరముఖ హనుమంత కోర్కంటిగోత్ర కదనత్రినేత్ర వెన్నిచ్చి కుడు? నాయంకరగండ కార్యబృహస్పతి స్వరూప ఘడికోటమల్లయలదాయరాక్షస వైరివనకుఠార శత్రుకులనిర్జిత అరిబలతల్లడ సాహసాభరణ గిరిదుర్గ వజ్రాయుధ స్థలదుర్గహలాయుధ వనదుర్గవైశ్వానర జలదుర్గబడబానల సత్యహరిశ్చంద్ర యేరువకర్ణుని సముఖంబున పంజులబండవాగున సబలాన పులిని బొడిచిన సబలసహస్రబాహ పులియమార్కోలుగండ బాహుబలభీమ వైరిగజవిదళ పంచానన సమరముఖరామ దీక్షాదక్షపారిజాత పరివారసంగడిసన్నాహ అఖిలజన పురుహూత ఆశ్రితపారిజాత వాడూరి పురవరాధీశ్వర శ్రీ నరసింహదేవ దివ్యశ్రీపాదపద్మారాధక యిత్యాది నామాదిప్రశస్త సమస్తహితులైన కోర్కంటి నాయంకులాన్వయ బిరుదు విజయప్రశస్తి విజయీభవ–

## మారట్లవారి బిరుదు

స్వస్తి సమస్త మారట్లసింహమ మారట్లగోత్రపవిత్ర మధ్యాహ్న కల్ప

వృక్షమ దుర్భిక్షవైరికామధేను కల్పవృక్ష చింతామణి మాన దుర్యోధన నుడుదంతి రాయచేకొలుగండ హంవీరహరిసాలకసమాన అసహాయశూర పొడువని పోటు పొగిడించుకునే మన్నెకొమాళ్ళమిండ బిరుదు పొగిడించుకొని త్యాగమియ్యక జుణిగేమన్నె కొమాళ్ళమిండ కలుగొండవీరక్షేత్రాణో భారతీకమల్ల కలుగొండయుద్ధరంగమందు పన్నిద్దరు సామంతుల జంపిన భారతీకమల్ల అదటురాయమాన మర్దనహంకార రాయజగజ్జ్యోతి మన్నెనెరవాహినీకోటల గొంగ మలకగజసింహమ కోర్కంటిసింహ ఆదవెన్నిరెడ్డి మస్తకరంపమ ఆరవెల్లి నాయంకుల ఆత్మబాంధవ కోర్కంటినాయంకుల కోలాహల డెబ్బదేడ్గురుగోత్ర పద్మనాయకబాంధవ అప్రతిహతప్రతాప పరబల విదళంచిత? పరవీరభయంకర అదురుమన్నె కొమరమిండ మలయమన్నె కొమాళ్ళ మస్తకరంపమ తలయు మన్నెకొమాళ్ళ వెలయచేసిన తాత్పర్యనిర్వాహక ఏకాంగివీరరణమందు యెంతటి వీరునైన సంహరించినయట్టి సింహవీరబలాఢ్యకంభంమెట్టు నాయంకుల గర్వాపహర యేరువరాజుల నెత్తిపిడుగ ఉదయరాజు రాజ్యస్థాపనాచార్య గజపతి గజసింహమ సమరాన మడమదిరిగే నాయంకరగండ నున్నెరాయని మస్తశూల గంభీరశూరుని హల్లకల్లోల దుర్గదళ విభాళుని నిర్ధూమధామ బంగాళపుత్రుని ప్రళయాంతక కుమారభీముని కోలాహల శీకాటిరాముని శిరచ్ఛేదన అయ్యారవిపురవరాధీశ్వర మోహినీపట్టవర్ధన సత్యభాషా హరిశ్చంద్ర దుష్టనిగ్రహ శిష్టప్రతిపాలక చాపగాంగేయ ఆలపూరి బాల బ్రహ్మేశ్వర శ్రీపాద పద్మారాధకులగు మారట్ల నాయంకుడగు మల్లారావు.

సీసమాలిక॥

తంగేళ్ళ యసునూరు ధర్మంబు పాలించి
యందుఁ బ్రఖ్యాతియై యమరుచుండి
మల్లప్పకీర్తులు వెల్లివిరియఁ జేసి
శ్రీమల్లిఖార్జునసేవ కొనరి



..................... ............
భక్తిసంపన్నుఁడై ప్రౌఢి మీఱి
శ్రీశైలమందున శివభక్తియుక్తుఁడై
మల్లికార్జునసేవ మమత నొంది
భక్తులలోపలఁ బరమభక్తుండన
నతనివరమునను నధికబలుల
వీరమదేవుండు వెలయుపుత్రుల ముప్వ
రను గాంచెనిల మూర్తిత్రయములనఁగ
యెవ్వరెవ్వరటన్న నహితులఁ జెండాడి
మంతు కెక్కుకొమారమల్లఘనుఁడు
మల్లప్పకీర్తులు వెల్లివిరయఁ జేసి
ధర్మంబు నాల్గుపాదముల నుండ
బహుదళంబులఁ గూర్చి బలమునఁ జెండాడి
గుతికొండదుర్గము నతుకుకొనియె
నాదుర్గమందున్న (యరుల) సామంతులఁ
బడఁదన్ని పరిమార్చి బలియుఁడంత
నాక్రమించుకొనియు.........................
.....................................
కోట యాళువరియుఁ గొమ్మ కొత్తడములు
భద్రపఱచి..........................
అదిమొదల్ గుత్తికొండనుపేరు – నతి
మదమునఁ జెండి కొమారుఁడనఁగ
నతనివంశంబెల్ల నధికతేజము చెందెఁ
బుత్రాభివృద్ధిచేఁ బొలుపుఁ గనియె

వీరివంశంబెల్ల వీరవైష్ణవు లైరి

కడమవారలు కఱకంఠభక్తు (లైరి?)

మల్లప్పకనుజుఁడై మహిమీఁద విలసిల్లి

..................................

వీరభద్రవిభుండు విక్రమార్కులవంటి

సాహసవంతుల సంహరించె

గంగకు సాటిగాఁ గడు విక్రమించిన

...............................

కృష్ణవేణ్ణానది కేవల పశ్చిమం

బేలేశ్వరంబన నెసఁగుపురము

ముట్టడిగాఁ జుట్టి మొనసినశత్రులఁ

బరిమార్చి యార్చియు బలియుఁ డగుచు

ననిబారికెదురుచు నందున్న రాజుల

నతులితశక్తులై హతమణంచి

దిక్పాలకులనెల్లఁ ద్రిప్పుచుఁదోలిన

వీరభద్రుండన వెలసె నప్పు

డావీరభద్రుని నతిమోదమునఁ జెండి

యేలేశ్వరపువారు హెచ్చిరపుడు

వీరభద్రునికిని వెలయఁ దమ్ముండైన

మాచభూపాలుండు మహిమ మీఱి

శ్రీపర్వతంబునఁ జెంద్రశేఖరుఁ గాంచి

యతని పాదములకు నతి యొనర్చి

భాగ్యసంపన్నుఁడై బహుపదార్థముఁ గూర్చి

యెక్కడ నుంపుదునిది యటంచు



వీరమాంబను దల్లి వివరించి యడుగఁగా

ఘనశివాలయమునకడను వెలయ

.......................................

తల్లియు మతిచేత ధర్మపరుఁడు

శ్రీపర్వతంబును జెన్నుమీఱఁగఁ గాంచె

మనసిజహరుఁడైన మల్లికార్జునునకు

గోపురప్రాకార గర్భగృహంబులు

పసిఁడినిర్మితులుగాఁ బరిఢవిల్లఁ

బడితరంగులు చాల బహుళముల్ చేసి శా

శ్వత మైనపరమేశుభక్తి మీఱ

.....................................

ధర్మంబు విశ్వమంతయును నిండ

సూర్యచంద్రాదులు సొంపైనభువియును

నాకాశవాణియు నఖిలమునులు

నష్టదిక్పాలకు లలరెడుకాలంబు

తనకీర్తి ధర్మంబు నొనరఁ గాంచి

యంతయు నటమీఁద నహితులఁ జెండాడి

...............................

గుమ్మళంబనునూరుఁగొమరొప్పఁ గావించి

పట్నంబు కోటయు భద్రపఱిచి

పదివేలబలముల హృదయసమ్మతి యైన

................................

వారి యాప్తబలంబు వలనొప్పఁ జూచియు

నిదియె వేళ యటంచు నెచ్చరింపఁ

బదియుఁ దొంబదివేలు పరబలంబులవారి

..................................

బహుబలంబులఁ గూర్చి పరహక్కి మొనసిన

రణమున శిసరభూరమణుఁ గొట్టి

వీరమహాదేవువిక్రమమెడలించి

..................................

జయమటఁ జేకొని జగదేకమల్లత్రి

భువనైకమల్లుర నవనిఁ గూల్చి

వీరభైరవునిల విదళించి మించియు

..................................

మదగజకుంభికుంభములు వ్రయ్యలు చేసి

బలపరాక్రము లైన బలియులదర[1]

వీరకుమారవరుల ఘూర్జరయిల్వలరాయ దండధరోద్దండసామంతుల బరిమార్చియు ఉదయరాజు రాజ్యస్థాపనాచార్యు లైన దేగనాగదేవుని శిరంబు ఖండించి రణగబ్బిని రణముల్ ద్రుంచి కాసులసోముని గర్వంబణంచి సాహసప్రతాపుడైన బలియు డైనట్టి బలవీరసామంతుని బలియన బంధన? బట్టె మల్లని బెంకోలుగండ యేరువభీముని శిరచ్ఛేదన గర్వించి యెదిరిన కాల్వసేనుని శిరంబు ఖండించిన వరబలాఢ్య దిశాధిపతి యైన దేసింగరాయని రాజ్యంబు నిల్పినరమ్యయశులన విలసిల్లి వంశాభివృద్ధి నొనరించి హరిహరభక్తులై యతిమోదమున జెంది ధర్మజ్ఞులని చాల జనులు మెచ్చంగ వెలసిరన్నదాన ఉదకదాన కన్యాదాన కనకదాన గోదాన భూదాన గ జ దా న షోడశదాన మహాదాన విశేషదాన సప్తసంతానాధీశ్వర సమర్థులైన త్రిమూర్త్యాకంబైనట్ల కుమారమల్లప్ప వీరభద్రవిభుండు తంగెళ్ళమాచాకాపు మొదలుగా తమ్మేలిన కరికాల (రాశి?) చక్రవర్తిని దర్శించిన నా నృపాలుండు మెచ్చి యిచ్చిన మహాఘనరాజ్య బిరుదసంపద లెట్టి వనిన తన చతురంగ బలంబులకు సేనాధిపతిగా పట్టంబుగట్టి



వజ్ర వైడూర్యగోమేదిక మరకత మౌక్తిక పుష్యరాగ నీల కెంపు పచ్చలు మొదలైన నవరత్న ఖచితంబు లగు బహుభూషణంబులును చీనిచీనాంబరంబులును గంధ కస్తూరి కుంకుమ పరిమళాలంకారుంజేసి సింహముఖంబు కనకదండెందలంబును కంచుఢమారంబును గండపెండెరంబును కాలందెయు నుభయవింజామరంబులు ముత్యాలజంపు గొడుగును తెల్లపట్టు గుడారంబును పంచవన్నె వాద్యంబును అరిరాయలాలుసరి గజాంకుశంబును గజతురంగంబులును శుభ్రవర్ణం బైన వీరహనుమంతటెక్కెంబును కర్పూరతాంబూలంబులును ఆలపూరి బాలబ్రహ్మేశ్వర శ్రీపాదపద్మారాధకులయిన మహా వీరరధికక్షాత్రవంతులగు మారట్లనాయంకుడగు తంగెళ్ళమాచారావుకు యీ బిరుదు ప్రశస్తులు మహావీరపదవీ సామంతులకన్న మునుపుగా నొసంగిన మెచ్చి శరభతలాట రాయరాహుత్త వేశ్యాభుజంగుడై తన భుజాబలిమిని మెచ్చి శరభతలాట రాయరాహుత్త వేశ్యాభుజంగుడై తన భుజాబలిమిని కులబిరుదు చలబిరుదు సంతరించి మారట్ల నాయంకుడగు తంగేళ్ళమాచారావు తెచ్చిన అన్వయాది బిరుదు విజయప్రశస్తి విజయీభవ–

## కొప్పునూళ్ళవారి బిరుదు

స్వస్తి సమస్త కొప్పునూళ్ళసింహమ కొప్పునూళ్ళ గోత్రపవిత్ర కన్నడ మలెనేని తలగుండుగండ కాపురపుమలెనేని తలగుండుగండ దళపతిరావు సప్తాంగహరణ వేమవరపు లింగమనేని తలగుండుగండ కొత్తకోటమలెనేని కోలాహల పెంపారాయల ఆదిమూలమ కంబంమెట్టు నాయంకుల కంట్లోటి నెరస భల్లాని పట్టుక భంగపటిచిన అభంగ విక్రమ ఆడి తప్పేటివారి తలగుండుగండ తగవుతప్పి నడచేటి వారలకు మిండ పులిమీసాల నుయ్యాలలూగిన మహావీర శరణాగతరక్షామణి అసహాయశూర మన్యగజకంఠీరవ సర్వశాస్త్ర ప్రవీణ కై సేయని భుజబలపరాక్రమవంత రూపజితకందర్ప డెబ్బదేడ్గురు పద్మనాయంకుల వశీకర కాటయవేముని తలగుండుగండ మండవ మలెనేని మస్తకరంపమ ముగురురాజుల పూజాలింగమ పాతాళగరుడ పంజరాదుల నెత్తిపిడుగ మళయాళరెడ్డి మస్తకరంపమ

సూరసేన సూరారెడ్డి శిరచ్ఛేదన అవుటు కోటమల్లానాయుని సప్తాంగ చూరకార ఆదివరాహరెడ్డిని భంగపఱిచిన కొప్పునూళ్ళ నాయంకుల తమ్మేలిన భల్లానచక్రవర్తి రప్పించి గంధకస్తూరి పరిమళద్రవ్యంబు లొసంగి పాంచాలరాజులమీద సెలవనిన సెలవు గైకొని దొడ్డు కొంచమని చూడక వారి బలంబు లరువదియారువేల గుఱ్ఱంబులు నెనమన్నూరు  గజంబులమీద అయిదువేల కాల్బలంబు లారువేల గుఱ్ఱంబు లేబదిగజంబులతో రాజుల కెదురునడచి గజంబుల కడిఖండంబులుగా జెండి కాల్బ్వరబలంబుల కాలునిపురికనిపి తురంగంబుల తుత్తుమురుగా నఱకి పాంచాలరాజుల తలలు ఖండించి విజయంబు చేకొని తమ్మేలిన భల్లానచక్ర వర్తిని దర్శించిన ఆ నృపాలఘనుండు మెచ్చి యిచ్చిన ఘనరాజ్య బిరుదపదసంపద లెట్టి వనిన అరిరాయ లాలుసరి గజాంకుశంబును సురుమాయి బిరుదున్ను బాలార్కజాదున్ను సూర్యపుటముగుడారంబును సువర్ణతలాటంబును కాలిపెండెంబును కంచుఢమారంబును కనకదండెందలంబును నుభయ వింజామరంబులును ముత్యాలజంపుగొడుగులును పంచమహావాద్యంబులు మొదలైనవి యొసంగిన గైకొని మహాపదవీసామంతు లైన కొప్పునూళ్ళనాయంకులు మహాపరాక్రమవంతు లైనరావు వంశోద్భవులైన తిప్పారావు అన్నమనేడు మొదలుగా నాచంద్రార్కంబుగా నీ యాది చలబిరుదు సంతరించిన విజయీభవ–

సీ॥ [1]యవనుల గెల్వఁడే యంపరాయలు చూడ
నట్టైనఁ గంభముమెట్టుబైట
పరిపంథియోధులఁ బఱపఁడే వాఁడిమై
నుద్దండవృత్తిఁ గోనూరియొద్దఁ

1. ఈ సీసమాలిక తప్పులతడకగా నుపలబ్ధమయినది. శక్యమయిన సంస్కారములు జరిపి యిట్లు ప్రకటించితిమి.



గాటయదేవభూకాంతుసైన్యంబెల్లఁ
గొట్టఁడే యలగుండుగొలనిక్రేవ
చమరపామాత్యుని సాచి కొట్టఁడె......
కొండవీటను బెద్దకొండగడిని

గీ॥ ప్రబలరణరంగ జయభేరిభాంకృతుండు
రాయచేకోలుగండ ధరాధినేత
రామరఘురామబలభద్రరామనిభుఁడు
దీ ప్తబలుఁ డై నగజరావుతిప్పఘనుడు.

సీసమాలిక॥

శ్రీవిష్ణుదేవుని శ్రీపాదమునఁ బుట్టి
గంగకు సైదోడనంగఁ బ్రబలు
పంటవంశాగ్రణి పరమపావనుఁడైన
పేటయల్లన్నకుం బ్రియతనూజ
లయ్యన్న నీవును నలఘుఁ డౌపేరప
నాగన గంగభూనాయకుండు
రంగభూపాలుండు రణవీరగాండీవి
వసుధ నార్గురు చక్రవర్తులనఁగ
మిముఁ బెంచ హర్షాన మీమేనమామ దే
వారెడ్డి చెన్నభూవరుఁడు వాసి
వన్నెగా మిము రాయమన్నీలు దొరలును
రాజులుఁ గొనియాడఁ దేజముగను
నీసోదరులలోన నెఱయోధ నాగన్న
రణవిక్రమార్క వీరప్రతాప
శాలి నిశ్చలవృత్తి శాత్రవబలముల
బలసి రౌతుల దండములను గవయు

తద్వైరిసంఘ మందఱ............. తన
కరఖడ్గధారచే నఱకి నఱకి
చెంజిపురిబయళ్ళ సింహలగ్నవృత్తి
దేవతల్ దెచ్చినదివ్యరథము
రహినెక్కి చేరె వీరస్వర్గ మచ్చోటఁ
దదనంతరంబున హదలు మెఱసి
తక్కినరిపులు నీ తమ్ములు రంగన్న
నిలిచి ఖడ్గా...................ద్రుంచె
..............................................
మేనికి భూషణమిశ్ర మమర
నీ కెంతయును............. నీటుగాఁ జూపుచుఁ
బౌరుషఖ్యాతిచేఁ బరిఢవిల్లు
గంగన్న రంగప్ప కదనహంవీరుల
బత్తితో నినుఁ గొల్వ నత్తి నీటు
చెలగఁబ్రౌఢి మెఱసి శ్రీమంతుఁడై నట్టి
....................................
హేమాద్రి దానచింతామణి భోగసు
త్రాముఁ దంబుధిగభీరగుణశాలి
కనకకర్పూరవసంతరాయుడు సత్య
సద్గుణాంచితుఁ డార్యజనవిధేయుఁ
దంగనాజనమోహనాకారరూపపాం
చాలుండు రాయవేశ్యాభుజంగ
జగనొబ్బగండ నిశ్చలవీరనారాయ

1. ఈ పద్యము ప్రత్యేకముగా నిందే మఱొకచో ముద్రితము.



ణాంకసద్బిరుదాంకుఁ డమితకీర్తి
రేఖాప్రతాపధురీణుండు పంటవం
శాగ్రణి నిశ్శంకుఁ డర్జునాంశఁ
జెలువుగా విలసిల్లె గజదుర్గానకు
హృదయ భీకరమహాబిరుదమైన
దేసూరికోటలో వాసి వన్నె ఘటిల్ల
బంధువుల్ దొరలును బరిజనముల
తో నుండె......నని మానవేంద్రులు మెచ్చి
రయ్యారె సకలదిగంతరముల
నంతలో ఖాన్‌ఖానుఁ డాగ్రహింపఁగ సుబా
మీఁద దండెత్తి.... ఘండి
కోట ముట్టడి వేసికొని దోషచిత్తుఁడై
యక్కడి ఘడికోటలాక్రమించు
మని కాగితము పంప సంబరుఖానుండు
నది చదువుక (వేగ) హదలు మెఱసి
బల్లిదుం డగుమురా(రల్లు)ని భాలోజి
యహిపతి రాయశూరాగ్రగణ్యు
బాజఖానుని............ వంతుఁడైన
మహ్మదుఖాను దుర్మత్తుఁడైన
కైరాతఖానునిఁ భేరుపేరులఁ బిల్చి
ఘడిసీమలన్నియుఁ గట్టు మనుచు
సెలవు పెట్టిన వారు బలువిడ నేతెంచి
యతివేగ మటముకోటాక్రమించి
క్రూరుఁ డైనట్టి దుర్గోజిపండితులను
నిర్భయ నచట ఠాణెంబు పెట్టి

యలకోట తెల్నాట కోటాదిగాఁ గల
కోటల నన్నియుఁ గూడఁగట్టి
ముట్టడి సేయను మొనగాండ్రఁ గైసేసి
దాధాపరానను థాణె ముంచి
కంచి చెంగలపట్టు కరుగుడిపాలెంబు
నాక్రమింపఁ దలంచి యలమురారి
జల్లి యన్నుగ్రోగ్రసాహసి బాలోజి
....................................
అహిపతిరాయందు నయ్యవారిపురంబు
...................................
పేటలు గెల్చియు బెళుకుగాఁ గంచిపై
జగడమిచ్చిరి ప్రజల్ పగిలిపాఱ
నంతటఁ గంచితే నెంతయు ముట్టడి
దాఁకినచో నిపు డాఁక మెఱసి
నిను సంతరించిననృపమణి దామర
వేంకటేంద్రుని రాజ్యవిభవమెల్ల
నుద్ధరింపఁ దలంచి యుద్ధసన్నాహమై
యప్పుడు దామర యక్కభూపు
ననుమతిఁ గైకొని పినతండ్రి యైనట్టి
పెదకృష్ణవిభుని నీ (పెద్ద) యల్లుఁ
డత్యంతరణశూరుఁడైన దేవారెడ్డి
పెద్దన మొదలైనదొరల దేసూర నునిచి?
మధురాంతకపుగోత్రమన్యసింహము...........
కూచి సేయించి గగ్గోలుగాను



నల్కు బెళ్కును లేక యత్యంతఘోరమై
బహువాద్యఘోషముల్ పరిఢవిల్ల
భట్లు నీబిరుదు లేర్పాటుగాఁ బొగడంగఁ
గటికెవారెచ్చరికలటు సేయ
నెఱయోధలగు రెడ్డిదొరల రాజుల మంచి
కైజతపోటరికాండ్ర వీర
భటుల హెచ్చైనతుపాకులచేరువ
కాండ్లఁ గూర్చుక భయంకరనిరూఢి
గా శత్రుపురములు గాల్చినాఁ డుగ్రుని
ఢాకతో మటముకోటకును జేరి
కదిసి లగ్గలకెక్కి ఖడ్గధారలచేత
బిరుదురాహుత్తులపించ మార్చి
గబ్బి గంబుల (వీర) కంఠనాళంబులు
గరిమ రిగ్గునఁ దెగ నఱకి నిండు
శిలెదార్ల బొండుగల్ దెగటార్చి నీటైన?
రిపుపఠాణీరౌతు లను గొట్టి
.......................................
కపటగరీజుల గర్వ మణఁచి
.....................................
వీకమరాటీలపేరణంచి
అబిసికణోజుల యంగముల్ దెగటార్చి
దళకర్త దృగ్గోజిగళముఁ ద్రుంచి
నెత్తురు మాంసంబు మెత్తనిక్రొవ్వును
రణభూతభేతాళరాజుకపుడు
విందు గావించహో వీరలక్ష్మిని జెంది
దయ వచ్చి ధర్మదారయును వేగఁ

బట్టించి యంతటఁ బటువిజృంభణరీతిఁ
దనరుచుఁ గీర్తిప్రతాపమలర
నతనిడాలు డమారమతనిదస్తువ్రాత
మంతయుఁ గైకొని.............
గావించి చెంజిలగ్గల కెక్కవలె నని
పొడవైన నిచ్చెనల్ పొంకపఱిచి
పలుఫిరంగీగుండ్లు బాణాలమోపులు
మందుతిత్తులు చాల నందగించి
యల చెంజిలోఁగలమలక మొల్కలు పలు
రకమైనప్రజలు హేరాళముగను
ముక్కలు గోయించ నుక్కుచిప్పలు చాల
చేయించి నీపరిసేవకులను
విడిచి చెంజీపురివీధిని – నిధుల
రాతికాకిట మెల్గ రాల హెచ్చు
విడిపించినాఁడతి హృద్భీతి దీనుఁడై
...................................
అంబరుఖానుండు నంతట బాలోజి
యహిపతిరాయుండు నలమురారి
జల్యాదిగా దొడ్డసరదారులందఱు
..........................................
అదె వచ్చెఁబేట కృష్ణార్జునుండంచును
వెఱచువారును బూరి గఱచువారు
నై విఱ్ఱిపోయిరి యలసరదారులు
నీయుద్ధజయము వర్ణింపఁదరమె
యీవార్త వినిన మన్నీలు దామెరవేంక
టోర్వీవరుండు..............న



కనుజన్ముఁడై నరంగప్పఁడోడ్కొని రాజ
సమునబాబు..........పొడ
గని పిల్చి నీవు గెల్చినగెలుపులను నా
యనువారు దెల్పఁగా విని నబాబు
జోకతో నిచ్చ మేల్కోక యెలమిని శా
బాసహో శౌర్యం బయారె యనుచు
.........మెచ్చి పంపె వైభవ మొప్పగాను న
కాలీలు చౌకటుల్ నాలునగలు

గీ॥ ..............కట్టిమన్నీలలోనఁ
గదనహంవీర పేటెల్లఘనకుమార
కృష్ణభూపాలచంద్ర సత్కీర్తిసాంద్ర
ధరణి వర్ధిల్లు మాంచంద్రతారకముగ. 378

## దాచునూళ్ళగోత్ర బిరుదు

స్వస్తి సమస్త సకలసామ్రాజ్యలక్షణాలంకార వీరగుణాభరణ విక్రమ ప్రతాప దాచునూళ్ళగోత్రపవిత్ర దశదాన నిత్యదాన విలంబిత పరదళవిభాళ గంధవారణ గంధస్తుత నిశ్శంకమల్ల వేంగిమువ్వరగండ కాలవిమన్ని యల తలగుండుగండ అసహాయశూర విక్రమార్కావతార కొదమసింహమ సకల శాస్త్రప్రవీణ స్థలదుర్గహరణహలాయుధ వనదుర్గవైరి వైశ్వానర గిరిదుర్గదళన వజ్రాయుధ సత్యభాషాహరిశ్చంద్ర చాపగాంగేయ ఆహవభీమార్జున పరశురామ దుష్టనిగ్రహ శిష్టపరిపాలక దశరథరామ యుద్ధరంగమందు మడిమె దిరిగే మన్నెకొమాళ్ళమిండ బిరుదు పొగడించుకొని త్యాగ మియ్యక జుఱిగేమన్య కొమాళ్ళమిండ కలుగొండ వీరక్షేత్రాణో భారతీకమల్ల ఆదిమన్యరెడ్డి మస్తక రంపమ ఆరవెల్లినాయంకుల ఆత్మబాంధవ కోర్కంటినాయంకుల కోలాహల యిమ్మడిముమ్మడిగండ నాయకరగండ హత్తిత్తపోమండలీకరగండనాస్తింబర గండ

నాళువబ్బరగండ ప్రతిగండభైరవ ప్రళయ మార్కోలుగండ యెక్కుడు గాండ్ల దీక్షాదిగురువ డెబ్బైయేడ్గురు గోత్రపద్మ నాయకబాంధవ ఆడిండిన (?) తలగుండుగండ మచ్చురుద్రమ దేవుని మానాపహరణ కన్నడమలెనేని కంఠవిదళన వేమవరపు లింగమనేని విదళించిన పరాక్రమ కంఠీరవ బండికోటరెడ్డిప్రాణాపహరణ కుట్లూరి మారారెడ్డి మస్తకరంపమ వీరకుమార ఘూర్జరరాయధట్టవిభాళ యిల్వలరాయనిశిర:ఖండన సుంకుమల్లనిభోజ ప్రాణాపహార పరబల సాధక ఏకాంగి వీరభద్ర చంద్రగుప్తమానమర్దన అదియోదరగండ? సత్యహరిశ్చంద్ర మానదుర్యోధన ధనగిరి దుర్గవల్లభ దుర్గనిశ్శంకమల్ల బిరుద భీకరులయినట్టి బిరుదు ఘనులు తమ్మేలిన ఓరుగంటి ప్రతాపుండు తన చతురంగ బలంబులకు సేనాధిపతి దాచునూళ్ళ గోత్రోద్భవుండైన గుండయ గురునాథా రావును పట్టంబు గట్టి లాంగూల గజపతి బలంబుల మీద పంపు సెలవనిన సెలవు గైకొని వాని బలంబుల బాఱదరిమి చతురంగ బలంబుల హతము చేసి వారి బిరుదులు గైకొని గజతురంగంబులను ప్రతాపుని సముఖంబున నుంచిన సంతోషభరితుండై బిరుదంబుల నొసంగె అవి యేవి యనిన వాని కనకదండము అందలంబును కంచుడమారంబును కాళాంజియు గండపెండేరంబును నుభయ వింజామరంబులును మాణిక్య తలాటంబును సింహపు డాలును తెల్ల పట్టు గుడారంబులును సూర్యపుటము గుడారంబును సురుమాయి జిల్గులున్న పంచెవన్నె నవాయుధంబులును బిరుదంబులును దాచునూళ్ళ గోత్ర పవిత్రుండగు గుండయ గురునాథునకు గంధ కస్తూరి కుంకుమ పరిమళాలం కృతుని చేసి యంబర కర్పూర తాంబూలాదుల నొసంగెను. హెచ్చి తన భుజ బలంబువల్ల చల బిరుదురగండడై షోడశమహాదానంబులంజేసి సంతానంబు వడసి (నర?) సింహదేవ దివ్యశ్రీపాదపద్మారాధకులయిన వారి వంశం బులవారలకు ఆయురారోగ్య పుత్రపౌత్రాభివృద్ధి యవునట్లుగా (సుభవ?) కనక వస్తువాహన సమృద్ధి యగునట్టుగా వరంబు వడసి ధర్మాత్ముండవని నాచంద్రతారార్కంబుగాను జయ విజయీభవ దిగ్విజయీభవ–



# వంశావళి

## దామెరవారి వంశావళి

స్వస్తి సమస్త మహామండలేశ్వర మహాసామంత పదవీసమేత ఉత్తర దిగ్భాగ పూర్వసింహాసనాధీశ్వర అయోధ్యాపుర సామ్రాజ్య లక్ష్మీనిర్వాహక హరిశ్చంద్ర మహారాజ్య కార్యధురంధర లోహితాస్య దక్షిణభుజాదండ భాగీరథీ సముద్రా...విస్తారక అనవేమ మహీపాలుని సకల సేనాధీశ్వర దితి పుర మహారాజ రాజ్యభారక ఇక్ష్వాకు సేనాముఖదరీకులాంభోనిధి హరిక్రీడా వినోద చంద్రచూడ పాదపంకజ భ్రమరాయమాణ దశరథమనోరథ సన్మీల చతుర్దక్ష మహీమండల మండితాయమాన రామ భాగీరథీ లక్ష్మణ శత్రుఘ్న కార్యనిర్వాహక మాహిష్మతీపురవరాధీశ్వర శ్రీ లక్ష్మణదేవ మహాపట్టాభిషేక మహోత్సవ మహాసంతుష్ట కరికాలచోళరాజ్య సముద్ధారక కావేరి శ్రీరంగనాథదేవ దివ్యశ్రీపాదపద్మారాధక చతుర్థకుల సుధార్ణవ సంపూర్ణచంద్ర చోళ రాజ్య ప్రతిష్ఠాపక సమరముఖ హనుమంత యినిగాలగోత్ర కదనత్రినేత్ర వెన్నిచ్చి కుడువబెట్టు నాయంకరగండ కార్యబృహస్పతిస్వరూప గండికోట మల్లాయలదాయరాక్షస వైరివనకుఠార శత్రుకుల నిర్జిత అరిబలతల్లడ సాహసాభరణ గిరి దుర్గవజ్రాయుధ స్థలదుర్గహలాయుధ వనదుర్గ వైశ్వానర జడదుర్గబడబానల సత్యహరిశ్చంద్ర యేరువగోకర్ణుని సముఖంబున పంజూరి పడమట బండ్లవాగున సభలోన పులిని పొడిచి యెత్తిన సబశీసహస్రబాహ పులియమార్కోలుగండ బాహుబలభీమ వైరిగజదళ విదళపంచానన సమర ముఖ (హనుమంత) ఓరుగంటి ప్రతాపరుద్రుండు యిచ్చిన బిరుదంబులెట్టి వనిన సువర్ణతలాటంబును ఉభయ వింజామరంబులును దక్షిణ పారిజాత పరివారసంగడి సన్నాహ అఖిలజన పురుహూత ఆశ్రితపారిజాత వాలూరిపురవరాధీశ్వర శ్రీ నరసింహదేవదివ్య శ్రీ యిత్యాది నామాద్రిప్రశస్తి సహితులైన యినిగాలగోత్ర నాయంకులాన్వయ బిరుదు అదివిజయబిరుదు ప్రశస్తి విజయీభవ దిగ్విజయీభవ–

మాదయనాయనింవారు ప్రతాపరుద్రుని తావున విస్తారంగా ప్రభుత్వం చేస్తూవుండి తదనంతరం గజపతి రాయులవారి తావున ప్రవేశించి వారు విస్తారంగ రాజ్యం సంపాదించుకుని ప్రభుత్వం చేస్తూ వున్నప్పుడు వారియొక్క కీర్తిప్రతాపములైన పద్యం.

కII మాదయఘనవల్లభ విభుఁ
డాదటను బ్రతాపరుద్రునంతరమున నొ
డ్డాదిగ గజపతిఁ గొల్చి శు
భోదిత బహురాజ్యభరిత భుజబలయుతుఁడై. 379

అటు పిమ్మట వల్లభనాయనింవారు ప్రభుత్వంచేస్తూవుండి గజపతి వారి పంపున ఖాదిరిఖానుఁడనే వజీరుమీదికి దండెత్తి పోయి వాణ్ణి కొట్టి వాడి యొక్క సదాలతును తీసుకునివచ్చి గజపతివారికి యిచ్చినంతలో వారు సంతోషించి సకలబహుమతులు యిచ్చినది యేమంటే వారియొక్క పద్యం :

సీII గజరాజు పంపున ఘనమైనఖాదిరి
ఖానాదివజ్రీలకడిమి మాపి
వారల హయగజవ్రాతభండారుస
ద్బిరుదు ఛత్రధ్వజస్ఫురితదుర్గ
వర్గముల్ కానుకఁ బట్టంపఁగడు మెచ్చి
యొద్దెరాజ్యాధ్యక్షుడొప్పు గులుకు
పడివాగె తేజీలు భద్రగజంబులు
సరవి ముత్తెపుజగజంపుగొడుగు

గీII కళుకు సెలకత్తి యొసఁగినఁ గడిమి నొంది
చండగతిఁ బుల్యమార్కోలుగండ బిరుదు
పాత్ర చరితుండు యినిగాలగోత్రతిలకుఁ
డమితయశుఁడైనవల్లభాహ్వయుఁడు భువిని. 380



వీరి తదనంతరం తిమ్మానాయనింవారున్ను అన్నమనాయనింవారున్ను ప్రభుత్వం చేస్తూ వచ్చిరి.

కII ఆ నరపతికిని దిమ్మ
క్ష్మానేతయు మఱియు నన్నమాహ్వయుఁడనఁగన్
మానితప్రతాపకీర్తుల
చే నిరువురు వెలసిరెలమి స్థిరకాలంబున్. 381

అటుపిమ్మట మహీపతిరాయనివారు ప్రభుత్వం చేసినపద్యం.

కII దామెరమహిపతిరావుకు
భూమీపతులీడు గారు పూర్ణయశోభృ
త్సోముఁడు పటుశౌర్యశ్రీ
రాముఁడు శాత్రవులకనఁగ రహి నుతికెక్కెన్. 382

తదనంతరం తిమ్మానాయనివారు మహీపతిరాయని వారి కొమారుడు గన్క వీరు మహాప్రబలులై గజపతిరాయనివారు తావున నిండా మెహనతు చేసినందున వారు నిండా దయచేసి దేవరకొండ రాజ్యం జహగీరుగా దయచేసిరి. గన్కు పంపుబందితో కూడా పోయి దేవరకొండ ప్రభుత్వం చేస్తూ వున్న బైచడు అనేవానిమీద లడాయి చేసి వాణ్ణికొట్టి వాడిదగ్గర వున్న వస్తు వాహనములు తీస్కున్నప్పుడు వారియొక్క కీర్తిప్రతాప మైనపద్యం :

సీII బలపరాక్రమయశఃప్రబలుఁడై తిమ్మభూ
పతి యున్నచో గజపతియుఁ బిలిచి
వస్తువర్గములు దేవరకొండ దుర్గంబు
రాజ్యంబుతోఁ గూడ రహి నొసంగెఁ
గైకొమ్ము కొమ్మన గడిసీమలటు సొచ్చి
దుర్గంబు చుట్టుక దోర్బలమున

లగ్గ వట్టించుచో బెగ్గిల కందున్న
బలముతో సేనాధిపతులఁ గినిసి
ధట్టించి శస్త్రాస్త్రతతులచే నొంచిన
తనవీరభటులతోఁదానుఁగినిసిఁ
పొడు పొడుమనుచు బెబ్బులిమాడ్కి లంఘించి
యీఁటెలఁ గుమ్మించి యేపు మాపి
దుర్గానికధిపతౌతులువ బైచనిఁబట్టి
తలఁగొట్టి పౌఁజుల నెలమిఁగూల్చి
నెత్తురుటేరులు నెఱపి భూతలముకు
విందుఁగావించి దోర్విజయుఁ డగుచుఁ

గీ॥ బరఁగు దేవరకొండ విభాళ బిరుదు
నెమ్మెఁగనుపట్టుఁ దనకెందు నెదురు లేక
యతులితంబైన సబళీ సహస్రబాహుఁ
డిమ్మహిఁ జెలంగె దామెరతిమ్మఘనుఁడు. 383

ఈ ప్రకారం కొన్ని దినములు తిమ్మానాయని వారు ప్రభుత్వం చేసిరి. వీరి తదనంతరం రాఘవనాయనింవారు ప్రభుత్వం చేసిరి గనుక వారి యొక్క పద్యం :

సీ॥ తారకాచలసముద్వాహంబు దేహంబు
చటులహాలాహలసఖము ముఖము
దంభోళినిఖడ్గధారలు కోరలు
కాలకంఠోదగ్రగరము శిరము
పటుమృత్యుహస్తసంపాదముల్ పాదముల్
దీపితప్రళయాగ్ని చూపు రూపు



శిక్షితయదుదండశీలంబు వాలంబు
ధీరనృసింహుని వ్రేళ్లు గోళ్లు

గీ॥ నాఁగ రిపురాజ్యముల వీరగజచయంబుఁ
జెందు నీదైనకోర్కంటి సింహబిరుదు
ధరణి దామెర తిమ్మభూధవసుపుత్ర
రాజదేవేంద్ర యిమ్మడిరాఘవేంద్ర! 384

తదనంతరం తిమ్మానాయనివారు ఆ రాజ్యమే ప్రభుత్వం చేస్తూ వుండిరి. కనుక వారియొక్క ప్రతాపమైన పద్యం :

ఉ॥ పెట్టినదండఁదీయని యభేద్యపరాక్రమశాలి యైన నీ
కట్టెదుటన్ నిలంగలరె కట్టడిమన్నెకుమారులాజిలో
ముట్టినసింగపుంగొదమముందర నేన్గులు నిల్చునేని రా
దిట్టవు నీవె దామెరలతిమ్మనృపాల విశాలవైభవా! 385

వీరి తదనంతరం వెంకటప్పనాయనివారు ప్రభుత్వం చేసినది పద్యం:

ఉ॥ దామెరవెంకటేంద్ర! కలదా మరలన్ సమితిం గృపీటజో
ద్దామరసాధ్య భూస్థలిని దారకశైలశతారచంద్రబ్రం
దామరభూజరాజశరదభ్రజిదభ్రమరాళ మల్లికా
దామరతీశవైరులనదల్చి వెలుంగెడుఁ గీర్తులెంతయున్. 386

వీరి తదనంతరం తిమ్మానాయనివారున్ను కొన్ని దినములు ప్రభుత్వం చేసిన పద్యం :

చ॥ దురమున కోహటింపక యెదుర్కొని తూటి ఖడాఖడిన్ నెఱా
బిరుదవజీరులందఱిమి బింక మెలర్పఁగఁజక్కుచక్కుగా
నఱికి జయంబుఁగైకొనురణాంగణశూరుఁడ వీవెరా భళీ !
స్థిరభుజసార దామెరలతిమ్మనృపాల! విశాలవైభవా! 387

వీరి తదనంతరం [1]శ్రీపాదనాయనివారు ప్రభుత్వం చేసినారు గన్క వారి పద్యం :

కII ఆ పటుశౌర్యున కొదవెన్
భూపాలకతిలక మనుచు భువి వొగడ హరి
శ్రీపాదధ్యానాయతి
శ్రీపాదక్షోణిపతి విచిత్రస్థితియై. 388

సీII గజరాజరక్షణఘనతరదోర్దండ
గురుతరపులియమార్కోలుగండ
స్ఫుటమతి వాలూరిపుటభేదనాధ్యక్ష
రణనిటలాక్ష నిర్గతవిపక్ష
యుభయసైనిక మహావ్యూహపితామహ
హనుమంత సబళీ సహస్రబాహ
యతులిత స్వర్ణపట్టతలాట లాలాట
నాభికాఘంటానినాద ఘోట

గీII కదనరిపురంహ విజయకోర్కంటిసింహ
కాంచనవసంతరాయ విఖ్యాతవిజయ
యనుచు మాటికి మాగధులభినుతింపఁ
బొదలె బిరుదాళి శ్రీపాదభూపమౌళి. 389

ఈవల శ్రీపాదనాయనివారి కొమారుడు అబ్బానాయనింవారు దేవర కొండరాజ్యం ప్రభుత్వం చేస్తూ వున్నంతలో లోగడ బైచడు అనే వాని జ్ఞాతి వాలూరిరాజ్యం చేస్తూవుండే వీరిమీద విరోధాలకు యత్నం చేస్తూవుండె కన్కు

1. బహులాశ్వ విజయమునందును నుషాపరిణయమునందును దామెర వారి వంశావతార వర్ణన మితనితో నారంభ మగును.



వాడిమీద లడాయిచేసి వాణ్ణి కొట్టి వాలూరిపట్నం కట్టుకుని యీ రాజ్యమున్ను దేవరకొండ రాజ్యమున్ను ప్రభుత్వం చేస్తూ వచ్చినారు. వీరి యొక్క పద్యములు :

కII దురమున బోయదళంబులఁ
బరువడితో నఱికి వారిపట్టణమపుడున్
గరకరి అబ్బ నృపాలుఁడు
స్థిరముగఁ దానేలె నపుడు దివ్యులు మెచ్చన్. 390

ఈయన కొన్నాళ్ళు ప్రభుత్వం చేస్తూ వుండి వీరి తదనంతరం ధర్మా నాయనివారు ప్రభుత్వం చేసిన పద్యం :

ఉII దుర్మదవైరిహారిబలధుర్యవిహారికి నబ్బ శౌరికిన్
నిర్మలకీర్తిశాలి రమణీయతనూరుచిహేళి సత్క్రియా
కర్మఠసాధుయూథవరకామిత దానలసద్గుణాళి యౌ
ధర్మనృపాలమౌళి పటుధర్మ వినిర్జతశూలి కల్గినన్. 391

వీరియొక్క కొమారుడు వెంగళప్పనాయనింవారు ప్రభుత్వం చేసిన దినములలో వీరియొక్క పద్యం :

సీII [1]తన పదాతిశయంబు తనపదాతిశయంబు
కరణి నాళీకసంగతి నటింపఁ
దనుసుదృగ్గరిమంబు తనసుదృగ్గరిమంబు
గతిఁగౌముదీప్రసంగంబు నిలుపఁ
దనవిగ్రహోన్నతి తనవిగ్రహోన్నతి
కైవడి నసమాస్త్రకలనఁ దెలుపఁ
దనకరస్ఫురణంబు తనకరస్ఫురణంబు
ప్రఖ్యాతి నగరవైభవముఁబూనఁ

1. బహులాశ్వ విజయమునందును, నుషాపరిణయమందును దామెర వారి వంశావతార వర్ణనమితనితో నారంభ మగును.

గీ॥ బరిఢవిల్లు శరద్విషత్ పరివృఢప్ర
గాఢ భుజపీఠకుఠశాఖికాభిధావి
ధాకఠోరకుఠారకాధారధర్మ
నృపతి దామెర్లవెంగళోర్వీధవుండు. 392

వీరి తదనంతరం చెన్నప్పనాయనింవారి ప్రభుత్వంలో పద్యం

క॥ చక్కనిదామెరచెన్నఁడు
చొక్కపు రణరంగభూమిఁ జొచ్చినఁగినుకన్
ముక్కులు చెక్కులు డొక్కలు
జక్కులుగాఁ జేయు వానిసాటెవ్వరిలన్ ? 393

వీరి తదనంతరం యీన కొమారుడు వెంకటప్పనాయుడు ప్రభుత్వం చేసినప్పుడు వారియొక్క ప్రతాపమైన పద్యం :

ఉ॥ దామెర చెన్నభూవిభుసుతవ్రజరత్న మనన్ వినూత్నధై
ర్యామితశౌర్యలీలఁ జతురబ్ధిపరీత ధరిత్రి వెంకట
క్ష్మామహిళామనోహరుఁడఖండయశో విభవంబు పర్వ సు
త్రామసమానవైభవధురంధరబంధుర చర్య రంజిలన్. 394

వీరి తదనంతరం చెన్నప్పనాయఁడు ప్రభుత్వం చేశినప్పుడు వీరి యొక్క పద్యం :

క॥ తమతమకె బెదరి చెదరుచు
భ్రమఁ జెందుదురెంత మన్నెభార్గవు లైనన్
ఘుమఘుమమని చెలఁగెడు నీ
తమటధ్వనిఁ జెవుల విన్న దామెరచెన్నా ! 395

వీరి తదనంతరం యీనకొమారుడు వెంకటప్పనాయనింగారి పద్యం :



సీ॥ బంధుర పరిపంథి గంధేభములఁ గాని
చెండదు కోర్కంటిసింహబిరుదు
అరినృపాలక రాజవరపురంబులఁ గాని
నెగడదు కదనత్రినేత్రబిరుదు
మత్తారిసముదగ్రమన్నెలేళ్లను గాని
యత్తదు సబళీసహస్రబిరుదు
.........................................
.................................

గీ॥ నీదు బిరుదప్రశస్తంబు నిఖిలమునను
రిపుల కల్లను గర్భనిర్భేదనంబు
జస్వతాళాంక దామెర్లశాసనాంక
చెన్నభూపాల వెంకటక్షితితలేంద్ర! 396

వీరి తదనంతరం యీనకొమారుడు అబ్బానాయుడు ప్రభుత్వం చేశినపుడు యీన పద్యం:

క॥ దామెర్లకులాంభోజ న
భోమణి యై తనరుతత్ప్రభుశ్రేష్ఠునకున్
ధీమంతుఁ డబ్బనృపతి ల
లామము జనియించె సత్కళానిధి తగఁగన్. 397

వీరి తదనంతరం యీనకొమారుడు తిమ్మానాయుడు ప్రభుత్వం చేశినపుడు యీనపద్యం :

సీ॥ కర్ణాటకస్వామికై సేయురణవీర
మలహరియందును మనసు విఱిచి
హర్షించి కుదపశహా యిచ్చునుభయవిం
జామరల్ వైవఁ బ్రసక్తి మాలి

కడువేడ్క నేదులాఖానుఁ డొసంగుదో
ఖండాలసడ్డగాఁ గడను బెట్టి
గురుముఖంబాదిగాఁ దఱిమి వైరులచేతఁ
గైకొన్న కేతులగములు వైచి

గీ॥ యింద్రుకార్యముఁ దగ నిర్వహించి యింక
బిరుదులను బొందఁ దలఁచె నావరతదీయ
సభకు వేంచేసె సన్మానవిభవుఁడగుచు
దిగ్జయవిహారి దామెరతిమ్మశౌరి. 398

ఈవల యీ రాజ్యాలు ప్రభుత్వం చేస్తూవుండి తదనంతరం యీన కొమారుడైన వెంకటప్పనాయనివారు యీరాజ్యాలు ప్రభుత్వంచేస్తూ వున్నంతలో సుంకెశల రాజ్యం ప్రభుత్వం చేస్తూవున్న తురకలు లాతుఖానుడు వీరిమీద చిదగొద చేస్తూవుండె గన్కు వాడిమీద పంజు మందిచేసి లడాయిచేసి వాణ్ణి కొట్టి ప్రభుత్వం చేస్తూవచ్చె గన్కు వీరియొక్క కీర్తిప్రతాపమైన పద్యం :

సీ॥ సుంకేశపురిలో శూరుఁడై మ్లేచ్ఛుండు
కలుషుఁడెంతయు మురాత్ఖానుఁడనఁగ
బలియుఁడై యెదిరింప బవరంబులో వాని
శిరము వ్రయ్యలు చేసి శీఘ్రముననుభ్రాతృపుత్రామాత్యబంధువర్గంబులఁ
బొడిచియు నఱకియు భూరిమహిమ
హయగజవ్రాతంబులన్నియుఁ గొనియును
శూరుఁడై యెంతయు సుస్థిరముగఁ

గీ॥ జెలఁగె మహిలోన మార్కొంటిసింహమనఁగ
దామెరాన్వయతిమ్మభూధవుని తనయుఁ



డగుచు వెలసెను ప్రౌఢిమ నమితయశుఁడు
ధన్యుఁడైనట్టి వెంకటధరణివిభుఁడు 399

ఈనకొమారుడు తిమ్మానాయడు ప్రభుత్వం చేసిన దినముల్లో వీరి యొక్క కీర్తి ప్రతాప మైనపద్యం :

శా॥ ఇచ్చేపట్లఁదృణంబుగాఁగ మణులుం హేమంబులుం గ్రామముల్
నిచ్చల్ వేడుక నిచ్చుచుండుటఁ గదా నీకీర్తి నల్దిక్కులన్
రచ్చన్ మెచ్చిక మెచ్చు హెచ్చు గనియన్ రాజన్యమూర్ధన్య! భా
స్వచ్చారిత్ర! కుమారతిమ్మనృపతీ! సౌందర్యరమ్యాకృతీ! 400

ఈనకొమారుడు చన్నప్పనాయనింవారు ప్రభుత్వం చేస్తూ వున్న దినముల్లో వీరిపద్యం:

సీ॥ తేజిపై లంఘించి నేజ చేఁబూనితే
బెదరు నెంతటిమన్నె బెబ్బులైనఁ
గినిసి మీసము దిద్ది కిలకిల నవ్వితే
స్రుక్కు నెంతటి మన్నె శూరుఁడైన
ధర ఘరీలున దూసి కరవాలు చిమ్మితే
తిరుగు నెంతటి మన్నెధీరుఁడైన
నట్టహాసముఁ జేసి యాజికి నడచితే
విఱుగు నెంతటిమన్నె వీరుఁడైనఁ

గీ॥ గాక నీరాక కెదిరించి కత్తిమొనకు
నానునా యెంతవారైన నళుకు లేక
భాగ్యచారిత్ర! తిమ్మభూపాలపుత్ర !
మానవోపేంద్ర! చెన్నభూమండలేంద్ర ! 401

ఈన కొమారుడైన కొమార అక్కప్పనాయనింవారు ప్రభుత్వం చేస్తూ వున్న దినములలో పద్యం :

సీ॥ మొనసి ప్రత్యర్థివై మోహరించిన నిన్ను
గంటింపఁగలఁడె ముక్కంటి యైన
దండిబా రేర్పడి మెండొడ్డితే నిన్నుఁ
దెమలించునా బ్రహ్మదేవుఁడైనఁ
గదలెత్తి నడచినఁ గదనాన నీతోడ
నెదిరించఁగలఁడె యాయింద్రుఁడైనఁ
దారసిల్లిన నీకుఁదలఁగి వెన్నీయక
బవరాన నిల్చునా పార్థుఁడైన

గీ॥ నీదెరా శౌర్యవిస్ఫూర్తి నిక్కముగను
నిన్ను మార్కొని యెవ్వఁడు నిలువఁగలఁడు
వర్ణితోదార! చెన్నభూవరకుమార !
వీరబలసాంద్ర! దామెరవెంకటేంద్ర ! 402

ఈనకొమారుఁడైన తిమ్మానాయనింవారు ప్రభుత్వం చేస్తూవున్న దినములలో పద్యం :

మ॥ ఇల దామెర్లకుమారతిమ్మవిభు దాతృత్వంబు వర్ణింపగాఁ
గలయం వీనుల నాలకించి సభలం గర్ణాటసంస్థానవ
ర్యులుఁదా మట్ల ఘటింపఁబూనుటయెకానొక్కింత యీ నేర్తురే
పులిచాఅల్ గని నక్క వన్నెలిడుటం బొల్పొనె తత్సామ్యముల్
403

ఈనకొమారుఁడైన వెంకటప్పనాయడు ప్రభుత్వం చేస్తూవున్న దినములలో యీన పద్యం :



సీ॥ పెద్దనగరునొద్దఁ బ్రేమ బాదరుజల్లి
తలఁద్రుంచినట్టియౌద్ధత్యమునకు
నిందుకూరున జయార్గళ వృత్తి నలము?
ఖానును సుతికించు కార్యమునకు
గజపతిరాయలు ఘనముగా నిను మెచ్చి
గండపెండారంబు ఘనగజంబు
తాళిచౌకట్లును దగ వీరమలహారిం
బంగారు డాల్హనుమంతుడాలు

గీ॥ వైభవము మీఱ సకలభూపతులలోన
నమితగుణహార విక్రమార్కావతార
వర్ణితోదార చెన్నభూవరకుమార
వీరబలసాంద్ర దామెరవెంకటేంద్ర ! 404

ఈనకొమారుడు అయ్యప్పనాయడు ప్రభుత్వం చేసిన దినములలో యీనపద్యం :

సీ॥ ఫణితల్ప ఫణికేతు ఫణిరాజభూషణ
ఫణికులాధిపులు నీపాటివారు
వసునగ వాసవా వసురాజనందన
వాసవాత్మజులు నీవంటివారు
కమలేశ కమలారి కమలాతనూజాత
కమలసంభవులు నీక్రమమువారు
యాదోధి యక్షేశ యదునందనాత్మజ
యమతనూభవులు నీయంతవారు

గీ॥ శౌర్యమానుషధైర్యప్రజ్ఞానుభూతి
భాగ్య వైభవ వీరప్రభావరూప

................................
శాశ్వతైశ్వర్య ధనబలసత్యములను
నా(శితోపేంద్ర దామెరయయ్యపేంద్ర! 405

ఈనకొమారుండైన వెంగళప్పనాయని వారి ప్రభుత్వంలో పద్యం:

కII అంగజనిభు వెంగళవిభు
నంగగు భువి నర్థికోటి యహిమాంశునిభున్ ?
అంగ త్రిలింగక వంగ క
ళింగంబుల నీడు జోడు లేరు వదాన్యుల్. 406

ఈనకొమారుడు చినవెంకటప్పనాయనింవారు ప్రభుత్వం చేసిన దినములలో ఈనపద్యం :

సీII ప్రధనభార్గవ! నీదుభటధాటి గన్నంతఁ
దురకల గుండియల్ విరియఁబాఱె
జన్యత్రినేత్ర! నీజయభేరి విన్నంత
యవనాధిపపురంబులవియఁ జొచ్చె
రణధనంజయ! నీదుమణికేతు వీక్షింప
దగిడీలచక్షువుల్ పెగలి చెదరె
యుద్ధగాంగేయ! నీయుద్ధతి కదిసిన
మొగలురాహుత్తులు పగిలి పాఱె

గీII నౌర! సబలీసహస్రబాహాభిరామ
బిరుదసన్నుత జయశాలి భీమకేళి
దామెరల వెంగళేంద్రుని తనయమౌళి
చిన్నవెంకటనృపశాలి మన్నె హేళి. 407

ఈనకొమారుడు అయ్యప్పనాయడు ప్రభుత్వం చేసినప్పుడు యీన పద్యం :



సీII అభియాతి సర్వంసహాధీశమండలీ
కంఠరక్తములుగ్గుగాఁగఁ బొదలి
దుర్మదారాతిమేదోమాంసమస్తిష్క
మృదులాన్నకవళముల్ మెసఁగి మెసఁగి
పరిపంథిరాజ దుర్భరగర్భపటలముల్
భక్షించి క్రొన్నల్ల పట్టి పట్టి
ప్రత్యర్థిగజశిరోభాగకపాల ని
ర్యన్మౌక్తికశ్రేణి రాల్చి రాల్చి

గీII చండతారక భుజదండ మండలాగ్ర
కాళరాత్రి చరించు నుత్కటము గాఁగ
ధీజనాధార వెంకటాధిపుకుమార
ఆశ్రితోపేంద్ర దామెర అయ్యపేంద్ర ! 408

ఈనకొమారుడైన వెంకటప్పనాయనివారు ప్రభుత్వం చేస్తూ వున్నప్పుడు యీనపద్యం
:

సీII ఒడలు వెల్వడి చిచ్చులుమియుకత్తుల ధగ
ద్ధగలు గన్గొని గుండెదిగులు గొనక
కొమ్ముకత్తులు చిమ్ముకొని వచ్చుభద్రదం
తావళంబులఁ జూచి తల్లడిలక
ఘోటికావరపుటీకోటీహతరజోవి
జృంభణంబులఁ గన్నుచెదరి చనక
ఢాక మించుధమామి టోకు కఠోరముల్
చెవులు సొచ్చిన బిట్టు చెదరి చనక

గీII నిల్చి పోరునఁ దెగటార్చి నీదుభటులు
పొడువ శాత్రవభటపాళి పోటుగంటి

దూరుదువు నీవు దురుసవు దొరవు గనుక
వినుతగుణసాంద్ర ! దామెరవెంకటేంద్ర! 409

ఈ ప్రకారం కొన్ని దినములు రాజ్యం చేస్తూవుండి చన్నప్పనాయని వారిని ఆ ప్రభుత్వంలో వుంచి వెంకటప్పనాయనివారు శ్రీరంగరాయని వారి దగ్గరికి దక్షిణరాజ్యాలు ప్రభుత్వం చేశ్నివయినం ఉత్తరాదిన సుంకెశల, దేవరకొండ వాలూరు వగైరా రాజ్యాలు ప్రభుత్వం చేస్తూ వుండిరి గన్కు గోలకొండ రాజ్యం ప్రభుత్వం చేస్తూవున్న తురకలు యీ దక్షిణ రాజ్యాలు ప్రభుత్వం చేశేది చూడజాలక ఆ శ్రీజయించవలెనని ప్రయత్నం చేశి అందుకు తగినసరదార్లను పంజును ప్రయాణం చేసినంతలో ఆ పంజు వచ్చి కందుకూరి బయళ్ల దిగినంతలో ఆ సమాచారం శ్రీరంగరాయలవారికి తెలిశి వారున్ను తగినసలతనచేసి అప్పుడు వెంకటప్పనాయనింవారు బహుక్షాత్రవంతులని తెలిసి వారికి వ్రాయించి పంపించిరికదా మీరు కర్నాటకస్తులు బహుక్షాత్ర వంతులు మా రాజ్యాలమీదికి ప్రయత్నంచేశి తర్లివస్తున్నారు. మేమున్ను దళసమేతంగా వారిమీదికి తర్లివస్తున్నాము. మీరున్ను దళసమేతంగా తర్లివచ్చి నట్టు అయితే యీ కార్యం ఫత్తా అయిన వెనుక మీకు మాకు జాగీరులు సకల బహుమానాదులున్ను మా స్థానాన్కు వజీరుగానున్ను సకలమర్యాదలున్ను నడిపిస్తు వున్నామని వ్రాయించి పంపించినందున పెదవెంకటప్పనాయనింవారు వారి తమ్ముడైన చెన్నప్పనాయనింవారిని అక్కడ వుంచి వారు దళసమేతుగా వచ్చి శ్రీరంగరాయలవారితో కలసి కందుకూరి బారుమీదికిపోయి లడాయిచేశి రాయలవారికి జయప్రదం చేశి యిచ్చినందువల్ల వారు బహుసంతోషచిత్తులై వీరికి సకలమైన బిరుదులు సింహతలాటాలు మొదలైన బహుమానములు యిచ్చి జహగీరు కాళహస్తి, వందవాశి, చంజి వగైరా రాజ్యాలు యిప్పించి తమ సైన్యముతో కూడా వెంటబెట్టుకుని వచ్చిన తరవాత ఈ రాజ్యాలు ప్రభుత్వం చేస్తూ వచ్చినారు. ఈ లడాయిలో జయప్రదమైనది. వారియొక్క కీర్తిప్రతాపమైన పద్యాలు వ్రాయించినాము యేమంటే :



సీ॥ గోలకొండవజీరుఁ గొట్టి దుముదారుగాఁ
గందుకూరి బయళ్లఁ గదిసినపుడు
శరపరంపర వృష్టి గురియించి బాణంబు
లొండుగా నొనరించి యొగిఁదుబాకు
లైదాఱువేలకు నారగాఁ బదివేలు
రౌతు రాఱువ మిన్ను ప్రాకినటుల
యొకటి రెంటను గుంపులుత్పాతహేతులై
గట్టినదేవేంద్రుగతిఁ జెలంగి

గీ॥ ఘనత భద్రాయువనియెడి గజమునెక్కి
గుంపులన్నియు నొకగుంపు గూర్చి నఱికి
దంటతనమున జయము చేకొంటి వౌర !
విక్రమ మృగేంద్ర ! దామెర వెంకటేంద్ర ! 410

సీ॥ వెంటనంటిన బారులంటి కూడక మున్నె
యెంత లేదని తనకెదురు లేక
రాచూరి బాణాలు రవళిఫిరంగీల
యొడ్లపైకుఱికిన యుద్ధతంబు
కరికి గాయము దాఁకి చురుకులట్టిట్టై
నరికి దారికిఁ దెచ్చి నడువనేర్చు
ప్రధనముఖంబున బలుగాయములు దాఁకి
దాటి శత్రుల గెల్చుధైర్య పటిమ

గీ॥ కందుకూరందు వైభవక్రమములెల్ల
నెంచి వినుతించ నాబ్రహ్మ కేనిఁదరమె
యమితగుణహార ! కృష్ణమాంబాకుమార !
వెలయు దామెర చెన్న భూవేంకటేంద్ర ! 411

సీ॥ పదిహేను వేలకు బళువైన గుఱ్ఱముల్
ఘనవజీరులను సింగాణివిండ్లు
నమ్ములఁ గురియించి కమ్మి బాణంబులు
బలసి ముట్టించి తుపాకివేట్లు
నూరారువేలకు ధీరంబుతో నేసి
కదిసినఁదానెక్కు గజమునకును
ముప్పదిగాయముల్ మొనసి డాలుకుఁదుపా
కీవేట్లు పదునైదు కెరలి తాఁకి

గీ॥ తనకు గాయంబు దాఁకినఁ దలఁకకపుడు
నెంచి గోలించి తురకలఁద్రుంచిఁనాడు
కందుకూరందు చెన్నభూకాంతసుతుఁడు
మహిని దామెర వెంకటక్ష్మావరుండు. 412

సీ॥ మన్నె మార్తాండుతో మత్సరంబేటికి
మానుమీ ఆలముఖాన్ ఖానరాయ
రాయమన్నీలతో రణము సేయఁగ వచ్చి
కలువరించే వదే కాటి కాజి
మన్నెసింహముఁ జేరి మఱి నిల్వఁగా లేవు
దూసుకో బాగు పారాసుఖాన
మన్నె బెబ్బులితోను మసలక గునుకెత్తు
వినుము హల్లాకొల్లి విశదముగను

గీ॥ బాల నను నెడి నప్పు డాగోల రోక్ష
ఘోర వఱ్జీలు నినుఁ గందుకూరి బయల
వర్ణితోదార ! చెన్నభూవర కుమార !
వీరబలసాంద్ర ! దామెర వేంకటేంద్ర ! 413



సీ॥ కర్ణాటకక్షోణిఁగలమన్నె వారితో
విఖ్యాతకీర్తుల వెలసినావు
దమరీతి సింహాసనమున నాఁడును నేఁడు
పెద్దవై కార్యముల్ దిద్దినావు
రణదళాఖానుని రాకుండఁబోఁ ద్రోలి
గదిమిసంస్థానంబు గాచినావు
........................................
................................

గీ॥ ప్రభుమణివటంచు శ్రీరంగరాయలపుడు
పంపు నిన్నప్పఖాదిని జంపి మఱియు
గెలిచి తురకలఁ దఱిమితౌ కృష్ణ దాఁట
వీరబలసాంద్ర ! దామెర వేంకటేంద్ర ! 414

యీ రాజ్యాలు ప్రభుత్వం చేస్తూ వున్నంతలో మరికొన్ని దినములకు వీరు క్రమించిన వెనుక ఈనకొమారుడైన చెన్నప్పనాయనింవారు వారి కొమారుడు ముద్దు వెంకటప్పనాయనింవారు ప్రభుత్వం చేస్తూ వున్నప్పుడు యింగి రీజు బహదరువారు మరి కొన్ని దినములకు ఈ రాజ్యాలకు వచ్చి మధిరాసు రేవు బందరు చాయవలెనని ప్రయత్నం చేశి ఈ రాజ్యాల్కు ప్రభువులయ్ని మా పెద్దల్కు తమ అభిమానం తెలియచేశినంతల్లో యింగిరాజు బహదరు వారు గొప్ప సరదార్లు. వీరికి మనము యేమి విహితంగా నడిపించినా అది ఉత్తరోత్తరా న్ను శ్రేయస్కరానకు హేతువ వంటిది. చంద్రసూర్యులు వున్న మట్కున్ను వంశంమీద అభిమానం వుండునని యోచన చేశి చెన్నప్ప నాయని వారి కొమారుడు ముద్దు వెంకటప్పనాయనింవారు యీ రేవుదగ్గర తన తండ్రి అయిన చెన్నప్పనాయనిం వారి పేరిటను పట్నం కట్టించి వృద్ధిచేశేటట్టు మాకు యిష్టదైవంగా వున్న చెన్నకేశవస్వామి ఉభయ నాంచార్లతో కరుకు వరహా వెట్టువేశి నడిపించేటట్టు నిష్కరష చేస్కుని రాయసంస్థల్లో అహం వహించి జవాజాస్వాలు చేశి ఆ స్థళం

మా రేవుకు తీర్చి యిచ్చినారు. మరి కొన్ని దినములకు పట్నాన్ని గురించి ప్రతి సంవత్సరం ఫేష్కసు ఒక దిట్టంగా యేర్పరచుకోవలెనని కౌలు పుట్టించుకోవలెనని ప్రయత్నం చేసి నంతల్లో ముద్దు వెంకటప్పనాయనింవారు శ్రీరంగనాయకులవారి దగ్గర జనాజాస్వాలుచేశి చన్నపట్నానకు ప్రతి సంవత్సరం వెయిన్ని నూరు వరహాలు ఫేష్కసు నిష్కరష చేయించి శ్రీరంగనాయనివారి తరపున వక శాసనమున్ను ముద్దు వెంకటప్పనాయనివారి తరపున వక దిమ్మత్తున్న పుట్టించి యిచ్చినారు శ్రీరంగరాయలవారు వ్రాశి యిచ్చిన బంగారు శాసనంమీద వ్రాశి యిచ్చినది యేమంటే యింగిరీజు కుంపిసీవారు చన్నపట్నానకు ప్రతి సంవత్సరం ఫేష్కను వెయిన్ని నూరు వరహాలు యిచ్చేది. శాశ్వతంగా అనుభవించుకొనేది. చన్నపట్నంలో టంకసాల చన్నకేశ్వరస్వామి ఉభయనాంచార్లతో కూడా వరహాలు వెట్టువేసుకునేది. దేవాదాయం బ్రహ్మాదాయం నడిపించి కర్నాటకస్తుల పట్నంవలె అన్ని విధాలా చన్నపట్నాన్ని యంచి నడిపించ గలది అని యిత్యాది సంగతులు వ్రాసి వున్నది. రెండోపద్దు దామెర్ల ముద్దు వెంకటప్పనాయనివారు పేరట వ్రాశి యిచ్చిన దిమ్మత్తులో చన్నపట్నం రాయలవారు వ్రాసి యిచ్చిన శాసన ప్రకారం పూర్ణితంగా అనుభవిస్తు రాగల వారు అని వ్రాశి వున్నది. యింగిరీజు బహద్దరువారు సూర్యచంద్రులు వుండే మటుకు మనమీద అభిమానం తప్పరు. మనవంశస్థులు వుండేవారంతా వారితో స్నేహాభివృద్ధిగా వుండేది అని వ్రాశి యిచ్చినారు. తదారభ్య యింగిరీజు బహదరువారు ఆ విశ్వాసం మనసులో వుంచి అప్పటప్పట్కి మా పెద్దలకు బహుమానం అంపిస్తూ రావడం, మావారు యప్పుడైనా చన్నపట్నాన్కు పోయినా యింగిరీజు బహదరువార్కి బహుమానము అంపినా అవి ఘన మర్యాదగా రప్పించుకుని యిర్వై యొక్క ఫిరంగీ వేట్లు వేయించ యితర లాంఛన బహుమానములు అంత:కరణంగా నడిపిస్తూ వచ్చిరి. మరి కొన్ని దినములకు యింగిరీజు బహుదరువారు ఫ్రాంసువారికి మైలాపురి దగ్గర లడాయి అయినంతల్లో మా పెద్దలు యింగిరీజు బహుదరువారితో కూడా సహాయమై ఫ్రాంసువారి మీద లడాయి చేశి ఆ కార్యముల్లో మా పెద్దలు చన్నప్పనాయని వారు ముద్దులనాయనివారు



కొందరు బంధువులు విశేషంగా సైన్యమున్ను స్వర్గస్థులైరి. ఆ కార్యం ఫత్తె అయినందున యింగిరీజు బహదరువార్కి మా పెద్దలమీద నిండా అంత:కరణ వుంచి స్కల మర్యాదలు వారు చేశినారు. ఆ లడాయిలో మావారియొక్క కీర్తి ప్రతాపములైన పద్యములు.

సీ॥ [1]మునుమున్న యేరాజు మున్నలిబయళుల
వేలూరి లింగభూవిభునిఁ గొట్టి
పంచవన్నియడాలు పట్టించె నేరాజు
పరవీరభద్రేభపటలిఁదెచ్చి
ధీరత గూఢ లాతూరిలో నేరాజు
శాత్రవబలముల సంహరించె
శుక్రవారమునాఁడె చౌఅబాతీ యేరాజు
పాండ్యుని బలముల భంగపఱిచె

గీ॥ నతఁడు సామాన్యుఁడే దామెరాన్వవాయ
కలశవారాశి పూర్ణరాకాశశాంకుఁ
డనఁగ గడికోట మల్లశుభాంగయుతుఁడు
[2]వేంకటేంద్రుని చెన్నభూవిభువరుండు. 415

చన్నపట్నంలో ఫ్రాంసులవారిమీద చేసిన లడాయి పద్యాలు :

సీ॥ సూర్యుండు తాఁద్రోవఁజూపి కూర్మిని బంప
నిది లగ్న మని గురుఁడెచ్చరింపఁ
దూర్పు టేనుఁగు బలాదూరు దిష్టులు దీయ
మునుపుటింద్రుఁడు బీగెముద్ర లీయ

---

1. ఈ పద్యము బహులాశ్వ చరిత్రములోనిది.
2. చన్నభూపాలుఁ దరిరాజసన్నుతుండు.

రంభాది సతులు హారతులెత్తి జయలాడ
నారదమౌని గానంబుఁ బాడ
గరుడోరగామరవరులు చెంగట నిల్వఁ
జిత్రసేనాదులు చేరి కొల్వ

గీ॥ ప్రాంసువీరులఁ జెండాడి ప్రాభవమున
నల సుధర్మను రత్నసింహాసనమున
నిందుకొలువునఁ దమతండ్రి దండ నుండె
ముద్దు ముద్దుగ దామెర ముద్దులయ్య. 416

సీ॥ కజ్జమయ్యెను వీఁపు కదనంబుచే నని
భక్తి నూర్వశి మూపుఁ బట్టుచుండ
నొచ్చెఁబాదములంచు వచ్చి వేగ ఘృతాచి
యొయ్యనఁగుచపాళి నొత్తుచుండ
నెండకాఁకల మేను పండఁబాఱె నటంచుఁ
బొసఁగ రంభ పయంట విసరుచుండ

గీ॥ ప్రాంసువీరులం జెండాడి ప్రాభవమున
నల సుధర్మను రత్న సింహాసనమున
నిందు కొలువునఁదమతండ్రిదండ నుండె
ముద్దు ముద్దుగ దామెర ముద్దులయ్య. 417

సీ॥ చెల్లవింద్రుల దనుకిల్లాకు లిఁక నని
పలుమాఱు తెలుఁగుబిజ్జలుఁడు పలుక
నలకూబరునిత్రుళ్ళు పొలిబాయలేదని
మెండుగా విక్రమార్కుండు వలుకఁ
బ్రాపు కల్గెను నేఁడు ప్రతి యెవ్వ రిఁక నని
పేర్మితోఁ దిక్కనప్రెగడ వలుకఁ



బారిజాతము వీనిపాలయ్యె నిఁక నని
యళిరామరాజేంద్రుఁడెలమిఁ బలుక

గీ॥ ప్రాంసువీరులఁ జెండాడి ప్రాభవమున
నల సుధర్మను రత్నసింహాసనమున
నిందుకొలువునఁ దమతండ్రిదండ నుండె
ముద్దుముద్దుగ దామెర ముద్దులయ్య. 418

సీ॥ విసుమాలి బుద్ధులు వీనులు సొరనీక
యరులచే ధనముల కాసపడక
మొనను స్వామిద్రోహమునకుఁ దా లోఁగాక
పెనుబలము లేదని వెనుక దీక ?
యనుదినంబును నిద్ర నాహారమును లేక
వాలు బిరుదును డాల్ గోలుపోక
వైరులేతెంచిన వడి ముచ్చముణుఁగక
కీర్తిఁ బోనీక దుష్కీర్తి తేక

గీ॥ ప్రాంసువీరులఁ జెండాడి ప్రాభవమున
నల సుధర్మను రత్నసింహాసనమున
నిందుకొలువునఁ దమతండ్రిదండ నుండె
ముద్దుముద్దుగ దామెర ముద్దులయ్య. 419

సీ॥ విజయనితోఁ బోరు విమతుల తలయేరు
చేరి పోవుట భయము చిచ్చుమయము ?
వాని పందలకత్తి వైరుల బలుమిత్తి
తఱిమి వెంబడి హత్తి తలలు మొత్తి
బలుఫిరంగులనాదు పటముగా నిల నీదు
ధరణీధ్రము లగలు తలలు పగలు

చూఱ దప్పఁగ లేదు చొొచ్చి పోవఁగ రాదు
చికిలిగుండ్లేసినఁ జిత్తవాన

గీ॥ ప్రాంసువీరులఁ జెండాడి ప్రాభవమున
నల సుధర్మను రత్న సింహాసనమున
నిండుకొొలువునఁ దమతండ్రిదండ నుండె
ముద్దుముద్దుగ దామెర ముద్దులయ్య. 420

యీ ప్రకారం యింగ్లీజువారి యంతఃకరణ నిండా కలగవలె నని సకలవిధాలా మెహనతు చేసినారు. పూర్వోత్తరం తెలియగలందులకు యేమంటే మునిశల బడదీసు అనేఫ్రాంన్సు సరదారుడు చన్నపట్టణంమీద యుద్ధం చేసి స్థళం తీస్కుని తిర్గి స్థళం యింగిలీజు బహదరువారు తీస్కున్నతర్వాత–పట్నం నిమిత్తం లోగడ పుట్టివున్న దస్తైవజులు తెలియవలసినందులకు కుంఫిణీలేఖపత్రాలు శోధించినప్పుడు సదరహి వ్రాసిన రాయశాసనమున్ను ముద్దు వెంకటప్పనాయినివారి దిమ్మత్తును అగుపడినందున తీసి వుంచినారు. ఇదిగాక చెన్నకేశ్వరస్వామి దేవాలయం కట్టించి నైవేద్యదీపారాధనల్కు సంవత్సరం 1–కి నూరువరహాలకే యిదివర్కు నడిపిస్తూనే వున్నాము. వారి తదనంతరం కరిచన్నప్పనాయనింవారు పెద అక్కప్ప నాయనింవారు యీ రాజ్యాలు ప్రభుత్వం చేస్తూవుండి రాపూరిబారులో జయించినందున అక్కప్పనాయనింవారికి రాయలువారు నిండా దయచేసి మునుపటి జహగీర్లు కాక చిరుతనాపల్లి తంజావూరు తాల్కూల్లో కొంత నింద్రపొన్న నాన్నవరం వగైరా తాలుకాలు జహగీర్లు దయచేసి నడిపించిరి. గన్కు ప్రభుత్వం విస్తార మైనప్పుడు యాభైపల్లకీలవారున్ను పద్దెనిమిదివేల పంజుకొొలువు కొలుస్తూ వుండిరి. యీ ప్రకారం ప్రభుత్వం చేస్తూ వున్నంతలో కొన్ని దినంబులకు సమయవరం దగ్గరలడాయిలో అక్కప్పనాయినింవారు స్వర్గస్థులైరి. వీరియొక్క ప్రతాప మైనపద్యము:

సీ॥ అల పాదుసాహుచే నాకులందితివని
విజయాదిపురిసామి విన్ననయ్యేఁ



గడిమితో దక్షిణకార్యమందితి వని
మధురాధిపతికనుమానమొదవె
బెడిద మౌఁప్రస్థానభేరి వేయించుట
మయిసూరు దొరయుఁ గన్మలు బిగించెఁ
గదిసి సోమశిల దగ్గఱ వచ్చుటను విని
తంజాపురీశుఁడు త త్తళించె

గీ॥ దండె రాపూరిబైట నుద్దండముగను
దారసంబైనమన్నీలఁదఱిమె నపుడె
కడమదొరలెల్ల దిక్కా మొగంబులైరి
యెన్న దామెర్ల అక్కయ చన్నధీర ! 421

సీ॥ ఘనపతిద్రోహరగండాంకుఁడగుటకుఁ
బాండ్యభూమండలభర్త సాక్షి
తివిరి పెట్టినదండు దీవియ వవుటకు
రంజిల్లుసమయవరంబె సాక్షి
మోసినయరుల పొందాసించువాఁడౌట
కుభయసైన్యముల భూవిభులు సాక్షి
బిరుదు మించినమహోద్ధురతకు ముంజేతఁ
గట్టిన కపికేతుపట్టి సాక్షి

గీ॥ రహి మహాభాగవతతకు రంగధామ
చరణపాథోరుదేశంబు సాక్షి
గాఁగ నద్దేవునందు నైక్యంబు నొంద
నరులఁబరిమార్చె దామెర అక్కశౌరి. 422

శా॥ ధిక్కారక్రమ! విక్రమోగ్ర! పరిపంథివ్రాతముల్ నీవలెన్
జక్కాడం గలమన్నెవాని నిఁక నే చక్కిన్ వినన్ లేదులే

చక్కం జూడcగ శక్తుcడా యొకcడు నీ సంరంభ మఝ్ఝారె స
మ్యక్కోలాహలధక్క! దామెరల అక్కా ! మన్నెకంఠీరవా ! 423

సీ॥ ధృతి సాగి కొండభూపతి యతిరాజులు
కడు నొప్పు శంఖచక్రములు గాcగc
జండవిక్రముcడైన సాగి లచ్చన కడు
డంబైనయట్టిశార్ఙ్గంబు గాcగ
సమర భీకరుcడయి చనువేంకటేంద్రుcడు
కౌమోదకస్ఫూర్తిగా నెసంగ
.............................................
.......................................

గీ॥ మోక్షలక్ష్మీసమేతులై ముఖ్యభటులు
పార్శ్వవర్తులుగా సూర్యపథము దాcటి
దామెరాక్కవసుంధరాధవుcడు విష్ణు
మూర్తి చెన్నొందు వైకుంఠపురమునందు. 424

సీ॥ అరివర్గములcదాcకి యని సుగ్గుగా నూకి
వెన్నాడి శరములు వేసి డాసి
మదగజంబులc జేరి మావుత్తులను జీరి
కరములు శిరములు నఱికి పెఱికి
కాల్బలంబులc ద్రోలి గాండివి యనcజాలి
నెరవైన మన్నీల నెత్తి మొత్తి
పోరక వెఱcబాఱి పుట్ట లెక్కె డువారిc
గరుణార్ద్రదృష్టి వెన్గాచి కాచి

గీ॥ తహహ! నీసాటి యెవ్వ రీ యధిపకోటి
గురుతరోద్దండ! పులియమార్కోలుగండ!



చెన్నభూపాలపుత్ర ! సుస్థిరచరిత్ర !
హరినిభాటోప ! దామెర అక్క భూప ! 425

ఈన కొమారుడు ముద్దు వెంకటప్పనాయని వారియొక్క పద్యం

సీ॥ మత్తవిరోధిచర్మంబు పల్లము గాcగc
బరcగc బ్రేవులు సుగ్గపట్టు గాcగ
విమతవర్గముల శల్యములు కళ్యము గాcగ
వసుధీశునరములు వాగె గాcగ
నభియాతి దాళువలంకవన్నియ గాcగc
బుడమీశుక్రొవ్వు పావడలు గాcగ
భూపాలుకండలు పూలదండలు గాcగ
నరులపున్కలు బిరుదందె గాcగ
రణశూరుకనుగ్రుడ్లు మణితురాయులు గాcగ
గమకంబు పరభయంకరము గాcగ
బోరి ఘోటధ్వనుల్ భువనకంపము గాcగ
జోడుగా జయలక్ష్మి తోడు గాcగ

గీ॥ వాగె సవరించి యక్క నివాజి రిపులc
ద్రుంచి విదళించి దిశల రాణించి తౌర!
సలలితోదార ! దామెర్ల కులవిహార!
కలితగుణజాల ! ముద్దు వెంకటనృపాల ! 426

సీ॥ బహుళశాత్రవరాజపం క్తి దామెనగొర్లు
పొలుచుప్రత్యర్థులు పునుక పేర్లు
చండించుమన్నీల గుండెలే కుడుములు
మెండుమాంసంబులు పిండికూర
విరసించు మన్నీల వీపు డాగురకిల్లు
వై రివీరులజడల్ వీరదాళ్ళు

మదవద్విరోధుల మెదడు గంధపుఁబూఁత
బహుర క్తపూరముల్ పానకములు

గీ॥ గాఁగ జాతర లాడించి ఘనత గాంచి
ప్రకటరణకేళి నీఖడ్గభద్రకాళి
సలలితోదార ! దామెర్ల కులవిహార !
కదనహంవీర ! ముద్దువెంకటవజీర ! 427

ఈ ప్రకారం ప్రభుత్వం చేస్తూ వచ్చిరి. వారి తదనంతరం అయ్యప నాయనింవారు రావూరివారును జయప్రదమైనందున నీజూవూరు పోయి అక్కడి కార్యాలు ఫత్తి చేస్కుని తిరుగ చిరుతనాపల్లెకు వచ్చి ప్రభుత్వం చేస్తూ వచ్చిరి. మరి కొన్ని దినంబులకు మయిసూరివారి మీద యీరేటిబారులో అయ్యపనాయనిం వారు కంచి లడాయియయిన వెనుక స్వర్గస్థులైరి. వీరి యొక్క ప్రతాపమైన పద్యము.

సీ॥ పగఅవజీరుల పలుగుడారులు కదా
భద్రేభములమీఁది పరువులకును
దగు దునేదారులు తగటుకోకలు గదా
స్వామి నీబిరుదధ్వజంబునకును
మత్తారిసరదార్ల మైకబాయులు కదా
పడివాగెతేజుల పల్లములకు
శత్రురాహుత్తుల చర్మంబులే కదా
మొనసి నీదు ధమామిమూఁతలకును

గీ॥ సమరెఁ గద కంచిబైళ్ల ఘోరాహవమునఁ
గెరలినసహోవజీరుని గెలిచి నీవు
విజయలక్ష్మిని గైకొనువేళ దామె
రయ్యపేంద్ర ! మహోగ్రసాహసమృగేంద్ర ! 428



వీరి తదనంతరం వీరి కొమారుడైన చన్నప్పనాయనింవారు కొన్ని దినంబులు ప్రభుత్వం చేసి వారున్ను లడాయిలో స్వర్గస్థులైరి. గన్క వారి యొక్క ప్రతాప మైనపద్యము –

శా॥ ఘోరాజిం దనతేరుఁదోలి విమతక్షోణీతలాధీశులన్
నారాజిం దెగటార్చి వీరభటసన్నాహంబుతోఁ జేరి యా
నౌరోజా గజహస్తముల్ నఱకి నానావస్తువుల్ గొన్న యో
నారీజాలమనోజ ! దామెరలచెన్నా ! మన్నెకంఠీరవా ! 429

సీ॥ ధీవోలు మొదలుగా ధీరులౌ వజ్రీలు
గరిమతోఁ దనదిక్కు కనుగొనంగ
నీచిన్నవానికే యింత సాహస మని
కదుఁదుపాకుల కృష్ణఘనుఁడు మెచ్చ
నెంత శూరుండని సంతోష మంది రా
విళ ముద్దుకృష్ణేంద్రుఁడలరుచుండఁ
బెదతండ్రికంటెను బిరుదుమన్నీఁడని
తండ్రి ఆయపనేఁడు తగు ననంగ

గీ॥2 దురమున నెదుర్చు శాహాజీ తుక్కన కర
వీరరాహుత్తులును జెండి వేసి తౌర !
యవుర ! నీసాటి మన్నియలవనిఁగలరె
నవ్యగుణసాంద్ర ! చెన్నప్ప నాయకేంద్ర ! 430

వ॥ వీరియొక్క రాజ్యాలు ప్రభుత్వం చేశేటటువంటి దినముల్లో వారు యిచ్చినటువంటి దానపత్రాలు శాసనాలున్ను అగ్రహారశాసనాలు కంచి, వంద వాశి వగైరా స్థలాల్లో చెరువులమీద వుండేటటువంటి శాసనాలున్ను తమరు దరియాప్తు చేసినట్టు అయితే తమకే విశదమవుతున్నది. వీరి తదనంతరం వీరి కుమారుడైన కొమార అక్కప్పనాయనింవారు బాలురు గన్కు కార్యస్థులు పెద్దలు అందరు క్రమించి

పోయినందున చెంజి, చిరుతనాపల్లె , వందవాసి వగైరా తాల్కూల కున్నలలు వచ్చె గన్కు వందవాసినుంచి శ్రీకాళహస్తి ప్రవేశించి తమ బంధువులైన సరదార్లను యిక్కడ వుంచి కుమార అక్కప్ప నాయని వారు యథాప్రకారం తాలూకాలు జాగీరు తీస్కు రావలె నని యోచన చేసి – గోలుకొండకు ఆలంగీరు పాదుషావు వారి తావుకు ప్లవంగ సంవత్సరంలో తర్లి పోయి పాదుషావు వారిబేటి అయి కొన్ని దినంబులు అక్కడ వుండి యథాప్రకారం తాలూకాలు దయచేయవలయు నని సకలవిధాల మనవి చేసుకుని అందుకు పాదుషావువారు 'మీరు బాలులు యింకా కొన్ని దినములు మా దయకు పాత్రులు అయినట్టు అయితే అదే ప్రకారం దయచేస్తూవున్నాము. యిప్పుడు కాళహస్తి సీమకు పేషకస్సే అక్కరలేకుండా వ్రాయించి యిప్పిస్తున్నాము' అని సెలవు యిచ్చి కాళహస్తి సీమపాళేలు వగైరా దరోబస్తు పరమానా వ్రాయించి యిప్పించి సకల బహుమానాలు దయచేసిరి గన్కు ఆ బహుమానాలు తీస్కుని కాళహస్తి ప్రవేశించి ప్రభుత్వం చేస్తూ వుండిరి.

సీ॥ కొదమసింగమునైన మద మణంపఁగ వచ్చు
బేతాలుతోనైనఁ బెనఁగవచ్చు
దండిమృత్యువు నైనఁదఱిమి కొట్టఁగవచ్చు
బడబానలము కేలఁబట్టవచ్చుఁ
గార్చిచ్చుతో నైనఁ గదిసి మార్కొనవచ్చు
బెబ్బులిమీసాలఁ బెఱుకవచ్చు
భీకరమార్తాండబింబమంటఁగ వచ్చుఁ
గాలభైరవు నైనఁగదియవచ్చుఁ

గీ॥ గాక నీడాక కెదిరించి కదనమునను
నిలుచునా యెంతవాఁడైన నళుకు లేక
భాగ్యచారిత్ర ! చెన్న భూపాలపుత్ర !
హరినిభాటోప ! దామెర అక్కభూప ! 431



వ॥ వీరితదనంతరం వీరికుమారుడైన పెదవెంకట నాయనివారు తిమ్మానాయనివారు వీరు యిద్దరు ప్రభుత్వం చేస్తూ వచ్చిరి. యీ ప్రకారం ప్రభుత్వం చేస్తూవున్నంతలో అసబ్జాగారు దక్కనుసుబా విచారించగలందు్కు వారి (తమ్ముడు) తిమ్మానాయనింవారు వీరికొమారుడైన కొమారవెంకటప్ప నాయనింవారున్ను అసబ్జావారితావుకు పోయి వారిభేటీ అయి వారియంతఃకరణ కలిగేటట్టుగా సకలవిధాలా కొలువుగొలిచి పూర్వోత్తరం సంగతి రాజ్యాలు జహగీరుల వయనం యావత్తూ మనవి చేస్కుని మాజాగీర్లు యథాప్రకారం మాకు దయ చేయ వలెనని మనవి చేసుకున్నందున వారు గోలుకొండకు తర్లిపోయేటప్పుడు యీసుబాకు నియమించి వున్న అనవర్దిఖానుని వారిపేరట వీరికి కొంత జహగీరులు యిప్పించమని ఫరమానా వ్రాయించి యిచ్చిరి గన్కు వారిచేత బహుమానములు తీస్కుని అనవర్దిఖానుని తావుకు వచ్చి వారిభేటి అయి ఫరమానా చూపించి మనవి చేస్కున్నంతలో ఉత్తరాదిన పామూరు సీతారాంపురం తాలూకా జహగీరు దయచేసి గన్కు వారిచేత సెలవు తీస్కుని శ్రీకాళహస్తి చేరి పంజుమందిని గూర్చుకుని తాల్కు మీద్కి పోయి ఆ తాల్కూలో నున్న వాడవారు బష్కి మొదలయ్ని సరదార్ల – క్షిని మీద లడాయి చేసి వాండ్లను సంహరించి ఆ రాజ్యం కట్టకుని కొన్నిదినంబులు ప్రభుత్వం చేసిరి. అప్పుడు లడాయి చేసినప్పుడు యీ యొక్క పద్యములు:

సీ॥ ధూర్త ! నీజయధాటి వార్త విన్నంతనే
యూర్పులు నిగుడించెఁ దూర్పుదిక్కు
పెక్కు నీదు ధమామి పెట్టు విన్నంతనె
తల్లడంబందెను దక్షిణంబు
ఘనమైన నీ సైన్యకహకహధ్వనులచేఁ
బటపట మని వ్రీలెఁ బశ్చిమంబు
సొబగైననీడాలు చూచినయంతనె
యుఱ్ఱూత లూగెను నుత్తరంబు

గీ॥ అహహ ! మజ్జారె ! వీరసంహారశూర !
తారకర్పూరకీర్తికాంతావిహార !
విక్రమోదార ! అక్కభూవిభుకుమార !
విభవదేవేంద్ర ! దామెర వెంకటేంద్ర ! 432

సీ॥ శ్రీకరంబుగ భేరి జోకొట్టి నడిమిలా
ఖానుని వ్రేయవా మానువకడ
హత్తిని దుమికించి దుత్తలూరిబయళ్ల
మొత్తవా బక్షిని నెత్తి వగుల
బెడబెడల్ గొనివచ్చు వడి ఫిరంగీగుండ్ల
కెదురుగా నడవవా కదనమునను
జడిసి పోయెడివానిఁ బొడుచుట ధర్మంబు
గాదని నిలుపవా నీదుభటుల

గీ॥ సవుర ! నీకీర్తివిస్ఫూర్తి యజునకైన
వర్ణనలు సేయ శక్యమా వసుధలోనఁ
దిమ్మభూపాలసత్పుత్ర ! ధీవిచిత్ర !
వీరబలసాంద్ర ! దామెర వెంకటేంద్ర ! 433

వ॥ పెదవెంకటప్పనాయనివారు తిమ్మానాయనివారు క్రమించిన వెన్క వారి తదనంతరం కొమార వెంకటప్పనాయనివారు ప్రభుత్వం చేస్తూ వుండిరి. గన్కు బహుదినంబులు రాజ్యం చేసినారు. వారు నవాబు వాలాజా వారితో కూడా కష్టపడి దయ సంపాదించుకున్నది, ముసేలాలి అనే పురిచేరి సరదారుడు చన్నపట్టణం మీద వచ్చి కనిపించుకున్నప్పుడు నవాబు వాలాజా వారు యింగిలీజు బహదరువారి యనుమతి ప్రకారం చన్నపట్ణాన్కు యింగ్లీజు బహదరువారికి రసదుపౌచా యిస్తు వచ్చినారు. మరికొన్ని దినములకు వాలాజా వారి తాలూకా మోదరు ఖానుడు అనే సరదారుడున్ను పలనాడికి పోయినప్పుడు వీరున్ను కూడా పోయి రెండు సంవత్సరములు అక్కడ వుండి వారి యనుమతి చొప్పున



పుల్లారెడ్డిగూడెం వగైరా కొట్టి ఠాణావేసి యుభయత్తర్ల ప్రీతి సంపాదించుకున్నారు. మరికొన్ని దినములకు వాలాజావారున్ను జంద్రల్ యిసుమతువారున్ను కర్నల్‌పూటువారున్ను వెంకటప్పనాయనివారున్ను కూడా కోళాళస్వారి పోయినప్పుడు వారితో కూడ కడాకువుండి మెహనతుచేసి జెడి కోటమార్గాన పూటువారు యిసుమతువారితో కలియవస్తుండంగా హయిజరువారి పంజు కర్నల్ పూటువారిమీద మొకాబిలా ఆయ గన్కు పూటువార్కి కుమ్మక్కు నిమిత్తం జంద్రల్ యిసమత్ వారు పోతూ వెంకటనాయని వారిని పిలుచుకొని పోయినందున వారితోకూడావుండి హైదరువారి పంజుమీద లడాయిచేసి నిండా మెహనతు చేసి కార్యం ఫత్తి చేసినారు. ఆ వేళ మాపంజులో శేనా మందికి చావులు గాయాలు ఆయ గన్కు బారావారున్ను యిసమతువారున్ను కూడా సంతోషపడి బహదరు కితావు బహుమానములు నిండా దయచేసినారు. అప్పుడు వారియొక్క పద్యములు

శా॥ కోళాల్ చెంతఁ దురుష్కసైన్యములపైఁ గోపంబు రెట్టించి శుం
డాలంబున్ బెస నెక్కి హైదరుసుబా డాబాసయున్ దెచ్చినన్
దాళంజాలక వెళ్ళసాగిరట కాంతారప్రదేశంబులన్
జాలా శ్రీకర దామెరాన్వయవతంసా వెంకటాధీశ్వరా ! 434

చ॥ తొలి యిసుమంతలై గదియఁ దొత్రిల వేయుఫిరంగి పెట్లకున్
దొలఁగి కడాఖడిన్ బవుజు దీఅఁగ మీసముఁదీడి హత్తిపై
నిలిచి కరాసి దూసి పటు నిర్భరమైన తుపాకిగుండ్లకున్
నలఁగక కామనూరికడ హైదరుబాదరు మీఁద గప్పునన్
గలబడ నోర్చి మొత్తితివిగా మతి దామెరవెంకటాధిపా! 435

ఉ॥ సంగరమందు నీభటులసాహస మద్దిర కామనూర నల్
క్రంగుల నొత్తి యీటెలను గత్తులఁ జూర్లఁగటార్ల బాకులన్
కంగు ఖణింగు ఘల్లురన గబ్బిగురాన బిరాన జోళ్ళపైఁ
జంగునఁ జంగునన్ దుమికి జబ్బలు పిక్కలు డొక్కలక్కులన్
ముంగల పుట్టియల్ దొరుగ మొత్తిరి దామెరవెంకటాధిపా! 436

వ॥ తిరుపతిదగ్గర మమ్మత్కమాలును కొట్టినప్పుడు వీరి యొక్క ప్రతాప మైనపద్యము :

సీ॥ మమ్మత్కమాలును మర్దించినందుకు
బైదమౌ పొంగళ్ళబైలు సాక్షి!
చుట్టుపాళేలన్ని చూఱ గొన్నందుకు
గుఱియైన కందాటికొండ సాక్షి!
హైదరు మిముఁ జూచి మైదుచేఁగ్రమ్మిన
పోరి గెల్చుట కామనూరు సాక్షి!
వడి ఫిరంగీ గుండ్లవయఁజేసి బక్కిని
గొట్టినందుకు దుత్తుకూరు సాక్షి!

గీ॥ గాఁగ బలనాటిరాజుల గర్వమడఁచి
సేతుహిమగిరిమధ్యభూమీతలమున
శౌర్యకీర్తులు ప్రఖ్యాతి సలిపినట్టి
విజయుఁడవు నీవె దామెర వేంకటేంద్ర ! 437

మ॥ పటుశౌర్యోక్తి మమత్కమాలుదళముల్ పై వచ్చినం జూచి ప్ర
స్ఫుటదంతావళవీరవిక్రమముచేఁ బొంగల్లబైలన్ రట
త్పటహోద్యద్ధ్వని వించి త్రుంచితివి నీ పట్టాసిచే శత్రురా
ట్పటలిన్ దామెరవెంకటప్రభుమణీ ! భాస్వత్ప్రతాపాగ్రణీ ! 438

వ॥ ఆవల జంద్రల్ యిసుమతువారున్ను ఆర్మీలు వుమావారున్ను తంజావూరమీదికి పోయినప్పుడు వీరున్ను కూడా పోయివుండి నిండా మెహనతు చేసినారు. పులిచేరి యింగ్లీజు బహదరు కట్టుకునేందుకు జంద్రల్ మంద్రోలువారిని అర్పిస్తూ వారితో కూడా మా పంజును అర్పించమని హుకుం అయినందున ఆ ప్రకారం అందించినంతల్లో మా సరదారుడు మంద్రోలు వారి యనుమతిచొప్పున



మోర్జాలు వగైరా తావుల్లో నిండా మెహనతు చేసినారు. పులిచేరి కట్టుకుని తర్వాత మా సరదారుడ్కి బహుమానం యిప్పించి వెంకటప్పనాయనిం వార్కి యేనుగ, గుఱ్ఱం, కత్తి, వీరకంకణం వగైరా బహుమానములు అర్పించినారు. ఆ పద్యము:

శూరుఁడటంచు మెచ్చి రణశూరుఁడు మేల్ మమదల్లి మీకుని
ద్ధారుణి వీరకంకణము తాళి తురాయి జిరానిసరాలు బల్
బారహజాతి యేనుఁగును బాళిచిపంతులచేతఁ బంపె నీ
పేరుగ నాల్గుదిక్కులకు బెట్టుగ దామెర వెంకటాధిపా ! 439

వ॥ అవతల మరికొన్ని దినములకు కొండపాళెంగారలు సరకారు మీద తిరగబడి పోళూరికోటలో ఠానా ఉన్న అరికాటి కోట కొత్తవాల్ అబ్బూ మహమ్మదును తలకాయ కోసుకొని పోయినందు్కు వాలాజావారి యనుమతిమీద చంద్రల్ వెల్లి వారితో కూడా వుండి పాళేల లడాయిలో నిండా కష్టపడి ఫత్తె చేసినందున నవాబు వాలాజావారితో పాళేలు పూర్వం మాది అని మనవి చేసు కున్నందున వాలాజావారు నిండా బహుమానం దయచేసి ఆ పాళేలు మాకు కొన్ని జహగీరు యిచ్చినారు. ఆ లడాయి చేసినప్పుడు వీరియొక్క పద్యములు

సీ॥ నీ భేరి ధణధణానినదంబు విన్నంత
వేలాది పాళెంబు గోలుపోయె
నీ భటావళి కిల్కిలార్భటుల్ విన్నంత
పురి వీడి బాల్నీడు పరుగు సూపె
నీదు ఝుండాహెుయల్ నెఱిఁ జూచినంతనే
వీర్లకొండన కొండదార్లు సేరె
నీ ప్రతాపస్ఫూర్తి నిబిడమైనంతనే
మోదెప్పనాయనివాది యణఁగె

గీ॥ నాఁడె కదలెను సాయబునాయఁడహహ !
తత్తరించెను లొకచారితంబు చారి ?

మనకు రణమేల యీగెరామన్న యనుచు
వెళ్ళి రౌరౌర ! దామెరవెంకటేంద్ర ! 440

వ॥ యిటీవల హయదరు కలాపనలో హైదరువారి తాలూకు శామా రాయుడు నాలుగువేల గుఱ్ఱంతోకూడా తిరుపతిలో వచ్చియుండగా పంజును అర్పించి ఠాణా లేవగొట్టించి సరకారు ఠాణాకు అక్కడ వసూలు అయిన రూకలు సరకారుకు చేరేలాగున్న చేయడమయినది. అప్పుడు లాటుమకారీటీను వారు వాలాజావారున్ను సంతోషపడి ఉభయత్ర బహుమానములు అర్పించినారు. ఆ దినములలో వారియందు యింగ్లీజు బహదరువారికి అభిమానం వున్నందున నవాబు వాలాజావారి కొమారుడు అమీరుల్ వుమారావువారు వారి యందు జిందుజేసి దురాక్షేపణలు చేసి అవిహితములు నడిపించినందుక్కు యింగిలీజు బహదరువారు పూర్వోత్తరం అభిమానం తెలిసినవారు గన్కు మా యందు దయచేసి కుంఫిణి తరపున మెస్తరుక్లోసువారిని వారి తావుకు అర్పించి విచారించి మహలు యావత్తున్ను సముఖాన్కు వ్రాయించి పంపించి సీమలో తీరి వచ్చిన ప్రకారం గవనరు చార్లీసువోకిలీ బహదరువారి దినాలలో రాజ మొహోరుతోకూడా సదామదు యిచ్చి పేషుకసు తీస్కునేటట్టున్ను ఆ ధనం అడగకుండా గవనరు చార్లీ వోకిలీ బహదరువారి జాబున్ను బహుమానములున్ను యిప్పించినారు. గన్క యింగ్లీజు బహదరువారి కోటి కల్పవృక్షంవంటిది అనిన్నీ చంద్రుడివలెనె చల్లదనం కలిగినటువంటిదిన్ని గన్కు వాటికారణం వాలీసువారితో మనవిచేస్కుని నవాబువారి తావున యిలాకా లేకుండా చేస్కుని కుంఫిణీవారి యిలాకాలో చేరినాము. మమ్మును చూచి చుట్టుపట్టువారున్ను తమ యిలాకాలో ప్రవేసించినారు. యీ ప్రకారం బహుదినములు రాజ్యం చేసి వారు క్రమించిరి.

తదనంతరం వారికొమారు డైన తిమ్మానాయడు బహుదరువారు ప్రభుత్వం చేస్తూ వచ్చిరి. వారు వారితండ్రిగారున్నప్పుడె వారి అనుమతి ప్రకారం పట్ణాన్కు పోయినప్పుడు అక్కడ హైదరు కలాపనలలో చాకలపేట, చింతాద్రిపేట, తట్టుకాపున్ను, లుంగబాక, బెత్తీరి, అమీరుబాగు, మైలాపురి చరవు వగైరా తావుల హైదరువారి



పంజుమీద లడాయి చేశి పత్తి చాయడ మున్ను వేలూరికి రసదు పౌచాయించడమున్ను ఆ దినములలో శానామంది మా పంజులో జాయాకావడమున్ను యిషువంటి మెహనతులు చాయడం అయి నందున లాటు మకారీటున్ను వాలాజావారు జంద్రల్ మెడోసు వారితో కూడా శ్రీరంగపట్నం స్వారికి మా పంజును సరదారుణ్ణి అంపించినంతల్లో అక్కడ నిండా మెహనతు చేసినారు. వారియొక్క ప్రతాపములైన పద్యాలు

సీ॥ పటుశౌర్యమునఁ జెన్న పట్నముమీఁదను
బహుమందిపౌజుతో బహద రపుడు
చుట్ల బతేరాలు గట్లద్రువఁగఁ బెట్టి
పేర్మి ఫిరంగీల పేట్ల కపుడు
మొన చెదరక వెడ ముసిముసినగవుతో
ఘనత నేజా వడిగాఁగ దూసి
అరబితేజీ నెక్కి యరిరాజగణముల
యవనులడొక్కల నధికమునను

గీ॥ దివిరి రణరంగమున నీవు తేడపడఁగ
నఱకునపుడు మహమదల్లి యవుర యనుచు
సకలదౌలత్తు లొసఁగినసద్గుణాఢ్య !
ప్రబల దామెర వెంకటప్రభుకుమార !
వరగుణవిరాజ! తిమ్మభూవరబిడౌజ! 441

శా॥ రాజాబాదరు తిమ్మభూప ! తగురా రమ్మంచు మందల్లి మేల్
తేజీపాలికి నాల్నగల్ పతకముల్ దేశంబు నీ కిచ్చె మేల్
రాజత్వంబు కుమారపద్దు భళిరా ! రారాజదేవేంద్ర ! నీ
రాజత్వంబును గీర్తు లెంతు రవురా ! రాజాధిరాజావళుల్, 442

చ॥ తిరువళికేణినుంచిబహుతీవ్రగతిన్ బడి గుఱ్ఱ మెక్కినన్
గరమున హేతిఁ బూనియు లగాలగి హైదరుబారు పంజులన్

నతికి జయంబు గాంచినఘనాఘనుడంచు నబాబు మెచ్చఁగా
దురమును జేసి తౌ భళిర ! దోర్బలశాలివి తిమ్మభూవరా ! 443

ఉ॥ గండునరాతితండములఁ గాసె బిగించియు హేతిఁ బూని బల్
చండతరోగ్రకోపమున జన్యముఁ జొచ్చి విరోధిసేనలన్
బెండు వడంగఁగా గదిమి పేరెమువాఱుచుఁ జక్కుచక్కుగాఁ
జెండినదామెరాన్వయవశీకర ! తిమ్మనృపాలకాగ్రణీ ! 444

శా॥ వీరత్వంబునఁదేజి నెక్కి చటులోద్వేలారియూథంబులన్
బేరెంబాఱెడు హైద రన్పుదళముల్ పేరైనమైలాపురిన్
బోరం జొచ్చి తురుష్కబృందములనుం బోనీక భేదించి తౌ
ధీరప్రాభవ ! దామెరాన్వయమణీ ! తిమ్మేంద్రరాజన్మణీ ! 445

మ॥ నెఱవేగంబున టీపుసైన్యములపై నీఢాక మైలాపురిన్
బరిపంథిన్ దురగంబు నెక్కి వడిగా బాహాసిచే నంటినన్
బెఱుకన్ వెళ్ళిరి కంచిమిట్టలకు బల్విద్వేషిభూపావళుల్
తరమే శౌర్యము నెన్నఁగా జగతిలో దామెర్లతిమ్మాధిపా ! 446

సీ॥ చెలఁగి మైలాపురిచెఱువు లోతట్టున
హైదరుపౌజుపై నాహవమున
ఘనశిలేదార్లను గంఠముల్ విదళించి
మొగలిగరీబుల మొనసి నఱికి
దండిబారునఁ జొచ్చి మెండైన సరదార్ల
కందరములు రాలఁగదిమి పొడిచి
వడి గలవజ్రీల వక్షములను గ్రుమ్మి
మేలౌజమేదార్ల మెడలు ద్రుంచి



గీ॥ గర్వ మణచిఁయు నా కరింఖాను నపుడు
కంచి కేగంగఁ దఱిమించి ఘనత మించె
దామెరాన్వయ వెంకటధవుని ముద్దు
తనయశేఖర తిమ్మభూధవవిభుండు. 447

వీరు కొన్ని దినములు ప్రభుత్వం చేసి క్రమించిరి. తదనంతరం వీరి కుమారుడైన పెద వెంకటప్పనాయనివారు ప్రభుత్వం చేస్తూవున్నారు. వీరియొక్క పద్యములు :

సీ॥ అద లెఱుంగవు గదా మదవంతు లగురాచ
కదుపులఁ గొట్టుసింగం బనంగ
భయము నొందవు గదా హయమత్తవారణ
ముష్కరారుల కోట్లు మొనయుపట్ల
చలన మొందవు గదా బలవద్విరోధులఁ
జలపట్టి నుగ్గాడు సమయమునను
బరవ సేయవుగదా పటువిక్రమప్రౌఢి
ప్రళయమై యేతెంచుబలమునైన

గీ॥ నవుర ! నీ సైన్య మెన్నంగ నలవి యగునె
సలిలతోదార ! దామెర్లకులవిహార !
వార్ధిగంభీర ! తిమ్మభూవరకుమార !
యాహవాటోప ! పెదవెంకటావనీప ! 448

సీ॥ కప్పు గప్పదు గదా కఠినంపువైరుల
మేనిచర్మంబుల మిసిమి గాని
జలముఁ గ్రోలదు గదా శత్రుమూర్ధన్యుల
బటువైనమెదరక్తపాళి గాని

మేఁత మేయదు గదా మేటితరాహితు
గుదిగొన్న మాంసంబుగుములు గాని
శబ్ద మియ్యదు గదా శత్రుమూర్ధన్యుల
తలమీఁది బొమిడికతతులు గాని

గీ॥ యెంత కరకరి యదిగాక యెంత హంత
యెంత వేగంబు గడుసరి యెంత బలము
కలితభవదీయ బాహాగ్ర ఖడ్గశక్తి
యాహవాటోప ! పెదవెంకటావనీప ! 449

సీ॥ కవిగాయకుల బంధుగణములఁ బోషించి
ఘనత కెక్కిన యినుగాల పేరు
అరిరాట్పురంబులు దురమున విదళించి
సిరులఁ బ్రబలిన దామెరల పేరు
అఖిల దిగ్భూముల యవనీశ్వరులు మెచ్చ
గణనచే మించు కోర్కంటి పేరు
శౌర్యవిస్ఫూర్తిచే జగములు మెచ్చంగ
నుతిమి కైకొన్న వాలూరిపేరు

గీ॥ మీకు వజ్రాల పేరులై మెఱసె నౌర !
మద వదరి మస్తకన్యస్త మకుటరత్న
భాసితపదాబ్జ ! తిమ్మభూపాలపుత్ర !
యాహవాటోప ! పెదవెంకటావనీప ! 450

వ॥ యీ ప్రకారం హిందూ రాజ్యాదులకు ప్రవేశించిన లగాయితీ మా పెద్దలైనటువంటివారు తమ శ్రేయస్సే కోరి నడుచుకుంటూ వచ్చినారు.

* * * * *



## దామెర వెంకటరాయభూపాలుఁడు

ఉ॥ శ్రీమహితాబ్ధిజాప్రియుఁడు సేవితరక్షుఁడు సర్వదేవతా
గ్రామణి భక్తవత్సలుఁడు రమ్యఘనోదయకాంతిదేహుఁడు
ద్దామసరోజలోచనుఁడుదాత్తశుభంబుల నిచ్చి ప్రోవుతన్
దామెరవంశవారిధిసుధాకరు వెంకటరాయభూవరున్. 451

### దామెర ముద్దువెంకటభూపాలుఁడు

క॥ శ్రీకర దామరవంశ సు
ధాకరసంజాత సత్సుధాకర దీన
శ్రీకర రిపుజనబహుతర
భీకరనిజరూప ముద్దువెంకటభూపా ! 452

క॥ సారాసారవిచారవి
శారదులును మీరె, దామరాన్వయతిలకా!
కారులును మీరె! బళిరే!
వీరసభాచంద్ర ముద్దువెంకటభూపా ! 453

క॥ అజుఁడు మది వెదకి మిమ్మును
గుజనుల శిక్షింప సుజనకోటులఁ బెంపం
సృజనం బొనర్చె నహహా
విజితారిసమూహా ! ముద్దువెంకటభూపా ! 454

క॥ అమిత ప్రతాప నమ్రిత
కుమతిశిరస్సోమ ! దుష్టకుంజరసింహా !
సుమశరసన్నిభరూపా !
విమతాచలకులిశ ! ముద్దువెంకటభూపా ! 455

కఀ ధరలో భూపతు లెల్లను
బరబోధలు వినుచుఁ గార్యపరు లౌదురుగా
పరికించి చూడ బహుసు
స్థిరచిత్తులు మీరె ముద్దువెంకటభూపా ! 456

కఀ శ్రీదామరకులదీపక !
వేదాంతవిచారనిపుణ ! విద్వద్విద్యా
వాదరసజ్ఞులు మీరే
లేదు కదా సాటి ముద్దువెంకటభూపా ! 457

కఀ నే నెవరికి వినిపించెద
దానధురంధరులు సుజనదాక్షిణ్యపరుల్
జ్ఞానాజ్ఞానవిచారులు
నీనాఁటికి మీరె ముద్దువెంకటభూపా ! 458

కఀ ఇభముఖునితంద్రికరుణను
సభికగుణంబులను గార్యచరులగుణాంబుల్
సభ మెచ్చ వెదకుప్రభువుల
విభుఁడవు దామెరల ముద్దువెంకటభూపా ! 459

కఀ నలుమొగములు గలవేలుపు
వెలఁదియు మీపలుకులందు వెలసినది భళీ
గలరే మీకు సమానులు
నిలలో దామెరల ముద్దువెంకటభూపా ! 460

కఀ అపరిమితదయాసాగర !
రిపుజనమత్తేభ కేసరీంద్ర ! నరేంద్రా ?



యుపకృతిదానవినోదా !
నృపవర ! దామెరల ముద్దువెంకటభూపా ! 461

కఀ మనుజేంద్రుల సభలోపల
ఘనతర దాతెవ్వఁడనెడుగణనకు మొదలన్
వినుతించవలెను మిమ్మును
వినుమీ దామెరల ముద్దువెంకటభూపా ! 462

కఀ పరమేలోర్చి నటించే
దొరలకు దొర వీవు సాటి దొరకదు భువిలో
మరునయ్య నీకు సముఁడని
యెఱుఁగుదు దామెరల ముద్దువెంకటభూపా ! 463

కఀ అనుమాన మేమి లేకను
వినుపించెద నృపవరేణ్య ! వినుతప్రజ్ఞా
ఘనుఁడవు కవికమలంబుల
కినుఁడవు దామెరల ముద్దువెంకటభూపా ! 464

కఀ అష్టామరాంశసంభవ
శిష్టజనత్రిదశభూసురేశ్వర పూజో
త్కృష్టమతి బహుళభక్తివి
శిష్టా దామెరల ముద్దువెంకటభూపా ! 465

కఀ పురహరుఁడు దయను మీపయి
స్థిరముగ నిడి సకలకార్యసిద్ధి నొసంగన్
స్థిరమతి గలవాఁడై సు
స్థిరుఁ డౌదామెరల ముద్దువెంకటభూపా ! 466

కII పక్షీంద్రవాహనుఁడు మీ
పక్షమునం దుండి కార్యభాగంబులు దా
నీక్షించి సేయవలయును
నీక్షితి దామెరల ముద్దువెంకటభూపా ! 467

కII రతిపతిసన్నుతకాయా
మతిజితనిర్జరసమూహ మానితధిషణా
సతతసురమహీసురవర
హితకర దామెరల ముద్దువెంకటభూపా ! 468

కII బీదల పేదఱికముఁ గని
లే దనుచు నొసంగుదాత నీ వనుచు భువిన్
వాదింతు రఖిలజనములు
లేదుగ మీసాటి ముద్దువెంకటభూపా ! 469

కII నీసరిసమాన మగునరు
వేసరకయు మదిని నేను వెదకితి రసపై
వీసముపాలికి సమనరుఁ
డీసరికిని గాన ముద్దువెంకటభూపా ! 470

కII కమలాసనాంగనాకచ
సుమశరపరకంఠ దేశసుమన స్తంబే
రమగండస్థలమలహర
విమలయశోరూప ! ముద్దువెంకటభూపా ! 471



# మంత్రులు

సీII వ్రాయను జదువను వరుసతో మాటాడ
నావలీవలిపల్కు లాలకింప
పరదేశభాషలు ప్రభువుకు వినిపింప
సభదుర్గుణంబులు సర్దుచేయఁ
మనవులు గదియింప మనసులేకముచేయ
గపటనిష్కపటముల్ కలయనెఱప
కలిపింప, విడిపింపఁ, గరుణింప, మన్నింపఁ,
బరనృపాళికిరాజ్యపదవిఁదీర్ప

గీII సభలఁగూర్చుండి చిత్రప్రసంగ మాడ
సరససంగీతసాహిత్య సరణి నెఱప
వినయగాంభీర్య చాతుర్యవితరణముల
నేర్పుగల్గినమంత్రులు నీతిపరులు. 472

## ద్వాత్రింశన్మంత్రులు

ముప్పది యిద్దరు మంత్రులను దెలుపు నీ సీసమాలిక కట్టుకతలను బట్టి యొకబట్టుకవిచేఁగూర్పఁబడినది. పేర్కొనఁబడిన మంత్రుల క్రమము కాలక్రమమునకు ననుకూలింపదు. చరిత్రకారులు దీనినిఁబరమప్రమాణముగా దీసికొనరాదు.

1. సీII కవులిచ్చి భూపతి గాసి పెట్టఁగ జచ్చెఁ
ప్రజలకై **రాయన భాస్కరుండు.**

2. వరదాతయై మణీవలయముల్ కవికిచ్చె
దండిభాస్కరసూతి **కొండమంత్రి.**

3. భాస్కరువలెఁగీర్తిపడసెఁ తత్పౌత్రుఁడౌ
ఘన**రామలింగభాస్కరుఁడొ**కండు

4. గణకనిర్వాహంబు గల్గించె నూరూర
మహి **గోపరాజు రామప్రధాని.**

5. దుర్గమియ్యక శత్రువర్గంబుతోఁ బోరెఁ
బెల్లుగాఁ **గరణము మల్లమంత్రి.**

6. ఆత్మీయతపముచే నర్థినాలుకమడ్డు
కేడించె **బండారు కేతమంత్రి.**

7. కవిపాముచేఁజావఁగను నాయు వాతని
కై యిచ్చె **సీదయ యాచఘనుఁడు.**

8. వేఁటాఱుతునియల విమతులఁజెండాడె
నాజిలో **నాదెండ్ల యయ్యలయ్య.**

9. పోరిలో నసహాయశూరుఁడై తెగి వెన్క
బ్రతికె **సిద్దయ తిక్కఁడతులితముగ**

10. పట్టిసపురవీరభద్రునిప్రేమచేఁ
జెన్నొందె **శ్రీ కోటసింగరాజు**

11. ఇలుచూఱ యాచకావలికి దాతలదాత
యై యిచ్చె **నిట్టల హరిహరప్ప**

12. తనదు మీసముదీసి తాకట్టుగానుంచి
**కొట్ట రెడ్డిం** దర్థి కోర్కి తీర్చె.

13. గణపతిదేవునికరుణ భట్టుకు మణి
యడపంబొసంగె **గుండార్యవరుఁడు.**



14. అష్టసహస్రంబు లర్థి కిచ్చి సుకీర్తి
మహిని **సింగనమంత్రి మాచఁ డందె.**

15. కొనియె భాస్కరునిచేఁదెనుఁగురామాయణం
బారూఢి **సాహిణిమారమంత్రి.**

16. ఆంధ్రనైషధకావ్య మందె శ్రీనాథుచే
**మామిడి సింగనామాత్యమౌళి**

17. ఘనదానకర్ణుఁడై గండపెండెముదాల్చెఁ
**గొలవి యన్నామాత్యకుంజరుండు.**

218. పగతుఁజుట్టమటంచుఁబల్కఁగా ధనమిచ్చి
చేపట్టెఁ **బెమ్మయసింగరాజు.**

19. గురుజగత్త్రయదాన గురుమూర్తియై మించె
**నందూరి భీమనగుండమంత్రి.**

20. ప్రాణికోటికినెల్ల బహుభక్ష్యభోజ్యాన్న
సత్రముల్ పెట్టె **విస్సప్రధాని.**

21. భట్టుమూర్తికిఁగిన్కరెట్టింపఁబచ్చల
హార మర్పించెఁ **దిమ్మరసమౌళి.**

22. ఘనదైవతంబు దాక్షారామభీమేశుఁ
డని కొల్చె **బెండపూఁ డన్న మంత్రి.**

23. నీడ ద్రొక్కెడువేళ నెఱి నర్థి కభిమతం
బిప్పించెఁ **జేమకూ రప్పరాజు.**

24. ఘనసప్తసంతతు లొనరించి సత్కీర్తి
వెలయించె **విట్టల వెల్లమంత్రి.**

25. అమితశత్రులఁ గెల్చి యవని పాలనచేసె
రహి **గుంటుపలి ముత్తరాజమంత్రి**

26. తనునేలునృపతిచేతనె మేటికృతి గాంచె
శ్రీ **గుంటుపలి నరసింగమంత్రి.**

27. ఘనభట్టుసుకవికి మణికుండల మొసంగి
**నందితిమ్మకవీంద్రుఁ** డందెఁ గృతుల.

28. కవుల కర్థ మొసంగి ఘనకీర్తి వహియించె
రహిఁ**గూరగాయల రామమంత్రి.**

29. వాకిటికావలి జోఁకతో నొనరించి
దివ్యకీర్తి వహించెఁ **దిమ్మమంత్రి.**

30. రిపు గెల్వ నృపుఁడిచ్చువిపులార్థముల నర్థి
కర్పించెఁ **గటికి కామన్న మంత్రి**

31. కవిబుధావళినేలి ఘనకీర్తిని వహించె
**వరకోటిపల్లి శ్రీ శరభమంత్రి.**

32. నిరతాన్నదాతయై నిత్యకీర్తి వహించెఁ
గాశి **బందా పరదేశిమంత్రి.** 473

ఒకానొకబట్టురా జీక్రిందివిధముగ ద్వాత్రింశన్మంత్రుల సీసమాలికను జదువఁజాగెను, గాని, కడముట్టింపఁజాలఁడయ్యె. అందినంతపట్టు–

సీ॥ బళిర ! **రామయమంత్రి భాస్కరామాత్యుండు**
నిండారు**నందూరి గుండమంత్రి**
శివపాదభక్తుండు **శ్రీ కంఠవెంగన్న**
శ్రీనిధి **యౌకోట సింగరాజు**



వేమభూపతి మంత్రి **మామిడిసింగన్న**
యెన్న నౌబెండపూఁడన్న మంత్రి
మేటైన **కొచ్చెర్లకోటకర్ణముమల్లు**
స్తుతికెక్కువాడల **తుక్కమంత్రి**
ప్రియమాడునెఱజాణ **పెమ్మయసింగన**
మహితుండు **సింగనమంత్రిమాచ**
సర్వజ్ఞుఁడై నట్టి **సర్వయ చిక్కన**
యధికుండు **నెల్లూరి యాదిరాజు**
ధీరుండు **సాళువ తిమ్మనరేంద్రుండు**
గురిజాల **నాదిండ్ల గోపమంత్రి**
ప్రథితి కెక్కుచు నుండు **భాస్కరామాత్యుండు**
మాన్యుండు **కొడపర్తి మాదిరాజు**
ఇలఁ గొండవీటిలో వెలయు ప్రధానుండు
భవ్యుండు **బలభద్ర పాత్రఘనుఁడు**
కులముద్ధరించిన **గోపయరామన**
పేరిమి **తిరువెళ్ళ పెమ్మరాజు**
విస్మారసత్కీర్తి విలసిల్లి వర్ధిల్లు
విదితుండు **నందూరి వెంగళయ్య**
కేవలపుణ్యుండు **కేసయరామన**
సుజనుండు **శ్రీపతిసోమరాజు** 474

పై సీసమాలికయందుఁ బేర్కొనఁబడినవారిలోఁ గొందఱపైఁ జెప్పఁబడిన చాటుపద్యములు చేకుఱినవి. అవి యీ క్రింద వివరింపఁబడు చున్నవి.

## 1. భాస్కరుఁడు

ఈనామముగల ప్రఖ్యాతపురుషు లనేకులుగలరు. తిక్కన పితామహాదు

లటుండ రాజమంత్రులును దాతృత్వమున ప్రఖ్యాతులును నందవరీకులును నగు భాస్కరులే నల్వురైదుగురు గన్పట్టుచున్నారు. రామయభాస్కరు లిర్వురు. పదునాల్గవశతాబ్దియందుఁ ప్రఖ్యాతకవీశ్వరుఁడుగానున్న రావిపాటి త్రిపురాంతకునిచే–

మ॥ సరిబేసై రిపు డేల భాస్కరులు ! భాషానాథ ! పుత్రా వసుం
ధరయందొక్కఁడు మంత్రియయ్యె,వినుకొండన్ రామయామాత్యభా
స్కరుఁడో,యౌ, నయినన్ సహస్రకరశాఖ ల్లే వవే యున్నవే
తిరమై దానము సేయుచో రిపుల హేతిన్ వ్రేయుచో వ్రాయుచోన్. 475

అని పొగడఁబడినవాఁడొకఁడు.

సీ॥ నిర్మించె నేమంత్రి నిరుపమప్రాకార
నవకంబుగా గోపినాథపురము
గెలిచినాఁడేమంత్రి లలితవిక్రమమునఁ
బ్రబలుఁడై యవనుల బలము నెల్ల
నిలిపినాఁడేమంత్రి నియతవైభవమున
గోపికావల్లభుఁగూర్మి వెలయ
పాలించె నేమంత్రి ప్రకటధర్మ ఖ్యాతి
మహిమ మీఱఁగ నాంధ్ర మండలంబు

గీ॥ అతఁడు భూపాలమంత్రీంద్రసతతవినుత
ధీవిశారదుఁడచ్యుతదేవరాయ
మాన్యహితవ ర్తనుఁడు శౌర్యమహితయశుఁడు
భానుతేజుఁడు రామయభాస్కరుండుఁ 476

కొండవీటి గోపీనాథపురపు గోపీనాథస్వామి యాలయము ముఖద్వార శాఖయందు వ్రాయబడిన యీ పద్యమువలన యచ్యుతదేవరాయలనాఁడు వేఱొక రామయభాస్కరుఁడున్నట్లు ధ్రువపడుచున్నది. ఇంక రాయనభాస్కరులుకూడ ననేకు లున్నట్టు స్పష్టపడుచున్నది. మనలోఁదండ్రిపేరు కుమారునకుఁబెట్టెడు నాచారము కలదుగదా ! దానివలననే యేకనామ మనేకులకు బొసగియుండె నని తలఁపఁదగి యున్నది.



చ॥ కలయఁ బసిండిగంటమునఁ గాటయవేమసమక్షమందు స
త్ఫలముగ రాయనప్రభునిబాచఁడు వ్రాసిన వ్రాలమ్రోఁతలున్
గలుగలు గల్లుగల్లు రనఁగంటకమంత్రుల గుండెలన్నియున్
జలుజలు జల్లు జల్లురనె సత్కవివర్యులు మేలుమే లనన్. 477

అను చాటుపద్యమువలనఁ గాటయవేముని కాలమున క్రీ॥ 1400 వ నొక రాయభాస్కరుఁ డుండిన ట్లేర్పడుచున్నది.

శ్లో॥ శాకాబ్దే వసువహ్ని వేదధరణీగణ్యే చ ధాత్రబ్దకే
వైశాఖే వినుకొండసీమని సుధీ ర్నాదెళ్ల యప్పప్రభుః
వాసిష్ఠాయ చ భ ర్తపూండి మఖిలంగ్రామం స్వనామాంకితం
ప్రాదాద్రాయనిభాస్కరాయ విదుషే ష్టైశ్వర్యభోగాన్వితమ్. 478

అను శాసనమువలన క్రీ॥ 1500 తర్వాత నొక రాయన భాస్కరుఁడుండిన ట్లేర్పడుచున్నది. ముప్పదియిద్దఱు మంత్రుల సీసమాలికలోఁబేర్కొనఁబడిన రాయభాస్కరుఁడు ప్రాచీనుఁడుగాఁనూహింపఁదగియున్నాఁడు. ఆతఁడు మహాదాత. ఆ రాయని భాస్కరుని గూర్చి చెప్పబడిన చాటుపద్యము లనేకములు గలవు.

క॥ పన్నిద్దఱు భాస్కరులని
యెన్నికసేయుటదికల్ల యిద్దఱుగాదా
మిన్నున నొకభాస్కరుఁడును
బన్నుగ వినుకొండనున్న భాస్కరుఁ డొకఁడున్. 479

కు॥ పసముత్య మొకటిచాలును
గస పూడ్చిన చింపిరాలు గంపెండేలా ?
రసికుం డొక్కఁడె చాలును
రసహీనులు పదువురేల రాయనిబాచా ! 480

కు॥ చేకొని రాయని బాచఁడు
కాకాలు గుణించు పిదపకాలమునాఁడే
లాకేత్వ మియ్యనేరఁడు
దాకును గొమ్మియ్యఁడిట్టి ధన్యులుగలరే ? 481

కు॥ ఏవ్రాలైనను వ్రాయును
నావ్రాయఁడు వ్రాసెనేని నవ్వుచునైనన్
సీవ్రాసితావడియ్యఁడు
భావజ్ఞుఁడు రాయనార్య భాస్కరుఁడెలమిన్. 482

కు॥ వగమాన్పి యర్థి కియ్యని
మగముండకు మీసమేల మఱిమూతిపయిం
దెగగొఱుగఁడాయె మంగలి
రగడందునఁ గీర్తిదోఁచ రాయనిబాచా! 483

ఉ॥ ఒక్కఁడు మాంసమిచ్చె మఱియొక్కఁడు చర్మముఁ గోసి యిచ్చె వే
ఱొక్కరుఁడస్థినిచ్చె నిఁకనొక్కఁడు ప్రాణములిచ్చె వీరిలో
నొక్కొకపట్టునన్ బ్రదుక నోపక యిచ్చిరొ కీర్తి కిచ్చిరో
చక్కఁగఁజూడు మంత్రికులసంభవ ! రాయనమంత్రిభాస్కరా. 484

ఉ॥ రాజితకీర్తిశాలియగురాయనిబాచ ! భవద్యశంబు ది
క్పూజితమౌచు మించె సురభూధర భూ ధరేంద్ర కాం
తాజనుగోత్రరు గ్విధు రథాంగరథాంగరథాంగశేషభా
షాజలజాహితాహితతుషారతుషాతురధాములన్. 485



ఉ॥ ఏమినిలింపశాఖి? పనియేమి సురేశ్వర ! యీవి నిన్నుఁ జిం
తామణి మీఱినాఁడటకదా మనరాయనబాచకోవిద
గ్రామణి, యౌన యింతటనె కాదుచుమీ విభవంబునందు ని
న్నో మతియందు నీ గురువునో సుకుమారత నీకుమారునో. 486

మ॥ అయలక్ష్మీనిధి రాయనప్రభునిబాచామాత్యుఁడశ్రాంతమున్
నియతిన్ బ్రాహ్మణపూజసేయు టభివర్ణింపంగ శక్యంబె త
త్ప్రియగేహంబున హేమపంజరమునన్ బె 'ల్లర్చితప్రార్చిత
ప్రియమేధా' యనుచుం బఠించు శుకశారీకిన్న రీద్వంద్వముల్. 487

ఉ॥ అన్నరొ కొండపల్లి సచివాగ్రణి రాయనమంత్రిపట్టి బా
చన్నజలాన్నసత్ర మెడపైన పథంబునఁ బెట్టు నెయ్యి రా
జాన్నము లొల్పుఁబప్పు పదియాఱు తెఱంగులకూరగాయలున్
వెన్నెలగుజ్జుఁబోలుదధి వేసవికాల మవారితంబుగన్. 488

కు॥ ముసలాపె వ్రేలుఁజన్నుల
పసవంటిది లోభివానిబ్రదుకు ధరిత్రిన్
బసిబాలవయసువంటిది
రసికునిజీవనము మంత్రిరాయనిబాచా. 489

సీ॥ ఫణిరాజు తనశిరోమణు లర్థికిచ్చునో
యనుచు విష్ణువు క్రింద నణఁగియుండె
కైలాసకుధరమెక్కడ నిచ్చునో యని
యుగ్రుఁ డక్కడఁ గావ లుండఁబూనె
తనయందు మణుల నేతఱి నిచ్చునో యని
వనధిసంతతమును వణఁకుచుండె
సురధరాధరము నెవ్వరి కిచ్చునో యని
తరణి యగ్గిరిచుట్టుఁ దిరుగుచుండె

గీ॥ ఔర ! నీదానవిఖ్యాతి యఖిలదిశల
మింటవర్తించె నీకీర్తి నెంచఁదరమె
గాఢదారిద్ర్య యామినీకాంతిచంద్ర
భాగ్యదేవేంద్ర ! రాయన భాస్కరేంద్ర ! 490

సీ॥ నీపంక్తి నొకఁనాడు నెతిభుజించినవిప్రుఁ
దమృతాన్నమైనను నరుచిసేయు
నీసభాస్థలి నొక్క నిముసమున్న జనుండు
తల్పశేషునినైనఁ దప్పువట్టు
నీరూప మొకనాఁడు తేఱిచూచినభామ
కందర్పునైన డాకాలఁ దన్ను
నీచేతిదానమ్ము నెమ్మినమ్మినయర్థి
యెమ్మె ధనాధిపు బొమ్మబెట్టు

గీ॥ నీవె నినుఁ బోలుదువుగాక నిన్ను నెన్ని
యున్న మంత్రుల నెన్నుట పిన్న తనమె
బాలికాప్రాణ నూతన పంచబాణ !
భాస్కరేంద్రుని రాయనభాస్కరేంద్ర ! 491

సీ॥ అక్షరాభ్యాసంబు శిక్షచేసెడునాఁడె
యోవ్రాసి నా వ్రాయకుండినావు
గుణితవేళలయందుఁ గోరి లా కేత్వంబు
దాకుఁ గొమ్మియ్యక తర్లినావు
ఒకటి పఙ్క్తినివ్రాయు నూహ నేర్చిననాఁడె
సున్న చుట్టక వ్రేలు చూపినావు
గణితవేళలనాఁడె ఘనయుక్తిగా నేర్పు
గురుకీర్తికిని బాలుగూర్చినావు



గీ॥ నిజకులాచారధర్మంబు నిర్వహించి
హెచ్చు గలయట్టిదాతవై హెచ్చినావు
సరసహృదయుండ ! వినుకొండశాసనుండ !
భవ్యభరతుండ ! రాయన భాస్కరుండ ! 492

సీ॥ సంగీతసాహిత్యసరస విద్యలకిచ్చు
బహురూపులకు నిచ్చుఁ బట్టుకిచ్చు
పెండ్లిపేదల కిచ్చుఁ బేదవిప్రులకిచ్చు
బీదసాదులకెల్లఁ బిలిచి యిచ్చు
తిట్టవచ్చిన నిచ్చు దీవించఁగా నిచ్చుఁ
గొట్టవచ్చిన నిచ్చుఁ గొంటెకిచ్చు
బాచన్న! యన నిచ్చు భాస్కరా ! యన నిచ్చుఁ
దేరబాచాయన్నఁ దిరిగి యిచ్చు

గీ॥ మెచ్చి తగనిచ్చు మెచ్చులుమెచ్చి యిచ్చు
వీఁడువాఁడనకయె సొమ్మువేఁడ నిచ్చు
మంత్రిరాయని భాస్కరామాత్యుఁబోలఁ
గలరె దాతలు మూఁడులోకములయందు ? 493

సీ॥ కదలి యి ల్వెడలంగఁ గడప కాల్ దాఁకినఁ
దలపాగ పందిటఁదగులుకొన్న
ఎందుఁబోయెద వన్న నేకవిప్రు నిఁగన్న
నొంటిరోదన మన్న నుండుమన్న
తగినచోఁ దుమ్మినఁ దంబళియెదురైన
వీడినతలవాని వీథిఁగన్న
ఒలిమిడి మిక్కిలి యొంటికొమ్మెక్కినఁ
బులుఁగువీచినఁబొడపురుగుఁగన్న

గీ॥ మానకేతెంచు నర్థిసమాజములకు
నిచ్చునిష్టావస్తువు లెలమితోడ
సరసహృదయుండు వినుకొండశాసనుండు
భవ్యభరతుండు రాయనభాస్కరుండు. 494

సీ॥ ఆవుపొడ్చినయర్థి లేవకుండఁగనిచ్చె
వలవేసి తీసిన వానికిచ్చె
గుడిఁవ్రాసియాఁగినఁ గొఱకొఱపడకిచ్చె
బ్రార్థించిబుజమెక్కు బట్టుకిచ్చె
మొగసాలఁజిచ్చిడ్డ తగవరిఁ బిలిచిచ్చె
నిలుచూఱవేఁడిన నెసఁగనిచ్చె
ప్రాణముల్ వేఁడినఁ బ్రాభవంబుగనిచ్చె
భార్యనువేఁడినఁ బరఁగనిచ్చె

గీ॥ పల్ల మడిగినఁ బదటులోఁ బల్లమనక
భట్టగొంపోయి మున్ను తాకట్టు పెట్ట
ముచ్చవెంగనఁ జేపట్టి మెచ్చి యిచ్చె
భవ్యభరతుండు రాయనభాస్క రుండు. 495

పైపద్యమున 'భార్యనిచ్చె' ననఁగా వివాహముచేసె ననియే యర్థము నిర్ధారించుకొందము.

ఈయన దాతృత్వపుఁబిచ్చిని వినుఁడు ! విటగ్రామణులకుఁ గాను సత్రము పెట్టించినాఁడట !

సీ॥ అతిథికోట్లకు నిల నమృతాన్నసత్రంబు
నంబలిసత్రంబు నాతురులకు
ఆచార్యులిండ్ల రామానుజసత్రంబు
నూనెసత్రము శిరస్స్నానమునకు



బాలకులకును నేర్పడఁ బాలసత్రము
కామసత్రము విటగ్రామణులకు
జలకమాడుట కింట జలసృష్టి సత్రంబు
తాంబూలసత్రంబు ధన్యులకును

గీ॥ కట్టడలుచేసె వినుకొండ పట్టణమున
సర్వకాలము సత్కారపూర్వకముగ
మంత్రిరాయనభాస్కరామాత్యుఁ బోల
గలరె దాతలు మూఁడులోకములయందు?[1] 496

మఱియు .-

సీ॥ బట్టు దీవించుచు బాసికంబును జూప
వెలయఁ బెండిలిచేసి వేడ్కఁ బంపెఁ
జొప్పకట్టలమీఁద సోలియుండఁగఁ జూచి
పట్టెమంచము పాన్పు బట్టుకిచ్చె
వలెత్రాడుఁ జూపినఁ జెలఁగి యెద్దు నొసంగెఁ
బలుపుఁ జూచినఁ బాడిపశువునిచ్చెఁ
గళ్లెంబుఁజూపిన ఘనత గుఱ్ఱమునిచ్చె
జుట్టఁ జూపిన దాసిసుదతినిచ్చె

గీ॥ స్నానమాడంగఁ గడియంబు జారఁ గడమ
కడియమును వేయ శాంభవి కరముచూపె
వెలయరాయల కుంగ్రమ్మువేసిచూపె
సరసహృదయుండు వినుకొండశాసనుండు
భవ్యభరతుండు రాయనభాస్కరుండు. 497

1. ఈ పద్యమునే (ఎత్తుగీత) పాఠాంతరములతో రామలింగయ భాస్కరునిదిగా చా.ర. పేర్కొన్నది. సం॥

సీ॥ నిత్యసత్యత్యాగనీతిలో శిబిఁజెప్పి
నినుఁ జెప్పి మఱియును నిన్నుఁ జెప్పి
బహుపరాక్రమమునఁ బరశురామునిఁ జెప్పి
నినుఁజెప్పి మఱియును నిన్నుఁ జెప్పిఁ
రఘుకులోత్తముఁడైన రామచంద్రునిఁ జెప్పి
నినుఁ జెప్పి మఱియును నిన్నుఁ జెప్పి
సుకుమారతను సరి సురరాజసుతుఁ జెప్పి
నినుఁ జెప్పి మఱియును నిన్నుఁ జెప్పి

గీ॥ చెప్పఁ దగుఁగాక యితరులఁ జెప్పఁదగునె ?
కలియుగంబున నీవంటిఘనుఁడు కలఁడె ?
అమితగుణసాంద్ర ! మానినీకుముదచంద్ర !
భాగ్యదేవేంద్ర ! రాయనిభాస్కరేంద్ర ! 498

ఉ॥ సన్నుతలీలఁ బాండవులసంతతిఁ గర్ణుఁడు దాత గాక వా
రన్నలు దమ్ములందు నొక రైన వదాన్యులు గారు, కీర్తిసం
పన్నునిరాయనప్రభుని భాస్కరుసంతతి నెంచి చూడ వా
రన్నలు దమ్ము లింటఁ గలయందఱు దాతలు భూతలమ్మునన్. 499

సీ॥ ఏవేళఁ జూచిన నిందిరానంద మై
యందమై చెలఁగు నీమందిరంబు
ఏపాళఁ జూచిన గోపాలసత్కథా
ళిందమై చెలఁగు నీ మందిరంబు
ఏ జాముఁ జూచిన నిష్టాన్నభోజనా
ళిందమై చెలఁగునీమందిరంబు
ఏ ప్రక్కఁ జూచిన సుప్రజానాయకా
ళిందమై చెలఁగు నీమందిరంబు



గీ॥ గాక తక్కినమంత్రివర్గముల యిండ్లు
మేక మెడచండ్లు గిజిగాండ్ల మెఱుగుగూండ్లు
పూవుఁబోఁడులు నిర్మించుబొమ్మరిండ్లు
భవ్యవిభవేంద్ర ! రాయనిభాస్కరేంద్ర ! 500

సీ॥ రంగత్కృపాదృష్టి గంగాభవానికి
మణికంకణంబు లేమంత్రి యొసఁగె
భిక్షార్థమీయఁగా నక్షయంబగునట్లు
మార్తాండుఁ డర్థ మేమంత్రి కొసఁగెఁ
దగ వేఁడినంతలో జగతి పై నర్థికి
మానంబుప్రాణ మేమంత్రి యొసఁగె
మీసంబు తాకట్టువేసి పదార్థంబు
మహిమచే నర్థి కేమంత్రి యొసఁగె

గీ॥ అతఁడు నందవరీకవరాన్వయుండు
దుర్ఘటుండు వసిష్ఠగోత్రోద్భవుండు
శత్రుమథనుండు వినుకొండశాసనుండు
భవ్యభరతుండు రాయనిభాస్కరుండు. 501

క॥ వసుధేశుఁ గొల్వరాదో
పసగలమణియంబు చేసి బ్రదుకఁగరాదో
రససిద్ధిఁబడయరాదో
రసికుఁడు కారాదు గాక రాయనబాచా ! 502

క॥ మీఁగాళ్ళబంటినీళ్ళకు
వీఁగుదు రమ్మక్క యనుచు వెరపున వనితల్
చాఁగి పయోధులు దాఁటెను
రాఁగై నీకీర్తికాంత రాయనిబాచా ! 503

సీ॥ ఉత్తుంగభుజసూనుదత్తనందాపురీ
పుణ్యాగ్రహారాంశ భోక్త యితఁడె
ఆజన్మ సంసిద్ధభూజన ప్రఖ్యాత
దానసింహాసనాధ్యాసి యితఁడె
కొండపల్లీ రాజ్యమండలాఖిల మహా
గణక సందోహాగ్రగణ్యుఁడితఁడె
వైకుంఠతీర్థనిర్వాణ సంయమికృపా
సంవర్ధితాఖిలైశ్వర్యుఁడితఁడె

గీ॥ కొండవీడుద్దగిరి పెనుగొండ గుత్తి
పానుగల్విజయనగర పట్టనముల
యర్థులకు నిచ్చు నితఁడె యిష్టార్థమనుచు
జగము రాయనభాస్కరుఁ బ్రెగడఁ బొగడు. 504

ఉ॥ రాజితకీర్తిశాలి యగు రాయనిభాస్కరు వేఁడఁబోవఁగా
నాజికి నిట్లనున్ బరుని యాలికినిట్లను నర్థికిట్లనున్
దేజము పెంపులేని యతిదీనుని హీనుని వేఁడఁబోవఁగా
నాజికి నిట్లనున్ బరునియాలికినిట్లను నర్థి కిట్లనున్. 505

శ్లో॥ కృతేయుగే బలిర్దాతా త్రేతాయాం రఘునందనః,
ద్వాపరే సూర్యపుత్రశ్చ కలౌ రాయనభాస్కరః. 506

ఆ.వె॥ పరఁగ రాయనికుల బాచని ధనమెల్ల
భటులపాలు, కవులపాలు, దలఁప
ధరను లోభివాని ధనము దాయాదుల
పాలు, జారకాంతపాలు, వేమ ! 507

ఈ పద్యమువలన, వేమనపద్యకర్తయగు వేమన రాయని భాస్కరుని కాలపువాఁడని తేలుచున్నది. (ఈ వేమన ) వేమాభిధానులగు నప్పటికొండవీటి



రెడ్డిరాజుల సంతతిలోనివాఁడెయై యుండును. ఈ యుదాహరింపబడు పద్య మాతనిరీతిఁ దెలుపును.

క॥ కాదనఁడెవ్వరినేనియు
వాదులకుంబోఁడు వెఱ్ఱివానికి వలెనే తా
భేదాభేదములెఱుఁగఁడు
వేదాంతరహస్య మెల్ల వేమన యెఱుఁగున్. 508

ఉ॥ సన్నుతలీలఁబాండవుల సంతతిఁ గర్ణుడు దాత గాక వా
రన్నలఁదమ్ములందు నొకరైన వదాన్యులు గారు, కీర్తిసం
పన్నుని రాయనిప్రభుని భాస్కరుసంతతి నెంచిచూడ వా
రన్నలు దమ్ము లింటఁగల యందఱు దాతలు భూతలంబునన్.
509

సీ॥ శ్రీగిరిప్రాగ్దిశ శ్రీలకావాలమై
విలసిల్లు విరిదండ విన్నకొండ,
విబుధాధిరాణ్మౌళివిశ్వంభరావ్రజ
విజయధాటికి జెండ విన్నకొండ,
వేదవేదాంతాదివిద్యావిచక్షణ
విద్వజ్జనులకండ విన్నకొండ,
రాయనిభాస్కర ప్రాంచత్ప్రధానుండు
విత్తములిడు కొండ విన్నకొండ,

గీ॥ కొండవీడాది పెనుగొండ గోలకొండ
కొండపలిసీమ మేలైన కొండవీడు
దుర్గముల కల్ల బలుదొడ్డ దొడ్డకొండ
భాస్కరునికొండఁ వినుకొండఁ బ్రబలుచుండ. 510

కు॥ ఏ కొండయు వినుకొండకు
రాఁగోరదు సాటి పోటి రానేరదుగా
చేకొని రాయనిభాస్కరు
దేకోన్నతవృద్ధి మీఱ నేలుట చేతన్. 511

కు॥ ఆ వినుకొండకు రెండవ
దేవేంద్రుఁడు భాస్కరుండు దీపించె, భళీ,
ఏవేళ నర్థికోటికిఁ
గావించుచుఁ గనకవృష్టి కడుఁ జోద్యముగన్. 512

సీ॥ దాతతో నర్థుల తారతమ్యముఁ దెల్పి
యిప్పింప నేర్చుఁ, దా నీయ నేర్చు,
నవరసాలంకార నవకవిత్వప్రౌఢిఁ
దెలియనేర్చును, మూడుఁ దెలుపనేర్చు,
భట్టుసంఘట్టఘరట్టవాగ్ఘట్టయై
చదువగా వినసేర్చుఁ, జదువనేర్చు,
మానుషాధిపులైన మానవాధీశుల
మెప్పింప నేర్చుఁ, దా మెచ్చనేర్చు,

గీ॥ దాత కవి భట్టు మంత్రియుఁ దానె యగుచు
మంతు కక్కెను ధారుణీ మండలమున
సరసహృదయుండు వినుకొండ శాసనుండు
భానుతేజుండు రాయని భాస్కరుండు. 513

సీ॥ క్షౌరకర్మముదీర్ప సరసులౌ నంబష్టు,
లభ్యంజనమొనర్ప నంటువాండ్ర,
వలువచలువసేయ వరుసతో మడివేళ్ళ,
గంధలేపమొనర్ప గట్టువాళ్ళ,



నమృతాన్నరుచులిడ నలస్వయంపాకుల,
నదన వీడెములీయ నడపకాండ్ర,
గాంక్షదీర్పఁగఁదమి గామసత్రస్త్రీల,
పరుస వ్యాధులుమాన్ప వైద్యవరుల,

గీ॥ గట్టడలుచేసె వినుకొండ పట్టణమున
దానసింహాసనాసీనుఁడైన ఘనుఁడు
మంత్రిభాస్కర భాస్కరామాత్యుఁ బోలఁ
గలరె దాతలు మూఁడులోకములయందు ? 514

సీ॥ గణితంబునందును, గావ్యంబునందును,
గాంభీర్యమందును, గరుణయందు,
సంగీతమందును, సాహిత్యమందును,
జతురంగమందును, శకునమందు,
భారతకథలందు, (భరతంబునందును)[1]
పరహితంబందు, షడ్భాషలందు,
ఆచారమందు, మహౌదార్యమందును,
జక్కందనమునందు, శాంతమందు,

గీ॥ స్వామిహితమందు, సత్కళాసరణియందు,
నేర్పు, నోర్పును, గూర్పును, నెగడవలయు
మంత్రి ననువాని కెల్ల, దుర్మంత్రహరణ!
భాస్కరేంద్రుని రాయని భాస్కరేంద్ర ! 515

సీ॥ చూచిన నీవంటి సుందరాకారుని
సొంపుగాఁ గన్నులఁ జూడవలయు,
నడిగిన నీవంటి యధికసంపన్ను ని
నరలేక యాచకుఁ డడుగవలయు!

1. భారతమందును – అని చా.ర.పాఠము. సం॥

నెన్నిన నీవంటి హితసుగుణాఢ్యుని
నెందటిలోనైన నెన్నవలయుఁ,
బొగడిన నీవంటి పుణ్యమూర్తిని రాజ
పుంగవ సభలలోఁ బొగడవలయు!

గీ॥ వన్నెమీఱఁగ నినువంటివానిఁ గన్న
తల్లిదండ్రులభాగ్య మెంతని నుతింతు !
నమితగుణసాంద్ర ! మానినీకుముదచంద్ర !
భాగ్యదేవేంద్ర ! రాయనిభాస్కరేంద్ర! 516

కం॥ రాయనిభాస్కరు నొకసతి
పాయక యెలమావినీడఁ బాడఁగఁ దమితో
నా యెలుఁగుసన్న సిగ్గునఁ
గోయిల తన చిగురుఁగొమ్మ గూడున్ బాసెన్. 517

కం॥ నియ్యోగిలేని చావడి
దయ్యాలకె యిరవుగాక దాతల కిరవా ?
యొయ్యొరి గుబ్బచంటికిఁ
బయ్యెదలేనట్టు, మంత్రిభాస్కరరాయా ! 518

కం॥ పగ గల్గి యర్థికీయని
మొగముండల కేల మొలిచె మూతిని మీసల్
తెగగొఱుగఁడాయె మంగలి
రగడొందఁగఁ గీర్తికాంత, రాయనిబాచా ![1] 519

1. పరిశోధన కనువు గొల్పు ననుదృష్టితో ద్వాత్రింశన్మంత్రుల విషయమై లభ్యములగు నధికపద్యముల మఱి కొన్నింటిని ప్రభాకరుల నోట్సు నుండియు, చా. రత్నాకరము నుండియు గ్రహించి వాని నిందు పొందుపరచితిమి. 510–519 పద్యములవి చా.ర. నుండి. గ్రహించినవి. – సం.)



చ॥ కరములు వేయునుం గలుగఁగా ఫలమేమిటొనర్చు భాస్కరుం
దరులను వేడుకొంచుఁ దిరుగాడును బంగరుకొండచుట్టు శ్రీ
కరుఁడగు భాస్కరేంద్రకులగణ్యుఁడు రాయనిభాస్కరన్నవే
కరములు యాచకాంబుజవికాసకరంబులు శ్రీకరంబులున్. 520

ఉ॥ ఆకులవ్రాలువ్రాయ సచివాగ్రణిబాచనకే ఘటిల్లుఁ బ
ల్గాకికుమంత్రినందనులు గంటముముట్టి లిఖించినట్టి వ్రా
లాకులు రాటపాకులు చెవాకులు బ్రాహ్మణవీథిలోని పు
ల్లాకులు లంజెలిండ్లపలుగాకులు గాక నిజాన కాకులే! 521

ఉ॥ వ్రాయుఁబసిండిగంటమున రాజహితైకరహస్య కార్యముల్
వ్రాయు ధనార్థికోటినిటలంబున శోభనభాగ్యసంపదల్
వ్రాయుఁ జకోరలోచనల వక్షువచన్నుల మన్మథాంకముల్
రాయనిమంత్రి భాస్కరుఁడు వ్రాసినవ్రాఁతలసంఖ్యముల్గదా ! 522

ఈపద్య మాభాస్కరునిర్యాణముఁ గూర్చి చెప్పఁబడినది.

చ॥ సహజకళంకమూర్తులు కుజాతులు గూఢతరోదయ ప్రభా
మహితులు గోత్రవిద్విషదమాత్యులు రాత్రిచరానుకూలధీ
సహితులు మందవర్తనులు సర్పసమానులు రాజసేవక
గ్రహములు కాననయ్యె నల రాయనిభాస్కరుఁడ స్తమించినన్. 523

## 2. భాస్కరసూతి కొండమంత్రి

శా॥ కాండావిర్భవభాండభూపరివృఢగ్రైవేయశైలేయసూ
కాండాటాధిపకేతుమాతులబలాకాశ స్రవంతీమరు
త్కాండాఖండలతుండిపాండురయశః కర్పూరపేటీభవ
త్కాండా! రాయనమంత్రి భాస్కరునికొండా ! దండనాథాగ్రణీ! 524

శా॥ రెండా నాల్కలు సాం(ప్రదాయికునకున్ లెక్కింపఁగా నొక్కటే
గండాగొండిశిఖండిబండనికి లెక్కల్లేని నాల్కల్గదా
చండారాతికులాటవీదహనతేజస్స్ఫురధాటీలస
త్కాండా ! రాయనమం(త్రి భాస్కరునికొండా ! దండనాథాగ్రణీ ! 525

క॥ పద్యముచెప్పిన సుకవికి
హృద్యముగా నియ్యనట్టి హీనాత్మునియా
పద్యము పామై కఱచును
బ్రద్యోతితకీర్తికాండ ! భాస్కరుకొండా ! 526

గీ॥ పడుచునిడినవానిఁ బద్యమిచ్చినవానిఁ
గడుపుకిడినవాని నడుపవలయు
నడుపలేనివాని నయవిదు లెంతురా
భువిని భాస్కరేంద్ర పుత్త్ర ! కొండ ! 527

## 3. రామలింగ భాస్కరుఁడు

రామలింగభాస్కరుఁడు చిఱుతనాఁడు విద్యాభ్యాసము చేయుచుండగా నొక భట్టువాఁడు–

క॥ రాయని భాస్కరుతోనే
పోయెసుమీ కీర్తికాంత–

అనెనట! తోడనే యాతఁడు తనకరముననున్న మణికంకణమును వానికొసంగి–**పోదె**–అనెనట! అచ్చట మఱియొకఁడు **మఱేది**– అనెనట! అంతట నాభట్టుకవి పూరించెను.

ఆయన మనుమఁడు చతురో
పాయుండగు రామలింగ భాస్కరుఁజేరెన్. 528



సీ॥ ఏ మం(త్రిసత్కీర్తి హిమ సేతుపర్యంత
మవనిమండలము ముత్యాలశాల
ఏ మం(త్రి మొగసాల యే(పొద్దు చూచిన
సంగీతసాహిత్యసరసగోష్ఠి
ఏ మం(త్రియిలవేలుపిందురేఖామౌళి
చౌడేశ్వరీమహాశంభుశక్తి
ఏ మం(త్రిసౌందర్యమిందీవరాక్షుల
వాలారుఁజూపుల వలపుముద్దు

గీ॥ అతఁడు హరిదాసవంశాబ్ధి కబ్ధిభవుఁడు
అర్థిదారి(ద్ర్యగాఢతమోర్కుఁడతఁడు
దానధర్మ పరోపకారానుకూలి
భాస్కరుని రామలింగన్న భాస్కరుండు. 529

సీ॥ నీ దేవదేవుండు నిజభక్తరక్షాప
రాయణుండాదినారాయణుండు
నీ తాత జగదేకదాత రాయనమం(త్రి
భాస్కరాన్వయుఁడైన భాస్కరుండు
నీ తం(డ్రి వితరణఖ్యాతినిఁగలియుగ
కర్ణుండు రామలింగ (ప్రధాని
నీ తల్లి పతిహితనీతి నరుంధతీ
దేవితోఁ(బతివచ్చు తిరుమలాంబ

గీ॥ తనర వెలసితివత్యంత వినయవిభవ
గురుతరైశ్వర్య మహనీయ గుణగణాఢ్య !

భవ్యభరతుండ! వినుకొండ పాలకుండ!
భాస్కరుని రామలింగయ్య భాస్కరుండ ![1] 530

సీ॥ కడఁగిమేఘుండేక కాలంబుననె కాని
కొమరప్ప నేవేళఁ గురియఁగలఁడె
కల్పభూరుహమొక్క కాలంబుననెకాని
గరిమనేవేళలఁ గాయఁగలదె
కమలారి తానొక్కకాలంబుననెకాని
యేవేళ నమృతంబు నీయగలఁడె
కామధేనువు నేకకాలంబుననెకాని
పెంపొంద నేవేళఁ బిదుకఁబడునె

గీ॥ పలుచనైపోక యాకులపాటులేక
వట్టిపోవక చిల్లరవంకలేక
యనుదినంబర్థుల కొసంగె దౌర భువిని
ఘనసుగుణసాంద్ర! రామలింగయ్యచంద్ర! 531

## 4. గోపరాజు రామప్రధానుఁడు[2]

శ్లో॥ శ్రీమాన్ గణపతి ర్భూపో గజపత్యన్వ యోద్భవః,
అస్మిన్ భూమండలే తస్య బహవ స్సంతి మంత్రిణః 532

గోపరాజాన్వయోఽ మాత్యో రామాఖ్యో గణకాగ్రణీః,
గణకానాం హితార్థాయ సద్యశ స్థాపనాయచ. 533

1. ఇది చా.ర.లో 'సరస హృదయుండ! వినుకొండ శాసనుండ! భవ్యభర తుండ! రాయని భాస్కరుండ!' అని రాయని భాస్కరుని పేర నున్నది. – సం॥.
2. చా.ర.లో గోపయరామయ గోపరాజు రామప్రధాని భిన్నులుగా పేర్కొనబడినారు. సం॥



తిష్ఠత శ్శశిమార్తాండౌ యావత్తావ...
గోత్రశాస్త్రాంబరేందూనాం సంఖ్యాబ్దే శాలివాహనే.[1] 534

రక్తాక్ష్యబ్దే భాద్రదర్శే అర్కగ్రహణకాలికే,
తేన రాజ్ఞా గ్రహీ ద్దానం కృష్ణవేణ్ణాతటే తథా. 535

ధర్మ మేతత్కలౌ యేన చాక్షిప్తంచ దురాత్మ నా,
షష్టివర్ష సహస్రాణి జాయతేఖరయోనిషు. 536

ప్రాచీనలేఖనములందీశ్లోకములగపడుచున్నవి. శా. 1067 మున గజపత్యన్వయుఁడగు గణపతి కలఁడో యని విచారింపవలసియున్నది. లేక పై శ్లోకములందు గణపత్యన్వయోద్భవః' అని యగునో! ఈ రామప్రధానుఁడు కమసాలులపరమయియుందు కరణికవృత్తులను నియోగిబ్రాహ్మణుల కిప్పించెనట! గృష్ణవేణ్ణానదీతీరమున భూదానప్రతిగ్రహమొనర్చి సజాతీయుల భరించెనట ! దానికి వైదికులెవరో యాక్షేపింపఁగా నియోగులెవరో బదులు చెప్పిన పద్యములు.

### ఆక్షేపము

చ॥ అవగతశబ్దశాస్త్రచయులైన మహాత్ములు పండితోత్తముల్
భువనతలంబునం దధికపూజ్యులు వారలటుండఁ గూటికై
నవనవకల్పనావిధిచణత్వము తోఁప నబద్ధమాడు నీ
కవులిల దానపాత్రులయి గౌరవమందుట చూవె చిత్రముల్ ! 538

1. రామప్రధాని కాలము, శా.శ. 1067 అని సూచించు నీ క్రింది పద్యము చా.ర. నందు గుర్తింపబడినది – సం॥

క ॥ ధర గోపరాజు రామయ
కరణీకము లుద్ధరించుకాలము తలఁపన్
గిరి ఋతు గగన శశాంకులు
కర మొప్పెడు శకమునాఁటి కాలంబయ్యెన్. 537

## సమాధానము

ఉ॥ వ్రాయుట చిత్రమా వికృతవైదికమా నిజదారరక్షణో
పాయముకై నియోగి యిలcబార్థివసేవ యొనర్చినంతనే
పాయునె వంశశీలములు పాయక యెప్పుడు చిత్రగుప్తులున్
వ్రాయరె యెల్లలోకములవారలుc జేసినపుణ్యపాపముల్. 539

ఉ॥ మానఘనుండు బ్రహ్మకులమండనమూర్తి పరోపకారి దు
ర్దాన దురన్నముల్ గొనcడు, తప్పcడు స్వామిహితోపకారముల్
దీనులc బ్రోచు బాంధవవిధేయుcడు డస్సియు వేcడబోడు తా
నూనినవేడ్కతోడుత నియోగికి నిచ్చినదాన మల్పమే ? 540

చ॥ కవి కమలాసనుcడు త్రిజగత్పతి యైనపినాకపాణియుం
గవియె తలంపcగాcగవులుకారె పరాశరబాదరాయణుల్
కవికృతపుస్తకగ్రహణగర్వితు లల్పులె పూజ లందcగా
గవులట దానపాత్రు లcట ! కారcట! యిట్టివిపో విచిత్రముల్.[1] 541

## ఆతనిప్రశస్తి

సీ॥ తనకీర్తి యాచంద్రతారార్కముగ మంత్రి
కులులకుcగరణికముల నొసంగె

1. ఈ సందర్భమందలివే మరి మూడు పద్యము లివి చా.ర.నందు గుర్తింపcబడినవి. – సం॥

చ ॥ గురుకులవాసఖేదమునకుం గడు డస్సి, యపారశాస్త్రసా
గరముల నీcదియున్ వలcతిగాc డలరింపcగc బండితుండు తాన్,
వరకవు లుద్యదిందుకరవారసమాగమపుల్లహల్లకో
త్కరవిగళన్మరందపదకాండముచే నలరించుచాడ్పునన్. 542

తక్కినవి తరువాత పుటలో



నతిథిసంతర్పణ మనుదినంబు నొనర్చి
ఖ్యాతిగా హరిహరప్రీతిc జేసె
వర్ణాశ్రమాచారనిర్ణయంబుల నెల్ల
వేదోక్తరీతిగా వెలయcజేసె
ఘనవిప్రవందిమాగధకవీంద్రుల నెల్ల
నగ్రహారము లిచ్చి యాదరించె

గీ॥ నతcడు శ్రీగోపరాజాన్వయాబ్ధిచంద్రుc
డనcగ విలసిల్లెcదనసాటిఘనులు పొగడ
మంత్రిదేవేంద్రుc డనcగ స్వతంత్ర లీల
మంత్రికులహేళి రామయామాత్యమౌళి. 543

సీ॥ వీcడెపో ! దుష్టారి వీరమంత్రికఠోర
భూధరంబులకు దంభోళిధార
వీcడెపో కవిరాజగాఢదారిద్ర్యాంధ
కారంబు లcడగించు కమలహితుcడు

గీ ॥ ఎంచి యెంచి చూడ నింపయి తోcచు నీ
మూcడులోకములను ముగ్ధలైన
మించుబోండ్లచూపు లించురసంబులు
చతురులైన కవుల సరసమతులు. 544

చ ॥ పలుమరు శాస్త్రముల్ చదివి పండితుcడై యజురాణి సత్ఫపా
ఫలమును గాంచి తా రసము బాగుగcజెప్ప వలంతియైన వాc
డిల గవి, లాతివాcడు కపియే యని చెప్పcగ నొప్పు, జాయ నాc
గులజయ జాయగాని, పెఱకోమలి మాయయ కాక జాయయే ?545

వీఁడెపో బహునీతివిద్యానిరూఢిచే
సురగురుఁ గెల్చినశుభకరుండు
వీడెపో చతురబ్ధివేష్టితావనిఁ గల్గు
బహుమంత్రికులసార్వభౌమమూర్తి

గీ॥ ఈతఁడే సర్వదేవతాప్రీతికరుఁడు
ఈతఁడే గోపరాట్కులశీతభానుఁ
డని కవీంద్రులు పొగడంగ నతిశయిల్లె
మంత్రిజంభారి రామయామాత్యశౌరి.[1] 546

1. మీది పద్యమీక్రిందివిధముగా పాఠభేదముతో చా.ర.నందు గోపయ రామయ రచనగా గుర్తింపఁబడి యున్నది.

ఇతఁడు ప్రథమశాఖా బ్రాహ్మణుఁడు. ఇంటిపేరు హనుమకొండవారు. ఇతఁడు (ఏ రాజుకడనో) మంత్రియై యుండి మంచికీర్తి గడించినవాఁడనియు, దాతయనియు ఈ క్రింది పద్యము తెలుపుచున్నది.

సీ ॥ వీఁడెగా శఠమంత్రి వీరధైర్యకఠోర
భూధరంబునకు దంభోళిధార,
వీఁడెగా సౌందర్యవిభ్రమాదభ్రవ
ర్యాచకఘనయక్షరాజసుతుఁడు
వీఁడెగా కవిరాజవికటదారిద్ర్యాంధ
కారభారస్ఫుటకమలహితుఁడు
వీఁడెగా చతురబ్ధివేష్టితోర్వీచక్ర
యాచకావళికిఁ గర్ణాంశదాత.

గీ ॥ మంత్రిమార్తాండదుర్మంత్రమదవిరోధి.
అఘవిదూరుండు, హనుమకొండాన్వయుండు,
గణకనిర్వాహు డగ్రశాఖాప్రభుండు.
రమ్యగుణపాళి గోపయరాయమౌళి. 547



## 5. కరణము మల్లన్న[1]

క॥ గంటము ఖడ్గముతోడుత
నంటినఁ బగ దీర్పవలయు నవసర మైనన్
గంటము శంఠముకొఱకా
కంటకరిపుహృదయ భల్ల ! కరణముమల్లా. 548

క॥ వంచింపఁ జనదుమంత్రికి
వంచించినఁగీర్తి గలదె వసుమతిలోనన్
బెంచవిసిన ఖం గనునా
కంచవిసిన నసును గాక కరణముమల్లా ! 549

క॥ కరణము గ్రామాభరణము
కరణము తమవంకవారి కాభరణంబౌ
కరణము నృపునుపకరణము
కరణము కులవార్ధిచంద్ర కరణముమల్లా !! 550

## 6. బండారు కేతమంత్రి

ఉ॥ ఆలములోన నోడమికి, నన్యవధూటులదిక్కు వోమికిన్
మేలము కైన బొంకమికి, మెచ్చినచో వృథ గామికిన్ మహీ
పాలనకీర్తిలోలుఁ డగుబండరుకేతననీతిసాటికిన్
నాలుక నడ్డుపట్టెద మనంబున రాముని నిల్పి వేడుకన్, 551

1. ఈతఁడు రామగిరి దుర్గమున నొక గడిమన్నెకోట కధికారియైన సాళువ చెంచుభూపాలుని మంత్రియని చా.ర. నందు గుర్తింపఁబడియ్యుది. ఈతని ఆస్థానకవి ఏనుగుధాటి సుబ్బరాజు రచించిన పద్యము లివియని యందు గలదు. – సం॥

## 7. సీదయయాచమంత్రి

ఉ॥ మీఁద వెలుంగు పూర్ణశశిమేనికళంకముకప్పుఁ గ్రిందటన్
రోదుఁచునున్న శేషఫణరోచులకప్పు సుధాపయోధిలో
నీఁదెదుకృష్ణుకప్పుఁబరమేశ్వరుకంఠముకప్పుఁ గప్పి మా
సీదయయాచకీర్తి విలసిల్లెను దిక్కులఁ బిక్కటిల్లుచున్.[1] 552

## 8. నాదెండ్ల అయ్యలయ్య

## 9. సిద్ధయ తిక్కన

ఈ తిక్కన రణనిహతుఁడయినపిదప వేములవాడ భీమకవి యాతని యింటికేఁగి యాతని భార్యను 'దీర్ఘసుమంగళీభవ' యని యాశీర్వదించెనఁట ! ఆమెభర్తృవియోగవార్త తెలిసి శోకింపఁగా నాతఁడు–

క॥ గుణముల నిధాన మగుమన
రణతిక్కన తాఁగళేబరంబును శిరమున్
గణఁకమెయిఁగలయ బ్రదుకును
బ్రణుతాఖిల వైరిమకుట భాసితపదుఁడై. 553

అని పద్యము చెప్పి రణతిక్కన నుజ్జీవింపఁజేసెనఁట ! ఇది కట్టుకత. రణతిక్కనను గూర్చి చెప్పఁబడిన పద్యమిదియొకటి–

ఉ॥ ఏమితపంబు చేసి పరమేశ్వరు నేమిటఁబూజచేసిరో
రాముని తల్లియుం బరశురాముని తల్లియు భీము తల్లియున్

1. ఈ పద్యము మొగతాటి రామభద్రకవి కృతముగ సేదమ యాచమంత్రి పేర చా.ర.నందు కలదు. – సం॥



గాముని కన్నతల్లియును గంజదళాక్షుననుంగుఁదల్లియున్
శ్రీమహిత ప్రతాపుఁడగు సిద్ధన తిక్కన కన్నతల్లియున్[1] 554

## 10. కోటసింగరాజు

ఈతఁడు విద్యానగరప్రభువును శ్రీకృష్ణదేవరాయల తండ్రియు నగువీర నరసింహరాయల కాలమున నున్నవాఁడు. రాజశేఖరచరిత్రమును రచియించిన మల్లయకవితండ్రి మాదయ మైరావణచరిత్రమున వెంజెర్లగోపమంత్రి తన్నిట్లు ప్రశంసించినట్లు చెప్పుకొన్నాఁడు.

సీ॥ మెప్పించినాఁడవు మెఱవడిఁగర్ణాట
నరనాయకుని వీరనారసింహు
ధట్టించినాఁడవు తస్కరకవిరాజిఁ
గోటసింగయ మంత్రి కొల్వులోన
కాంచినాఁడవు కనత్కాంచనాభరణంబు
లేపార నందాపురీశుచేత
అందినాఁడవు నుత్తమాశ్వద్వయంబును
గిమిడిభూమండలరమణుచేత

గీ॥ నతిమతిస్ఫూర్తిఁగ్రోడించినాఁడవఖిల
కావ్యలక్షణలక్ష్యసాగరము నెఱయ
నిన్నుఁ బేర్వేర వర్ణింపనింక నేల
ప్రోడవన్నింట సర్వయమాదసుకవి ! 555

### కోటసింగరాజు నిరతాన్నదాత

సీ॥ పాయసాన్న ప్రౌఢిపరిపాకమే చాలు
పిండివంటలరుచుల్ మెండు మేలు

1. చూ.మఱియు నిందే.పుట. 18 – సం॥

ఆజ్యప్రవాహంబు రాజ్యమేనని చెప్పఁ
బల్చనిపెసరొల్పుఁబప్పుతెప్ప
మెత్తనైస్వచ్ఛమై మెదవెదురాజాన్న
మెన్నఁ గైకొంటి యోయన్న ! నిన్న
బహువిధశాక ప్రపంచంబు తుదిముట్ట
నూరుఁగాయల రుచులొరవులుట్ట

గీ॥ అనుచునీపంక్తి భుజియింతు రనుదినంబు
భూసురశ్రేష్ఠు లెలమి నుప్పొంగి పొంగి
మహితచారిత్ర కొండయామాత్యపుత్ర !
కుటిలదుర్మంత్రిమదభంగ ! కోటసింగ ! 556

సీ॥ రావూరుపురి ఢిల్లి రాజ్యంబులందుండి
సింధుబర్బరమధ్యసీమనుండి
పాంచాలమాళవపాండ్యభూములనుండి
కటకకల్యాచలగయలనుండి
ఘోట్టాణటెంకణఝూర్జరోర్వులనుండి
మళయాళ కేరళ మహులనుండి
భోజకర్ణాటకాంభోజభూములనుండి
సాల్వాంధ్ర ముఖ్యదేశములనుండి

గీ॥ చాలనేతెంచు సద్విజసంఘములకు
నన్నదానంబు గావించుచున్న దొరవు
భవ్యచారిత్ర ! కొండయప్రభుసుపుత్ర !
కుటిలదుర్మంత్రిమదభంగ ! కోటసింగ ! 557

క॥ నరజన్మంబునఁ బుట్టినఁ
గరణీకమె యుత్తమంబు కరణంబై నన్



పురుషార్థపరుఁడు గావలె
శిరసెత్తిన ఫలము కోటసింగనవర్యా ! 558

చ॥ గడుసరి లోభియర్థ మదికన్నపుదొంగలబందిపోటుకున్
బుడమిని వారకాంతలకు భూపతికిం జనుఁ గోటసింగ ! నీ
పడసినయర్థ మార్తులకు బాంధవకోటికి యాచకాళికిన్
గుడికిని సత్త్రశాలకును గూపతటాకవనప్రతిష్ఠకున్. 559

గీ॥ కోటసింగరాజు మాటవాసియె కాని
గంగమాంబవలన ఘనత కెక్కె
గంగమాంబ జగతి గయ్యాళియైనను
సింగరా జిఁకేమి సేయఁగలఁడు. 560

ఉ॥ భానుజుఁ డర్థముం గుముద బాంధవుఁ డాయమృతంబు మేఘుఁడున్
దానజలంబు నన్న మది ధర్మజుఁడున్ గలవేళ నిత్తురౌ
వానిని వానివాని మఱి వానినిఁ జెప్పకు కోట సింగఁడే
మానక కాంచనామృత సమాన జలాన్నము లిచ్చు నెప్పుడున్. 561

## 11. నిట్టల హరిహరప్ప

క॥ నిజమా రాజ్యసుఖంబులు
నిజమా తరుణీవిలాసనిరుపమలీలల్
నిజమా సంపచ్చయములు
నిజమా యీజీవనంబు నిట్టల హరియా ! 562

క॥ ధీరోదారగుణంబులు
కారణజన్మునకు వేఱె కఱపఁగవలెనా
ధారుణిలోఁ డెంకాయకు
నీరెవ్వరు పోసిరయ్య నిట్టలహరియా ! 563

కు॥ నిట్టలహరియుండయి యిలఁ
బుట్టెను సురధేనుకల్పభూరుహములు దా
మట్టులు గాకుండినచో
నెట్టుల నిడు నర్థికోటి కీప్సితఫలముల్, 564

కు॥ దాతలదాతవు గదరా
భూతలమున నెట్టిసుకృతముం జేసిరొకో
ఖ్యాతిగలనిన్నుఁ గనుటకు
నీ తలిదండ్రులు గడంగి నిట్టలహరియా ! 565

## 12. కొట్టరువు - ఎల్లమంత్రి

ఉ॥ వీనులు సంతసిల్లు నిను విన్నఁ గనుంగవనిండువారు, నీ
మానితమూర్తిఁ గన్న, నిను మంత్రిశిఖామణి వన్న నాలుకం
దేనియ లొల్కు, నీవొసఁగు దివ్యవిభూషణచందనాదులన్
మేనును నాసికేంద్రియము మెచ్చుర కొట్టరువెల్లధీనిధీ ! 566

## 13. గుండమంత్రి

కు॥ నెట్టన గజపతిదేవుని
పట్టణమునఁ గల్గువీరభటసామంతుల్
చుట్టములు దాతలే బళి !
గట్టిగ గుండన్న కరుణగల్గినకతనన్. 567

## 14. సింగనమంత్రి మాచఁడు

సీ॥ విక్రమార్కునిఁబోలు వీరుండు గల్గిన
భట్టివంటి యుపాయపరుఁడు గలఁడు,
రామచంద్రునిఁబోలు రారాజు గల్గినఁ
బవనతనయువంటి బంటు గలఁడు



భోజభూపతిఁబోలు భూనాథుఁ డుండిన
కాళిదాసునివంటి కవియుఁ గలఁడు,
తన నందసుతుఁబోలు తండ్రియుఁ గలిగిన
కుసుమాయుధునివంటి కొడుకు గలఁడు,

గీ॥ ఎట్టివారికిఁ దగినట్టు లట్టివారు
పుట్టడముతోడనే భువిఁ బుట్టుచుండ్రు
బళిర ! సుకుమార ! లక్కమాంబాకుమార !
మానితకులీన! సింగయమంత్రిమాచ ! 568

సీ॥ కులమును రూపును గుణమును గల్గిన
యింతి నిల్లాలుగా నేలవలయు
వీర్యంబు హితమును వెరవును గల్గిన
పురుషుని బంటుగాఁ బ్రోవవలయు
స్త్రీ పెంపు వాటింప నోపక కలిమిమై
నిలయేలురాజును గొలువవలయు
అఖిలంబు నెఱిఁగి దయాళుఁడై పెంపొందు
మూర్తి సద్గురుఁ డంచుమ్రొక్కవలయు

గీ॥ కాన, నిన్ని గుణంబులు గల్గెనేని
ఆలియెడ బంటునందు భూపాలువలన
గురునిపట్టున సౌఖ్యంబు గూడుటరుదె
మనుజమందార ! సింగనమంత్రిమాచ ! 569

సీ॥ న్యాయంబుదప్పని నరపతి నరపతి
నరపతిపాలించునాడు నాడు
నా డెఱింగినదొరపోఁడిమి పోఁడిమి
పోఁడిమి సొబగైన బుధులు బుధులు

బుధులు సంభావించుపురుషుండు పురుషుండు
పురుషోత్తమునిమీఁదిబుద్ధి బుద్ధి
బుద్ధిమంతున కైన పుణ్యంబు పుణ్యంబు
పుణ్యలక్షణయైన పొలఁతి పొలఁతి

గీ॥ పొలఁతి యట్టిద కలవానికలిమి కలిమి
కలిమి చలమని తెలిసిన తెలివి తెలివి
భానునిభతేజ! లక్కమాంబాతనూజ !
మనుజమందార ! సింగనమంత్రిమాచ ! 570

సీ॥ అర్థులయెడలఁ బ్రత్యర్థులయెడలను
వెఱ పెఱుంగనివాఁడె వీరవరుఁడు
సతులసన్నిధి మహీపతులసన్నిధియందుఁ
దత్తఱింపనివాఁడె ధైర్యపరుఁడు
ధన మగ్గలంబైనఁజన వగ్గలంబైన
గర్వ మెర్గనివాఁడె కార్యపరుఁడు
శివుమీఁదనైన గేశవుమీఁద నైనను
దలఁపు నిల్పినవాఁడె తత్త్వఘనుఁడు

గీ॥ కాన, నిట్టివివేకంబు గలిగి మెలఁగు
పురుషు లిహపర సౌఖ్యముల్ పొందువారు
భానునిభతేజ ! లక్కమాంబాతనూజ !
మనుజమందార ! సింగనమంత్రిమాచ ! 571

సి॥ ఈలోకపుసుఖంబు నాలోకపుసుఖంబు
సతిచేత సుతుచేతఁ జాలఁ బడసి
మేనిరోగంబును లోనిరోగంబును
వెజ్జుచే వేల్పుచే నుజ్జగించి



సురతర్పణంబు భూసురతర్పణంబును
భక్తిచే శక్తిచేఁబరఁగఁజేసి
అతిసుకృతంబును నభిమతార్థంబును
నీతిధైర్యంబుల నెఱయఁజేసి

గీ॥ తొల్లిచన్న మహాత్ములత్రోవ దెలిసి
తప్పకుండ మెలఁగువారు తత్త్వఘనులు
భానునిభతేజ ! లక్కమాంబాతనూజ !
మనుజమందార ! సింగనమంత్రిమాచ ! 572

సీ॥ తల్లిదండ్రులఁ బ్రోచుతనయుండు తనయుండు
తగురాజుచేపడ్డధరణి ధరణి
అభిమానవతి యైన యంగన యంగన
యక్కఱకొదవిన యర్థ మర్థ
మొరుకాంతఁ గోరనిపురుషుండు పురుషుండు
వేఁడనియాతనివిద్య విద్య
సంగరాంగణమునఁ జచ్చుట చచ్చు టు
పవసించి సల్పెడువ్రతము వ్రతము

గీ॥ ఎదురుతన్నెఱిఁగినయట్టి యెఱుక యెఱుక
ప్రజలు మెచ్చఁగఁ జెప్పెడిపాటి పాటి
పగయె లేకుండ బ్రదికినబ్రదుకు బ్రదుకు
మనుజమందార! సింగనమంత్రిమాచ ! 573

సీ॥ ఎరువుశృంగారంబు నరవుసంభోగంబుఁ
జేయుటయెల్లను సిగ్గుగాదె
విప్పనిపువ్వును నొప్పనికాంతను
ననుభవించుట యెల్ల నధమవృత్తి

తన్నెఱుంగక యున్న మన్నింపులేకున్నఁ
గాఁపురం బుండుట కష్టతరము
తరమెఱుంగనిరాజు వరమీనిదైవంబుఁ
గొల్చుటయెల్లను గూళతనము

గీ॥ గాన నెప్పుడుఁ జతురుఁడై ఘనత మెఱసి
ప్రజలు మెచ్చంగ సుఖలీల బ్రదుకవలదె
భానునిభతేజ ! లక్కమాంబాతనూజ !
మనుజమందార ! సింగనమంత్రిమాచ ! 574

సీ॥ ఉద్యోగహీనుఁడై యుండెడుమనుజునిఁ
బ్రోవంగఁజాలఁడేదేవుఁడైన
ధరఁగృతఘ్నుండైన నరునివర్తన చూచి
క్రక్కదే పుచ్చినకుక్క యైన
అత్యంతధనలోభి యగువాని యెదరోసి
నవసి వర్తిలవె ప్రాణంబు లైన
అఖిలజగద్రోహి యగువాని కలుగరే
కృప చాలఁ గల్గినతపసులైన

గీ॥ గాన నుద్యోగియై కృతఘ్నతకుఁబాసి
వెలయ లోభంబు విడిచి జీవులకు నెగ్గు
సేయకుండెడువాఁడు విశిష్టుఁ డంద్రు
మనుజమందార ! సింగనమంత్రిమాచ ! 575

సీ॥ సంపద్ఘనుని జేయఁజనదు కృతఘ్నుని
సైన్యాధిపతిఁ జేయఁజనదు భీతు
కపటాత్ము నాత్మీయుఁగాఁ జేయ వలవదు
సన్మంత్ర మెఱిఁగింపఁజనదు సభల



కార్యంబు లూహింపఁగాదవివేకితోఁ
గాదు వంచకుఁగార్యకర్తఁ జేయ
పాపాత్ముఁ బరమిత్రు భక్తివిహీనుని
వలవదు పరిచరవర్తిఁ జేయ

గీ॥ అనృతభాషణుచేత దుర్వ్యసనిచేత
లోలమతిచేత నత్యంతలోభిచేత
వినినకార్యంబు వలవదు విశ్వసింప
మనుజమందార ! సింగనమంత్రిమాచ ! 576

సీ॥ కులమున నధికుఁడై గుణవంతుఁ డయ్యెనా
యాకారహీనుఁడై యలరుచుండు!
నాకారలక్షణం బంతయుఁ గల్గెనా!
యోగ్యత లన్నియుఁ నొప్పకుండు!
యోగ్యత లన్నియు నొప్పుచు నుండెనా!
గర్వాంధకారంబు గప్పి యుండు !
గర్వాంధకారంబు గప్పక యుండెనా
యనుకూలవతి లేక యవయుచుండు!

గీ॥ కొమ్మగలిగిన సంతతికొఱకు వగచు
పుత్త్రసంతతి మొదలుగాఁ బొందె నిన్ను
భానునిభతేజ ! లక్కమాంబాతనూజ !
మనుజమందార ! సింగనమంత్రిమాచ ! 577

## 15. సాహిణి మారన[1]

ముప్పదియిద్దరు మంత్రుల సీసమాలిక యాసాహిణిమారుని నియోగిని జేసినది. ఈతఁడు బ్రాహ్మణుఁడుగాఁ దోఁపఁడు.

1. సాహిణిమారన గూర్చిన మరియొక పద్యము ఇందే పుట 24లో చూడనగును. –సం॥

కII అప్పు లిడునతఁడు ఘనుఁడా
అప్పు డొసఁగి మరలఁ గాంచునాతఁడు రాజా
చెప్పఁగవలె సాహిణమా
రప్పను దానమున ఘనుఁడు రాజు నటంచున్. 578

కII మాటాడరాదు సభలన్
మాటాడినఁదప్పరాదు మగసింగముకున్
మాటే మానము గాదా
సాటువగలవారికెల్ల సాహిణిమారా ! 579

కII ఇంతులమనముల నరిసా
మంతులమనములను బుద్ధిమంతులమదిలోఁ
జింతింపనిబ్రదు కేమిటి
సంతతసత్కీర్తిహార ! సాహిణిమారా ! 580

శ్లోII అజాగళస్థస్తన ముష్ట్రపృష్ఠం
నాసాంతరే కేశ మథాండయుగ్మమ్.
వృథా సృజం త్సాహిణిమారభూపం
పూజాం నలేభే భువి పద్మయోనిః. 581

## 16. మామిడి సింగన

## 17. కొరవి అన్న మంత్రి

కII హరి సిరిని వలచుఁ,సిరియును
నరుదుగ హరి వలచు, గొరవియన్నయ యెపుడున్
వరకీర్తిసతిని వలచును,
వరుసను సత్కీర్తి యతని వలచును సతమున్.[1] 582

1. ఈ పద్యము చా.ర. నుండి గ్రహింపఁబడినది – సంII



## 18. పెమ్మయ సింగరాజు

“పెమ్మయసింగధీమణీ యను మకుటముతో నొక శతకమే రచింపఁబడె నేమో ! ప్రయోగ రత్నాకరమున “జక్కన చెప్పిన పెమ్మయధీమణి శతకము” అని యుదాహరింపఁబడెను. కాన నీసింగరాజు, ప్రౌఢదేవరాయల నాఁటివాఁడగును, కొన్ని పద్యములు–

చII మిరియములు లేని కూరయు, మెచ్చు నెఱుంగనివారియీవియున్
గరగరగాని భోజనము, కన్నుల పండువుగాని రూపమున్,
మురిపములేని యౌవనము, మోహములేనిలతాంగికూటమున్,
సరసుల కింపుగావు, సుగుణాకర ! పెమ్మయసింగధీమణి ! 538

పోర్చుకీసువారు (బుడతకీచులు) మనదేశమునకు రాక పూర్వ మిక్కడ మిర్యపుఁగాయలు లేవు. కారమునకు మిరియములే యుపయోగించెడివారు. ఆ దేశము నుండి పోర్చుకీసువారే తొలుత వీనిని మనదేశమునకుఁ దెచ్చిరి. కావుననే నేఁటికిని గొందఱు వైదిక కృత్యములందుఁగారమునకుఁ మిర్యములనే యుపయోగింతురు. మిరియములకు బదులుగా నేర్పడినవిగాక వీనిని మనవారు మిర్యపుఁగాయ లనిరి.

ఉII మచ్చికలేనిచోట, ననుమానము వచ్చినచోట, మెండుగాఁ
గుచ్చితులున్న చోట, గుణకోవిదు లుండనిచోట, విద్యకున్
మెచ్చనిచోట, రాజుకరుణించనిచోట, వివేకులుండిరే
నచ్చట మోసమండ్రు సుగుణాకర ! పెమ్మయసింగధీమణి ! 584

ఉII వాసనలేనిపువ్వు, బుధవర్గములేనిపురంబు, నిత్యవి
శ్వాసము లేనిభార్య, గుణవంతుఁడు గాని కుమారుఁడున్, సద
భ్యాసములేని విద్య, పరిహాసప్రసంగములేని వాక్యమున్
గ్రాసములేని కొల్వు కొఱగానివి, పెమ్మయసింగధీమణి! 585

ఉ॥ ఆడిక కోడఁడేని, యుచితానుచితంబు లెఱుంగఁడేని, ము
న్నాడినమాట తాఁదిరుగ నాడక యుండఁడ యేని, ప్రల్లదం
బాడెన యేని, సిగ్గు వినయంబు నయంబును వీడెనేని, వాఁ
డేడ నియోగి యయ్యెడు మహీస్థలిఁ బెమ్మయసింగధీమణీ! 586

ఉ॥ మాడలమీఁద నాస గలమానిసి కెక్కడికీర్తి, కీర్తిపై
వేడుకగల్గునాతనికి విత్తముమీఁద మఱెక్క డాస, యీ
రేడుజగంబులందు వెల హెచ్చినకీర్తిధనంబు గాంచి, స
త్ప్రౌఢయశంబుఁ జేకొనియె, బమ్మయసింగఁడు దానకర్ణుఁడై. 587

ఉ॥ పెట్టక కీర్తిరాదు, వలపింపక యింతికి నింపులేదు, తాఁ
దిట్టక వాదులేదు, కడు ధీరత వైరుల సంగరంబులోఁ
గొట్టక వాడలేదు, కొడుకొక్కడు పుట్టక ముక్తి రాదయా
పట్టపురాజుకైన నిది పద్ధతి, పెమ్మయసింగధీమణీ! 588

ఉ॥ ఇప్పటిదాతలర్థులకు నియ్యఁగఁ జాలక రాగిబిందెలన్
ద్రుప్పులు వట్టఁ,బాఁతులిడి దూఁకొని యుండఁగ బండికండ్లతో
గుప్పునఁటొమ్ముగ్రుద్ది దివెకోలలు పుచ్చుక మోము గాల్పఁగా
నప్పుడుగాని యియ్యరు గుణాకర పెమ్మయసింగధీమణి![1] 589

ఉ॥ ఎవ్వరిసొమ్ము నెంత దిన నెవ్వరికున్నదొ, ప్రాప్తిగల్గినన్
దవ్వులనున్నఁ బిల్చి తముఁదార మొసంగుదురంతయంత, పై
నవ్వల నెంత వేఁడినను నా ప్రభు వెంత యొసంగఁ జూచినన్
గవ్వయు నివ్వనీదు తన కర్మము, పెమ్మయసింగధీమణీ! 590

ఉ॥ అక్కజమైన దుర్జనుని కారయ బుద్ధులవెన్ని నేర్పినన్
జక్కటి కేలవచ్చు, విను సాదృశ మొక్కటి వేపవిత్తుకున్

1. ఈ మూడు పద్యములు ప్రభాకరుల వ్రాతపతుల నుండి స్వీకరించితిమి. సం॥



జక్కెర పాదిచేసి, యనిశంబును బాలునుపోసి, పెంచినన్
దక్కునె దానిచేదు వసుధాస్థలిఁ బెమ్మయసింగధీమణీ! 591

ఉ॥ మానమె భూషణంబు చనుమానమె సౌఖ్యకరంబు నిర్మల
జ్ఞానమె ముక్తికాస్పదము గానమె విద్యల కెల్ల రాజు సం
తానమె పో ఫలంబు మహి ధర్మమె తోడు తలంపఁగా నుదా
సీనమె వీడుకోలు గుణ శేఖర పెమ్మయసింగధీమణీ! 592

ఉ॥ సత్యములేనిచోటఁదను సమ్మతి చెందనిచోట, సాధుసాం
గత్యములేనిచోట, ధనకాంక్షమునింగినచోట, శత్రురా
హిత్యములేనిచోట, ఋణమీయనిచోటను, గాపురంబుఁ దా
నిత్యముఁ జేయరాదు సుమి, నిక్కము పెమ్మయసింగధీమణీ![1] 593

ఉ॥ బూరుగుమ్రాను యున్నతియుఁబూవులుఁ బిందెలుఁ జూచి యాసతో
గీరము లాఱునెల్లు తమకించుచునుండి ఫలాభిలాషితన్
జేరి రసంబుగ్రోలుటకుఁజించిన దూదియు రేఁగునట్టు, లా
కూరిమిలేని రాజులను గొల్చుట, పెమ్మయసింగధీమణీ ! 594

చ॥ మనవికి నొక్కయేడు, ననుమానపుమాటకు నాఱునెల్లు, నే
డని పెదనన్న మాసమవు, నన్నెదపొమ్మనఁబక్షమౌను, తత్
క్షణ మిదె యంపితన్న మఱి సంతయు వచ్చును,మోక్ష మింక నా
మనవికి నెన్నఁడో? సుజనమాన్యుఁడ! పెమ్మయసింగధీమణీ! 595

ఉ॥ పద్దెము లోభికేల? మఱి పందికి జాఫరుగంధ మేల ? దు
క్కెద్దుకు పంచదారటుకు లేల? నపుంసకుఁడైనవానికిన్
ముద్దులగుమ్మ యేల ? నెఱముక్కఱ యేల వితంతురాలికిన్?
గద్దకు స్నానమేమిటికిఁగావలెఁ ? బెమ్మయసింగధీమణీ ! 596

1. ఈ (593-596) నాలుగు పద్యములు చా.ర. నుండి గ్రహించితిమి-సం॥

## 19. నందూరి గుండమంత్రి

కేయూరబాహుచరిత్రకృతిపతి యీతఁడు.

మ॥ ధరణిం దానగురుండ వీవని కవీంద్రశ్రేణి వర్ణింపఁగా
బిరుదుల్ నిండినగుండయేంద్రునకు గంభీరప్రభావోన్నతిం
దొరకుం గాకతిలుబ్దులైన గణకస్తోమంబుకుం గల్గినన్
గిరికిం బెట్టినచందమౌ నితరులన్ గీర్తింపఁగా నేటికిన్. 597

## 20. విస్సప్రధాని[1]

క॥ అనుదినము నన్నదానము
ఘనభూదేవతలు మెచ్చఁగా జేసితి వౌ
నినుఁజూచి మెచ్చుకొనరా
వినయజ్ఞులు దానవిధము ? విస్సనమంత్రీ 598

## 21. తిమ్మరుసు

ఈతఁడు కృష్ణరాయలయొద్ద ముఖ్యమంత్రి. రాయలకుఁబితృసముఁడు, కృష్ణరాయ లీతని 'సప్పాజీ' యని పిల్చువాఁడు. ఒకప్పు డీతనియెడ భట్టు మూర్తికవి కడుఁగుపితుఁడై యీ క్రింద నుదాహరింపబడు నుత్పలమాలికాదులను జెప్పెనట.

ఉత్పలమాలిక.

లొట్ట యి దేటిమాట పెనులోభులతో మొగమోట మేల తాఁ
గుట్టకయున్న వృశ్చికముఁగుమ్మరపుర్వని యందురే కదా
పట్టపురాజుపట్టి సరిపల్లె సరాసరి యీయకున్న నేఁ
దిట్టకమాన నామతము తీవ్ర మహోగ్ర భయంకరంబుగాఁ
దిట్టితినా మహోగ్రహమతిన్ మరకగ్రహజర్జరీభటా

1. ఈ పద్యము చా.ర. నుండి స్వీకరించితిమి. సం॥



పట్టపుదట్ట ఫాలఫణి భర్తృబహూకృతపర్జటస్ఫుటా
ఘట్టనదట్టణాలకవిఘట్టనిరర్గళ రాజభృత్యకీ
చట్టచటార్భటీనయనజర్జరకీలలు రాలఁగావలెన్
జుట్టతికంబునం బొగడఁ జూచితినా రజతాద్రధిత్యకా
పట్టణ మధ్యరంగగతభవ్యవధూవదనానుషంగసం

హట్టశిరస్థగాంగఝురహల్లకజాల సుధాతరంగముల్
చుట్టుకొనన్వలెన్ భువనచోద్యముగా భయదంబుగా మతిన్
దిట్టితినా సభాభవనధీంకృతభీమనన్నృసింహరాడ్ధ్వజా
తాట్టమహాట్టహాసచతురాస్య సముద్భ్రుకుటీతటీనటీ

కోట్టణరోషజాలహృతకుంఠితకంఠ గభీరనాదసం
ఘట్టవిజృంభమాణగతి గావలె, దీవనపద్య మిచ్చి చే
పట్టితినా మణీకనక భాజనభూషణ భాసురాంబరా
రట్టతురంగగంధగజరాజ దమూల్యఘనాతపత్ర భూ

పట్టణభర్మహర్మ్యపఙ్క్తి చిరాయురనామయంబునై
గట్టిగఁ దోడుతో వెలయఁగావలె నెక్కువఁటీవిఁ జూడుఁడీ
యట్టిటు మందెమేలముల నందఱనుం బలెఁజుల్కఁజూచి యే
పట్టుననైనఁ గేరడము పల్కకుఁడీ పయిపెచ్చు నందులన్

గొట్టుదు దుష్టవిద్విరదకోటులఁ బంచముఖోద్భటాకృతిన్
బెట్టుదు దండముల్ సుకవిబృందము కే నతిభక్తి సారెకున్
గట్టితి ముల్లె లేఁబదియుఁగాఁగలనూటపదాఱు లెయ్యడన్
రట్టడిభట్టుమూర్తికవిరాయనిమార్గమెఱుంగఁ జెప్పితిన్. 599

గీ॥ ముందు నిప్పుడు నిఁకమీఁదఁ మోద మలరఁ
బద్యదండంబు చేఁబూని పార్థివులను

1.ఈ మూడు పద్యములు ప్రభాకరుల వ్రాతప్రతులనుండి స్వీకరించితిమి. సం॥

జంపుచున్నాఁడు చంపును జంపఁగలఁడు
పరుషవాక్యత సమవర్తి భట్టుమూర్తి 600

శా॥ గుత్తిం బుల్లెలుకుట్టి చంద్రగిరిలోఁగూ డెత్తి పెన్గొండలో
హత్తిన్ సత్రమునందు వేఁడి బలదుర్గాధీశుతాంబూలపుం
దిత్తు ల్మోసి పదస్థులైనఘనులన్ దీవింప...

అనునంతవఱకుఁజెప్పునప్పటికిఁదిమ్మరుసు దుష్కీర్తికి భయపడి పచ్చలహారము మెడనుండి తీసి భట్టుమూర్తికి సమర్పింపఁగా నాతఁడు ప్రహృష్టుఁడై పూరించెను–

...దీవించెదన్
మత్తారాతియయాతి నాగమసుతున్ మంత్రీశ్వరున్ దిమ్మరున్. 601

క॥ అయ్య యనిపించుకొంటివి
నెయ్యంబునఁ గృష్ణరాయనృపపుంగవుచే
నయ్యా! నీసరి యేరీ ?
తియ్యనివిలుకాఁడవయ్య ! తిమ్మరుసయ్యా ! 602

గురువై మహారాజ్యప్రదాపయితయై తన్ను సర్వవిధముల సంరక్షించిన తిమ్మరుసుమంత్రిని శ్రీకృష్ణరాయలు కడకాలమున విద్వేషించెను. ఆయన రెండుగ్రుడ్లను దోడించెను. తన యశశ్చంద్రున కిట్టపయశఃకళంకమును గూర్చుకొనెను.

## 22. బెండపూడి అన్నమంత్రి

## 23. చేమకూర అప్పరాజు మంత్రి

సీ॥ దాతతో నర్థులతారతమ్యముఁ జెప్పి
యిప్పింప నేర్చుఁదా నీయనేర్చు
నవరసాలంకారనయకవిత్వప్రౌఢిఁ
దెలియనేర్చును నన్యుఁ దెలుపనేర్చు



భట్టువాగ్దట్టసంఘట్టకవిత్వంబు
చదువఁగా విననేర్చుఁ జదువనేర్చు
మానవోత్తములైనమహితలాధీశుల
మెప్పింప నేర్చుఁదా మెచ్చనేర్చు

గీ॥ దాత కవి భట్టురాజును దానయనుచు
మహిమ నుతి కెక్కె ధారుణీమండలమున
వీరరిపుదంతిమథనకంఠీరవుండు
రమ్యశ్రీచేమకూరప్ప రాజుమంత్రి. 603

క॥ అనుదినము నీడ ద్రొక్కఁగ
నొనరఁగ సురభూజ మీయ దొకకాసైనన్
దినదినము సుకవిజనులకు
ననయము శ్రీ చేమకూరయప్పన యిచ్చున్. 604

## 24. విట్టల వెల్లమంత్రి[1]

క॥ తన పేరు తల్లి పేరును
తనుగాంచినతండ్రి పేరు దైవము పేరున్
తనయున్న యూరుపేరును
వినుకలిగా బ్రతుకవలయు విట్టలవెల్లా ! 605

ఉ॥ శ్రీగలవేళ నాశ్రితుల శిష్టజనంబుల భూసురాళి న
భ్యాగతులన్ గవీశ్వరుల బాంధవులన్ దగ నాదరించి మే
ల్యాగము సేయుసర్వధన ధర్మవిధిజ్ఞులఁ జెందుకీర్తి బ
ల్రాగకు యుక్తిమంత్రులకు రాదు గదా యిల వెల్లధీమణీ ! 606

1. ఈతని పద్యములివి రెండును గుండుభట్టు నారాయణకవి కృత్యములని చా.ర. గుర్తింపు – సం॥

## 25. గుంటుపల్లి ముత్తరాజు

ఉ॥ అద్దిర ! వీరముత్తc డభియాతిహరుండు కఠోరశాత్రవో
ద్యద్దళనప్రచండకరుcడాజిభయంకరుcడబ్బ ! వానితో
వద్దు విరోధ మెంత బలవంతులకైనను నిన్నcబంపcడే
గద్దరివైరి రాచతలకాయలు నాలుగు గోలకొండకున్ ? 607

మ॥ అని నీవైరులమంత్రు లిట్లనిన నిన్నార్యుల్ కవుల్ పండితుల్
ఘనదానంబున మేఘునిన్ శిబిఘనుం గంధీశ్వరుం గర్ణునిం
జనులెల్లన్ వినుతింప గెల్చె నని విశ్వాసంబుగాc బల్కితౌ
ముని నీచేయుతపంబు గుంటుపలి శ్రీ ముత్తప్రధానాగ్రణీ ! 4 608

క॥ పదివేలమాడ లిచ్చిన
నిదిగొమ్మని యగ్రహార మిచ్చినcగానీ
తుదప్రియము చెప్పకుండిన
ముదుగు సుమీ గుంటుపల్లి ముత్తయమంత్రీ ! 609

మ॥ అనఘప్రాభవ! గుంటుపల్లిసచివేంద్రా ! ముత్తయామాత్య ! నీ
ఘనహస్తాబ్జనవీనవాసన మదంగవ్యాప్త మైనప్పుడే
కనుcగొంటిన్ జతురంతయానపదముల్ గైకొంటి మేల్వస్తువుల్
గనకస్నానము లబ్బె మాకు సెలవా కర్ణాటకక్షోణికిన్. 610

ఉ॥ వార్తల శత్రురాజుల నవశ్యము గెల్చె నటన్న మేటిస
ద్వార్తలు బ్రహ్మచారులు వివాహము సేయుదు రన్న వార్తలుం
స్ఫూర్తిగ షడ్రసాన్నములు భూసురకోటి కొసంగువార్తలుం
గీర్తివిభూష గుంటుపలిఖేలన! వీరయమంత్రిముత్త ! నీ
వార్తలె కాని యెన్న నిcక వార్తలు లేవు ధరాతలంబునన్. 611



ఉ॥ సంతత మారగించునెడ సజ్జనకోటులcc బూజసేయుశ్రీ
మంతుcడు గుంటుపల్లికులమంత్రిశిఖామణి ముత్తమంత్రి దౌ
బంతియె బంతిగాక కడుపంద గులాముల బంతులెల్ల నూ
ల్బంతులు దుక్కిటెద్ల మెడబంతులు విప్రవినోదిగారడీ
బంతులు దొంగవాండ్ర ములుబంతులు సుమ్ము ధరాతలంబునన్612

సీ॥ దుమ్ముధూళిగcజేసి తూర్పారc బట్టcడే
కోపాగ్నిచే బొమ్మలాపురంబు
నుగ్గనూచంబుగా నూర్పిడి సేయcడే
ధాటి మీఱగ నెల్లపాటి కోట
కండతుండెములుగాc జెండి చెక్కాడcడే
దండిబోయలపేట జుండికోట
కుటిలవైరులcద్రుంచి కొల్లc బట్టింపcడే
శ్రీలు మీరcగ బోర లోలకోట

గీ॥ పాదుషాదత్తఘనరాజ్య పదనిరూఢి
జెందె శ్రీగుంటుపలి కులశేఖరుండ
టంచు నీవైరిమంత్రు లిట్లండ్రు భువిని
మంత్రి కుల హేళి ముత్తయామాత్యమౌళి. 613

చ॥ ఎలమినిమించి బంధుజనులెల్లను హత్తc బ్రమత్తులైన రా
జులు సభలన్ మహామహిమ సూచుచు మ్రొక్కుచుcజేతులెత్తమా
ర్మలయు ప్రమత్తకృత్తరిపుమంత్రులు పాదము లొత్త రీవిమై
వెలసితివౌర గుంటుపలివీరయముత్తవదాన్య శేఖరా ! 614

శా॥ ముత్తామాత్య పరాకు! నందనగరీమూర్ధన్య ! మత్తారిరా
హుత్తోన్మత్త వజీరవారపరివారోదారసాహోనమ
ద్ధత్తోపాయనదానలోల యిదిగో దండంబు లర్పించెదన్
జిత్తాంభోరుహ పీఠశోభితమహాచేతో భవారాతికిన్. 615

మ॥ శతమన్యుం డమరావతేలఁగ సురల్‌సత్రాలపాలైరి సం
గతిఁబాతాళము శేషుఁడేలఁగ ఫణుల్ గాలావటించుండె నీ
క్షితి నీవేలఁగ వీరముత్త ! మనుజుల్ శ్రీగంధమున్ బుష్పముల్
హితరాజాన్నము గల్గి యుండి సుఖులై రెల్లప్పు దుల్లాసులై. 616

శా॥ నావిద్వత్కవితావిశృంఖలవచో నైపుణ్యధారాళ ధా
రావష్టంభవిజృంభణంబునకు నౌరా వీరముత్తప్రధా
నావిర్భూతవితీర్ణికల్గవలె లేదా యన్యుల న్వేఁడనా
చీ వాచార్భటి ! చీ కవిత్వమ ! చిచీచీ!! యర్థకాంక్షారతుల్! 617

చ॥ కమలభవాండభాండమునఁగల్గిన ! నందవరంపు టిండ్లలోఁ
బ్రముఖుఁడు రాయనప్రభుని భాస్కరుఁడే నెఱదాత, పిమ్మటన్
విమలగుణౌఘు గుంటుపలి వీరయముత్తఁడె దాత, భట్టపం
క్రమఘనదానరూఢినొక పాటి వదాన్యుల నెన్న నేటికిన్ 618

క॥ నాలుగుదుర్గంబులు పదు
నాలుగు దేశముల ప్రజల నయమార్గమునన్
లాలించుచుఁ జిరకాలము
పాలించెను ముత్తమంత్రి ప్రభుమాత్రుండే ? 619

క॥ పొందుగ శరజలనిధిహరి
చందనతరుచంద్ర సంఖ్యశకవర్షంబుల్
దుందుభి నాషాఢంబున
నందముగా వీరముత్తఁడరిగెన్ దివికిన్. 620

## 26. గుంటుపల్లి నరసింగమంత్రి

క॥ యాచక సంరక్షణకై
భూచక్రమునన్ జనింపఁ బొమ్మని నిన్నా



వాచస్పతి పంపెనటే
నాచక్కని గుంటుపల్లి నరసింగన్నా ! 621

గీ॥ గురుయశశ్శాలి యగునట్టి గుంటుపల్లి
మంత్రి నరసింగరాయసన్మందిరమున
నొక్కనాఁటివ్యయంబగుఁ దక్కినట్టి
దేశపాండ్యాలయొకయేఁటి ప్రాశనంబు 622

మ॥ వరగంభీరత సింధురాజు కళలన్ వారాశిపుత్రుండు సుం
దరభావంబున మన్మథుండు కరుణ న్దార్క్ష్యధ్వజుం డార్యస
ద్గురువిప్రావనదానకర్ణుఁడఖిలక్షోణీస్థలిన్ మంత్రిశే
ఖరుఁడీ శ్రీకర గుంటుపల్లి నరసింగామాత్యుం డెన్నం దగున్. 623

## 27. నంది సింగమ తిమ్మన

పారిజాతాపహరణమురచించిన నందితిమ్మనకు ముక్కు పొడుగుగా నుండుటచే ముక్కుతిమ్మన్న యనియుఁ బేరుకల్గెను. పారిజాతాపహరణము కృతినందినప్పుడు కృష్ణరాయ లీతనికి రత్నకుండలముల నొసఁగెను. ఒకనాఁడీకవి కుండలముల ధరించి తన యింటియరుఁగుపైఁ గూర్చుండియుండఁగా భట్టుకవిత్రోవ నరుగుచు నీకందపద్యముఁ జెప్పెను-

క॥ మాకొలఁది జానపదులకె
నీకవనపుఠీవి యబ్బునే కూపనట
ద్భేకములకు ? గగనధునీ
శీకరములచెమ్మ నందిసింగయతిమ్మా ! 624

ఆనందించి తిమ్మకవి చేత నేమియు లేకపోవుటచేఁ గర్ణమున నున్న కుండల మొకటి తీసి యాతని కొసఁగెనట ! తర్వాత రాయలయాస్థానమునకు నొంటికుండలముతోఁ దిమ్మకవియు భట్టుకవియు వచ్చిరట ! ప్రస్తావవశమున

నీవృత్తాంతము రాజు విని 'గగన' యనుచో 'నాక' యనిమార్చి పద్యము మిసమిసలార్చెనట.

కు॥ మాకొలందిజానపదులకె
నీకవనపురీవి యబ్బునే కూపనట
ద్భేకములకు నాకధునీ
శీకరములచెమ్మ నందిసింగయతిమ్మా ! 625

తిమ్మకవియు భట్టుమూర్తికవియు రెండుకుండలములను రాజునకు సమర్పించిరట ? రాయలు వారిసరసతకు మెచ్చి హెచ్చు బహుమతు లిచ్చెనట!

## 28. కూరగాయల రామన

కు॥ చొరవగొని నఱకు వానికి
నరివరుఁడొక తృణము, దాతయగు నాతనికిన్
వరహాలు చింతగింజలు,
కరుణారసధామ! కూరగాయలరామా ![1] 626

## 29. తిమ్మమంత్రి

## 30. కటికి కామన్న మంత్రి

కు॥ తనసుడివడి గలదినములు
కని మనవలె నరుఁడు కటికికామనవలెనే

1. ఈ పద్యమును చా.ర. నుండి గ్రహించితిమి.

రామన్న రాయలవారి సువారములోకూరగాయల శాఖకధికారిగా చేసిన సేవలకు మెచ్చి ప్రభువు సొమ్మీయఁగా దానినాతఁడు కవులకు పంచిపెట్టుట ఇందు స్మరింపఁబడినది. సం॥



తనువులు ధనములు రాజుల
చనవులు నెన్నాళ్ళు నమ్మ సాళువతిమ్మా[1] 627

## 31. కోటిపల్లి శరభరాజు[2]

గీ ॥ నీతి దానహీనుని నియోగి నెవ్వరు
కరణ మనరు వానికరుణ మనరు
జాణ కోటిపల్లి శరభన్న నందఱు
కరణ మనిరి వానికరుణ మనిరి. 628

## 32. బందా పరదేశి మంత్రి

కు॥ బృందారక లోకంబున
మందారం బుండమాని, మహి కేతెంచెన్
బందా పరదేశి యనన్
అందముగా నర్థికోటి కాధారంబై.[3] 629

కు॥ బృందారక లోకంబున
మందారం బుండమాని మహిఁజేరె నటం
చందురు ఘనులందఱు నిను
బందా పరదేశి ! పూర్ణభాగ్యపురాశీ ! 630

1. ఈతడు సాళువ తిమ్మభూపాలునికడ చిన్న యుద్యోగి యని చా.ర. గుర్తింపు.సం॥

2. ఇదే పద్యము మోటుపల్లి శరభన్నపేర చా.ర.లో. నున్నది. ఈతని యింటిపేరు కోటిపల్లి అని సీసమాలికలో నున్నట్లుండుటయే సరికానోపును-సం॥

3. ఈ రెండు పద్యములను చా.ర. నుండి గ్రహింపఁబడినవి.

వాసిరెడ్డి వెంకటాద్రినాయని గారి రాజ్యమున ఒక చిన్నపల్లెకు కరణమితఁడు. ఈతని అన్నదాన విఖ్యాతి కాశిదాక ప్రాకినవార్త వెంకటాద్రినాయఁడు విని యానందించి యాతని సత్కరించిన సంఘటన చా.ర.లో చూడనగును. – సం॥

# మతికొందఱు మంత్రులు-దుర్మంత్రులు

## 1. దేవనారాయణామాత్యుఁడు

శా॥ క్షిత్యాకాశ దిశావకాశముల ముంచెన్ దేవనారాయణా
మాత్యగ్రామణికీర్తిచంద్రికలు ఝంపాతాళమానక్రియా
నృత్యద్ధూర్జటిజూటకోటరకుటీ ప్రేంఖద్వియద్వాహినీ
ప్రత్యగ్బుద్ధవిశుద్ధ ఫేనపటలీపాటచ్చర ప్రౌఢిమన్. 631

## 2. సాళ్వ తిమ్మరసు

క॥ ఏతెంతురు తముఁ దామే
దాతల సన్నిధికి నర్థితతు లుర్వి శుక
వ్రాతమునకుఁ జూతమహీ
జాతమ్మంపినదె కమ్మ ! సాళువతిమ్మా ! 632

## 3. నందూరి వెంగళమంత్రి[1]

సీ॥ హరిహయ చంద్రికా హంస నారదులను
'పిల్లగిర్ల' కుఁదగఁబిలిచి యాడు,
శారదనిర్మలచ్ఛాయాపతాకాశ
భాగంబులను 'కోలుపట్టెఁ లాడు,
నక్షీణవరదీప్తి నక్షత్రపంక్తితో
నొప్పుగా 'వెన్నెలకుప్ప' లాడుఁ
గైలాస హిమశైలగహ్వర కలశాబ్ధి
రీతుల 'డాగిలిమూఁత' లాడు

1. ఈ పద్యము చా.ర. నుండి గ్రహింపఁబడినది. ఇందలి బాలక్రీడా విశేషములు గుర్తింపఁదగినవి – సం॥



గీ॥ భవ్యభాగీరథీతటి 'బంతు' లాడు,
హల్ల కాబ్జులతోఁ'దన్నుబిళ్ళ' లాడు,
నమరతరువులఁ'దూఱుదండెముల' నాడుఁ
గేరి నందూరి వెంగళు కీర్తిశిశువు. 633

పిల్లగిఱులు, కోలుపట్టెలు, వెన్నెలకుప్పలు, డాగిలిమూఁతలు, బంతులు తన్నుబిళ్లలు, దూఱుదండెములు, బాలక్రీడావిశేషములు.

## 4. మహిమలూరి పెమ్మయసింగన

క॥ సంపదలు జలతరంగము
లింపలరఁగ వచ్చుఁ బోవు నిమ్మహిలో మేల్
సంపాదింపఁగవలెరా
పెంపలరఁగ మహిమలూరి పెమ్మయసింగా ! 634

## 5. కోనమరుసు

క॥ చేపట్టిన ధ్రువు లవుదురు
కోపించిన రంభఁ గూడుకొందురు జగతిన్
స్థాపింపఁ బొడువనేరని
యాపందలు సాళ్వకోనమరుసున కెనయే ! 635

## 6. భట్టిప్రోలు మల్లయమంత్రి

ఉ॥ నీవలె నిచ్చుదాత ధరణీస్థలిలో మును కర్ణుఁడొక్కఁడే
నీవలె మాటలాడుతరి నేర్పరియౌ నిల శేషుఁడొక్కఁడే
నీవలె సుందరాంగ కమనీయతరుండు జయంతుఁడొక్కఁడే !
భావిత భట్టిప్రోలు కులపావన మల్లయ మంత్రి ధీమణీ ! 636

## 7. మాదిరాజు వేంకటమంత్రి

కII అన్నా మంత్రిశిఖామణి
నిన్నెప్పుడుఁ గోనసీమనియ్యోగులలో
నెన్నికదాతవటంచును
విన్నారము మాదిరాజు వేంకటమంత్రీ. 637

## 8. సిద్ధయామాత్యుఁడు

సీII శేషాహి భాషావిశేషుఁడింతే కాని
యెలమిఁగర్ణునిరీతి నీయలేఁడు
ఎలమిఁగర్ణుఁడు దాన మీయ నింతే కాని
పుడమి నింద్రునివంటిభోగి గాఁడు
పుడమి నింద్రుఁడు కడుభోగి...నకుఁగాని
ధర్మనందనువంటితాల్మి లేడు
ధర్మనందనుఁ డెంత తాల్మిదాల్చినఁగాని
పార్థు నా గాంభీర్యపరుఁడు గాఁడు.

గీII గాక యిటువంటి గుణములు గలిగె నీకు
శత్రునిశ్శంక ఉటుకూరు శాసనాంక !
భాగ్య గంభీర వెంగయప్రభుకుమార !
మహితమందార! సిద్ధయామాత్య ధీర ! 638

## 9. డొక్కా సీతమ్మగారు

ఈమె నిరతాన్న ప్రదాత్రిగాఁ గొలఁది కాలముక్రింద రాజోలు తాలూకాలో నున్నదట! ఈమె భర్తపేరు జోగయ.



సీII శ్రీగల్గురాముఁ డీజోగాభిధేయుండు
ధరణీతనూజ సీతమ్మగారు
కాశివిశ్వేశుఁ డీఘనుఁడు జోగయగారు
తగునన్నపూర్ణ సీతమ్మగారు
సురకులాధీశుఁ డీజోగాభిధేయుండు
నభినవవాణి సీతమ్మగారు
దానచంద్రుఁడు జోగమానవశ్రేష్ఠుండు
నెమ్మి రోహిణియు సీతమ్మగారు

గీII అనుచు మిము యాచకులు కొనియాడుచుంద్రు
అహహ తమభాగ్య మేమని యభినుతింతు
అతులగుణదామ డొక్కాన్వ యాబ్ధిసోమ !
అవుర ! జోగయనామ ! సీతాభిరామ ! 639

## 10. లోభి

కII యాచకుఁడు లోభివానికి
రాచూరిఫిరంగి దానరాధేయునకున్
సూచింప దేవరాయలు
నీచపుదగిడీల నెన్న నేటికిఁ బుడమిన్. 640

గీII దాతగానివాని ఖ్యాతిగా నెన్నిన
దాతయౌనె వాఁడు ధరణిలోన
గడ్డిపరకపీఁకి గంగ నల్లార్చిన
దర్భయగునె యజ్ఞతంత్రమునకు. 641

ఉII తిట్టిన రోసముంబడఁడు దీవనయిచ్చిన సంతసింపఁ డా
కట్టిఁడిలోభి కెంతయధికారముగల్గిన నేమి ? లేక యే

బెట్టుగనున్న నేమి? నడపీనుగుకున్ మణిభూషణంబులన్
బెట్టిన మొట్టినన్ సరియె మెచ్చునొ నొచ్చునొ కాళికేశ్వరీ! 642

కు॥ అంటేవేళకు నంటును
నంటనితఱి నంట దెంత యలమటపడినన్
అంటే భాగ్యం బుంటే
నింటికిఁదా నడచివచ్చు నిమ్మహిలోనన్. 643

ఉ॥ క్రూరగణంబు మందు, విషగుంభితవాక్యము గుండు, పద్యమా
ఘోరపుబల్ఫిరంగి, కవికోపము వహ్నియు, నంటి సూటిగాఁ
గూరిక బారుసాగి కొన, గుండుదడాదడిదూఁకి తాఁకినన్
సారెకు లోభి తూలఁబడు సాలమహీజము కూలునట్లుగన్. 644

ఉ॥ మొండిశిఖండిలోభులను ముఖ్యజనావళి వేఁడబోయితే
దండ మనేది, రెణ్ణెలలు తాళు మనేది, మఱింతనొక్కితే
నుండు మనేది యీదివస మోర్చు మనేది, సహించి చూచితే
మండిపడేది మొండిచెయి మాటుకొనేది వివాదపద్ధతిన్. 645

శా॥ ఇచ్చే దెన్నఁడు లేద యిత్తు ననెనా యీప్రొద్దురా రేపురా
వచ్చేయేటికిరా యమాసపయిరా వద్దమ్మఁగారా ధరల్
హెచ్చేటప్పుడురా మఱొక్కపుడురా యీమధ్యతంటాలచేఁ
జచ్చే నన్నను గవ్వలేదుగదరా చాగంబు లోభిప్రభూ! 646

ఉ॥ ఇంతుల కిచ్చినట్లు సుకవీంద్రుల కియ్య రదేమిచోద్యమో
యింతులు చెంతఁజేరి యెలయింతురు పైకొనువేళ మోవి నా
కింతురు గాఢబంధరతికేళిసుఖంబున నోరితమ్మ తి
న్పింతురు చెక్కు నొక్కి మరపింతురు మే నిఁకనేమి చోద్యమో 647



గీ॥ విత్త మొకని కిచ్చి వితరణభరణంపుఁ
జిత్త మొకని కిచ్చి చెఱిచినాఁడు
బ్రహ్మయాలిత్రాడు బండిఱేవునఁ ద్రెంచ
రెండు నొకని కీక బండుచేసె. 648

## 11. వనమయగారి తుక్కన

చ॥ మును పొకకేల రావణుఁడు మోదమునన్ రజతాద్రి యెత్తినం
తనె హరుఁడోపఁడే తనపదంబునఁ ద్రొక్కి మదం బడంపఁగా
వనమయగారితుక్కసచివా! యలశ్రీగిరి గడ్డపాఱలన్
గనలుచుఁద్రవ్వి సర్వమును గైకొనునీ కిపు డాతఁడోపఁడే 649

## 12. బాచమరుసు

ఆ.వె॥ గోలకొండమలక గోవుల భక్షించుఁ
గొండవీటి విప్రకులము నెల్ల
బాచమరుసుచేరి భక్షించుచున్నాఁడు
మలక మేలొ బాచమరుసు మేలొ? 650

## 13. సింగయరామన

కు॥ చేతికి గంటమువస్తే
క్రోఁతికి సివమెత్తినట్టు కొందఱుమంత్రుల్
నీతియెఱుంగక బిగుతురు
సీతారామాభిరామ సింగయరామా! 651

## 14. తంగెడ కొండఁడు

ఉ॥ పింగళ యేకచక్రపురి పెంపుగ నందు వసించియున్న యా
తంగెడ కొండఁడే బకుఁడు తథ్యము మానవులార! వానిబా

ధం గడముట్టఁ జేసె మును ధర్మజు తమ్ముఁడు భీముఁడిప్పుడా
యెంగిలిముచ్చుఁ జంపుటకు నీశ్వరు వేఁడుఁడి భీముఁడయ్యెడున్. 652

## 15. బెహరా దారన

ఒకానొక బాటసారి 'బేచిరా' కయిన దని యెఱుఁగక క్రింది యగ్రహారము పేరువిని వెళ్ళివెదకి కానక విసిగి చెప్పిన పద్యమట !

ఉ॥ కాసర కూసరై మిగులగందరగోళపుమూలమై రసా
భాసపు హేతువై వికటపద్ధతియై సిగపట్లగోత్రమై
దాసరిపాటయై బెహరదారన చేసిన యగ్రహర మా
కాశముముట్టి తోఁకతెగి గాడిదవాలకమయ్యెఁ జూడఁగాన్. 653

## 16. పుత్రేపు వేంకట్రాయఁడు

కః॥ పుత్రేపువంశభవ వెం
కట్రావా ! దుస్స్వభావ ! గార్ధ (1) గ్రీవా
నిట్రాచట్రావిభవా
భట్రాజుల కియ్యలేవు బడవా ! చెడవా ! 654

## 17. పేరులేనివాఁడు

సీ॥ వేడ్క నిద్దఱతోడ వీథిలో నిలుచుండి
జోడుగా ముచ్చటలాడ భయము
కొంప సౌరుగఁ గట్టుకొని కాపురంబుండి
తెల్లనిబట్టలోఁ దిరుగ భయము
గంధాక్షతలు పెట్టి కడుపార భుజియించి
నిండార వీథిలో నిలువ భయము



శుభశోభనములందు సొంపుగా స్త్రీలతో
రాగిల్లి యూరనూరేఁగ భయము

గీ॥ నెట్ట నంగీతొడిగి పాగచుట్ట భయము
బ్రాహ్మణులపాలిమృత్యుపు పాపజాతి
కఠినచిత్తుఁడు వీఁడమ్మకడుపుగాల
...................................... 655

## 18. ఆదెన

కః॥ పెద్దమ్మ బొచ్చు ఆదెన
వద్దికిఁ జనుదేర గార యూరార్చునెడన్
మొద్దువలె పలుకకుండిన
గద్దరి పెద్దమ్మ దాని కౌగిట జేర్చున్. 656

సీ॥ నేవచ్చి నిలిచిన నీమందిరము లోన
ధాన్యరాసులు నూర్జితంబు లేవు
నేవచ్చి నిలిచిన నీ గడించినసొమ్ము
యెక్కడి దక్కడనే హరించు
నేవచ్చి నిలిచిన నీ యింటిలోపల
పైడి సొమ్ములు చోర్ల పాలఁ జేరు
నేవచ్చి నిలిచిన నీపశువ్రాతంబు
గడియలో యమపురికడకుఁజేరు

గీ॥ నేను వచ్చిన తరువాత నీకు నింట
సంపదలు లేవు, సిరిలేదు, చాలు చాలు!!
బొచ్చు ఆదెన నీవెఱ్ఱిపోక లెల్ల
మాన కలశేరు చెడుబుద్ధి మానవలసె. 657

## 19. పోగోలు వీరమంత్రి

సీ॥ కడుపు వెన్నునకంటి కష్టించువానికి
మిఱ్ఱుగా గూనంత బొఱ్ఱ పెరిగె
వరిగోసి చోడియంబలిఁదాగువానికి
కడుపొత్తి పంచెలుగట్టఁ గలిగె
పొలములో తాటి టెంకలు చీకువానికి
తమలముల్ పలుమారు నమలఁగలిగె
తలయు గడ్డము బుట్టవలెఁ బెంచువానికి
ప్రతివారమునను క్షౌరమును గల్గె

గీ॥ పౌరుషంబును ధర్మంబు పట్టువిడిచి
తిట్ల కొడిగట్టి యపకీర్తి చెట్ట బట్టి
.......................................
క్రూరదుర్మంత్రి పోగోలు వీరమంత్రి. 658

## 20. మతికొండలు

ఉ॥ బానెఁడు జొన్నవంటకము వంటెఁడుపాలును మేటిచారు లెం
తేనియుఁ బుల్లఁగూర కడుఁదేరినమజ్జిగ పెద్దచెంబెడున్
బూనిచి కమ్మచౌదరులు బొఱ్ఱలు పెంచుక కొండవీటిలోఁ
గానరు కుంభకర్ణ గజకర్ణ హిడింబ బకాసురారులన్. 659

ఉ॥ తిండికిఁ గుంజరంబులు వితీర్ణికిఁగంటకిభూరుహంబులున్
దండ...గృహంబులకు దండధరుల్ రణరంగభూమికిన్
ముండలు కుండగోఁకరులు ముచ్చటకుం గొఱగానివార లి
మ్మండలమందుఁ గొంద అధమాధమకమ్మబికారిత్రిమ్మరుల్ 660



క॥ పిండెంత రొట్టె యంతే
మండలపతిమను వదెంత మానుష మంతే
గుండెంత తూని కంతే
మిండని యీవెంత లంజెమేలము నంతే. 661

## అల్లుఁడు

క॥ అలుపుని నధికుఁడు చేరిన
నలుపుని తప్పొనె యల్లుఁడల్పునె చేరున్
కొలను విడి కుండ కేఁగిన
కలహంసది తప్పుగాని కాకిది తప్పా ! 662

గీ॥ అల్లునకుఁగల్మివచ్చిన నర్ధరాత్రి
గొడుగుఁదెమ్మన్న కతయయ్యె నొడలెఱుంగఁ
డేడిపించుచు నున్నాఁడు పీడవోలె
వీడిపోడేమి వీడాలిత్రాడుతెంచ. 663

# రాజ్యతంత్రము – నీతి

సీ॥ బ్రాహ్మణ భూములపై నాసయుంచకు
దేవతాద్రవ్యంబు తెరువుపోకు
తగలంచగొండిని దగవరి సేయకు
కపటికి సత్త్రాధికార మియకు
గుడిపారుపత్తెంబు కడుభోగి కియ్యకు
చెనఁటికి నిండిన సీమ యియకు
విత్తహీనులకును గుత్తలు కట్టకు
మతి జారచోరుల మఱుఁగ నియకు

గీ॥ నీచజాతుల వారి మన్నింపఁబోకు
దుర్మదాంధుల వాకిలి ద్రొక్కనియకు
....................................
తలఁపు ధర్మాభివృద్ధి కావలయునేని. 664

సీ॥ గాంభీర్యపరులను గడిదుర్గమున నుంచు
చతురుని సేనాధిపతినిఁ జేయు
పాయక సరసుల రాయబారులఁ జేయు
ముచితజ్ఞు దగ్గఱ నుంచికొనుము
మఱి ధనాధ్యక్షుల మణియగార్లను జేయు
మతిమంతుఁగరణికమార్గుఁజేయు
పరఁగ విశ్వాసుల పరిచారకులఁజేయు
కరుణాన్వితుని గార్యకర్తఁ జేయు

గీ॥ సతత విధ్యుక్తమతిఁబురోహితునిజేయు
నవరసాలంకృతుని మహాకవిని జేయు
షణ్మతజ్ఞానవంతు నాచార్యుఁ జేయు
వార్తకెక్కినకీర్తి కావలయునేని. 665

సీ॥ శరణన్నశత్రునిఁజనవిచ్చి రక్షించు
దీనులమనవులఁ దెలియ వినుము
విష్ణుభక్తులజోడు విడువక వర్తించు
మాధవుపైచింత మఱవఁ బోకు
పేదసాదులనేలఁ బిలిచి రక్షింపుము
పలుచనిపలుకులు పలుకఁ బోకు
అన్నదమ్ములసొమ్ము లపహరింపఁగఁ బోకు
తలిదండ్రిహితవును దప్పఁ బోకు



గీ॥ దయయు సత్యంబు మదిలోనఁదఱుగ నియకు
పరసతులమీఁద భావంబు పాఱ నీకు
భగవదర్పణకానిది పట్టఁబోకు
వెలయు మోక్షాభివృద్ధి కావలయునేని. 666

సీ॥ నమ్మినవారల నమ్మివర్తింపుము
నమ్మనివారల నమ్మఁబోకు
మఱి శత్రువుల మీఁద మఱపించి దండెత్తు
కై జీతగాండ్రను గలుగ నేలు
పొడిచి గెల్చినవారిఁ బోనీక మన్నించు
వంచించు మన్నీల గొంచెపఱుచు
వెరవుమాలినవాని దొర సేయఁ బోకుము
పందకు సేనాధిపత్య మియకు

గీ॥ చేరి చనవిచ్చి దాయల మీఱనియకు
నిక్కమైనట్టి రాణువలెక్క లెల్ల
నెలమి నశ్రద్ధ చేయక తెలియవినుము
వెలయుభాగ్యాభివృద్ధి కావలయునేని. 667

## తీర్పరి

సీ॥ తగవునఁ గూర్చుండి ధర్మంబుదప్పెనా
తప్ప కాతనికళత్రముకుఁదాఁకు
అర్థంబు నేపాటియాసించి చెప్పెనా
యుభయవంశంబులు నుడిగిపోను
పక్షపాతము చేసి పాప మార్జించెనా
తొలగఁక యతని పుత్త్రులకుఁదాఁకు

కపటియై తగ వెఱుంగక తప్పఁజెప్పెనా
    కాలునిపురికిఁ దాఁగదియనేఁగు

గీ॥ వాదిప్రతివాదిమాటల వరుస నెఱిఁగి
యుభయసాక్షుల పల్కుల నుచిత మెఱిఁగి
సత్యమైనట్టిమాటలజాడ యెఱిఁగి
తగవుతీర్చినయతఁడెపో ధర్మరాజు! 668

## ధర్మహీనుఁడు

కం॥ ధర్మముచెడి రెండాడిన
దుర్మార్గుఁడై గృహముపట్టు తుడిచినధూళై
నిర్మూలోన్మూలంబై
ధర్మజు పురికేఁగి మలము ద్రావుచునుండున్. 669

## హితము

ఉ॥ ఉబ్బుచు నర్థి వేడినను నూరకె ప్రాణము వోవు లోభికిన్
దబ్బఱగాదు తథ్యమిది ధారుణినాథుఁడు పట్టి తన్నినన్
లిబ్బులు పెళ్ళగించి మఱి లెక్కకుమించినమాట్లు దంచియున్
గొబ్బున కుప్పబోతు రెలుగోటిధరాధిప! చెన్నకేశవా!![1] 670

## స్వార్థము

కం॥ పశువు కవి నాకు టెల్లను
విషయించుట కొఱకుగాక వేడుకకొఱకా
వసుధేశుడు చెరువేయుట
దశబంధముకొఱకుగాక ధర్మముకొఱకా ? 671

1. ఈ (670–671) పద్యములను ప్రభాకరుల నోట్సు నుండి గ్రహించితిమి. –సం॥



## మంచినోరు – కంపునోరు

చ॥ పుడమిని సత్యసంధుఁడగు పుణ్యునినోరు పవిత్ర మెప్పుడున్
మడియతనాన నూటి కొకమాటయినన్ నిజమాడనేర నా
గడుసరినోరు నోరె యతికష్టపుఁగంపిడిబే జలారినీ
ర్వెడలెడిక్రంత తుం పెరపురీహనుమంత! నితాంతవైభవా! 672

చ॥ కదుగకయున్నఁగంపు, బలుగ్రంతలు రెంటలు, చుట్టివెండ్రుకల్
గడుకొనియుండు, శబ్దములఁ గల్పనసేయుచునుండు, నిట్టిచో
నుడుగు సదర్థమైవెలయ నోరని పల్కిరి, యర్థహీనమై
చెడుగయి కంపుగొట్టిన వచించిరి వేఱని యెంతభేదమో! 673

## అష్టకష్టములు

సీ॥ ఆరయఁ బరదేశ యాత్రసేయుట యొండు
    తనకుఁదానే వండుకొనుట రెండు
కులసతి నెడఁబాసి తొలఁగిపోవుట మూఁడు
    వెలయంగ యాచకవృత్తి నాల్గు
తనసరివారిపంచను జేరుకొను టైదు
    గుఱితెఱుంగని రాజుఁ గొల్చు టాఱు
చదువునేరకయుండి సభకుఁ బోవుట యేడు
    నెన్న దారిద్ర్యంబు నెన్మిదవది

గీ॥ అష్టకష్టంబు లనియెడునవ్వి యివ్వి
గాన యిటువంటి వెవ్వరికైన వలదు
చారుతరమూర్తి ! దేవతాచక్రవర్తి !
రమ్యగుణధామ ! కావేటిరంగధామ ! 674

## గాడిదకొడుకు

కII ఆడిన మాటలు దప్పిన
గాడిదకొడు కంచుఁ దిట్టఁగా విని యయ్యో !
వీఁడా నా కొకకొడు కని
గాడిద యేడ్చెం గదన్న ఘనసంపన్నా ! 675

## పసరము

సీII అసమానదానవిద్యా
రసికత లేనట్టి నరునిబ్రదు కేటికి సీ
కస వేఱుక తిని బ్రదుకదె
పసరము తనకడుపు నిండఁ బర్వతకొండా ! 676

## మరికొన్ని నీతులు

కII సమశీలశ్రుతియుతులకు
సమధనవంతులకు సమసుచారిత్రులకున్
దమలోన సఖ్యము వివా
దము దగుఁగా కసములకును దగునే యెందున్. 677

కII కోటానుకోటు లిచ్చినఁ
గూటికి సరిరాదు, దేవకోటులు రారా
పాటించి యజ్ఞవాటికిఁ
గూటికి మారెళ్ళకొండ ! గుణరత్ననిధీ! 678

కII అనిఁబాఱిన విధి నవ్వును
ధనసంపద నవ్వు నుచితదానవిహీనున్
దనయుని ముద్దాడంగాఁ
బెనిమిటిఁగని జార నవ్వుఁ బిచ్చుయరేచా ! 679



కII పదివేలమంది కిచ్చియుఁ
దుద కొక్కని కీయకున్న దొరకవు కీర్తుల్
పదివేలు నోము నోఁచిన
వదలదె యొకఱంకు వంక వన్నియసుంకా ! 680

కII ఇప్పటియన్నము కొఱకై
త్రిప్పులఁ బడి కుందనేల? దేవుఁడు శిలలోఁ
గప్ప కొసంగెడు హారము
కుప్పలుగ మహేంద్రవాస ! గోకర్ణేశా ! 681

కII చెప్పినపని యొనరించిన
యప్పణఁతుక గల్గుగహన మది సదన మగున్,
జెప్పినపని యొనరింపని
యప్పణఁతుక గల్గుసదన మది గహన మగున్. 682

ఉII వారక యీశ్వరుండు తలపై ధరియించినయంతమాత్ర న
వ్వారిజవైరితోడ సరివత్తువె యుమ్మెతపూవ ! నీపసన్
వారిధు లుబ్బునో దెసలు వన్నెలఁ దేరునొ చంద్రకాంతముల్
నీరవునో చకోరములనెవ్వగ దీఱునొ తాప మాఱునో! 638

ఉII పీనసరోగి నిన్నుఁ దిలపిష్టసమానము చేసినంతనే
వానివివేకహీనతకు వందుఱనేల కురంగనాభమా !
మానవతీకపోలకుచమండలమండిత చిత్రపత్రికా
నూనవితానవాసనల నొందుట లోకము నిన్నెఱుంగదే ! 684

ఉII ఎవ్వఁడ వీవు కాళ్ళు మొగ మెఱ్ఱన ? హంసమ, నెందు నుందువో !
దవ్వుల మానసంబునను, దాన విశేషము లేమి తెల్పుమా ?
మవ్వపుఁగాంచనాబ్జములు మౌ క్తికముల్ గల వందు, నత్తలో?
యవ్వి యెఱుంగ, మన్ననహహా! యని నవ్వె బకంబు లన్నియున్ 685

మ॥ ధర నత్యుత్తముఁడైన ధీరునిమనస్తాపంబు దీర్పంగ స
త్పురుషానీకమ యోపుఁగాని యొకయల్పుం డోపునే తీవ్రదు
స్తరనై దాఘవిదాహతాప మడఁపన్ ధారాధరాంచద్రసో
త్కరధారావళిగాక యర్హ మగునే గండూషతోయంబులున్ ? 686

ఉ॥ చేతికి వచ్చు కార్య మెడసేసితి వర్ధులు శత్రులైరి యిం
కేతరినైనఁ గార్యము ఘటించెదనన్న ఘటింపనీవు నీ
చేఁతగునట్టి చెయ్దమును జేసితి వింతయకాక యింకనా
వ్రాఁతొకయింత మార్పఁగలవా గ్రహచారమ ! దుర్విచారమా! 687

ఉ॥ కా దనిపించుకోఁదగదు, కానిగుణంబు వహించి లోభిచే
లే దనిపించుకోఁదగదు, లేనిదురాశకుఁ బోయి యిందురా
రా దనిపించుకోఁదగదు, రట్టడియై కరినెక్కి దిడ్డిదూ
ఱే దదియెంత ? తుంపెరపురీహనుమంత ! నితాంతవైభవా! 688

చ॥ ఎనయఁగ హీనుదంట, జలమింతయ నిల్వని పాడుగుంట, నీ
చునకుఁ బదార్థమంట, తనుఁజూచిసహింపనియూరనుంట, లే
దనియెడుచేనిపంట, వెసనాఁకంటికందనిపంట మంటకా ?
జనకసుతాభిరామ ! బుధసన్నుత! శ్రీ పెనుమళ్ళరాఘవా! 689

చ॥ కరిగమనల్ దురాత్ములనెకాని రమింపరు, హీనజాతికా
పురుషులఁగాని భూభుజులు ప్రోవరు, కానలఁగాని మేఘముల్
కురియవు, సత్యశౌచములకుం బెడబాసినవానిఁగాని యిం
దిర వరియింప, దుర్వి యవినీతులఁగాని భరింప దెంతయున్. 690

చ॥ పిలువనికూటికిన్, వెతలఁబెట్టుధరావరుఁ డేలువీటికిన్,
జలములు లేనియేటికిని, సారెకు బందుగు లున్నచోటికిన్,



బలువురతోటిపోటికి, నృపాలురసాటికిఁ, బోవరాదయా
బలవదరీ! దరీకుహర భాస్వదరీ! యదరీదరీహరీ![1] 691

ఉ॥ తంత్రులులేని వీణయును, దానమురాగము లేనిగీతమున్,
మంత్రములేని సంధ్యయును, మౌనములేని తపంబు, వేదవి
ట్తంత్రములేని యాగముఁ, బదజ్ఞతలేనికవిత్వతత్త్వమున్,
మంత్రులులేని రాజ్యము, సమానము లియ్యవి దుప్రయుక్తముల్. 692

ఉ॥ గంధపుఁ జెట్టుక్రింద నురగంబు, పయోనిధి బాడబాగ్ని, మా
కందఫలంబు క్రింద నొకకందురుదుంప, జగద్విలోక నా
నందము మేఘునందుఁ బవి నాఁచినమాడ్కి, నకారణంబుగా
నుందురు దాతసన్నిధి నయోగ్యులు కొందఱు మల్లికార్జునా! 639

ఉ॥ చూతఫలావతంస నినుఁజూచినఁ గన్నులపండు వయ్య! లో
పాతిశయంబునన్ బరిమళాన్విత మయ్యె దిశౌఘమెల్ల వి
ఖ్యాతియొనర్చె నీగుణము లైనను గల్గదు నాకు నెమ్మదిన్
గౌతుక మెప్డు నీహృదయకర్కశభావము జూడ జూడఁగన్ 694

## గువ్వలచెన్నా

క॥ అడుగఁ దగువారి నడుగక,
బడుగుల నడుగంగ, లేమిఁ బాపం గలరా!?
వడగళ్ళఁ గట్టువడునా
గుడి రాళ్ళనుగట్టుకున్న గువ్వలచెన్నా ! 695

క॥ సారాసారము లెఱుఁగని
బేరజముకు బుద్ధిసెప్పఁ బెద్దలవశమా !

1. ఈ మకుటముగల మఱికొన్ని పద్యములను చాటుపద్య మణిమంజరి (కొత్తకూర్పు) ప్రథమసంపుటమున చూడనగను. – సం॥

నీ రెంత పోసి పెంచినఁ
గూరౌనా నేలవేము! గువ్వలచెన్నా! 696

కII కలిమిగలవాఁడె మనుజుఁడు
విలసితసత్కీర్తిచేత వెలయఁగవలదా?
కలి యేమి యెల్లకాలము
కులగిరులా కదలకుండ? గువ్వలచెన్నా! 697

కII కలిమిగలలోభికన్నను
విలసితముగఁ బేద మేలు వితరణియైనన్
జలిచెలమ మేలుగాదా
కులనిధి యంబోధికన్న? గువ్వలచెన్నా! 698

కII విలువరుస దానగుణములు
గలవారికిఁగాక లోభిగాడ్దెల కేలా!
తలుపేల చాఁపగుడిసెకుఁ?
గులపావనకీర్తివన్న! గువ్వలచెన్నా! 699

కII వెలివిద్య లెన్నియైనను
గులవిద్యకు సాటిరావు కుంభినిలోనన్
వెలకాంత లెంద ఱున్న ను
గులకాంతకు సాటిరారు గువ్వలచెన్నా, 700

కII తల లెంత పెంచుకున్నన్
గులధర్మము విడిచి కన్నకూళ్లుం దిన్నన్
గలుగదు మోక్షము చిత్తము
విలయము గాకున్న బిజనవేములచెన్నా! 701



కII ఎన్నఁగల జీవరాసుల
నన్నిటిగర్భమునఁ బుట్టి యట మనుజుండై
తన్నెఱిఁగి బ్రదుకవలెరా
కొన్నాళ్లిఁక నెచటనున్న గువ్వలచెన్నా ! 702

## శరభాంకలింగమా

చII పెనిమిటికిం దలారికిని బిమ్మటివారికి బంధుకోటికిన్
వనరుహనేత్ర తా వెఱచి వాకిటి కేఁగదుగాక ! యాత్మ నె
వ్వని మఱిపొందరాదె బలవంతపుఁగాఁపులు వెట్టి కామినీ
జనముల నేలువారు నెఱజాణలయా శరభాంకలింగమా! 703

చII పొరిఁబొరి మేకమాంసములు బొక్కుచు నిక్కుచు సోమయాజియై
సురపురి కేఁగి రంభకడఁ జొక్కుచుసోలుచుఁ గామయాజియై
ధరణికి డిగ్గి యిండ్లఁబడి తండులమెత్తుచుఁ గర్మయాజియై
సొరిఁ దిరుగాడుకామి మిముఁజూడఁడయా శరభాంకలింగమా!704

ఉII గారుడమంత్రసిద్ధుఁ డురగంబులచేఁ గఱపించుకొన్నఁద
ద్ఘోరవిషంబు లెక్కవఁట కుంభినిలో శివమంత్రసిద్ధుఁడై
జారవినోదియై విషయసంగతిఁ జెందినఁ జెందుఁగాక యా
పూరిత మోహపాశములఁ బొందఁడయా శరభాంకలింగమా! 705

ఉII కండలు వహ్నిదేవునకుఁ,గాలినయెమ్ములు భూమిదేవికిన్,
వండినకూడు కాకులకు, వాతిహిరణ్యము చీర మాలకున్,
నిండినసొమ్ము భూపతికి, నిత్యము ప్రాణము మృత్యుదేవికిన్,
మిండతయాలు నన్యులకు, మేదినిలో శరభాంకలింగమా! 706

ఉII వందెడువాని, సత్కవిని, వైద్యుని, మంత్రిని, దంత్రవాదినిన్,
గొండెముపల్కువాని, రిపుఁగూడినవాని, ధనేశునిన్ మహీ

మండలమేలువానిఁ దనమర్మ మెఱింగినవాని నిష్టునిన్
ఖండితమాడునే నదియు గండమయా శరభాంకలింగమా! 707

## భైరవా

చ॥ కలిగినవానియింట శుభకార్యముగల్గినఁ గీడుగల్గినన్
బిలువకమున్నె బాంధవులు పెల్లుగఁబోయితదంగమంతయున్
దెలుపుచు నుందు రాతనికి దీనునియింట శుభంబె కల్గినన్
బలుమఱుఁ బిల్చినప్పటికిఁ బల్కరుగా యెవరైన భైరవా ! 708

చ॥ పరువుగ్రహింపనేర కొకపాటిదురాత్ముఁడు మించనాడినన్
సరసు లెఱింగి మార్కొనక సైఁచినయంతటఁ నైచ్య మే లగున్
అరుదుగవచ్చు మార్గమున కడ్డముగా నొకకుక్క వచ్చినన్
గఱచినఁగోపగించి కరి కర్వగరాదుగదయ్య భైరవా! 709

## పుల్లకవి పద్యాలు

సీ॥ కోణంగి నాట్యముల్ క్రోతు లాడించగా
నూరబందులు సభ నున్నయట్లు
గూబకూతలు విని గువ్వలు తల లూఁచి
పోయికాకులయొద్దఁబొగడినట్లు
కాలువదరి నుండి కప్ప లంకించఁగా
నెండ్రకాయలు తల లెత్తినట్లు
ఎనుబోతు బిరుదులు మనుబోతు పొగడంగ
మేలు మేలని గొఱ్ఱె మెచ్చినట్లు

గీ॥ ఓగుధగిడీలు తమలోననొకరి కొకరు
మెచ్చుకొనుచుందు రెటువంటి పిచ్చితనమొ!



మేలుమే లెట్టిగుణము నిర్మించినాఁడు
పుల్లకవి నేలు గోపికావల్లభుండు. 710

సీ॥ కుంభికుంభములపై కుప్పించి సింహంబు
చిక్కదా సింహంబు నక్కచేత
గాంభీర్యకల్లోల గాఢసముద్రంబు
తఱుగదా యొకవేళ తపసిచేత
మత్తిల్లి భీషణోన్మత్త మాతంగంబు
మునుగదా యొకవేళ మొసలిచేత
బాహుబలోన్మత్త బాహుండు హన్మంతు
చిక్కడా తానింద్రజిత్తుచేత

గీ॥ యెంతవానికి నొకవేళ నెట్టిపాటు
వచ్చుబోవును ధరలోన వగవ వలదు
మేలుమే లెట్టిమహిమ నిర్మించినాడు
పుల్లకవి నేలు గోపికావల్లభుండు. 711

సీ॥ ఇచ్చె ఇచ్చెను దొర యేమిచ్చె నంటిరా
ఈవూరిలో నుండనిచ్చినాఁడు
పొరుగూళ్ళ వెంబడిపోయి ముష్టెత్తుక
యింటికితిరిగి రానిచ్చినాఁడు
గ్రాసానకొకవేళ కలిగిలేకుండిన
నిట్టింట పస్తుండ నిచ్చినాఁడు
చలివేళకప్పుకో చట్ట లేకుండినా
చేతులుముడుచుకోనిచ్చినాఁడు(?)

.....................................

ఇట్టియన్యాయమున కేడ్వనిచ్చినాఁడు

మేలుమే లెట్టిగుణము నిర్మించినాఁడు
పుల్లకవి నేలు గోపికావల్లభుండు. 712

సీ॥ ఎందుండి వస్తివో యింతైనవడదాఁకి
కూచుండు మీనేల కొంచెమనక
ఇంత మజ్జిగదెచ్చి యిప్పింతు మంటేను
నిమ్మాకులునులేవు నీళ్ళులేవు
వూరకోమటి లేదువొక్కటే నేరంబు
తెప్పింతునో విడెము దేవరాన
తీయించిగంధంబు పూయింతమంటేను
చివుకుమానేగాని చిక్కలేదు
అక్షింతలాదిగా నర్పింత మంటేను
ఊరబియ్యపుగింజ యొకటి లేదు
పేలాలు వేయించి పెట్టింత మంటేను
వెలకుతే కొత్తమంగలము లేదు
వంటకమొండించి వడ్డింత మంటేను
యింటియావిడ కుండ లంటరాదు
తెప్పించిపచ్చడ మిప్పింత మంటేను
చేతపైకములేదు చెప్పరాదు

మా పేరు చెప్పక మరి యొక్కయూరను
భోం చెయ్యమని.....................
.........................................
పుల్లకవి నేలుగోపికావల్లభుండు. 713

సీ॥ తుదిరావణుఁడు జగద్రోహియై మోహియై
నిజవంశమెల్లను నీఱుజేసె



కార్తవీర్యుఁడు పాపకర్ముఁడై మర్మఁడై
క్షత్రాన్వయం బెల్ల క్షయముచేసె
కనకకశ్యపు డౌర ఘన విష్ణుదూరుఁడై
తనవంశమెల్ల దగ్ధంబుచేసె
దుర్యోధనుఁడు ధర్మదూరుఁడై క్రూరుఁడై
బంధుసోదరుల పెంపడవి గలిపె

గీ॥ చెటిచెఁ గులమెల్ల ఫణి పరీక్షిత్తు గఱచె
చెడ్గు పగపట్టు కులమును చేటుదెచ్చు
మేలుమే లెట్టిగుణము నిర్మించినాఁడు
పుల్లకవి నేలు గోపికావల్లభుండు. 714

సీ॥ సగరాన్వయం బనశ్వరగతి బెంపొందె
రాజితంబగు భగీరథునిచేత
యదువంశ మెల్లను విదితమై గనుపించెఁ
గీర్తి పెంపొందె శ్రీకృష్ణుచేత
భానువంశమున జగద్వ్యాప్తమై కనుపించె
జానకీపతి రామచంద్రుచేత
పరశురాముని తపోబలవృద్ధి మహిమను
భృగువంశ మెల్లను బూజ్యమయ్యె

గీ॥ ఒకఁడు చాలును గులమెల్ల నుద్ధరింప
ధర్మ మెఱుగని పెక్కండ్రు తనయు లేల
మేలుమే లెట్టిగుణము నిర్మించినాఁడు
పుల్లకవి నేలు గోపికావల్లభుండు. 715

సీ॥ శ్రీవిష్ణు(దేవ) వాంఛితమహారథమైన
పక్షీంద్రునకు విషపాది కూడు

భూతేశుకామితస్ఫూర్తి వాహనమైన
బసవరాయనికి నా కసవు మేత
బ్రహ్మదేవునికి విభ్రమతురంగంబైన
దొడ్డరాయంచకు దుంప తిండి
సర్వసర్వంసహాచక్రవాహకుఁడైన
కాకోదరేంద్రుకా గాలి గటక

గీ॥ గరిమ గల్గును తన పూర్వఘటనచేత
నెంతవారిని గొలిచిన నేమి కలదు
మేలుమే లెట్టిమహిమ నిర్మించినాఁడు
పుల్లకవి నేలు గోపికావల్లభుండు. 716

సీ॥ కుక్క కస్తూరికి గుల్ల కరాటంబు
ముక్కిడిరాజుకు మొండియాలు
బడబాగ్నిరాజుకు బద్ధక(పు) కరణాలు
మాలసుకుమారికి తోలుపరుపు
యియలేని యప్పుకు యీతాకుపత్రంబు
చెయలేని చేనుకు చిలుకశాస్త్రి
దబ్బర పెండ్లికి దబ్బాకు జాగంట
మునసబు కరణాన్కు ముతకకలము

గీ॥ కురిపెంపువానికి గూనివోయిన యాలు
మఱి కాపుటూరికి మంగలోజు
మేలుమే లెట్టిమహిమ నిర్మించినాఁడు
పుల్లకవి నేలు గోపికావల్లభుండు. 717

సీ॥ దొరకైన కరణముతో విరోధము సెబ్ర
అతిలోభిమొండికి నర్థి సెబ్ర



పార్థివోత్తమునకు బహునాయకము సెబ్ర
పెనుఱంకుటాలికిఁ బిల్ల సెబ్ర
దాతకు రాజుకుఁ దామసంబులు సెబ్ర
వసుధ నిల్లాలికి వగలు సెబ్ర
ఘనుఁడైన విద్యాధికున కహంకృతి సెబ్ర
యరయ దుర్బుద్ధి యెవ్వరికి సెబ్ర

గీ॥ మిమ్ముఁ గొల్వమి యన్నింట మేటి సెబ్ర
సెబ్ర లెవ్వియు మిముఁగొల్వఁ జేర వెఱచు
శైకోదండకాండ! నిజాముకొండ
బాలగోపాల! రాధికా ప్రాణలోల. 718

సీ॥ నరనాథవంశకాననము దహించుట
కవనీసురులవిత్త మగ్నికీల
జననాయకుల నిజైశ్వర్యాబ్ధి నింకింప
బ్రాహ్మణక్షేత్రంబు బాడబంబు
పార్థివోత్తముల సంపచ్ఛైలములు గూల్ప
భూసురధనము దంభోళిధార
జగతీవరులకీర్తిచంద్రిక మాప వి
ప్రోత్తము ధనము సూర్యోదయంబు

గీ॥ విప్రతతిసొమ్ముకంటెను విషము మేలు
గరళమున కుర్విఁ బ్రతికృతి కలదుగాని
దాని మాన్పంగ నిల నౌషధములు లేవు
కాన బ్రహ్మస్వములు పట్టఁ గాదు పతికి. 719

గీ॥ ఇఱుకరాదు చేత నిసుమంతనిప్పైనఁ
గొఱుకరాదు యినుము కొంచెమైన

నఱుకరాదు నీళ్ళు నడిమికి రెండుగా
బెఱుకరాదు బావి పెళ్ళగిలఁగ. 720

ఉ॥ ఎక్కడి కేగెదో వడుగ! యేఁగెద బెండ్లికి, మాడ లేవిరా ?
నిక్కము నాల్గు చేఁగలవు, నీకటరా యవి యేవి చూపుమీ,
యొక్కటి త్రోవలోఁ గనెద నొక్కటి కొక్కరిఁ బూట పెట్టెదన్
ఒక్కటి తప్ప నెంచెద మఱొక్కటి లేదని కొక్కరించెదన్. 721

సీ॥ పోఁకలు నమలుచు నాకులు చేకొని
సున్న మడ్గినవాఁడు **శుద్ధవిధవ!**
ఇద్దఱు నొకచోట నేకాంతమాడంగ
వద్ద జేరినవాఁడు **వట్టివిధవ!**
ఆలితోఁ గలహించి యాఁకలి లేదని
పస్తున్నవాఁ డొక్క **పంజివిధవ!**
వారకాంతలయిండ్ల వాసంబుచేయుచు
మగువ కేడ్చెడువాఁడు **మడ్డి విధవ!**
చదువుచెప్పిన జీతమదనులో నీయక
మిటకరించెడివాఁడు **మేటివిధవ!**
త్రోవబోయెడు స్త్రీలతో మొగం బిగిలించి
ముచ్చటాడెడువాఁడు **ముష్టివిధవ!**
కట్ట మిచ్చెద నని కాలమం దీయక
గోళ్ళు గిల్లెడువాఁడు **కొంటెవిధవ!**
ఇంటిఱం కెఱుఁగక యిరుగుపొరుగుఱంకు
వెంటాడువాఁడొక్క **యంటవిధవ!**
దారిద్ర్యముల నుండి తన పూర్వసంపద
లూరకతలఁచువాఁడు **త్తవిధవ!**



గీ॥ ......................................
.........................................
..........................................
......................................... 722

చ॥ అసదృశగంధబంధుర మటంచు వడిన్ జనుదెంచి కేతకీ
ప్రసవమునందుఁ జెంది మకరందము పెందమిఁ గ్రోలలేమికిన్
దెసచెడి కుందనేమిటికిఁ దేఁటి! యరాళకరాళకంటక
ప్రసవముచే భవత్తనువు వ్రయ్యక వచ్చిన మేలు చాలదే ! 723

## ప్రాజ్ఞత

చ॥ వలవదు చూడదుర్జను నవశ్యము చూచిన దాని ముందటన్
నిలువకయుండఁగా వలయు నిల్చుట గల్గిన వానితోడుతన్
బలుకక యుండఁగావలయుఁ బ్రాజ్ఞుఁడు దత్సమయోచితంబుగాఁ
బలికిన యేని వాఁ డెటులు పల్కిన నట్టులలు పల్కఁగాఁదగున్. 724

## పురాకృతకర్మము

ఉ॥ దానము భూమిదాన మటె దాత మహాబలియట్టె, కాలమున్
భూనుతయజ్ఞకాల మటె పూనిగదాధరుఁడర్థియట్టె, త
ద్దానఫలంబు బంధనము దానటె యిట్టిదియైన నింకఁ బౌ
రాణికవాక్య పద్ధతిఁ బురాకృతకర్మమ! నీకు మ్రొక్కెదన్. 725

# సుభాషితములు

చ॥ వినుము మహాద్భుతంబు సరివెంటను బుట్టును బంచమేద్రుఁడున్
మనుజుల లక్ష్మిఁబొందినఁ బ్రమత్తుఁడు లుబ్ధుఁడు వానిఁ జేరి యా
యనుకుల కళ్ళ నోరఁజెవి నింపుగనుంచిన యంత నత్తఱిన్
వినరును తేరిచూడరు వివేకముతోడను మాటలాడరున్. 726

చ॥ సిరి దనయంత మానవునిఁ జెందినయంతనె బావవావిగా
నెఱిఁగియు లచ్చిసోదరుఁడు నేపున శిశ్నములైదు నిక్కఁగాఁ
బొరిఁబొరి కర్ణనేత్రములఁ బొందుగ వక్త్రమునన్ ఘటించుఁబో
గుఱుతుగఁ జూడకుండ వినకుండ సుభాషిత మాడకుండఁగన్. 727

## భర్గా ! పార్వతీవల్లభా !

మ॥ మడతల్ పల్కు నృపాలుతోఁ బలుమఱున్ మాటాడు పెండ్లాముతో
చెడుజాడన్ బచరించు నాత్మజునితోఁ జెట్టాడు కోల్లెంకతో
పొడవం దన్నఁగ వచ్చు కార్మొదవుతో పోరాడు చుట్టంబుతో
కడతేరన్ వశమా గృహస్థునకు భర్గా! పార్వతీవల్లభా ! 728

## చెన్నకేశవా !

ఉ॥ ఉబ్బున నర్థివేఁడినను నూరక ప్రాణము పోవు లోభికిన్
దబ్బఱగాదు తథ్యమిది ధారుణినాథుఁడు పట్టితన్నినన్
లిబ్బులు పెళ్ళగించి మఱి లెక్కకు మించిన మాట్లు దంచినన్
గొబ్బునఁ గుప్పఁబోతు రెలుగోటిపురాధిప చెన్నకేశవా ! 729

ఉ॥ ఇంటనుబోరు, స్నేహితులు నిష్టులుగారు, భుజింపనొక్కటిన్
వంటకమింపులేదు, పయివారికిఁగూడ నసహ్యమైతి నీ
కొంటెతనం బదెల్ల సమకొల్పితి వింతియకాని యింక నా
వెంట్రుకముక్క పీఁకగలవే గ్రహచారమ దుర్విచారమా! 730

## నవనీత చోరకాష్టకము

ఉ॥ వ్రళ్ళని ప్రాణభీతిమెయి సారె భయంపడు దేహధారి గుం
డ్రాళ్ళను రువ్వినన్ శితశరంబులనాఁటిన రోగమొందినన్
నీళ్ళమునింగినన్ రిపులు నిర్దయులై గరళంబు వెట్టినన్
డ్రెళ్ళునె బ్రహ్మవ్రాత కడతేరక యో నవనీతచోరకా ! 731



చ॥ ఘనమగు మంత్రిలేని నృపుకార్యము, నేరనివాని విద్య, లు
బ్ధునిసిరి, వృద్ధనారి రతి, భూసురుపో, టవివేకి నీతి, మ
త్తునిచదు, వల్పుతో చెలిమి తూకొని మేలని లోక మెంతురే
కినియుచు నెంత హాయనుచుఁ గేరక యో నవనీతచోరకా ! 732

ఉ॥ లక్ష వ్రతంబు లుండి పదిలక్షలు తీర్థము లాడి భస్మరు
ద్రాక్ష జటాచ్ఛటాభరణులై మునులై వనులం జరింప నా
యక్షయ కాలకింకర భయంకరబాధ లణంపవచ్చునే
కుక్షిని మీపదామృతము గూరక యో నవనీతచోరకా ! 733

ఉ॥ ఆసలు పుత్రమిత్ర జనకాదులఁ బాసి మహోపవాసులై
దాసు లటంచుఁ జేరి సతతంబును వంచనలేక మానవుల్
గాసముఁ బెట్టుమంచు బరిగంటును గొల్చిన మేలుగల్గునే
దూసలుబారి యెత్తుబడి దోరక యో నవనీతచోరకా ! 734

చ॥ పసరముకైవడిన్ విటుఁడు పైఁబడి తుచ్ఛపు బంధరీతులన్
గుసుమము వేచినట్లుకుసిగుంపులు చేసిన మేలుగల్గునే
నిసితమనోజబాణనిభ నిర్మలకాంతి నఖాగ్రపంక్తులన్
గిసలయ పాణిచన్మొనలు గీరక యో నవనీతచోరకా! 735

చ॥ పసగలయాచకుండు జనభావ మెఱింగి మెలంగగావలెన్
రసికుని విద్య కాదనక రమ్మని ప్రార్థనజేసి మెచ్చినన్
గొసరక యీనివాని మరుగొబ్బునఁ దిట్టక చారుకీర్తితో
పొసగనిలోభితో జరుగు పోరక యో నవనీతచోరకా! 736

చ॥ గదరున రాకుమారకుఁడు కండలు బెంచుక యూరకుండితే
విదితబలంబు శౌర్యమును విస్మితకీర్తులు గల్గనేర్చునే
బెదరొకయింత లేక యతిభీకరబంధుర యుద్ధభూమిలో
నెదిరిన వైరికోటితలలేరక యో నవనీతచోరకా ! 737

చ॥ కసరెడికాపు ధూర్తయగు కామిని దుష్టగుబంటు వట్టి రా
జసమున నుబ్బుసుంకరి నిజంబొకయింతయు లేని దాసి న
ప్పసమును రమ్ముపొమ్మనియుఁ బ్రార్థన చేసిన లెక్కసేతురే
మసలక చేతికొద్ది బడిమారక యో నవనీతచోరకా ! 738

## చాటుపంచచామరాల్

శరీర మగ్నిపాలు, బట్ట చాకిపాలు, ప్రాణముల్
పరేతరాజుపాలు, వాతిపైఁడి మాలపాలుగా
నెఱింగి యీగులాలు ధర్మమేల చేయ నేరరో
సిరామ రామ రామ రామ శ్రీరమామనోహరా! 739

గురాలఁ గట్టి, నీళ్లమోసి, కూళ్ళు వండిపెట్టి, వి
స్తరాకు లమ్మి లంజెలిండ్ల తమ్మలెత్తి, పిమ్మటన్
దొరైనవాఁడు ధర్మమైనత్రోవద్రొక్క నేర్చునా
సిరామ రామ రామ శ్రీరమామనోహరా ! 740

పరాంగనాజనంబుమీఁద బారుజెందువాఁడు స
త్పురాణమార్గముల్ దొలంగిపోవువాఁడు విప్రులన్
దురాసలన్ భ్రమించు లంజెదోపుగాడునుం దొరా
గరాసు మొండిదూఁబవాడుగాక బుద్ధినేర్చునా
సిరామ రామ రామ రామ శ్రీరమామనోహరా ! 741

తఱట్లఁగొట్టి చెప్పుగాళ్ళఁదన్ని మొట్టి తిట్టినన్
గొఱట్లఁగాల్ప మూలదాచుకొన్న సొమ్ము లిత్తురా
నరండిమొండి బండగాద్దె లర్థి కివ్వలేరయా
సిరామ రామ రామ రామ శ్రీరమామనోహరా ! 742



దరిద్రులైరి దాత లాతతాయులైరి భూభుజుల్
చిరాయులైరి లోభు లల్పజీవులైరి సజ్జనుల్
కరాబులైరి మంత్రులెల్లఁగాల మెంత సెడ్డదో
సిరామ రామ రామ రామ శ్రీరమామనోహరా! 743

## కంభము రామచంద్ర !

సీ॥ వినయంబు తోడ బెట్టనిభోజనము రోత
ముప్పున పెండ్లాడ మొదల రోత
లెక్కింప కన్నులు లేనిదేహము రోత
గరితలేనట్టి మందిరము రోత
పత్రంబు తగనిచ్చి ప్రాకులాడుటరోత
మురిసిన యూరనే తిరియ రోత
గడుసుయావుల కాశపడియుండుటయు రోత
దారుణంబగు దరిద్రంబు రోత

గీ॥ ఇంతకంటెను పెనురోత యింకనొకటి
తారతమ్యంబు లెరుగని ధరణిపతుల
కువలయంబున రోయక కొలుచుటెల్ల
రమ్యగుణసాంద్ర కంభము రామచంద్ర ! 744

సీ॥ నెరవైన విద్వాంసునికి కోలుకాని పై
బిరిగెంటు పాతికాపరకచిట్టు
ఘటికా ప్రబంధంబు గట్టిన చాతురి
గల కవిరాజులకు కాసుచిట్టు
భూరి విజృంభణ పొగడినభట్టుకు
కొరతబెట్టక నొకకొత్తరూక

మిగుల వేడుక పెట్టి మేళంబులకు నెల్ల
మీరుచు నూరుపదారు లిపుడు

గీ॥ కోరి యీరికి నొసగును కూళధాత
యెలమి కలనైన సత్పాత్ర మెరిగియీడు
ఇట్టి మూఢాత్ము గొలువంగ నెట్టు వచ్చు
రమ్యగుణసాంద్ర కంభము రామచంద్ర ! 745

సీ॥ పుట్టినప్పుడె నూరుబొంకులు తలనంటి
మున్నూరబొంకులు మొలనుగట్టి
నన్నూరు బొంకులు నాలికె నంటించి
ఐనూరు బొంకుల మేననలది
ఆర్నూరు బొంకులు అంగిట బడబోసి
పొట్టలో యేళ్లూరు బొంకులణచి
రక్షగా వలకేల లక్షబొంకులు గట్టి
మితిమీరి బొంకులు మెడనువేసి

గీ॥ తల్లిదండ్రులు యీరీతి ధాత్రి బెంప
పెరిగినటువంటి పడిశెట్టు పెంకెదీటు
అనుచు రోయుచు రల్పుల నఖిలజనులు
రమ్యగుణసాంద్ర! కంభము రామచంద్ర!! 746

సీ॥ బహుతరైశ్వర్య సంపన్నుండు శంభుండు
భక్షింపలే కేల భిక్షమెత్తె
ఆదిలక్ష్మీనాథుఁడై యుండి దీనుఁడై
దనుజాధిపతి నేల దానమడిగె
భూరిభోగస్ఫూర్తి పొలుపొందు సురనాథుఁ
డబ్జాప్తసుతు నేల నాశ్రయించె



సకలభూముల జయ స్తంభంబు నిలిపిన
పాండవాగ్రజు డేల పరులఁ గొలిచె

గీ॥ యెంతవారికి నొకవేళ నిట్టిపాటు
వచ్చు నిందుల కెంతయు వగవనేల
(యనుచుఁ దెలిసిన ప్రాజ్ఞుల కరయమేలు)
రమ్యగుణసాంద్ర! కంభమురామచంద్ర !! 747

సీ॥ ఎన్నగా రెండువేలేండ్లు తాబ్రతికిన
విక్రమార్కావనీవిభుఁడు వేఁడి
కడువేడ్కతో లక్ష కొడుకుల గన్నట్టి
రసికుఁడారావణబ్రహ్మ యేడి
అంబుధులేడింటి నాపోశనము గొన్న
బలశాలి కుంభసంభవుఁడు ఏడి
మితిలేని రాజ్యసంపదల చేనొదవిన
నుతమూర్తి దుర్యోధనుండు ఏడి

గీ॥ పదవి కులమును బలము సంపదలు మాయ
సుతులు పెండ్లాలు తెరచాటు ప్రతిమలౌర !
చేసినటువంటి ధర్మంబె చెడని పదవి
రమ్యగుణసాంద్ర! కంభము రామచంద్ర!! 748

సీ॥ మగనాలి మీఁదను మమత యుంచఁగరాదు
పగవానితో మించి నగఁగరాదు
నగరివాకిలినంటుమగువలఁ బిలరాదు
పతి కాప్పుఁ గోపించి పలుకరాదు
చలపట్టి దొరపోదు సరిపడ దనరాదు
చనవరితోఁ గంటు కనఁగరాదు

ప్రభువు చెప్పకయె తాఁబనులు చేయగరాదు
పిలక డగ్గఱఁబోయి నిలువరాదు

గీ॥ పరులు రారాజుమొనచూపి పలుక రాదు
పగఱ యధికత స్వామితోఁ బొగడరాదు
నరులకెల్లను నీనీతి నడవ వలయుఁ
బ్రకట గుణసాంద్ర! కంభము రామచంద్ర! 749

సీ॥ తలవరితో మించి కలహింపఁగా రాదు
స్త్రీల స్వతంత్రులఁ జేయరాదు
జాతిదప్పినయట్టి నాతిఁ జేకొనరాదు
నీతిమాలినయెడ నిలువరాదు
ప్రభువు సమ్ముఖమునఁ బకపక నగరాదు
చనువున గర్వంబు గనఁగరాదు
కులమెఱుంగక యరికూతుఁ గైకొనరాదు
పరునికల్మి కసూయపడగరాదు

గీ॥ పదిరియాసల ధర్మంబు వదలరాదు
చలము బొంకును సుజనుతోఁ జలుపరాదు
నరులకెల్లను నీనీతి నడవవలయుఁ
బ్రకటగుణ సాంద్ర! కంభము రామచంద్ర !! 750

సీ॥ అక్కఱకొదవనియర్థంబు వ్యర్థంబు
బంటుతనము లేని భటుఁడు నటుఁడు
రసికుఁడేలనియట్టి రాజ్యంబు త్యాజ్యంబు
శీలంబుదలఁపని యాలు తేలు
మాటతప్పఁగనాఁడుమనుజుండు దనుజుండు
గౌరవం బెఱుగనియూరు పోరు



ధర్మంబుమానిన దానంబు హీనంబు
నయము వీడిన వానినంటు కంటు

గీ॥ పొదలు తమిఁ బూనని లతాంగిపొందు మందు
చెలఁగి సజ్జనుల్ మెచ్చనిచేఁత రోఁత
యిష్టబంధులు నిండనియిల్లు పొల్లు
ప్రకటగుణసాంద్ర! కంభము రామచంద్ర ! 751

ఉ॥ వీడనిమూర్ఖునొద్ద నెఱవిద్దెలు రూఢికిరా వదెట్లనన్
బూడిద హెూమమై చవుటఁబోసిన నెయ్యాయి, వెఱ్ఱిదానితో
గూడినకూటమై, విధవకొప్పునఁ జుట్టిన పుష్పమాలికై,
గాడిదవాహమై, యడవిఁగాంచిన వెన్నెలయై, వృధాయగున్. 752

ఉ॥ లంచము, వెజ్జుకూలియును, లంజెయునుంకువ పన్నిదంబు, జో
డించిన యాగితేగము, కడిందిమగంటిమి, వడ్డివైద్యమున్
మంచివయస్సు, సుంకమును, మానుగఁ జేతికిడాయఁజేయ ద
క్కించుకొనంగలేకునికి గేలియొనర్తురు వానిఁ బిమ్మటన్. 753

సీ॥ రాజు పాలింపని రాజ్యంబు పూజ్యంబు
రథికు లుండనియట్టి రథ్య వధ్య
కరుణాకరులు లేని గ్రామంబు ధూమంబు
ఘనతతో నిలువని కవులు తెవులు
ధరఁబాత్రమెఱుఁగని దానంబు హీనంబు
దయదక్షిణతలేని దాత ప్రేత
అతిథిపూజకు రాని యర్థంబు వ్యర్థంబు
అనుకూలవతిగాని యాలు తేలు
హీనులతోఁ బొందునిష్టంబు నష్టంబు
ఇల్లాలు లేనట్టియిల్లు పొల్లు

సరవి మూర్ఖునితోటి సరసంబు విరసంబు
శబ్దమెఱుగని వాని చదువు ముదువు
బంధులు లేనట్టి పండుగ దండుగ
వావివర్తనలేని వాఁడ పీడ

గీ॥ ఇన్నిరీతులు జగమందు నెన్నికాయె
.......................................
.......................................
విబుధ లోకేశ ! వినుకొండ వెంకటేశ! 754

చ॥ వదల కుపాయవంతుఁ డగువానికి నెన్నడు రాగరక్తిమైఁ
బదనికి రానిబాల దలపట్టుక యీడ్చుక తెచ్చినట్టుగా
కొదుకక వచ్చు శ్రీసతి మహోన్నతమై తనుదానవచ్చి త
త్పదనము నందు నిల్చుఁ బ్రమదస్థితిఁ బాయక యెల్లకాలమున్. 755

సీ॥ సర్వజ్ఞుఁ డగుమంత్రి సాదరించిన రాజు
కార్యఖడ్గంబుల క్రమమెఱుంగు
కార్యఖడ్గంబుల క్రమమెఱింగిన రాజు
బహువిధంబుల మూలబలము గూర్చు
బహువిధంబుల మూలబలము గూర్చిన రాజు
శత్రుల నవలీల సంహరించు
శత్రుల నవలీల సంహరించిన రాజు
ధరణి నేకాతపత్త్రముగ నేలు

గీ॥ గావున ప్రధానమది యగ్రగణ్యబుద్ధి
యదురు సామ్రాజ్యమునకు సర్వాంగరక్ష
రాజధాత్రేయగోత్రధర...........య
గుండభూపాల నరసింహమండలేంద్ర ! 756



# ఊళ్లు – నాళ్లు

## తూర్పునాడు

సీ॥ శ్రీరామ! పతిపేళ్ళు దొరలు రాచకొమాళ్ళు
వెలమనాయళ్లు చేవెళ్లు గోళ్లు
కాళ్ళను బాంకోళ్ళు కదునోరసిగముళ్ళు
వింతకట్టురుమాళ్ళు బంతికూళ్ళు
చెవులపోఁగుల జోళ్ళు చేయీఁటె పదిమూళ్ళు
మాటవ్యక్తపునోళ్ళు వేఁటకాళ్ళు
వెలిరారుమగనాళ్ళు పెనుబాలకావళ్లు
గొల్లబోయళ్ళు పైఁదెల్లజోళ్ళు

గీ॥ చాలుమామిళ్ళు తాళ్ళు వజ్రాలరాళ్ళు
నీళ్ళు గలయూళ్ళు నడవికుందేళ్ళు లేళ్ళు
మహలుకట్టళ్లు పాఁతళ్లు మానుఱోళ్లు
మెప్పు నడవళ్ళు తూర్పున నుప్పుమళ్ళు. 757

## కర్ణాట దేశము

సీ॥ జిలుగువన్నెరుమాళ్లు చెవుల ముత్యపుజోళ్ళు
వెగటైనవడదోళ్ళు వేఁటకాళ్ళు
వారకాంతలయిళ్ళు వచ్చురాచకొమాళ్ళు
నారీమణుల పెళ్ళు నారికెళ్ళు
వాసించువటివేళ్ళు వారిజాక్షినగళ్ళు
దాసరిదేవళ్ళు తఱచుగుళ్లు
శృంగారసావళ్ళు బంగారు మెడనూళ్ళు
నిగ్గైనమద్దెళ్ళు నేర్పుకాళ్ళు

గీ॥ ఎట్టివారికిఁ గలరయా యిద్దఱాళ్ళు
సంతతంబును దమయొద్ద బంతికూళ్ళు
మాటనిలుకళ్ళు మఱిమంచినీటుకాళ్ళు
పొందుకర్ణాటదేశపుఁ బొందుకాళ్ళు. 758

సీ॥ కాసుపుట్టని యూళ్ళు కఱవు మజ్జిగనీళ్ళు
పడిపోర్లుదేవళ్ళు పాడుగుళ్ళు
దరిబేసిసావళ్ళు మొఱలు పెట్టువఱళ్ళు
పరుగులెత్తెడిలేళ్ళు పలుగుఁఱాళ్లు
చౌటవాఁగులనీళ్ళు సరకు లేనంగళ్ళు
పెనులోభులనగళ్ళు పిచ్చపళ్ళు
మలపముండలజోళ్ళు మడ్డిచెక్కలపోళ్ళు
తెందెవ (?) శివపాళ్ళు తెల్లనూళ్ళు

గీ॥ చివికిపోయినపందిళ్ళు చింపిదళ్ళు
బీదరాచకొమాళ్లు తబ్బిబ్బుపేళ్లు
తోడుఁబోతులవడుసుళ్లు తుమ్మబీళ్లు
పోరుమామిళ్లనడవళ్లు పూటకూళ్లు. 759

## కొండవీటిసీమ సముతులు

సీ॥ కొండవీటీసీమకోర్కులు దీర్పంగ
దండిసముతులు పండ్రెండు రెండు
ఎలమితోఁ జెప్పెను, ఏదేది యంటివా
పాలడ్గు పులిపఱ్ఱు ప్రత్తిపాడు
సంతనరావూరు సరసను నూతక్కి
పొంతను చేబ్రోలు పొన్నునూరు



మంగళగిరియును మఱి మంచిమునుగోడు
రంగైననాదెండ్ల రాయిపూఁడి

గీ॥ దాచినధనంబువంటిది కూచిపూఁడి
పంట లధికంబు గుంటూరు ప్రజలకెల్ల
పాడిబాసలు గలిగుండు తాడికొండ
పరమమల్లేశ శివలింగ ! పార్వతీశ ! 760

## వినుకొండసముతులు

సీ॥ వినుకొండసముతున విలసిల్లు గ్రామంబు
లిన్నూటనార్నొకటెన్నికకును
వానికి సముతులు వర్ణింప పదియాఱు
సముతుల నామముల్ క్రమముతోడ
వివరించి చెప్పెద వినుకొండ పూనూరు
కొండపాటూరును కొణిదెనయును
ముక్తేశ్వరంబు చొప్పాడి చింతల చెర్వు
కుందుర్రు చేచెర్ల కొప్పరంబు
వెల్లటూ రినిమెళ్ళ విశదమౌనినగల్లు
రావూరుపురము తలార్ల పల్లి
రొంపిచెర్లయుఁ గూడి పెంపైన సముతుల
క్రిందచెల్లెడు నూళ్లు పొందుమీఱ
నెన్నగరచియింతు నీవినుకొండ హ
వేలి క్రిందను జెల్లు వేలుజోడు
దాసరి పాలెము దగ్గుపాడుప్పర్ల
పల్లెనల్లయనంతవరము గోప

వరము (పాడేగివి?) నిర్లపాడు కుంకల గుంట
మద్దిరేలయు నెనమదల పిచ్చి
కలపాడు నరుదందగను కొండ్రముట్లయు
వినుకొండయును గూడ వేడుకలర
పదమూడు పల్లెల పరగెను నీసము
తరయంగ నాగలవరముగరికె
పాడును వయకట్ల ప్రబల పిట్టంబండ
నాగండ్ల యగ్ని గుండాల ముక్తి
పూడియు కనుమర్లపూడి కోమటిగుంట
తురుమళ్ళ నాయన్నవరపుపాడు
అన్నవరంబును నావీరపట్నంబు
చెలువొందు ముప్పాళ్ళ సెట్టిపల్లె
ముమ్మడివరమును కొమ్మాల పాడును
రమణీయమగు నాగరాజు పల్లె
గోగులపాడును కొమరొందఁ గోమాలె
పాడు బొల్లాపల్లి బబ్బెపల్లి
ఈడ్పులపాడును నెనయ రేమిడిచెర్ల
ఏపుమీరెడు కామలీపురంబు
కుందుర్టి సముతయ్యె కొండపాలింకొల్లు
కొప్పెరపాడును కొమరుమిగుల
మదమంచిపాడు తమ్మవర మెన్నఁగ జనుల్
బ్రస్తుతి సేయుఁగఁ బ్రబలుచున్న
మేదరమెట్లయు మించు కామేపల్లి
తంగేడుమల్లెయు రంగు మీర



తూరుపన్నవరంబు తోరంపు ముదుకొండ
పాడు చినకంచెర్లతోడఁగలసి
బొప్పూడి (12) పంద్రెండు పొందగు పల్లెలు
సముతయ్యె చూడ నాశ్చర్యముగను
ములకటారుతనంగ ముత్తనపల్లెయు
పరిటిచెర్లయు మఱి పయిడపాడు
వరుసతో నబినీసువారియప్పాపురం
బుల్లాసము పెరుమాళ్ళపల్లె
తమ్మాలకుంటయు తిమ్మపాలెంబును
బల్లిదంబగు చింతపల్లెపాడు
బంగాలపల్లె పొసంగ యెద్దనపూడి
సూరవరపు పల్లె చోద్యమైన
వింజనంపాడును రంజనంబగు క్రొత్త
లూరు నారేపల్లె సారమైన
బ్రాహ్మణపల్లెయు పడమటనుండును
రేపల్లె యిను కుర్కియును తాణు(?)
దారు నన్నవరంబు తరుచగు సిరులచే
మండితంబై చాల దండియైన
పైడిమఱ్ఱియు వేడ్కఁ బరఁగెడు మిన్నెక
ల్లారయ నినుగల్లు నమరగూడి
ఇరువదిరెండూ(ళ్ల) ను (22) నినుగంటి సముతన
బెంపొందె జనులకు నింపెసంగ
వెల్లలచేర్పూడి జిర్లసీసంపూడి
పెట్లూరిపాలెము వేటరాయ

నప్పాపురమ్ము కొండయపాలె ముప్పల
పాడును కూర్ముల.......(?)
కర్లగుంటయు రొంపిచెర్ల నంగ
చేరి తొమ్మిది(9) రొంపిచెర్ల సముతు
చిట్టాపురంబును చీపూరు బొగ్గరం
బొమ్మరాజునిపల్లె బుజనపల్లె (?)
వనికుంట పొట్లూరు.................
కొత్తప ల్లినుమల్ల గూడియేడు
నినుమల్ల సముతన నిరవుగ తొమ్మిది
గ్రామంబులనునొప్పి ఘనతమీఱ
కల్లూరుదాసళ్లపల్లె విష్టమరాజు
పల్లె వేమవరంబుఁ బ్రబలమైన
జండారుపల్లెకంచె ర్లరగయపాలె
మతుల గోకనకొండ మతుకుమల్లి
ఉప్పరపాలెంబు నొప్పైన యేనుగ
పాలెంబు నాగుంటుపల్లి కొప్ప
రపుపాలె మంతయు రమణతో మీరంగ
సింగారములతో జెలంగుచుండి
రంగగు శంకరలింగము గుడిపాడు
నందిపా డెన్న కోనంగి కొప్పరము
గూడుక కడ మవిగో పదునేడు (17)
పల్లెల సముతు కొప్పరము చెలఁగె
ముక్కెళ్ళపాడును ముత్తుజాపురమును
గంగపాలెము నీలగంగవరము



కమ్మలచెరువును కన్నవరంబును
పువ్వాడు నూజండ్ల పొందుమీర
ఒనరు పెద్దవరంబు నొగితంగ్గిరాలయు
బైదనయు మైలవరము చెరువు
కొమ్మపాలెము చూడకూకుట్లపల్లెయు
నరసయపాలెము వరుసతోడ
కంభముపాడు చొకాటపుచింతల
చర్వుతోడనుగూడి సరసముగను
పదునేడుపల్లెల(17) బరగిచింతలచెర్వు
సముతయ్యె ప్రజలెల్ల సన్నుతింప
పైడిపోతును మగ్రిపాడు రవ్వరవంబు
త్రిపురాపురంబును తెల్లపాడు
ఉచ్చునూతులయును నుప్పల కొచ్చెర్ల
యంగలూరును కంకణాలపల్లె
నయతతలార్లపల్లెయుఁ గూడి పదునొకం(11)
డగు నూర్లచేతతలార్ల పల్లె
సముతునాఁ బరఁగె నొద్దెముగుంట పేరూరు
పాడూరు సరికొండపాలె ముప్ప
నాయనిపాలెంబు నడిగెడ్డ కొప్పుకొం
డయు బలిజేపల్లి నయముమీఱ
వెల్లటూరును గూడివెలయునెన్మిదియూళ్ళు(8)
సముతయ్య వెల్లటూ రమరుచుండ
పలుకూరు వేంకనపాలెము పోలయ
పాలెంబు తగుగుట్లపల్లిదార్ల

దిన్నెజువ్వల కల్లతెల్లపాడును గంగు
పల్లెతో కలిసుక పరగ రావు
లాపురమనుపేరు రమణతో సముతయ్యె
తొమ్మిదియూళ్లచే నెమ్మితోడ

గీ॥ నట్టి సముతులు తగ (16) పదియాఱు గూడి
యూళ్ళు (207)యిన్నూటపై నాఱునొకటి గాగ
వసుధ ధనధాన్య లక్ష్మీనివాస మగుచు
నమరియుండెను వినుకొండ సముతనంగ. 761

## మారెళ్లసీమ

సీ॥ సిరిమించు మారెళ్లసీమ దేశంబునఁ
దుదముట్టఁజూచినఁ దువ్వభూమి
ఆ భూమిపంటలు నారికె కందులు
చామలు నులువలు సజ్జలు మఱి
వరుసతోఁ గొఱ్ఱలు పరిగ లల్చందలు
ననుములు పెసరును నాముదాలు
ప్రత్తియు రాగులు పొళెపుజొన్నలు
పదునాల్గు వన్నెలపంట గలదు

గీ॥ అందుఁ గూరగాయ లనువైనగోఁగులు
పుచ్చకాయ తుమ్మిపులుసుఁగూర
పాలుపెరుగు నెయ్యి పరిపాటిగాఁ గద్దు
ఇంతకన్న లేద యెంచిచూడ. 762



## వీరనకనుపూరు, కొల్లుకుదురు

ఈ రెండు గ్రామములును నెల్లూరిదగ్గఱ నున్నవి.

ఆ.వె॥ ఊరిచుట్టు ముండ్లు నుదకంబు మధ్యంబు
పాడిపంట సున్న ఫలము నాస్తి
తీరు దినుసు లేనివీరనకనువూరు
పాడుకొంప దీనిత్రాడు త్రెంప 763

ఆ.వె॥ ఒక్కపా లెగేసి యొక్కపాలు దిగేసి
ఉన్నయూరిమీఁద మన్నుబోసి
పాపరాజుపోయెఁ బారుపత్తియుఁబోయె
కొల్లుకుదురుమీఁదఁ గొఱవి పెట్టి. 764

## ఉదయగిరి రాజ్యలక్ష్మి

క॥ ఉదయగిరి రాజ్యలక్ష్మికి
సదనము నెల్లూరు అట్టి సాధ్వీమణికిన్
వదనంబు కందుకూరున్
బదయుగళం బాత్మకూరు బట్టేపాడున్ 765

## కొవ్వోలు వృత్తాంతము

“శ్రీకృష్ణ దేవరాయలచేఁ గొవ్వోలు గ్రామమును బొడ్లుచెర్ల తిమ్మన యగ్రహారముగాఁబడ సెను. ప్రథమ భాగము (పు. 161) చూచునది.) ఆ తిమ్మన మంత్రి కుమారుఁడు వెంగన్న యాకొవ్వోలు గ్రామమునకుఁబాపఘ్నినది నుండి కాలువ త్రవ్వించి నాగులకుంట యనుపేర నొకచెర్వు నిర్మించి యా నీటిచేతఁదన యగ్రహారమును నదీ మాతృకము చేసికొని యుపపన్నుఁ డగుచుండెనట! దానికోర్వక తమకేదో నష్టము కలుగుచున్నదని లెంబాక నాగిరెడ్డి యనునాతఁడు

తద్గ్రామాధికారిగా నున్న పోచిరాజు ఓబన్న తోడ్పాటున వెంగన్నమీఁదఁ దగవు సాగించెనట! అప్పుడు దేశాధీశ్వరుఁడుగా నున్నమట్ల- కుమారనంతరాజుగారికడ కేఁగి బొడ్డుచెర్ల వెంగన్న విన్నవించుకొన్న విధము.:-

సీ॥ కొప్పోలుకవి దిశాకుంజరంబులమీఁదఁ
గోలాహలంబాడెఁ గోలకట్టె
తగఁగృష్ణరాయేంద్ర దత్తాగ్రహారంబు
నాశంబుగాఁ బూనె నాగిరెడ్డి
యారాజ (?) నరనాథకృతమైన పెనుగాల్వ
కూలఁద్రొబ్బఁగఁ బుట్టెఁ గుంటకట్ట
వెలయ వామన మహోత్పల శాసనంబులు (?)
తల్లడంబులు చేసె నల్లఁడహహ

గీ॥ విని పరామరిసించు మా విన్నపంబు
చిత్తమును నుంచు పోషితాశ్రితకలాప
మట్లకులదీప! మత్తారి వంశహరద
నర్గళ ప్రతాప! కుమారనంతభూప! 766

దీనిపై ననంతరాజుగారు వెంగన్న కనుకూలముగా దఁగవు తీర్చిరట! పోచిరాజు. ఓబనమీఁద బొడ్డుచెర్ల వెంగన్న చెప్పిన పద్యములు.

సీ. మహియేలుమట్లకుమారనంతాన్వయ
మూర్ధాభిషిక్తుని ముదలలేక
ఆ.................నాథ
మంత్రి శేఖరుని సమ్మతము లేక
కడుఁదిట్ట దీవించఁగాగల కొప్పోలు
వరకవి శ్రేష్ఠుల యెఱుకలేక



అనయంబుగా పుండియన్ను పన్నులు పెట్టి
మనుమేటి కాపులమాట లేక

గీ॥ కాలనష్టంబుగాఁగుంట కట్టుమనుచు
నిచ్చె లేఁబాకవారికి ముచ్చుకమ్మ
...................................
................................... 767

గీ॥ గొడుగు కాలిపోయె గుఱ్ఱంబు చనిపోయె
నాలు తొలఁగిపోయె నల్గుఁడలిగె
నూరు మాఱిపోయె నూరికి రాకురా!
ఓరి పోచిరాజ నోబ! దూబ ! 768

## గాలివాన

సీ॥ శ్రీరామ నీపాద సేవామృతంబుగా
సీసమాలిక యొందు చెప్పినాఁడ
జగతిలో నుత్పాతజంఝూసమీరంబు
విసరిన విధమెల్ల విన్నవింతు
రుద్రసంబంధియౌ రౌద్రిసంవత్సర
కార్తిక శుద్ధపేకాదశితిథి
ఏపార స్వాతి మూఁడోపాద మందున
వాయవ్యమున గాలివాన విసరె
చిటపట చినుకులు చెలఁగి యదన మాయె
ఘన మేఘములు మింటఁగప్పి నిలిచె
ప్రళయ సముద్భూతభయదజంఝూనిల
మవని గంపింపంగ నదరసాఁగె

మేడలు గోపురాల్ మిద్దెలు కోటలు
నేలపైఁ గూలెను నీళ్లఁ గలసె
పశువులు మృగములు పక్షిజాలంబులు
నెల్ల భూములయందుఁ గొల్ల లయ్యె
అష్టదిగ్గజములు నట్టిట్టు తిరిగెను
గడుశేషునకు శిరఃకంప మొదవె
రవి సోమ మండల రథములు గతిదప్పె
నక్షత్రములు పూర్వ పక్షమయ్యె
ఆవులు దూడలు సంభారవములతోఁ
జెట్లను గట్లను జేరఁబడియె
అన్నలు తమ్ములు నతివలు పురుషులు
కొడుకులు కోడండ్రు గురుజనంబు
తల్లులు బిడ్డలు తగఁ గౌగిలించుక
చలిచేత నలసట చాలఁ బడిరి
బందరు బాపట్ల పరగ నిజాంపట్న
గ్రామముల్ జలధిలోఁగలసిపోయె
పాలేరు మాచేరు ప్రబలించి కొన్నూళ్ళు
వరదను గడువడి వార్ధిఁ జేరె
అద్దంకి వినుకొండ యా ప్రాంతముల యూళ్ళు
గుండ్లకమ్మనుబడి కూలిపోయె
కందనూ లాదోని గండిగోటయు గుత్తి
కడప సిద్ధోటముల్ కలవరించె
నల్లమలంతయు హల్లకల్లోలమై
కూఁకటి వ్రేళ్లతోఁ గూలె ధరను



వెలిగొండ వృక్షాలు వెల్లిపాలయ్యెను
పొదిలె కొండను గుండ్లు పొర్లి పడియె
చిమకుర్తి కొండయు ఛిన్న భిన్నంబయ్యెఁ
గొండవీ డెంతయు బెండుపడియె
సిరిగిరి మల్లయ్య చెక్కిటఁ జెయిచేర్చె
భ్రమరాంబ చింతచేఁ బవ్వళించె
వేంకటాచలపతి విపరీత మనిపల్కె
నలమేలు మంగమ్మ యడలసాగె
ప్రధకెక్కు దేవళ్ళు పరితాపపడఁ జూచి
యూళ్ళ దేవళ్ళెల్ల వెళ్లఁబడిరి
ఎసగొని విషవాయు వీశాన్యమునఁ బుట్టెఁ
బైరులు పంటలు పాడు పడియె
పాఁతళ్ల ధాన్యముల్ నూతుల విధమాయెఁ
గలవర్తకుల కోర్కి ఘనత గాంచె
కఱవు దీఱిన వెన్కఁగడువేడ్క భూమికి
నెలమూఁడు వానలు నిండి కురిసె
వెండుగా దండిగాఁ బండెను బంటలు
వరహాకుఁ బుట్టెఁడు వసుధ నమ్మ
ఆంతట భూజను లానందమందిరి
సర్వత్ర సౌఖ్యముల్ సంఘటిల్లె

గీ॥ అహహ నీ మాయ యేమని యభినుతింతు
బొసఁగ నీ పాదమునఁ బుట్టి పుడమి ముంచె
మేలుగా నౌల మంచెఁ బాతాళగంగ
నెమలి గుండము శ్రీరంగ నిర్మలాంగ!! 769

## ఉప్పెన–బందరు

రక్తాక్షి సంవత్సరము కార్తికంబున
శుద్ధమంగళవార మిద్ధరి(త్రి
విదియనాఁడుదయంబు మొదలఁ దుషారంబు
అంతంత కెక్కువై యంతకముగ
(ప్రొద్దు(క్రుంకిన వెన్కఁబొగరై తులాసిని (?)
దానివల్లను లావుగాలి కీలి
ఉత్తరంబునఁ బుట్టి మొత్తాన పెళగిలి
కూకటి(వ్రేళ్లతోఁగూలెఁదరులు
అచలంబు లల్లాడె నవని తల్లడమందె
దక్షిణ దిశనుండి తత్క్షణమున
వారకతొల్లి దుర్వాసశాపవశాన
నమరేం(ద్రుసిరి కంధి నణఁగినట్లు
బందరుపురలక్ష్మి బలుదుర్దశల నొంది
యుప్పెనపాలయి యుడిగిపోవ
(ప్రళయ ఝుంఝూసమీరమునకుఁ దోడుగా
మెఱుపులు నుఱుములు మెండుకొనియె
లయకాలరు(ద్రలలాట నే(త్రాగ్నిగా
భగ్గుభగ్గున మంట లగ్గలముగ
పిడుగులు బడబాగ్ని పిల్లలో యనునట్లు
నిప్పులకుప్పలై గప్పుమనియె
తిమి, తిమింగిల దులి(భమి భయంకరముగ
నల్లకల్లోలమై యడరె జలధి
జలధి యాకాశంబు పుడమియన్ భేదంబు
దెలియ రాకుండఁగా దెరలె నిరులు



గుఱ్ఱాలవలె నేనుగులవలెఁ గొండల
రెక్కలవలె నెక్కువెక్కువగుచు
జలధితరంగాలు చెలరేగి ముందుగా
ముంచివేసెను గొన్ని పంచటూళ్ళు
ఏవేవి యంటేను నిరుగు గిరాల్దిండి
గిలకలదిండి యా క్రిందిదిండి
తుమ్మలసొఱ్ఱియు సమ్మలదీవియు
నుప్పగుండాలన్ని యూడ్చి పెట్టె
సరవిఁ జెంగ(లాయ స(త్రంబు చిన పెద్ద
గొల్లపాలెమ్ములు వెల్లిఁ గలిసె
మంగినపూఁడియు మఱి తవిశేపూడి
బరిశి పాచ్చాపురి బంటువల్లి
చెడముంచి యటు దివిసీమకుఁ (బవహించి
మందపాకలదాని మాలిపల్లె
పిట్టలలంకంతఁ బీకి రెండిళ్లుంచి
కోడూరు మునుపట్ల పాడుచేసి
నారాయపాలెంబు నాశంబుగావించి
భావదేవరపల్లి భగ్నపఱిచి
తలగడ దీవిని దలమున్కలుగ జేసి
మాచవరము రూపుమాపి విశ్వ
నాథ పల్లిని బిట్టుశోధించి మఱి టేకు
పల్లిని పెదకళ్లెపల్లిఁ జెఱిచి
భోగిరెడ్డిపల్లె సాగరమును జేసి
యట రెండు మాజేర్ల నపహరించి

మంగళాపురము నామమునుమాపి ముత్రాసు
పాలెము పీస్గుదిబ్బలుగఁ జేసి
పాలచెట్లడవిని బడిచల్లపల్ పెద
ప్రోలును వేంకటాపురము నదిమి
పర్వతాకారమై పైఁబొంగివచ్చిన
వెల్లువ యటకొంత వెనుకఁబడియె
ఇంతకు పదిరెట్లు హిమవన్నగములాగు
పెఱిగి సముద్రంబు విరిగిపడియె
తామసోగ్రముగ బందరు పట్టణంబెల్ల
నదియేమి పాపమో చిదిగిపోయె
మొట్టమొదట రేగి ముంచెను శివగంగ
యగ్రహారముమీఁద నాగ్రహించి
బ్రాహ్మణోత్తములిండ్లపై దిబ్బయిసుకయ్యె
గుండాలు వేసెను గొన్నిచోట్లు
కాలిఖాన్‌పేట నాకలిగొని కాల్వల
వంతెన పడవలు వార్ధి గలపె
మంటఁగలిసెఁ జింతకుంటపాలెమ్ము దే
శాహిపేట్రాదిగా జరగు పేట
లెన్నికఁ బదునెన్మి దన్నింటి నడఁగార్చె
పెద్దదొరాబ్రసన్‌పేట నడుమ
వాసికెక్కిన వైశ్యవర్యుల సరకుల
కొట్టులన్నింటిని మట్టు పెట్టె
ఉప్పు బెల్లంబులు చప్పున గరిగించె
నేతిసిద్దెలు తేనెగోతఁగలిసె



నూనె యాముదములు...............
వెల్లుల్లి యింగువ నల్లమందు
ఆకులు పోకల్ పుగాకు పెండెమ్ములు
చింతపండును బప్పు జీలకఱ్ఱ
మెంతులావాలును మిరియాల్ లవంగాలు
జాపత్రి యేలకుల్ చందనంబు
పసపు నోమంబును పాదరసము పంచ
దార కస్తూరి పన్నీరు పచ్చ
కపురము హారతి కర్పూర మగరువు
కుంకుమపువ్వు పున్గును జవాది
వెండి బంగారముల్ విలువైన నగలును
బహుమహౌషధములు భాగ్యరాసులును
ధాన్యరాసులును వస్త్రములనేకంబులు
గుర్తింపరాకుండఁ గూలిపోయె
లోబందరెల్లఁ గల్లోలంబు గావించె
కందకం బెల్ల సాగరము గలసె
కలకటేరు కచేరి తల క్రిందులైపోయె
పత్రాలు పద్దులు పరిసిపోయె
ఆ సభ నధికుఁడై యలరిన దిన వహి
పురుషోత్తమయ పుణ్యమునను బ్రదికె
సర్కారు వారి ఖజాన ముంపకమయ్యె
లైను సిపాయిలు లయముఁ బొంది
రురుతంబైన దేవరకోట సీమలో
పట్టణముల నూళ్ళఁబట్టి చూచె

సందులు గొందులు సావిళ్ళు మావిళ్ళు
డొంకలు బంకులు, పెంకుటిళ్లు
భోషాణములు గొప్ప పాషాణములు టేకు
దూలాల్ తనాబీలు దొడ్ల తెడ్లు
ఓడలు పిన్నీసు లొగినడపడవలు
దోనెలు సంగళ్లు దొప్ప తెప్ప
లడగారె చందువా లలమార్లు బీరువాల్
కారాగృహంబులు కల్లు, సార,
రూపాయి వరహాలు రూకలు నేబులు
మొహరీలు ముత్యాలు మోహణములు
కంటెలు నానులు కంకణాల్ కడియాలు
ముక్కుపోగులును చేర్చుక్కబొట్లు
నడుము వడ్డాణిముల్ నానుకోళ్ళును మంచి
రాగిళ్ళ సెల్లాలు రంగుమీఱు
కోట్ల సొమ్ములు పోయి కోళ్ళనేకలసెను
నిత్తడి సామాను లెగిరిపోయె
కంచాలు పందిరిమంచాలు పీటలు
రాటాలు బండ్లును రథచయములు
పశువులు లేగలు బఱ్ఱెలు దున్నలు
వేలకొలందిగా వెళ్లిగలసె
బందాలతోఁ గొన్నియందు నిత్రపుద్రాటి
చెట్ల మొవ్వులలోన జిక్కువడియె
పట్టెమంచాలపై పన్నుండి సతిపతుల్
వదలక కొట్టుకవచ్చు వారు



చచ్చిన పీనుఁగు సాయంబుగాఁ గొని
యుసుఱుతో నీళ్ళీదుచుండువారు
ప్రాణంబువిడి సొమ్ముపైయాశవిడలేక
దయ్యమై పీనుఁగు దగులువారు
బ్రాహ్మణ స్వాములు బ్రహ్మరాకాసులై
శ్రుతులు రాత్రులను వర్ణించువారు
ఏభయంబును లేకయే పీనుగులమీది
నగలెల్ల దోచుకొన్ తెగువవారు

* * *

గీ॥ ఈ విధమ్మును రాణెమ్మ కెఱుకసేయ
సీమలోపల రాణెమ్మ సేమ మరయ
కోటియజ్ఞ ఫలంబు చేకూరె ననుచు
మేరునగధీరు డా కలక్టేరు గారు
శవములను పూడ్చి పెట్టించె చాలవఱకు
పేదలకు నిళ్ళు గట్టించిపెట్టె మఱియు
నాదుకొనెడి బెక్కు విధముల మోదుకూరి
వేణుగోపాల ! రాధికాప్రాణలోల. 770

## రాజమహేంద్రవరము

సీ॥ లలితంపు గౌతమి లవణవారిధిగాఁగ
నా (యో ? హే ? రా ?)మగిరి సువేలాద్రిగాఁగ
మహిత పెద్దన మంత్రిమణి విభీషణుఁడుగా
మల్కినేయబు హనుమంతుగాఁగ

బాహుబలేంద్రుండు భల్లూకపతిగాఁగ
కఱకుఁదుర్కలు ప్లవంగములుగాఁగ
రాజమహేంద్రమే లంకాపురముగాఁగ
రమణతోనిభరామురాముగాఁగ

గీ॥ కనలియహితునిఁ జిత్తాపఖానువెడలఁ
ద్రోలి యాంగీరసందు నుద్ధురతఁ జూపి
సరవి నాషాఢశుద్ధపంచమి మొదలుగ
రాజ్యమేలెను నిభరామురాయ శౌరి. 771

"శాలివాహన శకవర్షములు 1485 ఆంగీరస సంవత్సరాషాఢ శు 5 గురువారమునాడు" (క్రీ.శ. 1563)

## నల్లూరు

శ్రీనాథుఁడు నల్లూరు పోగా అగ్రహారికుఁడు బుఱ్ఱాసింగయ అపండితుఁడు అనాదరింప శ్రీనాథుఁడు చెప్పిన పద్యం.

కః॥ నల్లూరి తూర్పు వీథినిఁ
జిల్లర ప్రజలెల్ల బుఱ్ఱ సింగని యింటన్
జిల్లేళ్ళును నుమ్మెత్తలు
పల్లేళ్ళును మొలచుఁగాక భద్రనరేంద్రా. 772

## బెజవాడ

సీ॥ వినరయ్య బెజవాడ విమల ప్రభావంబు
వివరించి చెప్పెద వేడ్కతోడ
నింద్రకీలాద్రిపై నింద్రతనూజుండు
తద్దయు నత్యుగ్రతపముచేసె



పందికైపోరాడి ఫాలాక్షు మెప్పించి
పాశుపతాస్త్రంబు పడసెఁదొల్లి
శ్రీపతిపండితుల్ శివదూషకులఁ జూచి
తమ తపోమహిమచే దర్పమడఁచె
అగ్నిహోత్రునిఁబట్టి యాకర్షణముచేసి
జమ్మికొమ్మను గట్టి శాపమిచ్చె
దివినుండి దేవతల్ దృష్టించి వెఱఁగంది
మాధవవర్మ ధర్మములకలరి
చినుకు చిన్నంబెత్తు ఘనమైన వర్షంబు
కరుణించి కురిపించెఁ గనకదుర్గ
ఆడి తప్పనటన్నయతి ఘనవ్రతముచే
తన సతినంటక తనువు ముదిసి
కుమ్మరగుండయ కులపత్నితోఁ గూడి
ప్రాయంబు వడసెనే భవునిచేత
జైన భక్తుఁడొకండు శంభుఁని బూజింప
బొందితోఁగై లాసమునకు నేఁగె
నిది ముక్తిసోపానమిది శంకరక్షేత్ర
మిది తీర్థసారమై యెసఁగు ధరణి

గీ॥ నిట్టి మహిమల విలసిల్లు పట్టణంబు
పరుగు శ్రీగిరికీశాన్య భాగమునను
తివిరి కృష్ణవేణీ నదీతీరమునను
గలదు బెజవాడ దక్షిణకాశి యనఁగ. 773

## జగ్గయ్యపేట బందిపోట్లు

సీ॥ శ్రీహరి కృపగల్గ జీకటి వెల్గొను
లేకున్న వెల్గును జీకటౌను
తొలుత దానికిఁబేరు దొంగలబేతవోల్
పిమ్మట జగ్గయ్యపేట యయ్యె
బహుభాగ్య భరితమై ప్రబలుచున్నట్టి యా
జగ్గయ్య పేటకుఁ జేటువుట్టె
సరవిఁ బింగళనామ సంవత్సరము కార్తి
కంబున బహుళ పక్షంబునందు
శనివాసరమ్మున పంచమతిథి నాఁడయో
పట్టపగటివేళ బెట్టిదముగ
పైశాచమహిమ దాబ్రబల తాండవమాడె
ధర్మదేవత కొండదారిఁ బట్టె
ఆర్పులు రోహిళాలావేళఁ బయనమై
దండుర్కి రూరిపై మెండుగాను
బ్రొద్దుపొద్దున వచ్చి పోలీసు సూటుపై
కదిసిరి దొద్దడి కయ్యమునకు
వెఱవక దెబ్బలు వేసిరిర్వంకల
చచ్చిరి పదిమంది సమఫలముగ
కత్తులు దూసుకోఁ గదిసిరి చోరులు
వంద జమానులు పారిపోయి
రంతట వరక త్తియందుకు పైబడి
సర్దార్ని నఱకిరి సాహసమున
గర్భనిర్భేదమౌ ఘాతలు సేయుచు
కొట్టులు పెకలించి కొల్లగొట్టి



రఖిల వైశ్యుల యిండ్ల నైశ్వర్యము హరించి
రద్దులేకుండ నాయసుర జనులు
వైశ్యకులంబున వాసికెక్కిన యట్టి
ధార మల్లయ్యయన్ దాత గలఁడు
లింగమ్మునమ్మిన భంగమ్మురాదని
యిలువీడఁడాయెను నీశ్వరాజ్ఞ
చేతిలో లింగంబు సేవించుచుండెను
కాశిబ్రాహ్మణుఁడని కాచిరతని
శివకేశవుల సొమ్ములని యెల్ల హరియించి
రెంతబంగారమో యెంత వెండొ
గమిడిపై వెల్గుచు ఘనమైన వస్త్రముల్
ధర్మముచేసిరి దండిగాను 774

గీ॥ పట్టపగలింటి వేళనే పంచుకొనిరి
కుక్క రోలెంతనాకినం గూడుగాదు
ధర్మమార్గంబు దప్పినధనము ఘనమె
దుష్టసంహార! మముఁబ్రోవు దురితదూర!

## సిద్ధవటము

సీ॥ సిద్ధవటంబున సిద్ధేశ్వరుండెప్డు
నీకొండతూర్పున నిలిచియుండు
పడమటి భాగానఁ బాటైన యూట్కూరు
శ్రీ చెన్నకేశవుల్ చెలఁగుచుండు
ఉత్తరంబున గత పత్తుక యారామ
వెంకటాచలపతి వెలుఁగుచుండు
దక్షిణంబున సర్వలక్షణవంతుండు
బుగ్గమల్లేశుండు దగ్గఱుండు

గీ॥ పర్వతము చుట్టుఁ బదివేలు ప్రతిమలెన్న
కొలఁది వెట్టంగ ఫణఫణుల్ కోటివశమె
యుగము గల్పింప గరమన్య విన్నస్వామి ?
పాలకొండ్రాయ విదితసద్భక్తగేయ. 775

## రంప

ఉ॥ రంప గణింపరాని జనరాశిని జంపెడుదుంప కాన్పిబిల్
గుంపుల పెంపు సొంపణఁపఁ గూర్చిన యాజముకొంప, దొర్ల మా
యింపు జనించురొంప ధరణీశుల టొంప, పితూరిదార్లకున్
సంపదలిచ్చి ప్రోచుటకుఁ జాలినమేరువుచెంప యిమ్మహిన్. 776

## పొన్నూరు

క॥ మన్నవ గణకవివాదము
నన్నన్నా కొండవీటి యజముల పోరున్
పొన్నూరి నంబికలహము
తిన్నంగా బ్రహ్మకైనఁ దీర్పఁగవశమే! 777

## కొన్నియూళ్ళ నియోగులు

క ॥ చేకూరును సెలపాకయు
ప్రేకటమగు దుగ్గిరాల పెదగూడూరున్
కాకాని కాకుమానును
నీకుండీ పుచ్చుకోకుఁడిల నియ్యోగుల్. 778

## బెల్లంకొండ

క॥ నల్లులచే దోమలచే
నల్లని వస్త్రములచేత నవద్రాగుడుచే



బె(న?) ల్లంకొండకుఁ జెల్లే
పల్లెల కరణాల గోడు బ్రహ్మేయెఱుఁగున్. 779

## నందవరము

సీ॥ అలపాండునకుఁ గిరీటాతనికభిమన్యు
డతనివల్లను బరీక్షితుఁ డతనికి
జనమేజయుండు నాతనికి శతానీకు
డాధన్యునకు నశ్వమేధదత్తు
డతనికి క్షేమేంద్రుఁ డతనికి సోమేంద్రుఁ
డాతని కుత్తుంగుఁడతనివలన
సార్వభౌముండును సరసుండు నందన
చక్రేశుఁడరివీర జయవిహారి

గీ॥ యాత్మనామాంకమున నొక్కయగ్రహార
మెలమిఁజేసెను నేనూఱునిండ్ల విప్ర
గోత్ర సంఖ్యయుఁ బదుమూడు కొమరుమిగుల
వారిఁ బ్రోచును చముడాంబవనజనేత్ర. 780

సీ॥ నందాపురీవిప్రనాడు లేనూటికిఁ
గోమరొప్పఁ బదుమూడు గోత్రములకు
శ్రీవత్స శత కౌశిక వసిష్ఠాత్రేయు
లలగోత్రముల వృత్తు లలరు వెరసి
హరిత భరద్వాజు లవి రెండుగోత్రముల్
నలువది నలువది వెలయుచుండు
కాశ్యపమౌని భార్గవకుత్స మౌద్గల్య
గౌతమాగస్త్య సంవీతహవ్య

గీ॥ లేదుగోత్రంబులకు వృత్తు లిరువదేసి
ఇట్టి............చముదేశ్వరమ్మ

మనకుఁ గులదైవ మమ్మహాజనమునకును
నమ్మహాదేవి కరుణింప నలరినారు. 781

సీ॥ శ్రీరమారమణీయ శృంగార సౌఖ్యంబు
అలతూరుపునను బద్మాకరంబు
దక్షిణాస్థలి గదాధరుఁడు పావనమూర్తి
ధర్మాత్ముఁడగు జనార్దన విభుండు
పశ్చిమంబునను సౌభాగ్యసంపదలిచ్చు
వివిధోక్తులకు దీవి వింధ్య శిఖరి
ఉత్తరంబునను దా నుడురాజబింబాస్య
చముడాంబయను మహాశక్తిగలిగి

గీ॥ నందవరమున శోభిల్లు నగర మపుడు
మొనసి యేనూఱు విప్ర సమూహమునకు
గరిమతోడుతఁ గీర్తి ప్రఖ్యాతిగాఁగ
దానమిచ్చెను నాచంద్రతారకముగ. 782

సీ॥ భువిలోన నేనూఱు భూసురోత్తములకు
నవవిధాన పురమ్ము నందపురము.
ఘనజనార్దనమూర్తి కరుణా కటాక్షేక్ష
ణక్షణ.............నందవరము
గుఱుతుగాఁ బదుమూఁడు గోత్ర పావనులకు
నవ్యసంపదురము నందపురము
చౌషష్టివిద్యల చముడాంబకిరవైన
సుందరపురము శ్రీనందవరము

గీ॥ ధారవోసెను గాశిలో ధర్మశాలి
యోగవాగాలు తనపంపు నొప్పుకొన్న



వినుతిచేసెను సురచిర విప్రవరుని
శత్రుసమవర్తి నందన చక్రవర్తి. 783

సీ॥ వేదశాస్త్రములకు విశ్రమస్థానంబు
సౌజన్యపదవికి జన్మభూమి
ఆచార సంపద కావాసగేహంబు
గుణనిధానములకు కులగృహంబు
కలిత చతుష్షష్టి కళలకు నిలయంబు
బాంధవాశ్రితులకుఁ బట్టుఁ గొమ్మ
మలయు నీతి విచార మహిమకు పుట్టిల్లు
వితరణ స్ఫూర్తికి వీడుపట్టు

గీ॥ నందచక్రేశ హస్తారవింద దత్త
వర్ణ్యమానాగ్రహార ప్రవర్థమాన
భాసమానాగమాచార భూసురంబు
నవ్య విభవాకరంబు శ్రీనందవరము. 784

సీ॥ తడిదోవతులు సభస్థలమున రా నను
ష్ఠానులై వత్తు రేజగతిసురులు
పంపు సేయని యోగవాగాలు నందుని
పంపుసేయించి రేభవ్యమతులు
మును కాశినుండి చాముండీమహాశక్తి
వెంటరాఁ బరగిరే విప్రవరులు
ఎండిన రావిమ్రానిగిరింపఁగాను మం
త్రాక్షతలిడిరేమహాజనములు

గీ॥ చాగురే వారు వేదశాస్త్రప్రవీణ
కావ్యనాటకాలంకార గాఢమతులు

భవ్యగుణములఁ గలియుగ బ్రహ్మలౌర
నందవర విప్రవర్యు లానందయశులు 785

## చముడాంబ

సీ॥ కాశికాపురినుండు ఘనవిప్రవర్యులు
సాక్షికివచ్చు కటాక్ష మేది ?
కవితా మహత్త్వంబు కాళిదాసున కిచ్చి
ప్రతిభ చెన్నొందిన ప్రజ్ఞ యేది ?
ఢక్కా నినాదంబు వ్రక్కలు చేసుక
శ్రీనాథుకిచ్చిన చెల్వమేది ! ?
నందపురాంగనా నయ శిరోరత్నమై
పూజలుగొన్నట్టి భోగమేది ! ?

గీ॥ అట్టిశ క్తివి నీవిట్టులణగియుండఁ
గారణంబేమి సెలవిమ్ము కరుణతోడ
నందవరమందు నెలకొన్న నయకదంబ
సరససద్గుణ నికురుంబ చముడమాంబ. 786

సీ॥ చటుల రాక్షసనాథ శల్యంబులన్నియు
ఫెళ ఫెళ ఫెళ ఫెళ ఫెళను విరిచి
కఠిన దానవ వీరకంఠ రక్తంబులు
గళ గళ గళ గళ గళను ద్రావి
మత్త దైత్య వ్రాత మత్తామిషంబులు
గర గర గర గర గరన నమిలి
ఘోరాసురశ్రేష్ఠ గురు కళేబరములు
జిర జిర జిర జిర జిరన నీడ్చి



గీ॥ కొట్టి కోలాహలంబాడి మట్టు పెట్టి
నట్టినీలావు వినుతింప నలవి యగునె
నందవరమున నెలకొన్న నయకదంబ
సరససద్గుణ నికురుంబ! చముడమాంబ!! 787

## దామగట్ల

కంది పురుషోత్తమ కవి–త్రాగుబోతని గ్రామస్థులు గర్హింపగా, నాతని శాపముచే గ్రామము దగ్ధమైనట్లును, తర్వాత, స్థలముమార్చి ఆ పేరనే తర్వాతి వారు కవిని శాంతపఱిచి గ్రామము నిర్మించుకొన్నట్లును స్థలజ్ఞులవాడుక.

ఆ.వె॥ కపిల మునివరేణ్యు విపులకోపాగ్నిచే
సగరవంశమెల్ల సమసినట్లు
పొగలురేగు కంది పురుషోత్తముని దృష్టి
దామగట్ల పురము దగ్ధ మయ్యె. 788

## నెల్లూరు

సీ॥ పాలించు నేవీట బ్రహ్మాదివంద్యుండు
లీల మూలస్థాన లింగగురుఁడు
దీపించు నేవీట దేవాలయంబులు
ధావళ్యనవసుధా ధౌతములయి
ప్రవహించు నేవీట బ్రహ్మాండకర్పరం
బొరసి మిన్నులుముట్ట నున్న పెన్న
చెలువందు నేవీటఁ జిరకాలజీవన
స్వర్ణాలచెఱువు సంపూర్ణ మగుచు

గీ॥ ప్రజలకును మన్కి సకలసంపదల కున్కి
భోగములవీడు సురపతిపురికి నీడు

నమ్మికలటెంకి వైరులఁ జిమ్ముకొంకి
భాగ్యనికరంబు నెల్లూరుపట్టణంబు. 789

సీ॥ ఏ పట్టనంబున నెన్నంగ మున్నూట
యఱువది దేవాలయంబులుండు
ఏ పట్టనంబున రూపింప నన్నియు
నీరేడు బావు లింపారుచుండు
ఏ పట్టనంబున నెల్లమానవులుఁ బ్ర
శస్తిగాంచిరి నెఱజాణ లనఁగ
ఏ పట్టనంబున నేకాలమును బెన్న
కాల్వలచేత ముక్కాఱుఁ బండు

గీ॥ శివునికృపఁ బుట్టె వేమాలసెట్టిబావి
పరఁగ జన మెల్ల నఱుఁగ నేపట్టనమున
నట్టిపట్టన మిలను సౌఖ్యముల కునికి
పట్టనందగు నెల్లూరు పట్టనంబు. 790

సీ॥ చరియించితిని గాని జగము మూలస్థాన
పరమేశ్వరునివంటి భక్తవరదు
విహరించితిని గాని వివిధభూములు[1] పల్లి
కొండనాథునివంటి కూర్చువేల్పు
పరికించితినిగాని బహుదేశము లనంత
పద్మనాభునివంటి భవ్యమూర్తి
వీక్షించితినిగాని విశ్వమంతయుఁ బెన్న
నదివంటి దివ్య పుణ్య స్రవంతి

1. పల్లి కొండనాఁథుడు – శయనించినస్వామి – రంగనాథుఁడు.



గీ॥ అరిగితిని గాని దేశదేశాంతరముల
వేదగిరివంటి పావనోర్వీధరంబుఁ
గాన మిన్ని విశేషముల్ గలిగి ధరఁ బ్ర
సిద్ధి కెక్కెఁ ద్రివిక్రమసింహపురము. 791

సీ॥ ఆ పట్టణంబున నమరంగఁ దూర్పున
మా కందచందన మహితవనము
ఆ నగరంబున కటు దక్షిణంబునఁ
జెలువారు వేమాలసెట్టిబావి
ఆ యూరి పడమట నంభోజ రాజిచేఁ
బ్రాకటంబైన తటాక మమరు
ఒప్పారు నవ్వీటి యుత్తరదిక్కున
మున్నీటి కెదురైన పెన్న దనరు!

గీ॥ కలిమి నా రాజధాని మార్గంబు నెన్న
బహుళ గంధర్వ సింధుర బంధురంబు
రతనపుం బొమ్మ లప్పురి రమణు లనఁగ
వినుతి కెక్కెను నెల్లూరి విభవ మహిమ 792

శా॥ మల్లెల్ మొల్లలు సేమమా? శుభములా మా కందముల్ జాజులున్
మొల్లం బారక యుందునా? సుదతులున్ మోదంబు వాటింతురా?
విల్లుం గోలయు (యేమరూధమరునా?) వేమాల నూయున్నదా
నెల్లూరన్? బెదసోమ వీథిన కదా నీరాక జైవాతృకా! 793

## తంజావూరు

క॥ పురముననుండే కవులే
చొరఁబడి తినఁ గూడులేక చుంబించంగాఁ

బరకవు లేటికి వచ్చిరి
తరమెఱుఁగక యరికివిరికిఁ దంజాపురికిక్. 794

కII లేదా తంజావూర బ
ళా దొరలున్నారు లంజెలకు మాబోంట్లం
జేదేవా రెవ్వరు నీ
యాదరణ వినాగ నరసయప్రభునాగా! 795



# పరిశిష్టము

సీII నిపుణత రాజ్యవినీతుఁడు గాఁడేని
నేలయేలెడువాఁడు బేలగాఁడె
సంగీత సాహిత్య సరసుఁడు గాఁడేని
కృతి సెప్పువాఁడు దుష్కృతుఁడు గాఁడె
కుశలత సతిమతి విశదుఁడు గాఁడేని
విటుఁ డనువాఁడు దుర్విటుఁడు గాఁడె
మాధవ శ్రీపాదమగ్నుండు గాఁడేని
మోక్షార్థి ననువాఁడు మొప్పెగాఁడె

గీII అతుల రాజ్యనీతి యతుల కావ్యసుశక్తి
యంగనానురక్తి యచలభక్తి
రతుఁడుగానివాడు పతిగాఁడు కృతిగాఁడు
కామిగాఁడు మోక్షగామికాఁడు[1]. 796

సీII వాలము సులిచియు నేలఁ గాళ్లణఁచియు
ధాత్రిపైఁ బొరలియుఁ దాల్మివిడిచి
వదనంబు దెఱచియు నుదరంబుఁ జూచియుఁ
బెక్కుపాటునఁబడ్డఁ గుక్క కొక్క
కడిమాత్రమన్న మాఁకలిదీఱ నిడఁబోరు
నాగంబునకుఁ బ్రార్థనంబుతోడ
కబళశతంబులు కరమున కందీయ
నాఁకలిదీఱఁగ నదిభుజించు

1. పొదలకూరునుండి మైనంపాటి హనుమంతరావుగారు సేకరించినది.

గీ॥ ఎంతవేఁడిన హీనున కెవ్వ రీరు
ఇచ్చిరేమియుఁగడుఁ గొంచె మెచ్చు లేదు
ఘనున కూరకయుండినఁ గాంక్షదీఱ
గురుతరార్థంబు లిత్తురు ధరణిపతులు. 797

గీ॥ పౌరుషజ్ఞానకీర్తులఁ బరఁగెనేని
వానిజన్మంబ దొక్కపూ టైనఁ జాలు
నుదరపోషణమాత్ర మీయుర్విమీఁదఁ
గాకి చిరకాలమున్న నేకార్యమగును? 798

## నియోగులు

గీ॥ భాగ్యవశమున బుద్ధిసంపన్నుఁ డగును
బుద్ధిబలమున నృపులకుఁ బూజ్యుఁ డగును
నృపులు మన్నింప నయకళానిపుణుఁ డగును.
పూని రాజ్యము నడుపఁ బ్రధానుఁ డగును. 799

ఉ॥ వ్రాలివిగోఁ గనుంగొనుము వన్నియమీఱఁగ వ్రాలకేమి నా
బ్రాలు సుధారసాలు కవిరాజులకెల్ల మనోహరాలు వ
జ్రాలు సరస్వతీవిమల చారుకుచాగ్రసరాలు చూడఁ జి
త్రాలు మిటారిమోహనకరాలు నుతింపఁ దరంబె యేరికిన్? 800

ఉ॥ మేదినినాథుఁ డల్గినను మించినకార్యము చక్కసేయ న
మ్మోదమెలర్పఁగా గణకముఖ్యునిసఖ్యము లెస్స యెట్లనన్
ఆదటఁ గాలుఁడల్గియు **గతాయు** వటన్నను జిత్రగుప్తుఁ డా
**'గా'** దొలగించి **'శా'** మొదట గ్రక్కునవ్రాసి సజీవుఁ జేయఁడే. 801



చ॥ హరిహరి! యేమి సాంబశివ ! అయ్య ! భయంపడి పల్కనోడెదన్
అరమర లేల పల్కు భవదగ్ర పురంధ్రి పెదక్క యేదయా ?
సిరికిని దానికిం బడక చీఁదర యెత్తగఁ జింతపల్లెలో
వరకరణాలయిండ్లకడ వారక యున్నదయా యుమాపతీ! 802

క॥ అధికార మబ్బినప్పుడు
బుధులు ప్రమోదించి వీఁడె పురుషోత్తముఁడం
చధికంబుగ గొనియాడెదు
విధమున వర్తింపఁ దరమె వేల్పులకైనన్ ! 803

మ॥ విధిసంకల్పముచే నొకానొకఁడు తా విశ్వంబుపాలించుచో
బధిరం బెక్కువ చూపు తక్కువ సదా భాషల్ దురుక్తుల్ మనో
వ్యధతో మత్తతతోడ దుర్వ్యసన దుర్వ్యాపారతం జెందు న
య్యధికారాంతమునందుఁ జూడవలదా యాయయ్య సౌభాగ్యమున్ 804

క॥ ఉద్యోగ మొదవినప్పుడు
సద్యోమద మొదవి పూర్వసరసత లుడుగున్
విద్యావంతున కైనను
విద్యాహీనునకు వేఱె వివరం బేలా ! 805

సీ॥ బళిబళీ ! మీ తాత బల్లెంబు చేఁబూని
పుల్లాకు తూటుగా బొడిచినాఁడు
ఎద్దుచ్చపోయంగ నేఱులై పాఱంగ
లంకించి లంకించి దాటినాఁడు
కలుగులోనూ కప్ప గఱ్ఱుగఱ్ఱు మనంగ
కట్టారి తీసుక గదిమినాఁడు
నాగలాపురికాడ నక్క తఱ్ఱుకురాగ
తిరువళూరూ కాడ తిరిగినాఁడు

ఎలుకయెదురుకు రాగ నీటె చేతనుబూని
యేడాఱుబారులు యెగిరినాఁడు

గీ॥ ఔర! వీని పరాక్రమం బద్భుతంబు
.......................................
.......................................
................చిన్నప క్ష్మాతలేంద్ర! 806

## పునుగుపాటి వెంకన

క॥ చెన్నగునియోగి కవితల
మిన్నా వైదికుని కబ్బమె నిజంబు సుమీ
తన్నుకు చచ్చినగానీ
విన్నావా పునుగుపాటి వెంకనమంత్రీ![1] 807

## వెలుగోటివారు[2]

ఈ వంశమున సర్వజ్ఞ సింగభూపాలుఁడు, విద్వత్కుమార యాచమ నాయఁడు మొదలగు విద్వత్ప్రభువులు వెలసినారు. విద్వత్కుమార యాచమ నాయని వైదుష్య దాతృత్వములకు ద్యోతకముగా నీ క్రింది విధమున నొక కథ యున్నది.

విద్వత్కుమార యాచమనాయఁడు ప్రభుత్వము చేస్తుండగా, ఒక విద్వాంసుఁడు ఆస్థానమునకు వచ్చి శాస్త్ర ప్రసంగం చేసి సంస్థాన పండితులను వోడగొట్టెను. కుమార యాచమనీడు మిక్కిలి సంతోషించి ఏమికావలెనో కోరుకొండని పండితుని అడిగెను. ఆయన దేవర సంస్థానములో నా మనో వృత్తికి చాలినంత

1. బుర్రా శేషగిరిరావు సేకరించినది (1915)
2. ఈ వాక్యములను పు. 130 లో వెలుగోటివారిపద్యములకు ముందు చేర్చి చదువుకోవలెను.



భూమి దయచేసి, నా నిత్యకర్మానుష్ఠానములు చక్కగా జరిగేటట్లు, అనుగ్రహించ వలసినదని కోరెను. ఏ వూళ్ళో ఏ పొలముకావలెనో, మీరే సస్యగర్భముగా చూచుకొని వచ్చి చెప్పితే సర్వమాన్యముగా దానపత్రము వ్రాయించి యిప్పిస్తున్నామని రాజుగారు సెలవిచ్చిరి. ఆ పండితుఁడు వారి తాలూకాలో తీర్థంపాడనే వూరికిపోయి అక్కడ జలసమృద్ధి, స్థల సమృద్ధి చూచుకొని తన స్నాన సంధ్యాద్యనుష్ఠానములకు, అనుకూలంగా ఉన్నదను కొన్నాఁడు. ఆ వూటి చెఱువుకు దక్షిణపు తట్టు పొలం తనకు వనరుగా భావించెను. రాజుగారి దగ్గిరకు వచ్చి, ఆ సంగతి విన్నవించి అక్కడి ఆ చెఱువు దక్షిణపు చేనుకు దాన పత్రము పుట్టించుకొనెను. ఆ వూరికి బోయి గ్రామస్తులతో మాట్లాడి గ్రామకరణమును సంతోషపెట్టి తన దానపత్రము చూపించెను. "అయ్యో బ్రాహ్మడా! చెఱువుకు ఉత్తరపు చేను సుక్షేత్రమై వుండగా వట్టి చౌటిపట్టు, దక్షిణపు చేను కోరుకొన్నావేమిటి? మాతో చెప్పక వెఱ్ఱిపని చేస్తివి" అని కరణం చెప్పేటప్పటికి, ఆ పండితుఁడు "సరి కుదురుతుందిలే" అని లోలోపల సరిచూచుకొని, "అయ్యా! నేను కోరినదిన్నీ అదేనండీ! అట్లాగే వ్రాయించినా" నని ఆయనకేదో చెప్పి లోబరుచుకొని, చెఱువు కుత్తరపు చేనే విడుదల పెట్టించుకొన్నాఁడు. దాన్ని సాగుబడిచేసే రైతును వెళ్ళగొట్టి తన సేద్య గాళ్ళను చొప్పించి తగవు సాగించినాఁడు. అంతట ఆ భూమి కాపు రాజుగారి దగ్గిర ఫిర్యాదు చేసుకొనెను. పిలిపించి, "యిదేమిటి? మీరిట్లా చేయవచ్చునా?" అని రాజుగారు పండితుణ్ణి అడిగిరి. "తమరు దాన పత్రంలో వ్రాయించిన ప్రకారం చెఱువు వుత్తరపు చేనే నేను లోబరుచుకొన్నాను. నా తప్పేమి? అని పండితుఁడనెను. స్వయము పండితుఁడు గనుక ఆ రాజు, "ఓహో! చెఱువు వుత్తరపు చేననగా ఏ చేనుకు చెఱువు వుత్తరముగా వున్నదో ఆ చేనని అర్థము చేసినాడు సుమా" అని గ్రహించి "బహువ్రీహిచేస్తిరా?" అనెను. "దేవర వారు దయచేసిన భూమి బహువ్రీహిగాక అల్పవ్రీహి కావచ్చునా" అని ఆ పండితుఁడు చమత్కరించెను. బహు వ్రీహి అనగా హెచ్చు ధాన్యము కలది. బహువ్రీహి అనే సమాసమున్ను అర్థము. విద్వత్కుమార యాచమ నాయని వారు పరమానందము చెంది "మునుపు

యిచ్చినది అబద్ధము ఇప్పుడు ఇచ్చినది నిబద్ధి అని మెచ్చి అట్లాగే మార్చి యిచ్చి సంసారినిన్ని సమాధానపరిచి పంపెను"

వీరి చాటుపద్యములు పరశ్శతముగా నున్నవి. మచ్చునకుఁ గొన్ని మాత్ర ముదాహరించెదను. వేంకటగిరి ప్రభువులు వాని నన్నిటిని ముద్రింతురు గాక!

### మట్లవారు – ఎల్లమరాజు[1]

సీ॥ చక్కఁగా నఱకవా చొక్కనాథుఁ డెఱుంగు
మీరి వైరుల నెలదనూరికాడ
కొట్టవా దాపెన గొర్లుగా పోలిలో
రణభూమి పోతు కొండ్రాయనిగని
చెండవా పొత్తపినుండి పారగఁబాఱ
చెండి వైరులు నీరుకొండలెక్క
కొండూరి మలలమ్మకును బ్రీతిగాఁ దోలి
కొట్టించవా తలల్ గుట్టలుగను

గీ॥ అహహా! గుఱ్ఱాలు గొడుగులు నందలాలు
విడిచి పారగ బాఱగ వెంటనంటి
సమరనిశ్శంక మట్ల వంశ ప్రధాన
భాగ్యముల కెల్ల కోన భూపాలుయెల్ల![2] 808

1. మట్లవారిని గూర్చిన చాటువులివి మరికొన్ని శ్రీప్రభాకరుల సేకరమున గలవు. మాకడనున్న వ్రాత ప్రతి పాఠమునుబట్టి వీనినిట్లు కూర్చినాము. ఈ సందర్భమున మట్లవారినిగూర్చి ఆంధ్రపత్రికలో (1944) ని ప్రభాకరుల వ్యాసాంశములు చూడదగును. వీని నీ శీర్షిక క్రింద పు. 135లో ప. 266 తర్వాత చేర్చి చదువుకోవలెను.

2. వెంకటపతి రాయలనుగూర్చి లోకల్ రికార్డ్ వార్తలను నుద్ధరించుపట్టున 30–4–45 ఆంధ్రపత్రికలో ప్రభాకరులు ప్రకటించిన వ్యాసాంశమున నీ పద్యము గలదు.



### తిరువెంగళనాథ రాజు

సీ॥ గుత్తి దుర్గాస క్తి గూడిన మన్నీల
పోకార్చె నే రాజు......పరచి
అర్చి పోరఁగ కొల్లలాడించె నేరాజు
పటుశక్తి ఉదయాద్రి పట్టణంబు
సాధించె నేరాజు చలపట్టి భుజబలో
ద్యల్లీల పోరుమామిళ్లపురము
కామలాపుర భయంకరవప్ర మేరాజు
విక్రమక్రమ రూఢి నాక్రమించె

గీ॥ నతఁడు తగు బద్దెవోల్ పట్టణాభిధాన
మాతృ నామైక లక్కమాంబాతటాక
వేంకటేశ ప్రతిష్ఠాది వివిధ సుకృత
శాలి తిరువెంగళ క్షమాపాలమౌళి. 809

సీ॥ బిరుదు శత్రులమేన పెట్టు సొమ్ములెకాని
పెట్టరు నీవద్ది భట్టువారు
హెచ్చువీరుల దోచి తెచ్చుకోకలెకాని
కట్టరు నీ వద్ది కటికవారు
ప్రత్యర్థి యర్థియై పట్టమిచ్చినగాని
అందరు నీవద్ది అడపవారు
మదవైరి చర్మంబు పదును సిద్దలెగాని
పట్టరు నీవద్ది పంజువారు

గీ॥ అవుర నీయంత ఘనుని దిగంత....
గొలిచి బ్రదుకని మన్నీలు కూళ లహహ

సమరనిశ్శంక మల్ల.....శాసనాంక
లలితగుణసాంద్ర తిరువెంగళక్షితీంద్ర ! 810

సీ॥ సురుమాయి బిరుదు భాసురలీల నీకిచ్చె
రాయలు నీ పరాక్రమము మెచ్చి
కనక తప్పెట హెచ్చు గనుక నీ కిచ్చెను
పట్టభద్రుఁడ భవద్బలము బొగడి
మలహరి వైరిసీమలు హరించిన సెల
విచ్చి నీకిచ్చెను విలసితముగ
మీనాంక మఖిల భూమీనాంక మిదె నీకు
గెలిచివచ్చిన నాడె కృప నొసంగె

గీ॥ మఱియుఁ దానెక్కు తేజీల మత్తకరుల
నిచ్చి కట్టాణిముత్యాల కుచ్చులొసఁగె
పసుపుపావడ కర్ణాట పతి యొసంగె
లక్షణోపేంద్ర తిరువెంగళ క్షితీంద్ర ! 811

సీ॥ ఇభరామ మదసామజేంద్రుల గడిదాటి
రానీదు నీదు వీరధ్వజంబు
ఉదయాద్రి తురగాద్రి మొదలైన గిరులను
వేటాడు నీడాలు విక్రమమున
సింహాసనం బెక్కి చెలగి రాయలచేతఁ
గొన్నది పూజ నీకులపతాక
కొలువని పాటిల గూడేల దొరలను
మేతగా మేయు నీ కేతనంబు

గీ॥ విజయ సింహంబు గనుక నీ భుజబలంబు
రాయమన్నీలు సన్నుతుల్ సేయువారు



మల్లకులభోజ బాపురే మగల రాజ!
లక్షణోపేంద్ర తిరువేంగళక్షితీంద్ర! 812

సీ॥ ప్రకటించి వేంకటపతి దేవరాయలు
ఘనతమించిన రాజవనుచుఁ బొగడి
మదపుటేనుంగులు మంచితేజీలును
పొందైన నవరత్న భూషణములు
సింహడాలు పసపుజిగిమించు పావళ్ళు
కనక తప్పెటలు బంగారునైజ
..........టెక్కెము వీరమలహరి మొదలైన
బిరుదులు నీకిచ్చె పెంపుసేయ

గీ॥ మెలఁగినాఁడవు మన్నీలు మెచ్చగాను
మహితసత్కీర్తిధౌరేయ మల్లరాయ
కలిగె నీసాటి హైదరగండ బిరుద
లక్షణోపేంద్ర! తిరువేంగళక్షితీంద్ర! 813

చ॥ పదరి కుమారనంత రణభార్గవ ని న్నెదిరించుమాత్ర కన్
జెదరి తళుక్కునన్ చికిలి చేసిన తావక ఖడ్గరాజమున్
కదనములోన దర్పణముగా దలపోసిరొ కాక యుండినన్
మదవదరాతి కోటులకు మాటికి పండ్లిగిలించ నేటికిన్? 814

## కొమార అనంతరాజు

క॥ బసవన బోయఁడె బసవఁడు
బసవనిపై నెక్కినట్టి భవుఁడవు నీవే
కసవైరి వెలమలందఱు
రసికాగ్రణి మల్లనంత రణహనుమంతా! 815

కII బసవన బోయఁడె వెలమల
కసిబిసిగా నతికినట్టి కండలు యెగయన్
బిసబిస వడసెను గ్రద్దలు
రసికాగ్రణి మట్లనంత రణహనుమంతా! 816

సీII కలకడ పట్టణ క్రమ దక్షిణాశల
గుండ్లూరు సంగ్రహాకుంత విభవ
వేమువెల్లీ పురీ విజయధాటీధుర్య
అనిమెలపాలగిర్యరివిదార
చెప్పలిశాత్రవ సేనా విభంజన
తంగేడుపల్లి సాధన సమగ్ర
పిగిలేటికారి రిపుభేదనోగ్రచమూప
అతుల కుమాళ్ళకాల్వరివిదూర

గీII మాధవర శత్రుసంహార మహిత తేజ
శెట్టి పలిసాల సాధన సిద్ధ శౌర్య
ఉదయగిరిదుర్గ రిపు భయదోగ్రయాత్ర
మహిత మహికాంత మట్లకుమారనంత. 817

సీII నేత్ర యుగ్మము మూసి నిర్జీవులైనట్ల
నుర్వి సాగిలబడి యున్నవారు
వెన్నంటి సుడిసిన వికృతాననములచే
వెఱచి మ్రొక్కుచు పూరిగఱచువారు
దోపిచ్చి కుళ్ళూరి దోవలు గానక
దిసమొలచే చెడి తిరుగువారు
తలఁక్రొవ్వి దామర్ల ధర్మండు తమయిండ్ల
పట్టార్చునని తెగి తిట్టువారుఁ



గీII బట్టుబడువారు గాయాలబడినవారు
బడలువడువారు ప్రాణము విడుచువారు
నైరి (వైరులు) మట్లకుమార నంత
విభుని యెలగోలు మూకచే విరిగినపుడు 818

సీII సాధించితివి మహాశ్చర్యంబుగాను సం
గ్రామ దుర్జయ శత్రుభూములెల్ల
చేసితి దానముల్ భూసుర ప్రతతుల
కారూఢి దారిద్ర్యహతముగాను
సమకూర్చితివి శేషశైల భర్తకు మహా
కైంకర్య విధులు లోకములు పొగడ
ప్రబలించితివి దేవభవన భూముల(ఘన)
ప్రాకార గోపుర భవనసమితి

గీII చెలఁగి సత్కవివరులెల్ల సిరులదొరల
నెంతగల్గిన చెప్పుదు రంత సేసి
నిజము వర్ణింప శక్యమే నీ ప్రతాప
మహిమ ధర్మంబు మట్లకుమారనంత! 819

సీII ఏ రాజుముత్తాత ధారుణి గైకొనె
ధీరుఁడై తనదు కఠారిమొనను
ఏ రాజుతాత.....దుర్వారదోర్బల
శ.....లో రావిశ.............
ఏ రాజుతండ్రి...........
................దునేదార్లమీద
ఏ రాజు తనకెందు నెదురులే కేలెను
కువలయంబున రాజకులమునెల్ల

గీ॥ అనుచు నీభట్లు దిక్కుల వినుతిసేయ
సున్నమన్నీలు రాజులు నిన్ను గొలువ
నీకు శరణని ప్రాణముల్ నిలుపుకొనిరి
మట్ల తిరువెంగళేంద్రకుమారనంత ! 820

సీ॥ వెంకటాచలమున వెలయు గోపురములు
పూని కట్టించినపుణ్యుఁ డితఁడు
వితత తులాభార విత్తంబు ద్విజులకు
దానమిచ్చిన యట్టి ధన్యుఁడితఁడు
ప్రత్యర్థు లర్పించు బహుళార్థ కటకముల్
భటకవీంద్రులకిచ్చుధన్యుఁ డితఁడు
దొరమన్నెరాజులు వరదునేదా ర్లెంచ
రాయపట్టము నిల్పు రాజితండు

గీ॥ రాజదేవేంద్ర విక్రమ రాఘవేంద్రుఁ
డనుచు జనులెంచ మించి తా నఖిలదిశల
వినుత గుణవంత రిపుభీమ విజయకుంత
మహిత మహికాంత మట్లకుమారనంత ! 821

సీ॥ మించి యుద్ధతి గబళించెగా మత్తారి
వీరుల మెదడు గుండ్లూరియొద్ద
గమకించి తుమురుగా నమిలెగా శత్రుభూ
పతుల యమ్ముల వేముపల్లి పజ్జ
కృపలేక జుర్రెగా రిపుల రక్తంబులు
అనిమెలపాలగిర్యవనిలోన
కసిబోక మెసవెగా గర్వితాహిత మాంస
ఖండంబులు కుమాళ్లకాల్వ చెంత



గీ॥ యీ కరణి, గొన్ని క్రీడల గాక యిపుడు
దలఁప నటువంటి వేడ్కలఁదనివిఁ బొంద
నేరదట పెద్ద దయ్యమా నీకతారి
ఘోర జయవంత! మట్ల కుమారనంత! 822

శా॥ శాంతిన్ మద్గుణ దోష సంఘముల నెంచన్‌బోకు కారుణ్య సం
క్రాంత స్వాంతమునన్ శుభాన్వితునిగా గావించి పోషించు ధీ
మంతా! మట్లకుమారనంత! నృపసమ్య గ్వాక్ప్రసూనావళీ
కాంతంబై తగు నీ యుదాహరణమున్ గల్పించి పూరించితిన్[1] 823

సీ॥ దురములో రావిళ్ల దొరలను దెగ దీర్చు
నవలీలగా మట్లనంతనృపతి
కందనోలను రాయకార్యంబు లీడేర్చు
విజయుఁడామట్ల తిర్వేంగళుండు
తతతులాభారాది దాన సంధానుండు
అరయ మట్ల కుమారనంత శౌరి
మార్కొన్న శూరుల మస్తకంబులు దుంచె
మట్ల రాజయ్య తా మహిమచేత

గీ॥ పరఁగ నందరి మీఱి సౌభాగ్యములను
గరిమ నమరంగ జేజచే కరితురంగ
భూషణంబులు తగనంది బొల్పు మీఱె
మట్ల వేంకట రామ భూమండలుండు. 824

---

1. అధిక పద్యము లివి మూడును (821, 822, 823) మట్లకుమార అనంత రాజును గూర్చి ప్రభాకరులు 29-7-1994 ఆంధ్రపత్రికలో కూర్చిన వ్యాసాంశమున గలవు. సం॥

## పూసపాటివారు[1]

కు॥ కరకరి నీబిరుదులు విని
వరయుదమని వరయఁజూచి వరయనిరాజుల్
తరముగను వారితాతల
తరముల నీబంటు బొజుగు తమ్మయరాచా! 825

కు॥ నీ బిరుదులు విని నాలయ
లాబూబులు తారు మన్నీలమనుచుఁ దుదిసా
గూబరపడు చొదిగుందురు
ద్రాబలవలెఁ బూసపాటి తమ్మయరాచా ! 826

## సాయనేనివారు[2]

మ॥ జయశాలైన ఘనుండు రావెళకులేశ స్వామికొండప్పకున్
నయవాగ్జాలత బిర్దు భట్టని కడున్ నానాదితాళింగ మ
న్ని య సంఘంబులు రాయలున్ నెఱుఁగిదన్మె చ్చంగరి (?) పూరుషా
హ్వయు డాధన్యు కుమార బాపసుకవిన్ నీవాడనం జూడు మీ
దయతో సాయపనేని వెంకటపతీంద్రా! మన్నె సంక్రందనా!827

## పెమ్మసానివారు[3]

సీ॥ సత్కవి కృతకావ్య శారదాదేవికిఁ
బాయకుండెడు రచ్చపట్ట భట్టు

1. ఈ పద్యములను ఇందలిపుట 139 లో ప. 284 తర్వాత చేర్చిచదువుకోవలెను-సం॥
2. శ్రీ ప్రభాకరుల వ్రాతప్రతులనుండి గ్రహించిన ఈ పద్యమును పుట 145-ప 305 తర్వాత చేర్చి చదువుకోవలెను - సం॥
3. శ్రీప్రభాకరుల వ్రాతప్రతులలోనున్న అపరిష్కృత పాఠముగల పద్యములివి. యట్లే గ్రహించితిమి. వీనిని పుట 146 లో - ప. 308 తర్వాత చేర్చి చదువుకోవలెను-సం॥



రాజవర్యుల కీర్తి రమణి నాకంబను
మేడమీదికి నెత్తుమెట్టు భట్టు
జయలక్ష్మి వరియించు సమరశూరులఁ జేసి
ప్రస్తుతింపఁగ వాతరట్టు భట్టు
మంగళపావన మహిమోత్సవము దాల్చి
పృథుగుణంబుల నిల్పబెట్టు భట్టు

గీ॥ కాన మీవంటి సత్కీర్తికాములైన
ప్రభువులకు నెల్లఁ జేపట్టవలయు భట్టు
....................................
ఆవుర పెమసాని పెద్దతిమ్మయకుమార. 828

సీ॥ ఈతఁడే కద మును యేదులాశాభిదా
నేకవజీర భాషా.............
అబ్దులాఖాను ఖానుబతాత్ఖాను-
......జాగ్రద్విషత్సరాని
ఘోరారి హంవీర వీర రాహుత్తుల
మీద........................
హరికిశోరంబున................
కడతేర్చి పెల్లార్చి...........

గీ॥ ..................................
కొట్టి గోరించి గుట్టలు పెట్టి గెలుపు
గమ్మ గైకొన్న భూజానిపెమ్మసాని
చిన్నతిమ్మేంద్రమౌళి రక్షితబుధాళి. 829

సీ॥ ఇతఁడే కదాగద్దించి దిగ్గనలేచి
మీసము దీటి..........

....................................

రాబాకు చూరీ జిరాధరించి
లక్కరీశిలే దారి సం
గడములో కదిసినీ గండికోట
పైలగ్గ కెక్కి తుపాకి......బొమిడిక
పైదాకి కంపించి భాయి భాయి

గీ॥ భాయి పెమ్మసాని (తిమ్మ) శాబాసు అలెస
లామనుచు గొండదిగి చల్లడములు విడిచి
ఖానునికిఁ జెప్పనబ్దులాఖానుఁడురికె
నవుర చిన తిమ్మభూప! సాహసదిలీప! 4 830

సీ॥ చూచెనా ఒక వింత సుముఖుఁడై కవులకు
నవురౌర నూటపదాఱు లిచ్చు
మాటాడెనా లోభి మన్నీలమిండ డిం
పార వేనూట పదాఱు లిచ్చు
నవ్వెనా ఒకమాఱు నాయక రత్నంబు
సంఖ్యగా లక్షల సంఖ్య లిచ్చు
సంతోష పడియెనా సకలార్థిపోషకుం
డరిదిగాఁ గోట్ల పర్యంత మిచ్చు

గీ॥ మెచ్చు....నౌరౌర మేలు మేలు
బళిబళి యనంగ ధరలోనఁ బ్రబలితౌర
పృథులసంపద్రమాజాని పెమ్మసాని
నారసింహేంద్ర సత్కరినారసింహ. 831

ఉ॥ చాలు దురాలు మాని గడి సంగడి
.......................................



.........................................
.........................................[1] 832

## తిమ్మయ బుక్కరాజు

క॥ వనములలోపల సింహము
కెనయఁగ మృగరాజు పట్ట మెవ్వడు గట్టెన్
దనలావున భుజబలమున
దినదినమును సంప దెక్క తిమ్మయ్య బుక్కా![2] 833

సీ॥ ఇంతింత మన్నీల కిసుమంత మన్నీల
కెంతటి మన్నీల కింటిమగఁడు
ఉన్న మన్నీలకుఁ జన్న మన్నీలకుఁ
బిన్న మన్నీలకుఁ బెండ్లికొడుకు
ఉబ్బు మన్నీలకు నుదుటు మన్నీలకు
గబ్బి మన్నీలకుఁగంటినెరసు
నలుపు మన్నీలకు నెఱుపు మన్నీలకు
వలిపెంపు మన్నీల కలి విజయుఁడు

గీ॥ ధూర్తమన్నియ విగ్రహ ధూమకేతు
ప్రకటమన్నియ విగ్రహపాళియముఁడు
కంటకపువైరి మన్నీల యంటుమగఁడు
బుక్కరాజయ్యవైరుల ముక్కుఁ గొయ్య. 834

1. అచ్చువేయవలసినవి – చూచెనా, చాలు దురాలుమాని అనియున్న రెండు పద్యములలో ఒకటిమాత్రమే కలదు. సం॥

2. ఈ పద్యములను పుట 147లో ప. 311 తర్వాత చేర్చి చదువుకోవలయును –సం॥

సీ॥ గడిరాజు ముట్టిన కనుమలు గట్టిన
నెఱితప్పుమన్నీల నెత్తిపిడుగు
పంపు పుత్తెంచిన పగవారి ప్రోపైన
కంటించు మన్నీల కంటిమంట
పరధనంబుల గన్న బలమల్పమై యున్న
వెనుద్రొక్కు మన్నీల వెన్నుదగులు
తప్పుద్రోవలఁ జన్నఁదమవారు వద్దన్న
చింతించు మన్నీల శిరసుఁగొఱ్ఱు

గీ॥ ధూర్తశాత్రవనిగ్రహ ధూమకేతు
ప్రకట మన్నియ విగ్రహ బాడబాగ్ని
అనుచు గొనియాడుదురు నిన్ను నఖిల సభల
భూనుతాటోప తిమ్మయ బుక్కభూప! 835

సీ॥ తాతతండ్రుల పగల్ తలమున్నలై యుండ
దండు పోబోకు మీదక్షిణంబు
అధవా ఆటేగిన నా భూమిలోపల
సోమవంశముకేసి చూడబోకు
పోయినా కల్లరిపోలె పల్ రణరంగ
భార్గవరాము....న జొరకు
సురధామ బంపిన సోలి తొల్గుదుగాని
అతనితోఁ బోరాడ ననుచుఁ జెప్పు

గీ॥ ......................................
......................................
......................................
...................................... 836



## మేదరమెట్లవారు[1]

సీ॥ వితరణం బెఱుఁగని అతిలోభులను వేడఁ
బ్రతిభ కెక్కనివానిఁబ్రస్తుతింప
ఘనమార్గహీనుకు గద్యపద్య మొసంగ
బిరుదుపద్ధతిలేని దొరను గొల్వ
దురమున వంచించు ధరణీశుఁగొనియాడఁ
బుణ్య మార్జించని పురుషు నెంచ
భటకవీంద్రులకీని ప్రభువుల గొనియాడ
మాటనిలకడలేని మహిపుఁదలఁప

గీ॥ తలతు నినువంటిమన్నీలధరణిసభల
మిహిరనిభతేజ! మేదరమెట్లభోజ !
నారసింహాంకసత్పుత్ర ! నవ్యగాత్ర !
గీతగుణసాంద్ర ! రమణ పృధ్వీతలేంద్ర ! 837

ఉ॥ మేదరమెట్లవంశమున మేటివదాన్యుఁడ వంచు దిక్కులన్
మోదముతోడ నెన్నెదను మున్నుగ మన్నెసభాంతరంబులన్
ఆదరణించి మమ్ము ముద మందఁగఁ జేయుము పూర్వులట్లు మ
ర్యాదల నారసింహతనయా! రమణప్పనృపాలశేఖరా! 838

క॥ శ్రీదనరగ భటకవులకు
లేదనక యపారకోర్కె లెల్లను యొసఁగే

---

1. శ్రీ ప్రభాకరుల నోట్సు నుండి గ్రహించిన యీ అధిక పద్యములను పుట 152లో ప. 322 తర్వాత చేర్చిచదువుకోవలెను – సం॥

2. ఇందే పు. 164– ప. 353 తర్వాత చేర్చి చదువుకోవలెను.

మేదరమెట్లాన్వయమధు
సూదననిభ రమణభూప! సుమశరరూపా ! 839

కII గజరాజు మన్నియుండవు
ప్రజపాలిటి ధర్మజుఁడవు ప్రాభవరీతిన్
విజయుడవు అర్థి కెయ్యెడ
రజతాద్రిసమానధైర్య రమణనృపాలా 840

## వాసిరెడ్డి వేంకటాద్రినాయఁడు

సీII లంగుగా నపరంజి యంచుచీరె ధరించి
రంగైె మెఱుంగారు రవికఁదొడిగి
రమణు లందియ్యఁగా రహి రత్న ఖచితమౌ
సొమ్ము లందంబుగ సొరిదిఁదాల్చి
చెలికత్తె నొక్క చెయివైచుకొని, స్వామి
యింతప్రొద్దాయె రాఁడేమటంచు
నెల్లిపూదండచే నల్గిన చల్లని
సురటి చేఁబూని యచ్చోటనిలచి

గీII రాకపోకలు నిన్నె పరాకుమాని
యరయుచున్నది యదిగొ మాయమ్మ సాధ్వి
వరమదనకోటిలావణ్య వాసిరెడ్డి
వేంకటాద్రీంద్ర! మన్నె హంవీరచంద్ర! 841

## కృష్ణభూపతి

కII అప్రదుఁ దక్షిప్రదుఁడును
కుప్రదుఁడును నీకు సరియె కువలయమందున్



సుప్రదకృష్ణ మహీభుజ
విప్రోత్తమ కల్పభూజ విద్యాభోజా! 842

## కలిదిండి రంగరాజు

కII కలిదిండి రంగరాజా !
కుల పెద్దలు నిన్నుఁ జూచి........లనగరా?
వెలమలకుఁ బుట్టినావా
పలుబీజమ ! నీకు రావు ప ద్దేటికిరా ! 843

## కలిదిండి రామభూపాలుఁడు[1]

సీII ఘోరయుద్ధంబులోఁ గోటిరాణువమీఁద
జెండుబెండాడదే చేతికత్తి
ఢీకొన్నమటిదొడ్డ ఢిల్లిఫౌఁజులమీఁద
జగడంబుసేయదే చాయకత్తి
చదురుపాచ్చాయైన నెదురుకొన్నప్పుడే
సూటిగాఁబొడువదే చూఱకత్తి
నేటుగా మీరు పజునిల్ల ? ఖానునిమీఁద
నాడంగ నఱకదే యాయుధంబు

గీII మహిమ వర్ణింపఁగా రాదు మానవులకు
విరివి ఛప్పన్నదేశాల వినుతికెక్కి
వల్లగాకున్నతురకల వంచినావు
రమ్యగుణదీప! కలిదిండి రామభూప ! 844

1. ఈతని మీది పద్యమిది. ప్రభాకరుల వ్రాతప్రతుల నుండి గ్రహించితిమి. ఇదే చా.ర. నందును గలదు – సం॥

## కొండమంత్రి

ఉ॥ నూటపదాఱులిచ్చెద వనూనవదాన్యుఁడవంచు నెమ్మదిన్
మాటికి నెంచి వచ్చితిని మానితకీర్తిధనుండవౌట నీ
సాటిప్రధానులెవ్వరిఁక సంశ్రితరక్షణశక్తి నీకు బా
హాటమెకాన ప్రోవుము కృపాకర కొండయమంత్రిశేఖరా! 845

## గోప తిప్పమంత్రి

మ॥ ఎనయన్ గోపయతిప్పభూవిభునితో నేత్రాసిభూపాలురన్
జన నీగిం బ్రతిసేయఁగా వినినదోషంబేమిటం బాయునే
విను కావేరి మునింగి రంగవిభునిన్ వీక్షించి యశ్రాంతచిం
తనగా రామసమాస్రనామపఠనోద్ధాముండు గాకుండినన్! 846

## వెంకటాచలపతీంద్రా

మ॥ అట మిన్నందిన యట్టివాని పొడవెంతన్నట్టుగాదే సము
ద్భటదైనందిన దానఖేలన మహోద్యద్భాస్కరామాత్య వి
స్ఫుటవంశోదయ నిన్ను సద్గుణగణా పూర్ణుండ వీవంచు మే
మటు వర్ణించుట వేంకటాచలపతీంద్రా సాంద్రతేజోనిధీ! 847

## మందపాటి రామభద్రేశుఁడు

శా॥ దండ్లంగూర్చి విరోధిరాజుల వడిం దార్కొన్నచే పోరులన్
చెండ్లన్ వైచి తలల్ సడించి జయలక్ష్మిం జెంది సద్వస్తువుల్
బండ్లం దెచ్చిన మందపాటి కులశుంభద్రామభద్రేశు న
య్యెండ్లూరిక్కడికెంత దవ్వు చెపుమా యేణాంకబింబాననా! 848
(ప్రభాకరులనోట్సు27)



## మందపాటి రఘుపతిరాజు

సీ॥ జనక జాతానంద సంధాయి యాతండు
జనకజాతప్రేమ చతురుఁడితఁడు
బహుపుణ్య జనలోక భంజనుండాతండు
పుణ్యజనావన స్ఫురితుఁడితఁడు
మిత్ర సంతతికెల్ల మేలొసంగునతండు
మిత్రసంతతిఁబ్రోచి మెలగునితఁడు
మండితరత్నాకరుండాతఁడధి గుణ
మండల రత్నాకరుండితండు

గీ॥ మనుకులాగ్రణియాతండు మందపాటి
కులజుఁడీతండు దశరథు కొమరుఁ డతఁడు
రామభద్రక్షితీశు పుత్రకుఁ డితండు
రఘుపతి యతఁడు రఘుపతిరాజితండు 849

## మట్రాజు గుండభూపతి

శా॥ దోర్థిలాఘన మూర్తు జాన్నగరుమేల్ దుర్వార ఉర్వీరమా
వాల్లభ్య ప్రతిభావిభాగి మదశుంభ ద్రత్న భద్రేభముల్
దిల్లీదాక మషూరుకొన్న దొరవాఁడెవ్వాఁడహో నీవె శుం
భల్లీలాగుణి! గుండభూవరమణీ మట్రాజు వంశాగ్రణీ! 850
(నోట్సు-27)

క॥ పుట్టుక పద్మజుఁడైతే[1]
భట్టును పోషించ వలెను పాలించని వా
కట్టెయు పద్మజుఁడౌ నా
గట్టిగ మట్రాజుగుండ గండరగండా![1] (నోట్సు-27) 851

1. ఈ పద్యము చా.ర. నందును గలదు.

కII పొట్టలు పెంచుక తిరిగే
రట్టడి పెనులోభి మన్నెరండలకేలా!
భట్రాజున గలకీర్తులు
గట్టిగ మల్రాజుగుండ గండరగండా! (నోట్సు - 27) 852

## మిరియాల వెంకటపతి

మII క్రమమొప్ప మిరియాల వెంకటపతీంద్రా నీదు ఖడ్గంబు పే
రిమిఁబైఁబడ్డ విరోధిగాత్రమవనిన్ రెండయ్యె మార్తాండ బిం
బము రెండయ్యె బతాలునన్ బ్రిదిలి రంభాకంచుక గ్రంథి బం
ధము రెండయ్యె జనానులాపమునకుం దప్పేమిర్వేటాఱనన్. 853

## డొక్కాసీతమ్మ - జోగయ్య[1]

సీII సద్యోఘృతము పాయసము పిండివంటలు
కండచక్కెర పానకంబు పనస
తొనలును సుధతోడ నెనవచ్చు క్షీరముల్
కమ్మనికూరలు కందిపప్పు
శాక్యాదనము కడుఁ జవిగల్గు పచ్చళ్ళు
మధువులోఁ దోఁచిన మావి పండ్లు
మిల మిల మెఱసెడి మీఁగడ పెరుగును
నూరఁగాయల చారు నీరు చారు.

గీII ఇలసురాళికి భట్టుమూర్తులకుఁ బ్రేమ
నతిశయంబుగ వడ్డించుఁ గుతుకమలర
నీ కుటుంబిని సీతమ్మ నేర్పుదనర

1. శ్రీ ప్రభాకరుల వ్రాతప్రతుల నుండి స్వీకరించిన యీ పద్యమును పుట 303 ప. 639 తర్వాత చేర్చి చదువుకోవలెను - సంII



అతులగుణధామ! డొక్కాన్వయాబ్ధిసోమఁ!
బ్రాహ్మణలలామ జగ్గయ్యభవ్యనామ! 854

పాప మొకభట్రాజు ప్రాచీన కవి కవిత్వము (సీసచరణములు) హరించి తన పైత్యము (గీతము) దగిలించి, పొగడినాఁడు.

## తిరువళేంద్రుఁడు

లయII నిగనిగని చన్నులును నగుమొగములున్ నకన
కగు నడుములున్మెఱయ జిగినమరకాంతల్
నగధరుఁడు మెచ్చ భవదగణితగుణౌఘముల
నొగి థిమికి ధింధిమికి దిగుద్ధిమి ధిమి తొం
దిదుద్దదిగి దిగుద్దగణ తగుద్ద తతతొం తగణ
జగుధగిణ తత్తిగణ తెగుద్ద తత తత్తై
జగుద్దగిణ తాతిగణ తగుద్దతతతాయనుచు
మిగుల నటియింపుదురు తగఁ దిరువళేంద్రా! 855

## అచ్యుతరాజు

గీII తారగిరి మందరములు బృందారకాది
తారకారాజవదనలు తారు తార
తార ధారా శ్రుతిస్వరోదారలీల
బాడుదురు నచ్యుతేంద్రుని భవ్యకీర్తి. 856

కII సాటి చదలేటినీటికి
హాటకగర్భునివధూటి కమరుద్రువనీ

1. ఈ పద్యములను ప్రభాకరుల సేకరించిన వ్రాతప్రతుల నుండి గ్రహించితిమి- సంII

వాటికి మధుకైటభరిపు
వీటికి శ్రీయచ్యుతేంద్రు విశదయశంబుల్ 857

గీ॥ భారతీ వదనాంబుజ భ్రాజమాన
కలితకర్పూర తాంబూల కబళగంధ
బంధురంబులు నీమంజుభాషణములు
లలితగుణధుర్య అచ్యుతరాజ వర్య! 858

## అచ్యుతరామ భూపాలుఁడు

అచ్యుతరామ భూపాలుని గూర్చి భోగరాజు నారాయణమూర్తి గారు చెప్పిన పద్యములు.

మ॥ శ్రితరక్షారతికచ్యుతుండు సుగుణశ్రీ సత్యధర్మ ప్రభా
మతికిన్ రాముఁడు సత్కళాకలనకున్ మారాజు రాజంచు నీ
పితరుల్ భావిగ్రహించి నామకరణోద్వేలోత్సవంబందు స
మ్మతి నీ కచ్యుతరామరాజనుచు నామంబుంచిరుర్వీశ్వరా! 859

శా॥ భాసిల్లుం గద పామరుండు నధిక ప్రజ్ఞాత్మకుండౌచు, వి
ద్యాసామాన్యుడు పండితుండగు, కవిత్వంబల్లు విద్వాంసుఁడున్
ధీ సంపన్నుత రామరాణ్ణృపమణీ నీతో ప్రసంగించినన్
నీ సాంగత్యము నిత్యమున్ సలిపినన్ నీమోము వీక్షించినన్. 860

ముంగండ అగ్రహార కాపురస్థులొకకవిగారు చెప్పిన పద్యమిది.

సీ॥ అఖిలలోకైక రక్షాంచన్నిరీక్షణ
భ్రమరక భ్రమర సంపదలతోడ
నమితమాధుర్య ధుర్యాధర పల్లవ
లలితాంఘ్రిశయ కిసాలములతోడ



ప్రకటకుంకుమ రజఃపటలికాంచితపృథు
స్తనహారసూన గుచ్ఛములతోడ
దనయట్టి సహజ చందనపద్మకర్పూర
పరిమళామోదవిస్ఫురణతోడ

గీ॥ నురునిజానంద కలశాబ్ధి నొఱపుమీఱు
కవినుతిమతల్లి కవిత వాక్కల్పవల్లి
శ్రీమదచ్యుతరామధాత్రీ బలారి
కెపుడు వాక్ప్రౌఢి పాండిత్యమిచ్చుగాత. 861

ఆటపాటలమేటి శ్రీమదజ్జాడ ఆదిభట్ల నారాయణదాసుగారు చెప్పిన పద్యము.

ఉ॥ నీతుల నీతులం గదియు నేతల నీయవనీతలంబునన్
జూతమనన్ లభింపుదురె చూతము బోలు ఫలేంద్రముల్ ఫల
వ్రాతములోన నెట్లు గనుపట్టెడు పట్టణతుల్యశోభ నే
రీతిని పల్లెటూళ్ళనుకరించెడు అచ్యుతరామరాట్ప్రభూ ! 862

వారణాశి రామమూర్తిశాస్త్రిగారి పద్యము

సీ॥ భవదీయ గీర్వాణ భాషాభిమానంబు
గన విక్రమార్కుని కలిమి దోచె
భవదీయ విద్వత్త్వవర్ధనాతత శక్తి
దిలకింప భోజుని తలపు గలగె
భవదీయ కవిలోక పాలనామిత భక్తి
నరయ శ్రీకృష్ణరాయలు స్ఫురించె
భవదీయ భాషాభినవ సమంచిత సేవ
గాంచ రాజనరేంద్రు ఘనత బొడమె

గీ॥ ఔర! నల్లపరాజ వంశాబ్ధి చంద్ర
రాజకులవర్య పండిత భోజధుర్య!
సుగుణమణి భూష! పండితస్తుత మనీష
లలిత శుభరూప యచ్యుత రామభూప. 863

వీటూరి వేంకటరామశాస్త్రి గారి పద్యము

సీ॥ శ్రీరమణీయాంధ్ర భారతీ తీర్థ క
లాధిక జయపురేలాధినాథ
విక్రమ దేవ భూ విభుదత్త విద్యా వి
లాస వరబిరుద లాంఛితుండు
మీర్జయన్ బిరుదంబు మేల్పురుల్ పాదుషా
చేనొంది కులమధిష్ఠించువాడు
నల్లప యన్దేవి కెల్ల పూజలు సల్ప
నల్లపరాజోపనామకుండు

గీ॥ శ్రీ ధనంజయ గోత్రాబ్ధి శీతకరుఁడు
నార్య సీతాభిరామ రాజాద్యసుతుఁడు
భ్రాతృయుక్తుండు పుత్ర విభ్రాజితుండు
నార్యుఁడచ్యుతరాయరాజాహ్వయుండు. 864

ఈ క్రింది రెండును గడియారం వెంకటశాస్త్రిగారు చెప్పిన పద్యములు

శా॥ రాజా నల్లపరాజవంశమణి మీర్జాఖ్యాతుఁడున్ సత్కళా
భోజుం డాశ్రితకల్పభూజము దయాంభోరాశి దీవ్యన్మహా
తేజుండచ్యుత రామరాజు సుయశోదీర్ఘాయురైశ్వర్య వి
భ్రాజిష్ణుండవుగాత శ్రీతునిపురీ రాజ్యేందిరాకాముఁడై. 865



ఉ॥ విందుము మీ మహత్త్వము కవిత్వకలా రసికత్వమున్ దదా
నంద ఘనత్వమున్ వితరణ ప్రవణత్వము ధార్మికత్వని
ష్యంది యశః ప్రియత్వము ననర్ఘ గుణాచ్యుత రామరాన్మణీ
విందగు నిన్నుబోలు పృథివీపతి కావలె నందు మెందునున్. 866

మధురవచన్ మిర్జాబోలే సున్నేమే అతిప్యారాహైఁ
శోభిత్శుభ్ర్ విశాల్ హృదయ్ మన్ అతి నిశ్చలధారాహైఁ
భాషావోఁకీ ప్రేమీ అవుర్ కవితావో కా సార్ హై
సరసగీత్ సంగీత్కా ప్రేమీ తునీకా నివాశీహై. 867

జగజీవన్కీ అపార్ మహిమా గానే నాలాజ్ఞానీహై
కాల్ కే ప్రవాహవేగ్ మే ఛిపాహువా ఏక్తారా హై
అనుపమరూప్ విద్వతా, అఖిలవిశ్వకా భాండార్ హై
ప్రేమీయోకా ప్రేమీ ఈశ్వర్కా ప్యారా అచ్యుతరామ్ రాజాహై. 868

మీఁది రెండు హిందీ పద్యములును వారణాసి నుండి శ్రీకృష్ణ కృష్ణశాస్త్రి గారు వ్రాసినవి.

విజయనగరాధీశులు శ్రీ పూసపాటి నారాయణ గజపతిరాజుగా రడిగిన ప్రశ్నకు మీర్జా వెంకటపతిరాజుగారు చెప్పిన సమాధానము.

సీ॥ ప్రత్యక్షబాహాట పాంచాల నటనల
సరసంబు గుల్కనే జదువనేర్తు
నాయికా నాయకనైపుణ చాతురీ
శృంగార కవితయుఁజెప్పనేర్తు
భరతశాస్త్ర విశిష్ట బహువిధ శబ్దముల్
చెలగ నాటకరీతిఁ దెలుపనేర్తు
తళుప కొణ్ణవగాన తాళమృదంగముల్
యొంటిగా నవధాన మొనరగూర్తు

పారసీభాషచేఁ బరగు సమాసముల్
చిత్రంబుగా తెన్గుఁజేయ నేర్తు

గీ॥ నశ్వశిక్షయు జ్యౌతిష మశ్వ శాస్త్ర
శిల్పి గారడి విద్యలచేత నరయు
నృపకులోచిత వృత్తుల నిపుణతయును
ఘనత మిరజా ఖితాబు వెంకటపతీంద్రుఁ
డరయ నేర్చెను బుధజను లౌననంగ. 869

క॥ బహదరు మిరజా యనుచును
మహరాజ కులోద్భవుండు మన్ననతోడన్
వహ నారాయణ గజపతి
షహబాషు నటంచు నన్ను సభలో మెచ్చెన్. 870

## వెంకటనీలాద్రిరాజు

క॥ పంకేజభవవధూపద పంకజ
మంజీరనినద భాసురములు నీ
పొంకపు పలుకులు మిర్ జా
వెంకటనీలాద్రిరాజ విద్యలభోజా! 871

కాకర్లపూడి రామభద్రరాజుగారు చెప్పిన పద్యము

మ॥ సమదానేకపయూథదర్శనరుషా సంరబ్ధ కంఠీరవ
క్రము లంసాగ్రనిరూఢ భూవలయ రక్షాదక్ష శిక్షాక్రమ
క్షము లబ్జా ప్తపవిత్రవంశ్యులు త్రిలింగ ప్రాభవ శ్రీధవుల్
సుమతుల్ నల్లపరాజరాజమణిరాజుల్ దానకల్పద్రువుల్. 872

చిలుకూరి సోమనాథశాస్త్రిగారు చెప్పిన శ్లోకము



శ్లో॥ వంశేన విద్యయా స్థిత్యా
సుగుణైశ్చమహత్తమాః
అన్యేభ్య క్షత్రియో భ్యోమీ
మీర్జాశబ్దాంకితా నృపాః. 873

నారాయణగజపతి నగరప్రవేశము చేయునప్పుడు వెంకటపతి రాజు గారు చెప్పిన పద్యము

సీ॥ గగనమండల మదే కంటి నే డోయమ్మ!
గగనంబు కాదది గజము కొమ్మ
గజమైతె నక్షత్ర గణము లందేమమ్మ?
నక్షత్రములుగావు నవ్యమణులు
మణులైతె హరిణాభ్ర మండలంబేమమ్మ?
హరిణాభ్రములుగావు సురకజూలు
సురకజూ లవియైతె మెరపు లందేమమ్మ?
మెరుపులు జలతారు చెరగులమ్మ

గీ॥ చెరగు లవియైతె నిండు చందురుఁడదేమి
చంద్రుడునుగాడు.........................
రామరాజేంద్రసుతుఁడు నారాయణ గజ
పతి మహారాజ చంద్రుడే పద్మగంధి! 874

## కపిసేన

సీ॥ కోతు లెన్నది కోట్లు కొమరప్ప నొక గంతు
గంతులు వేయు నిక్కంపు గమియు
గమికోటి కోట్లును గలయంగ నొక మొత్త
మొత్త లర్వది కోట్లు మొరయ వీడు

వీడు లక్ష క్షోణి వెలయంగ నొక సాతు
సాతు డెబ్బది వేలు సరవి మూక
మూకలు శతకోటి ముదమొప్ప సంగడ
సంగడ శతకోటి సరగ ధట్టి
ధట్టు లర్వది కోట్లు ధట్టింప నొక మొన
మొనలు మున్నూట పద్మూడు తోయ

గీ॥ అట్టి తోయలు మరి యారైన నది వెల్వ
నట్టి వెల్వలు డెబ్బదారు తోడ
నరిగె సౌమిత్రి వీర సహాయుఁడగుచు
రామచంద్రుండు లంకాపురంబుమీఁద.[1] 875

శ్లో॥ నిత్యం సంధ్యానియమ విధయో రామసేతు ప్రదేశే
లోపాముద్రా సహచరమునే రన్వహం స్వస్తివాచః
క్రీడాశైలో మలయశిఖరీ దీర్ఘికా తామ్రపర్ణీ
రాజా పాండ్య స్స కథ మితర క్షత్రసాధారణశ్రీః.[2] 876

శ్లో॥ విరాజతే సుందరపాండ్యదేవ
పదాంబుజే కాంచన వీరభూషా
కారాగృహస్థా నివ కాలమేఘాన్
సౌదామినీ మోచయితుం ప్రపన్నా! 877

శ్లో॥ త్వదంగణే విక్రమ పాండ్యదేవ
మతంగజాశ్శృం ఖలినోవిభా న్తి

1. 856 నుండి 875 వఱకు గల పద్యములు శ్రీ ప్రభాకరులు సేకరించి యుండిన వ్రాతప్రతుల నుండి గ్రహించినవి. – సం॥

2. ఈ శ్లోకములు ప్రభాకరుల నోట్సు నుండి గ్రహించితిమి. – సం॥



ఆవాస దానా దరిభూపతీనాం
ఆశాంత శైలా ఇవ సాపరాధాః 878

శ్లో॥ స్వస్తి విక్రమ పాండ్యస్య బాహవే చక్రవర్తినే
అరిరాజ వధూ కంఠ ప్రథమా భరణ ధ్రువే! 879

శ్లో॥ సేవాదుఃఖాభి భూతస్య యాచ్ఞా దుఃఖోధ (ఖేవ, ఖాయ?) భూయసే
దీర్ఘాధ్వ పరిఖిన్నస్య శైలకోట రివాగ్రతః
సేవాశ్వవృత్తి రుక్తాయైః నతై స్సమ్యగుదాహృతమ్
స్వచ్ఛందం చరతి క్వశ్వా విక్రీతాసుః క్వ సేవకః 880

శ్లో॥ రామో దారవియోగ్య బధ్యత బలి శ్చోరో హతశ్శూద్రకః
ధ్వాంక్షాశీఖలు విక్రమార్క నృపతిర్ధర్మోవనం ప్రస్థితః
చండాలాశ్రయ దూషితో బత హరిశ్చంద్రో జగద్వల్లభః
ప్రాప్తేకాలవశే విధిర్బలయుతో ధిగ్ధిగ్వృథాపౌరుషమ్.[1] 881

## శ్రీనాథుని చాటువులు[2]

సీ॥ నీలాలకాజాలఫాలకస్తూరికా
తిలకంబు నేమిట దిద్దువాఁడ
నంగనాలింగనా నంగసంగరఘర్మ
శీకరం బేమిటఁ జిమ్మువాఁడ
మత్తేభగామినీవృత్త స్తనంబుల
నెలవంక లేమిట నిల్పువాఁడ

1. ఈ శ్లోకములు ప్రభాకరుల నోట్సు నుండి గ్రహించితమి. – సం॥

2. చాటుపద్య మణిమంజరి కొత్తకూర్పు–1, పు. 152, 302లలో చేరని మరికొన్ని పద్యములివి ప్రభాకరుల నోట్సు నుండి, క్రీడాభిరామము పీఠిక నుండి గ్రహింపబడినవి. – సం॥

భామామణీకచాభరణశోభిత మైన
పాపట నేమిటఁ బాపువాఁడ

గీ॥ ఇందుసఖులను వేప్రొద్దుఁ గ్రిందుపఱిచి
కలికి చెంగల్వఱేకుల కాంతిఁ దనరి
................................అహహ!
పోయె నా గోరు! తనచేతిపోరు మాని. 882

ఉ॥ ఇంగల మంచు వచ్చి యడియే నని కొత్తమసాని మ్రొక్కఁగాఁ
గొంగు బిరాల్నఁ బట్టి తిరుకొం గటు దీసి జలారిచెంతనే
వంగఁగఁ బెట్టి యోనిఁ దిరువట్టలఁగొట్టగఁజాలుఁ జాలు నీ
.......లటంచు నిన్ను మఱి తిట్టెనుగా శఠకోపజియ్యరూ 883

ఉ॥ జంగమురాలిఁబట్టి యొకజంగము వంగఁగఁ బెట్టి యోనిలో
లింగముఁ బెట్టి క్రుక్కియదలించుచు నొక్కొకతాఁకు తాఁకినన్
లింగ!నమశ్శివాయ! గురులింగ! మహేశ్వర! జంగమయ్య!యో
యంగజభంగ! సాంబగురుఁడా! యనుఁదాఁకినతాఁకుతాఁకుకున్. 884

ఉ॥ గోష్పదరూపమై మిగులఁ గోమలమై గణుతింపరానిదై
శష్పవిహీనమై నునుపు చాలఁగఁ గల్గి ద్రవం బపారమై
పుష్పిణి యైననీభగము పుణ్యమునన్ భుజియింపఁగల్గె వా
స్తోష్పతికైన నో ద్రవిడసుందరి! నిన్ను వచింప శక్యమే? 885

చ॥ వడిసెల చేతఁబూని బిగివ్రువగుబ్బలఁ బైట జాఱఁగా
నడుము వడంకఁగాఁ బిఱుదు నాట్యము సల్పగఁ గొప్పువీడఁగా
దుడదుడ మంచెయెక్కె నొకదొడ్డమిటారపుఁ గమ్మకూతురున్
దొడదొడ మంచమెక్కె నొక దొడ్డమిటారపురెడ్డికూఁతురున్. 886



శా॥ హంసీయానకుఁ గామికి[1] స్నధమరోమాళుల్ నభఃపుష్పముల్
సంసారద్రుమమూలపల్లవగుళుచ్ఛం బైనయచ్చోట వి
ద్వాంసుల్ రాజమహేంద్రపట్టణమునన్ ధర్మాసనంబుండి ప్ర
ధ్వంసాభావము ప్రాగభావమనుచున్ దర్కింతు రెల్లప్పుడున్. 887

చ॥ ఉలిమిడిచెక్క యున్ మిగులనుక్క యుఁ జప్పని రొట్టెముక్కయున్
మలినపుగుడ్డలున్ నులుకమంచపుఁగుక్కియుఁ జీకటిల్లునుం
దలఁచిన రోఁతవచ్చు నొకనాఁటిసుఖం బొకయేఁటిదుఃఖ మీ
పలివెల వారకాంతల యుపస్థలకుం బదివేల దండముల్! 888

క॥ తేలాకాయెను బోనము
పాలాయెను మంచినీళ్ళు పడియుండుటకున్
నేలా కఱవాయె నిసీ!
కాలినగురజాల నిష్టకామేశశివా ! 889

ఉ॥ ................................భోం
చేస్తిమి లేస్తి మామెకుడిచేతికి దండ మటుండనిమ్మయా
విస్తరి పుట్టినట్టి పలువిత్తుల అంకుల రాచవీటిలో
నస్తును బస్తు నాయెఁ గవితార్థుల కక్కడఁ గూడు గల్గునా? 890

సీ ॥ జిలుఁగై న చెంగావి జిగిమీఱుకుచ్చెళ్ళు
చిన్నిమెట్టెలమీఁదఁ జిందులాడ
నీటైనరత్నాల తాటంకములకాంతి
కుల్కుగుబ్బలమీఁద గునిసియాడ
గుఱుతైనయపరంజి గొప్ప ముత్తెపునత్తు
మోవిపై నొకవింత ముద్దుగుల్క

1. ఈ సంధి శ్రీనాథప్రయుక్తమే. శివరాత్రి మాహాత్మ్యమున జూడఁదగును. 'కయ్యధమ' అనియే కవిప్రయోగముగావచ్చును.

తీరైనముత్యాలహారముల్ మేలిమై
మెఱుఁగుఁ జెక్కులతోడ మేలమాడ

గీ॥ గంధకస్తురివాసనల్ గమ్మనంగ
నలరువిలుకానిచేతిపూ వమ్మనంగ
కాళ్ళనందెలు గలుగల్లుగల్లనంగ
సొగసు గుల్కంగ వేపారిసుదతి వచ్చె. 891

ఉ॥ వాసన గల్గుమేను నిడువాలు కనుంగవ గబ్బిగుబ్బలున్
కేసరిమధ్యమున్ మదనకేళికి నింపగుబాహుమూలవి
న్యాసము గల్గినట్టియెలనాఁగను బోగముదానిఁ జేయ కా
దాసరిదానిఁ జేసినవిధాతను నేమనవచ్చు నీశ్వరా! 892

సీ॥ మకరధ్వజునికొంప నొకచెంప గమనింపఁ
జీర గట్టినదయా చిగురుఁబోఁడి!
యుభయకక్షములందు నురుదీర్ఘతరము లౌ
నెఱులు పెంచినదయా నీలవేణి!
పసపువాసన గ్రమ్మఁ బైఁటచేలము లెస్స
ముసుకు పెట్టినదయా ముద్దుగుమ్మ!
పూర్ణచంద్రునిబోలి పొసఁగ సిందూరంపు
బొట్టు పెట్టినదయా పొలతి నుదుట!

గీ॥ ఎమ్మె మీఱంగ నిత్తడిసొమ్ము లలర
వోరచూపులు గుల్క సింగార మొల్క
కల్కి యేతెంచె మరునిరాచిల్క యనఁగ
వలపులకు పేటి యొక యొడ్డెకులవధూటి! 893



క॥ నిబ్బరపుఁగలికిచూపులు
జబ్బించుక లేనిపిఱుఁదు సన్నపునడుమున్
మబ్బుకురు లుబ్బుకుచములు
బిబ్బీలకుఁగాక కలవె పృథివీస్థలిపై. 894

ఉ॥ దుష్పరివారశూన్యగతితో మెఱుఁగై సరసోచితోల్లస
త్పుష్పశరాసనక్రియకుఁ బొల్పెసలారి మనోహరంబు నౌ
పుష్పసుగంధ్యసంగగృహపుణ్యమునన్ భుజియింపఁగల్గె వా
స్తోష్పతి కెన్ని యున్న సరితూఁగినవే యొకశోభనంబుతోన్. 895

ఉ॥ కూటమి నొక్కనాటికిఁ ద్రికోణసహస్రములం బగుల్చునీ
ధాటికిఁ జల్లడంబులును దారుణగోణము లంచుగోచులున్
శాటులు నోర్వఁగాఁగలవె! చాలును నీదు విజృంభణంబు బయో
యేటికి లేవఁబాఱితివి యీసరిప్రొద్దుకడం బ్రజాపతీ! 896

ఉ॥ మాపటికొండవీటికసుమాలపుఁదొత్తులఁ జూచి యేల యు
త్థాపనశక్తిచూపెదవు దబ్బఱ శిశ్నమ! వారిసొమన
శ్చాపగృహాంతరాళతలజాగ్రదుదగ్రనిరర్గళప్రణో
ద్దీపితకాలకూటవిషదిగ్ధశరీరుల ము న్నెఱుంగవే! 897

చ॥ సడి గలవంటగుంటకులసంభవ వేంకటభట్లయింటిలో
వడు గని చేరవత్తురట వచ్చినబ్రాహ్మల కేమి వెట్టునో
పిడుకలఁ బెట్టునో మఱియుఁబీఁటల బెట్టునొ ఱాల బెట్టునో?
తడఁబడ లేవఁద్రోలి తనదడ్డొక టడ్డము బెట్టి కొట్టునో? 898

ఉ॥ రాతిరి నేను పస్తు హయరత్నము పస్తు, కవీంద్రగాయక
వ్రాతము పస్తు,................................
................................................టట
లేఁతమిటారి నా వయసులేదు యుపస్థకుఁబస్తు భూవరా! 899

సీ॥ నగముఁ బోలెడుమేను సగము చేసెను గదా
భగము కాదది మహోరగము గాని
పెల్లు రోగముల దుఃఖిల్లఁ జేసెను గదా
గొల్లిగాదది యాతముల్లుగాని
గోఁకుడుపుండ్లఁ జీకాకు జేసెనుగదా
–కుగాదది మారుబాకుగాని
భగభగల్ తనువెల్ల రగులఁ జేసెనుగదా
–ద్ద గాదది నిప్పుముద్దగాని

గీ॥ ..........................................
..........................................
..........................................
పయిపసారంబుగని పొరఁబడితిఁ జెడితి. 900

బాల, యువతి, లోల, ప్రౌఢలకు ఁ జెప్పిన పద్యములు[1]

**యువతి :–**

సీ॥ కౌఁగిటి లోపలఁ గదియంగ బిగియించి
చనుగవ లెదురొత్తి చాలసొక్కి
అరవిరిసిగ్గును నాహ్లాదనంబును
ద త్తరంబును గడు బిత్తరంబు
వెడవెడ మెరయును వివిధ రతిక్రీడ
చేతకుఁ జుల్కగాఁ జెలఁగి పెనగు
ఒయ్యార మొనరించు సురతిగతులను
రెప్పలలోపల గప్పికొనును

1. బాల మీఁద చెప్పిన "కమనీయకర పల్లవము" పద్యము చాటు –ప్రథమ భాగము (కొత్త కూర్పు) న గలదు. – సం॥



గీ॥ సకల రుచి సౌఖ్యముల చేతచాలసొక్కి
నిండుజవ్వని గలయంగ నేర్తునీవె
రాజపరమేశ రాజాధిరాజ విభవ
లక్షణోపేంద్ర! ప్రౌఢరాయక్షితీంద్ర! 901

**ప్రౌఢకు :–**

సీ॥ అలుకయుఁ గినుకయు నలసభావంబును
క్రొవ్వును నవ్వును గమురుకొనఁగ
సొక్కుల నొక్కుల సోయగంబుల చేత
నగవుల కొసరుల నవ్వుకొనఁగ
దట్టించి గదుముచు గొట్టును జడకొద్ది
వింతయౌ తమకంబు సంతసిల్ల
చెదరుల బెదరులఁ జెన్నుల మిన్నలౌ
బహుబంధ భేదముల్ పనిగొనంగ

గీ॥ ప్రౌఢ వలపించు నప్పంచబాణునైన
అట్టి ప్రౌఢను వలపింతువౌర నీవు
రాజపరమేశ రాజాధిరాజ విభవ
లక్షణోపేంద్ర! ప్రౌఢరాయక్షితీంద్ర! 902

**లోలకు :–**

సీ॥ చన్నులపైఁ జెయిచాపఁనీక లోగు
నక్కున నందంద యదుము కొనును
ప్రాంతసుద్దులు కొన్ని పచరించి పచరించి
బంధభేదముల నిర్బంధపఱుచు
సూచ్యపుతాపునఁ జొచ్చి పోవఁగ నీక
యదను లేకుండిన ముదము పెనఁగు

మోముకుఁదెచ్చును మురిపెమెంతెంతైన
ప్రియుఁజాల పోషించు పెక్కు గతుల

గీ॥ పంచశరుఁడెత్తి పోయిన పాళెమనఁగ
పరఁగ కస్తురిముడిచిన ప్రాంత యనఁగ
లోల జవరాలు విటులను జాలి పెట్టు
లక్షణోపేంద్ర ప్రౌఢరాయ క్షితీంద్ర! 903

### ఆదినారాయణా జనాహ్లాదకరణ![1]

సీ॥ ప్రసవ వేదనపడ్డ పడతుక తరువాత
విషయ ప్రయత్నంబు విడిచి యున్నె
దండుగ కలవడి బెండైన హాలికుండు
హలకర్మ మటమీద నణచి యున్నె
అక్షయం బైనట్టి శిక్ష గల్గినదొంగ
వదలిన తొల్లిటివరుస విడునె
అత్తింటివార లెంతణచిన నంత సం
చారిణీ స్వభావసరణి విడునె

గీ॥ తగినవారలు తా మెంత నొగిలి గడిమి
విడిచి పెట్టిన ధనలోభి విడిచియున్నె
సహజమైనట్టి తన తొంటి సరణి నెప్పు
డాదినారాయణా జనాహ్లాదకరణ! 904

సీ॥ శయ్య నొయ్యనజార సయ్యన డాసిన
విటుఁడనుష్ఠింపక విడచి చనునె

1. శ్రీ ప్రభాకరుల వ్రాతప్రతుల నుండి గ్రహించితిమి. – సం॥



కసవుచే సస్యంబు గాసి నొందిన తరి
దున్నక తొలగునే దుక్కివాడు
పక్వంబు గాకున్న పనసకాయకు వన
పాలుండు గొట్టడే పట్టుకొఱ్ఱు
తాపులగొడ్డు పాల్సేపకున్నను కట్టు
బంధించడే (పట్టి) పసులవాడు

గీ॥ లోభగుణమున ధనికుడు లోలవృత్తి
కవుల కిడకున్న వానిపై కరుణ వదలి
గద్యపద్యావళుల వాని గెల్వవలదె
ఆదినారాయణా! జనాహ్లాద కరణ! 905

సీ॥ కర్కశ పాషాణ కర్షంబునగాని
కొబ్బరికాయనీ రబ్బ నగునె
కఠిన రతిశ్రాంతఁగాఁ జేయుతరిగాని
నెలతుక సుతులఁదా నెలమి గనునె
వృషణఘట్టనచేత వెతల నొందకగాని
వృషభంబు కృషిసేయ వెరవ దగునె
హలముఖంబునఁ జాల నలగ దున్నక కాని
పుడమి సస్యం బిడ బూన నగునె

గీ॥ వికట పదపద్యములచేత ప్రకటమైన
నిందలు సభాంతరములందు నెగడు మీద
గాక సుకవుల కిడనేర గలదె కుజని
ఆదినారాయణా జనాహ్లాదకరణ! 906

సీ॥ మైలకోకలు మోసి మను గాల్దభం బాజి
సాది కశ్వమురీతి సాగ గలదె
పల్వలంబులఁ జేరి బ్రతికెడి కొక్కెర
పంజరశుకి పోల్కి బలుక గలదె
పశుకళేబరముల పాలైన శునకంబు
సింహలీల రవంబుఁ జేయఁగలదె
పూతిగంధంబున పొదలు మక్షికము సూ
నాసవం బవలీల నాన గలదె

గీ॥ సంకర కులంబునందున సంభవించు
జనుఁడు కాలవశంబున జగతి యేల
పాలుపడియున్న పండిత ప్రౌఢి గనునె
ఆదినారాయణా! జనాహ్లాదకరణ! 907

గీ॥ సాని తెయ్యని యాడసాగిన దానిపై
కనకంబు కురిపించు తనకు తానె
కొండెగా డొకకొన్ని గొడిమెలు నుడివిన
కౌగిలించును వాని గరుణతోడ
యువజనుల్మదనమహోత్సవోక్తులు దెల్ప
వారికి మౌ క్తికహార మిడును
వాచాలు రొకకొన్నివార్తలు బల్కిన
శాలూలు భూషణాల్ చాల నొసగు

గీ॥ సుకవి యఖిలపురాణముల్ శ్రుతులు శాస్త్ర
కావ్యనాటకములు మృదుగతిని దెల్ప
దాని గడకంట జూడగాబూనఁ డెవ్వ
డాదినారాయణా జనాహ్లాదకరణ! 908



సీ॥ పా ల్లెంత దంచిన పూట కూటికినై న
తండులంబులు గూర్ప దలప వశమె
మరుభూమిలోపల మన్నెంత ద్రవ్విన
పుడిసెడు జలమైన బడయ వశమె
వంధ్యతో రతికేళి వరుసతో సల్పిన
సుతలాభ మందుల జూడ వశమె
యిసుక పోకగజేసి పొసగ మర్దించిన
నూనియ దానిలో గాన వశమె

గీ॥ హీనకులమున జనియించువాని జేరి
ప్రభువటంచును సుకవులు ప్రస్తుతించి
కాచమైనను వానిచే గాంచగలరె
ఆదినారాయణా! జనాహ్లాదకరణ! 909

## ప్రార్థనము

సీ॥ నిఖిలభూధరదరీ నిమ్నోన్నతస్థలీ
విహరణాగతమైన వెనుకబెణుకుఁ
యమిరక్షణార్థమై యమహృత్కవాటంబుఁ
బగులఁదన్నిన నాఁటిప్రాతఁనొప్పి
బ్రహ్మాదిసకల నిర్జరకృతార్చనకాల
మున నిల్వఁ బట్టిన మొనయు గుదులు
నేకాంఘ్రిపై నిల్చి నృత్యమత్యంతంబు
విరచించునాఁటి తిమ్మిరియుఁదీఱ

గీ॥ తోమి గ్రుద్దెదఁబిసికెద దూళిఁదుడిచి
వ్రేళ్ళువిఱిచెదఁజూపవే కాళ్ళు తండ్రి

నిగమ నుత కీర్తి యెలకుర్తి నగరవర్తి
యీశమల్లేశలింగ క్షమాశతాంగ! 910

మ॥ తలక ట్టిత్వము కొమ్ము నేత్వమును నైత్వం బౌత్వముం బొల్లులున్
బలుసంయుక్తపుటక్షరంబులు విరామప్రాసశబ్దాదు లిం
దులఁ జేతప్పునఁదప్పు నజ్ఞుఁడను నన్ దూషింప కాతప్పు లొ
ప్పులుగాఁజేయుఁడు పెద్దలార! మిము నేప్రొద్దున్ బ్రశంసించెదన్.
911

శ్లో॥ విసర్గబిందు మాత్రాది
పదపాదాక్షరాది చ
న్యూన మప్యతిరి క్తం వా
క్షమస్వ పురుషోత్తమ! 912



## (ఈ గ్రంథంలోని కొన్ని సంస్కృత శ్లోకాలకు తెలుగు వివరణ)

**-ఆచార్య పుల్లెల శ్రీరామచంద్రుడు**

పే.3 శ్లో.7.

దీపంవంటి పచ్చని రంగులు బంగారం రాసులు యాచకులకు పంచి పెట్టాం. వాదాలలో వాదులనే గజాల శాస్త్రోక్తులతో నిండిన వాక్కులను త్రిప్పి కొట్టాం. రాజులను పీకివేస్తూ, మళ్ళీ నిలబెడుతూ, పాచికలతో ఆడుకున్నట్లు వాళ్ళతో ఆడుకున్నాం. అర్థిత్వాన్ని జరపవలసిన అవసరాన్ని కూడా దైవం కల్పిస్తే అందుకు కూడా సిద్ధంగా ఉన్నాం.

పే.6. శ్లో.13

హరిశ్చంద్రుడు, నలమహారాజు, పురుకుత్సుడు, పురూరవుడు, సగరుడు కార్తవీర్యుడూ ఈ ఆరుగురూ చక్రవర్తులు.

పే.30. శ్లో.82

ఓ! అనవేమ మహీపాలా! యుద్ధంలో శత్రువుల బాహుదండములనే చంద్రుని పాలిటి రాహువైన నీ బాహువునకు స్వస్తి అగుగాక!

పే.50. శ్లో.131

"తెలుగులో రచించిన కావ్యం ఇనుముతో చేసిన అలంకారం"

"ఇది సంస్కృతం అనే అరణ్యంలో సంచరించే విద్వాంసులనే మదగజాలను కట్టడానికి ఉపయోగించే గొలుసు."

పే.54. శ్లో.149

వీరాగ్రేసరుడవైన ఓ! కృష్ణరాయనృపాలా! కుచములు నడక లత వంటి రోమపంక్తి, మాటలు– వీటి లీలలు గల నీ శత్రుస్త్రీలు తమను వెంటాడి వస్తూన్న

చక్రవాకాలనూ మదగజాలనూ, సర్పాలనూ, చిలుకలనూ, తమ ముఖచంద్రుడు నడుము కేశపాశము కంకణాలలో ప్రకాశిస్తూన్న వైడూర్య రత్నాలు–వీటి సహాయంచేత తమ దగ్గరకు రాకుండా చేసుకుంటున్నారు.

స్తనాలు చూచి తమ సజాతీయాలైన చక్రవాక పక్షులనే భ్రాంతిచేత చక్రవాకాలూ, గజగమనం వంటి గమనం చూచి కరేణువులనే భ్రాంతిలో గజాలు, నల్లని రోమరేఖచూచి సర్పాలూ, చిలుక పలుకులవంటి పలుకులు విని చిలకలూ, ఆ స్త్రీలను వెన్నాడడం కోసం ప్రయత్నంచేశాయి. అయితే వాళ్ళ ముఖాలు చూడగానే చంద్రుడనే భ్రాంతితో రాత్రి చంద్రోదయం అవగానేవిరహంపొందే చక్రవాకాలు వెనక్కి పారిపోయాయి. నడుములు చూడగానే సింహాలు అనుకొని ఏనుగులు పారిపోయాయి. కేశపాశం చూడగానే నెమలి (గరుడపక్షి) అని భయపడి సర్పాలు పారిపోయాయి. కంకణాలలో ఉన్న పిల్లి కండ్లు రంగుగల వైడూర్యాలు చూడగానే పిల్లి అని భయపడి చిలుకలు పారిపోయాయి అని భావం.

పే.54. శ్లో.150

గొప్పపరాక్రమంగల ఓ! రాజా! నీ యుద్ధయాత్రలలో సేనాగ్రభాగాలు విద్యాధరుల వాద్యాలమ్రోతలతో ధణంధణం ధణ ధణం ధాణంధణం ధ్వనులతో మారుమ్రోగుతూ ఉంటే నీవు ఖండించిన వీరులను వరించడానికి వచ్చిన దేవతాంగనలు నాట్యం చేస్తూంటే ధిమిధిమ్మి ధిం ధిమిం ధింధిం ధిమిం ధిం ధ్వనులు వినబడుతున్నాయి.

పే. 54. శ్లో. 151

నరస భూపాలుని సభలో ఉండే స్త్రీల చూపులకు భయపడి లేడి రాజును (చంద్రుణ్ణి) ఆశ్రయిస్తే ఆ రాజు వాళ్ళ ముఖాలచేత జయించబడి తన మండలం (చంద్రమండలం, రాజ్యమండలం అని రెండర్థాలు) విడచి, దుర్గేశుని (దుర్గకు భర్తయైన శివుడు, ఒక దుర్గానికి అధిపతి అని రెండర్థాలు) జటాటవిని ఆశ్రయించి,



తనను శరణుజొచ్చిన ఆ మృగాన్ని ఆతని చేతిలో పెట్టాడు. సన్మార్గమునందు ఆసక్తిగలవాడు (మంచిమార్గము, ఆకాశమార్గము అని రెండు అర్థాలు) ఎంత క్షీణదశలో ఉన్నా తనను ఆశ్రయించినవానిని ఉపేక్షించడు కదా!"

పే.55. శ్లో.152.

వీరాగ్రేసరుడవైన ఓ కృష్ణదేవరాయా, యుద్ధరంగంలో నీవు ఛేదించిన పారశీక దేశ రాజులు స్వర్గరాజధానియైన అమరావతి చేరి బృహస్పతిని **'పీరుత్త'** అని, ఇంద్రుణ్ణి **'సుల్తాను'**అని, శచీదేవిని **'బీబీ'** అనీ నమస్కరించేటప్పుడు 'సలాం' అనీ అంటూ దేవతలకు చిరునవ్వు పుట్టిస్తున్నారు.

పే. 55. శ్లో.153

ఓ కృష్ణదేవరాయా! కవులు నిన్ను స్తుతిస్తే స్తుతించెదరుగాక. మేము మాత్రం స్తుతించము. నరసింహ కిశోరుడు (నరసింహుని కుమారుడు గజపతిని జయించడం అనేది ఏమంత గొప్ప పని! (సింహంపిల్ల ఏనుగును జయించినదంటె ఆశ్చర్యం ఏమిటి?)

పే. 57. శ్లో. 158

శ్రీకృష్ణదేవరాయలు ఇచ్చిన మణులతో విద్వత్కవులు తమగృహాలలో అనేక రత్నాలు పొదిగించి చపటాలు చేయించుకున్నారు. అందుచేత వాళ్ళ ఇండ్లల్లోని భూభాగాలన్నీ రత్నాకరాలు (రత్నాలకు నెలవులు) అయిపోవడంతొ నీళ్ళు మాత్రమే మిగిలిన సముద్రాన్ని సజ్జనులందరూ "అంభోధి, జలధి, పయోధి, ఉదధి, వారాంనిధి, వారిధి" అనే పేర్లతో పిలుస్తున్నారు. ( దానికిపూర్వం ఉన్న రత్నాకరం అనే పేరు ఇప్పుడు లేకుండా పోయింది.)

పే.57. శ్లో. 159

"నాన్నా! అమ్మకి కోపం వస్తూన్నది. నీ తలమీద ఉన్న ఈ గంగను విడిచిపెట్టు" "కుమారస్వామీ! నీవు అన్నీ తెలిసినవాడవు కదా! ఇన్నాళ్ళూ నా

నెత్తిమీద ఉన్న ఆమెగతి ఏం కావాలో చెప్పు". ఆ మాటవినగానే కోపం పట్టజాలక "ఆమెకు ఏమిగతి అంటావా–" "అంభోధి, జలధి, పయోధి, ఉదధి, వారాంనిధి, వారిధి" అని ఆరుముఖాలతో ఒక్కమాటే సమాధానం చెప్పాడు.

పే. 265. శ్లో. 506

కృతయుగంలో మహాదాత బలి, త్రేతాయుగంలో రాముడు– ద్వాపర యుగంలో కర్ణుడు, కలియుగంలో రాయన భాస్కరుడు.

పే. 272. శ్లో. 532, 533

గజపతి వంశంలో పుట్టిన శ్రీమంతుడైన గజపతి ఈ భూమండలానికి రాజుగా ఉన్నాడు. ఆయనకు చాలమంది మంత్రులున్నారు. గోపరాజు వంశానికి చెందిన రామామాత్యుడు గణకులలో శ్రేష్ఠుడు. ఇతడు గణకులకు హితం చేకూర్చి గొప్పకీర్తి సంపాదించుకొన్నాడు.

శ్లో. 534. 536

చంద్రసూర్యులు ఎంతవరకూ ఉంటారో అంతవరకు...........శాలి వాహన శకం 1067లో రక్తాక్షి భాద్రపద అమావాస్యనాడు సూర్యగ్రహణ పర్వమునందు కృష్ణవెణ్ణానదీ తీరంలో ఆ రాజునుంచి దానం గ్రహించాడు. కలియుగంలో చేసిన ఈ దానాన్ని ఏ దురాత్ముడు లాగుకుంటాడో వాడు అరవై వేలసంవత్సరాలు గాడిద జన్మ ఎత్తుతాడు.

పే. 286 శ్లో. 581

బ్రహ్మ ఎలాంటి ఉపయోగమూలేని మేక మెడకు చన్నులనూ, ఒంటెకు తోకనూ, ముక్కులో రోమాలనూ, రెండు వృషణాలనూ, సాహిణిమారభూపాలుణ్ణి సృష్టించాడు. అందుచేతనే అతని కీలోకంలో పూజలేకుండా పోయింది.



పే. 389. శ్లో. 873

మీర్జా అనే మాట చిహ్నంగాగల ఈరాజులు వంశంచేత విద్యచేత సుగుణాలచేతా ఇతర క్షత్రియులందరి కంటె చాలా గొప్పవారు.

పే. 390. శ్లో. 876

సంధ్యావందనాది నిత్యకార్యక్రమాలన్నీ రాముడు నిర్మించిన సేతువు దగ్గర ప్రతిరోజూ అగస్త్యుని స్వస్తివాక్యాలు. మలయపర్వతం క్రీడాశైలం. తామ్రపర్ణి దిగుడుబావి. అలాంటి పాండ్యరాజుకూ ఇతర రాజులకూ పోలిక ఏమిటి!

పే. 390. శ్లో. 877.

సుందరపాండ్యరాజు పాదాంబుజంలో ఉన్న బంగారు వీరభూషణం (కడియం) కారాగారంలో ఉన్న నల్లని మేఘాలను విడిపించడానికై వచ్చి ఆశ్రయించిన మెరుపువలె ఉన్నది. (భావం స్పష్టంగాలేదు.)

పే. 391. శ్లో. 878.

ఓ పాండ్యరాజా! నీముంగిట గొలుసులతో కట్టివేసిన మదగజాలు, శత్రురాజులకు నివాసం ఇచ్చిన అపరాధానికి వధించబడిన దిగంతాలలోని పర్వతాలవలె ఉన్నాయి.

పే. 391. శ్లో. 879.

శత్రురాజుల స్త్రీల కంఠాలలోని మొదటి ఆభరణాన్ని (మంగళ సూత్రాన్ని) తొలగించినదీ చక్రవర్తీ (రాజ్యచక్రం నడిపించేదీ) అయిన విక్రమపాండ్యుని బాహువుకు స్వస్తిఅగుగాక.

పే. 391. శ్లో. 880.

సేవ అనే దుఃఖంతో బాధపడుతున్న వానికి యాచన అనేది చాలా దూరం. నడిచి అలిసిపోయిన వానికి ఎదురుగా (దాటవలసిన) పర్వతం కని

పించినట్లుగా ఇంకా అధిక దుఃఖం కలిగిస్తుంది.

పే. 391. శ్లో. 880ఎ

"సేవ శ్వవృత్తి (కుక్కవృత్తి)" అని అన్నవాళ్ళమాట సరైనది కాదు. స్వేచ్ఛగా తిరిగే కుక్క ఎక్కడ! తన ప్రాణాలే అమ్ముకున్న సేవకుడెక్కడ!

పే. 391. శ్లో. 881

రాముడికి భార్యా వియోగం కలిగింది. బలికి బంధనం లభించింది. శూద్రకుణ్ణి చోరులు చంపివేశారు. విక్రమార్కుడు కాకుల్ని తిన్నాడు. ధర్మరాజు అరణ్యానికి వెళ్ళాడు. జగత్తుకు ఇష్టుడైన హరిశ్చంద్రుడు చండాలుణ్ణి ఆశ్రయించడంచేత దూషితుడయ్యాడు. కాలం వచ్చినపుడు దైవమే బలవత్తరమై పురుషకారం అంతా వ్యర్థం అయిపోతుంది.

పే. 400. శ్లో. 912.

విసర్గ, అనుస్వార, మాత్ర మొదలైనవీ పదము, పాదము, అక్షరమూ మొదలైనదీ ఏదైనా తక్కువైనా, ఎక్కువైనా, ఓ పురుషోత్తమా! క్షమించు.



# చాటుపద్య మణిమంజరి

## అకారాది పద్యానుక్రమణిక


అంగజ నిభువెంగళవిభు 406
అంగుగానపరంజి 841
అంచితరాయరావు 259
అంటేవేళకు నంటును 643
అంబా కుప్యతి తాత! 159
అక్కజమైన దుర్జనుని 591
అక్కజమొప్పగా భుజపరాక్రమ 264
అక్కఱకొదవని 751
అఖిలలోకైక 861
అగణితకీర్తిలోల! సుగుణాకర! 254
అజాగళ స్తన 581
అజుఁడు మదివెదకి 454
అటమిన్నందిన 847
అడపాలు కుంచె లరిగెలు 298
అడుగఁదగువారి నడుగక 695
అతిథికోట్లకునిల 496
అతిశౌర్యుండగు పూసపాటి 287
అదలెఱుంగవుగదా 448
అదిగొ సాయపనేని 305
అద్దిర! వీరముత్తఁడభియాతి 607
అదెఛత్రంబదె చామరంబదె 372
అధికారమబ్బి 803
అనఘప్రాభవ! గుంటుపల్లి 610
అనవేమమహీపాల 82
అన్నరొ కొండపల్లి 488
అన్నామంత్రిశిఖామణి 637
అని నీ వైరులమంత్రులిట్లనిన 608
అనిఁబాఱినవిధినవ్వును 679
అనిలో విఱిగివచ్చి 263
అనుదినము నన్నదానము 598
అనుదినము నీడద్రొక్కఁగ 604
అనుమానమేమిలేకను 464
అపరిమితదయాసాగర 461
అప్రదుఁడక్షి 842
అప్పులిడునతడు 578
అబ్జముఖీమనోజ! 147
అభయంబొసంగుము 308
అభియాతి సర్వంసహా 408
అమితప్రతాపనమిత 455
అమితప్రతాపబాలార్క 163
అమృతాంబానకయున్న 240
అయలక్ష్మి నిధి రాయనప్రభు 487
అయ్యయనిపించుకొంటివి 602
అరికాంతలముసుంగుతెరల 239

| | |
|---|---|
| అరిబలభేదిలింగవసుధాధిపు | 300 |
| అరివర్గములఁదాకి | 425 |
| అరివరులేఁబువభీమని | 24 |
| అర్థిభ్యఃకనకస్య | 7 |
| అరుదౌ నీ బిరుదప్రతాపములు | 258 |
| అర్థులయెడలఁ బ్రత్యర్థుల | 571 |
| అలపాండునకు | 780 |
| అల పాదుషాహుచే నాకు | 421 |
| అలలంబాటితివేమి | 161 |
| అలుకయుఁగినుకయు | 902 |
| అలుపునినధికుడుచేరిన | 662 |
| అల్పునకుఁగల్మి వచ్చిన | 663 |
| అవగతశబ్దశాస్త్రచయులై | 538 |
| అష్టామరాంశసంభవ | 465 |
| అసదృశగంధ | 723 |
| అసదృశముగ | 39 |
| అసమానదానవిద్యా | 676 |
| అసమునఁగాశికా | 33 |
| అహితులఁదాఁకి | 22 |
| అక్షరాభ్యాసంబు | 492 |
| ఆంధ్రభాషామయం | 131 |
| ఆకారసంపదననుకరించి | 107 |
| ఆకులవ్రాలువ్రాయ | 521 |
| ఆచెంపనుద్దండ? అనవేమ | 87 |
| ఆడికకోడఁడేని | 586 |
| ఆడినమాటలు దప్పిన | 675 |
| ఆనరపతికిని | 381 |
| ఆపట్టణంబున | 792 |
| ఆపటుశౌర్యునకొదవెన్ | 388 |
| ఆభూపత్రితయంబులో | 182 |
| ఆయతకీర్తినజ్జనకులాగ్రణి | 278 |
| ఆరయఁబరదేశయాత్ర | 674 |
| ఆరయవత్సవాయ | 272 |
| ఆలమునఁజిక్కభీముఁడు | 29 |
| ఆలములోననోడమికి | 551 |
| ఆలములో నరాతులకు | 25 |
| ఆలములోన సింగవసుధాధిప | 252 |
| ఆ వినుకొండకు రెండవ | 512 |
| ఆవుపొడ్చినయర్థి | 495 |
| ఆసలుపుత్ర | 734 |
| ఆస్కందితాశు ప్రహసి | 241 |
| ఇంగలమంచు | 883 |
| ఇంటనుబోరు | 730 |
| ఇంతింత మన్నీల | 834 |
| ఇంతీ! పానుపుపైనిదె | 173 |
| ఇంతుల కిచ్చినట్లు | 647 |
| ఇంతుల మనముల | 580 |
| ఇతఁడేకదా | 830 |
| ఇంద్రుని సన్నిధానమునకేగె | 268 |
| ఇచ్చె ఇచ్చెను దొర | 712 |





| | |
|---|---|
| ఇచ్చేదెన్నడు లేద | 646 |
| ఇచ్చేపట్లఁదృణంబుగాగ | 400 |
| ఇతడారంగదభంగసంగర | 274 |
| ఇనువెనుకయగ్రహచక్రము | 253 |
| ఇప్పటిదాతలర్థులకు | 589 |
| ఇప్పటి యన్నముకొఱకై | 681 |
| ఇభముఖునితండ్రి కరుణను | 459 |
| ఇభరామమద | 812 |
| ఇఱుకరాదు | 720 |
| ఇలఁగలన్నృపతులు | 341 |
| ఇలదామెర్ల కుమార తిమ్మవిభు | 403 |
| ఇలరామదేవరాయలను | 184 |
| ఈతఁడేకద | 829 |
| ఈరేడు జగములనఁ | 88 |
| ఈలోకపుసుఖంబు | 572 |
| ఈసాగిబైచభూవరుఁ | 104 |
| ఈక్షితిఁకాశికానగరి | 257 |
| ఉత్తమకులజుడై | 115 |
| ఉత్తరమల్లారనుద్దండ వృత్తిగా | 183 |
| ఉత్తరమల్లారియొద్ద | 178 |
| ఉత్తుంగ భుజసూను | 504 |
| ఉదయగిరిరాజ్య | 765 |
| ఉదయతాళంబెక్కి | 1 |
| ఉద్యోగమొదవి | 805 |
| ఉద్యోగహీనుడై | 575 |
| ఉబ్బుచునర్థివేడినను | 670 |
| ఉబ్బునర్థి | 729 |
| ఉలిమిడిచెక్కయున్ | 888 |
| ఊరిచుట్టుముండ్లు | 763 |
| ఎంచియెంచి | 544 |
| ఎందుండివస్తివో | 713 |
| ఎక్కడికేగెదో | 721 |
| ఎత్తినబీరమొప్ప | 68 |
| ఎదురైనచోఁదనమద | 156 |
| ఎనయఁగ హీనుదంట | 689 |
| ఎనయన్ గోపయ | 846 |
| ఎన్నఁగలజీవరాసుల | 702 |
| ఎన్నగారెండు | 748 |
| ఎనిమిదివేల దొరగల | 281 |
| ఎరువుశృంగారంబు | 574 |
| ఎలమిని మించిబంధుజను | 614 |
| ఎవ్వఁడవీవుకాళ్ళు | 685 |
| ఎవ్వరిసొమ్మునెంత | 590 |
| ఏకొండయు వినుకొండకు | 511 |
| ఏడుకులాద్రులెక్కివెసనేడు | 210 |
| ఏతెంతురుతముఁదామే | 632 |
| ఏనుమృతుండనౌదునని | 365 |
| ఏ పట్టణంబున | 790 |
| ఏపనికిఁదగినమనుజుని | 76 |
| ఏపునఁగృష్ణరాయజగదీశ్వరు | 136 |

ఏ మంత్రిసత్కీర్తి 529
ఏమితపంబుచేసి 48
ఏమితపంబుచేసి 554
ఏమిదరిద్రమా! సుకవి 331
ఏమినిలింపశాఖి? 486
ఏమీశేషుడ ? ఏమినారద! 248
ఏ రాజుముత్తాత 820
ఏరువ సింహాసనమున 297
ఏవంకఁజూచిన 340
ఏ వనితల్ మముందలప 170
ఏవ్రాలైననువ్రాయును 482
ఏవేళఁజూచిననిందిరానంద 500
ఒకచెలినొక్కచేవెనుక 237
ఒకతాతకుతుబుశా 326
ఒక్కఁడు మాంసమిచ్చె 484
ఒక్కపాలెగేసి 764
ఒగిఁజతుర్దశ 20
ఒడలు వెల్వడిచిచ్చు 409
ఓలిసరాతులందునిమె 93
కంటకపురిపుల 319
కండలు వప్పిదేవునకు 706
కజ్జమయ్యేనువీఁపు 417
కట్టున్ మట్టునుమీఱు 229
కట్టెలగుండి...కట్టెదురన్ 279
కడఁగి మేఘుండేకకాలంబుననె 531
కడఁగి వీరాధివీరుడు 219
కడఁగివై రాగడా 233
కడిమిన్ మైసురిదేవరాయలకు 221
కడిమిన్ మైసురిదేవరాయ 224
కదుగకమున్నఁగంపు 673
కడుపువెన్నునకంటె 658
కదనమె బొమ్మరిల్లు 246
కదలిక చూపెనా 243
కదలియిల్వెడలంగ 494
కదిలెన్ ఖండియరాయ 58
కపటకంఠీరవాకార 84
కపిలముని 788
కప్పుగప్పదుగదా 449
కమలంబునకుఁబుట్టి 36
కమలభవాండభాండమున 618
కమలాసనాంగ 471
కరకరితమ్మయ 284
కరకరి నీ 825
కరణముగ్రామాభరణము 550
కరములు వేయునుం గలుగ 520
కరయుగములు చరణంబును 208
కర్కశపాషాణ 906
కర్ణాటకక్షోణిఁగలమన్నె 414
కర్ణాట భూపాలు కంఠహారము 77
కర్ణాటకస్వామికై 398



కర్ణాటకాధీశు కంఠమాలిక 206
కరిగమనల్ దురాత్ములనె 690
కలకడ పట్టణ 817
కలకాలంబరియైన 226
కలగుండ్లువడుఁబారు 261
కలనం దావకఖడ్గ ఖండిత 135
కలయఁబసిండి గంటమున 477
కలిగిన వానియింట 708
కలిత ధర్మజ్ఞానఖని 303
కలిదిండి రంగరాజా 843
కలిమి గల లోభికన్నను 698
కలిమి కలవాడె మనుజుడు 697
కలిమినారాజ 792
కవికమలాసనుండు 541
కవిగాయకుల బంధుగణము 450
కవితాకన్యకు నలుగురు 78
కవులిచ్చి భూపతి 473
కసరెడికాపు 738
క్రమమొప్పమిరియాల 853
కాటమరెడ్డి వేమఁడవ 66
కాదనఁ డెవ్వరినేనియు 508
కాదనిపించుకోఁదగదు. 688
కానీనకాకోక 85
కాయము వంగి తాముదిసెఁ 148
కాల్బలంబుల మీఁద 316
కాశికాపురినుండు 786
కాశియు నీ కరాసిసరిగాదు 137
కాసర కూసరై మిగుల 653
కాసుపుట్టని యూళ్ళు 759
కుంభికుంభములపై 711
కుక్కకస్తూరికి 717
కుటిలశాత్రవకోప 370
కుదురుగ మిమ్ముఁగొల్చి 249
కురువిరాట వరాటకరహాట 232
కులమున నధికుఁడై 577
కులమును రూపును గుణమును 569
కులికెద వేటికే చెలియ! 172
కూటమినొక్క 896
కృతేయుగే బలిర్దాతా 506
కృష్ణ రాయస్తువంతుత్వాం 153
కొంచుల వెంబడిన్ 332
కొంచెపు జగములలోపల 79
కొండంత భుజశక్తి 296
కొండపలి బయల బిరుదులు 295
కొండవీటి సీమ 760
కొండ నృపాలు పౌత్ర 301
కొండవీడు మందేరా 154
కొండావిర్భవభాండ 524
కొందఱు రాజు లప్పనము 288
కొదమ సింగమునైన 431

| | |
|---|---|
| కొద్దిని రాఁడు దిండుతికి | 202 |
| కొప్పోలు కవి | 766 |
| కొలది మీఱిన పుట్టకురువ | 176 |
| కొలువక యిచ్చుట త్యాగము | 294 |
| కొలువులో మీసాలు కొనలు | 260 |
| కోట సింగరాజు | 560 |
| కోటానుకోటులిచ్చిన | 678 |
| కోణంగి నాట్యముల్ | 710 |
| కోతు లెన్నదికోట్లు | 875 |
| కోశాల్ చెంతఁదురుష్క | 434 |
| కోమటి వేమన త్యాగము | 90 |
| కౌఁగిటిలోపల | 901 |
| క్రూర గణంబు మందు | 644 |
| క్షిత్యాకాశదిశావకాశముల | 631 |
| క్షౌర కర్మము దీర్ప | 514 |
| ఖండేందు మౌళిపై | 95 |
| గంటము ఖడ్గముతోడుత | 548 |
| గండర బేరుండ బిరుదు | 293 |
| గండునరాతి తండముల | 444 |
| గంధపుఁజెట్టుక్రింద | 693 |
| గగన మండలమదే | 874 |
| గజపతి మన్నీడు కమలాక్ష | 318 |
| గజరాజరక్షణ ఘనతర | 389 |
| గజరాజు పంపున | 380 |
| గజరాజు మన్ని | 840 |
| గడగడ నన్యభూమి వడకన్ | 228 |
| గడిదొరల్ గడగడ | 234 |
| గడిరాజు ముట్టిన | 835 |
| గడిసీమల్ దేవరాయాగ్రణి | 225 |
| గడిసీమల్ బెగడన్ విజాపురము | 227 |
| గడుసరి లోభియర్థ | 559 |
| గణితంబునందును | 515 |
| గదురునరా | 737 |
| గబ్బినినుండు నీ తరముగాదు | 194 |
| గరళపుముద్ద | 27 |
| గర్వాంధ పరిపంధి | 245 |
| గాంభీర్యపరులను | 665 |
| గవఁకుల్ బల్లిదమయ్యె ఢిల్లికిని | 140 |
| గారుడ మంత్రసిద్ధు | 705 |
| గుణముల నిధానమగు | 47 |
| గుణముల నిధానమగు | 553 |
| గుత్తిం బుల్లెలు కుట్టి | 601 |
| గుత్తిదుర్గాసక్తి | 809 |
| గురాలఁగట్టి | 740 |
| గురుకుల వాసఖేదమునకు | 542 |
| గురుయశశ్శాలి యగునట్టి | 622 |
| గొడుగు కాలిపోయె | 768 |
| గొబ్బురి జగ్గరాజు లొకకోటి | 193 |
| గోపరాజాన్వయో | 533 |
| గోలకొండమలక | 650 |





| | |
|---|---|
| గోలకొండ వజీరుఁగొట్టి | 410 |
| చూచినా ఒకవింత | 516 |
| గోష్పదరూపమై | 885 |
| ఘనతర దండోడు | 375 |
| ఘనపతి ద్రోహర గండాంకు | 422 |
| ఘనమగు మంత్రి | 732 |
| ఘనసార శరశర | 354 |
| ఘోటకఖోట హాటకురు | 67 |
| ఘోరయుద్ధంబులో | 844 |
| ఘోరాజిందన తేరు | 429 |
| చంద్రకందర్పాది | 15 |
| చంద్రనందనునకు | 16 |
| చక్కగా నఱకవా | 808 |
| చక్కని దామెర చెన్నడు | 393 |
| చటులరాక్షస | 787 |
| చటుల శాత్రవకోటి | 289 |
| చన్నులఁపైఁ | 903 |
| చరియించితిని | 791 |
| చాలుగుఱాలు మాళిగడి | 200 |
| చాలుదురాలుమాని | 832 |
| చిక్కక మన్మసిద్ధి | 41 |
| చినుకుఁజినుకెత్తు | 280 |
| చిరస్ఫురాసత్య | 362 |
| చూచినఁజాలదాసుల్తా | 222 |
| చూచిననీవంటి | 516 |
| చూచెనాఒకవింత | 831 |
| చూతఫలావసంస | 694 |
| చెడిపిరాలొత్తిన | 160 |
| చెన్నగునియోగి | 807 |
| చెప్పినపనియొనరించిన | 682 |
| చెలఁగిమైలాపురి | 447 |
| చెలఁగెన్‌వేజెళసార్వభౌముడు | 333 |
| చెల్లవింద్రుండనుకిల్లాకు | 418 |
| చేకూరును | 778 |
| చేకొనిరాయనిబాచఁడు | 481 |
| చేతికిగంటమువస్తే | 651 |
| చేతికివచ్చుకార్యమెడ | 687 |
| చేపట్టినధ్రువులవుదురు | 635 |
| చేస్తిమిలేస్తిమా | 890 |
| చొరవగొనినఱకువానికి | 626 |
| జంగమార్చనము భూషాయ | 217 |
| జంగమురాలి | 884 |
| జంభారిగంభీర | 166 |
| జగజీవన్‌కీ | 868 |
| జడలలో మిన్నేటుఁ | 63 |
| జనకజాతానంద | 849 |
| జననాధసామంత | 10 |
| జయరాజవేశ్యాభుజంగాంక | 97 |
| జయశాలైన | 827 |
| జలజారి కళలయందును | 350 |

జల్లికులావతంస 330
జిలుగువన్నెరుమాళ్లు 758
జిలుగైనచెంగావి 891
జూటూరి ముండర 306
టెక్కునఁగొండతోఁదగరు 203
డాబాలోఁగూర్చున్నా 277
డాసిఢిల్లీకవాటములు 220
ఢిల్లీలోసురధాను 55
ఢిల్లీలోసులతాను 368
తంగేళ్ళయసునూరు 376
తంత్రులులేనివీణయును 692
తక్కకనేలముట్టెగొని 130
తగవునఁగూర్చుండి 668
తడిదోవతులు 785
తనకీర్తియాచంద్ర 543
తననుడివడిగలదినములు 627
తనపేరు తల్లిపేరును 605
తనభుజార్థితమైనయర్థంబు 116
తనపదాతిశయంబు 392
తమతమ కెబెదరి 395
తమ్మతమకెంతప్రియమో 256
.....తరాకాళీయ 165
తఱట్లఁగొట్టి 742
తలకట్టిత్వము 911
తలఁపెల్లన్ హరిభక్తియుక్తి 251
తల లెంత పెంచుకున్నన్ 701
తలవరితో 750
తల్లిదండ్రులప్రోచుతనయుండు 573
త్వదంగణే 878
తాతదండ్రుల పగల్ 836
తారకాచల సముద్వాహంబు 384
తారగిరిమంద 856
తావిజగడంపు సిగపూవుల 168
తిండికిఁ గుంజరంబులు 660
తిట్టిన రోసముం బడదు 642
తిరువళి కేణినుంచి 443
తిష్ఠతశ్శశి 534
తీరుగ వత్సవాయకుల 269
తుదిరావణుఁడు జగద్రోహియై 714
తృణకాష్ఠ జలసమృద్ధిని 118
తెరలంబాఱి నభంబు 28
తేఁతకువతోడ వత్సవము 276
తేజఃకాంతి వితీర్ణిభోగ 344
తేజిపై లంఘించి 401
తేలాకాయెను 889
తొగరుచి కన్నుదోయి 125
తొలియిసుమంతలై 435
త్రొక్కించు గడివన్నె దుర్గముల్ 196
దండయాత్రాఘోష 96
దండ్లంగూర్చి 848





దరిద్రులైరి 743
దర్పితాహితరాజ 313
దళవాయికిని వెట్టిగొలిపి 188
దాతగానివాని ఖ్యాతిగా 641
దాతతోనర్థుల 513
దాతతోనర్థుల తారతమ్యము 603
దాతల దాతవు గదరా 565
దాసము భూమిదాన 725
దామర వెంకటేంద్ర! 386
దామెర చెన్న భూవిభు 394
దామెర మహిపతిరావుకు 382
దామెర్ల కులాంభోజ 397
దిన దినంబును నెల్ల దివిజులు 106
దీపాల మిసిరవల్ 347
దుమ్ము ధూళిగఁ జేసి 613
దురమున కోహటింపక 387
దురమున బోయ దళలంబుల 390
దురములోఁగదిసిన 327
దురములో రాచూరు 323
దురములో రావిళ్ళ 824
దుర్మద వైరిహారిబల 391
దుష్పరివార 895
దృగ్భృత్యా నరసక్షమాపతి 151
దేవరకోటాఖ్య 346
దొరకైన 718
దోర్లీలాఘన 850
ధనికులగావింపఁదగదు 113
ధరగోపరాజురామయ 537
ధరణిందానగురుండ 597
ధరణినేవిభుఁడద్యతన 351
ధరణియెబొమ్మరిల్లు 86
ధరణీచక్రమవక్రవిక్రమము 230
ధరనత్యుత్తముఁడైన 686
ధరలోభూపతులెల్లను 456
ధర్మముచెడిరెండాడిన 669
ధర్మమేతత్కలౌ 536
ధారుణిరాణివాసినవి 75
ధాటిగనేగియుద్ధగిరి 199
ధిక్కారక్రమ! విక్రమోగ్ర! 423
ధీరుఁడుబొడ్డుచెర్లచిన 133
ధీరుఁడైధరయేలె 50
ధీరోదారగుణంబులు 563
ధీవోలుమొదలుగా 430
ధూర్తనీజయధాటి 432
ధృతిసాగి కొండభూపతి 424
ధైర్యంబునీమేన 44
నందాపురీవిప్ర 781
నందిని బుత్తెంచె 45
నగముబోలెడు 900
నగరుపగాయెనింకవిపినంబుల 124

| | |
|---|---|
| నరనాథవంశ | 719 |
| ననవలెననవలెచెఱకుం | 360 |
| నమ్మినవారలనమ్మి | 667 |
| నరజన్మంబునఁబుట్టిన | 558 |
| నరసింహకృష్ణరాయని | 144 |
| నరసింహకృష్ణరాయా | 141 |
| నరసాధీశ్వరుకృష్ణరాయ | 162 |
| నలుమొగములు గలవేలుపు | 460 |
| నలువచిచీ ! నినుందలఁప | 336 |
| నల్లులచేదోమలచే | 779 |
| నల్లూరుతూర్పువీథి | 772 |
| నవరత్నభూషణా | 5 |
| నవ్వెనాసంగీతనాద | 205 |
| నాలుగు దుర్గంబులు | 619 |
| నాళీకభృంగకృదతీ | 174 |
| నావిద్వత్క వితావిశృంఖల | 617 |
| న్యాయంబుదప్పునిరపతి | 570 |
| నిఖిలభూధర | 910 |
| నిగనిగని చన్ను | 855 |
| నిజమారాజ్యసుఖంబులు | 562 |
| నిట్టలహరియుండయి | 564 |
| నిత్యంసంధ్యా | 876 |
| నిత్యసత్యత్యాగనీతిలో | 498 |
| నిపుణత | 796 |
| నిబ్బరపుఁగలికి | 894 |
| నియ్యోగిలేనిచావడి | 518 |
| నిరుపహతిస్థలంబు | 122 |
| నిర్మించెనేమంత్రినిరుపమ | 476 |
| నీబిరుదులు విని | 826 |
| నీతిదానహీనుని | 628 |
| నీతులనీతులం | 862 |
| నీదేవదేవుండు నిజభక్త | 530 |
| నీ పంక్తినొకనాడు | 491 |
| నీబాకుశత్రులనెమ్మేని | 361 |
| నీభేరి ధణధణా నినదంబు | 440 |
| నీలాలకాజాల | 882 |
| నీ వలె నిచ్చుదాత | 636 |
| నీసరిసమానమగు | 470 |
| నీహేతిచే జగ్గనృపతి | 189 |
| నుదుటఁబాపటబొట్టు | 358 |
| నూటపదాఱు | 845 |
| నూర్లార్లు లెక్క సేయక | 363 |
| నెట్టనగజపతిదేవుని | 567 |
| నెనరుఁజూపులువాఁడి | 238 |
| నెరవుగాఁ బేరిన నెత్తురు | 102 |
| నెరవై నవిద్వాంసు | 745 |
| నెఱవేగంబునటీపుసైన్యముల | 446 |
| నేడుగా తలపూవువాడ | 187 |
| నేత్రయుగ్మము | 818 |
| నేనెవరికి వినిపించెద | 458 |



| | |
|---|---|
| నేరుపుబ్రహ్మఁజేరె | 26 |
| నేవచ్చినిలిచిన | 657 |
| పంకేజభవవధూ | 871 |
| పంజరముననుంచి | 235 |
| పంతులవంశబ్రహ్మకవి | 359 |
| పందికొమ్మెక్కి పెనుపాము | 80 |
| పక్షీంద్రవాహనుడు | 467 |
| పగగల్గియర్థికీయని | 519 |
| పగఱకువెన్నిచ్చినచో | 38 |
| పగఱవజీరుల | 428 |
| పటుశక్తిశౌర్య | 18 |
| పటుశౌర్యమున | 441 |
| పటుశౌర్యోక్తిమమత్కమాలు | 438 |
| పదుచునిడినవాని | 527 |
| పదటునవాజి | 40 |
| పదరికుమార | 814 |
| పదవేరంభ! సురేంద్రు | 267 |
| పద్మనాట్యస్థలంబున | 145 |
| పద్యముచెప్పిన సుకవికి | 526 |
| పదివేలమందికిచ్చియు | 680 |
| పదివేలమాడలిచ్చిన | 609 |
| పదిహేనువేలకుబశువైన | 412 |
| పద్దెములోభికేల? మఱి | 596 |
| పన్నితురంగమంబు | 23 |
| పన్నిద్దఱుభాస్కరులని | 479 |
| పరగధర్మాధర్మ | 329 |
| పరఁగరాయనికుల | 507 |
| పరమేలోర్చినటించే | 463 |
| పరవీరనరపాల | 311 |
| పరాంగనా | 741 |
| పరువుగ్రహింపనేరకొక | 709 |
| పలుమరుశాస్త్రముల్ చదివి | 545 |
| పశుపుకవినాకు టెల్లను | 671 |
| పసగలయాచకుండు | 736 |
| పసముత్యమొకటిచాలును | 480 |
| పసరముకైవడిన్ | 735 |
| పాతకసుకవీంద్రబంధు | 192 |
| పాయసాన్నప్రౌఢి | 556 |
| పాఱువేఁటలురాచబారు | 197 |
| పాలించునేవీట | 789 |
| పావకపరమేష్ఠిపవన | 73 |
| పింగళయేకచక్రపురి | 652 |
| పిండెంత రొట్టెయంతే | 661 |
| పిలువనికూటికిన్ | 691 |
| పీనసరోగి నిన్ను | 684 |
| పుటములు ద్రొక్కినా | 242 |
| పుట్టినప్పుడె | 746 |
| పుట్టుకపద్మజుఁడై | 851 |
| పుత్రేపువంశభవ | 654 |
| పుడమినిసత్యసంధుఁడగు | 672 |

పురమునసుండే 794
పురహరుఁడుదయను 466
పులితలాటంబుకై 103
పూఁతమెఱుంగులుం 121
పూర్వాపరాద్రులు 62
పెట్టకకీర్తిరాదు 588
పెట్టినదండఁదీయని 385
పెద్దనగరునొద్దప్రేమ 404
పెద్దమ్మబొచ్చుఆదెన 656
పెనిమిటికిందలారికిని 703
పెనిమిటిచేయు పుణ్యజన 146
పొందుగ శరజలనిధి 620
పొట్టలు పెంచుక 852
పొడగన్నంతనె 3
పొరిఁబొరిమేకమాంసములు 704
పొల్లెంతదంచిన 909
పోఁకలు నములుచు 722
పోలయ వేమన్న పొలుపార 64
పౌరుషజ్ఞాన 798
ప్రకటప్రతాపాతపము 4
ప్రకటించి 813
ప్రతిపక్షసుందరీ 60
ప్రతిపక్షసుందరీ 374
ప్రత్యర్థిమత్తేభ 314
ప్రత్యక్షబాహాట 869
ప్రథనభార్గవ! నీదు 407
ప్రసవవేదన 904
ప్రియముతోనిజమాతృ 112
ఫణితల్పఫణికేతు 405
ఫణిరాజుతనశిరోమణు 490
బంగారునకు సౌరభము 110
బంధుర పరిపంథి 396
బట్టుదీవించుచు బాసికంబును 497
బట్టునునేను కమ్మకుల 321
బలపరాక్రమయశః ప్రబలుఁడై 383
బలభిన్నాగము చెంపఁగొట్టె 143
బలమునఁ జలమున 6
బలరిపుభోగకృష్ణనరపాలుని 204
బల్లరగండలింగవిభుపాదము 255
బలిమిఁబ్రతాపుని 53
బలిమిఁబ్రతాపుని 366
బళిబళీ 806
బళిర! రామయమంత్రి 474
బసవనబోయడె 815
బసవనబోయఁడె వెలమల 816
బహదరుమిరజా 870
బహుతరైశ్వర్య 747
బహుముఖబ్రహ్మాండ 101
బహుళశాత్రవరాజ 427
బానెఁడుజొన్న వంటకము 659



బాహాబలాటోప 317
బిరుదుశత్రుల 810
బిరుసైన నీ గండబేరుండ 291
బీదల పేదటికము 469
బూరుగుమ్రానియున్నతియు 594
బృందారకలోకంబున 630
బృందారక లోకంబున 629
బెగడెన్ గల్మిలిసత్యవీడు 198
బేడుపై తరవులు పెట్టక 119
బోరనయాచకప్రతతి 155
బ్రాహ్మణభూములపై 664
భండనభీమనీయెదుర 31
భండనమాటపట్టు 59
భండనమాటపట్టు 373
భటుల కోలాహలార్భటుల 356
భద్రత్యాగగుణాయురాహవ 69
భద్రమరుత్ప్రయాణగుణ 99
భములతో సురపాదపము 349
భరతభాషారాడ్భిదుర 74
భరతునిలాగున 2
భవదీయగీర్వాణ 863
భానుజుఁడర్థముంగుముద 561
భారతీవదనాంబుజ 853
భాసిల్లుంగద 860
భాగ్యవశమున 799
భువిలోననేనూఱు 783
భూతలమునశిబికర్ణులు 169
భూరమణీమనఃకుముద 337
భో భో భూవర! భూరివక్రమ! 150
మండితకీర్తిమీటి 292
మండువపండువాద్ర 302
మంత్రాధిపునితోడ 114
మకరధ్వజుని 893
మగనాలిమీఁద 749
మచ్చికలేనిచోటననుమానము 584
మట్టకరాఁడుబెట్టుటికి 201
మడతల్ బల్కు 728
మత్తఖండాపూని 282
మత్తవిరోధిచర్మంబు 426
మత్తారిరాజన్యమకుటంబుల 262
మత్తుఁడుకూర్మరాజు 247
మధురవచన్మిర్జా 867
మనవికినొక్కయేడు 595
మనసులొంగనివైరి 288
మనుజేంద్రులసభలోపల 462
మన్నవగణక 777
మన్నెమార్తాండుతో 413
మన్నెసులతానుబిరుదు 285
మమ్మత్కమాలును 437
మలికిభరామభూప! 213

| | |
|---|---|
| మల్లెల్ మొల్లలు | 793 |
| మహినానందనృపాలు | 275 |
| మహియెల్లయెడ | 17 |
| మహియేలుమట్ల | 767 |
| మాకొలదిజానపదులకె | 624 |
| మాకొలదిజానపదులకె | 625 |
| మాటాడరాదుసభలన్ | 579 |
| మాటాడితప్పెడి | 320 |
| మాడలమీఁద నాసగల | 587 |
| మాదయఘనవల్లభ | 379 |
| మానఘనుండుబ్రహ్మ | 540 |
| మానమెభూషణంబు | 592 |
| మానిసికొండొద్ద | 54 |
| మానిసికొండొద్ద | 367 |
| మానుషదానమానబల | 92 |
| మాపటికొండవీటి | 897 |
| మాయురె! సద్గుణాభరణ | 265 |
| మాయురేభాశోర | 56 |
| మాయురేభాశోర | 369 |
| మించియుద్ధతి | 822 |
| మిరియములులేని కూరయును | 588 |
| మీఁగాళ్ళబంటినీళ్ళకు | 503 |
| మీజముదాడివాఁడికడిమింగడి | 223 |
| మీఁదవెలుంగుపూర్ణశశి | 552 |
| ముందునిప్పుడునిఁకమీద | 600 |
| ముత్తామాత్యపరాకు | 615 |
| ముద్దగ గండపెండియరమున్ | 120 |
| మునుపోకకేలరావణుడు | 649 |
| మునుమున్నయేరాజు | 415 |
| ముప్పదిరెండువేల భటముఖ్యుల | 180 |
| ముప్పదివేలవీరభటముఖ్యులు | 195 |
| మురుగుల్ గొల్సులు | 342 |
| ముసలాపెద్రేలుఁజన్నుల | 489 |
| మెప్పించినాడవు | 555 |
| మేదరమెట్లవంశ | 838 |
| మేదినినాథుఁ | 801 |
| మేలిమితేజీలు | 307 |
| మైలకోకలు | 907 |
| మొండిశిఖండి లోభులను | 645 |
| మొనసిప్రత్యర్థివై | 402 |
| యరలవమదనసయనుచును | 209 |
| యవనులగెల్వఁడే | 61 |
| యవనులగెల్వడ | 377 |
| యాచకఖేచరుండు | 21 |
| యాచకసంరక్షణకై | 621 |
| యాచకుఁడులోభివానికి | 640 |
| రంగత్కృపా | 501 |
| రంగపనేని | 250 |
| రంతుల్ మానుముకుక్కుటాధమ | 128 |
| రంపగణింప | 776 |





| | |
|---|---|
| రక్తాక్షిసంవత్సరము | 770 |
| రక్తాక్ష్యబ్దే | 535 |
| రణరంగమున | 42 |
| రతిపతిసన్నుత | 468 |
| రభసంబుతో | 290 |
| రమణమీపెద | 310 |
| రాకున్నఁబిలువఁడేనియు | 81 |
| రాగబంధముచేత | 11 |
| రాచర్కమనఁగ | 273 |
| రాజనిభాసనా! సరసురాలవు | 171 |
| రాజానల్లపరాజ | 865 |
| రాజాబాదరు | 442 |
| రాజితకీర్తి | 485 |
| రాజితకీర్తిశాలి | 505 |
| రాజుకళంకమూర్తి | 271 |
| రాజునురాజగాఁ | 211 |
| రాజుపాలింపని | 754 |
| రాజులరాజు | 270 |
| రాజులలోజగ్గ | 190 |
| రాతిరినేనుపస్తు | 899 |
| రామరాయనరేంద్ర | 185 |
| రాముఁడుదుక్కి | 212 |
| రామోదారవియోగ్య | 881 |
| రాయగ్రామణి కృష్ణరాయ! | 138 |
| రాయనిభాస్కరు | 517 |
| రాయనిభాస్కరుతోనే | 528 |
| రాయరాహుతమిండ | 157 |
| రాయిటుభట్ట | 207 |
| రారవిధాత | 214 |
| రావూరుపురిఢిల్లి | 557 |
| రెండానాల్కల | 525 |
| లంచమువెజ్జు | 753 |
| లలితంపుగౌతమి | 771 |
| లక్షవ్రతంబు | 733 |
| లావొక్కింతయు | 364 |
| లిబ్బివిరిబోణి | 236 |
| లేదాతంజావూర | 795 |
| లొట్టయిదేటిమాట | 599 |
| లోకప్రతిష్ఠితో | 338 |
| వంచింపఁజనదు | 549 |
| వండెడువానిసత్కవిని | 707 |
| వంశేనవిద్యయా | 873 |
| వగమాన్పి | 483 |
| వగరుపుమాత్రమే వరుఁడు | 126 |
| వడిసెలచేతఁ | 886 |
| వదలకుపాయ | 755 |
| వనములలోపల | 833 |
| వనవాసియైపోక | 12 |
| వరగంభీరతసింధురాజు | 623 |
| వరహాల్కాసుల | 335 |

| | |
|---|---|
| వరుఁడు చెఱంగుపట్టినను | 123 |
| వర్ణాశ్రమంబుల వరుస | 117 |
| వలవదుచూడ | 724 |
| వల్లభభోగ | 57 |
| వల్లభభోగ | 371 |
| వసుధేశుఁ | 502 |
| వసుమతిలో | 34 |
| వారకయీశ్వరుండు | 683 |
| వారజీతమెకాని | 191 |
| వార్తలశత్రురాజుల | 611 |
| వాలమునులిచి | 797 |
| వాసనగల్గుమేను | 892 |
| వాసనలేని | 585 |
| వాహ్యాళిచోమత్తవారణ | 111 |
| వ్రాయను జదువను | 472 |
| వ్రాయుఁబసిండిగంటమున | 522 |
| వ్రాయుట చిత్రమా | 539 |
| వ్రాలివిగోఁ | 800 |
| విందుమునీమహత్త్వము | 866 |
| విక్రమార్కుఁడనెడు | 8 |
| విక్రమార్కుఁడనెడు | 9 |
| విక్రమార్కునిబోలు | 568 |
| విజయంబు | 322 |
| విజయనితోఁబోరు | 420 |
| విజయాధిపునిదాడి | 43 |
| వితరణంబెఱుఁగని | 837 |
| విత్తమొకనికిచ్చి | 648 |
| విదితగురుప్రతాప | 32 |
| విధిసంకల్పము | 804 |
| వినయంబుతోడ | 744 |
| వినరయ్య బెజవాడ | 773 |
| వినిచెప్పకున్నదోషంబని | 70 |
| వినుకొండసముతున | 761 |
| వినుముమహా | 726 |
| విరాజతేసుందర | 877 |
| విలువరుసదానగుణములు | 699 |
| వివిధవిద్యోద్దండ | 94 |
| విసర్గబిందు | 912 |
| విసుమాలి | 419 |
| వీడనిమూర్ఖు | 752 |
| వీఁడెగాశరమంత్రి | 547 |
| వీఁడెపోదుష్టారి | 546 |
| వీనులుసంతసిల్లు | 566 |
| వీపునమోసెఁగచ్చపము | 83 |
| వీరగుణప్రతాపగుణ | 30 |
| వీరత్వంబునఁ | 445 |
| వీరనారాయణ విభుడు | 71 |
| వీరవివాదంబు | 37 |
| వీరశాత్రవరాజ వృక్షముల్ | 89 |
| వీరాగ్రేసర! కృష్ణరాయనృపతే! | 149 |





| | |
|---|---|
| వీరాగ్రేసరకృష్ణరాయభవతా | 152 |
| వృద్ధకచ్ఛపరాజువీఁపు | 98 |
| వెంకటాచలమున | 821 |
| వెంటనంటినబారు | 411 |
| వెండియుమట్ల | 266 |
| వెన్నెలలేని రాత్రియు | 46 |
| వెన్నెలవలె | 345 |
| వెలమకులంబు | 334 |
| వెలయాలు శిశువునల్లుడు | 91 |
| వెలివిద్యలెన్నియైనను | 700 |
| వేద్కనిద్దఱతోడ | 655 |
| వేదశాస్త్రములకు | 784 |
| వేలసంఖ్యలు | 309 |
| వైభవోపేంద్రుఁ | 343 |
| వ్రేటున కాఱుతున్కలుగ | 65 |
| శతమన్యుండమరావతేలగ | 616 |
| శతసంఖ్య లొక్కటైనను | 132 |
| శయ్యానొయ్యనజార | 905 |
| శరజన్మభార్గవ | 315 |
| శరణన్న శత్రుని | 666 |
| శరసంధాన బలక్షమాది | 134 |
| శరీరమగ్నిపాలు | 739 |
| శశిలోనిమృగము | 339 |
| శాంతిన్మద్గుణ | 823 |
| శాకాబ్దేవసు | 478 |
| శుభచరితాంగ | 299 |
| శూరతవైరిరాజులఁగాని | 100 |
| శూరుఁడటంచు | 439 |
| శేషాహిభాషావిశేష | 638 |
| శ్రితరక్షారతి | 859 |
| శ్రీకరంబుగభేరి | 433 |
| శ్రీకరదామర | 452 |
| శ్రీకరవిజయ | 177 |
| శ్రీకరవిజయలక్ష్మీ | 328 |
| శ్రీకీర్తిరస్తు | 304 |
| శ్రీకృష్ణక్షితిపాలదత్త | 158 |
| శ్రీగలవేళనాశ్రితుల | 606 |
| శ్రీగల్గురాముఁడీ | 639 |
| శ్రీగిరిప్రాగ్దిశశ్రీల | 510 |
| శ్రీచన్నుంగవక్రేవ | 35 |
| శ్రీదనరగ | 839 |
| శ్రీదామరకుల | 457 |
| శ్రీమహితాబ్ధి | 451 |
| శ్రీమాన్గణపతి | 532 |
| శ్రీమించుజడదారి | 216 |
| శ్రీమించుమన్నియ | 312 |
| శ్రీమించురేచర్ల | 179 |
| శ్రీమించురేచర్ల | 181 |
| శ్రీమించువెలుగోటి | 175 |
| శ్రీయలరార | 49 |

| | |
|---|---|
| శ్రీరంగైక | 231 |
| శ్రీరమణీయాంధ్ర | 864 |
| శ్రీరమారమణీయ | 782 |
| శ్రీరామనీపాద | 769 |
| శ్రీరామపతి | 757 |
| శ్రీలీలాత్మజ! కృష్ణరాయ! | 142 |
| శ్రీవిష్ణు (దేవ) | 716 |
| శ్రీవిష్ణుదేవుని | 378 |
| శ్రీహరికృప | 774 |
| సంగరమందు | 436 |
| సంగీత ధర్మంబు | 109 |
| సంగీతసాహిత్య | 493 |
| సంతతమారగించునెడ | 612 |
| సంపదలు జలతరంగము | 634 |
| సంపద్ఘనుని | 576 |
| సంహారభైరవచండ | 72 |
| సగరాన్వయంబన | 715 |
| సడిగలవంట | 898 |
| సత్కవికృత | 828 |
| సత్యములేనిచోట | 593 |
| సద్యోఘృతము | 854 |
| సన్నుతలీలఁ | 499 |
| సన్నుతలీలఁ | 509 |
| సమదానేకప | 872 |
| సమరక్షోణినిగృష్ణరాయల | 139 |
| సమరానశాత్రవ | 244 |
| సమశీలశ్రుతియుతులకు | 677 |
| సరసాగ్రేసరసాగినన్న | 105 |
| సరిబేసైరిపు | 475 |
| సర్వజ్ఞుడగు | 108 |
| సర్వజ్ఞుడగుమంత్రి | 756 |
| సర్వసర్వం సహా | 52 |
| సలకముతిమ్మండనియెడు | 167 |
| సహజకళంక | 523 |
| సాటిచదలేటి | 857 |
| సాధించితివి | 819 |
| సానితెయ్యని | 908 |
| సారాసారములెఱుగని | 696 |
| సారాసారవిచార | 453 |
| సింహాసనమునకుఁ | 185 |
| సిద్ధవటంబున | 775 |
| సిరిదనయంత | 727 |
| సిరిమించి..... | 218 |
| సిరిమించుమారెళ్ళ | 762 |
| సిరిమించుసురుమాయి | 324 |
| సుంకేశపురిలోన | 399 |
| సుమమౌక్తికాకల్ప | 325 |
| సురభూమీరుహ | 352 |
| సురసరిద్ధరిణ | 348 |
| సురుమాయిబిరుదు | 811 |





| | |
|---|---|
| సుల్తానుబహదరీ | 355 |
| సూర్యుండుతాఁద్రోవ | 416 |
| సొగసైనరత్నాల | 357 |
| సేవాదుఃఖాభి | 880 |
| సేవాశ్వవృత్తి | 880ఎ |
| సోముఁడులేని | 353 |
| స్రక్ఛనిప్రాణ | 731 |
| స్వచ్ఛశైవలగుళుచ్ఛ | 164 |
| స్వస్త్యస్తు | 215 |
| స్వస్తివిక్రమ | 879 |
| స్థానవిశేషమాత్రమునఁ | 129 |
| స్తుతమతియైనయంధ్రకవి | 127 |
| హంసీయానకు | 887 |
| హరిశ్చంద్రోనలోరాజా | 13 |
| హరిసిరిని | 582 |
| హరిహయచంద్రికా | 633 |
| హరిహరదేవ | 51 |
| హరిహరబ్రహ్మాదు | 14 |
| హరిహరియేమి | 802 |
| హేమాచలము | 286 |
| హేహయవంశధాత్రీ | 19 |